



భక్తులు

జీవిత చరిత్ర

ఆంధ్ర మహా భక్త విజయము








సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరవిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

http://www.new.dli.ernet.in



అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద



"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

శ్రీమత్

ఆంధ్ర మహాభక్త విజయము

రచయిత:

పంగులూరి వీరరాఘవుడు

పీఠిక

భక్తావతంసములారా !

ప్రతిమానవుని, హృద్గృహాలయందును రెం డద్భుత శక్తులిమిడియున్నయవి. అందొకటి మనశ్శక్తి దీనిని బైకిదీసిన వాడే యొడుదుడుకులు లేకుండగ నిహమును జయప్రదముగా సాధింపగలడు.

సర్వానర్థముల మూలమగుభయమును జయించిన వానికి మనశ్శక్తిస్వాధీనమగును. నిర్భయుం డెంతటిపనినైనను జేయగలడు. క్రూర సర్పములనుబట్టి యాడించువాడును, శార్దూలాది మృగములతో చెల్లాటలాడువాడును ఆజన్మవైరులతో బోరాడి జయమందినవాడును నిర్భయకోటికి జెందినవాడై యున్నాడు. ఈ మనశ్శక్తి నీనికిదాసి రైళ్ళు, విమానములు, మోటార్లు, బాంబులు మనశ్శక్తి సంభవములు. మనశ్శక్తి లేనివానికిహముదుఃఖమయము కాగా ! బరముమాట తలంప నేటికి చింతాకులు డేపనియు జేయజాలదు జీవచ్ఛవమన నీతడే యనినను తప్పుగాదు.

సంకల్ప వికల్పముల కాకరమగు మనస్సరికట్టి కొంట కను బోసిక నేకసంకల్పముమీదనిల్పిన దానికశక్తి బయలుపడు

సాధకుని సర్వవిధముల గాపాడును. ఏకాగ్రతగలవానికి సాధింప
రాని యైహికముండదు.

ఈ యేకాగ్రతదుర్బలుని బలవంతునిగను, దరిద్రుని ధనవంతునిగను అనామకుని సనామకునిగను జేయుసమర్థతగలది. అసాధ్యమైన యెవరెస్టు శిఖరారోహణమొక మనశ్శక్తిగల వాని కేసాధ్యము, గ్రంథములు వ్రాయుట, అష్టావధానశతావధానములు జేయుట ఆశువుగా బద్యములల్లుట, కొద్దిగనో, గొప్పగనో మనశ్శక్తి గలవానికే సాధ్యము.

ఈ చిత్తైకాగ్రిత పూర్వవాసనాబలముననో, ప్రస్తుత సాధనా పటిమవలననో లభింపగలదు. మానవుడు పూర్వజన్మమునం దేవిషయమునకై సాధనజేసినాడో? మరుజన్మమం దా విషయమందు బట్టుదలగలవాడై యుండును.

ఇట్టి మనశ్శక్తిగలవాడు కర్మ, భక్తి, జ్ఞానము లవలీలగా సాధింపగలడు. చిత్తైకాగ్రతవలన లభించుమహాఫలమిదే మనశ్శక్తియని మరువరాదు. ఏకాగ్రిత లేనివాని కర్మ, భక్తి, జ్ఞానములకు శ్రమయే ఫలము. గనుక ముందు మనస్సును స్వాధీనపరచుకొని పిదప కర్మ, భక్తి, జ్ఞానములయం దేయొక్కటి సాధించినను సద్యోఫలము లభించును.

మనశ్శక్తిని నాత్మశక్తిగా మార్చగల సమర్థతగలవి కర్మ, భక్తి, జ్ఞానములు ఈ మూడుమార్గములద్వారా ఆత్మశక్తిని బయటకిదీసినవాడే సమర్థుడు. నిర్జీవిని జీవవంతు

నిగా జేయు సమర్థతగలది యాత్మశక్తి, ఆత్మశక్తిగల వాని యెదుట మనశ్శక్తిగలవాడు దివిటీక్రింది దీపమువంటివాడు ఆత్మశక్తి మనశ్శక్తిని లోబరచుకొనగలదు. ఈమనశ్శక్తి సంభవములైన ప్రయోగాము లేవియు కర్మ, భక్తి, జ్ఞానములలోనే యొక్కటినైన నాశ్రయించిన వానిని జేరి పారజాలవు.

దీపమునకు దీపపువెలుగున కెటులభేదమో భగవంతునకును భగవచ్ఛక్తికిని నటులే భేదము భగవంతునిఁ జూచినవాడనిన వా డాత్మశక్తిగలవాడనియు, ఆత్మశక్తిగలవాడే దేవుని జూచినవాడనియు జెప్పనగు.

భగవంతుడు శక్తిస్వరూపుడు భక్తునిభావము ననుసరించి ఆశక్తియే తదాకృతి ధరించుచున్నయది. భక్తుడు భగవంతునకువలె సర్వసమర్థుడైయుండును. గనుక ప్రత్యక్ష భగవంతుడే భాగవతోత్తముడనుట.

అచేతనమైన పాతమట్టిగోడను గుఱ్ఱముగా నుపయోగించి స్వారీచేసినవాడును, చనిపోయినకుఱ్ఱని బ్రతికించిన మహాపురుషుడును. ప్రత్యక్ష భగవంతులని చెప్పిన సంశయించువారుండరు.

ఇట్లు ప్రత్యక్ష భగవత్స్వరూపులై తమ తమ జీవితముల లోకహితమునకర్పించినట్టియు వారి వారి భగవచ్ఛక్తులను ఆ యా శక్తులద్వారా వారు వారు సాధించిన మహా కార్యజాలమును తెలుపగల గ్రంథరాజమగుట దీని కాంధ్ర మహా భక్త విజయమని పేరిడబడినది.

ఈ భక్తవిజయ ప్రకటనా కార్యములో పాల్గొని తను మనధనముద్వారా సహాయపడిన మహామహుల పేర్లజాబితా నిందే మఱియొకచో జూడగలరు. వీరలయం దీర్ఘప్రతిష్ఠ-టలో శ్రద్ధవహించిన బ్రహ్మశ్రీ పన్నాల రామకృష్ణయ్యగా రత్యంత వందనీయులు. వీరలందఱకు గావించు వందనసహస్రంబులతో పీఠిక ముగించెద.

సర్వేజనాః సుఖినో భవంతు

అప్పికట్ల,
బాపట్లతాలూకా
1—5—1957

ఇట్లు,
విశ్వసేవకుడు,
పంగులూరి వీరరాఘవుడు

ఉపోద్ఘాతము

శ్రీమంతంబై నిత్యప్రకాశ సమన్వితంబై నవఖండంబులందఖండ జ్ఞానప్రదంబై విరాజిల్లుమన పావనంబగు భగతఖండము భక్తి, జ్ఞాన, వైరాగ్య భోగదాయకంబు నందగ్రస్థానమలంకరించి అభీష్టార్థ ప్రదకల్పకభూజమై ఖండాతర్గత బహుదేశముల భేదంబులచే ననేకంబులై యుండు భాషలన్నింటికి ప్రధానభాషయగు సంస్కృత భాషామతల్లికి జన్మస్థానంబై, మూర్తీ భవించిన వేదస్వరూపంబై ఆదినుండి నేటివరకున్నూ అనేకమంది దివ్యపురుషులను కని, పెంచి, లోకకళ్యాణార్థమై, పరిపూర్ణ విద్యాప్రవీణులచేసి, వేదానుసారమగు మోక్షధర్మముల యుగధర్మంబుల ననుసరించి నాసేతుహిమాచలము నఱకు వ్యాపింపచేసి, దేశాచారకర్మ ధర్మంబులందు భేదమున్నను అంతిమఫలంబగు కైవల్యమునం దెట్టిభేదమున్నూ లేని యద్వైత మతంబు నొసంగి భగవంతుడు రక్షించుచున్నాడనుట సర్వజనవిదితమేగదా!

ఆయాదేశములందలి మహాపురుషుల జీవితములను, దేశాభిమానముచేతనేమి, లోకకళ్యాణార్థమై చేసిన, అనుపమానమగు నిష్కామ కర్మల ఋణవిముక్తికై నైతేనేమి భక్తి, జ్ఞానములందలి శ్రద్ధావిశ్వాసములచేతనేమి, అందందు అట్టి దివ్యజ్యోతి స్వరూపులగాథల శాశ్వితముగా ప్రకాశింపచేయుటకు కొందఱు పండితులు, వారిజీవితములను అతికష్టముచే సంగ్రహించి, రచించి దేశమునందంతటను వ్యాపింప

చేసి కృతార్థులై యుండుటచే నేటికిన్ని మనపూర్వుల చరి
త్రలు నిత్యజీవితములై చదువరుల కానంద మొసగుచు భక్తి
జ్ఞాన వైరాగ్యాది సల్లక్షణాభివృద్ధికై యుత్సాహమునొసంగి
తత్తద్ధర్మాభిమాన కర్మాచార పరాయణులనుగా చేయుటకు
ప్రధానకారణంబులై, దివ్యోపదేశవాక్యామృతసారము గ్రోలి,
జీవన్ముక్తి పొందుటకు నిర్భయావలంబకులై యుండుటచే, పర
మేశ్వరుని దివ్యలీలావిభూతులార్జించి, జ్ఞానాగ్నిని ప్రజ్వలించి,
భక్తి నభివృద్ధిని చేయుటకై దైవప్రతినిధులై తాము యుద్యోగ
మును అనేకవిధములగు చిత్రవిచిత్రదృశ్యముల చూపుచూ
ప్రజారంజకులై మతాభిమాన గుణభూషణులుగా చేసి తరించి
రనుట దేశాభిమానయుక్తులగు సద్గుణ స్వభావరమణులగు
సహజానందరసజ్ఞులకు గ్రాహ్యము గాకపోదు.

ఉత్తర హిందూస్థానమునందున్నూ యింకా యితర
దేశములందున్నూ, మహాభక్తుల చరిత్రలను మతభేదరోగా
వేశమత్తులుగాక విశాలబుద్ధిగల పండితులు, అనేక
కష్టములనోర్చి, రచించి యుండుటచే ఇప్పటికిన్ని
వారిచరిత్రలు దివ్యజ్యోతులవలె ప్రకాశించుచూ
చదువరులకు వివేకజ్ఞానోదయప్రాప్తిని గలిగించి, ఆస్తికజ్ఞాన
మునం దారూఢిని గలిగించి, సాధనానుకూలధర్మములను,
దెలిపి, ముక్తికై ప్రేరేపించి భక్తిమార్గమును ప్రదర్శింప
చేసి, భారతీయ దివ్యసాంప్రదాయధర్మములను యితర దేశం
బులకు నందజేసి, మతవైషమ్యముల తొలగించి నేటికిని ప్రసిద్ధి
గాంచియుండుటచే అట్టిలోపమును మనఆంధ్రమాతకు లేకుండ

జేయుటకై అందందు కొందరు భక్తులు మన దేశమందలి మహా పురుషుల చరిత్రలను, కొన్ని రచించియున్నను రహస్యముగా శేషించియున్నవా రెందరోయున్న వారిచరిత్రల సేకరించి వ్రాయు సదుద్యోగమును కష్టసుఖంబులకోర్చి గ్రామ గ్రామంబునకున్నూ, కాలినడకనుబోవుచూ, క్షుత్పిపాసలశాంతికై, ప్రాప్తించిన ఫలములనో లేక నీటినో త్రాగి చెట్లక్రింద విశ్రాంతి తీసుకొని భక్తిశ్రద్ధలచే అభిమాన వర్జితులై జాతి మత భేదరోగరహితు లెవ్వరాయని పరికించి, దైవానుగ్రహ ధర్మ కర్మోద్యోగమునకు తగినవాడని నిశ్చయించి వృద్ధుడని విచారించక, నిర్ధనుడని భావించక, అసహాయుడని యోచించక, యీ ఆంధ్ర మహాభక్త విజయమనెడి దివ్యగ్రంధ రచనాధికార భారమునూ యీ గ్రంథకర్తగారి పైబెట్టి, ద్రవ్యార్థమై పెక్కుగ్రాముల ద్రిప్పి శ్రీరాముడు, కరుణాభిరాముడగుటచే గ్రంథకర్తగారికి మధ్య మధ్యగలుగు కష్టంబులను సుఖములుగానే తోపింప చేయుచూ, అదృశ్యుడై అటనుండి సర్వవిధముల రక్షించుకొని స్వకార్య నిర్వహణార్థమై తన నిజసేవకుని నేటివరకు పోషించుకొని, యిప్పటికి గ్రంధమున కొక దివ్యస్వరూపము నేర్పరచినాడు.

ఈ గ్రంథరచనాభిలాషాసక్తబద్ధ చిత్తుండగు శ్రీ పంగులూరి వీరరాఘవదాసుగారు నాకు చాలా పూర్వపరిచయులే గాక, మామకాంతరంగాను షంగసద్బంధుండగుటచే, ప్రేమోత్సాహపూరితహృదయుడై, పీఠికను వ్రాసి యివ్వవలసినదిగా

ఆజ్ఞాపించినందున అసమర్థుడనని యెఱింగియు, కర్తృహృద యాంతరంగ రమణుండగు శ్రీరమారమణుని ప్రేరేపణాగో యని భావించి వ్రాయ సమకట్టి కలము చేబట్టితిని. ఐనను భక్తుల హృద్గత సద్భావ స్వరూపానందభోగైశ్వర్య [illegible] యైనను స్థానభేదము లనేకములై యుండుటచే వీరందరు ఒకే గ్రామమున నివసింపక దూరదూరంబుగా స్వగ్రామసంబంధ నివాసంబుల నేర్పరచుకొని, అంతరంగము లొక్క తాపుననే యానందించుచుండుటచే, వారి వారి గ్రామంబులకేగి, అందలి పెద్దలనో లేక వారివంశీయులనో కానిచో యితర గ్రామ కాపురస్థులనో విచారించి ఒక్కొక్క మహాభక్తుని జీవితమును సేకరించవలసియుండుటచే, మనగ్రంథకర్తగారు బహుకాలము నుంచియు యీ వృత్తియే, సద్వృత్తియని భావించి నిర్వృత్తి భోగానందప్రాప్తికై, బండి పాతదైనను, యెద్దులను అనుకూలానుకూల గ్రాసముచే మేపుకొని బలపరచుచూ తన యిష్టమూర్తియొక్క సంపూర్ణకరుణామృతవాస సంపత్తిప్రబలమాధారముగా గ్రహించి వారు సుమారు 80 సంవత్సరముల వయస్సునందు పూర్తిచేసి అచ్చుకై. యిచ్చవచ్చిన బోట్లకంతయు విచ్చలవిడిగా తిరిగి ద్రవ్యము సేకరించి పుణ్యకర్మాభిరతులగు ఆంధ్ర మహాభక్త జనుల కరాబ్జంబులం దలంకరింప జేసి కృతార్థులై రనుట అతిశయోక్తి గాదని భావింతురు.

మహాత్ముల చరిత్రలనేక విధంబులుగాయుండి, యెవ్వ రెవ్వరిని నేయేభావముచే వశ్యులచేసికొని వారికి

దివ్యజ్ఞానోపదేశముచేసి, పూర్వకృత పాపకర్మముల నశింప చేయవలెనో అట్టి రహస్యంబులం నెరింగి భక్తులు వర్తింతురు. గాన వారి అంతరంగభావముల గ్రహించుట సామాన్యులకు అత్యంత కష్టమగుటచే, కొంతవరకైనను భక్తియోగరహస్యంబుల జ్ఞానయోగ సహాయంబున భేదభావవర్జితులై గ్రహించు వారికిమాత్రమే మహాభక్తుల చరిత్ర వ్రాయుటకు అధికారము గలదు. గావున నే మన గ్రంథకర్తగారి కీయుద్యోగము భక్త హృద్రిమణుండగు శ్రీవమారమణుని గ్రహించియే యుండిరని చెప్ప నొప్పు.

ఎన్నడో, యెందో, యేవిధముగానో జీవితంబులను కాలానుసారముగా, ఆడంబరులుగాక, వేషమాత్రంబుననే లోకవంచకులుగాక, సంతతము భగవన్నామ సంస్మరణానంద పరవశులై గడుపుకొనిశక్త్యానుసారము పరోపకారమే పరమ పదవికి సోపానమని నమ్మి స్వపరభేదమును రవ్వంతయైనను లేక ఆభేదభావముచే ఆశ్రయించిన యాశ్రితులకు నాశ్రయమిచ్చి, భవసాగర తరుణోపాయమును చక్కగాబోధించి వెనుకచింత, ముందాశయులేక ప్రశాంతిగా కాలమును గడపినవారి చరిత్రలయందలి రహస్య భావంబుల గ్రహించి అతిశయోక్తులు లేక సద్గుణములకు మాత్రమే వన్నెబెట్టి సరళమగు మృదుమధురభాషలో కదళీద్రాక్ష పాకంబుల చేజదువరుల కుత్సాహము గలుగురీతిని రచించినందుకు భక్తవత్సలుడైన భగవానుడు భక్తపరతంత్రుడను నామమును

సార్థకమును చేసికొనుటకై గ్రంథకర్తగారికి, వయోభేదమును పాటింపక ఆత్మశక్తి నొసంగి రక్షించుగాక.

శ్రద్ధావిశ్వాస సమన్వితంబైన ప్రేమయను నేడి పరభక్తి నార్జించి తత్ఫలమును లోకకళ్యాణార్థమై వచ్చించి, సర్వ త్యాగులైన మహాత్ముల దివ్యవాగ్జ్యోతులు అందించు ప్రకాసించి, సంసారాంధకార భయమును పారద్రోలకున్న సామాన్యమానవులకు వివేకోదయ మెట్లుగలిగి భరతబంధు మనెడి నామము సార్థకమగునో చదువరులు యోచింతురుగాక. ఆలు బిడ్డలచే గలుగు యాయాసముగ్రహించి యాజ్ఞోటివిడచి, ధనధాన్యాది వస్తుసామగ్రిచే సిద్ధించు. తృష్ణాబంధప్రభావమును గుర్తించి పరవైరాగ్యంబుచే తద్బంధమును ఛేదించి దృశ్యము పరమేశ్వరుని అనగా తమ యిష్టదేవుని దివ్యమంగళ స్వరూపమని భావించి, తాము తద్దృశ్యాంతర్గతాత్మ స్వరూపులమని నిశ్చయించి, బహిరంతరంబుల విశ్వాత్మసంబంధమును వర్జింపక నామము స్మరించుచూ హృదయమున స్వరూపదర్శనము చేసికొని పూజించి భజించుచూ ప్రతి శ్వాసయందున్నా దివ్యనామాక్షర ద్వయమంత్రంబును కలిపిధ్యానించుచూ అణువంతైనను గ్రామ్య వ్యవహారములకు తమలో చోటునీయక, తమ అంతరంగమునకు రుచించిన యొకమహాభక్తుని జీవితమును లక్ష్యములో దృఢముగా నిలుపుకొని, లోపల, వెలుపల ఆదివ్యమూర్తియొక్క దివ్యోపదేశ వాక్యామృతసారము గ్రోలి తన్మయత్వానంద మనుభవించుచూ, "బాలోన్మత్తులవలె చరించువారి పావనచరిత్రలు

పరమేశ్వరుని మహాయశమును యీదృశ్యమునందు వ్యాపింప జేసి శాశ్వతముగా స్థాపింప చేసినందున భగవంతునికి భక్తులయందుగల దివ్యానురాగ కారణము జ్ఞాన సమన్వితమైన భక్తి యనినను. భక్తిసమన్వితమైన జ్ఞానమనినను రెంటికి ఫలమొకటియే గాని భేదము లేదు. కాని ఆచరణయందుమాత్రము కొంతభేదముగలదు, అంత మాత్రముచే కేవల జ్ఞానమేగొప్పదని గాని, లేక భక్తియే గొప్పదనిగాని వాదించుకొనువారు జల్పవితండ వాదులు మాత్రమే యగుదురుగాని, కేవలసచ్చిదానంద సుఖాను ప్రదంబగు సాత్విక వాదులుగారు. కావుననే ఇట్టిమహాపురుషులు విశ్వప్రియులు అని తెలుపును ఇందుచే వీరు అహింసా వ్రతపరాయణులు పరోపకారార్థమై తామైనను యెట్టికష్టము నైనను భరింతురుగాని తమచేమాత్రము యెట్టి క్లిష్టసందర్భమునందైనను. స్వప్నమందైనను యేప్రాణికిని హానిచేయ గోరరు, చేయరు. వీరికి విశ్వమునం దనురాగ మధికమగుటచే ద్వేషమునకు వారిలో తావులేదు వీరు భగవన్మహిమ నెరింగిన వారగుటచే ప్రతి వస్తువునందున్నూ చైతన్యమునే జూచి యానందించి భగవత్కృత్యమును కీర్తించుచూ జీవించుటయే వీరికి జీవితధర్మము నిందాస్తుతులకు కుంగరు, పొంగరు. గుణముండినచో నామరూపములున్నూ యుండుటచే విశ్వమంతయు నానాగుణమయమై యున్నందున నానావిధ నామరూపములచే నొప్పియున్న విశ్వగర్భుడగు భగవానుని యందే నానాత్వమున్నదన్నదనియు భగవానుడొక్కడే యైనం

దున, భక్తులకు నానాత్వమందేకత్వమును ఏకత్వమందు నానాత్వమును భావించి యానందించుట సహజమేగదా! ఒక్కబీజమునందు వృక్షగుణంబులన్నియు కూడి యేకమై యుండి బీజము వృక్షాకారమునుదాల్చినంతనే బీజమందలి నానాగుణములు, భిన్నములుగాయుండునట్లు ఒక్క భగవన్మహా బీజమందు ఈ విశ్వమంతయు లీనమైయుండి స్వరూపమును ధరించినంతనే నానాగుణములు గూడియున్నవి విశ్వము విశ్వనాథుని చిచ్ఛక్తితో గూడియున్నందున విశ్వమంతయు సచ్చిదానందస్వరూపమే యగుననుట నిశ్చయము.

ఈదివ్యగ్రంథ ముద్రణార్థమై ఉదారసంతోషులును, పరమభక్తులు పరమపురుషార్థ ఫలానుభవాశక్తులును, సగుణనిష్కాములగువారు ధనమొసంగి భక్తమనోవాంఛిత నివాసుడగు శ్రీనివాసుని సత్కృపామృతపానసిద్ధి కధికారభాగ్యశీలురైనందుకు పరమేశ్వరుడు వారందరకు అభీష్టార్థములనిచ్చి సర్వదా రక్షించుగాక!

ఈవృద్ధుడగు గ్రంథకర్తగారికి భగవంతుడు మరింత ఆయురారోగ్య బలమొసంగి, ఇంకను శేషించి గుప్తముగాయుండిన మహాభక్తుల చరిత్రలను సంపాదించి పుణ్యాత్ముల ద్రవ్యసహాయంబుచే ముద్రింపించి లోకమునకు అందజేసి కృతార్థులగుటకు కరుణామయుండగు భగవంతుడుతోడై రక్షించుగాక.

ఆనందాశ్రమము
రెడ్డిపాలెం
9–5–57.

ఇట్లు,
సర్వజీవశ్రేయోభిలాషి, లక్ష్మీకాంతయోగి

భక్త పండితాభిప్రాయములు

బ్ర॥ శ్రీ॥ పంగులూరి వీరరాఘవయ్యగారిచే విరచితమయిన ఆంధ్రభక్త విజయమును ఆమూలాగ్రము చదివితిని. ఇతర భక్తవిజయములకంటె దీనిలో నొక విశేషము గాన్పించినది. ఇతర భక్తవిజయములలోని భక్తులు చాలమంది మనము కని యెఱుగనివారు. ఈ భక్తవిజయములోని భక్తులు చాలమంది మనము కని వినినవారు. కాశీలో నున్నవారికంటె కాశీకి చాలదూర దేశములవారికి గంగయందు భక్తియెక్కువ. (పెరటిచెట్టు మందునకు కాదు.) అన్నట్లు సన్నిహితు లెంతగొప్పవారైనను వారి గొప్పతనమును గ్రహించుట చాలకష్టము. అటులనే మన మాంధ్రులమయియుండియు మన యాంధ్రులలో. మహా భక్తులయి వివిధ వర్ణముల జన్మించిన మహానుభావులు. 1. తూము నృసింహదాసుగారు, 2. సమిడిఘంటం వెంకటరమణదాసుగారు, 3. అద్దంకి వెంకట్రాయుడుదాసుగారు మున్నగువారిని మనము (ఆంధ్రులము) ప్రత్యక్షముగ నెఱిగియుండియు వారి మహిమలను గుర్తించి భగవద్భక్తిని సంపాదించి తరింప లేకపోవుచున్నాము. అది పెద్దలోపము, అట్టిలోపమును దీర్చి, పైన పేర్కొనబడిన ఆంధ్రభక్తుల చరిత్రను సర్వసుబోధముగ వ్రాసి యొక గ్రంథరూపమున తయారుచేసిన యీ పంగులూరు వీరరాఘవయ్యగారు ఆంధ్రలోకమునకు మహోపకారకులయిరి. ఇటులనే, మరికొన్ని గాథలను "బుఱ్ఱకథలు"గ మార్చి తయారుచేసిరి. ఆంధ్రులందరును వీరికి ఋణస్థులగుదురని నావిశ్వాసము.

గుంటూరు.
20-5-57,

ఇట్లు,
కాశీ కృష్ణాచార్యులు

శ్రీ పంగులూరి వీరరాఘవయ్యగారు. ఈ గ్రంథరచన యందు రెండు విలక్షణములైన విధానముల ననుసరించిరి. పాండిత్య కవిత్వ ప్రదర్శనములజోలికిబోక, నిత్యనూతనమైన "ఇందు గల డందు లేడను" భాగవతసూక్తుల ననుసరించి వారి యానందానుభవమును ఇందు వెల్లివిరియ జేసిరి. రెండవది మహాభక్తుల చరిత్రములను నిస్సారములైన వాక్యములతోగాక వారి యనుభవోపేతములగు సాధనా వివరములను శాస్త్ర అనుభవాధారములతో నాయా భక్తుల సాధనముల కంటించి ప్రతిచరిత్రకు ప్రప్రథమమున సుబోధకముగా వివరించిరి ఈ విధానము ప్రస్తుత మమలునందున్న భక్తవిజయములలో లేదని నానమ్మకము ఒకానొక సమయమున, మీ యాంధ్ర దేశమున భక్తులు లేరను, యొక మహారాష్ట్ర సోదరుని పరుషవాక్య కారణముగ దేశాభిమానము, ఆత్మవిశ్వాసము, ఆత్మగౌరవములను ప్రకోపింప వీరీగ్రంథమును ఆంధ్ర సోదరుల కందింప గలిగిరి.

పాఠకు లీగ్రంథమునందలి భక్తుల యనుభవములను గ్రంథకర్త హృద్గతమైన యాత్మానందమును, నిరాడంబర జీవితమును లక్షించి అనల్పమైన యాత్మానందమును, అతిస్వల్పమైన పదములలో నిముడ్చబడిన గంభీర భావముల గ్రహించి ఆంధ్రసోదరు లాత్మాన్వేషణయందు బురోభివృద్ధి నందెదరుగాక.

ఇట్లు,

గుంటూరు,
20-5-57.

రాగం ఆంజనేయులు
భగవద్భాగవత చరణ సేవకుడు

శ్రీయుత పంగులూరు వీరరాఘవశర్మగారు ఈయాంధ్ర మహాభక్త విజయ మనుగ్రంథమును రచించి లోకమునకును ఆత్మకును, మహోపకార మొనరించిరని తలంచుచున్నాను. ఈ గ్రంథదర్శనముచే వీరికిగల భాగవతాభిమానము ఆంధ్రాభిమానము అపారమై ప్రవహించుచున్నదని తెలియుచున్నది. వీరు పరమవైష్ణవ శిఖామణులయ్యును అన్ని మతములను, అన్ని సిద్ధాంతములను, అన్ని సంస్థలనుజూచి సంతసించుచు, కొనియాడుచు నుండెదరు ఇది వారి యాంతరంగిక సామరస్యభావము. ఇట్టివారలు చాల తక్కువగనున్నారు. వీరి రచనా మహత్వమునకు నీగ్రంథములోని, పోతన, వేమన, గోపన మొదలగు ఆంధ్ర మహాభక్తుల జీవితభాగములను జదువునప్పుడు పాఠకలోకమునకు గలుగు ఆనందపులకలు, ఆనందభాష్పములు, ఆనందపారవశ్యము సాక్ష్యము నిచ్చుచున్నది. ఇదియుం గాక వీరిరచనలోగల చాతుర్యము చాల కాలముక్రిందట జరిగినను, పరోక్షమున జరిగినను, చరితములను, వర్తమాన కాలికములుగ ప్రత్యక్షదృష్టములుగ, పాఠకలోకమునకు భావసంస్ఫూర్తిని గలిగించి ప్రత్యక్షమే యంతయు నను, గ్రొత్తవిషయమును; లోకమునకందఁజేయుచున్నది.

ఈ రచనా ప్రవాహములో ద్వితీయ ప్రయత్నము భక్తులతోబాటు క్షేత్రములయొక్కయు, మతకర్తలయొక్కయు

మహాత్త్వములను జీవితములను సుదూరము పరిశోధించి, భక్తిని విజ్ఞానమును సమకూర్చు గాక యని లోకము కాంక్షించుచున్న యది.

ఇట్లు మన యాంధ్ర దేశములోని భక్తసత్తుల, గరిష్ఠులను, పరమార్థ దర్శనములను గ్రంథించుటచే జిజ్ఞాసువులనుండి ఋజువు చేయుచు, సకల దేశముల కవిమణులలోను వెనుకంజ వేయదీ యాంధ్రదేశము అని దేశమహాత్మ్యమును చాటుచు ఆనృణ్యమును బడయుచున్నారు. ఆంధ్రదేశ మహాభక్తులలో నొకరగు శ్రీ పంగులూరు వీరరాఘవస్వామిగారి ఇట్టి మహోత్కృతుల ననేకము లోకమున కందజేయుదురు గాక.

అప్పికట్ల
16-5-57

ఇట్లు,
మహావిద్వాన్ సంపా:
వేదాన్తం జగన్నాథాచార్యులు
తిరుమల దేవస్థానము, ఆస్థానవిద్వాన్

తప్పొప్పులపట్టి

పుట	పంక్తి	తప్పు	ఒప్పు
7	10	పరిసావింప	పరిసాదింప
104	2	మిన్నె	మిన్ని
		గురునాథ	గురునాధ
159	2	భగవంతునిదయయయు	దయయయు
206	2	మా యాత్మ	మా ఆత్మ
289	17	సాపన్యాసమున	పన్యాసమున
302	9	ఒకే వేళ	ఒక వేళ
364	10	యాసక్తి	ఆసక్తి
366	25	సగ్వధారి	సాధారణ
390	9	దీనినే	దీనినేకొందఱు
405	9	సుహాత్మ్య	మహాత్త్వ
	16	దుగ్బలము	దుర్బలము
414	1	గామదాసు	నాగదాసు
430	21	జేరిఖించిన	ప్రేమించుచే
480	21	గూపుమాన్పి	రూపుమాపి

విషయసూచిక

శ్రీరామనామక్షేత్రము, గుంటూరు



శ్రీ కోదండరామప్రభువు

ప్రార్థన

కం. శ్రీరామనామసుక్షే ।
త్రోరుపవిత్రావనీశ । యోగిసం చయా
ధారా ! గర్తనగరసం
చారా ! కోదండరామ ? జననుతనామా.

సీ. అల్పవిద్వాంసుదేహాగే । హాప్రసక్త
నన్నుగ్గైకొని యుపకర । ణంబుగాగ
గర్తృభర్తృత్వసంపద । ల్గాంచుతావ
కీయలీలల వర్ణించి । కృపగడింతు.

సీ. కలనుమంత్రింబొసంగివి । ఖ్యాతవిశ్వ
రూపుజూపించి భయవృత్తి । రూపుమాపి
ఆంధ్రిసద్భక్త సంగభా । గ్యంబొసంగి
పెంపుజూపుటయేకాక । విపులకరుణ
నాంధ్రిదేశస్థక్షేత్రిమ । హాత్వమెన్న
విభవమునుగూడ నిచ్చెదే విశ్వనామ
రామనామోల్లసత్క్షేత్రి । ధామరామ.

కం. నీవాడించినమాటలె
దేవా ! నీయంఘ్రిజేర్చి । తిస్సృసగనుమా
సేవకుడ సర్వదృశ్యము
నీవైయుండంగ నేను । నిలువంగలదే.

గీ. ఆత్మశక్తి బ్రసాదించి । యహామడించి
తావకీయాంఘ్రిపద్మసేవావిభవ మొ
సంగిరక్షింపఁబ్రార్థితు । వెంగఁగానను
వార్ధకంబున కదిమీ । కృపార్ద్రదృష్టి
గలుగనన్నేమిసేయఁగా । గలదు రాము
నామసుక్షేత్రధామ కోదండరామ.

గీ. అవనిజాధిపబ్రహ్మ వి । ద్యాప్రదీప
విదళితాశ్రితసంతాప । విశ్వరూప
భక్తజన భాగధేయ శో । భననికాయ
రంజితామరసముదాయ । రామరాయ.

గీ. గ్రహానికాయంబులోపల । గ్రాలువాఁడ
దేశకాలవ్యవస్థల । దిరుగువాఁడ
పంచభూతాలలోసంచ । రించువాఁడ
నన్ను దయఁజూచికావుమో । సన్నివాఁడ.

గీ. తగినభక్తుల హృదయపద్మాల నిత్తని
యంతరంగాననిలచి శ్రీ యాంధ్రభక్త
జీవితంబులగుప్పించి చెన్నుగనుట
గ్రంథకర్తృత్వసంపద రామభద్రి
తమకెజెందెను కాదను తలపుమాను
గర్తపురినేతవిమల వి ఖ్యాతచరిత
శ్రీశ శ్రీరామనామ సు క్షేత్రవాస
ప్రథితగుణసాంద్రకోదండ రామచంద్ర.

గీ. భక్తవత్సల రామకృపాసముద్ర
చందనాగరుచర్చల జర్మచక్షు
వుల గోచరసంగతి వెలయు నీవు
రమ్యమై దివ్యమైన వరాహనార
సింహరూపుడననుచు దక్షేత్రమందె
దర్శనంబిచ్చితివి మహాత్మ్యాత్వదీయ
కరుణాజన్మాంతరంబుల మరువ రామ
నామసుక్షేత్రధామ కోదండరామ.

షష్ఠ్యంతములు

కం. శ్రీరామనామక్షేత్రో
ద్ధారికి గూరిరాఘుచయవి దారికి బృధుసం
సారికి గర్తనగరసం
చారికి గోదండ రామచంద్రవిభునకున్.

కం. శౌరికి నస్మద్హృదయవి
హారికి షడ్వర్గతిమిర హారికిబరమో
దారికి గర్తనగరసం
చారికి గోదండరామ । చంద్రవిభునకున్.

కం. సారసనయనునకు బుధా
ధారున కానందనిధికి దాపత్రియసం
హారికి గర్తనగరసం
చారికి గోదండరామ । చంద్రవిభునకున్.

కం. కారుణ్యజలధిరాకా
కైరవమిత్రునకు సమిత । గర్వనిభృతదై
త్యారికి గర్తనగరసం
చారికి గోదండరామ । చంద్రవిభునకున్.

కం. ధీరునకు మామకీప్సిత
పూరితచిత్తునకు ధాన । పూర్ణునకుబుధా
ధారునకు గర్తపురసం
చారికి గోదండరామ । చంద్రవిభునకున్.

కం. వందనశతంబుతో భవ
బంధంబువిదల్చుకొనియె, భాగవతకథా
బృంధము విశ్వాత్మునకిడి
ఇందందీవ్యక్తి యాత్మ దృగ్రితుడయ్యెన్.

శ్రీమత్

ఆంధ్ర మహాభక్త విజయము

త్రిలింగక్షేత్రము

మన యాంధ్రరాష్ట్రమే త్రిలింగక్షేత్రము. ఇది భారత స్వారాజ్యలక్ష్మికి శిరోభూషణము. క్షేత్రాధిపతులు ముగ్గురు. శ్రీశైలమల్లికార్జునుడు, ద్రాక్షారామభీమేశ్వరుడు, కాళహస్తీశ్వరుడు. మఱియు నిందు దివ్యస్థలములు పెక్కులు. అందు తిరుమల, ద్వారకాతిరుమల, సింహాచలము, అహోబలము, వేదగిరి, తిరుత్తని, అన్నవరము, భద్రగిరి ముఖ్యములు. ఈ పుణ్యస్థలము లన్నింటికిని స్థలపురాణములు గలవు. గాని ఇందు తూర్పుగోదావరి మండలమునం దలరారు భద్రాచల మాహాత్మ్యమును మాత్రము మా పాఠకుల కెఱింగించెద. ఇది వేదకాలమునుండి నేటివఱకు బుణ్యనిలయమై, భగవద్భాగవత సేవితమై, ఐహికాముష్మిక ఫలదాయకమైన దివ్యక్షేత్రమని పేరందినది. బ్రహ్మాండ పురాణమును దిలకించినవారలకు భద్రగిరి మాహాత్మ్యము గరతలామలకము.

మున్నొకప్పుడు మేరుగిరి తపంబొనరించి భద్రుడను పుత్రుని బడసినాడు. ఆతండు గిరిరూప ధారియై దండకారణ్యమున గల గౌతమీ తటంబున స్థిరనివాసి యైనాడు.

సీతాలక్ష్మణ సహితుండగు శ్రీరామచంద్రమూర్తి తన వనవాస కాలమున దండకారణ్యమున సంచరించు కారణముగ నలసి సేదదీర్చుకొన నెంచి భద్రగిరియం దాసీనుడై తత్సుఖస్పర్శ కలరుచు సంతసించి తద్గిరివరమును "అచలరూప భక్తుండవు గాగల"వని అనుగ్రహించె. "రామభద్రపదాంకత్వా ద్భద్రాద్రిరితివిశ్రుతః" రామభద్రపాదచిహ్నిత మగుట నా గిరి భద్రాద్రి యని పిలువబడుచున్నది.

తదుపరి భద్రుడు దీర్ఘతపంబుండ శ్రీరామమూర్తి ప్రత్యక్షంబై అర్చామూర్తిధారి నగుచు శాశ్వతముగనీయందు వసించి భక్తుల కిహపరముల సమకూర్పగల నని వరం బొసంగి, తమ్మల దమ్మక్క కారణముగ నిందు స్థిరనివాస మేర్పరచుకొని భక్తాభీష్టఫల ప్రదాతయై విరాజిల్లుచున్నాడు. తదాది భద్రాద్రి సర్వలోక పూజితమైయున్నయది. విశేషించి శ్రీరామనవమినాటి కళ్యాణోత్సవ సందర్భమున సహస్ర సంఖ్యాకులగు భక్తుల కత్యంత సేవ్యంబైయున్న దనుట సర్వు లెఱింగియే యుండిరి. స్థలమా - భద్రుడు వేలకొలందివర్ష ములు తపం బుండిన పవిత్రప్రదేశము. జలమా- గౌతమ మహర్షి వెంటనంటి గంగయను నామాంతరమున బ్రకాశించు గోదావరీ పవిత్రోదకము. దైవమా- కరుణాలవాలుండగు శ్రీ సీతారామమూర్తి. ఇట్లు పావనత్వమున కిక్కయగు పుణ్యక్షేత్ర మాచంద్రార్కము భాగవత సేవ్యమగుటలో నాశ్చర్యమేమి ? పురాణప్రసిద్ధిని వడసిన పావనక్షేత్రమును,

అందు స్థిరనివాసియైన, దైవమును జనసామాన్యమున కంద జేసిన భక్తాగ్రణి మన రామదాసు. భద్రాచలక్షేత్రచరిత్ర శ్రీరామదాసు చరిత్రతో ప్రారంభము. ప్రత్యక్ష శివస్వరూపు లగు ఆదిశంకరాచార్యవర్యులు గూడ భద్రగిరి సేవించి నట్లు రామకర్ణామృతమువలన వెల్లడియగుచున్నది. శ్రీ త్యాగరాజ స్వామివారు తనకీర్తనములందు గొన్నింటిచే భద్రగిరీశుని వర్ణించియున్నారు. ఇంకప్రస్తుత మనుసరించెద. మన త్రిలింగ క్షేత్రము కృష్ణా, గోదావరి, తుంగభద్రాది పుణ్యనదులకు బుట్టినిల్లు.

త్రిలింగస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామి, వేమన మొద లగుయోగి పుంగవులకు నిలయము. వారణాసి వీధుల సంచ రించు త్రిలింగస్వామిని గాంచి నిజమైన విశ్వేశ్వరుడీతడని వచించిన శ్రీ పరమహంసరామకృష్ణుని కాలము వాడితడు. పుట్టుపూర్వోత్తరము లేమియు దెలియవచ్చినవిగావు. (లభించిన రెండవ సంపుటమున జేర్చి ధన్యుడనయ్యెద). ఈకాలమున గూడ ఆంధ్రగిరి కందరములం దక్కడక్కడ యోగిపుంగవు లగుపడుచున్నారను వదంతి గలదు. వదంతిమాత్రమేగాదు. ప్రత్యక్షముగాచూచి వారివలన మహోపకారముల నంది యిప్పటికిని సజీవులైయున్న ఒకరిద్దరిని వీడుచూచియున్నాడు. గణపవర పురవాసి, యొకరు రామభజననేర్పుచు 'శొణిదెన' యందున్నాడు. ఒకనాడు, శొణిదెన వెంకటసుబ్బయ్యాగారరు దెంచి 'వెంకయ్యగారూ, మల్లాయిపాలెము నానుకొని దక్షిణ

మందున్న వీర్ల కొండకేగుదము రండి' అనిపిలచి వెంటగొని ఓష ధులను సంగ్రహించుకొఱకు బయనించి, కొండనెక్కి అందందు దిరుగుచు బైనగల గుహాద్వారముజేరిన తద్వారముఖమున దిగంబరియైన జడదారి నొక్కనిఁగాంచి, నమస్కరించి యోగి కనుసన్న గూరుచుండి స్వీయాగమన కారణ మెఱింగించి, యనుగ్రహ మర్థించిన కృపాళుండై వెంకయ్యగారివలన రెండు నూతన తాళపత్రముల దెప్పించి, వాటిని తన తొడలకు రుద్ది, అందొకటి వెంకయ్యగారికిని మఱియొకటి వెంకటసుబ్బయ్యగారి కిని యిచ్చెను. గాని యొకచిత్రముజరిగినది. వెంకయ్యగారికిడిన తాళపత్రమునందు "హరిమర్కటమర్కటాయస్వాహా" అనుమం త్రము వ్రాయబడియున్నది. దానిని జూచి వెంకయ్యగారిట్లనిరి. 'అయ్యా, మీయాజ్ఞప్రకార మీమంత్ర పునశ్చరణగావించెద' తనభావిని గుర్తించుట బ్రతిమానవునకు విధియగుట భవిష్యచ్ఛు భాశుభము లెఱింగింపుడన యోగిపుంగవులిట్లు సెలవొసఁగిరి. నీకు 'రెండవపెండ్లిగానున్నది' గాని ఆమెకొకస్త్రీసంతతి గలి గినవెంటనే విడిపోవును. గాఢమైన బధిరత్వమేర్పడును. అరవై యేండ్లవయస్సునుండి జీవితాంతము వఱకు స్వయంపాకివయ్యె దవు. భయపడకు. భగవంతుడు వెన్నంటి కాపాడగలడు. సర్ప వృశ్చిక బాధలెప్పుడు నిన్ను దేరి చూడలేవు. మీ యింటిపేరు సోమరాజు వారుకదా ? ఇకబొమ్ము. 'వెంకటసుబ్బయ్య ఇది వఱకే మంత్రోపదేశమును బొందినాడు గనుక దిరిగి వాని కవసరములేదు'. పొండు అని త్వరచేయుచు గుహాలోని కరిగి

అంతర్ధాన మైనాడు స్వామి. ఈకొండయం దప్పుడప్పు డిట్టి మహాత్ములు గోపాలుర కగుపడుటచే వీర్లకొండయని దీనికి పేరు వచ్చినది. వీర్లనగా దయ్యాలు, దయ్యములరూపములతో మహాపురుషు లిందు దిగంబరులై జడదారులై యగుపడు కారణముగా నీకొండకీపేరువచ్చియుండనగు. ఇది 1920 సం॥ జరిగిన సంఘటన. పై వెంకయ్య సజీవి. మఱియొకయోగి కోటప్ప కొండపై నిరాహారదీక్షతో సంవత్సరకాలము తపంబుండి కారణాంతరముచే వీర్లకొండ గుహ బ్రవేశించి పలువురకు మహోపకారముల గావించి పునీతులజ్జేసి అంతర్ధాన మైనాడు. వాని పోకడి యింతవఱకును దెలియఁబడదు. వీర్లకొండచెంతనున్న ఉప్మాగులూరి కొండగుహ మన సింగం గురప్పయ్యగారి తపోమందిరము.

మఱియు, మన త్రిలింగక్షేత్రము భక్తకవులకును, ప్రబంధకవులకును, నిలయము. రాళ్లకు జైతన్యము గల్పింపజాలిన శిల్పకళాకోవిదుల కాటపట్టు. దేశభక్తులకు నివాసభూమి.

భద్రాచల శ్రీరామమూర్తి తమ్మల దమక్కకుమార్తె తెచ్చిన నివేదితాన్నము నారగించుటయు, శ్రీరామదాసుగారి ఋణమారులక్షలరూప్యముల ప్రత్యక్షముగా రామలక్ష్మణులు తానీషాకు జెల్లించి రశీదు తెచ్చి దాసునకిడి ప్రాణాపదనుండితప్పించిన కారణముగా నాంధ్రావనిప్రజలురామభక్తిపూరితులగుట నాకాలమున రామభజనలు మిక్కుటమయినవి. రామమందిము లేని గ్రామమే లేదని జెప్పుట అతిశయోక్తికాదు.

రామదాసుగారివలన మొలకెత్తి పందిలెక్కిన భక్తిలత తూము నరసింహదాసుగారి కాలమున నాంధ్రావనియం దంతట నల్లుకొని వెంకటరమణదాసుగారి దోహద క్రియవలన పుష్ప గుచ్ఛములతో విరాజిల్లుచు భారతదేశ మంతకును శోభ గూర్చినది.

తదుపరి సమర్థులగు భక్తులెవరును లేకున్కి విచారించిరో, ఆంధ్రజనాభా పెరుగుదల యోచించిరో, మఱి యే కారణమును పురస్కరించికొనిరో, గుంటూరునందు 'శ్రీరామ నామక్షేత్ర' మను పేరుతో రెండవ భద్రాద్రిని నిర్మించి తద్వారా పై భక్తిలతకు భగవానుడు తన నామజల మందింప జేయుచు త్రిలింగక్షేత్రము నుద్ధరించుచున్నాడు. భద్రాద్రి యందు సీతాకళ్యాణోత్సవముల మరపించు 'రామకోటియుత్సవము' శ్రీరామనామక్షేత్రమున జరుగుట శ్రీకోదండరామ స్వామివారి కరుణగాక మఱియొండు కారణము లేదు.

ఏతత్క్షేత్రపురోభివృద్ధినాశించుచు శ్రీరామచంద్రమూర్తికి గావించు వందనశతములతో నీశుభగాధ ముగించెద.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

మహాత్మ బమ్మెర పోతన

గీ॥ శ్రీమత విజ్ఞాన భక్తివైరాగ్య మోక్ష
తత్త్వబోధానుగత లసద్భాగవత మ
హాపురాణంబు నిష్కామరూప మచ్చ
పడగ విరచించి రామునకిడిన పుణ్య
మూర్తి బమ్మెర పోతన కీర్తినెంచి
రామచంద్రుని గాంతు దుర్భవ మడంతు.

భగవంతుని యందుగల గాఢానురాగమే భక్తి. సత్య వస్తువన భగవద్భక్తి యొక్కటియె. భక్తిపెంపున బులకాంకిత గాత్రులయినవారే ధన్యమూర్తులు. స్వార్థరహితమైన భక్తి కఖండశక్తి కలదు. పాషాణమునకు దైవత్వము ప్రసాదింప గలదు; మృతశరీరమును బ్రతికింపగలదు. కృతార్థత్వమాశిం చిన నిట్టిభక్తి నార్జింపదగు. విశ్వాసయుక్తమైన భక్తివలననే ధన్యతనందుట. భక్తి, భగవంతుడు వేఱు వేఱు పదార్థములు కావు. పవిత్రహృదయు డొక్కండుమాత్ర మీరహస్య మెఱుంగగలడు. ఇట్టిభక్తి లభించినవాడే బంధముక్తుడు. భక్త్యా నుభవములేని హృదయము మరుభూమియని చెప్పకతప్పదు. భక్తియుక్తమయిన హృదయ మీశ్వరాభిముఖమైయుండును. ఈశ్వరాభిముఖమైన మనస్సు గలవానికి తాపములన్నియు హరించును. ఆపదలు దరిజేరవు. ఇట్టి మహాభాగ్య మార్జించి నవారు విషయవాసనలకును, ప్రాపంచిక కర్మలకును దూర ముగ నుండగలరు. త్రికరణశుద్ధిగ నవవిధభక్తి సాధనలయందే

యొక్కటిగాని, అన్నియుగాని నాశ్రయించి కృతకృత్యత నందవలయు.

కం॥ ఒకపరి జగములు వెలినిడి
యొకపరిలోపలికి గొనుచు నుభయము దానై
సకలార్థ సాక్షియగు న
య్యకలంకుని నాత్మమూలు నర్థి దలంతున్.

అనుభాగవత ధర్మమును ముఖ్య లక్ష్యముగ సాధన సాగింపవలయు. ఇట్టిభక్తి నార్జించిన పుణ్యామూర్తి మనపోతన కవుడుగట్టిన భక్తితత్త్వముగ ప్రసిద్ధిచెందిన పుణ్యామూర్తి. భోగ తృష్ణను మొదలంట గోసివేసిన త్యాగజీవియైన మహాత్ముడు.

తండ్రి కేసన. తల్లి లక్కమాంబ. జనన కాలము క్రీ. శ 15 వ శతాబ్దము. వృత్తి వంశపరంపరాయత్తమైన వ్యవసాయము.

ఈతడు బాల్యమునం దొకనాడు తన యావును మేపు కొనుట కడవికి తోలుకొనిపోయి తానొక వృక్షచ్ఛాయ గూర్చునియుండె. ఆయావు అడవియందందు మేయుచు నొక పొదరింటికడ కేగి, మిట్టి మిట్టి చూపులతో నిలువబడి, బెదరిన దానివలె గన్పించిన పోతనలేచి ఆవునుజూచి, దరిజేరి, వెన్ను జరిచి, పొద తిలకించిన, అందుపన్నగ భూషణుడైన సాంబ మూర్తి తన కంటబడిన నప్రియత్నముగ నేత్రములు మూత బడి నిశ్చేతనుడై కొంతవడికి కనులువిప్పి, పొదవంకకు తన చూపును ద్రిప్పి, భుజగాభరణవిరహితుడై తేజఃపుంజ విరాజి



మహాత్మ బమ్మెర పోతన

మానుడగు మహాదేవుని వీక్షించి, చేతులు ముకుళించి యనేక విధముల ప్రస్తుతించిన, చిరునవ్వు వెలయించుచు పార్వతీపతిచే సన్నఁజేరి మనపోతనను తన తొడనిడుకొని చుంచుదువ్వి, చెక్కిలి ముద్దుగొని "శ్రీరామ ప్రసాదసిద్ధి రస్తు" అని యాశీర్వదించి అంతర్ధానుడగుటయు, మన భక్తశిఖామణి తల్లిని గోల్పడిన బిడ్డవలె ఘోషించి, యట్టకేలకు శాంతివహించి గోవును కదలించుకొని, యిల్లుజేరి జననీజనకుల కీవృత్తాంత మెఱింగించి సంతోష తరంగిణుల నోలలాడుచుండె.

పదునాల్గవ వర్షప్రాయము గడచినది. అనుకూలవతి యగు మహాలక్ష్మమ్మని తండ్రియాజ్ఞ బరిణయమందినాడు. ఈమె నీడవలె భర్తననుసరించి వర్తించు బరమసాధ్వీమణి. సంసారదుఃఖములకు లోనుగాక, కవితాస్రవంతికి మార్గదర్శకుడై, కవితల్లజుడై పేరొందినవాడు మన పోతన.

ఈతడు నిరాశాజీవి. ఉన్నదానితో తృప్తినందు స్వభావముగలవాడు. అప్రయత్నముగ లభించిన కవితా మహాభాగ్యమువలన నానందసాగరమున నోలలాడుచున్నాడు. కవితాసామ్రాజ్యమలవడిన కవిచంద్రుడల్పసుఖము లాశించునా?

ఈతడు ప్రథమమున 'వీరభద్రవిజయము' రచించి మహాదేవుని కర్పించినాడు. 'భోగినీదండక' మీతని విరచితమే. పది యారవయేట జిదానందయోగి దర్శనమబ్బినది. తన కవిత్వ మాధుర్యముతో నాతని తృప్తిపరచినాడు. యోగి సంతో

షము నభినయించుచు "బిడ్డా, నీవు భక్తకవివై లోకకల్యాణ మొనరింపనున్నావు. తప్పదు." అని వచించినాడు. అంతనా యోగివలన తారక మంత్రమును గ్రహించి ధన్యుడైనాడు. "యోగివలన, రామానుగ్రహమువలన, నీవు తరించుటయే గాక లోకము నుద్ధరింపగలవ" ను ఆశీర్వాదముగూడ పొంది నాడు. తదుపరి యచిరకాలముననే శ్రీరామానుగ్రహ పాత్రుడైనాడు. కాలము మంచిదైన సర్వభాగ్యములు తమంత తామే వచ్చునుగదా!

రామానుగ్రహమువలన సమస్త విద్యలు కరతలామలక ములైనవి. ఇప్పుడు ఎఱుంగని శాస్త్రములుగాని, అలవడని కళలు గాని పోతనకు లేవు. సర్వవిజ్ఞానమును హస్తగతమైనది.

ఇతని కవిత నిర్మలమై, నిరుపమానమై మెఱుగులు తేరినది. జనరంజకమైనది. ఇప్పుడు మనభక్తకవి పులు గడి గిన రత్నమైనాడు. సహజపాండిత్య పోతనామాత్యుడైనాడు.

ఈతని కొకనాటి స్వప్నమున

సీ॥ మెఱుగు చెంగటనున్న మేఘంబు కైవడి
నువిద చెంగటనుండ నొప్పువాడు
చంద్రమండల సుధా సారంబు పోలిక
ముఖమున చిరునవ్వు మొలుచువాడు
వల్లీయుత తమాల వసుమ తీజముభంగి
బలువిల్లు మూపున బరుగువాడు

నీలనభాగ్రి సన్నిహిత భానుని భంగి
ఘన కిరీటము దల గలుగువాడు

గీ॥ పుండరీకయుగము బోలుకన్నులవాడు
వెడద యురమువాడు, విపుల వక్షము వాడు...

అయిన రాజముఖ్యుడొకడు స్వప్నమున సాక్షాత్కరించి భాగవత మనువదించి తన కంకిత మీవలయునని అర్థించినాడు.

ఈమాట విని పులకిత గాత్రుడై

కం॥ పలికెడిది భాగవతమట
పలికించెడివాడు రామభద్రుండట నే
పలికిన భవహరమగునట
పలికెద వేఱొండుగాథ బలుకగనేల.

అని ఆంధ్ర మహాభాగవత రచనకు మొదలిడినాడు. ఇప్పుడు ఆధ్యాత్మిక శాస్త్రమగు సంస్కృతభాగవతము మహాకావ్యముగ మారినది. సాధారణముగ భక్తులెల్లరు నిరుపేదలై యుండెదరు. వారలవలెనే పోతన దారిద్ర్య మనుభవించుచున్నను చలింపనిభక్తి గలవాడై యున్నాడు. భగవంతు డెవని యనుగ్రహింపదలుచునో ముందు వాని నైశ్వర్యము హరించుననుట యదార్థమైనది. ఈదరిద్రస్థితిలో భాగవతకృతి అమ్మునో! ఏమో! యని శంకించి సరస్వతి ఈతని యెదుట సాక్షాత్కరించి కన్నీరు తనపమిట చెంగుతో తుడుచు

కొనుచుండుట చూచి, "అమ్మా! భారతీ, ఊరడిల్లు మూరడిల్లుము. కర్ణాట కిరాత కీచకులకమ్మ" నని శపథము చేసి ఆమెను తృప్తిపరచెను.

సింగభూపాలుడు ఆంధ్ర భాగవతమునకు తనను కృతి భర్తగా జేసిన నగ్రహారాది సత్కారముల గావింతునని కబు రంపిన, నిరాకరించిన ధీరుడు మన పోతన.

మన భక్తాగ్రణికి లోకానుగ్రహా కాంక్షతప్ప తుచ్ఛ విషయేచ్ఛలేదు. అంత సింగభూపాలుడు కోపించి పోతన కృతి రత్నములను నేలగల్ప దలంచినాడు. తన జీవితమున నది యొకసల్లమచ్ఛయని తలంపక పగసాధింపజూచినాడు. ఇది పోతనకు తెలియవచ్చినది. సింగభూపతి ఏమిచేయునో అను భీతిచే తన భాగవతమును భూస్థాపిత మొనర్చి రక్షించు కొని నాడు. ఇందువలన కొన్ని భాగములలో పోతన రచనలు చెడి నవి. శిథిల భాగములను నేర్చారి సింగన, నెలిగందల నారన పూరించి గ్రంథభాగము కొరవపడకుండ చూచినారు. ఈ ఆంధ్ర మహాభాగవతమున భక్తిస్వరూప స్వభావముల సర్వ జనాదరణీయముగ నిర్వచించుటయేగాక తాననుష్ఠించి చూపి నాడు. ఈతని భక్తిమార్గములె తెలుగువారి భక్తిమార్గ ములు. పోతన భాగవతమే తెలుగువారి ముక్తిగ్రంథము. పోతన భక్తిలో శివకేశవులకు భేదములేదు. సగుణాద్వైత భక్తియన నిదియె. పరమేశ్వరుడు ప్రపంచమంతటను వ్యాపించి

యున్నాడు. ఎవరి నుపాసించినను, దేని నారాధించినను భగవంతుని నారాధించుటయే యగును. భగవదారాధన రూపమగు భక్తికి ప్రభువు సర్వేశ్వరుడు. ఈభక్తికి శమదమాది గుణములు, శ్రవణసఖ్యకీర్తనాది నవవిధ భక్తిమార్గములు సాధనములు.

భగవంతునియందు నిరంతర తన్మయావస్థ భక్తుని కావశ్యకము. భగవద్రూపమున దేని నారాధింప గలిగినను, అదియెల్ల భక్తి యనిపించుకొనును. ఇట్టిభక్తి ననుష్ఠించువారెల్లరు భాగవతు లనిపించుకొని భగవదనుగ్రహమునకు పాత్రులగుదురు.

ఉ॥ ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపల నుండులీనమై
ఎవ్వని యందుడిందు బర మేశ్వరు డెవ్వడు మూలకారణం
బెవ్వ డనాదిమధ్యలయు డెవ్వడు సర్వముదానయైన వా
డెవ్వడు వాని, నాత్మభవు, నీశ్వరునే శరణంబువేడెదన్.

అని వర్ణించిన ఆత్మస్వరూపమగు ఈశ్వరతత్త్వమే శ్రీ మహావిష్ణువుగా బరిగ్రహింపదగు.

ఆత్మస్వరూపి, సర్వాంతర్యామిఅగు నతని బొందుటకు భక్తి సాధనము. భక్తినార్జించుటకు సర్వభూత సమహితత్వమావశ్యకము.

వినయ పూర్వక మనవి. మనపోతన భక్తియే తెలుగువారి భక్తియని మాత్రము. ఇట్లు భక్తిజ్యోతి ఆంధ్ర మహా

భాగవత రూపమున అసామాన్య తేజముతో తేజరిల్లజేసి యాంధ్రుల అజ్ఞానాంధకారమును పటాపంచ లొనరించిన భక్తశిఖామణికి ధన్యవాదములు.

పలువురు చారిత్రకులు పలువిధములైన శ్రీవారి ప్రభావముల గ్రంథస్థముల గావించుట గ్రంథవిస్తరభీతి వదలితి, పాఠకులు క్షమింతురుగాక.



యోగిరాజు వేమన

"నామనస్సు" అనువ్యవహార ముండుటచే ఆమనస్సు నీవు గాదు, నీవు యజమానివి. నీదాసి మనస్సు. నీవెప్పుడును సుఖ మపేక్షించుచుండుస్వభావముగలవాడ వగుట సుఖస్వరూపుడవై యున్నావు. మనస్సును తోసివేసిన సుషుప్తియం దనుభవించిన శాంతియే నీ స్వరూపమని తెలియబడును.

తలంపులగుట్ట మనస్సు. సుషుప్తియందు తలంపులు లేవుకనుక మన స్సుండియు లేనిదైనది. 'జాగ్రత్స్వప్నముల యందు తలంపు లున్నవి గనుక, మన స్సున్నది. అనగ, మన స్సుండిన జగమున్నది. మనస్సు లేకుండిన జగత్తు లేదు. నిన్ను నీవు జూచుసాధన బలపడినకొలది క్రమముగ జగత్తంతరించుచున్నది. జగత్తును చూచునపుడు నిన్ను నీవు జూడలేవు. ఈ శరీరమునందు "నేను" అనుతలంపు మొదట హృదయమునుండియే బయలుదేరినది, కనుక మనస్సునకు హృదయమే జన్మస్థానము. నీ స్వస్వరూప మనుసంధించిన నీచోటికే నిన్ను తీసుకొనిపోవును.

మనస్సునదోచు తలంపు లన్నిటికి "నేను" అను తలంపు మొదటిది. ఈతలంపు లేచినతరువాతనే లెక్కలేనన్నితలంపు లుద్భవించుచున్నవి. "నేను ఎవడను?" అను విచారముచే మన స్సడంగును. "నే నెవడ" ననువిచారము వేఱుతలంపుల నాశముచేసి మనస్సును నాశము చేయును.

మనస్సునందు లేచినతలంపుల గార్యరూపమును ధరింపనీక "ఈ తలంపు లెవనికి గల్గినవి" అనివిచారించిన, "నాకే" అని తోచును. "నేను ఎవడను?" అనివిచారించిన "సుఖస్వరూపుడ" ననుట వెల్లడి యగును. దానితో మనస్సనునదియే లేదని తెలియును. అనగా మనస్సు తనజన్మస్థానమును జేరి సుఖించు ననుట.

ఈవిధమైన యభ్యాసము కానుకాను మనస్సునకు తనజన్మస్థానమందు నిలకడజెందుశక్తి యధికమై క్రమక్రమముగా తాను తానై విరాజిల్లును. ఇట్టిసాధనయందు కృతార్థత గడించినవాడే మన వేమనయోగి.

(ఈ మహానీయుడు క్రీ. శ. 1412 సం॥ నందననామ సంవత్సర కార్తిక శుద్ధ పూర్ణిమనాడు జన్మించినాడు. ఈతని తండ్రి తుంగకేశవుడు. తల్లి అచ్చమ్మ. సోదరులు బాపన, కేశవుడు, నారాయణ. వాసము కొండవీటియందలి పడమటి వీధి. తండ్రి రాజాస్థానమం దధికారి. ధనికుడుగూడ. భక్తి జ్ఞానవైరాగ్యము లీతని పట్టుకొమ్మలు. తండ్రిగుణగణములే మన వేమనయందు మూర్తీభవించినవి.)

చిన్నతనమునుండి చాల గారాబముతో బెఱిగినాడు. పిన్ననాడే తలిదండ్రులు గతించుటచే అన్నచేత బెంపబడినాడు, "తండ్రిలేని బిడ్డని" గారాబముచే పెంచినాడు. ఇందువలన విద్యాబుద్ధులు కొరవడినవి. చదువుట, వ్రాయుట మాత్రము నేర్చినాడు. (పిన్ననాటినుండియే ఈతనికి గవిత్వ

మబ్బినది. ఆశు కవిగూడ. స్వేచ్ఛావిహారి.) దుష్టసహవాస మున కలవాటుపడినాఁడు. భోగస్త్రీలకు దాసుడై సర్వస్వము వారి కర్పించినాడు. దుర్వ్యసనములకు లోనై వదినెగారి యాభరణములనైతము ధారబోసినాడు. ఆమె జేసిన యుప దేశమే, దుర్వ్యసనములనుండి తొలగించి గృ హ స్థ గా జేయఁగలిగినది

వివాహమైనది. కుటుంబభారము పైబడుట, స్వర్ణ యోగ మలవరచుకొన బ్రియత్నించినాడు కాని లభ్యపడ లేదు. పిదప (లంబికాశివయోగి దర్శన మబ్బినది. దాన వైరాగ్య మలవడి ఐహికచింత తొలగినది. యోగాభ్యాసచింత బలపడినది. భోగాశ నాశనమైనది. జ్ఞానసిద్ధి నాశించి తత్త్వోప దేశమునకై జీవితము వెచ్చించినాడు.)

-కొండవీటికి దాపుననుండు గుహలో జ్ఞానయోగి యుండె నని విన్నాడు. అభిరాముడను విశ్వబ్రాహ్మణుడు జ్ఞానయోగి మిత్రుడు. ఈ యోగిపుంగవుడు అభిరాముని గటాక్షింప నెంచి ముహూర్తము నిశ్చయించి, తత్త్వోపదేశమునకై రా నాజ్ఞాపించినాడు. ఈ వృత్తాంత మెఱింగి అభిరాముడు తన యన్నకడ నుద్యోగియఁగుట దీరనిపనిగల్పించి పంపి, తా నా యోగిని దర్శించి, తనను అభిరాముడుపంపినటుల బొంకి, ముహూర్తాతిక్రమణమునకు సహింపలేని యోగివలన దత్త్వోప దేశమును బొంది ధన్యుడైనాడు.

(మన వేమనకు "ఆత్మజ్ఞానము" కరతలామలకమైనది. యోగసిద్ధియు, జ్ఞానసిద్ధియు లభించినది. వీనిలక్ష్య మిప్పుడు సర్వసంగపరిత్యాగమే, స్వపరభేదము లేదు. లోక మీతని కుటుంబము. సన్యాసియైనాడు!

ఈకాలమున లోకమునందు దైవభక్తి సున్న. ఆధ్యాత్మికచింత శూన్యము. అవినీతి మిక్కుటము. !ఇప్పు డీతడు లోకమున కిట్లు బోధించినాడు. " సత్యము దప్పరాదు, అకృత్యము లాచరింపరాదు, తనతోసమానముగా సర్వ ప్రాణులను జూడవలయు, ధర్మమే జయము" అని!

దేశదేశాలు తిరిగినాడు. తత్త్వదృష్ట్యా లోకము వీక్షింపసాగినాడు. కొంకుజం కెఱుంగక దా నెఱింగిన సత్యమును బోధించినాడు. (ఈతడు కావించిన నీతులన్నియు తేటగీతలలోను, ఆటవెలదులలోను వెలువడినవి. ఇట్టిపద్యములు వేలకువేలు. గాని రెండువేలుమాత్ర మగుపడుచున్నవి. పుణ్యకర్మాచరణమునకు చిత్తశుద్ధి అవసరమను అర్థమిచ్చు " చిత్తశుద్ధిలేని శివపూజ లేలరా " అను గీతచరణమును వెలయించినాడు. మతములు భిన్నభిన్నములుగా నున్నను నిరూపించుతత్త్వ మొక్కటియే యని బోధించినాడు./

ఇట్టిబోధల నెన్నిటినో వెల్లడించినాడు. అభిరాముని వలన తనకుజరిగిన మహోపకారమునకు గృతజ్ఞత జూపినాడు. ఈతడద్వైతి. ఉపాస్యమూర్తి శివుడు. (ఎవ రేయే దేవతల బ్రేమించినను మోక్షసిద్ధిలభించు ననుస్వానుభవ

మును వెల్లడించినాడు. భక్తి జ్ఞానమున కంగము. జ్ఞానాధికారికి గర్మాచరణ మనవసరము. జ్ఞానము యోగసిద్ధి కత్యంత సన్నిహితము. "యోగమే జ్ఞానము, జ్ఞానమే యోగము" అని వీరి భావము.

వీరిసాధన లివి, నీతు లివి—

గీ॥ నిన్ను జూచుచుండ నిందును తత్త్వంబు
తన్ను జూచుచుండ దగులుమాయ
నిన్నెఱింగినపుడె తన్ను దా నెఱుగుట
విశ్వదాభిరామ వినర వేమ.

గీ॥ ఆలు మగనిమాట కడ్డంబుజెప్పిన
ఆలు కాదు నుదుటి వ్రాలుగాని
అట్టియాలి విడచి యడవినుండుట మేలు
విశ్వదాభిరామ వినర వేమ.

గీ॥ లోభివాని జంప లోకంబులోపల
మందులేదు వేఱు మతముగలదు
పైక మడిగినంత భగ్గునబడిచచ్చు
విశ్వదాభిరామ వినర వేమ.

గీ॥ సకలతీర్థములను సకలయజ్ఞంబుల
దలలుగోఱుగకున్న ఫలములేదు
మంత్రిబలముకన్న మంగలిబల మెచ్చు
విశ్వదాభిరామ వినర వేమ.

ఇట్లే అనేకనీతులు బోధించినాడు—

గీ॥ దేవుడనగ వేఱు దేశమందున్నాడె
దేహియగుచు నెక్కి దేహరథము
వాహనములగట్టి వడి దోలుచున్నాడు
విశ్వదాభిరామ వినర వేమ.

గీ॥ నాకు నెవరు దిక్కు నడినాళమందున్న
వేగుచుక్కవంటి వెలుగె దిక్కు
వెలుగుకంటెదిక్కు వేరెవ్వ రున్నారు
విశ్వదాభిరామ వినర వేమ.

ఇట్లాధ్యాత్మికమునుగూడ బోధించినాడు. గ్రంథవిస్తర భీతి విరమించితి.

వ.రా:— శ్రీవారి జీవితగాధలో జరిత్రకారులు పలువిధములైన పరిభావముల గ్రంథములలో జేర్చియున్నారు. చర్వితచర్వణభీతి జైకొన నింతలో విరమించితి.

వీరికులమువారు కదిరితాలూకా, నల్లజెర్వు, కటారుపల్లెలలో నున్నారు. వీరు శ్రీవారి సమాధులకు ధర్మకర్తలుగూడ.



భక్తాగ్రణి భద్రాద్రి రామదాసు

మన యిష్టదైవమైన నిర్గుణనిరాకారపరబ్రహ్మమగు శ్రీరామచంద్రుని జూచుటకే మానవజన్మ వచ్చినది. మన కును రామునకును నడుమ భేదింపరాని తెర యున్నది. అదియే సత్వరజస్తమోమయమయిన మాయ. దానిని దొల గించినగాని యత డగుపడడు. ఈ మాయవినోదము వర్ణింప రానిది. ప్రపంచమంతయు మాయాకార్యమే. దీని వినోద మున మైమరచి మోసపోవుచున్నాము.

దీని బహిరంగరూప మెనిమిదివిధములుగా నున్నది. అవి ఆకాశము, వాయువు, అగ్ని, జలము, భూమి, మనస్సు, బుద్ధి, అహంకారము. స్వభావమున లేక, నున్నటు లగుపడునది యీ మాయ. మనము చూచునది, చేయునది, తినునది, వినునది, సర్వము అనగా ప్రపంచపోకడలన్నియు, కనుపడు పదార్థాలన్నియు మాయామయములు. ప్రపంచరచనాక్రమ మునే కర్మ యనెదరు. దేహేంద్రియాలకు గారణముగా మాయ యున్నది.

ఈ మాయ పరమాత్మయగు శ్రీరామునినుండియే కలిగినది. ఎందులకు గలిగినది, ఎట్లు కలిగినది, ఎవరును చెప్పజాలరు. ఇది సృష్టికిబూర్వ మవ్యక్తరూపమున నున్నది. ఈనాటి వ్యక్తరూప మానాడు లేదు. మాయా కార్యమైన ప్రపంచము ప్రళయములో నశించునుగాని,

మాయమాత్రము నశింపదు. ఇది పరమాత్మనుండి ఎప్పుడు వచ్చినదియో ఎవరును చెప్పజాలరు. గాని దాని యథార్థ స్వరూప మెఱింగినవారినిమాత్రము కన్నెత్తియైన జూడ జాలదు. ఇట్టివాడే జ్ఞాని. సత్కర్మదుష్కర్మ లన్నియు మాయామయము లగుట వీని కెఱుకయే. సత్కర్మవలన నుత్తమజన్మ, దుష్కర్మవలన నీచజన్మ ; సత్కర్మవలన సుఖము, దుష్కర్మవలన దుఃఖము. ఇదియే మాయానాటకము. అన్నికర్మలు బంధకములే.

ఈ మాయాప్రభావముతోనే పశువుగా, పక్షిగా, మానవుడుగా, దానవుడుగా, నానారూపాలతో బ్రకృతి తోచుచున్నది. అసంగస్వభావుడైన జీవుడు మాయకు లొంగి సంసృతిలోబడినాడు. కర్మల నభిమానించుటయే మాయలో దగుల్కొనుట. లేని ప్రపంచము లేనిదానిగా గాని. లేక భగవత్స్వరూపముగా గాని తలంచి యారూఢ స్థితిని గడంచినవాడే భక్తుడు. ఈ రెండుస్థితులను క్రమముగా గష్టములకోర్చి సాధించిననాడే గమ్యము లభించును. పలు కష్టములరికోర్చి, "మళ్ళీజన్మాలకు రామువదిలో నుంచండి" యని గంటగట్టి సాటించిన భక్తాగ్రణి మన కంచర్ల గోపన్న (రామదాసు). ఈతడు స్వప్రయత్నముపై జిజ్ఞాసభక్తిని గడించి రఘునాథభట్టరాచార్యులగారివలన దారకమంత్రి మార్జించి "ఏడనున్నాడో, శ్రీరాము డేడనున్నాడో" అని భగవంతుని వెదకుచు, నార్తభక్తియు "ఇక్ష్వాకుకులతిలక యికనైన బలు

కవే" అని పాడుచు, సర్వార్థిభక్తియు గ్రమముగ "అంతా రామమయం, జగమంతా రామమయ" మనిపాడుచు, విశ్వరూపోపాసనజేసి "ఎందుజూచిన నీదు అందమే కనుపడె" ననుచు తన సాధనాఫలమును వెల్లడించి, మళ్ళీజన్మానికి రానని స్వానుభూతి వెల్లడించిన పుణ్యమూర్తి శ్రీభద్రాద్రి రామదాసు.

తండ్రి లింగనమంత్రి. తల్లి కామాంబ. ఆదిశాఖా బ్రాహ్మణుడు. నివాసము నైజామురాష్ట్రములోని నేలకొండపల్లి. క్రీ॥ శ॥ 17వ శతాబ్దమున భద్రాచలసమీపమునగల భద్రరెడ్డి పాలెములో శబరి కులమునకుజెందిన తమ్మల దమ్మక్క యను భక్తురాలైన పూర్వసువాసినికి స్వప్నములో శ్రీ సీతారామ చంద్రులు దర్శనమిచ్చి, సమీపారణ్యమున దాళివృక్షముల పొంత నర్చామూర్తిగా దాను సీతాలక్ష్మణులతో నున్నానని జెప్పి యంతర్ధానమగుట, మరునాడు వెదకి భద్రగిరి పైన స్వాములగాంచి, ఆనందముతో నాతాళఫలముల నివేదించుచు ఆమె కాలము గడిపెను.

స్వామి స్వప్నమున నామెకు శ్రీరాములు "నీకు సహాయుడుగా నచిరకాలమున మఱియొకవ్యక్తి రాగల" డనిచెప్పిన వాక్యము ననుసరించి మన రామదాసుగారు పాలవంచతాలూకా తహసీల్దారుగా నేగి, 1670 సం॥ మొదలుకొని 1674 వఱకు శ్రీరామాలయ నిర్మాణకార్యక్రమమున మగ్నులైయుండి కృతార్థు డయ్యెను.

ఒకానొకసమయమున మన గోపన్నకుమారుడు గంజి గుంటలో బడి మృతినందిన, "ఏబుద్ధి వీడు, ఎఱుగనివాడు, పాపడు వీడు బడలియున్నాడు, పాపనులేపి బాధలుమాన్పి ఆపదబాపి అటు కృపజూపి" అని పాడి రాముని మెప్పించి పిల్లవానిని బ్రతికించుకొనినాడు.

చేత చిల్లిగవ్వయేనియు లేకపోయినను, సాహసించి ఖజానాద్రవ్యము వెచ్చించి, ఆలయముపని పూర్తిగావించి నాడు. రెండుమూడుమండపములు, గోపురములు, ప్రాకార ములు, వాహనములు నిర్మింపించుటయేగాక, జింతాకు పత కము, పచ్చల పతకము, బిళ్ళల మొలత్రాడు, రవ్వలకుండ లములు, చెవిపోగులు, నీలాలపోగులు, కిరీటములు, గొలుసు, మంగళసూత్రము, కలికితురాయి మొదలగు బంగారునగలు గూడ చేయించినాడు. ఖజానాపైకము పూర్తిగాబడినది. ఈ వ్యయము దాదాపు ఆరులక్ష లైనది. తానీషాభటులు సర్కారుఋణము చెల్లింపనికారణమున బంధించుకొనిపోయిరి. గ్రామస్థులు తదృణము దీర్ప సిద్ధపడిరిగాని గోపన యొప్పు కొనలేదు. గోల్కొండ కారాగారమున బందియై పండ్రెండు వత్సరములు బాధపడినాడు.

తనసాహిత్య ప్రగతిచేత అప్పటిపరిస్థితులు కీర్తనల ద్వారా, దాశరథీశతకముద్వారా ఆంధ్రలోకమున కందించి భక్తలోకమునకు, భాషాసాహిత్యమునకు వెలలేని సేవ చేసి నాడు. భగవత్పరీక్షలో నెగ్గినాడు. మాయ దాటినాడు.

శ్రీరామునికరుణ కార్యరూపము ధరించినది. తానీషా కడకు రామలక్ష్మణులు మారురూపములతో వచ్చి రామ రాజ్యమునాటి బంగరునాణెములు సమర్పించినారు. తానీషా ఆశ్చర్యభరితుడైనాడు. వారికి రశీదిచ్చి పంపినాడు. తానీషా రామదాసునిమహిమ నెఱింగి రామదాసున కాద్రవ్యమం తయు నర్పింప నదుల కిష్టపడక నా నాణెములందు రెండిం టినిమాత్రము గైకొని దాసుగారు భద్రాద్రి జేరినారు.

ఆరెండునాణెములు నేటికిని రామాలయమున నర్చింప బడుచున్నవి. ఈ దృశ్యమువలన చరిత్ర యెంతసత్యమో బోధపడుచున్నది. రామదాసు చేయించిన నగలన్నియు భద్రా చలమున నద్దములతో బొదుగబడిన ఇనుపబీరువాలోనుంచి నేటికిని ప్రదర్శింపబడుచున్నవి.

రామదాసుగారు 1670 సం॥లో తహాశ్శీల్దారు పదవి పొంది, 1674 సం॥ వఱకు రామాలయాది నిర్మాణముల గావించి, 1686 వఱకు కారాగారవాసముండి తిరిగి భద్రగిరి కేగి, స్వామికళ్యాణములు గావించుచు గాలము గడిపి శరీ రము జాలించినారు. నవాబులలో జివరివాడగు తానీషా 1687 సంవత్సరమున ఔరంగజేబునకు వశుడైనారు.

భగవాన్ ములుగు పాపయారాధ్యులు

ప్రతిమానవునకు, బాల్య, యౌవన వార్ధక్యములయం దెప్పుడో ఒకప్పుడు సహజముగ జ్ఞానోదయంబగును. అప్పుడు తగినదోహద మలవడిన, బరమాత్మానుగ్రహము లభించును, కాన, జ్ఞానోదయమైన వెంటనే ఈశ్వరానుగ్రహమార్జించుట కారంభింపవలయు.

సంపూర్ణముగ నిహసుఖములనుభవించి, ముసలివయసున, భగవత్కృప గడింపవచ్చునని, జీవితము లస్థిరములగుట దెలిసియు, గాలమువ్యర్థపరచుట శ్రేయస్కరముగాదు.

గతించిన రోజులు తిరిగిరావు, కాలమమూల్యము. బాల్య, కౌమారదశలందు, బరమేశ్వరానుగ్రహము సంపాదించు టసంభవమని తలంపరాదు. ధ్రువాదులు బాల్యముననేగదా భక్తినార్జించినది. ఒకడు చేసిన దుర్ఘటకార్యమింకొక డెందులకు జేయజాలడు? సమర్థతా సమర్థతలు దేహములో లేవు. అవి బుద్ధికి సంబంధించినవి.

రంగు క్రొత్తగుడ్డకు బట్టినట్లు పాతగుడ్డకు బట్టునా? బాల్యదశయందు మనంబు కోమలమైయుంట భక్తిసులభముగ నలవడును. ఇది తెలిసియే మనకు బంచాక్షరితో నక్షరాభ్యాస మొనర్చినారు, గాని వాతావరణ మనుకూలింపమి చౌటిభూమియందు నాటిన విత్తనమైనది. అటుగాక వెంటనే దోహద మలవడిన నాభక్తి చెట్టై, మానై, పూలుపూసి కాయలు

కాని పండ్లుపండి అనుభవమునకు రాకపోయెడిదికాదు. ఈ భక్తినిధి బాల్యమున లభింపనిచో యౌవనమందైనను, ముది ప్పుడైనను భక్తిజిజ్ఞాస గలిగినవెంటనే మొదలిడి, భగవదను గ్రహాము గడించుటకు యత్నించిన, మరుజన్మమందైనను కార్యసిద్ధి లభించును ఈ రహస్యమనుసరించి పూర్వవాసనా బలము ముందునకు దోయు.

సీ॥ సంస్కృతాంధ్రోన్నత సాహితీగరిమంబు
బాలత్వమున నుగ్గు, బాలుగాగ
బహుపదార్థరసస్వ భావపరిభావంబు
పిన్నతనంబున, వెన్నగాగ
నవనవకల్పనా నంతసామర్థ్యంబు
చిరుతప్రాయముననే చిగురుగాగ
సర్వవిజ్ఞాన ప్రసన్న ప్రసాదంబు
సహజప్రసాద భూషణముగాగ

గీ॥ దాడి, మెసవి, తొడిగి, దాల్చి శోభారతి
భారతీ సుతాను భావమొంది
పరిబలచుండు ములుగు పాపయారాధ్య ప్రి
సూక్తి సకలకావ్య శక్తి భక్తి.
అని పొగడిక గొనినాడు.

తండ్రి వీరేశ్వరుడు, తల్లి భ్రమరాంబ, భార్య లింగాంబ, గోత్రము కౌండిన్యస, గ్రామము చింతపల్లి, (via) అమరావతి. ఈపాపయారాధ్యులు నిరుపేద, ధనార్జనావ్యాపృతి లేనివాడు.

నిర్లిప్తుడు. తన దేవీభాగవతమును పరదేవి కంకితమిడి కృతార్థత గడించిన పుణ్యమూర్తి.

శ్రీమంతుడును, గీర్వాణాంధ్రభాషా కోవిదుడును వల్లూట్లగోత్రోద్భవుడును అయిన, జగన్నాథధరాధిపుడొకనాడరిగి, "నీ దేవీభాగవతము నాకంకితమిడిన నీ పేదరికమూడ బెరికి శ్రీమంతునిగావించెద" నని పలువిధములు ప్రార్థించినను, సమ్మతింపక పోతనామాత్యునికివలె, దనయిష్ట దైవముకిడి తృప్తిగడించిన ధన్యమూర్తి. వీరు పలుకు పలుకులన్నియు పద్యములుగానో, శ్లోకములుగానో, తయారయి హృదయాహ్లాదమును గలిగించుచుండును.

ఈమహనీయుడు తనముప్పదిరెండవయేట శివరాత్రినాడు ధ్యానగమ్యుడై జాగ్రత్సుషుప్తిలో నుండుతరి, దేవీ సాక్షాత్కరించి, దేవీభాగవతము దనకంకితమిడుమని సెలవొసంగిన కారణముగ, నరాంకితమిడ సమ్మతింపజాలడయ్యె. తన యుపాసనామూర్తియగు అర్ధనారీశ్వరునారాధించు తరి శ్రీ మహావిష్ణువు ప్రత్యక్షమై, "నేనే శివుడను, శివుడనే నేనే. మాకిరువురకు భేదములేదు. పొరపడకు" మని చెప్పుచు వెంటనే అర్ధనారీశ్వరాకృతిధరించి సాక్షాత్కరించె. నాటనుండి మతపాషండస్థితిని వదలి, అభేదభక్తిని సాధించి సిద్ధిగడించిన పవిత్రమూర్తి.

పోతనామాత్యునకు వలె నీతడును సహజపాండితీగరిమ నలరువాడని "సంస్కృతాంధ్రోన్నతసాహితీగరిమంబు" అనుసీసపద్యపాదమే చెప్పక జెప్పుచున్నది. సర్వవిధముల వీరి

కవిత్వము పోతనామాత్యు కవితను బోలినదగుట "అభినవ పోతనామాత్య" డీత డని జెప్ప నొప్పు.

దేవికటాక్ష పాత్రుడగుట శ్రీవారిని వాశిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు, గురువునుగా గ్రహించుటయేగాక ప్రధానామాత్యునిగా గూడ నేర్పరచుకొని కృతార్థులైనారు. దేవీభాగవతరచనా కాలమున నిజ భార్యావియోగము రానున్న కారణముగ "ముక్తిద్వారము తల్పుదీయగదె చాముండా జగజ్జీవనీ" అనుమకుటముతో నిరువదియేడు శార్దూల వృత్తముల విరచించి సంతృప్తుడై జాయావియోగదుఃఖము మరచినాడు. అసూయాపరులు కొందరు "పద్యములతో ముక్తిద్వారము తెరువబడునా? మాటలతో జింతకాయలు రాలునా" అని ఆక్షేపించుటవిని సహించలేక ప్రభువు గురువుగారి ప్రభావమెఱింగిన వారైనను, మనోతృప్తికొఱకు బ్రత్యక్ష నిదర్శనము జూపుడని వినయముగా గురువుగారిని ప్రార్థించిన, వల్లెయని తాళములతో బిగింపబడిన ద్వారములుగల దేవీకోవెల ముఖమండపమున నిల్చి, పై యిరువదియేడు పద్యములలో నొకపద్యము జదివిన మాత్రమున అప్రయత్నముగ తాళములు తెగిపడి తలుపులు తెరువబడినవి, ఆత్మశక్తి పూరితున కసాధ్యమెంధైనను గలదా !

శ్రీ వెంకటాద్రినాయుడుగారు నబాబునుదర్శించుటకు హైదరాబాదునకు వెళ్లి, అందొకసంవత్సరము నిలువవలసి వచ్చుటచే దేవీసాక్షాత్కారభాగ్యము గడించిన వారగుట

సాహసించి, నిజక్షేమసమాచారములు తెలుపు నొక పత్రి
మును వ్రాసి, తాను ప్రతినిత్యము పారాయణముజేయు దేవీ
భాగవతము నంపుంచి, ఈపత్రిము తనగురువగు సాంబశివా
రాధ్యులవారికి జేసనట్లు సంకల్పించిన, మగుసటి గోజుదయ
మునకు, అమరావతి యందుండు మన పాపయారాధ్యుల
వారి పారాయణ గ్రంధమగు దేవీ భాగవతమున బొడసూపు
టయు, గాంచి సంతసించి, తిరుగు జబాబువ్రాసి అది తన
శిష్యునకు జేరునట్లు సంకల్పించి, తన పారాయణ గ్రంథమం
దుంచిన అది హైదరాబాదునందుగల వెంకటాద్రినాయునకు
గారికి బొడసూపుటయు, నిట్లుత్తర ప్రత్యుత్తరములద్వారా,
గురు శిష్యులిరువురు రాజామాత్యులై సంవత్సర కాలము
రాజ్యపరిపాలన సాగించినారు. ఇట్లు గురుశిష్యుల గూఢసమా
చారముల నబాబుగారెట్లో యెఱింగి సంతసించి, నాయునకు
గారిని సత్కరించి, నిజమతవిరుద్ధమైనను లెక్కగొనక.నాయునకు
గారి సలహాతో హైదరాబాదు నందొక చో దేవీప్రతిష్ఠ
గావించి, నిత్యనైవేద్య దీపరాధనోత్సవాలకొక యగ్రహార
మొసంగినారు. ఈసంఘటన క్రీ॥ శ॥ 1662 సంవత్సరమున జరిగి
నట్లు వాసిరెడ్డివారి వంశచరిత్రయందు గనుపడుచున్నది.

ఇట్లు దనశక్తి సామర్థ్యములతో శ్రీ శివాజీ మహా
రాజునకు సమర్థనివలె బ్రభువు వెంకటాద్రినాయుడు
గారి రాజ కార్యములలో బ్రత్యక్ష బరోక్షముల దోడ్పడుచు

ననేకమహాత్మ్యముల లోకహితముగా వెల్లడించి యిహ పర ములార్జించి 1716 సం॥ ఫిబ్రవరి యందు దేహముచాలించిన పుణ్యమూర్తి మన ములుగు పాపయారాధ్య చక్రవర్తి.

పైనవివరించిన విధమేకాక నింకెన్నియో ప్రభావములు పాపయారాధ్యులవారి యందుగలవని తెలిసినవిగాని వీడు గ్రహించినంతవఱకు తమకు విన్నవించినాడు.



రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడుగారు

తే॥ గీ॥ ఆంధ్రజనపరిపాలనా ధ్యక్షుడగుచు
పార్వతీభక్తిరాజ్యసం పాదియగుచు
బరగు బంగరుకడ్డీ మా వాసిరెడ్డి
వెంకటాద్రీంద్రు ధృతిసాంద్రు వేడుకొందు।

ప్రతిమానవునియం దపూర్వశక్తులు రెండు నిగూఢములైయున్నవి. అందొకటి మనశ్శక్తి, ఇది చిత్తవృత్తి కేంద్రీకరణవలన గలుగుచున్నది. రెండవది ఆత్మశక్తి లేక, భగవచ్ఛక్తి. ఇది సాధనాపేక్ష లేకనే సాధ్యవస్తువై ప్రకాశించునది. చిత్తైకాగ్రత, కామ్యపరమైన మనశ్శక్తియు నిష్కామపరమైన భగవచ్ఛక్తియు నెల్లడియగుచున్నది. కామ్యమును, సత్యపూరితమైన సంకల్పసిద్ధియు నిష్కామపూరితమైన నిర్గుణ సిద్ధియు గలుగుచున్నది.

సర్వ కర్మఫలప్రదాతయు జ్ఞానప్రదాతయు గూడ ఈభగవచ్ఛక్తియే. ఇది వేరు వేరుగాగనుపించు శక్తులన్నింటికి బునాదు. వేయేల భగవంతుడను నీయాత్మశక్తియే. దీపమునకును దాని వెలుగునకు నెట్లభేదమో అట్లే, భగవంతునకును భగవచ్ఛక్తికిని యభేదము. భగవచ్ఛక్తి యొక్కఛాయయే మనశ్శక్తి. ప్రస్తుతకాలము మెస్మరిష్టులచే ప్రకటింపబడుచున్న శక్తులన్నియు అష్టసిద్ధులతోసహా మనస్సంభవములు.

భక్తులయందు సహజముగనో, లోకోద్ధరణ కారణముగనో దోఁచుచుండు ప్రభావములకు, భగవచ్ఛక్తియే కారణము. ఈ శక్తిహీనుడైన భక్తుని రిక్తుడనక తప్పదు. అచేతన పదార్థములను గూడ సచేతనవంతములు జేయజాలు సామర్థ్యము దీనియందున్నది అని, అనుభవపూర్వకముగ నెఱిఁగిన ధన్యులలో మన వెంకటాద్రిగారొకరు.

తండ్రి జగ్గభూపాలుడు. తల్లి అచ్చమాంబ. భార్య వెంకమాంబ. జననము క్రీ॥ శ॥ 17 వ శతాబ్దము. గుంటూరు జిల్లా చింతపల్లి ప్రభువుల వంశమునకు జెందినవారు. హైదరాబాదు ప్రభువునకు ప్రతినిధిగా నాంధ్రరాష్ట్రమును పరిపాలించిన రాజపుంగవుడు మన వెంకటాద్రినాయుడు. పదునైదవ వర్షప్రాయము వచ్చియు రాకపూర్వమే, సర్వవిద్యాసంపూర్ణుడై ఉత్సాహ, ప్రభు- మంత్రశక్తులను, సామ, దాన, భేద. దండోపాయములెఱింగి, గుఱ్ఱపుస్వారియందారితేరి, కామలాలసుడు కాక. ములుగు పాపయారాధ్య విద్వచ్ఛిఖావరు గురువుగను, మంత్రిగను గూడ గ్రహించుటయేకాక, హరిజనుడైన భుజంగరాయుని రెండవ మంత్రిగ వరించి, వీరికు వురిచేయూతగారణముగ నాంధ్రరాష్ట్రమేకకాలికి కంటగట్టి యెదిరించిన వెలమ నాయకులజయించి శాసనస్తంభముల నాటి, దుర్గాష్టకమునిర్మించి పండితప్రకాండులకు, నూరగ్రహారము లిడి, వేలకొలది యజ్ఞముల జరిపించి, విపులాన్నదానమున భూతతృప్తిగావించి మూడుమారులు తులదూగు

టయే గాక ఏకకాలమున నూరు శివప్రతిష్ఠలును, కొన్ని కేశవ ప్రతిష్ఠలును గావించి, కోట్లకొలంది గోదాన భూదానములిడి, నూతన గ్రామములనేకములు గట్టించి, బీదనారాయణులకు జీవనోపాధుల గల్పించి, సుగుణ మణిరైయె చేబ్రోలు పురవరంబున త్రవ్వింపబడిన కోనేటియందు జతుర్ముఖబ్రహ్మ ప్రతిష్ఠయు, దానికి నాలుగు దిక్కులయందు, గ్రామముగ శ్రీ మల్లికార్జున, రంగనాయక, సర్వేశ్వర, గోపాలప్రతిష్ఠలును, నాలుగు కోణములయందు హనుమ వీరభద్ర, గరుడ, విఘ్నేశ్వర, ప్రతిష్ఠలును గావించి నిత్యనైవేద్య దీపారాధనోత్సవముల కవారిగ నీనాములిడి శాశ్వతకీర్తి గడించిన భక్తశిఖామణి వెంకటాద్రిభూపమణి.

ఇట్లు సత్కర్మలద్వారా చిత్తశుద్ధిగడించిన తదుపరి, యొకనాడు పాపయారాధ్యు లరుదెంచి, ఘోరారణ్యమున గల కొండగుహాలలో దాగియుండు చెంచుమూక యదనెఱింగి దారులుగొట్టుట, బందిపోట్లుసాగించుట యే గాక బ్రతిఘటించిన ప్రజల నంత మొందించు చున్నారనుట దేవరవారెఱింగినవిషయమే, ఈ దుండగములకు మనవిరోధి బృందము చేయూత నొసంగుచున్నదని తెలియవచ్చుచున్నది. అయినను భీతిలేదు. మనహరిజన మంత్రిని మారువేషమున బంపి ఆదుండగుల బట్టితెప్పించి ఈ రాత్రియే వారందరిని చాటున కంపనుంటి సమయమతిక్రమించిన దుస్సాధ్యులగుదురు. చూచిరమ్మని పంపినహనుమంతుడు, లంకనుకాల్చివచ్చెగదా

అస్లే, ధర్మసంస్థాపనమున కధర్మమూతగా గొనవచ్చునను భగదాజ్ఞ ననువర్తించెద, దీన బాపమావంతయు రాదు. సంశయింపక నాజ్ఞనిడుండని చెప్పి యొప్పించి, అస్లే కావించి ఆంధ్రలోకశాంతియు, నాయుడుగారి మనశ్శాంతియు గలిగించిన భక్తజనారాధ్యుడు పాపయారాధ్యుడు.

శ్రీ నాయుడిగారి మంత్రివర్గములో బంచముడొకడుండెనన పరిభుత్వశాఖోద్యోగులలో నిందఱుపంచములున్నారని చెప్ప నవరము లేదుగదా! నాయుడుగారు, ఆంధ్రిభూభాగమునగల వేయి గ్రామములకు నేకచత్రాధిపతియై ఎదురెఱుంగక పాలించి సెబాసని వాసిగాంచిన ధీవిశాలి. ఇప్పటి యాంధ్రులలో శ్రీ వారి పేరెఱుంగని వారులేరనియే వీడి తలంపు.

ఈరోజులలో బ్రిభుత్వ స్థానము చింతపల్లినుండి అమరావతికి మార్పబడినది దేశికేశ్వరానుజ్ఞననుసరించి శ్రీచాముండామరేశ్వరోపాసనాసిద్ధిబడసి, తదీయ దేవాలయము జీర్ణోద్ధారణగావించి, అష్టోత్తర శతశివ ప్రతిష్ఠలేక కాలమున జరిపి, అమరేశ్వరసాక్షాత్కారమంది, ఇంద్రుడమరావతికివలె వెంకటాద్రీంద్రు డమరావతిని ప్రకాశింపజేయుచు, నభేదభక్తిగలిగి సాటిలేని కీర్తిగౌరవముల విరాజిల్లిన ధైర్యహేమాద్రి మన వెంకటాద్రి.

ఇట్లుండ నొకతరి నవాబుగారి కోరికపై నాయుడుగారు హైదరాబాదున కేగి రాజకీయముల నిమగ్నుడై యుండునెడ, నొకనాడు నవాబు నాయుడుగారిని వెంటగొని

యశ్వశాలకేగి, అందు మదపిచ్చివలన క్షుత్పిపాసల మరచి మాలీలనుగూడ సమీపమునకు రానీక కరచుటచేతను తన్నుటచేతను భయపెట్టుచు బాధపడు పంచకళ్యాణి గుఱ్ఱమును జూపి, "అశ్వపరీక్షకులైన మీరు రోగనిదానమును గావించి ఔషధసేవ జరిపి మహోపకారము గావింపు"డని విన్నవించుటయు, 'వల్లె' యని ఆత్మశక్తిపూరితుడగు మన నాయుడుగారు నిర్భయముగ గుఱ్ఱమును సమీపించి జూలుబట్టి యాడించుచు దాని శరీరమంతయు నిమిరి హుషారిచ్చిన వెంటనే ప్రేమదృక్కుల బరపుట గాంచి, రోగము హరించినదని యెఱింగి దాణాబెట్టించి జీనుబిగింపించి తదశ్వారోహణము గావించి స్వారిసాగించి, దాదాపెనుబది మైళ్లు పయనించి తిరిగివచ్చి గుఱ్ఱముదిగి, నవాబున కుల్లాసము గల్గించి పేరు గడించిన కీర్తిశాలి మననాయుడుగారు మఱియు

గీ॥ పరగ నమరావతి గల గురువునకును
దనకు బ్రత్యహమ్ముస్వైర దగిన జాబు
లిష్టదేవతచేత మోయించినట్టి
వెంకటాద్రీంద్రునుమహిమ భావింపదరమె!

ఈ అద్భుతవిషయమును విని నబాబుగారు హిందూమతాభిమానియైన నాయుడుగారి సలహానుసరించి అందొకచో దేవీప్రతిష్ఠ జరిపించి నిత్యనైవేద్యాదిపారాధనోత్సవాదుల కొకయగ్రహారమిడి కృతకృత్యులైనాడు నబాబుగారు.

ఆంధ్రలోకమునే తనయిష్టదైవముగా భావించి పరిపాలనారూపసేవాభాగ్యము నార్జించినవాడు కనుకనే, ప్రభుత్వమునకు సాలీనావచ్చు రాబడియందు ప్రభుత్వకార్యములకు వెచ్చింపబడినదిపోను మిగిలినధనమును యజ్ఞముల నెపమున దానధర్మములు సాగించి, ధనపుకొట్లను ఖాళీలజేయు మహోదారచరిత్రుడు నాయుడుగారు. శతాధికములుగా నూతన గ్రామముల నిర్మించి, అందందు వశించు జనులను సుఖజీవనముల ముంచెత్తె. తల్లిదండ్రులపేరులతో నచ్చమ్మపేట, జగ్గయ్యపేటల సృష్టించి తనపితరులకు శాశ్వతకీర్తిని గల్పించిన ధీశాలి. ఇతని వేనోళ్ళబొగడినను తనివిదీరదు. వేదవిదులగు వేదవిప్రుల కగ్రహారములును, షోడశమహాదానములును, అనేకవాపీకూపతటాకాది జలాశయములను నిర్మించినవదాన్యు డేలనో, అమరావతియందు వేంచేసియున్న అమరేశ్వరస్వామివారిని మరచినారు. ఇది విచారకరము. "ప్రతిమా స్వల్పబుద్ధీనామ్" అనునార్యోక్తి ననువర్తించి యుండనోపు. శ్రీవారి వంశాభివృద్ధి నర్థించి రామమూర్తిని ప్రార్థించుచు నీచరిత్ర ముగించెద.



మహాశయులు బందా పరదేశివర్యులు

మనము నిత్యమనుభవించునది కేవలసుఖము మాత్రము కాదు, కష్టమిశ్రితము. విషయసుఖము మీసాలపూది తేనె వంటిది. విషసమములు విషయములు. విష మనుభవించిన వానికే చెరుపుగలుగును. విషయము లట్లుకావు. సమీపించిన వారినెల్లర నాశనముజేయును మొదట సుఖకరములుగా గనుపించిన యాహారపదార్థములు తుదకు దుఃఖదాయకము లగుచుండుట ననుభవైకవేద్యములే గదా !

పీడాకరమగు విషయసంపాదనవలన గాలహరణమే కాక బలువిధ కష్టముల కాకరమగుచున్నది. "ధనమూలమిదంజగ" త్తనుట యదార్థమే. కాని, భగవదారాధనా దృష్టితో ధనమార్జించి తన్నిమిత్తమై వెచ్చబెట్టిన శ్రేయోదాయకమని భగవదాదేశము. దయాసత్యశౌచాదు లార్జించి పరమేశ్వరపరములుగా గడించిన విషయములు నిర్విషయములై తుదకు ముక్తిదాయకములుగూడ నగుననుట శ్రీవారి సందేశము. ఇట్టివానికి భగవానుడు ప్రత్యక్షపరోక్షములతో దోడ్పడి సత్కార్యాచరణమునకు జేయూతనొసంగి కృతార్థుని గావింపగలడు.

పరమేశ్వరుడు జీవులహృదయములందుండి ఇహాపరరూపములైన సమస్తకార్యములు చేయించుచుండుట భక్తులెల్లరకును దెల్లనే. "యద్యత్కర్మ కరోమి తత్త దఖిలమ్ శంభో తవా రాధన" మనుసుబోధ ననుసరించి సాధకుడు

తానుగావించు పనులన్నిటిని భగవదారాధనారూపములుగా మార్పు జేయ గలిగినప్పుడే కృతకృత్యు డగుట. ఈ రహస్య మనుభవమునకు దెచ్చుకొన్న భక్తాగ్రేణి మన బందా పరదేశిమహాశయులు.

ఈ మహనీయుడు వంశపరంపరాయత్తమైన కరిణీక వృత్తిని జేపట్టినవాడై యుండియు ఏరూపముననైనను జేజాచి యెఱుంగడు. సామాన్యగృహస్థేకాని యాచించిన లేదను వాడుకాడు. ఉద్యోగరీత్యా ఎట్టివిషమస్థితి సంభవించినను అబద్ధమాడియెఱుంగడు. సత్యాహింస భూతదయ లీతని సహజ గుణములు. తన కితరులొనరించు యపకారముల గలలోనైనను దలంపడు. పరుల కపకారములజేసి యెఱుగడు ఎట్టికష్ట ములు వాటిల్లినను తనమేలుకొఱకేయని సంతసించువాడు.

వీని జననము పదునేడవ శతాబ్దము. భార్య పతివ్రత ఔదార్య శిఖామణి, పరోపకారపారీణ, అన్నదానవ్రతపరా యణ. ఈ వంశస్థు లిప్పుడు చీరాల, వేటపాలెముల యందు న్నారు. వీరిలో బందా వెంకటనరసయ్యగారు ముఖ్యులు. వీరిని కలిసి ముచ్చటించుభాగ్య మీతని కలవడలేదు. మన పరదేశి గారి జీవచరిత్ర యాంధ్రలోకమునకు నూతనమైనది కాదు. లభించినంతవఱకు సంగ్రహించి ముఖ్యవిషయముల నిందు బొందుపరుపబడినవి, పాఠకులు క్షమింతురుగాక.

పరదేశిగారి జీవితకాలమం దొక్కరోజైన నతిథి సత్కా రము జరుపని దుర్దినము లేదని జెప్పెదరు. ఏకాదశివ్రతము

వీరి జన్మహక్కు. పండ్రెండు సంఖ్యకు దక్కువగగాని నూట యెనిమిది సంఖ్యకెక్కువగగాని లేని యతిథులకు గావింపబడు యన్నదానముతో ద్వాదశీపారణ జరుపుట శ్రీవారి విధి.

ఆ వ్రతదివసంబంతయు జాగరణంబుండి భగవత్కథా కాలక్షేపములతో బ్రొద్దుబుచ్చువారు. అతిథులింటికి వచ్చిన వారిని జుట్టరికంపు చూపుతో నాదరించి, యన్నపానాదుల సత్కరించి, తద్వియోగమున కడలుచు దుఃఖాశ్రువులతో సాగనంపువారు గూడ. ఇట్లు బహుకాలముజరుగ గుటుంబాస్తియే కాక భార్యమెడనున్న తాళి సహితము వెచ్చింపబడుట, బరదేశిగారు నిరుపేదలైరి. రేపటి యతిథిసత్కారమునకు గాని కుటుంబ ఖర్చులకుగాని ద్రవ్యములేదు. ఆ రేయి ప్రథమ యామమున భార్యను వెంటబెట్టుకొని పరులకు దెలియబడకనే పయనముసాగించి, పరిచయములేని గ్రామముల నివసింపనెంచి, మార్గాయాసమున కోర్చి స్వగ్రామమగు వేటపాలెమును వదలి, రాత్రి రెండవజామునకు బాపట్ల తూర్పు సత్రమునకు జేరి, జరుగనున్న కార్యమును గురించి భార్యాభర్తలు ముచ్చటించుకొన మొదలుపెట్టిరి.

నాటి రాత్రి ప్రథమయామముననే యా సత్రమున ప్రవేశించి ఆకలి సొద కడలు పుత్రుల నిరుపుర బుజ్జగించుచు, "ఇవిగో శనగపప్పు. ఇవి తిని నీరు ద్రాగుడు. రేయి మూడవ జామున బయనించి రేపు పదిగంటలకెట్లో మిమ్ముల వేట పాలెము జేర్చెద: నందు నిరతాన్నదాతయగు బందా పర

దేశిగారింట మీ కన్నము బెట్టించెద. అం దెన్నిరోజులున్నను మన కన్నవస్త్రములకు దరుగు లేదు. ఊరడిల్లు" డని ఐ దేనిమిది వత్సరముల ప్రాయములుగల తన ముగ్దుబిడ్డల నోదార్చు చుండు స్త్రీనొక్కరితనుగనియు, నామెమాట లాలించియు గటకటంబడుచు, వెంటనే భార్యతో వచ్చినదారిబట్టి స్వగ్రామమున కేగుచు, "ఇంతీ, విన్నావుగదా! ఆ రత్నస్త్రీ దీనాలాపములు. ఈచంటి కూనలతో రేపుదయము బదిగంటలకీమె మన యిల్లుజేరి, అం దెవరును లేమి తెలిసి నిరుత్సాహియై ఎట్టిశ్రమ పాలగునో, ఏమగునో గదా! ఆర్తుల శ్రమలడంపని వానిజన్మ నిరర్థకమనియు, సుఃఖభూయిష్ఠమనియు బెద్దలనెదరు. వీరి నెట్లు సత్కరింప జాలుదుమా, అని విచారింపవలదు. మన యింట గుందిరోలొకటి నిలచియున్నది. దానినమ్మగావచ్చిన ద్రవ్యముతో నీమెను సత్కరించి ముందు యోచింతము. కాలుసాగించి నడువు" మని త్వరచేయుచు బయనము సాగించి, వేటపాలెమనంగల స్వగృహమును జేరి, శ్రీబొమ్మిశెట్టి సుందరరాజమను వైశ్యున కారోలు రెండు రూపాయల కమ్మి, పదార్థముల సేకరించి వంటగావించి, అతిథులకై వేచియుండ గతరాత్రి బాపట్ల తూరుపు సత్రమున తాము జూచివచ్చిన యతిథులు నియమిత కాలమున కరుదెంచిరి. వారిని యన్నాది సత్కారముల తృప్తులంజేసిరి. తమకుటుంబ స్థితిగతుల నెఱింగించి సాగనంపిరి. తదనంతరము సుందరరాజమును బిలిచి రోలెత్తించుకొని పొమ్మని జెప్పుటయు నాత

దండులకు యిచ్చింప నా రొట్టెక్రింద మొహరీలుంచె తను పడియె.

అది చూచి ధర్మాత్ముడగు వైశ్యపుంగవుడు, పరదేశి గారిని పిలిచి బంగారము జూపి "తీసి భద్రముజేయు" మనిన నాతడు ఈబిందె నీరొట్టెక్రింద నెవ్వడును బెట్టలేదు మా స్వామివా రెవ్వ రును జెప్పనులేదు. ఈ పాత్రనీయదనయో, గొట్టము గూడ నీ మొహరీలుంచెను గొంపొమ్మని బల్కుటయు. నాతడు వంగు కొప్పుకొనక రొలును మాత్రము మీవలన విక్రయించుకొని నాను గనుక నీపాత్ర మీయదనయే అనిచెప్పుచు, రొట్టెమాత్ర మెత్తించుకొని పోయెను, భగవదనుగ్రహమును కలిగించు దాను భగవత్ప్రీతిగా గావించు సన్నదాన మహాకార్యమునకు బరోక్షముగా శ్రీరామచంద్రమూర్తి తనకు జేయూతనొసంగినాడని సంతసించి నాటనుండి తిరిగి యన్నదానమహా యజ్ఞము నిరంతరాయముగ సాగించుచుండుట ఆంధ్రదేశమంతటను శ్రీవారి పేరు మారుమోగినది. ఇది చూడలేని యసూయాపరులు కొందరు ప్రభుత్వమున కెత్తింగించిరి గాని ప్రభువగు వెంకటాద్రినాయుడుగారు సంతతాన్నదానప్రియుల గుట లెక్కసేయలేదు. ఇప్పుడు పరదేశిగారి కీర్తిచంద్రిక కాశీ సేతుమధ్యప్రదేశ మంతటను నిండి పిండారబోసినట్లయినది. క్రీ॥ శ॥ 1670 సం॥ వచ్చిన గంగాపుష్కరిణి గ్రుంకు లిడ గురవుగారిని వెంటగొని వెంకటాద్రినాయుడుగారు వారణాసికేగిరి. గంగాస్నానకాలమున గోరినవారికి గోరినట్లువారిగా ధనకనకాదులొసంగుచుండ జూపరులు ప్రభువువారి యౌదార్య

మును వేనోళ్ళ గొనియాడుచుండిరి. నిరతాన్నదాతయగు బండా పరదేశిగారు వసించు ఆంధ్రదేశ పాలకుండగు మహా ప్రభు నిజాము చెప్పుకొను దూషకులబలుకులు గర్ణాకర్ణి విని సంతోషించి నాయకుడుగారు పరదేశిగారి యశశ్చంద్రికలకు శాశ్వతాస్థిరతను గలిగింప సంకల్పించి, కొంతకాల మందుండి దేశికాచార్యాజ్ఞననుసరించి యాత్ర ముగించి, యమరావతి కరుదెంచి, శ్రీవారిని నోటీసుచే బిలిపించి తన యొఱుక లేక వేటపాలెమున కనుగరాదని ముద్రగావించినాడు.

రాజాజ్ఞను ధరించి సంవత్సర కాలమందుండినారు పరదేశిగారు. ప్రభువుగారొక ద్వాదశినాడు ఉదయమున గాలి నడకగా గ్రామం బందము దలంప్రున వీధి జనుచుండ నొకయింటి ముంగిట నూటుల కొలది బ్రాహ్మణులు హస్తప్రక్షాళనముల జేసికొనుచుండ గాంచి ప్రశ్నించి, వారిని ప ర దే శి గా రి సమారాధన కావించినట్లు దెలిసికొని, సంతసమును వెలిపుచ్చక నొకసుముహూర్తమున బయలుదేరి వేటపాలెము జేరినారు నాయకుడుగారు. అక్కడ శ్రీవారి భార్య కమలాంబ గారి అన్నదానము కన్నులార జూచి ఆనందించి, ఆమహా తల్లిచే భిక్షగొనిన ధన్యుడనగుదునని తలంచి కబురంపి, సపరి వారముగా జని ఆమెగారిచే సత్కరింపబడి, పవిత్రుడనైతినని మురియుచు, "అన్నగారు, తోబుట్టువును మరువకుందురు గాక" అను కమలాంబగారి ప్రేమపూర్వక వాక్యముల నుబ్బుచు, తిరుగుపయనము సాగించి అమరావతి జేరి, సబహు మానముగా పరదేశిగారిని జేరి "అనవసరముగా నిన్ను గష్ట

ములపాల్జేసిన నన్ను క్షమించు" మని ప్రార్థించి శ్రీవారి కర్త సింహాసనమిడి యాదరించె.

ఇంతమాత్రమేగాదు, ఈ పురి మీరు సాగించిన యన్న దానమునకు ద్రవ్యదాత యెవడని ప్రశ్నించి తెలిసి కొని, అద్దేపల్లి సుబ్బయ్య శ్రేష్ఠిగారిని బిలిపించి, "నీవు పరదేశి గారి యన్నదానాదికమునకు వెచ్చించిన ద్రవ్యమెంత" యని అడిగిన నాతడిట్లనియె. "దేవా ! పరదేశిగారి యొద్ద తిరిగి తీసికొను భావముతో నేను ద్రవ్యమివ్వలేదు. గాన, పద్దు వ్రాయలేదు. అందువలన నింతయని చెప్పజాల"నని ఖండిత ముగా జెప్పినాడు.

నాయుడుగారు ముక్కుపై వ్రేలిడుకొని "సౌదాగ్య మని నట్లుండవలదా" యని, లోదలంచుచు సుబ్బయ్య శ్రేష్ఠి గారితో "మా కెరుకబరుపకనే దానము చేయుట నీ కధికార మెక్కడిది ? మాయాజ్ఞ దిరస్కరించిన నీవు శిక్షార్హుడవు గాని క్షమించితి. గాన బరదేశిగారి కొసంగిన ద్రవ్యమంతయు నిచ్చెద గైకొనుము.

దేవా! మీరిచ్చు శిక్షకంటెను. భగవంతుని శిక్ష మిక్కుటముగదా! సత్సంకల్పమున కన్యథా జరిగిన పాపకూప మున బడెదనను భయము నన్ను బాధించుచున్నది, క్షమింపుడు.

శ్రేష్ఠిగారి మాటలకు సంతసించుచు నిట్లనియె, "పర దేశిగారి యన్నదానమునకు వెచ్చింపబడిన ద్రవ్యము రమా రమి ఇంతయని చెప్పి నావద్ద నది గైకొనుము. అది నే బర

దేశిగారికి గావించుసత్కారములో నీవును బాల్గొని తద్రూపముగా మెచ్చింపుము. దాన మన మిరవురము ధన్యులమయ్యెదమని చెప్పి యొప్పించి, అట్లుగావించినాడు.

ఇట్లు వెంకటాద్రినాయుడుగారు పరదేశిగారిని సత్కరించి కమలాంబగారిని పిలిపించి యొప్పించి ఆంధ్ర ప్రభుత్వము వారణాసియందు జరుపు యన్నసత్రమున కధికారిగా పరదేశిగారిని నియమించి, వేటపాలెపు సత్రమునకు కమలాంబ నధికారిగా జేసి రెండును రెండువైపుల సాగించుచు, రెండుకులములకు వన్నెగూర్చిన పుణ్యమూర్తి ఆంధ్ర దేశ చక్రవర్తి.

ఇట్లు పరదేశిగారు తనజీవిత శేషము వారణాసియందు గడపి, చరమదశగ్రహించి వేటపాలెమును జేరి క్రీ॥శ॥ 1785సం॥ పరమపద మలంకరించిరి. కమలాంబయు నిరతాన్నదానముచే జీవితశేషమును గడపి పిదప రెండు వత్సరములకు శరీరము జాలించి కైవల్యమలంకరించె



అయ్యలరాజు రామభద్రుడు

సర్వభూతముల హృదయములందు పరమాత్మ ఈశ్వర రూపుడై యున్నాడు ఆయీశ్వరుడు సర్వజ్ఞుడు, సర్వశక్తిమయుడు, శాశ్వతుడు, సత్యస్వరూపుడు, జ్ఞానమూర్తి ఆనంద సాగరుడు, ప్రార్థనాప్రియుడు. అట్లే జీవుడును శాశ్వతుడు, సర్వజ్ఞుడు, సత్యుడు ప్రార్థనాప్రియుడుగూడ. ఐనను, కించిజ్ఞుడు మాత్రము. ఈతడు దేహాభిమాని యగుట దనను దామరచి దేహమే తాననని భ్రమ పడుచున్నాడు. సర్వశక్తిమయు డయిన పరమాత్మ శాశ్వతుడగుట దేహాభిమాని యైన జీవుడును శాశ్వతుడుకాగోరుచున్నాడు అతడు ప్రార్థనాప్రియుడగుట తానును ప్రార్థనాప్రియుడగుచున్నాడు. ఆత్మ సత్యస్వరూపి యగుట సత్యము నభిమానించుచున్నాడు. ఆత్మ జ్ఞానమూర్తియగుట దా దేహాభిమానియయ్యు జ్ఞానమును బ్రేమించుచున్నాడు. పరమాత్మ ఆనందసాగరుడగుట నస్థిరమైన విషయానందమును సేకరించుచున్నాడు

వేయేల! దేహాభిమానము వదలకయే తా నీశ్వరుడగుటకు సర్వవిధముల ప్రయత్నించుచున్నాడు. కాని కృతార్థత గడింప జాలకున్నాడు కారణము పురుషోత్తమ ప్రాప్తియందలి రహస్య మెఱుంగకుండుటయే. ఈరహస్య మెఱింగిన వాడొక్కడే. ప్రత్యక్ష పురుషోత్తమమూర్తి స్వస్వరూపానుభూతిని గ్రహించి కృతకృత్యుడైన దేవతాచక్రవర్తి. ఈత

విస్తానముతో దాటిపఁడు పండింపబ్రయత్నించు వానివలె దేహాభిమానుల బ్రయత్నము లన్నియు నిరర్థకములగుచున్నవి తన దీక్షాప్రయత్నము మీఁది జీవత్వము నాశము జేసికొనినవాఁడొక్కఁడే గమ్యము జేరగలఁడు. అగ్నికి వెలుతురు వేడిమి సహజము లైనట్లు, పురుషోత్తమునకును సర్వజ్ఞత్వాది కళ్యాణగుణములు సహజములైయుండు ననుట నిర్వివాదాంశము. ఇట్టి పురుషోత్తముఁడే అయ్యలరాజు రామభద్రుని తండ్రి అక్కయామాత్యుఁడు.

ఇతఁడు చేయిజారి తప్పిపోయిన తన ముద్దు కొమరుని వెదకి తెచ్చిపెట్టుమని శ్రీరామమూర్తిని బ్రార్థించి సఫలకాముఁడైనాఁడు. ఈ కథ యంతయు నక్కయామాత్యునకు జెందినదై యుండ రామభద్రున కంటింప నేలనన అక్కయామాత్యుఁడు ప్రార్థించినను సీతారాములచే రక్షింప బడిన వాఁడు. రామభద్రుఁడు. కనుక నితనిపేరు కథామకుటమున జేర్చబడినది. ఈతండు గోలకొండవ్యాపారి. బ్రాహ్మణుఁడు. జననము 1503 సం॥ అనగా యిప్పటికి 453 వ సంవత్సరములైనది. ఈ వంశమువా రందఱు మహాకవులే. అందఱు బండితులే. అందు మన రామభద్రుఁడు దనయిష్టదైవమగు ఒంటిమెట్ట కోదండ రామమూర్తి చరిత్రమునే రామాభ్యుదయమను పేర రామాయణము రచించినాఁడు.

ఈతనికి స్వగ్రామమున పేరులేదు. ఈతఁడు శిశువుగా నుండుతరి కోవెలలోజరుగు బ్రహ్మోత్సవమును జూడ తలిదండ్రులిరువురు పిల్లవాని జంకనిడుకొని కోవెలకేగి జనసమ్మర్ద మెక్కుడగుట బిల్లవాని కాపద సంభవించునేమో, అనుభీతి

నాతని దనవెంట తీసికొని పో శంకించి పిల్లవాని దన భర్త అక్కయామాత్యునకిడి నే నాలయప్రవేశము జేసి స్వామిని దర్శించి కానుక లర్పించి వచ్చునఱకు, మీరిందయుండి గని పెట్టియుండుడని మనవిజేసి ఆలయములోని కరిగెనదాను.

అక్కయామాత్యుడు భార్య! ఎంతసేపైని విచారించి కాలయాపనకు సహింపలేక భగవద్దర్శనాపేక్ష ముంపునకుదోయ, పైగుడ్డ బరచి పిల్లవాని బయుండబెట్టి ప్రక్కనున్న వారితో "మా అబ్బాయిని జూచుచుండుడు. వీని తల్లి త్వరలో రాగలదు" అని చెప్పి వారందుకు సమ్మతించినట్లు దలంచి ఆతడాలయప్రవేశము జేసినాడు. కొంతసేపటికి భార్య వచ్చి నిర్దేశస్థలమున భర్తగాని పిల్లవాడుగాని లేకుండుట ప్రక్క వారిని విచారించి జవాబురాని సంశయాకులచిత్తయై అందందు వెదకి పిల్లవానిని భర్తతీసికొని వెళ్ళి యుండవచ్చునని యెంచి, ఇంటి కేగినది. పిదప నక్కయామాత్యుడును స్వామిదర్శనానంతరము నిర్దేశస్థలమును జేరి పిల్లవానినిగానకయు ఆతనితల్లి పోబడి తెలియకయు విచారించి, తల్లి పిల్లవాని గొనిపోయి యుండ వచ్చునని తలంచుచు, గలతగొనిన చిత్తముతో నింటి కేగి భార్యనుగాంచి, పిల్లవానివిషయమై ప్రశ్నించి ఉభయులవచనములును అనాలోచితములని గుర్తించి, దంపతులిరువురు మితిమీరిన దుఃఖముతో బిడ్డను లో వెదకి వెదకి వేసారి, సూర్యాస్తమయంబగుట దమ తమ కార్యముల విసర్జించి ధైర్యంబవలంబించి, ప్రణతార్తి హరుండగు శ్రీరామసాన్నిధ్యంబు గల్పించుకొని నిందాస్తుతుల నిట్లు బ్రార్థించిరి.

కం॥ శ్రీకాంతావల్లభ య
శ్శోకదయారససముద్ర శుభగుణభద్రా
శ్రీ కుశలవజనకా సు
శ్రీకర సుగుణాభిరామ సీతారామా.

కం॥ నీకొడుకులు నీకెట్లో
నాకట్టులు గాదె నాదు నందనులు దమిన్
నాకొడుకు నాకు నిమ్మా,
శ్రీకర....................సీతారామా.

కం॥ నాకో, యొక్కడె పుత్రుడు
నీకో, పుత్రద్వయంబు నిలుప గులంబున్
నాకొడుకు నాకు నిమ్మా,
శ్రీకర....................సీతారామా.

కం॥ మృతుడైన విప్రసుతునిన్
బ్రతికించితివనుట నిక్కవంబగు నేనిన్
బ్రతికింపు నాదు పుత్రకు
శ్రితరక్షణ సుగుణధామ సీతారామా.

కం॥ నీ సోదరులం జూడగ
నాసగొనిన తల్లికొఱకు నై శీఘ్రమునన్
నీసోదరుల న్దేవే
శ్రీసఖ కళ్యాణనామ సీతారామా.

కం॥ కాలునిబారిం బడియెడి
బాలుని బ్రతికింపలేక పాబార్థుడు వగవన్

లీల గొని తేవె శిశువుగ
శ్రీలలనాచిత్తధామ సీతారామా.

కం॥ నీ కోసల నే విడచిన
నాకొడుకున కీవుగాక నాథుండెవఁడో
నా కొడుకు నాకు నీవే
శ్రీకర...............సీతారామా.

కం॥ శరణంబు నిన్ను వేడిన
గరితురగరథావళులను, కనకపురాసుల్
గురియింతువు శిశువమ్మా,
స్థిరజీవితు సుగుణధామ సీతారామా.

కం॥ దత్తాపహరణ పాపము,
మొత్తదె నిను నీవొసంగి మున్నా శిశువు
న్నిత్తరి నీవే కొననీ
చిత్తంబిక సుగుణధామ సీతారామా.

కం॥ బోయలు నీమిత్రులు నిట
బోయలె నిన్నిలిపిరంచు మునువింటిని నా
బోయమనంబును శిశునెడ
జేయకు సుగుణాభిరామ సీతారామా.

కం॥ పావనములు ముక్తిసతీ
దేవనములు బ్రహ్మసుదరి దేవావళి సం
భావనములు నీపదయుగ
సేవనములు సుగుణధామ సీతారామా.

కం॥ పాదంబులు నరకభయ
చ్ఛేదంబులు కమలగర్భ శితికంఠహృదా
మోదంబులు భక్తజన
శ్రీదంబులు సుగుణధామ సీతారామా.

కం॥ గుగుపుత్రి బాణకీలా,
పరిదగ్ధు న్గాచినట్టిపద్ధతి శిశువుర్
బరిరక్షింపుము దేవా
చిరజీవిని జేసి కరుణ సీతారామా.

కం॥ సాందీపుడు వేడిన త
న్నందను బ్రతికింపలేదె నాసుతు నట్లే
ముందలనిడి యానందము
చెందింపవె సుగుణధామ సీతారామా.

కం॥ నీకరములు భయహరణగు
ణాకరములు తాపతప్త పాణి హిమానీ
శీకరములు నతలోకవ
శీకరములు సుగుణధామ సీతారామా.

కం॥ పాహి జగద్రక్షక మాం
పాహి నతత్రాత దేవ వల్లభనుత మాం
పాహి జగజ్జనక విభో!
శ్రీహరి సుగుణాభిరామ సీతారామా.

ఇట్లు ప్రార్థించుచుండ దెల్లవారినది. అర్చకులు మడుం గులుగట్టి కోవెల తలుపులు తీసి లోనన్బ్రవేసించి, నిర్మాల్య

విసర్జనాకార్యమునకు గడంగుడు అందొకవంక రోదనము వినఁబడియె. బరికింప నొకశిశువు అర్చామూర్తియగు సీతాదేవి యొడియందుండి ఏడ్చుచు స్తన్యపానము జేయుచుండుట గాంచిరి.

పుత్త్రవియోగమున కడలుచుండు అక్కయామాత్య దంపతుల జేరి, మీబాలు డీతడగునేమో చూడుడని చెప్పిన, చూచి మావాడేయని చెప్పిరి. సర్చకు లాబిడ్డను తెచ్చి తల్లిదండ్రుల కొప్పగించిరి. తల్లి బిడ్డకు స్తన్యంబొసంగెను. గాని సీతాదేవి స్తన్యంబారగించిన వాడగుట బాలుడ్రాగలేదు. ఈ రామభద్రుడు క్రమముగా బెద్దవాడై మహాకవిబిరుదమంది లోకవిఖ్యాతి గడించినాడు.

ఒంటిమిట్ట సీతాదేవి సంతానదాయిని యనియు, శుభదాయిని యనియు నెఱింగిన వారగుట, నేటికిని భక్తులా భూజాతను సేవించి సంతానలాభమును గడించుచున్నారు.

భగవాన్ శ్రీ నారాయణ తీర్థ

భక్తులారా! రండు, రండు, త్వరగారండు. భజనానంద రసప్రవాహ పూరితమైన నామ ప్రయాగయందు మునుకలు వేసి వేసి తేలియాడుటకు రండు, రండు, త్వరగా రండు. భగవాన్ శ్రీ నారాయణతీర్థ స్వామి పోవుచు బిలుచుచున్నారు. రండు. రండు.

ఆ ఏమనుచున్నారు! కాలకృత్యముల దీర్చుకొని వచ్చెదరా? అని తీర్చుకొనునన వఱకు జాలును, స్నాన సంధ్య జప హోమ తర్పణాది నిత్యకర్మలవలన రాగల ఫలముగూడ లభించునట. నింతియెకాదు. శాశ్వతమై, అఖండమై, అలరారు మోక్షలక్ష్మియు, మనను వరింపగలదు, త్వరపడుడు, త్వర పడుడు.

ఆ, ఏమనెదరు, నామప్రయాగలో జేరు నదులేవి అనియా, మీ ప్రశ్న? వినుడు. రామనామమే గంగ, కృష్ణనామము యమున. గోవిందనామము సరస్వతి. ప్రయాగస్నానము దేహమలము మాత్రము బోగొట్టును. నామప్రయాగస్నానమో? అట్లుగాదు. త్రికరణ స్నానఫలము లభింపజేయుననుట నిస్సందేహము. స్మరణమువలన మనస్సు, కీర్తనవలన వాక్కు, కీర్తనానుగుణ్యమగు నర్తనమువలన కాయము, ఇట్లు త్రికరణశుద్ధి లభించును.

అయాచితముగా ఇట్టిమహోపకృతి గావింపనున్నట్టి భగవాన్ శ్రీనారాయణ తీర్థులవారి జీవితగాథ చెప్పుకొనుట మన ముఖ్యవిధి. వినుడు. కాలాతిక్రమమునకు శంకింప బనిలేదు. శ్రద్ధగా వినుడు.

భగవాన్ శ్రీ నారాయణతీర్థ మహారాజు పూర్వాశ్రమ మందు తల్లావఝ్ఝల వేంకటరామశాస్త్రి. నివాసము గోదావరి మండలమునగల కూచిమంచి యగ్రహారము. క్రీ॥శ॥ 1700 ప్రాంతమున వీరి జననము. బాల్యముననే సమస్తవిద్యాపారంగతుడై ఉభయభాషాకవిత్వ మందారితేరినాడు. జన్మాది నుండియు కృష్ణభక్తుడు. స్వదేశమునం దున్నప్పుడు శ్రీకృష్ణ లీలాతరంగిణియు, ద్రావిడ దేశమందుండి తెలుగు భాషలో పారిజాతాపహరణమును మృదు మధుర శైలి రచించిన కీర్తి శాలి.

ఆంధ్రదేశ సంచారకాలమున కృష్ణానదీ తీరంబున గల వెల్లటూరునందు కొంతకాల ముండుట తటస్థించినది. ఆ కాలములో జపదీక్ష నుండుతరి వరాహ మొకం డెందుం డియో వచ్చి ప్రతిదినము దనముట్టెతో దీర్థులవారి నొకటి లేక రెండు మారులు నెట్టిపోవుచుండెడిదట! ఇట్లుగొన్ని దిన ములు జరిగినది. శ్రీవారు కారణమెఱింగి వెంటబడిపోయిన దినదినప్రయాణములలో నరవదేశమునంగల వరాహపుర మును జేర్చి యంతర్ధానమైనది. ఆ పురియందే శ్రీవారు జీవిత శేషమును గడపినారు.

శ్రీవారి కిష్టము లేకుండినను తల్లి యొక్కయు, కాబోవు మామగారి యొక్కయు బలవంతమున బదునెనిమిదవ యేట గృహస్థైనాడు. భార్య మహాలక్ష్మిమ్మ. మహాలక్ష్మిమ్మ నుపాసించి వరమంది జనించిన జగదేకమాత ఈతనూజాత ప్రత్యక్ష మహాలక్ష్మిమ్మయే. ఈమె మహాలక్ష్మిమ్మ నుపాసించి ప్రత్యహ మిష్టదేవతతో సంభాషించు పుణ్యశీల. అందచందాలమెట్ట. సుగుణాలగుట్ట. నిషేకముహూర్తము నిశ్చయింపబడినది. మామగారి యాహ్వానముపై బందుగులు వెంటగొనకనే తంబుర తాళములతో గృష్ణనామగాన మొనర్చుచు నైమరచి పయనించుచున్నాడు. మార్గమధ్యమునం గల గోదావరీనది దాట బ్రవాహములో దిగి పోవుచు నొక సుడిగుండమున బడి తికమకలై జీవితాశవదలి మానసికముగా నాతురసన్యాసమును గొనినాడు. భగవదనుగ్రహమువలన సుడిగుండము దప్పించుకొని బయటపడి యెట్లో మామగారిల్లు జేరినాడు. నాటిపగలు జరుపవలసిన ఔపోసనాదికార్యముల దీర్పించుట కభ్యంగనమాచరించి నూతనవస్త్రముల గట్టనిచ్చి శ్రీవారిని వేదికముందు గూర్చుండబెట్టినారు.

మహాలక్ష్మిమ్మయు సర్వాభరణభూషితయై ఔపాసనాగ్నిని జేగొనివచ్చి శ్రీవారిని దిలకించి భయాశ్చర్యమగ్నయై నిజభర్తకు మానసికముగ వందనములర్పించి తేబడిన యగ్నిపాత్రతో జాటున కేగి నిలిచినది. కారణమడిగిన శ్రీవారి కేను శిష్యురాలనుగాని భార్యనుకాదు. సంసృతిదాటి సన్యసించిన పుణ్యమూర్తి ఇతడు. అరుగో, త్రిదండధారియై

కాషాయవస్త్రములతో బ్రకాశించుచున్నారు, అని చెప్పగను కామదృష్టి విసర్జించి ప్రేమదృష్టినార్జించి, భక్తమూర్తీభవించినదన్నట్లు జనుదెంచి, శ్రీవారికి నమస్కరించి యంతేవాసినిగా గ్రహింపుడని ప్రార్థించి, యిష్టార్థసిద్ధిని గైకొన్న ధన్యజీవి మహాలక్ష్మిదేవి.

భార్యాభర్తలిరువురును గురుశిష్యులైనారు. కమలనేత్రునిలీల లతివిచిత్రములుగదా? నిషేకము హ్యాషీకమైనది వీరిభౌతిక దేహములు వేరుగాని హృదయ మొక్కటియే. ఇప్పుడు వీరు నామప్రయాగలో నీదుచుండిరి కాలనియమము లేదు. క్షుత్పిపాసల జాడయే పొడసూపదు. దేహాభిమానమంతరించినది. లోకభీతి రూపారినది. ఆంధ్రదేశమంత నామప్రచారముగావించి క్రమముగ గాశిజేరి, గంగానదిని దానమాడి వారణాసి యందంతటను బ్రచారముగావించి చూపరుల కాహ్లాదము గలిగించుచు, నొక యింటనివాస మేర్పరచుకొని ప్రతిరేయియు దలుపులు బిగించుకొని గురుశిష్యులిద్దరు, బాలకృష్ణునితోగలసి భజనానందమున నోలలాడుచుండువారు

ఒకనాడు శ్రీవారు "నీలమేఘశరీరా" అను తరంగము గానము జేయుచున్నారు. మహాలక్ష్మి బాలకృష్ణులు నృత్యములు జేయుచు తన్మయులై యున్నారు. "వ్యత్యస్థ పాదారవింద" అను చరణమును గానము జేయుచున్నారు తీర్థులవారు. తన్మయుడగు శ్రీకృష్ణుడు వ్యత్యస్థపాదారవిందుడు కాలేక పోయినాడు. పై జరణమునే నూరుపర్యాయ

ములు గానము జేసినను పదార్థమును గ్రహింపకనే కృష్ణుడు గంతులు వేయుచున్నాడు. మహాలక్ష్మియు శ్రీకృష్ణు ననుసరించుచున్నది. కోపమువచ్చి శ్రీవారు తనచేతనున్న తాళపు చిప్పను శ్రీకృష్ణునిపైపునకు విసరినాడు అదిపోయి గిలకకు దగిలినది. ఇప్పుడు! యత్నములేకనే శ్రీకృష్ణుడు వ్యత్యస్థపదుడైనాడు. అనాలోచితముగ జరిగిన ప్రమాదమునకు పశ్చాత్తాపపడి మూడురోజు లుపవసించుటయే కాక నింకెప్పటికిని గోపమునకు వశుడగానని మనస్ఫూర్తిగా శపథముగావించి జీవితాంతము నియమపాలన సాగించిన ధీశాలి నారాయణ తీర్థపశాళి.

దుండగులు కొందఱు యావనవతియగు స్త్రీతో గంతులు బెట్టుట తగనిపని యని రెండు మూడుసారులు మందలించిరి గాని శ్రీవారు లెక్కసేయలేదు. పరాభవించి తమ ప్రయత్నము సఫలీకృతము గావింపదలంచినారు. దుండగులు. శ్రీవారొకరేయి కృష్ణగానము చేయుచున్నారు. మహాలక్ష్మి కృష్ణులు నృత్యములు గావించుచున్నారు. దుండగు లింటిచుట్టును జేరిరి. కొందఱు తలుపు సందులగుండ లోన జరుగు భజన దిలకించినారు. తీర్థులు తన్మయులై శరీరస్మృతి తప్పియున్నారు. లక్ష్మీకృష్ణులు వింజామరలు వేయుచున్నారు. గదియంతయు గోటి సూర్యప్రకాశముతో నిండియున్నది. భగవంతుని యొక్కయు భక్తులయొక్కయు జిన్మయస్వరూపములను గ్రమ

ముగ తిలకించి దుండగులు భక్తులైనారు. తీర్థులవారి పాదాల బడి తప్పునుక్షమించి శిష్యులనుగా గైకొనప్రార్థించి యభీష్ట సిద్ధిగైకొని ధన్యులయినారు. కొంతకాలమునకు వారణాసె యందే భార్యావియోగము జరిగినది. అందుండి బయలుదేరి యుత్తరయాత్రల పూర్తిజేసికొని తిరిగిస్వదేశమును పవిత్రి ముజేయుచు గృష్ణాతీరమునంగల వెల్లటూరున కొన్నిదినములు వసించి అందుండి ద్రావిడదేశమునంగల వరాహపురి జేరి అందు స్థిరనివాసమేర్పరచుకొని దేహముచాలించినారు. శ్రీవారు వెల్లటూరున నివసించు కారణమెఱిగించి సెలవు బుచ్చుకొనెద.

ఒకప్పుడు కృష్ణవరదలో బ్రాహ్మణదంపతులు తమ పుత్రీపుత్రికులతో బడి కొట్టుకొని పోవుచు నా దంపతులు మరణించిరి. పుత్రీపుత్రకులిరువురు సజీవులై తన్నదియొక్క ఈవలి యావలి యొడ్డులబట్టిరి. ఆపిల్లలను ఆ యా యొడ్డులకు సమీపగ్రామములలో గలిగి సంతానహీనులైన బ్రాహ్మణ దంపతులు వేరువేరుగా పెంచిరి. పెద్దవారైనారు. పూర్వకర్మ బలవత్తరమైనదగుట అన్నాచెల్లెండ్రను, భార్యాభర్తలనుగా జేయజాలినది.

ఈభార్యాభర్తలు సుఖముగా కాపురము జేయుచున్నారు.అన్నార్థియై త్రికాలవేదియగు సాధువొక్కండతిథిగా వచ్చి దంపతులచే పూజింపబడి దివ్యదృష్టిం బరికించి, ''విధి బలవత్తరము, మీ రొక్కే జననీజనకులకు జెందినవారు తెలియ కాచరించిన పాపమునకు బ్రాయశ్చిత్తముగలదు. భయపడ

కుడు. మీరిప్పుడు నీలవస్త్రధారులై ఏకచిత్తముతో నీకృష్ణా నది వెలువడిన తావునుండి బయలుదేరి ప్రతిరేవునను స్నానములు చేయుచు నియమపాలన గావింపుడు. మీరు ధరించిన నీలవస్త్రములకు తెల్లరంగువచ్చువఱ కిట్లుగావించిన పాపశాంతియగు బొం''డని యాజ్ఞాపింప వారట్లేకావించుచు, రాను రాను ఒకనాటి స్నానమున వస్త్రములకు నీలిమపోయి అవి తువ్వాలువలైనవి. ఏ తీర్థస్నానమున నీలవలువలు తువ్వాలువలైనవియో ఆ రేవు ననుసరించి వెలువడిన గృహసమూహమునకు వెల్లటూరను పేరు వచ్చినది. ఇట్టి పవిత్రస్థలమగుట మన తీర్థులవారిందు నివసింపగలిగిరని పెద్దలనిరి. వెల్ల అన తెల్లదనము, వెల్లటూరు అనగా తెల్లనియూరు. కృష్ణరేవు లన్నిటిలో నీ రేవు మిగుల పాపహారమైనదిగా పరిగణింపబడుచున్నది.



కోటంరాజు నాగేశ్వరదాసు

మరణమన నెట్టిదియో. ప్రతిమానవుడు దెలిసికొన దగిన విషయము. ఒకే దేహమునందు బాల్యయౌవనా ద్యవస్థల మార్పులెట్టివియో మరణావస్థగూడ నట్టిదియే. అది వ్యష్టిమార్పుగాని; సమష్టిమార్పు కాదు. వ్యష్టిసమష్టులు రెండును గలిసి ఉపశాంతి నందువఱకు జననమరణములు సాగుచునే యుండును. ఇది స్వరూపమిట్టిదని తెలిసి స్వానుభూతి నందినపుడే వ్యష్టిసమష్టుల కంతము. స్వానుభూతి గడించుటకే భౌతిక దేహ మవసరము దేహము పనికిమాలినదని దుర్వినియోగము జేయరాదు. పరమహంసలు మొదలు సామాన్యమానవులవఱకును చావు తప్పనిదే కనుక యథార్థ జ్ఞానసమార్జమునకు దేహ మవసరమని తెలియుచున్నది బంగరు మొదలగు లోహముల గరుగుటకు మట్టిమూస యెట్లవసరమో, అజ్ఞానరూప లోహమును ద్రవరూపముగా దయారు చేయుటకు భౌతిక దేహమవసరము. అజ్ఞానరూప లోహము కరగించి. దానిలో గౌణసంబంధమైన చెడుపదార్థము దీసివేసిన, నదియే జ్ఞానరూపముదాల్చి గమ్యము జేర్చును. బంగారము మూసలోబెట్టి ఆమూసను కుంపటిలో నుంచి బొగ్గులుబోసి నిప్పువేసి యూదుచు, అప్పుడప్పుడు పట్టుకారుతో బొగ్గులుతొలగించి బంగారము కరగినదియో, లేదో పరీక్షించినట్లు, సాధకు డజ్ఞానలోహమును దేహమను

మూసలోబెట్టి దానిని సూక్ష్మశరీరమను కుంపటిలోనుంచి తాపత్రియములను బొగ్గులుబోసి వైరాగ్యాగ్ని నిదగిల్చి, మన సహూప వాయువు నుపయోగించుచు, నప్పుడప్పుడు చికిత్సయను పట్టుకారుద్వారా వ్యాధులను బొగ్గుల దొలగించి కరగి నదియో లేదో ఆత్మపరీక్ష జేసికొనుచు, స్వస్వరూప కనకమే తా నగుచున్నాడు ఇంతపని జరుగుటకు దేహమనుకర్మజనక మైన మూస అవసరమే గదా! మూస లేకుండిన బంగారమెట్లు గరుగదో శరీరము లేకుండిన జ్ఞానసంపాదన సంభవింపదు గాన, భగవదాలయమునకువలె శరీరారోగ్యము రక్షించు కొను సాధన సాగించి కృతకృత్యుడైన మహనీయుడు మన నాగేశ్వరదాసుగారు.

తండ్రి భాస్కరమంత్రి. తల్లి శాయమాంబ. జననము 18వ శతాబ్దము. మనదాసుగారు పసితనముననే మాతా పితృ విహీనుడైనాడు. అప్పుడాబాలుని బోషించు బంధుగులెవ్వరు లేమి, సదాచార సంపన్నుండును, వైదిక కులాలంకారుండును, న్యాయవాద వృత్తింగైకొని జీవయాత్ర గడపుకొనుచు సకల జనాదరణపాత్రుండై వర్తించుమహామహుండును, ఔదార్య గుణాలంకృతుండును, భూతసేవాతత్పరుండును, రామభక్తా గ్రేసరుండును అగు యెల్లేపెద్ది పాపన్న శాస్త్రిగారరుదెంచి యాపిల్లవాని నంక నెక్కించుకొని స్వగృహమునకేగి, పతి వ్రతాతిలకమగు నిజకాంతస్త్రీరి యామె కాపుత్రరత్నమును జేతికిచ్చి యీపిల్లవాని, మాతాపితృవిహీనుని, నిజపోషణ

వ్యాపార సమర్థతావిహీనుని నేటినుండి నీయౌరసునిఁగా భావించి పోషింపుము. సంతానశూన్యులమగు మనకు శ్రీరామభద్రుఁ డీరూపంబున పుత్రభిక్ష మనుగ్రహించెనని దలంపుమని యాజ్ఞాపింప, నాపరమసాధ్వీమణి సంతోషాయత్తచిత్తయై భోజన మజ్జన శయనాసనాదిక్రియలయందు జననీజనకుల మరపించి, యతిగారాబమున నాగేశ్వరుని బోషింపుచుండె. పాపన్నశాస్త్రి యిట్టిసుముహూర్తమున నాగేశ్వరుని దనయింటఁ బ్రవేశపెట్టెనోగాని నాటికి సంవత్సరము పూర్తిగాకపూర్వమే యొకకుమారుండును, తదుపరి యొక కుమార్తెయు తనకు జనించిన, సుబ్బమాంబిక "ఇదియంతయు నాగేశ్వరుని చలువ" యని చెప్పికొనుచు వానియందుఁ బూర్వముకంటె మిక్కుటముగ ప్రేమఁజూపుచుండె.

ఇట్లు కొంతకాలమునకు నాగేశ్వరుఁడు పంచవర్ష ప్రాయసమన్వితుఁడగుటఁజూచి పాపన్నశాస్త్రి విద్యాభ్యాసమునకై పాఠశాలకుఁ బంపిన నీ ప్రాకృతవిద్యలు భగవానుని సన్నిధానమునకుఁ జేర్పఁజాలవనిగాఁబోలు ఒకపూట పాఠశాలకేగిన మరియొకపూటఁ బోవక విజనస్థలమునకేగి యొంటరిగాఁగూర్చుని ధ్యాననిమగ్నుఁడై యుండి మనంబు బహిర్ముఖంబగుడింటికివచ్చి భోజనమజ్జనాదికము లాచరించిపోవుచుండునేగాని తోడిబాలురగూడి క్రీడావిశేషములఁ బొద్దుబుచ్చుటయుఁ బూర్వపురీతి నిజమృదుమధుర వాక్యములచే దల్లిదండ్రుల సంతోషవార్ధి నోలలాడించుటయు లేక భగవదాయత్తచిత్తుండై యుండ, నది తెలియక పాపన్నశాస్త్రి తనకుమా

రుని యున్మత్తవ్యాధి పీడించుచున్నదని దలంచి, యేనేమా మందులిప్పించి అందువలన బ్రయోజనమావంతయుఁ గనుపింపకుండుటచే జేయునదిలేక, భవరోగవైద్యుఁడగు భగవానునకావ్యాధి నొప్పగించి యూరకుండ సుబ్బమాంబిక నాగేశ్వరుని యందతిప్రేమఁ గలదగుటచే బిల్లవాఁడెందుండినను వెదకి తెచ్చి భోజనమిడుచు, వానికి వ్యాధి యంతకంతకు మిక్కుటమగు సూచనలు కనుపించుటచే ముం దేమగునో యను భయము మానసంబుఁ గలవరపెట్ట నానాటఁ గృశించి పోవుచుండె.

భగవత్కృపఁ గడింపఁ బ్రయత్నించు వారలితరులకుఁ బిచ్చివారలుగా గనుపించుట నైజమేకదా! ఇట్లు కొన్ని వాసరంబులరుగ నెనిమిది వత్సరంబులు నాగేశ్వరునకు నిండుటయు వ్యాధి ప్రబలమగుటయుఁ గాంచి, పాపన్నశాస్త్రి పిల్లవానికుపనయనముచేసియైన విడిచిపెట్టెదననియెంచి, యొక సుముహూర్తంబున నట్లే గావించి. గురువర్యునియొద్ద సంధ్యావందనము నేర్చుకొమ్మని నాగేశ్వరుని బుజ్జగించి చెప్పిపంప, నాతఁడు తండ్రివాక్యానుసరణి నాఁడుదయమున లేచి స్నానముచేసి సంధ్యఁ జెప్పించుకొన గురువుగారింటి కేగిన,నుపనయనమునాఁడు శాస్త్రిగారివలన విశేషలాభముఁ బొందిన వాఁడగుట సుబ్బావధానులుగారు నాగేశ్వరుని కడుంకడుగారవించి యొకపీటపై కూర్చుండ నియమించి, తాను సత్వరమ స్నానముఁ జేసి శుభ్ర వస్త్రములఁ దాల్చి మోమున విభూతిపిండెకట్లు ప్రకాశింపుచుండ, వచ్చి మఱియొకపీటపై కూర్చుండి నాగేశ్వరుంగాంచి,

నాయనా! నేను జెప్పినట్లు శ్రద్ధాభక్తులతో నేర్చుకొని ప్రతి నిత్యము యథావిధిగా సంధ్యవార్చుచుంటివేని భగవానునకు నీయందు దయఁగలిగి నీకుఁగల వ్యాధినంతయు నిర్మూలముఁ గావించు. ఏదీ చెప్పెదను చెప్పుకొనుము.

శ్లో॥ అపవిత్రః పవిత్రోవా
సర్వావస్థాంగతోపివా
యస్స్మరే త్పుండరీకాక్షం
సబాహ్యాభ్యంతర శ్శుచిః॥

అని చెప్పిన నాగేశ్వరుఁడా మంత్రము భక్తితోఁ జదివి "గురువర్యా! ఈమంత్రమున కర్థమేమి?" అని వినయముగా నడుగ, "నర్థము నీకిప్పుడవసరము లేదు. సంధ్య చక్కఁగా వచ్చిన తదుపరి మాటది కాన మారుమాటాడక సంధ్యఁ జెప్పుకొమ్మని కోపముతోఁ బలికిన, సుబ్బావధానులుగారి వాక్యములకు బెద అక "అర్థము లేని చదువు వ్యర్థస్వరూపము దాల్చునని పెద్ద లనుట వినమే". మీరెప్పుడో సెప్పెదమన్న నామనంబొప్పదు కాన నిప్పుడే చెప్పితీరవలయు లేనిచో నాకీసంధ్యతోఁ బని లేదు. తర్వాత మీయిష్ట"మని ఖండితముగాఁ బలికిన నాగేశ్వరుని మాటవిని వీడు పిచ్చివాఁడు నేనేగాదని వివాదపెట్టుకొన ముందేమగునోయను భీతిచేతనో నిన్నగాక మొన్న నావలన విశేషలాభము గడించిగూడ తెలిసి తెలియని మాటలు మాపిల్లవాఁడనిన దగుసమాధానముఁ జెప్పి వానికెట్లో సంధ్య నేర్పక కృతఘ్నుఁడైనాడని పాపన్నశాస్త్రి యనుకొబోవునను భయముచేతనోగాని దుస్తామసియగు సుబ్బావ

ధానులు కోపపడక సాధుత్వము వహించి నీయిష్టప్రకార మర్థముఁ జెప్పెద తామసమువిడచి వినుము. "అపవిత్రుఁ డుగా నుండిగాని, పవిత్రుఁడుగానుండిగాని మఱియేయవస్థలో నుండిగాని పుండరీకాక్షుఁడైన భగవానుని దలంచిన మానవుండు లోపల వెలుపల శుచిఁగలవాడై యుండుననుట" అని సుబ్బావధానులుగారనిరి.

"అన్ని వేళలయందును భగవానుని స్మరించినవాడే పవిత్రుఁడుగదా" అని నాగేశ్వరుఁడన నగ్నిహోత్రము మంచి చెడ్డల విచారింపక వస్తువుల గ్రహించురీతి పవిత్రాపవిత్రత భగవానుఁడు విచారింపక నిజభక్తునకు శుచిత్వము సేకూర్చు.

శ్లో॥ అపిచేత్సు దురాచారో
భజతే మామనన్యభాక్
సాధు రేవ సమంతవ్య
స్సమ్యగ్వ్యవసితో హిసః॥

ఆచారరహితుఁడైనను, ఇతరమునందు మనంబుఁ బోనీక నన్నే భజించు నాతండే సదాచారపరుడని కృష్ణ భగవానుడు చెప్పినాడని సుబ్బావధానులుగారనిరి.

అదివిని ఏమంత్ర జపములేకయే భగవద్ధ్యానమువలన మానవుఁడు కృతార్థుఁడు కాగలడా, అను నాగేశ్వరునికి,

తాలం వృంతేన కిం కార్యం
లబ్ధే మలయమారుతే॥

"మలయమారుతసౌఖ్య మవిచ్ఛిన్నముగా ననుభవించు వానికి తాటియాకుల విసనకర్రతో ననసరము లేనట్లు, భగవన్నామజపమహాభాగ్య మనుభవించు భక్తునకు స్వమంత్రము లక్కరలే" దని సుబ్బావధానులుగారనిరి.

అదివిని నాగేశ్వరుడు నిమీలితనేత్రుఁడై కొంతతడవుండి మనంబున కెట్టి సమాధానముఁ గలిగెనోగాని చిఱునగవుతో తలయూచుచు గుసనిగాంచి, మిగిలిన సంధ్యసంతయుఁ జెప్పుడని వినయముగాఁ బలికిన, సుబ్బావధానులుగా రాశ్చర్యాయత్తచిత్తుఁడై, ఔరా! వీనిమనంబెంత పవిత్రవంతమైనది. కాదేని ఇట్టి పవిత్రప్రశ్నల గావించునా! "ఏమంత్ర జపమును లేకనే మానవుఁడు భగవన్నామ జపమునఁ గృతార్థుండు కాగలఁడా" ఆహా! ఏమీప్రశ్న? అష్టవర్షప్రాయమతిక్రమింపని బాలునిచే చేయఁదగినదియా, వీనికట్టి భావ మెట్లుఁగలిగె? మొదటినుండియు పిచ్చివాఁడని పిలువఁదగిన నడవడికఁగల వీనియం దిట్టి పవిత్రభావము లుండుట విచిత్రము, జ్ఞానులు బాలోన్మత్తులవలె సంచరింతురనుమాట యథార్థమయ్యె. గానీ ఇంకను వీనిచర్య లారసెదఁగాక, యని మనంబున నువ్విళ్లూరుచు సుబ్బావధానులు తిరిగి సంధ్యఁ జెప్పఁగడంగిన మఱుమాటాడక నాగేశ్వరుఁడు గురువుగారు చెప్పినదెల్ల చెప్పుచూవచ్చి,

శ్లో॥ ఆకాశాత్పతితం తోయం
యథా గచ్ఛతి సాగరం
సర్వదేవ నమస్కారాః
కేశవం ప్రతిగచ్ఛతి॥

అనుమంత్రము గురువర్యుని నోటనుండి వెలువడిన వెంటనే "ఈమంత్రమునకుఁగూడ తాత్పర్య మెఱిఁగింపు"డనిన సుబ్బావధానులు "ఆకాశమునుండి వర్షరూపముగా భూమి యందుఁబడిన నీరములెల్లు సముద్రమునజేరుచున్ననో, అట్లే మానవు లేయే దేవతలకు నమస్కరించినను ఆయానమ స్కారములన్నియు కేశవునకే చెందుచున్నవి", అని యర్థ మనిచెప్ప నాగేశ్వరుఁడు వెంటనేలేచి "ఇక మీరు శ్రమపడ నవసరము లేదు. ఎందుకన, వృధాకాలహరణముచేయక మానవుఁడు భగవన్నామస్మరణముచేయవలయునని మొదటి మంత్రమును, సర్వదేవతలు కేశవాకారులగుదురని రెండవ మంత్రమును జెప్పుటచే నామనంబీసంధ్యనుండి విముఖత వహించినది. "ఇది దైవికము కాన నేనిదేపోవుచున్నాను" అని చెప్పుచు సుబ్బావధానులుగారెంతఁ జెప్పిననువినకఁ బరు గెత్తుకొనిపోయిన, "వీనికి నిజముగాఁ బిచ్చిపట్టినది. పెట్టి వేయి విధను లందులోనిది యొకటి. ఇది చక్కగా నెరవేరదని మొదట నే ననుకొన్నవిషయమే నాపనియైపోయినదిగదా పోనిమ్ము ఇక వాడెట్లుపోయిన నాకేమి", అని అనుకొనుచు శాస్త్రిగారి గృహంబునకేగి నడచిన విధమంతయుఁజెప్పి నిజ నికేతనంబునకరిగి సుఖంబుండె.

పాపన్న శాస్త్రిగారతిశాంతులు, సదాచార సంపత్తిగల వారు. ప్రతిరోజుదయమునలేచి స్నానసంధ్యాద్యనుష్ఠానములఁ గావించి, తాళపత్రగ్రంధమునందు లిఖింపఁబడిన యధ్యాత్మ రామాయణమందొక సర్గపారాయణముచేసి, భగవానుని పోడ

శోపచారంబులఁ బూజించి, తద్గ్రంథరాజమును భద్రముగాఁగట్టి తాను భోజనముసేయుటకుఁ గూర్చుండు స్థలమునకు వెనుక గల గోడ పైభాగమందు నాటఁబడిన వెంపువం కెలపైన బొప్పస్తక ముంచి, భోజనముఁజేసి లేచి, దుస్తులనుధరించి తినన్యాయ వాదపదవి నిర్వహించుకొనుటకై యాయూరంగల న్యాయస్థాన మునకేగి యందుఁగల పనినంతయుఁ దీర్చుకొని. సాయంత్రిన మున కింటికివచ్చి గృహకృత్యముల నెరవేర్చుకొను చుండువాఁడు.

ఇట్లుండి యొకదినసంబున గ్రమముగా నియతకృత్య ములఁజరుపుకొనుచువచ్చి, ఆధ్యాత్మరామాయణము పారా యణఁజేయుటకు పైనుండు గ్రంథమునుదీసికొన వంకెలపైనపుసకు దృష్టి మరలించి, అందు తనగ్రంథరాజము లేమి ఇంటనుండు వారి నందఱిని విచారించి ప్రయోజనముఁగానక, పిచ్చినాగన్న చేష్ట యగునేమోయని యూహించి తనకుమారునిబిల్చి మన నాగేశ్వరుఁడెంచుండినను బిలుచుకరమ్మని యాజ్ఞాపింప వా డట్లుగావించె.

అంత నాగేశ్వరునిగాంచి శాస్త్రిగారు కోపముతో "నిందుఁగల తాటియాకుల గ్రంథమును నీవతీసినావని నాకుఁ దెలియవచ్చినది. దానిని వెంటనేదెచ్చి నాకిమ్ము. లేనిచో నిన్ను కఠినదండనలపాలు గావించెదనని పలికిన దండ్రివాక్యములకు బెదరినవానివలె వడవడ వడంకుచు మారుమాటాడక ఒని, రహ స్యస్థలమున తానుదాచియుంచిన శాస్త్రిగారి సంస్కృతా ధ్యాత్మరామాయణము దాని కనువాదముగా రచింపఁబడు

పద్యములచే నలరారు నూతనతాళపత్ర గ్రంథయుతముగాఁ దెచ్చి శాస్త్రిగారికిచ్చిచేతులుజోడించి నిలచె.

అంతశాస్త్రి కుమారుఁడిచ్చిన రెండుగ్రంథములను దీసికొని "ఈ రెండవగ్రంథమేమిటి" అనిబలుకుచు విప్పిచూచి అధ్యాత్మరామాయణము బాలకాండమని దెలిసికొని అది తన గ్రంథమున కనువాదమనిగూడ గ్రహించి కుమారుని గాంచి "యీగ్రంథమెక్కడిది? యెవరిచే రచింపఁబడినది?" అనియడిగిన నాగేశ్వరుఁడు నిర్భయముగా "శ్రీరామమూర్తిచే రచింప బడుచున్న యధ్యాత్మరామాయణము (పద్యకావ్యము)" అనిజెప్ప తండ్రి ఆశ్రీరామమూర్తి యెవరనుడు, సంతోషాతిశయమున నృత్యముసేయుచు "తండ్రీ! ఆశ్రీరామమూర్తి యెవరనియా, "నజాయతే నజనిమ్రియతే" పుట్టువెఱుఁగనివాఁడై స్వరూపసామర్థ్యాదులచే జెడనివాఁడై, యొరులచే జెపఁబడనివాఁడై "సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ" సత్యజ్ఞానానందములే స్వరూపముగా గలవాఁడై, సత్యసంకల్పుఁడై "హృత్పుండరీకం పురమధ్యసగ్స్థమ్" ప్రాణుల హృత్పుండరీక నివాసియై "ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే" అనుధర్మమును స్థాపించుకొఱకు ప్రతియుగమునం దవతరించుచుండువాఁడై "యదాదిత్యగతం తేజః" సమస్తజీవకోటులను ప్రకాశింపఁజేయువాఁడై, సర్వేంద్రియ నియామకుఁడై, యనంతాది రూపభేదములచే సమస్తభూతములను భరించువాఁడై, సర్వకర్మలకు నాయాకర్మఫలములకును గర్తయై ఆది మధ్యాంతములు లేనివాఁడై, సృష్టిస్థితి సంహారకారణుఁడై, విచిత్రక్రియా సమర్థుఁడై, వాచామ

గోచరుఁడై, భక్తమానసాహ్లాదకరుండై వెలుంగుపరబ్రహ్మంబ శ్రీరామమూర్తి'' అనిచెప్పి యూరకుండిన, పుత్త్రుని కౌగలించుకొని "నాయనా! శ్రీరామసహాయంబున నీచే నేగ్రంథము రచింపఁబడుచున్నదని తెలియుటచే పరమానంద భరితుండనైతి. విద్యాగంధమెఱుంగని నీకీవిజ్ఞానసంపత్తియు, మృదుమధుర వాగ్రచనా నిపుణతయు గ్రంథనిర్మాణ కౌశలంబును గలుగుటాశ్చర్యకరము. చిరకాలమునుండి నిన్ను నాదరము సేయుచు పిచ్చివాడవని దూరనాడిన నన్ను శ్రీరామమూర్తి క్షమించుగాక. నేటినుండి నాభయమేమియు లేక నేగ్రంథమును దెనుగించుము. "మఱచితిని" ఈమహాత్కార్య మెంత కాలమునుండి సాగింపుచుంటివి?'' అనుతండ్రికి నిన్న రాత్రి "అధ్యాత్మరామాయణము నాసాయంబున దెనుగున వ్రాయుదువుగాక'' అని రామాజ్ఞ యగుటచే తదాజ్ఞానువర్తినై పనిగొనుచుంటినని నాగేశ్వరుండనిన యాశ్చర్యాయత్తచిత్తుండై భార్యనుబిలచి శాస్త్రిగారు కుమారుని సామర్థ్యాతిశయంబులుగ్గడించి ఇంతటినుండి అతనియెడ భక్తిప్రపత్తులుగలిగి మెలంగునటుల శాసించి, తాను సంతోషసాగరమున దేలియాడుచు నాడు కుమారునితోఁగూడి భోజనముఁ జేసి నియతకృత్యముల నేరవేర్చుకొనుటకై న్యాయస్థానమున కేగె. నాఁడు మొదలింటియందు, నూరియందు గౌరవమతిశయింప రామాయణ రచనా మహాభారముఁ దలధరించి నాగేశ్వరుఁడు మోయుచు, తండ్రిని గాంచి యొక్కనాఁడు వినయాతిశయము లుప్పతిల్ల "నాయనా! అధ్యాత్మరామాయణమున బాలాయోధ్యకాండములు పూర్తి

మైనవి ఇక నరణ్యాకాండముఁ బ్రారభింపవలయు నంచు నకు విజనప్రదేశమును కాలవిరామమును ముఖ్యావసరములు. కాన దయయుంచి మనయింటియందలి గదులలో నొకదాని నొసంగి నాలుగుదివసములు విరామమిడి శ్రీమదధ్యాత్మరామాయణ ములో నేనందుండునటులను పైగదువులోపల నన్నెవ్వరుగాని బలుకరింపకుండునటులను, శ్రీరామాజ్ఞయయినపుడు నాకై నేనే వచ్చిమజ్జన భోజనాదులఁగావించి పోవుచుండువాడనగు టచే నన్నంతమున కితరులు నిర్బంధింపకుండునటులను, వరం బిమ్మ" ని పలికిన పుత్రుని వాక్యంబులకలరి, ఈమహాత్కార్య మునకిట్టి నియమముండవలయుఁగాబోలునని దలంచి మారు మాటాడక "అట్లేయగుగాక" అనుచు తనపారాయణమున కవ సరమగు శ్లోకములఁగొన్నిటి నధ్యాత్మరామాయణమునుండి వ్రాసికొని నాడు పుత్రునితో భోజనముఁగావించి, తనుపరికర ములతో నాగేశ్వరు నొకగదియందుఁ బ్రవేశపెట్టి; యతని యిష్టానుసారమా గదికి తాళమువేసి ముద్రచేసి శాస్త్రిగారు న్యాయస్థానమున కేగె.

ఆగదియందుఁ బ్రవేశించి నాగేశ్వరుఁడు చప్పుడుచే యకఁ గూరుచుండుటచే, నందు మనుజుఁడుండినాడనుకొనదగిన గురుతు లేమియుఁ దోపకుండుటయుగాక భోజనమజ్జనాదు లకు సయితము బయటికివచ్చుట మానివేసెను.

ఇట్లు దివసత్రయంబు గతించిన పాపన్న శాస్త్రి పుత్రుని కఠిననియమమున కడలుచు, క్షణక్షణమునకు మనంబుకలగుఁడు పడుచుండ జేయునది లేక నియతకృత్యములవీడి, పదేపదే గది

యొద్ద కేతెంచి యేవలనను పుత్రుని క్షేమసమాచారము దెలి
యమి నిరాశాపరుఁడై నిద్రాహారములు విడనాడి, మిగుల కష్ట
ముతో గతదినములు మూఁడు వెళ్ళించినాఁడు. గాని నాలుగవ
దివసమట్లు గాక, శాస్త్రిగారికి నాగేశ్వరుని జీవితమును గుఱించి
సందేహముఁ గలుగఁజేసినది. తన్నివృత్తికై ప్రశ్నించుటకుఁ
బ్రథమమున నాగేశ్వరుఁ డడిగిన పదంబులప్పుడే వీలుగలుగఁ
జేసినవిగావు. కాని పుత్రప్రేమ యంతకంతకు మిక్కుటముగా
పురికొల్పి తాను వేసిన ముద్రల దప్పించి తాళముఁదీసి తలుపుఁ
దెఱువ యత్నించెనుగాని లోపల గొళ్ళెము వేసియుండుటచే
సాధ్యముగామి, తలుపు బ్రద్దలు చేసియైనను ప్రవేశింపఁగాంచెద
నని దలంచి తత్కార్యమాచరింపఁబోవునంతలో నొక స్నేహితుఁ
డరుదెంచి "మీరలెందులకిట్లాతురపడెదరు ! ప్రథమమున
నాగేశ్వరుఁడు నాలుగురోజులుగదా గడువడిగినది. అది జాముపై
దేగిన కడచునునే! గడచిన మూఁడుదివసములనుండి రాజాలని
యశుభమీ స్వల్పకాలమునం దెట్లు రాఁగలదు? అట్లుగాదేని
ఇప్పటి మీ ప్రయత్నమున వెనుకవచ్చిన, ముందు రాఁగలిగిన
యశుభములు బోఁగలవా? అవతార పురుషుండగుటచే వాని
కెట్టికష్టమును రానేరదు గాన సంపూర్ణముగా సందియము
వీడు"డని సమాధానముఁ జెప్పి వారించెను.

అంత దివాకరుఁడీ విచారవార్త వినజాలకఁగాఁబోలు
హస్తాద్రి మఱుఁగున కేగె. శాస్త్రిగారికి నాటిరేయి నాలుగుజా
ములు నాలుగు యుగములై యెట్లో గతించినవిగాని ముందే
యశుభవార్త విననగునోయను భీతిమాత్రము గతింపమి, మఱే

ఇంకెక్కడి పుత్రుఁడు. నాలుగుదివసము లన్నపానములులేక జీవించినవారలెవ్వరైనను గలరా? సుపుత్రమృతిఁగనుగొనజాలిన నాబోఁటి నిర్భాగ్యుని బ్రతుకెందుకు 'మంటగలువనా' అనిరోదన సేయుచెవరెంతఁజెప్పినను వినకఁ తలుపుబ్రద్దలుసేయుఁడని సేవకులకాజ్ఞాపించి వేగిర పెట్టు డు, వారట్లుగావింపఁసిద్ధపడియున్నంత గదిలోపలిగొళ్లెము కదలించిన చప్పుడు వినవచ్చి వారి నెంతయువారించినది.

అంత నాగేశ్వరుఁడు కనులయందు నీరుఁగార్చుచు గ్రంథద్వయము హస్తయుగంబునం దలచుచుండ గదినుండి ప్రత్యక్షమైన శాస్త్రియు, తక్కంగల బందుగులును వానిం గౌగలించుకొని గొల్లుమనసాగిరి అది విని గతించినరేయి శాస్త్రిగారి ప్రయత్నము వారించిన మిత్రుఁడే తెంచి నాగేశ్వరుని కౌగలించుకొని విలపించు వారినందఱి నావలకుఁదీసి పిల్లవానిని బ్రతుకనివ్వరాయేమి? అని యదలించుచు, నాగేశ్వరునితో "నాయనా,! మీతండ్రిగారు నాలుగురోజులనుండి నీకొఱకు నిద్రాహారములుమాని పరితపించుచున్నారు. ఈదివస చతుష్టయమునుండి నీవన్నపానములులేక నెట్లుంటివి? రోజునకొక పూటయేనియు భోజనముఁజేసెపోయిన గాక పోయినదియా? చూడు నీకొఱకు మీయమ్మగారెంతఁ గృశించినారో?" అనుచు వానిహస్తములనుండు గ్రంథద్వయముం గ్రహించి, యందునూతన గ్రంథమునువిప్పి యరణ్యాకాండము పూర్తియగుటనారసి, అది శాస్త్రిగారికి చూపింప విషాద సంతోషప్రేమలు ముప్పిరిగొన బుత్రుని గౌగలించు

కొని చెక్కులముద్దుఁగొని గద్గదకంఠుండై, "నాయనా! ఈనా లుగుదివసములు మన్నాఁడఁబాసి యెట్లుండఁగల్గితివి?" అనిన "గ్రంథరచనాభారవాహుండగు శ్రీరామమూర్తి తనయరణ్యావాసవృత్తాంతము నెల్లడించుటచే దుఃఖమాపుకొనలేనివాఁడై యుండుటయు, లేఖరిత్వపదవి నధిష్టించిన నేను జగజ్జననీజనకులకుఁగలుగు కష్టములవిని వ్యసనపూరితుండనగుటయు గ్రంథముసాగమి యన్నపానముల మరచినాఁడ"నని దుఃఖపూరితుఁడై పలికిన నాగేశ్వరునిమాటల కచ్చటివారెల్ల రచ్చెరువంది వానిపరిభావము వేనోళ్ళఁగొనియాడుచుండ, జననీజనకులు పుత్రునిదోడ్కొనిపోయి యభ్యంజనముఁ గావింపించి పంచిరాన్నంబుల భుజింపఁబెట్టి. తాముఁభుజించి ఇష్టాగోష్టి సలుపుచు సుఖోపవిష్టులై యుండిరి. ఇట్లు రామానుగ్రహంబున నాగేశ్వరుఁడచిరకాలంబుననే రామాయణము పూర్తిగావించి తనపదమూఁడవయేట కృష్ణాసాగర సంగమ తీరమందలిరాగు మోరుకోటయందు వేంచేసియున్న ముక్తేశ్వరస్వామివారి సమక్షమున శ్రీరంగేశ్వరునకు కృతిసర్పింపదలంచి, మహాశివరాత్రినాడు ప్రొద్దుగ్రుంకుసరికి జననీజనక మిత్రబృందముతో పలువురు విప్రపుంగవులు మహాన్యాసపూర్వకముగా నభిషేకముఁగావించు నమయమున తదాలయమున కేగి, స్వామివారిని సమీపింప నందుండు విప్రులెల్ల నైకకంఠ్యముగా మయలవాఁడ వగుటచే లోనకు రాగిట్టదు పోపొమ్మని పలుకుచు నెట్టివేసిన, దాసుగారు తిరిగి ముఖమంటపమున కేగి తనకు సంభవించిన యవమానమును లెక్కసేయక గరం

బులఁ గీలించి భక్తిప్రపత్తులు మెరయ ముక్తేశ్వరు నిట్లని వినుతించె.

ఉ॥ శంకర భక్తమానస వ ♦ శంకర దుష్టమదాసురేంద్ర నా
శంకర పాండునీలరుచి ♦ శంకర వర్ణనిభాంగ భోగిరా
ట్కంకణ పార్వతీహృదయ ♦ కైరవకైరవ మిత్రయోగి హృ
త్పంకజ పంకజాప్తజయ ♦ తాండవ ఖేలన భక్తపాలనా॥

సీ॥ దేవజగన్నాథ ♦ దేవేంద్రవందిత వితతచారిత్ర సం ♦ తతపవిత్ర
హాలాహలాహార ♦ యహిరాజకేయూర బాలేందుభూష స ♦ ద్భక్తపోష
సర్వలోకాతీత ♦ సద్గుణసంఘాత పార్వతీహృదయేశ ♦ భవవినాశ
రజతాచలస్థాన ♦ గజచర్మపరిధాన సురవైరివిధ్వస్త ♦ శూలహస్త

గీ॥ లోకనాయక సద్భక్త ♦ లోకవరద
సురుచిరాకార మునిజన ♦ స్తుతవిహార
భక్తజనమందిరాంగణ ♦ పారిజాత
సకలలోకైకపూజిత ♦ చరణకమల॥

తే॥ గీ॥ అవ్యయుండ వనంతుండ ♦ వచ్యుతుండ
వాదిమధ్యాంతశూన్యుండ ♦ వఖిలభృతివి
నిఖిలమందెల్ల వర్తింతు ♦ నీవునగిలి
నిఖిలమందెల్ల నీయంద ♦ నెగడు దేవ॥

ఇట్లు ప్రార్థింపఁ గరుణాళుఁడగు శంకరుఁడు తద్భక్తికి మెచ్చి లింగరూపమున దాసుగారి దోయిటఁబ్రవేశించి కటాక్షించిన నాగేశ్వరుఁడు బ్రహ్మానందవార్ధి నోలలాడుచు యానందనృత్యము గావించుచుండె. ఇట నభిషేకముఁ గావించుచున్న బ్రాహ్మణులు స్వస్థలమందు శంకరుఁడులేమి సంశయాకులచిత్తులై తమలోఁ దాము గుసగుసలాడుచు గొంత వడికి దాసుగారి హస్తములయందు స్వామివారు వేంచేసి యుండుటలఁ దెలిసికొని తమతమ పూజాదికములమాని

వినయాతిశయంబు లతిశయింప వచ్చి దాసుగారికిఁ బ్రదక్షిణ నమస్కారములఁగావించి యాతని పరిభాషణమున కాశ్చర్య పూరితచిత్తులై పొగడుచు శ్రీస్వామివారిని స్వస్థానమున జేర్చు నటులఁ బ్రార్థింప దాసుగారు కొంతవడికిఁ దెలిసికొని,

గీ॥ భవునియందును శ్రీరమా ♦ ధవునియందు
భేదమెంచక సమదృష్టిఁ ♦ బాదుకొల్పి
భక్తిఁజేసెడునేని ని ♦ ష్కల్మషాంగ
మూర్తి స్వీయాసనముఁజేరి ♦ మురియుఁగాత॥

అని నిజాభిప్రాయము వెల్లడించినంతనే తల్లింగము స్వస్థానమునకేగి చూపరుల కానందముఁగలిగించె. నంత బ్రాహ్మణులెల్లరు దాసుగారిని సబహుమానంబుగాఁ దోడ్కొని పోయి స్వామివారి పురోభాగమునం దమర్చియుంచిన యుచితాసనంబున గూర్చుండఁబెట్టిన భక్తవిశ్వాసము లుప్పొంగఁ దన గ్రంథరాజమును యథావిధిగా ముక్తేశ్వరుని సమక్షమున శ్రీరంగేశ్వరుని కర్పించి కృతకృత్యుఁడయ్యె.

అంత కొంతకాలమునకు శాస్త్రిగారు నాగేశ్వరున కనురూపవతియగు కన్నెనొక్కర్తుఁ దెచ్చి వివాహ మతివైభవంబుగా గావించి, తదుపరి నూతనగృహంబొండు నిర్మించి యందాదంపతుల గృహప్రవేశము గావింపించి వారి పోషణా భారమంతయుఁ దానే మోయుచుండె. సంసార కృత్యముల యందు విరక్తుండై యుండుట నాగేశ్వరుఁడు భార్య నొంటి నింటవిడచి యెందేనియుం జని దనయిష్టము వచ్చినప్పుడు మాత్రమింటికివచ్చి పోవుచుండువాఁడు.

ఇటులఁ గొన్నిరోజులుగతింప శాస్త్రిగారు పరలోకో న్ముఖుఁడై యుండి తనకుఁగలయావదాస్తిని కుమారులందఱికిఁ బంచియీయఁదలంచెను గాని యప్పటిస్థితినిబట్టి స్వతంత్రించి యేకార్యముఁ జేయఁజాలని వాఁడగుటచే యారసునకులోఁబడి తానుదలంచినటులఁ గావింపలేనివాఁడై చేయునదిలేక విచార పూరిత మానసుండై స్వల్పకాలంబుననే మృత్యువాతం బడియె

దానకుటుంబ భారమంతయు నాగేశ్వరుని శిరంబున కొఱగినని కాని దానికతఁడు లెక్క సేయక పూర్వపు రీతి వర్తింపుచుండుటఁగాంచి రేపల్లె, భట్టిప్రోలు గ్రామంబు లంగల వైశ్యపుంగవులు కొందఱాభారమంతయుఁ దమపై వైచి కొని సంపూర్ణ విరామమిచ్చిన నాగేశ్వరుఁడు పరమానంద భరితుఁడై నిరంతరము రామభజన సేయుచు జీవితము సార్థక పరచుకొనుచుండె.

ఇట్లుండఁ గొంతకాలంబునకు దైవయోగంబుపేర్మి దాసుగారి భార్య గర్భవతియగుట విని, భట్టిప్రోలునగల వైశ్య శిఖామణులు కొందఱు భక్తిపెంపున చీన చీనాంబరములను కొన్ని యుపహారములును సేకరించి యొకబ్రాహ్మణునకిచ్చి దాసుగారి భార్యకర్పించి రమ్మని చెప్పిన, నాతండా ముడుపు గైకొని రేపల్లెకువచ్చుచుండ మార్గమధ్యమందా బ్రాహ్మణు నకు దాసుగారుకలసి యాతని యాగమన కారణంబెఱింగి, ఈ ముడుపునిచ్చి నీవింటికిఁబోయిన దీనినాయిలుఁ జేర్చెద. వృథా శ్రమ నీకేలయని నమ్మఁజెప్పి యాముడుపు గ్రహించి తన

శిరంబునందిడుకొని రామభజనసేయుచు వచ్చుచుండఁ గొంత వడికి నవమాసస్ఫూర్తి విజృంభింప మార్గాయాసమున నడువఁజాలకొక వృక్షచ్ఛాయఁ గూరుచుండియుండిన భిల్లకామిని నొకర్తుంగాంచి సమీపించి వినయవినమిత వదనుండై, "అమ్మా! వస్త్రాదికములచేతను, రుచ్యములగు నుపహారములచేతను నిన్ను సన్మానించువారెవ్వరుండరని నీవుధరించిన జీర్ణవసనములే చెప్పకఁ జెప్పుచున్నయవి గాన నాయందు సోదర వాత్సల్యముంచి మద్దత్తవసనాదులం గ్రహింపు"మని చెప్పుచు తనయొద్దనున్న ముడుపు నామెకందిచ్చి బ్రహ్మానందమున నోలలాడుచు నెందేనియుంజనియె.

ఈవృత్తాంతము భట్టిప్రోలు నగరవైశ్యపుంగవులు విని కటకటంబడి చేయునదిలేక దాసుగారికి తెలియకుండునట్లు తిరిగి వివిధోపహారములను ఉత్తమవసనములను సేకరించి దాసుగారి భార్యకంపి పరితృప్తులైరి. అంతకొంతకాలమునకు దాసుగారికొక పుత్రుఁడుదయించిన నేకపుత్రవిషయమగుటచే తల్లి రామారాయుఁడను నామకరణముఁగాంచి యతి గారాబమున బోషించుచుండె.

పుత్రలాభమునకుఁదోడు శిష్యలాభమును గడింప నెంచి దాసుగా రాంధ్రరాష్ట్రమంతయు సంచరించి యందందు భక్తి జ్ఞాన వైరాగ్యపూరితములైన యుపన్యాసములిచ్చుచు వర్ణవిచక్షణ లేకయే శిష్యబృందమును గడించుచు గొంతకాలమునకు గుంటూరునకేగి యందనేకమంది శిష్యుల

సేకరించిరి. దాసుగారు బుద్ధిబలమునకుఁ గోడు దేహబలము గూడ గలవారు.

అంత నొకసంవత్సరంబున సకాలవర్ష ప్రతిబంధక మేర్పడుటచే రేపల్లె వాస్తవ్యులందఱొక చోఁ జేరి తన్నివారణో పాయము లాలోచింపుచుండ దాసుగా రెటనుండియో వచ్చి వారల మనోభావము లెఱింగి దయాళుండై మీ రేల కటకటం బడెదరు, ఇప్పటికొక యామంబు గతించులోపలఁ జాలినంత వర్షము వర్షింపగలదనియు రామాజ్ఞయయినది. కాన తత్శుభ సమయమునకై వేచియుండుడని జెప్పుచు స్వగృహోన్ము ఖుండై చనిన దాసుగారి వాక్యముల లక్ష్యసేయక, సభ్యు లంద ఱాయూరంగల శివునకు సహస్రఘటాభిషేకముఁ జేయ నిశ్చయించి, తన్మహాకార్యమున కవసరమగు పరికరముల సిద్ధ పరచుచుండులోపల దాసుగారిచే నిర్ణయింపఁబడిన కాలం బరనిముసంబుండగనే ఎక్కడ లేని మేఘంబు లాకసంబెల్లడ నావరించి సంపూర్ణముగా వర్షించి కర్షకుల కానందముఁ గలి గించె. నాడు మొదలా యూరంగల యాబాలగోపాలమున కును దాసుగారియందు భక్తివిశ్వాసము లతిశయింపసాగె ననుటలో వింత లేదుగదా.

భరతఖండంబునం గల పుణ్యక్షేత్రంబుల నారయు తలంపున దాసుగారు శిష్యబృందముతో బయలుదేరి రామ భజనసేయుచు సీతాకల్యాణ సమయమునకు భద్రాచలమున కేగి సీతారాములు కల్యాణమంటప మధ్యస్థులగుటయుఁ

దన్మంటపమును చుట్టుముట్టి జనసముదాయము మిసుకజల్లిన రాలకుండు నటులుండుటయుఁ గాంచి, తాను శిష్యులతో నామండప సమీపమున కేగి భజన సేయుట దుస్తరంబని దలంచి కాంబోలు తత్ప్రయత్నమును మానుకొని, యాలయముఖ మంటపమున జేరి శిష్యులుం దానును కరతాళముల గ్రహించి తాంబూరలు మీటుచు.

ఆనందభైరవి రాగం — ఆటతాళము

కనులకుఁ గనుపడవేమి శ్రీరామ! రామయ్య తండ్రీ!
కనులకు॥ ఇంత కన్నడసేయఁగ కారణమేమి ॥క॥

ఎక్కాడనున్నానో స్వామి నాకింకెవరయ్య దిక్కికనో సర్వాంతర్యామి ॥క॥

గుహుడుకడగిన పదము లేవి జనక కూతురు నుంచిన్న వామాంకమేది ॥క॥

పయిడిముగ్గులు గొల్సుతవి చేత బట్టిన మంచితీసు కమాను లేవి॥

మంచి పచ్చలపోగు లేవి తళుకు మించిన నీవ్రేళ్ళ యుంగరము లేవి ॥క॥

ఘంటల మొలనూలు యేది బొజ్జ గదల తళుకుమను కౌస్తుభమేది ॥క॥

ముద్దులుగులుకు మోమేది జగన్మోహనమైన మీ చిరునగవేది ॥క॥

వరదుఁడిచ్చిన హారమేది తూము నరసింహుఁ డర్చించు చరణంబు లేవి ॥క॥

శ్రీ భద్రాచలవిహార తులసీదళహార హేసింధు గంభీర పరమదయారసపూర గాగేశ్వరదాస మందార జగ దేకవీరా ॥క॥

అని భక్తిభావంబుట్టిపడ ప్రార్థించిన సీతారాము లాతనిభక్తికి మెచ్చికొని మంటపస్థ విగ్రహములయందుండు తమతమ షోడశకళలనులేపి నాగేశ్వరుని ముందావహిల్ల జేసి యానందించుచుండె. అదిగాంచి,

కాఫీరాగము — ఆట.

నాపాలి భాగ్యమేమందు రఘునాధుఁడు కనుపించె ముందు పాపములెల్లనుబాపు శ్రీరాముల రూపము కను లకు సూఢిగఁ గనుపించె ॥నా॥

బారసిబారసియున్నందుకు తాంబూర చిరుతలఁ బూనినందుకు తరుచైన యెండ మధ్యాహ్న సమయమని వెరు వకబోయి కో నెల దూరినందుకు ॥నా॥

మంచిసొమ్ములు దాల్చినాడు నవ మన్మథ రూపము వాడు ఎంచగలేరు గౌరీశవాణీశులు మంచివారలకెల్ల మంచి వాడగువాడు ॥నా॥

అని యానందగీతముఁ బాడుచుండ తూము నరసింహ దాసుగారి రహస్యమును గ్రహించి నాగేశ్వరుని సన్నిధాన మునకేగి ప్రార్థించి సబహుమానముగాఁ దోడ్కొనిపోయి కల్యాణవేదికపై ప్రవేశపెట్టిన తిరిగి యావిగ్రహంబులు షోడశ కళాపరిపూర్ణములై విరాజిల్లె. నంత నాగేశ్వరుని మాహా

త్స్మ్యమున కచ్చేపవందుచు సంయమంసువారు యథావిధిగా కల్యాణమహోత్సవము గావించి కృతకృత్యులైరి. అంత కొంతకాలమందుండి రామాజ్ఞ గైకొని బయలుదేరి యుత్తర యాత్రలనన్నియు సేవించి, క్రమంబున దక్షిణదేశయాత్రలం జేయుచు శ్రీరంగమునకేగి యుంటాక శతకరాజమును శ్రీరంగనాయకున కర్పించి, ఎనిమిదవ వత్సరంబున నిజగృహ ప్రవేశంబుగావించె.

దాసుగారింటి కేగిన మరుదినసంబున అష్టవర్షప్రాయా తీతుడగు కుమారుండు మృత్యుముఖ గుహాప్రవేశంబునను తద్వ్యసద్దశ కడలక పుత్రశవమును హరిభజన పూర్వకముగా శ్మశానవాటికిం గొనిపోయి ఖననాదిక్రియలాచరించి, వివాహ మహోత్సవమునకేగి వచ్చువాని పోలిక, నిర్వికారుండై యింటి కిం జనుదెంచి, లోకమర్యాదానుసరణి శుచిస్నానాదికము లాచరించి భగవధ్యానాసక్తచిత్తుండై యుండు నెడ, బంధుగులు కొందఱు అరుదెంచి పెద్దతనమునం దిట్టి పుత్రవియోగదుఃఖము సంభవింపదగినదియూ మీకని సమాశ్వాసింప, వారలంగని దాసుగారు చిరునవ్వు మోమున దా డవమాడ, "మీరెట్టి వెఱ్ఱివారలైతిరి! ప్రత్యహము తాను విసర్జించు మలంబున ననేక కీటకంబులుపడి మృతినందుచుండ, వానికై దుఃఖింపని మానవుం డన్యస్త్రీగర్భమునుండి పొడమిన పుత్రిగూర్చి కీట కముల కడలుట సమంజసంబగునా? 'ఋణానుబంధరూపేణ పశు పత్ని సుతాలయాః' । అను నీతివాక్యమెఱుంగరా! కాన

మీ మీ యుపన్యాసము లింతట గట్టిపెట్టి రామనామామృతముఁ బానముఁ జేయుచు కృతార్థులు కం”డని బోధించె.

ఒకపరి నిజకాంతచే ప్రబోధింపఁబడి పితృశ్రాద్ధమునకు భోక్తల నియమించుటకై బయలుదేరి విఫణిమార్గంబున వచ్చుచుండ, బీదవర్తకుఁడొకఁడు దాసుగారినిజీరి మిగుల సన్మానించి, తన యంగడియందున్న పదార్థములలో శ్రేష్టములై చెన్నారు పుట్నాలఁగొన్నిటి నర్పింప, వాటినిగ్రహించి భక్షింపుచు, పౌరోహితుండగు ధర్మశాస్త్రిగారి గృహంబున కేగి, స్వీయాగమన కారణంబెటిగింప నాతండు వినివిననివాని వలె నటించి కపట మందహాసపూరితుండై, 'దాసుగారేమిటో భక్షింపుచున్నారు!' అనియడిగిన, 'తప్తచణక శకలములు తెడ వర్తి వెంకయ్యశ్రేష్టిగారు భక్తితో నర్పింప భక్షింపుచున్నాను గాని, నేడు మాతండ్రిగారి యాబ్దీకము; తాము భోక్తకు దయచేయవలయు'నని ప్రార్థనాపూర్వకముగా బలికిన దాసుగారికి “ధర్మశాస్త్రి బ్రాహ్మణుఁడైన వాఁడెవ్వడును నీయింట భుజింపడు. దురాచారపరుండవై తండ్రి తద్దినము రోజుగూడ అభక్ష్యా భక్ష్యములెఱుంగక వైశ్యుఁడర్పించిన శనగపప్పు భక్షించుచు తగునని నన్నెటుల భోక్తకురమ్మని పిలచితివి? సిగ్గులేక నీవుపిలచిన పిలతువుగాక, నేనెటుల నీయింటికిరాగలను పోపొమ్ము. నేనగాదీ యూరంగల బ్రాహ్మణుఁ డెవ్వడును నీయింట భుజింప”డని దూరనాడిన, ధర్మశాస్త్రి ననేకవిధములఁ బ్రార్థించియు ప్రయోజనముఁగానక, గృహం

బునకేగి జరిగినవిధమంతయు భార్యకెఱిగించి. "రామాజ్ఞానుసరణి కార్యములు గట్టెక్కఁగలవు. కాన నీవు శంకింపక నన్నాదికముల పచనముగావింపు"మన నా సాధ్వీమణి యట్లే గావించుచుండ నంతలో నిరువురు దూరాధ్వగులగు బ్రాహ్మణులేతెంచిన భక్తిప్రపత్తు లుల్లసిల్ల వారిని భోక్తలుగా నియమించుకొని శ్రాద్ధము పరిసమాప్తి గావించి కృతకృత్యుండయ్యె.

ఇట్లమానుషక్రియల ననేక మాంధ్రలోకమున నెల్లడించి తన డెబ్బదిరెండవయేట పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మలోకమును గడించె.



లీలాశుక (బిల్వమంగళ)

రచయిత : శ్రీ పన్నాల లక్ష్మీనరసింహంగారు

" The Glory of the Divine Name cannot be established through intellect and reason but it can be experinced through Faith and reverence only. "
— "Mahatma Gandhi."

భగవన్నామమహిమ తెలియవలయునంటె ప్రజ్ఞావాదముచే అసంభవము- గాని కేవలము శ్రద్ధ, విశ్వాసముచేతనే సాధ్యపడును.

శ్లో॥ భవానీశంకరౌ వందే, శ్రద్ధావిశ్వాసరూపిణౌ,
యాభ్యాం వినా నపశ్యంతి, సిద్ధాః స్వాంతస్థ మీశ్వరం ॥
— "తులసీదాసు."

శ్రీ బిల్వమంగళుడు మొదట మహాభక్తుడైనను, ప్రారబ్ధవశమున మార్పుచెంది, పరమశ్రద్ధ, విశ్వాసములతో భగవన్నామస్మరణవలననే, మరల ఉద్ధరింపబడిన మహానుభావుడు. అతని జీవిత చరిత్రవలన మనకు బోధపడు విషయం "భగవన్నామమునందు అచంచల శ్రద్ధవిశ్వాసమే" గావున వారి జీవితము మనకు రాజబాటవంటిది. వారివలె, మనము నిరంతర భగవన్నామ స్మరణజేసి తరింతుముగాక !

శ్లో॥ కరారవిందేన పదారవిందం
ముఖారవిందే వినివేశయంతం,
వటస్యపత్రస్య పుటేశయానం,
బాలం ముకుందం మనసాస్మరామి॥

పరమపవిత్రమగు కృష్ణవేణీ నదీ తటమందు "కొల్లూరు" అను నొకగ్రామము కలదు. అందు వేదాధ్యయనపరుడు, సకల ధర్మశాస్త్ర వేత్తయునగు "రామదాసు" అనునొక బ్రాహ్మణోత్తముడు కలడు. ఈతనికి "బిల్వమంగళుడు" క్రీ॥ శ॥ 17వ శతాబ్దియందు గలిగెను. బిల్వమంగళునికి యథాకాలమున చౌలోపనయ నాది సంస్కారములుగావించి, గురుకులమునకు పంపిరి. బిల్వ మంగళుని బాల్యమంతయు గురుకులవాసముననే గడచినది సకలశాస్త్రములు, వేదాధ్యయనము చేసెను. పూవు పుట్టి గనే పరిమళించునన్నటుల బిల్వమంగళునికి, భగవద్భక్తి, అతిథిసేవ మొదలగు సద్గుణములు అలవడెను. యీ బాల్య కాలముగడువగా, బిల్వమంగళునికి, "ముక్తాంబ" అను కన్యనుయిచ్చి వివాహము చేసిరి.

ఇటులుండ ఒకరోజున కొందరు భక్తులు యీ క్రింది విధముగా సంకీర్తన చేయుచు వెళ్లుచుండిరి.

నామం:- గోవింద, ఘనశ్యామ, గాతేచలో, విషయోంసె, మన్‌కో, హటాతేచలో ॥.

ఈ భక్తులనందరిని వారింటికి ఆహ్వానించి, సత్కరించి, మరునాడు వారిని పంపివేసెను. ఇట్లు మహాభక్తిచేయుచు బిల్వమంగళుడు కాలముగడపుచుండెను. కాలాంతరమున బిల్వ మంగళుని తల్లిదండ్రులు గతించిరి. పైతృకసంపదఅంతయు బిల్వమంగళుని స్వాధీనమాయెను.

శ్లో॥ యౌవనం ధనసంపత్తిః,
ప్రభుత్వ మవివేకితా,
ఏకైక మప్యనర్థాయ,
కింయత్ర చతష్టయమ్॥

అనగా యౌవనము, సంపద, అధికారము, అవివేకము ఇవి ఒక్కొక్కటియే అనర్థము చేకూర్చును. నాల్గును నున్నచో చెప్పున దేమి?

బిల్వమంగళునికి పూర్తిగా స్వేచ్ఛకలిగినది. అదుపులో నుంచువారు లేరు. అందువలన అతడు క్రమముగా దుస్సాంగత్యమువలన యుక్తాయుక్త వివేచనా శూన్యుడాయెను. సాంగత్యదోష మెంతటిపనినైనను చేయించునుగదా? బిల్వమంగళుడు దుష్టసాంగత్యముచే అనేక వ్యసనములకు లోనయ్యెను.

ఒక దినమున ఆగ్రామములో పెద్దలందరు కలసి "చింతామణి" యను వేశ్యయొక్క నాట్యము ఏర్పాటుచేసిరి. పండితులు, రసికులు, విలాసులు ఆమె నాట్యము చూడ నేగుచుండిరి. బిల్వమంగళుడుగూడ మిత్రులవెంట నర్తనశాల కేగెను.

"చింతామణి" భూలోకసుందరి. హావభావముల చక్కగ నభినయించుచు నాట్యము చేయుచుండెను. చింతామణియొక్క సౌందర్యమునకు, అభినయమునకు బిల్వమంగళుడు అచ్చెరువొంది ముగ్ధుడాయెను. తుచ్ఛమును నీచమునగు ఆమెశరీరమునకు, తనశరీరము, మనస్సు, ఇంద్రియములు,

కులము, మర్యాద, ధర్మములు, వేయేల తనసర్వస్వమును, అర్పించెను. సర్వకాల సర్వావస్థలయందు చింతామణిస్మరణ దప్ప వేరొండు లేదు. బ్రాహ్మణ కుమారుడు పూర్తిగా పతితు డయ్యెను.

ఆహా, స్త్రీ <u>మోహితుడగు వానికి యితరము లేవియు అవసరముండదుగదా!</u>

ఇటులుండ బిల్వమంగళుని యింటిలో ఒకనాడు తండ్రి ఆబ్దికము వచ్చెను. విహితధర్మకర్మాచరణాసక్తులగు పురోహితుల బలవంతముచేతను, పితృకర్మాసక్తిగల యిరుగు పొరుగువారియొక్క మందలింపుల చేతను, బిల్వమంగళుడు నాడు యింటనుండక తప్పినదికాదు. శ్రాద్ధము జరుగుచున్నంత కాలము మనస్సులో చింతామణి చింతనయే. శ్రాద్ధము నెటులో పూర్తిచేసి చింతామణి గృహమునకు పోవుట కుద్యుక్తు డయ్యెను.

బిల్వమంగళుని భార్య ముక్తాంబ మహాపతివ్రతాశిరోమణి. శ్రీమద్భాగవతములో చెప్పినట్లు భర్త పతితుడైనను, దైవముగా భావించుచు ఆయన చిత్రపటమును, నిత్యము భక్తితో పూజించుచు, ఆయన నడతను మార్పు చేయించవలసినదిగా శ్రీకృష్ణ పరమాత్మను

నిరతము నామామృతమును
మరపింతయు లేక నీదు మనమున నెప్పుడున్।

మరి మరి గోరిలుచు నుండెడి
పరమకృపాబ్ధీ! గ్రహింపు వందనశతమున్॥
అని ప్రార్థించుచుండెను.

ప్రయాణోన్ముఖుడైన భర్తను సమీపించి, "నాథా, నేడు పైతృక మాచరించితిరిగదా? గావున యీరోజు గృహముననుండి, రేపు ఉదయమే చింతామణిగృహమున కేగుదురు గాక, పితృకర్మ సిద్ధించగలదు" అని అనేక విధముల ప్రార్థించెను. గాని అతని హృదయము ఎన్నడో ధర్మశూన్య మగుటచే, ఆమె మాటలు చెవిటివానికి శంకూదినట్లాయెను.

చింతామణి గృహము నదికి ఆవలతీరమున కలదు. బిల్వమంగళుడు ఎటులనో నదీతీరముచేరెను. దాదాపు సాయం సమయమగుచుండెను. దైవవిధానము అతివిచిత్రముగదా!

ఆకాశమున చిన్న మేఘములు బయలుదేరి క్షణములో చూచుచుండగనే ఝుంఝూ మారుతములు వీచసాగెను. కుంభవృష్టి ప్రారంభమాయెను. అహర్నిశలు నిర్భయులై నదీ మధ్యమున సంచరించు నావికులు, తమనౌకలను తీరమునజేర్చి వృక్ష మూలముల నాశ్రయించి, ప్రాణముల నరచేతబెట్టుకొని యుండిరి.

ఈ పరిస్థితులను జూచుచున్న ముక్తాంబకు ఒక్కమారుగా భయము, ప్రేమయు గలిగినది. తననాథు డెటులైనను యీ రోజున చింతామణి గృహమునకుచేరక మానడని నిశ్చయించి, భర్తను మనసార ధ్యానించి, సమస్త దేవత

(12)

లకు నమస్కరించి, ఆరాత్రిసమయమున ఒంటరిగా నదీ తీర మునజేరి, ఓనదీ దేవతలారా!

గీ॥ "ఈ ప్రవాహంబుదాటగ నెంచువిభుని,
కూతిగా సంఘటింపించి ప్రీతినించి,
యీ శరీరాని కమలత్వమివ్వరాగె,
వాహినీ దివ్య దేవతా పంక్తులారా॥"

అని ప్రార్థనచేయుచు నదిలోదూకి ప్రాణములు విడ చెను. ఇట్టి భయంకరదృశ్యములు బిల్వమంగళునికి యించు కైనను ఔదాసీన్యము గలుగలేదు. తన్నా నదిని దాటించిన, కోరినంతడబ్బు యిచ్చెదనని నావికులను బ్రతిమాలుకొనెను, గాని నావికులు యీతని ప్రార్థనను నిరాకరించిరి. వేరొం డుపాయము గానక "కామాతురాణాం, నభయం నలజ్జా" అను నార్యోక్తిప్రకారం నదిలో దుమికెను. ప్రవాహమున కొట్టుకొని పోవుచుండెను. పైవశమున నుదేసమయమున నీటిప్రవాహమున కొట్టుకొని పోవుచున్న శవమును గొయిక దారుఖండముగా భావించి దాని యాధారమున తీరమున జేరెను. చాల చీకటిగా నుండెను. మనుష్య సంచారముగూడ లేకుండెను. ఎట్టకేలకు అతడు చింతామణి గృహము చేరెను.

నాడు పైతృకమగుటచే బిల్వమంగళుడు రాడని యెంచి తలుపులు గట్టిగా బిగించుకొని చింతామణి గాఢనిద్ర పోవు చుండెను. బిల్వమంగళుడు ఎంతపిలచినను పలుకలేదు. వనుక ప్రక్కనున్న గోడమీాద ఆతనికి ఒకత్రాడు వ్రేలాడుచున్న

టుల గోచరించెను. దాని సహాయమున లోపలికి దుమికి చింతామణిని సమీపించెను.

ఆమె యీతనినిచూచిన వెంటనే యింటిలోనికివచ్చిన రీతిని ప్రశ్నించెను. దారుఖండమూలమున నదినిదాటి, రజ్జు సహాయమున గృహమున ప్రవేశించినటుల జవాబుచెప్పగా, ఆతని సమాధానమువిని దీపముచేబూని గోడమీదగల రజ్జువునుచూడ, అచ్చట ఒక నల్లత్రాచుపాము వ్రేలాడుచుండెను. వెంటనే ఆశ్చర్యమునొంది నదీతీరమున కేగిచూడ అది ముక్తాంబశవమయి యుండెను. యీ దృశ్యములుచూచి చింతామణి నిశ్చేష్టురాలాయెను. బిల్వమంగళుడుగూడ శిలా విగ్రహముమాదిరిగా స్తబ్ధుడాయెను. ఇది అంతయుజూచి చింతామణి బిల్వమంగళునిగురించి యీ క్రింది విధముగా బోధించెను. "ఓయీ! నీవు బ్రాహ్మణుడవు సర్వధర్మముల నెరింగిన పండితుడవు. విశేషించి నేడునీ తండ్రిశ్రాద్ధము కాని నీవు చీముసెత్తురు, వస, మలమూత్రములతో కూడిన నా ఈ శరీరమున మోహితుడవై సర్వవిధ ధర్మకర్మల విసర్జించి, యీ భయంకర నిశీధివేళ, భార్య శవసహాయమున నిటకు వచ్చితివి. పండువంటి సంసారమును నాశనము చేసి కొంటివి. అంతియేగాక నీ పాపమునకు నిష్కృతిగలదా? యీ విషయమందు నేను భాగస్వామినే, నా పాపమునకు మాత్రము శాంతికలదా!

నేడు నేను పరమసుందరినని భావించి, పిచ్చివాడవైతివి. కాని నా ఈ శరీర సౌందర్యముగూడ ఈశవము వలెనే ఒకప్పుడు పరిణామము చెందును గదా.

గాని, నా మీదనూపిన ప్రేమలో సహస్రాంశమయి నను, ఆభువన మోహనుడగు శ్యామసుందరమూర్తిని కలసి కొనుటకు వ్యాకులముతో పరుగిడి, సర్వకాల సర్వావస్థల యందు, అతనిని స్మరించి ధ్యానించిన, పునరావృత్తి రహిత శాశ్వతగతిని పొందియుండే వాడివిగదా ?

చింతామణియొక్క యీ వాక్యములకు బిల్వమంగళుని హృదయము కరిగిపోయెను. చిన్ననాటి భక్తి, ధర్మపరాయణత్వము శాస్త్ర చింతనము జ్ఞాపకమువచ్చెను. నేత్రము నుండి అశ్రుధారలు జలజల రాలెను. వెంటనే చింతామణి పాదములు పట్టుకొని, "తల్లీ, నీవు నేడు నాకు దివ్యదృష్టిని ప్రసాదించితివి. నీవు చింతామణివి కావు, నాయొక్క నీవు ఆ శ్యామసుందరమూర్తివే, ఆశీర్వదించి శెలవొసంగుము. ఇవియే అనేక సమస్కారములు," అని ప్రార్థించెను.

"అద్యమే సఫలం జన్మ సుప్రభాతాచమేనిశా" అనుచు కృష్ణధ్యాన మొనర్చుచు.

నామం:- శ్రీకృష్ణ, గోవింద, గోపాల్ శ్యామ్, రాధా మాధవ
రాధిక శ్యామ్, గోవింద, గోవింద, గోపాలశ్యామ్ శ్యామ్।
శ్యామ్, రాధే రాధే, కృష్ణా కృష్ణా, రాధే రాధే.

ఎక్కడికో, ఎందులకో తెలియక బయలుదేరెను. కొన్నిరోజు లయినతర్వాత, "ముఖ్యతస్తు మహత్కృప ఏవ" అని శాస్త్రములు చెప్పుచున్నవి గావున, ఒకసద్గురువును ఆశ్రయించి వారివలన ఉపదేశమును పొందనిశ్చయించుకొనెను. కృష్ణాతీరమున "సోమగిరి" యను మహాత్ముని

గురువుగా బడసి ఆయనవలన 'గోపాలమంత్ర' ముపదేశము బొంది ఆయన ఆజ్ఞతీసికొని,

కం॥ "ధీరులు, నిరపేక్షులు, ఆత్మారాములు నైనమునులు, హరిభజనము, నిష్కారణము, సేయుచుందురు. నారాయణు డట్టివాడు సవ్యచరిత్రా." అనగా ("Devotion for the sake of devotion") పల్లెలు, పట్టణములు, ప్రయాణము చేయు చుండెను. కొన్నిరోజులు గడచిన తర్వాత పరమాత్మయాతని పూర్వసంస్కారములు అన్నియు నశించినవో, లేవో యని పరీక్షింపనెంచి, త్రోవ మధ్యమున ఒక పరమ సుందరిని పంపెను. ఈయువతిని చూడగనే ఆతనికి మనస్సు చలించెను.

భగవద్గీతలో చెప్పినప్రకారం

శ్లో॥ యతతోహ్యాపి కౌంతేయ।
పురుషస్య విపశ్చితః।
ఇంద్రియాణి ప్రమాథీని
హరంతి ప్రసభం మనః॥

"అనగా! ఓ అర్జునా బలవత్తరమైన ఇంద్రియములు భగవంతుని బొందుటకు యత్నించుచున్న, పండితుని మన స్సునుగూడ బలవంతముగా నాకర్షించును" ఆబిల్వమంగళునకి మరల మోహము జనించెను. భగవంతుని పూర్తిగామరచి, ఆయువతి నెంటపడెను. ఆమె తన యింటిలో ప్రవేశించగా బిల్వమంగళుడు ఆమెయింటివాకిట కూర్చుండెను. ఇంతలో గృహయజమాని బయటకువచ్చి, యీదీనునిజూచి, అతడు ఏపనిమీద వచ్చితివని ప్రశ్నింప "అయ్యా!లోనికేగిన,యువతిని

మనసార ఒక్క పర్యాయము" చూడదలచి కోరితి నని సమాధానము చెప్పెను. నిష్కపటియగు, ఆబ్రాహ్మణుడు తన భార్యను చూడదలచి, ఆమెను పిలచికొని వచ్చుటకు యింటి లోపలికి వెళ్లెను.

ఒక్క పర్యాయము ఆదీనబంధుని సేవింపగోరినవాని యోగక్షేమభారమును ఆసర్వవ్యాపివహింపడా!

శ్లో॥ అనన్యాశ్చింతయంతోమాం,
యేజనాః పర్యుపాసతే,
తేషాం నిత్యాభియుక్తానాం,
యోగక్షేమం వహామ్యహం॥

నేడు బిల్వమంగళుని సరిదిద్దుభారము వాఁడే వహించెను. అజ్ఞానాంధుడగు ఆబిల్వమంగళునికి. దివ్యచక్షుస్సులను ప్రసాదించెను. ఆతని హృదయము శోకభరితమయ్యెను. అతడు మ్లానహృదయుడై తలయెత్తెను. ఎదుట ఒక బదరికా (రేగు) వృక్షము కనుపించెను. భక్తిభావము చెలరేగెను. అతడా రేగిచెట్టునుండి రెండుముండ్లను తుంచి తెచ్చెను. ఇంతలో గృహస్థుని భార్యగూడ వచ్చెను. బిల్వమంగళుడు, ఆమెపై ఒక్క పర్యాయమునాచి, "ఓ అభాగ్య నేత్రములారా! మీరెంతటిదుర్మార్గము నాచరించుచుంటిరి." యని పలుకుచు యాబిల్వమంగళుడు ఆయచంచల నేత్రములకు దండనవిధించుట యుక్తమనితలచి, ఆరెండు కంటకముల చేతను రెండు నేత్రములను పొడచుకొనెను. రెండు నేత్రములనుండి నెత్తురు వరదలుగా పారజొచ్చెను. బిల్వమంగళుడు ఆనందముతో హరికీర్తన గావించుచుండెను.

నామం:- "గోవింద జైజై ! గోపాల జైజై! రాధారమణహరి, గోవింద జైజై" అని, గృహమేధి ఆయన భార్య మిగుల సుఖిం చిరి. గాని వారునిరుపాయులుగదా? బిల్వమంగళునికి అజ్ఞాన మంతయు నశించెను.

ఆశ్యామసుందరిని దర్శించుటకు ఆయన చాలవ్యా కులపడసాగెను. ఆకలి దప్పులు పూర్తిగానశించెను. పల్లెలు వనములు ఆయన సంకీర్తనలచే ప్రతిధ్వనించుచుండెను.

శ్లో॥ శ్రీకృష్ణ! విష్ణో! మధుకైటభారే!
భక్తానుకంపిన్! భగవన్! మురారే!
త్రాయస్వ మాం కేశవ! లోకనాథా!
గోవింద! దామోదర! మాధవేతి.

శ్లో॥ విక్రేతు కామాకిల గోపకన్యా।
మురారి పాదార్పిత చిత్తవృత్తిః।
దద్యాధికం మోహవశా దవోచత్।
గోవింద! దామోదర! మాధవేతి॥

యీ మాదిరిగా గోవింద, దామోదర స్తోత్రము చేయుచు ఒక ముళ్లపొదమీదపడి, "కృష్ణా, కృష్ణా" యనుచు నిరంతర నామస్మరణ చేయుచుండెను. ఇట్టిస్థితిలో ప్రేమపూర్ణు డగు పరమాత్మ ఎట్లువూరకుండగలడు!

ఒకరోజున పరమాత్మ ఒక సుందరబాలక వేషము వేసికొని బిల్వమంగళుని సమీపించి, "తామెవరు? తమకు చాల ఆకలిగాయున్నట్లున్నది. కనుక కొంచ మాహారము తీసికొనివచ్చితిని. మీరు దీనిని స్వీకరించి ఆనందించండి".

నామం:- రాధారమణ, మదనమోహన, బృందావనా ।
చిన్ని కృష్ణా ॥ శ్యామసుందర, మదనమోహన,
బృందావనా, చిన్ని కృష్ణా॥ సాధుజన మనోవిహారా,
సర్వాధార ధీరకృష్ణ, మాధవ గోవిందకృష్ణ, మధు
రిపు గోపాలకృష్ణ ॥

అని పాడుచు బ్రహ్మానందములో, మహాయోగి స్వప్రభ మగు ఆ ప్రసాదముల స్వీకరించి, హర్షపులకిత గాత్రుడయ్యెను గద్గదస్వరముతో, "స్వామీ ! మీ పేరేమి ? మీ నివాసమెచట? మీరేమి చేయుచుందు"రని ప్రశ్నించెను.

ఆ మాయవేషధారి, "నా ఇల్లు ఇచ్చటనే, నాకొక పేరని నియమము లేదు. నన్ను ఎవరెట్లు ఆశ్రయింతురో వారిని అట్లే నేను అనుగ్రహించెదను".

శ్లో॥ యే యథా మాం ప్రపద్యంతే,
తాం స్తథైవ భజా మ్యహం,
మమవర్త్మాను వర్తంతే,
మనుష్యాః పార్థ సర్వశః॥

బిల్వమంగళుడు ఆమధురవాక్యములు విని బ్రహ్మానందము జెందెను ఆగోపబాలుడు నవ్వుచు, "తమకు ప్రతిదినము ప్రసాదము తెచ్చియిచ్చెదను తాము స్వీకరించండి" అని చెప్పగా అందులకు బిల్వమంగళు డంగీకరించెను.

అదేమిచిత్రమోగాని బిల్వమంగలుడు అప్పటినుండి తైలధారవలె అవిచ్ఛిన్నముగా నామస్మరణచేయుటకు ప్రారంభించెను.

ప్రార్థన:–"గీ॥ దేవా, నీచరణ ప్రసాదకణ లభ్యింగాక, లేకున్న
నొండే వెంటన్ జనునీమహామహిమదానూహింప నెవ్వారికిన్,
నీవారైచనువారిలో నొకడనై, నిన్గొల్చు భాగ్యంబు,
నాకీవే, యిప్పటి జన్మమందైన, నొండెందైననో ఈశ్వరా॥"

నామం:– రాసలీలలోల చిన్ని, గోపాలబాల,
గోపాలబాల రాధికాలోల,
బాలకృష్ణ నీలీల, నేనెన్న జాల,
జాలనేల యశోద, బాలగోపాల,
కరిరాజపాల, కరుణాలవాల,
కనకాసుచేలా, తులసీవనమాలా,
పాండురంగ వేణునాద, గోపాలబాల ॥

ఆ పరమాత్మ ప్రతిరోజు తెచ్చిపెట్టుచున్న ప్రసాదమును స్వీకరించుటచే ఆయనకు భక్తి మరీ హెచ్చుసాగెను. బిల్వమంగళుడు ఎవ్వరికై తమ సర్వస్వమును సమర్పించెనో, నేత్రహీనుడయ్యెనో, అత డీబాలుడని గ్రహించెను. ఎల్లప్పుడు యీతని మాటలు వినుటయందే, మనస్సు లగ్నముచేయుటచే బిల్వమంగళుడు ఆపదలన్నియుతీరి, స్త్రీ వ్యామోహామునుండి విడువడి, మరల యీ గోపబాలకుని మోహామున జిక్కుకొంటినని తలచుచుండగా, ఆశ్యామసుందరమూర్తి, "అయ్యా, యేమో ఆలోచించుచున్నారే, నేను నేడు బృందావనము వెళ్లుచుంటిని. తమరుగూడ దయచేయుదురా" యని అడిగెను.

"నాయనా, నేను అంధుడనుగదా! బృందావనము నకు ఎట్లురాగలను?" అనెను. అందులకు, శ్యామసుందరుడు "చూడు. ఇదిగో, నా కర్ర. నీవు దీనిని బట్టుకొనుము. నేను బృందావనమునకు తీసికొని వెళ్ళెదను" అని చెప్పగా, బిల్వ మంగళుడు బ్రహ్మానందముతో, శ్రీకృష్ణుని ముగళి పట్టుకొని యీ క్రిందివిధముగా ప్రార్థనచేసి, నామస్మరణతో బయలు దేరెను.

శ్లో॥ హే గోపాలక, హేకృపాజలనిధే, హే సింధు కన్యాపతే,
హేకంసాంతక, హే గజేంద్రకరుణాపారీణ, హే మాధవ,
హే రామానుజ, హే జగత్త్రయగురో, హే పుండరీకాక్ష, మాం,
హే గోపీజననాథ, పాలయ, పరం జానామి, న త్వాం వినా॥

నామం:- హరేరామ హరేరామ. రామ రామ, హరేహరే।
హరేకృష్ణ, హరేకృష్ణ, కృష్ణ కృష్ణ, హరే హరే॥

భగవానుడు భక్తునికి కర్రఇచ్చి, మార్గముచూపుచు తీసికొని వెళ్ళుచుండెను

భగవానునికి, భక్తులయెడ ఎంతప్రేమయో గదా!

శ్లో॥ అపిచేత్సు దురాచారో,
భజతే మామనన్య భాక్,
సాధురేవ సమంతవ్యః,
సమ్యగ్వ్యవసితో హి సః ॥

ఎంత దురాచారము గలవాడయినను, అన్యమును సేవింపక నన్నే సేవించుచుండునో యాతడు శ్రేష్ఠుడనియే తలంప వలయును. ఏమనగా, యతడు "పరమేశ్వర సేవచేతనే కృతార్థుడనగుదును" అను మంచి నిశ్చయముగలవాడు గదా!

ఇచ్చటనుండి కొంతదూరము వెళ్లిన తరువాత "ఇదిగో బృందావనమునకు వచ్చితిమి, నేనికపోవుచుంటిని", అని పరమాత్మ యనెను. బిల్వమంగళుడు కరమునువీడి బాలకుని హస్తమును బట్టుకొనెను. శ్యామసుందరుని హస్తస్పర్శనము చేత, ఆతనిశరీరమంతయు, విద్యుత్తు ప్రవహించి న-ములయ్యెను. బాలకరూపమున శ్యామసుందరుడు ఎదుటనుండుట అతడు గాంచెను. భగవంతుని హస్తమును గట్టిగ బట్టుకొని "శ్యామా! ఇప్పుడు నిన్ను గుర్తించితిని. చాల దినములకు నిన్ను నేను పట్టుకొనగలిగితిని, ప్రభూ! ఇకనిన్ను నేను విడువను." అని అనెను.

శ్రీకృష్ణుడు "వదలుము వదలుము"–అనెను. బిల్వమంగళుడు "కాదు, కాదు. ఎన్నటికిని, నిన్ను నేను వదలను" అని గట్టిగా చేతినిబట్టుకొని,

" తే॥ దొరకితివి నీవు, నిశ్శంక దొడ్డదొరవు,
నాదువిందును గైకొని, నన్ను ధన్యు,
చేసితివి, నేను సంతసించితిగదయ్య,
అహహా, గోవింద, బాల మురారి శౌరి॥ "

శ్యామసుందరుడు గట్టిగా విదలించి, చేతిని విడిపించుకొనెను. గాని బిల్వమంగళుడు శ్యామసుందరుని "అనన్యభక్తి" యను రజ్జువుచేత హృదయమున బంధించి వేసెను. ఆరజ్జువును త్రెంచుకొనుట నాతనికిగూడనసాధ్యముగదా ? చేతిని విడిపించుకొని, మందహాసముతో వాలుచూపులు చూచుచు, నేగుచున్న శ్రీకృష్ణుని జూచి బిల్వమంగళు డిటుల బ్రతిమలాడుకొనెను.

"క॥ రారా, ముద్దులకృష్ణ,
రారా, రంగయ్య గోపరాజకుమారా,
రారా, ప్రియమున నిచ్చెద
కోరిన భక్ష్యంబు లివ్వి. కొనుము భుజింపన్॥

క॥ కలయో, నిదగు మాయయో,
తెలియంగజాల, సూక్ష్మదృష్టినినైనన్,
అలయించి, పారిపోవకు,
పలుమోసంబేల, గోప బాలా కృష్ణా॥

క॥ శబరీకాసందష్ట సంచితాంబులుగావు
పక్వ గేహారామఫలము లివిగో,
అల కుచేలుని పాతయటుకులు గావివి,
గరమాగరము, నేతి గారెలివిగో,

ద్రౌపదీపాక పాత్రస్థ శాకముగాదు,
భోజ్యోత్కృష్ట, శుద్ధాన్న పుంజ మిదిగో,
వల్లవీ ప్రేషిత పయ్యషితముగాదు,
వేడి వేణ్పొంగలి చూడు మిదిగో ॥

తే॥ భక్తియుక్తుల. జలశాక పత్రములును
నీకు నమృతమటంచును, నేను వింటి
కాని వారలెవ్వారొ యనన్యభక్తి,
నాకు లేదని యోచించినావొ కృష్ణ ॥

చ॥ నిలునిలు పోకుపోకు మిదె, నీరజనాభ యనుగ్రహింపుమా
నిలునిలు పోకు పోకు మిదె, నన్విడనాడిన మేలుగల్గునే

నళినదళాక్ష! యింత కఠినత్వముబూనుట యేటిన్యాయమో
తెలుగుట మేలె, నావలన తప్పులు గల్గిన సైచుటొప్పదే ॥

తే॥ ఏను వెన్నంటి తరుమంగ లేను నిన్ను,
బలము లేకుంట, నే నింక నిలువ నెంతు,
ప్రభుడ నీచిత్తమే నాదుభాగ్యమగుట
వలన, నీకిష్టమగుచోట, నిలుము కృష్ణ॥

యింత ప్రార్థనచేసినను స్వామి నిలువలేదు. అప్పుడు స్వామిని:

"సీ॥ వసుదేవనంద దేవకియశోదలకు, నీ
పోకల నెల్ల "రిపోర్టు" చేతు,
ప్రహ్లాదు ముచుకుంద పార్థముఖ్యులకు, నీ
గడుసుచేష్టలు "టెలిగ్రాము" సేతు,
అక్రూరవిదుర, భీష్మాంబరీషులకు. నీ
చేష్టలు నే "బ్రాడుకాస్టు" చేతు
నీదు పిల్లాటలు, మీఁదిలోకములకు
కడువడి "కేబులుగ్రాము" సేతు, "

తే॥ కోరి నే నిచ్చుఫలముల గొనవదేని,
కేవలుండవు, నిర్గుణి వీవటంచు,
"వాలుపోష్టుల" భిత్తికాపాళియందు,
తెలియనంటింతు ఝుడియను తెలిసికొమ్ము ॥

శ్లో॥ హస్తమాక్షిప్య, యాతోసి బలాత్ కృష్ణ, కిమద్భుతమ్,
హృదయాద్యది నిర్యాసి, పౌరుషం గణయామి తే॥ "

"చేయి వదలించుకొనిపోవుటలో నాశ్చర్య మేమున్నది? నాహృదయమునుండి కదలుము. నీ పౌరుషము తెలియును." అని పలికింప, భగవంతుడు డాబిల్వమంగళుని విడువలేకపోయి అతని ప్రీతికై బ్రహ్మానందభరితుడై

తే॥ పిల్ల జాబిల్లి శిరమున బెట్టువాడు,
భక్తజనముల రక్షకై బూనువాడు,
గౌరి వామాంకమున జేర్చి కరుణతోడ,
సాంబుడప్పుడు నాకు సాక్షాత్కరించె.॥

అప్పుడు శ్యామసుందరుడు బిల్వమంగళుని సమీపించి, యాతని నేత్రములను, తన కోమల మృదుహస్తములతో నొక్కసారి తాకెను. బిల్వమంగళుని నేత్రములు సాటిలేని ప్రభాన్వితము లయ్యెను. ఆదివ్యనేత్రములతో స్వామిని ప్రత్యక్షముగా దర్శించి, యానందాశ్రువులతో ఆయన పాదములు కడుగుచు,

" శ్లో॥ నాన్యం వదామి, నశృణోమి, నచింతయామి,
నాన్యం స్మరామి, నభజామి, నచాశ్రయామి,
భక్త్యా, త్వదీయచరణాంబుజ, మాదరేణ
శ్రీ శ్రీనివాస! పురుషోత్తమ! దేహి దాస్యం॥ "

అని ప్రార్థించెను. భగవంతుడు ఆయనను లేవనెత్తి కౌగలించుకొనెను.

భగవంతుడు భక్తునిగొనుక్కయు, సుమధురసమ్మేళమునచేత జగమంతయు భక్తిభావపూరితమయ్యెను. దేవ

తలు పుష్పవర్షము కురిపించిరి. భక్తుడు భగవంతుడు ధన్యులైరి.

వేశ్యయగు చింతామణి, గృహస్థు మరియు నాతని ధర్మపత్ని దైవయోగముచే,

> శ్రీకృష్ణ గోవింద హరే మురారే, హే నాథ నారాయణ వాసుదేవ
> జిహ్వే పిబస్వామృత మేతదేవ గోవింద దామోదర మాధవేతి ॥

అని సంకీర్తనముచేయుచు నచటకు వచ్చిరి. పరమభక్తుడైన బిల్వమంగళునిప్రభావముచేత, భగవంతుడు వారందరకు తన దివ్యదర్శనము నొసంగి కృతార్థుల జేసెను.

బిల్వమంగళుడు తన జీవితశేషమంతయు భక్తిప్రచారము భగవద్గుణానుకీర్తనము జేయుచు యంతమున గోలోక ధామము నొందెను.



తూము లక్ష్మీనృసింహదాసు

రచయిత: శ్రీ మిన్నెకంటి గురునాథశర్మగారు

ఐహిక భోగాసక్తుల సాహచర్యాదికములచేఁ బ్రాణులకును భగవద్భక్తి సన్నగిల్లుచున్నది. హేతువాదములు మెండగుచున్నవి. ప్రత్యక్ష ప్రమాణమే ముఖ్యమగుచున్నది. “ఆత్మవత్సర్వభూతాని” యన్నట్లు కించిద్జ్ఞులగు తా మన్యుల మహిమాతిశయముల నమానుష కార్యముల సందేహించి వెక్కిరించుచున్నారు. “మురారే స్తృతీయః పంథా” యన్నట్లు విపరీతమైనను నవీనమార్గముఁ ద్రొక్కుటయే యశస్కరమయి నాస్తికత ప్రబలుచున్నది. అనుయాయులు దోడగుచున్నారు. కాంప్రస దుర్మతాంతరములు విజృంభించుచున్నవి. అయినను వేకువతఱి రిక్కలవలె నందందున్న భగవద్భక్తులకు మా దాసుగారిచరిత్రము వేడ్కఁగొల్పకపోదు

భక్తిలత కాలవాలమును, సంగీత సాహిత్యములకునికి పట్టును, ప్రసిద్ధమును, పవిత్రమును, నగువంశమున, తూము లక్ష్మీనృసింహదాసుగారు, క్రీస్తుశకము 1790 వత్సర ప్రాంతమున, నప్పయాఖ్యునకును వేంకమాంబకును నవతరించిరి వీరు గోలకొండ వ్యాపారులు ఆపస్తంబ సూత్రులు. యజుశ్శాఖాధ్యయనులు. వసిష్ఠశక్తిపరాశరాఖ్య త్రయార్షేయులు పరాశర గోత్రభవులు.

నృసింహదాసుగారి తాతగారు వేంకటకృష్ణయ్యగారు. వీరు గుంటూరు మండలము బాపట్లతాలూకాయందలి పొన్నూరుగ్రామమున నివసించుచు భావనారాయణస్వామిని సేవించుచుండిరి. వీరి కప్పయాఖ్యుండు జనించి బుద్ధిబలములతోఁగూడ దేహబలమును వహించి రాజగౌరవము నొందుచు, వేంకమాంబను బెండ్లాడి యే కారణముననో పొన్నూరు విడిచి గుంటూరుపట్టణముఁ జేరి స్వగృహమును నిర్మించుకొని కాపుర ముండిరి.

హరిభక్తిపరాయణులగు నాపుణ్యదంపతులకు లక్ష్మీనృసింహదాసు, కృష్ణదాసునా నొప్పు పుత్త్రద్వయమును, రుక్మాబాయి నాఁబరగు ముద్దుకూతురును జనించిరి. రుక్మాబాయిని జగ్గూరావు వంశజులకిచ్చి పరిణయ మొనర్చిరి. ఆ లక్ష్మీనృసింహదాసు, కృష్ణదాసు నుచితసంస్కారములంది ఆంధ్రగీర్వాణవిద్యల నభ్యసించి రామభక్తులై యుండిరి. పిదప ''సంబ్రాజు'' వంశజాత సద్గుణోపేతయగులక్ష్మీబాయమ్మను, లక్ష్మీనృసింహదాసును, సీతమ్మయను బాలికను కృష్ణదాసును పరిణయమయిరి భగవద్భక్తశిఖామణియగు మన యీలక్ష్మీనృసింహదాసునకు సంతానము లేకపోయెను. సాధారణముగా భగవంతుఁడేలనో తనదాసుల కౌరసపుత్త్రుల నొసఁగకుండును. ఈ భక్తుఁడు పరమపదముఁ జేరిన వెనుక లక్ష్మీబాయమ్మగారు, మఱదికొడుకును రామదాసనాముని బెంచి నైదేహియను కన్యనిచ్చి వివాహము చేసెను. వార

లును నిస్సంతానులైరి. అంత నా దేహమ్మయు భర్త మరణానంతరము తూము లక్ష్మణరాయనాముని బెంచికొనియె. వారికొడుకులు నూఁతుండు భద్రాద్రి నేఁటికింగలరు.

మన లక్ష్మీనృసింహదాసుగారు బాల్యమునుండియు రామభక్తుఁడై నడచుచున్న యడుగడుగునకు "రామ" "రామ" యనియు, మాటమాటకు "రామ" "రామ" యని మదిలో ననుకొనుచు నుండువాఁడు. పువ్వు బుట్టుటతోడనే పరిమళించుఁ గదా! తన కిరువదేండ్లు వచ్చినపిదపఁ దండ్రి స్వర్గస్థుఁడగుటఁ గుటుంబభార మధికమై కలంపఁ, బొన్సారులో పేష్కారు వేతనమున దినములు గడుపుచుండినను, రామభజనము నతిథ్యభ్యాగతసేవనము, నాంధ్రకవితారాధనముమాత్ర మేమర కుండెను. అట్టు లెన్నిదినములో జరుగలేదు. దాస్యము స్వాతంత్ర్యము నడంచుంగదా! రామసేవ కుద్యోగధర్మ మంతరాయమగుడుఁ, దృణంబుంబోలె నాపేష్కారు పదవిని విసర్జించి, సమర్థుఁడగు గురువునొద్ద ఘోరసంసార పారావార తారకమ్మగు తారకమంత్రరాజముం గోరి కైకొని, తనయింట రామమందిరము నిర్మించి భద్రాద్రి సీతారామ విగ్రహముల నిల్పి నిత్యము భజించుచు. గద్య పద్యాదులచేఁ బొగడుచు నెన్నియేని భక్తిబోధక శతకమ్ముల గేయమ్ముల రచించి సుప్రసిద్ధుఁడై యుండెను.

అన్నదానము పునర్జన్మహేతువని వాదించుట లోభులకును, ఆచరణశూన్యులై "అహం బ్రహ్మాస్మి" యని నాల్కతుదచే సుస్మితులై యుచ్చరించి తెప్పరలెగుర వేయు దాంబికుల

కను, కాపథగాములై పుణ్యాపాపంబు లాత్మకంటవను పండిత బ్రువులకును జెప్పఁజాలను.గాని ముక్తికి భక్తియు భక్తికిఁ దీర్థసేవయుఁ గారణములు గాకపోవు. తామెందుం గాఁఱగాక భక్తులంజూచి యోగులమాత్రము పొగడియు, యోగులఁ జూచి జ్ఞానులనే కొండాడియుఁ దవితరుల దూషించువారు తీర్థయాత్రాపరుల గేలిసేయుదురోటు? శివశర్మాదులు తీర్థ యాత్రలఁ గృతార్థులుగా లేదా? నేఁడు ధూమశకటాదులవలన దూరమ్ము సయితము దాపగుచున్నది. పూర్వమో? కాశి కేగుట, కాటికేగుటతో సాటియఁట (అనగా దిరిగిరారనుట). రైళ్ళలోఁగూర్చుచుండి యనాయాసముగా యాత్రలసేవించిన ఫలముకవేళ నంత లేకుండునేమో యని వాదమున కొప్పు కొన్ననుగాని, నడకతో వివిధశ్రమలకోర్చి కష్టసుఖంబుల ననుభవించుచు, ననేక గ్రామప్రజల యన్యభాషా సల్లాప దూషణ భూషణాదుల నాలకించుచు, నింద్రియ నిగ్రహము నలవఱచుకొనుచు, గామక్రోధములఁ గట్టినైచుచు, యధేచ్ఛా లాభసంతుష్టిమెయి జేయుయాత్ర భూతదయలు లోకజ్ఞాన మును, సౌభ్రాత్రమును, భక్తిని బెంపొందింప జేయకపోదని నమ్మకతీరగు. ఫలముగల్గకపోదు. అట్లగుటవలననే యాత్ర సల్పి వచ్చినవారిని స్వపౌరులు మేళతాళంబుల నెదుర్కొని మహావైభవంబున నింటికిం గొంపోయెదరు.

సీ॥ పొడిదగ్గు కంఠంబుఁ ♦ బొరిపుచ్చకయమున్న
తల ప్రకంపంబుఁ బొం ♦ దకయమున్న

బొమలుకన్నులమీఁదఁ ♦ బొసవి వ్రాలకమున్న
పారనేత్రములకడ్డు ♦ బారకమున్న
శ్రుతిపుటంబులశక్తి ♦ సురిగిపోవకమున్న
వళులాననమునఁ ♦ బర్వకయమున్న
హృదయంబులో జాగ ♦ పదనుదప్పకమున్న
గాత్రంబు శిథిలంబు ♦ గాకమున్న ॥

పండ్లు పేర్వాసి కదలుచూ ♦ పకయమున్న
కాకికడకంటిపై చూపు ♦ రాకమున్న
కాలుసేయాడు తఱియంద ♦ కదలవలయుఁ
దీర్థసేవకు దేహమ ♦ స్థిరముగాన.

(కాశీఖండము)

అనితలపోసి మనదాసుగారు క్రీస్తుశకము 1818-19 కి సరియగు బహుధాన్య సంవత్సర కార్తికమున శ్రీరంగమున కేగి రంగనిం గడునుప్పొంగుచు సేవించి " శ్రీరంగశాయి తారహారము " అను మకుటముగల సీసపద్యముల నిర్వ దేఁడింటిని సమర్పించి తిరిగి యింటికివచ్చెను. వీనినే దేవు నెప్పుడు దర్శించినను బద్యములతో బొగడక మగిడిరా లేదు.

కాశీయాత్ర క్రి॥ 1820-21.

తనమాతృదేవతయగు వేంకమాంబను నర్థాంగియగు లక్ష్మిబాయమ్మను, సోదరుఁడగు కృష్ణదాసును నుచిత వాక్యముల సమాధానపఱిచి విక్రమసంవత్సరము చైత్ర శు॥ ౧ శనివారము రేవతి నక్షత్రమున గుంటూరునుండి కతిపయాప్త

మిత్రులంగోఁ గదలి, యమరావతికేగి కృష్ణాస్నానమునఁ బవిత్రుఁడై భర్గుఁగానియాడి, దుర్గమారణ్యమార్గముల ననర్గళ భక్తి పరవశుఁడై నడచుచుఁ, గ్రమముగా భద్రాద్రికేగి శ్రీరామచంద్రమూర్తిని దర్శించి

సీ॥ అర్థికిచ్చినధనం ♦ బప్పుడె మఱచెదఁట
పదిలమోహోరామ ♦ బహుపరాకు
అపకార మొనరించు ♦ నతనిమఱచెదఁట
పదిలమోహోరామ ♦ బహుపరాకు
మఱచుట నీకిది ♦ మఱిసహజంబ ట
పదిలమోహోరామ ♦ బహుపరాకు
మహినున్న యీాదీను ♦ మఱచెద వేమొకో
పదిలమో హోరామ ♦ బహుపరాకు.

గీ॥ పద్మజాక్ష రమాధీశ ♦ బహుపరాకు
భక్తనరసింహపోషక ♦ బహుపరాకు
భద్రశైలోపరిస్థిత ♦ బహుపరాకు
భక్తమందార రఘువీర ♦ బహుపరాకు॥

ఇట్టి యనేక పద్యంబులం బరాకుఁదెల్పి మఱలఁ బయనంబై, దినక్రమమున నశ్వారావుపేట, కొవ్వూరు, రాజమహేంద్రవరము నావలఁ బిఠాపురముఁ జేరి కుంతిమాధవుఁ బూజించి, సింహాద్రికేగి వరాహ నృసింహస్వామికి మ్రొక్కి, కూర్మపురము దరిసి ఛులీశ్వరునిసేవించి జగన్నాధము దొరసి మార్కండేయాది పుణ్యతీర్థములఁ గ్రుంకి, జగన్నాధుని బిల్వ మహిమ కథలవినుచు నాతనికి నమస్కరించి.

పంచచామరము.

"పరాకు శ్రీరమాంగనాస్య పద్మ పద్మ బాంధవా
పరాకనంత పద్మజాండ వారపూరి తోదరా
పరాకుభక్త హృన్నివాస భవ్యదివ్య విగ్రహా
పరాకు దేవ మౌళిరత్న భాసితాంఘ్రి పంకజా ;

అనిపొగడి పంచరాత్రింబులు వసించి యటుగదలి బహుకష్టప్రయాణంబుల జాజిపురంబేగి యున్నదిని పైత్రిక క్రియల నిర్వర్తించి, మార్గశ్రమమ్మున నలసి కాశీదర్శన భాగ్యమున్నదో లేదోయని చింతించి, రేయియగుడు నిద్రింప సుస్వప్నంబయ్యెనట దాసుగారి పద్యములనే వ్రాసెదను.

సీ॥ బ్రహ్మాదులకునైనఁ ♦ బడయ సాధ్యముగాని
యప్రతి హతశక్తు ♦ డైననీవు
దురితాత్ముఁడంచు నన్ ♦ ద్రోయగాఁజూడక
యతిదీనుఁడీతఁడం ♦ చాత్మనెంచి
జాలి జనించి కాఁ ♦ బోలు నాపైని నీ
నిర్హేతుకప్రేమ ♦ నెగడఁజేసి
స్వప్నగోచరుఁడవై ♦ భయమెల్లఁదీర్చితి
మేలు నాకరయవే ♦ వేలుగాదె ॥

స్వాంతమున నాదుపట్ల ♦ నొక్కింతకరుణ
నీకుఁ గల్గినయెడలఁ ♦ ద్రి లోకములను
నాకు సముఁడుండగలఁడే ♦ య నాథరక్ష
దశరథకుమార రామభ ♦ ద్రాద్రిధామ ॥

సీ॥ నెఱవకు మటంచు నన్నిట్లు ♦ వెన్ను సఱచి
దయఁదలిర్ప గఁ దెల్పెడి ♦ దాతలెవరు
నాకు సముఁడుండఁగలడె ♦ యనాథరక్ష
దశరథకుమార రామ భ ♦ ద్రాద్రిధామ ॥

చూచితిరా? భక్తావనవ్రతబద్ధకంకణుఁడగు భద్రాద్రి రాముని కారుణ్యాతిశయము శ్రీరాముఁడు స్వప్నగోచరుఁడై వెన్ను సఱచి భయమువాపి పోయెనఁట. అదంభవ్యాపారుఁడగు దాసుగారి నుడులివి. ఆహా! నృసింహదాసా! ఎంతధన్యుఁడ వోయి! శ్రీరామభద్రపవిత్రహస్తస్పర్శభాగ్యము నందితివి! సద్భక్తుల స్వప్నంబులట్టిన, వారివిశ్వాసంబు నట్టిద. అంతనజ్ఞులు కొందఱు దాసుగారి స్వప్నవృత్తాంతమును భక్తి పారవశ్యమును జూచి పరిహసించిరఁట. అవును వారు—

గీ॥ క్షేమజంబని కొందఱు ♦ పెద్దలెల్ల
నవ్వి నిందింతు రాతప్పు ♦ నాదికాదు
దాసుఁడనుపేరు పెట్టించి ♦ ధరణియందు
ద్రిప్పిరక్షించు నీదెకా ♦ దేవ దేవ ॥

అనియు,

గీ॥ మించి జనములెల్ల ♦ మెచ్చుటకొఱకు వ
ర్తింపఁజాల లయకు ♦ సొంపుమీర
నెసఁగి పాడనేర నిల ♦ నప్రయోజక
తనువు దీనిఁ బ్రోచు ♦ దాతవీ వె॥

క॥ హరి నీయడుగుందమ్ముల ।
నరసి మదింగంటి నింక, నరివర్గముకే, నెఱవను జూమి,

అని నమస్కరించి పొగడి రామునికిఁ దనపైఁ గూర్మి కలదని యెఱింగి, నూతనోత్సాహసంరంభంబున పాదచారియై క్రమముగా బుద్ధగయకేగి యఫల్గూదకమగు ఫల్గునీనది దర్శించి ఫల్గునసారథిని స్మరించు. స్నానసంధ్యాదులను పైతృక విధులను నిర్వర్తించి యందందుంగల పుణ్యతీర్థములు మెట్టుచు, రామనామస్మరణము సలుపుచుం జని చని, దూరమ్మునం బుణ్యరాశియగు కాశిం గని.

సీ॥ రజతాద్రి యిచటికి ♦ రాబోలునే మొక్కో
కాను కాశీసౌధ ♦ కాంతిగాని

(అతివిస్తరమగునను భయంబున శ్రీదాసుగారు రచించిన పద్యములను సాంతముగా వ్రాయనైతి.)

అని వర్ణించుచు సంతోషాతిశయమున నృత్యము సేయుచు.

గీ॥ పాంచభౌతిక దేహంబుఁ ♦ బాసిజీవుఁ
డేగునప్పుడు సవ్యక ♦ ర్ణాంతరమునఁ
దారకబ్రహ్మ మంత్రంబు ♦ దయనొసంగు
హరుని కాపురమగు కాశి ♦ నరయఁగంటి ॥

అని యుప్పొంగి దరియంజని హృదయపీఠి విశ్వేశ్వరునిల్పి భావకుసుమంబులం బూజించి, జాహ్నవీ విమలతోయావగాహనమునఁ బవిత్రదేహుఁడై యవ్వలిదరి నొక

భూసురాహ్వానమున నతనియింట వసించి భక్తితాత్పర్య విశేషంబుల నిత్యము విశ్వనాథుని సేవించుచు బిందు మాధవు భావించుచు, భగవానుని దర్శించుచు, దండపాణిని విమర్శించుచు, దుండిని గొల్చుచు, భైరవునిబిలుచుచు క్రమక్రమముగా సర్వదినాలుగుఘట్టముల నధికశ్రద్ధఁ బరిశీలించి పవిత్రుఁడై కృతార్థుఁడనైతినని హర్షించి పితృతర్పణాదులొనరించి విడువ లేక విడువలేక యగస్త్యునింబోలెఁ గాశివిడిచిపశ్చిమదిశగా నరిగి ప్రయాగను గాంచి, గంగా యమునా సరస్వతులం ద్రివేణీ సంగమంబున తర్బహిఃక్షేత్రంబుల నరసి యుబ్బరపడి కృతావగాహనుండై విధులు నిర్వర్తించి తత్క్షంగల విశేషంబు లారసి జన్మము సఫలంబయ్యెనని భావించి, దీర్ఘప్రయాణముల డస్సినవాడగుటచే నటుపైకిఁ జనలేక వెనుకకు మఱలి, తన చూచిన మహిమముల మనంబునందలచుచుఁ, గొన్ని దినంబులకుఁ గర్తపురి (గుంటూరు) కేగుదెంచి, తనతల్లియగు వేంకమాంబాపాదపద్మముల వ్రాలి, తన్ను వేడ్కమెయిం జూడ వచ్చిన పౌరులు నాసికాగ్రవిన్యస్తహస్తులై నిరీక్షించుచుండఁ దాఁదెచ్చిన గంగాజలంబుల నమ్మాతృదేవత నభిషేకించి తృప్తుఁడై, ద్రష్టలహృదయంబుల మాతృభక్తిబీజంబుల నంకురింపజేసి యాత్రావిశేషంబుల నుగ్గడించుచు బంధువులతోఁ గూడఁ గొన్నిదినంబులు గుంటూరునఁ గడపెను.

భద్రాద్రి

దాసుగారెందు సంచరించినను చైత్రమాసంబున దన యిష్టదైవమగు శ్రీరామచంద్రపరబ్రహ్మమూర్తిని సంద

ర్శించుటకు భద్రాద్రికేగవలసినదే. కనుక శ్రీరామకల్యాణ నిరీక్షణ కౌతూహలాయత్తచిత్తుండై తప్పుడగు కృష్ణదాసుం దోడ్కొని బంధువుల వీడ్కొని, కడువేడ్కతోఁగదలి లోచూ డ్కల హరిపదముల బంధించి, వృషవత్సర చైత్ర శుద్ధ నవమి దినంబునకు భద్రాద్రిఁజేరి, గౌతమీ పూతవారి సుస్నాతుఁడై శ్రీరామునకు హృదయమిచ్చి సీతాదేవికి గానుకలిచ్చి, హను మకు మ్రొక్కులిచ్చి యంజలిబద్ధుండై యయ్యాసద్బాంధవుం గుఱించి,

సీ॥ గయయందు నిప్పాసి ♦ కనులకు భవదంఘ్రి
నీక్షింపఁజేసిన ♦ దీవకావె
గంగాదియాత్రలీ ♦ కలుషాత్ముచేతఁ జే
యించి రక్షించిన ♦ దీవకావె
కలయందు నర్భకా ♦ కారిణై వీనికి
ధృతినెలకొల్పిన ♦ దీవకావె
మఱలనిప్పాపి నీ ♦ చరణసన్నిధిఁజేర్చి
యింపుగావించిన ♦ దీవకావె॥
యింక దక్షిణదిగ్యాత్ర ♦ లెటులవీని
వలనఁజేయింపఁగా మది ♦ దలచినావొ
భారమెల్లను నీదె ♦ దివ్యప్రభావ
దశరథకుమార భద్రాద్రి ♦ ధామ రామ ॥

అని యెన్నేని పద్యంబుల నాభగవంతుం బొగడి యతని యంఘ్రిల హృదయంబున స్థాపించుకొని మఱల గుంటూరు చేరెను.

దక్షిణ దిగ్యాత్ర

భక్తిపరులకును జ్ఞాననిష్ఠులకును దారతమ్యము కలదు. జ్ఞానధను లద్వైతాను సంధానమునను భక్తులు సేవ్యసేవక భావమునను నానంద పరాకాష్ఠ నధిగమింతురు. పూర్వసుకృత పరిపాకవశమ్మున తన్మార్గములు లభించును. భక్తాగ్రేసరుండగు మనలక్ష్మీనృసింహదాసుగారు తనువస్థిరమనియు, సత్కార్యా చరణము నేమరరాదనియు, సంపదలు బుద్బుదప్రాయము లనియు, తీర్థయాత్రా సోపానాధారమ్మున జ్ఞాన సౌధాధి రోహణ మనాయాసమ్ముగా సలుపవచ్చుననియు నిజసతీ మతల్లికిం దల్లికిం బోధించి తమ్మునికిం ధైర్యమ్ముఁగొల్పి నిర్ధ నుండయ్యు నావిశ్వాసంబే మోకాని రామునిపై భారంబువైచి రామేశ్వరాది దివ్యక్షేత్రంబుల వీక్షించుచు కాంక్షాతిరేకంబున వృషవత్సరాషాఢ శుద్ధద్వితీయాదివసంబున (క్రీస్తు 1821–22) గర్తపురినుండి నిర్గమించి పొన్నూరుఁజేరి శ్రీభావనారాయణ స్వామిని సంభావించి, బాపట్లకేగి యందున్న భావనారాయణ స్వామివారిని బొగడి యుబ్బుచు, నిట్లు నిబ్బరంబుగాఁ దాఁగడ చిన ప్రతిష్ఠలములనుండు స్వాములను దర్శించి మ్రొక్కుచు, నను దిన ప్రయాణమ్ముల నల్లన నెల్లూరికేగి, యుల్లంబు పల్లవింపఁ గ్రిన్నన మున్నుగాఁ బెన్నలోఁ గ్రుంకులిడి యప్పురి దివ్యా లయంబుఁ బరికించి యచ్చెరువొంది, దయాసనాథుని రంగ నాథుని సేవించి, మించితిరువలిక్కేళిఁజూసి పార్థసారథి నర్చించి, చెన్నపురినుండి తిన్నగాఁ గదలి, యెడనెడ వర్షంబులఁ దడియుచు, గడగడవడకుచుఁ బిడుగుల కడలుచు గడగండ్లబడుచు,

క్షుత్తృష్ణలకు సోలుచుం, గాలినడకలకుం దూలుచు, బడలువడి యడుగులు దడంబడ నొడలు కృశింపం బయనములు సేయుచుం, జిదంబరముం గరము మురియుచు నరసి యందలి పుష్కరిణీ తీరమునంగల నానావిధభక్తులం బులకలెసంగం బరికించి, యంబరలింగమును సంబరంబునంగని ప్రణమిల్లి, బిల్వదళంబుల నమకచమకంబుల బూజించి, శియాళికరిగి శంకరునకెఱంగి గౌరీ మయూరంబుంగాంచి పంచనటము వీక్షించి కావేరిదర్శించి కాయంబుం దోయంబులముంచి మధ్యార్జునంబున మహేశ్వరు నర్చించి. కుంభకోణమున ద్వాదశ తీర్థంబులంబొడంగని "కుంభేశ, శంభో హరహర, యని నుతించి," మఱియుంగల దేవతలం దీర్థంబులసేవించి, పంచనాధమున భవుని భక్తిసోం బాటించి, యందాకాలముననున్న మహాభక్తుండగు శ్రీ త్యాగరాయల వారి మహిమల విని యచ్చెరువొంది వారిదర్శింప నరిగిరట. దాసుగారేతెంచుట త్యాగరాయలువారెఱింగి యభ్యుత్థానాదికము లాచరించి, మహారాజాధిరాజులు పాదప్రపాతంబుల బ్రార్థించినను గీటునంబుచ్చు నమ్మహాగాయకుండు, స్వరచితకృతుల నతికుతుకమునం బాడిరట. తచ్ఛ్రవణమునం దన్మయుండై దాసుగారానందబాష్పబిందు బృందము జాఱుచుండ,

క॥ చేతులం దాళముపట్టుక
చేతో మోదంబుతోడ సిగముడి వీడఁగా
బాతరలాడుచు మింటను
గీతము నారదుండువాడె గృష్ణా యనుచున్ ॥

(భా॥)

యుట్ట్ర నారదునివలె నృత్యముచేసెనఁట. "పాముకాళ్లు పామే యెఱుఁగున్" అనినట్లు భక్తుల మార్గ మన్య దురాసదము. త్యాగయ్యగారితని తో మాట్లాడవచ్చెనా, యని సందియపడ వలదు. దాసుగారు చెప్పిరి వినుడు,

సీ॥ కేవలానంద సం ♦ కీర్తనావళివింటి
భావస్థితియు శుద్ధ ♦ భక్తిఁగంటి
భక్తులు శిష్యులు ♦ బలసి కొల్వఁగ గంటి
వాఙ్మాధురీ వైభ ♦ వంబు గంటి
వినయసత్సంపద్వి ♦ వేకములు కనుగొంటి
శ్రీరామ పదభక్తి ♦ చెల్వు గంటి
యజునకందగరాని ♦ యనుభవంబును గంటి
దన్మయత్వంబాత్మఁ ♦ దనరఁ గంటి ॥
నరసికనుగొంటిఁ ద్యాగరా ♦ యార్యునందు
నీలసద్గుణపుంజ మిం ♦ కెన్నియైన
దివ్యమహిమాతి శయములు ♦ దేజరిలుట
గంటి హర్షాబ్ధి నోలాడు ♦ చుంటి మదిని ॥

అని తత్ ప్రార్థనా భంగభయమునఁ గొన్నిరోజులతని యింటనుండి త్యాగయ్య భక్తికలరినాఁడు. చూడుఁడు.

గీ॥ రామపదభక్తి కీత్యాగ ♦ రాయవరుని
సమముగానేర రెవ్వరీ ♦ క్ష్మాతలమున
బ్రేమనాథునుఁడొకసారి ♦ పిలిచెనేని
రాముఁ డోహోయటంచు మా ♦ ర్పలుకునంట ॥

గీ॥ అట్టిఘనునియాజ్ఞ ♦ నంది యచ్చోటువాసి
కదురయంబులోఁడఁ ♦ గదలిసాగి
పరఁగరాజిలు నవ ♦ పాషాణమహిమంబు
నాలకించి ముందు ♦ కరిగియరిగి ॥

అనినాఁడు.

"రసభర నిభృతానామ్ దర్శనా దేవసూనమ్ । ప్రభవతి రసికానాం కోఽపిచేతో వికారః । ప్రథమరసనిదానే జాయమానే సుధాంశౌ । ద్రవతిహి సరళాంతిః ప్రక్రియశ్చంద్రకాంత॥" "రసికులకేదో మనోవికారంబుగలుగుఁ గనినయంత సరసుల, శృంగారరస నిదానుఁడగు శీతభానుఁ డుదయము గాఁగ సరళమతి చంద్రకాంతము గరగు గాదె" (నావ్రాసిన యడవిపూలు)

అనినట్లు, భక్తులు భక్తులఁజూచి తన్మయులగుదురు. పిదప నరసింహదాసు త్యాగరాజుచే సత్కృతుండై యరిగి శరధిని, నవగ్రహశిలలను, చక్రతీర్థము, స్వేతారంభ స్థలము వీక్షించి, యావల భైరవాదితీర్థముల యర్ఘ్యకృత్యము లాచరించి, రామేశ్వరము శాశ్వత సౌఖ్యప్రదము ననశ్వరము సముత్సుకతన వీక్షించి మహోన్నతంబై విచిత్రశిల్ప విభ్రాజితంబై కైలాసంబువిలాసంబుడంబు విడంబించు దేవాలయంబు హర్షంబువొదల. దిలకించి, పులకితాంగుడై లోనికరిగి, కటిప్పుదీఱ రామలింగేశ్వరస్వామిని సందర్శించి, "కాశికాపురినుండి గంగఁదెచ్చితిని ఈశ ! దీనిని గ్రహింపఁగదయ్య" అని ప్రార్థించి, తద్గంగాజలంబుల నమకచమకాదుల నభిషేకించి

బిల్వాది పూజాద్రవ్యంబుల నర్పించి బరువుదీరినట్లు, కోరిక నెఱవేరినట్లు, పెన్నిధి లభించినట్లు నుబ్బి సంతుష్టుండై చేతులు జోడించి,

గీ॥ అన్యమెఱుఁగను దేవ యు ♦ హర్నిశములు
దైన్యమున నీపదంబులఁ ♦ దలచిఁ సుజన
మాన్యహా పరమార్థ సం ♦ పద లభించి
ధన్యమతినైతి నీదగు ♦ దర్శనమున ॥

కం॥ అంగములో సగమంగన ,
కుం గడమసగంబు భక్త ♦ కోటికొసఁగితె
భృంగి నినుగానవచ్చు భు
జంగచయ విభూషదోష ♦ సంగవిదూషా ॥

లోనగు పద్యంబులఁబొగడి, యవ్వల హనుమదాదుల కెఱఁగి, మఱియు నందిర్వదినాల్గు తీర్థంబులఁ గృతస్నానుండై గంధమాధన పర్వతంబుఁ దుదముట్ట నధిరోహించి, సింధు బంధను శ్రీపాదంబులస్మరించి, పిదప సేతుమాధవు పదంబుల మూర్థంబుసోక మ్రొక్కి, యుభయసాగరసంగమంబున నుచిత విధులు నిర్వర్తించి, యందు దినత్రయంబుండి పిదప నేకాంత రాములసేవించి, యంపు చింతలపాటి లక్ష్మీనారాయణగారి వేడికోలు మెయి నతని యింటికరిగి, అందాభూసురుని కోర్కెఁ దీర్చుటకుఁ గొన్నిదినంబులుండి, రామాయణము పురాణము సెప్పి యతనిచేఁ బూజితుండై కదలి, మఱల సేతుమాధవు దర్శించి,

సీ॥ తగఁ బ్రయాగపురి మా ♦ ధవుఁడు నీక్షేమంబు
నడిగినాడని దెల్పు ♦ మనియెఁ బ్రీతి
జాహ్నవి నీపాద ♦ జలజంబులకు మ్రొక్కె
యమున నీదాననే ♦ యనుచుఁబల్కె
వరసరస్వతి నిన్ను ♦ బహుగతుల్ వినుతించె
యన్నపూర్ణ నమామి ♦ యనుచుఁబల్కె
కాశీశ్వరుఁడు నిన్ను ♦ ఘనముగా వినుతించె
దక్కుసురల్ నీవె ♦ దిక్కటనిరి ॥

తే॥ భైరవుఁడు దండి నేము నీ ♦ బంట్లమనిరి
వినగదే యుత్తరక్షితి ♦ విషయములివి
తెలిపినాఁడ నిజస్థితి ♦ దెలిపిమీఱ
సేతుమాధవ వినవయ్య ♦ చిత్తమరల ॥

(మఱియుం బెక్కుపద్యములు గలవు. విస్తరభీతి విరమించితి)

ఉ॥ కోరికదీరె నీచరణ ♦
కోమలయుగ్మము నాశ్రయించుటన్
గోరికదీరె గంగనిటఁ ♦
గూరిమి లింగని కొప్పగించుటన్
గోరికదీరె సేతువున ♦
గొంకక స్నానము లాచరించుటన్
ఊరికిబోయివత్తు దయ ♦
యుంచుము నీమది సేతుమాధవా !

అని నమస్కరించి కోటితీర్థముం గ్రహించి సయసంస్థై దర్భశయనముంజేరి శ్రీరామునకు సాష్టాంగమొఱఁగి శ్రీరంగము సరసి తనయనుభవము నిట్లు చెప్పినాఁడు.

సీ। ప్రాకారసప్తక ♦ ప్రకరంబు గనుఁగొంటి
నదియెవైకుంఠ మం ♦ చలరుచుంటి
ప్రాగ్దిశగోపుర ♦ త్రయమును గను గొంటి
దక్షిణంబున నేడు ♦ దనరగంటి
పశ్చిమమునమూఁడు ♦ ప్రజ్జ్వరిల్లుటగంటి
నుత్తరంబున నాఱు ♦ నుంటగంటి
నిరువదియొక్క గో ♦ పురముల నిటుగంటి
నామథ్య శర్వాల ♦ యంబుఁగంటి ॥
నందుఁ గోట్యర్క దివ్య ప్ర ♦ భాళియనఁగ
దాసవరులకుఁ గలపెన్ని ♦ ధానమనగ
మూఁడుమూర్తులలోనాది ♦ మూర్తియనగ
వెల్గుచుండెడి శ్రీరంగ ♦ విభునిగంటి ॥

సీ॥ ధగధగదీప్తులఁ ♦ దరుణార్క రుచిమించు
ఘనకిరీటముతలఁ ♦ గ్రాలగంటి
సన్మణిస్థగిత భా ♦ స్వద్రత్నహారముల్
వక్షస్థలంబునఁ ♦ బరఁగఁగంటి
విద్యుత్సహస్రకో ♦ టిద్యుతులీనెడి
మేఖలనడుమున ♦ మెరయఁగంటి

స్వర్ణవస్త్రద్వయి ♦ సహజ దేహవినీల
  కాంతులా చ్ఛాదించి ♦ క్రాలగంటి ॥
చంద్ర సూర్యద్యుతులమించు ♦ శంఖ చక్ర
ముఖర దివ్యాయుధోత్కర ♦ ములు కరముల
దనరఁగాఁగంటి నిటువంటి ♦ ఘనతరాంగు
సంగదూరుని శ్రీరంగ ♦ శాయిఁగంటి ॥

ఈ మొదలగు ననేకపద్యంబుల నాతనిఁబొగడి జంబుకేశ్వరమేగి యంబులింగమున కభివాదనములు చేసి కంచిని గాంచి పురవైభవము నభివర్ణించి,

ఉ॥ ఆఁకలిఁగొన్న యట్టిజను ♦
  డన్నముఁ గైకొను మాడ్కి వేదనం
దూకలు ప్రాప్తమైనటుల ♦
  రోగికి నౌషధ మబ్బినట్టులు
ద్రేకపుటెండ మాడుచుఁ జరిం ♦
  చెడివానికి నీడలభ్యమౌ
నాకరణిం గరీంద్రవర ♦
  దాంఘ్రులఁగంటి మహాభిలాషినై ॥

క॥ దవ్వులగని డాయంబో
  నవ్వాకిలి వారలడ్డ ♦ మైనిలుపగనే
  నివ్వెరపడి యుండగనన్
  జివ్వననొక వైష్ణవుండు ♦ చేర్చెన్ లోనన్ ॥

ఫలవృక్షమూలంబునఁ గంటకములున్నట్లు స్వామి ధ్యానసన్నిధినున్న ధనలుబ్ధులగు నీదౌవారికుల బాధయును భక్తగేసరునకుం గూడఁ దప్పినదికాదు అయినను శ్రీరాము దండయైయుండ నంతరాయము లేమిచేయును ?

ఆవల నృసింహదాసు వరదరాజస్వామిని సందర్శించి హర్షాతిశయమునఁ బులకలు నశ్రులనొలుకఁగాఁ బరవశుండై పుడమిపైఁబడి యించుక తడవునకు సుస్థితుండై మస్తకమున హస్తములు మోడ్చి హస్తివరదు నిస్తులభక్తిఁ బ్రస్తుతించియుఁ దదితరస్థలంబుల ముదంబునం దిలకించియు మఱునాఁడు తిరుపతి కేగ నొకవింతజరిగెను.

లక్ష్మీనరసింహదాసు తిరుపతిచేరి శ్రీ వెంకటేశ్వరస్వామిని మదిని దిరముకొల్పి ధ్యానించుచుఁ బర్వతారోహణ ప్రయత్నమునుండ మున్నుకంచిం గన్పించిన వైష్ణవుండె యరుదెంచి "నీ తాత తండ్రుల మ్రొక్కుబడుల నెల్లఁ దీర్పఁ గల్గిన నే కొండనెక్కుము లేకున్న నెక్కకుము" అను పలుకు వినవచ్చిన దెసకుం దల ద్రిప్పి చూడ్కుల సారించి మారు పలుక గమకించునంతలో నవ్వైష్ణవుం డల్లనల్లనం జని యదృశ్యుండయ్యె. అంతదాసు నిట్టూర్పుపుచ్చి కూలఁబడి "ఈయన మున్నుకంచిలో గన్పించి వాకిలి దాటించిన వైష్ణవుండయని తలంచి మాటలాడ నుంకించునంతలో నదృశ్యుం డయ్యె. ఇతఁడు నిక్కపువైష్ణవుఁడుకాఁడు నాపెన్నిధానము నాభాగ్యరాసి నాదైవము నాతండ్రి ? "అవేంకటేశ్వరుఁడే" కట్టా! ఎట్టినిర్భాగ్యుఁడను ఒక్కమాటయైన నోరారఁ బల్కక

పోతి తనివారఁ జూడనైతి బిగియారఁ గౌగిలింపకపోతి చేతు లారఁ బదము లొత్తనైతి స్వామీ! ఏలయింత నిర్దయ కేరా! వేంకటేశ్వరా! కొండయెక్కఁగనా?

గీ॥ తాతనాటిఋణము ♦ దలఁచి లెక్కలుతీసి
ప్రీతిమాని బిరుదు ♦ ఖ్యాతిమాని
కఠినవృత్తిదాల్చఁ ♦ కదలరా వలదంటి
విట్టులాడనీక ♦ బెట్టులొప్పె ॥

గీ॥ కాసుపైనాసఁ జేసి యీ ♦ కరణి భక్త
గణములను బాధపెట్టుట ♦ గుణముకాదు
తగదనుచుఁ దెల్ప నీసరి ♦ దైవమేడి?
నొక్కఁడవౌట నీకిటు ♦ లొప్పెనౌర!

గీ॥ వాడుకోర్చి విత్త ♦ పటలమార్జించిను
బాదుషాకొసంగు ♦ ఫలమదేమి
కడుపుకైన దినవు ♦ గాసియ్య వేరికి
బీదజనులయందు ♦ బింకమేల?

గీ॥ నీవొసంగక సిరిమాకు ♦ నెగడుటెట్లు
మానుసర్వంబు నీయది ♦ కాదెదేవ
యడ్డమే నీదు చేతికి ♦ నశనమాత్ర
మిచ్చితదియును గొనరాదె ♦ యిచ్ఛయున్న ॥

గీ॥ కొండపైకివచ్చి ♦ కోర్కెలెయ్యవియైన
గోరువాఁడనంచుఁ ♦ గొంకుగదిరి

భీతి జెందినావొ ♦ బిలిచిన బలుకవు
తెలిసెనీదుస్సుట్టు ♦ తెల్లముగను ॥

సీ॥ వేంకటాద్రినిలయ ♦ వేగిరపడబోకు
ఋణముదీర్తు నీకు ♦ నెల్లినేట
నింతవాఁడవౌట ♦ యెఱిఁగిన భద్రాద్రి
విడిచి యేఁవత్తు ♦ బ్రీతినిటకు ॥

సీ॥ తనువు నీసొమ్ముగా మున్నె ♦ ధారవోసి
యున్న నాయెడ నరమర ♦ లుంచఁదగునె
మంచిచెడ్డలునీవె నే ♦ నెంచనేల
ప్రోచికొ మ్మింక వులఁబడ ♦ ద్రోచికొమ్ము ॥

క॥ సెలవిచ్చినఁ బసివినియెద
నిలుమన్నను సముఖమందు ♦ నిలిచెదమదిలో
గలవార్త దెలుపకుండిన
దలఁచు కెటుల వైష్ణవోక్తి ♦ దగనీవిధిగాన్ ॥

సీ॥ తొంగిచూచియు నలమేలు ♦ మంగతాయి
దాపురానోడె నీగట్టి ♦ తనము నెంచి
కాను తనయునికన్నను ♦ ఘనమటంచు
విందు నదియుట నిజముగా ♦ తెలసె నేఁడు ॥

సీ॥ ఔర ! గోవిందరాజైన ♦ ననుజుఁడ
వీఁడు మనవాఁడు చూచి కా ♦ పాడు మనను
ఔర ! యిటువంటి మేళమీ ♦ యవనినొప్పె
మఱి యెచటనుండదిక వేయు ♦ మాటలేల ॥

ఇట్లెన్నెని విధముల నిష్ఠురోక్తులుపలికి పర్వతమెక్క వాని యచ్చోటన పడియుండి రిక్తహస్తుఁడ నే నెట్లు ఋణవిముక్తిఁ గందును స్వామి కెట్లు కృపగల్గునని తలంచుచు సంచె పై గుడ్డబఱచి నిద్రించుచుండ స్వప్నంబున,

సీ॥ రజతాద్రికాంతి ని ♦ రాకరించెడు మేని
చందంబుగల్గు న ♦ శ్వంబు నెక్కి
మల్లెపూలంగి పై ♦ మఱల ధట్టిబిగించి
వల్లెవాటుగ ఖండు ♦ వా నమర్చి
మణిమయ మకుటంబు ♦ మస్తకంబున దాల్చి
దండిసొమ్ములు మెయి ♦ నిండఁదొడిగి
ఎడమచేతను గళ్లె ♦ మిరవొందగాఁబట్టి
తక్కినచేత బె ♦ త్తంబుఁదాల్చి
కులుకునడకను దుముకులు ♦ కొసరు కొసరు
మూవ్రులనుగల్గి జనములు ♦ చోద్యమంద
దాపుసేరి ఓనరసింహ ♦ దాస యింక
రమ్మనఁగ నేను నతనిజే ♦ రంగనేగి ॥

నమస్కరించి నిలువంబడి యద్భుతమందుచుండ మందహాస సుందర ముఖారవిందుఁడై.

గీ॥ నీవు మావాఁడవని నిజం ♦ బేవచింతు
నాదు విధిదాట ♦ నేరికిఁ గాదుగానఁ
బర్వతంబెక్క వలదని ♦ పలికియుంటిఁ
గూడదను పనిచేయంగఁ ♦ గోరనేల ॥

పంచచామరము.

"నగంబుఁజూచుకోర్కె నీమ ♦ నంబునందు గల్గినన్" రమ్మ

క॥ అని శైలమునకు ననుదో
డ్కొని చని చూపంగగంటి ♦ గోగర్భంబున్
ఘనపాప నాశనంబుగ
గన గంగాధారమున్ను ♦ గా సర్వంబున్

మఱియు మురిపెంపు పెంపుదోల్కాడ,

సీ॥ నీలఘనాఘన ♦ నిగనమ దేహంబు
నందు బీతాంబరం ♦ బమరువాని
నరిదరశార్ఙ్గగ ♦ దాదిసాధనములు
హస్తచతుష్కమం ♦ దమరువాని
రవికోటిదీప్తిని ♦ రాకరించెడి కాంతి
గల కిరీటముతలఁ ♦ గలుగువాని
కస్తూరివాసనల్ ♦ గ్రమ్మెడు మెయినిండ
సొమ్ములఁదాల్చిన ♦ సొగసుకాని॥

వక్షమున శ్రీమహాలక్ష్మి ♦ వసఁగువాని
హాటకాంబరము మొలఁజే ♦ రాసువాని
వేంకటాద్రీంద్రనిలయు శ్రీ ♦ వేంకటేశు
గాంచి సేవించి యిట్లువ ♦ చించినాఁడ॥

అని యెన్నేని చందంబులం గొండాడి మఱియుంగల
విచిత్రంబులంజూచి.

గీ॥ అవ్వచటియఁ జూచి • యాశ్చర్యమొందుచు
నాజ్ఞవడసి యమ్మ • హాద్రిడిగ్గి
మఱియుఁ గల్గుచోట్ల • మహిమలెల్లనుగాంచి
మేలుకొంటిననంతఁ • జాలవేడ్క ॥

చదువరులారా! చూచితిరా? భక్తపరాధీనుని వింత చెయ్వులు "గోవు వెంటనుండు కోడెభంగి" భక్తుల వెంటనుండెద ననుట దబ్బరయా? ఈయొక్కవిషయము చాలదా? దాసు గారి పవిత్రజీవితము సంతత స్మరణీయమగుటకు దానెంత తపముసేసెనో! ఎంత, భక్తి గలిగియుండెనో! ఎంత పుణ్యా మార్జించెనో! భగవంతుఁడు తన వెంటనుండుటకుఁ దనకోర్కెఁ దీర్చుటకుఁ దనతో మాటలాడుటకు. దనతోఁ దిరుగుటకు. ఆహా! నృసింహదాసా! ధన్యుఁడవు ధన్యుఁడవు; గాఢతర భక్తిపాశమున భగవంతుని బంధించి గంగిరెద్దునువలె వెంట దిప్పుకొనుచుంటివి.

పాఠకులారా! యవ్వలి వృత్తాంత మీర్లు చదువుఁడు.

ఇట్లు నృసింహదాసు దానెన్నండు కనివిని యెఱుంగని వింతల నక్కపటపురాతు చూపఁజూచి మేల్కొని యిది సత్యమా? అసత్యమా? చిత్తవిభ్రమమా? యని తలంచు చుండ ఘ్రాణతర్పణంబుగా సుసౌరభ మేతేర నిదియేమని యన్వేషించుచో నాతని శయ్యపై.

ఉ॥ ఎన్నఁడునైనయోగి విభు • లెవ్వని పాదపరాగమింత
యుం । గన్నుల గానరట్టి .... (భాగవతము)

శ్రీవేంకటేశ్వరుని పాదచిహ్నము సురభి రజోలేశము నుండం గాంచి విస్మితుండై లేచి తోడివారలకుం జూపి యా వేంకటేశ్వరుని శ్రీపాదరేణువులఁ దలపై ధరించియు నాఘ్రాణించియుఁ గన్నులకద్దుకొనియుఁ గొంత యచ్చోటివారి కొసంగియు పిచ్చుకుంటుపై భాగీరథి ప్రవహించినట్లు భగవత్కృప నాబోటి కించిద్జ్ఞునిపై ప్రసరించె జూడీయని నిర్భర హర్షాతిరేకంబునఁ బిచ్చివానివలె గంతులువైచుచు నాడుచు బాడుచు నవ్వుచు నానందాశ్రుల గండతలంబులఁ దుడుపుచు మైమఱచుచుఁ దలద్రిప్పుచు బ్రమోదాంతరంగుఁడై పరితృప్తుఁడై నిమీలిత నేత్రుఁడై స్వప్నగోచర పురుషుని భావంబున బంధించి పరికించుచుండ నమ్మాయాపురుషుఁ డించుకసేపు హృదయకర్ణిక నధివసించియుఁ గొంతొకతడవు నిటలతటంబున నటనంబుసలిపియు నావల సహస్రార చక్రంబున సన్నిరేకుల వికసింపఁజేసి నడుమ గర్ణికయందు నిలిచి కోటిసూర్యప్రభామండలంబునఁ బ్రకాశించి దుర్నిరీక్ష్యుండై యుండెనట. అట్లంత క్షేత్రమున రెండు గడియలసేపు బ్రహ్మానంద మనుభవించి యంత నల్లన గనులువిచ్చి తోడివారల పొగడ్తలకు లజ్జించుచు నెట్టకేలకటనుండి కదలి యలమేలుమంగ కంజలిబంధము ఘటించి గోవిందరాజులఁ గొండాడి నమస్కరించి,

సీ॥ శ్రీపాదరేణువు • చిన్నంవరాయంచు
బల్కు వైష్ణవపరి • భాషవింటి

స్వామిప్రసాద సం • ప్రాప్తంబుఁగోరిన
నెలచాల హెచ్చును • విధముఁగంటి
గడకాష్ఠలపు నున్న • కాసివ్వకుండఁగఁ
జిక్కఁబోదనువార్త • జేరివింటి
వింతవింతలు గల • వెలలేని పటములఁ
గన్నులపండువు • గాఁగ గంటి
భక్తియెంతయున్నఁ • బైకంబులేదని
సర్వసాక్షియైన • సామికెఱుక
గాన నతఁడెనన్నుఁ • గనిప్రోచు వేల్పని
యాపురంబుదాఁటి • యనలికరిగి ॥

భగవంతుఁడును నియతిని దాటఁడు అతఁడే దాటిన నందరు దాటరా? కనుకనే శ్రీకృష్ణుఁడు కుచేలునితో.

సీ॥ ఏను దురిలోక సంగ్రహార్థంబు • కర్మాచరణంబు సేయు

గీ॥ గతిమనంబునఁ గామమో • హితులుగాక
యర్థిమై యుక్తకర్మంబు • లాచరించి
ప్రకృతి సంబంధమును బాసి • భవ్యనిష్ఠ
దవిలియుందురు కొందఱుత్తములు భువిని ॥

(భాగవతము)

అనియెను అట్టివాఁడే మనదాసుగారుగూడ" అంత నతఁడు కాళహస్తి నరసి యాస్వామిని బ్రార్థించి [illegible]మార్గమున మజిలల బొన్నూరువచ్చి యవ్వల గుంటూరు ప్రవేశించి

వేడ్కతోఁ దల్లి కెఱిఁగి యనుజుని దీవించి భార్యాసపర్యల నంగీకరించి జననికై తెచ్చిన కోటితీర్థంబు నామెనభిషేకించి మాధవప్రీతిగా సమారాధనాదికము నిర్వర్తించి "పోయి సేవింపలేకున్నఁ బుణ్యతీర్థ మహిమ వినుటయు నఖిలకల్మష హరంబు" అనుచు నాయామాహాత్మ్యములఁ దన కష్టసుఖ ముల యాత్రా విశేషముల నందఱకుం దెల్పుచునుండె, ఈయాత్ర వృషసంవత్సర ఫాల్గుణ శుద్ధ పాడ్యమికి సమాప్త మయ్యెను.

మఱల శ్రీరామనవమికి భద్రాద్రికేగి రామునకు దనవృత్తాంత మెఱిఁగించి మగిడివచ్చెను.

ఇట్లు నిరంతర ప్రయాణము లొనగ్చుటవలన నారో గ్యముచెడి కొన్ని దినంబులు వ్యాధిబాధితుండై దాసుగా రాత్మ గతంబున "స్వామీ! ఒకచోఁబడియుండి యను క్షణము నిన్ను స్మరించుటకా, ఇట్లు కదలలేని స్థితినిగల్గించితివి అని తారకము జపించుచు గొంతకాలమునకు దేరుకొని క్రీస్తు శకము (1827–28) వ్యయసంవత్సర పుష్య శు ౭ నాఁడు బయలుదేరి యుత్తరదిశాభిముఖులై చనిచని యయోధ్య కేగి రాముఁడు జనించినచోటనియు, వసించినచోటనియు, నాడిన చోటనియుఁ బాడిన చోటనియు, వల్కలములు ధరించిన చోటనియు, దశరథుని నిర్యాణస్థలమనియు, భరతుడు పాదు కల బూజించు చోటనియు నందలి జనంబులుచూప నాయా పుణ్యస్థలముల సభక్తికముగా నారాధించి సరయువునఁ గ్రుంకు

లిడి పితృతర్పణాదు లొనర్చెను. వంశమును బవిత్ర మొనర్చు
టకును బితరులకు సద్గతులు గలిగించుటకును "జాలఁడా యేఁడు
తరములకు నొకమహాత్ముఁడు" అంత నందఁతడు కొన్నాళ్లుండి
హరిద్వారముఁ జేరి యటనుండి బదరికావనమున కేగి నారాయ
ణు దర్శించి (మొక్కులిడి యాక్షేత్రమహిమల వర్ణించి మఱలి
కాల్నడకల బహుకష్టప్రయాణముల సర్వజిచ్ఛ్రావణ శుద్ధైకా
దశి నాటికి గుంటూరుచేరెను ఎక్కడ గర్తపురి! ఎక్కడ నర
నారాయణులు తపంబుచేసిన బదరికావనము! ఎక్కడ
యయోధ్య! ఎక్కడ కాలినడకలు యాత్రాఫలము లభిం
చుటయు సామాన్యముకాదు. కావుననే సాముద్రికులు
యాత్రారేఖలుంటయు నదృష్టవిశేషమందురు మఱల. చైత్రం
బున భద్రాద్రి కేగి వచ్చెనుజుడీ.

శ్రీదాసుగారి కిట్లెన్నియాత్రలు చేసినను దనివితీఱ
లేదు. నడకయన్న భయములేదు, ఎంతదూరమైనను బుణ్య
క్షేత్రమన్న బుద్ధిచెంబును గొల్లాయగుడ్డకు ముడివేయుటయే,
ఇది యేమి · కాని ఆయనకు ముల్లువిఱుగదు పాముఁగఱవదు,
దొంగకనఁబడడు. కాలితీపు లేదు దృఢకాయుఁడే. యుపవాసి
యైనను వర్చస్వియే. జంఘాలుఁడైనను, అభక్తవశ్యుఁడు గు
ణోత్సవ సందర్శనాభిలాషుడై విరోధినత్సర వైశాఖమునఁ
గతిపయాప్త భక్తులతోఁ గదలి కంచి కేగి స్వామిని సేవించి
మఱలి చెన్నపట్టణమురాఁగ వైదికబ్రాహ్మణుఁడు మురికి
నాడను శాఖకుం జెందినవాఁడు ధనాఢ్యుడు భక్తుఁడు నగు

నాగండ్ల వరదరామదాసు వీరినాహ్వానించి యుచితసేవలఁ దృప్తుంజేసి దాసుగారివలనఁ దారకమంత్రరాజ ముపదేశమున్ నొంది తనయింట గురువుగారిని మాసత్రయముంచుకొని రామాయణము సాంతముగావిని పిదప నాలుగువేల రూప్యములతో నరసింహదాసుగారి పాదపూజసేసి "స్వామీ! మీ రింకొక పర్యాయము వేంచేసి భద్రాద్రి రామచంద్ర మూర్తిని సందర్శించు భాగ్యము నాకు లభింపఁజేయవలయు" నని ప్రార్థించి వీడ్కొలుపఁగా దాసుగారతని వినయ భయ భక్తి శ్రద్ధలకలరి యిదియంతయు నా శ్రీరాముని కారుణ్యాతిశయమని తలంచి గుంటూరునకేతెంచి మూఁడు తరంబుల నుండి పెరుగుచున్న ఋణమ్ము నా నాల్గువేల రూపికలొసంగి నిశ్శేషమ్ముగాఁదీర్చి ఋణవిమోచన సంతర్పణ మొనర్చెను.

సీ॥ అప్పుదీఱుపనైన • హరియి పనైనను
  దలఁచుమానిసికిఁ బ • త్రింబువలదు
పరుగడ తట్టైన • భద్రేభమైనను
  ద్యాగశీలునకు ల • క్ష్యంబుగాదు
అధికాశగలవాని • కల్పసంతోషికి
  గణ్యంబుగాకుండుఁ • గనకశిఖరి
నాథుండు రక్తుఁడై • నవిరక్తుడైనను
  దరుణికేమిటిని సౌం • దర్య రేఖ॥

(రామలింగ)

అని యడిదము సూరకవి రామలింగేశునిపై మొఱ పెట్టుకొన్నట్లు పత్రములు లేకున్న నేమి? తరములు గడిచిన నేమి? సద్బుద్ధియగు నథమర్ణునకు.

అంతం గొన్ని దినములకు మఱల నరసింహదాసు చెన్న పురికరిగి వరదరామదాసుం దోడ్కొని వికృతివత్సర చైత్ర మాసాదిం బయలుదేరి శ్రీరామనవమి శుభయులు భద్రాద్రిం జేరి. శ్రీరాముని సముత్సుకత సందర్శించి యుట నిత్య ము దువారిదిగదా భాగ్యమని తత్రిత్యులం గొండాడి తిరిగి గుంటూరుకువచ్చిరి.

నృసింహదాసుగారి బుద్ధికి నడవడికిఁ బ్రభావమునకు నచ్చురంబడి వీరినివిడచి నుండఁదగదని సకళత్రముగా వారిం జెన్నపురికిం గొంపోయి యచట నాఱుమాసములుండి భక్తి జ్ఞాన సంపత్తిచే వైరాగ్యమువోడమ నందుండ నిచ్ఛగింపక తన యాద్యస్తువితతిని శకటాశ్వాదులపైబూన్చి యందఱుఁ గదలి వికృతివత్సర కార్తీకమున భద్రాద్రికరగి కాపురముం డిరి. అందు నిరతము రాము సేవించుచు నృసింహదంపతుల సంభావించుచు నా వరదరామదాసు దంపతులు సంతోష మున గాలముబుచ్చుచుండిరి.

క॥ కర్మమునఁ బుట్టుజంతువు
కర్మమున సమృద్ధిఁ జెందు • గర్మమునఁ జెడుఁ
గర్మమె జనులకు దేవత
కర్మమె సుఖదుఃఖములకుఁ • గారణమధిప ॥

అన్నట్లు దేహి కర్మానుగుణ్యమైన దశాపరిణామము నందవలయు భద్రాద్రిలో శ్రీరాములకుఁ గైంకర్యము సేయువారు ధనాశా పీడితులై స్వామిధనము హరించుచుఁ దత్తత్కాలోచిత కైంకర్యములఁ గావింపక యేరినిం జీరికిఁగొనక యుచ్ఛృంఖల వృత్తిని సంచరింపసాగిరి చూచితిరా! కడు దవ్వులనున్న వరదరామదాసాదులు భద్రగిరి నివాసమే పూర్వపుణ్య విశేషమని భావించిరి. అశ్రాంతము స్వామిసన్నిధినుండి సేవలొనరించు నీయర్చకులు తమయదృష్టమును బాటింపక పోగా? నకార్యములకు పాల్పడిరి. ఎందున్ననేమి? బుద్ధి లేని వారు మొసళ్లు, మీలు కర్కటముల్ నిరతంబును జాహ్నవీ నదిలో నివసించుచున్నను స్నానఫలము దక్కునా?

ఈయర్చకుల మొండగముల నృసింహదాసు నిరీక్షించి చక్కసేయ లేక తనసొత్తు పోయినట్లు నాలిం గోల్పోయిన వాని వలెఁ గడుఁ బరితపించి చింతించి యొకనాడు "ఓరామచంద్రా! నీకు సేవలు సక్రమముగా జరుగుట లేదు. నే నెట్లు సహింపఁ గలను నాకే తెరవు? అని మొఱవెట్టి నిద్రింపఁగా స్వప్నంబున నొక వైష్ణవుం డరుదెంచి నృసింహా! వగపేల? లెమ్ము చందులాలును దర్శింపఁ బొమ్ము అన్నియుం జక్కనగును" అని పలికి చనియె. అంత దాసు మేల్కాంచి తన ప్రియశిష్యుఁడగు వరదరామదాసుతో స్వప్న వృత్తాంతమంతయు మఱి తనమున సంతనముతో నుడివి శ్రీరామాజ్ఞగా భావించి సభక్తి నమస్కరించి హైదరాబాదునకుఁ బయనమై యొకఁడచనియె. భక్తుల

భావములు భగవంతునకు భగవంతుని భావములు భక్తులకుఁ దెలియుచుండును.

క॥ చిక్కఁడు వ్రతములఁ గ్రతువుల
జిక్కఁడు దానముల శౌచ • శీల తపములం
జిక్కఁడు యుక్తిని; భక్తిని
జిక్కినక్రియ నచ్యుతుండు • సిద్ధముసుండీ ॥

ఆకాలమున నిజాంరాజ్యమును బరిపాలించుచు హైదరాబాద్ అను ప్రధాన నగరమున నాసర్ద్దౌలానవాబుగారు నివసించుచుండిరి. అతనికి మహారాష్ట్ర బ్రాహ్మణుండును, ధర్మాత్ముఁడును, చండశాసనుఁడును, సన్మార్గప్రవర్తకుండును, సమర్థుఁడు, భక్తుఁడు నగు చందులాల్ ప్రధానామాత్యుం డుగా నుండెను. పుణ్యాత్ముఁడగు నమ్మంత్రిశిఖామణి కొకనాటి రేయి కలలో శ్రీరాముఁడు దృగ్గోచరుండై "ఓరీ! నృసింహదాసు నీదాపున కేతెంచుచున్నాఁడు వాఁడు నాప్రియ భక్తుండు సుమా" యని నుడివి యదృశ్యుండు కాఁగా వెంటనే కనులు తెఱచి యద్భుతపడి శ్రీరామచంద్రమూర్తిని ధ్యానించి శ్రీనృసింహదాసు కారణమ్మున గృతార్థుడనైతి నా జన్మము సఫలమయ్యె రాముని కా దాసుమీఁద నింత ప్రేమయుంట కా మహాత్ముఁ డెంతతపము చేసెనో, ఆ మహాత్ముఁ డెన్నఁ డు వచ్చునో? వారి చరణకమలముల నెన్నఁడు చూడఁగలుగుదునో? వారికి నావలని ప్రయోజన మెయ్యదియో? ఇంత నచ్చిన భక్తుని వాంఛితముల రాముఁడేల సఫలము చేయఁడో? నన్ను ధన్యునిజేయుతలంపు నం గావలయు, రాముఁడీ విచిత్ర

సంఘటనము సేయఁబూనెనని యెన్నియో తెఱంగులఁ దుఱంగ లించు భావములలోఁ బొద్దులుపుచ్చుచుండఁ, గొన్ని దినము లకు లక్ష్మీనృసింహదాసుగారు హైదరాబాదున కేగి, చందూ లాలు మందిరంబు నానందంబునం దరియఁజని సులభోపాయం బున లోనికరిగి, రాజాధిరాజా, సలామంచు మ్రొక్క నాదీర్ఘ కాయంబును నా ద్వాదశోర్ధ్వ పుండ్రములను నాతులసి పూసల పేరులను నా విశాల నేత్రంబులను నాపంచకక్ష్యల నీరుకావి ధోవతిని నాశరీరకాంతిని నాసుస్మితాస్య సౌందర్య విలాసములను భుజంబుల వ్రేలాడు నత్యూర్తి సంచిని నమ్మంత్రివర్యుఁడు పరికించుచో మహాప్రభూ ! మీ రాజ్యము లోని భద్రాద్రి నివసించు నరసింహదాసుఁడ నని చెప్పఁగా నుద్దవిడి గద్దియడిగ్గి యొక్కపెట్టున బిగ్గఁగౌగిలించి, చందూ లాలు దగ్గఱకేగి నిట్లనియె. "శ్రీరామచంద్ర పరమాత్మాను గ్రహముగాంచిన భక్తపుంగవా ! వింటివా నిన్నుగంట నాతొలినోముపంట పండినది. నీకు బంటనై నీసెప్పిన పనిసేయ సన్నద్ధుఁడ మహాత్మా! పనిఁగొమ్ము రమ్ము మమ్ము మా మంది రమ్ము పావనమ్ము సేయుము." అని యంతిపురిలోనికిం గొని చని పదములవ్రాలి పూజించి రాముఁడు తన స్వప్నంబున నుడివిననుడులను నుడువఁగా, హర్షావేశమున నొడలుమఱచి మైపులకలెసఁగ నానందాశ్రులు రాల గద్గదకంఠుఁడై, దాసు కొండొకవడికి మంత్రిని గౌగలించుకొని 'యంభోజ గర్భాదు లరయంగరాని శ్రీ రా మ చం ద్రు నీక్షింపఁ గల్గితివే ;

తండ్రీ ! ఎంతధన్యుఁడవు నిన్నుఁగన్న బన్నములురలవే ! నిన్నుఁదాకిన పున్నెములు వఱలవే!” యని కొంతప్రొద్దు ప్రశంసించి, చందులాలు ప్రార్థింపఁగా నతనియింటఁ గొన్ని దినములు వసించి యతనికిం దారకమహామంత్రరాజము నుపదేశించెను పిమ్మట నొకనాఁడు చందులాలు సవినయముగా దాసుతో “మహాత్మా! నన్ను మీరు కృతార్థుం జేయ నరుదెంచి నన్నేల మీప్రయోజనంబునకు వినియోగించుకొనరు? ఇంతదవ్వు మిమ్ముల నడపించిన యవసరకార్య మెయ్యది? యనుగ్రహమున నానతిం” డని వేఁడగా సహర్షంబున నాననమ్మున మందహాసంబు మొలకలెత్త నతం డిట్లనియె.

“మంత్రిశేఖరా! ఎఱిఁగియుంటివికదా! మీ రాజ్యములోని పూజ్యమైన భద్రాద్రిని శ్రీరామభద్రుని, ఆ స్వామివారికి శ్రీనవాబుగారొసంగిన పవిత్రక్షేత్రములను యాత్రికులొసఁగు ముస్తైలను ముడుపులనుహరించి మదోన్మత్తులై యర్చకులును తదధికారులు నెవరిని లెక్కింపక తుదకు స్వామికైంకర్యము సైతము సక్రమముగా జరుపుటలేదు. దీనికి సహింపలేకున్నారము. స్వామివారికి నిత్యోత్సవములు జరుగునట్లేదేని యుపాయముమీరారయునది” యని యూరకుండ నతఁ డద్దానికింతయేల! తదధికారము మీరే స్వీకరింపు”డను నమాత్యు పల్కుల కడ్డమువచ్చి, “అయ్యా! మీరొండు చందంబునఁ దలంపవలదను దాసుగారికి నమస్కరించి పరేంగితవిదుండగు నమాత్యుఁ డిట్లనియె “స్వామీ! నేను సమ్మ—

పటముగా నిస్సంశయముగా నిజముగాఁ బల్కుచున్నాఁడ. ఒక్క దేవాలయమున కాదు,

ద్వి ప ద.

భద్రాద్రి పాల్వంచ ♦ పరగణాలెల్ల
భద్రంబుగానీవు ♦ పాలింపఁదగుదు
వాయుర్వికెల్లనీ ♦ వధికారమూని
చేయుము న్యాయసం ♦ సిద్ధిఁ బాలనము
రాజితమైనట్టి ♦ రాజా బిరుదము
నేఁ జెల్వుగా నిదె ♦ నీకొసంగితిని
చెలగినీ రాజా నృ ♦ సింహదాసంచుఁ
బిలుతు రింతటినుండి ॥ "

అని దాసుగారు నిరాకరించుచున్నను వినక వెంటనే యొక శాసనములిఖించి మనమార సమ్మోహమహూన కొసంగె.

ద్వి ప ద : మఱియు నొంటెలు రెండు ♦ మత్తేభయుగము
తురగచతుష్క మెంతో ♦ భక్తినొసఁగి
సరిఫేష్కురాయీలు ♦ సరిగంచుసేల్వ
(నరసింహదాసు చరిత్ర)

నిచ్చి కనకాభిషేక మొనర్చి మహావైభవంబున పునర్దర్శనమయ్యెడు గావుతమని యర్థించి, కొంతవడి వెంట నడిచి వీడ్కొనియెను.

అట్లా నరసింహాభక్తవర్యుండు ఖరసంవత్సర ఆషాఢ కృష్ణ చతుర్దశినాటికి భద్రాద్రిం జేరి, మహామాత్య సందర్శన మగుటయుఁ, దాలూకాధిపత్యము లభించుటయు, నిమ్మహా వస్తువాహనమ్ము లబ్బుటయు గజాంతైశ్వర్యము చేకూరుటయు స్వామీ! భవదీయానుపమాన కృపాతిరేక వశమున నే యని సర్వము రామార్పణ మొనర్చి నాటినుండి తాలూకా కధి కారియై, శ్రీరామ కైంకర్యములు వేళతప్పకుండ సక్రమముగా జరుగున ట్లాజ్ఞాపించెను. అప్పటి భద్రాద్రివైభవమును వర్ణింప దరముగాకుండె. ఎప్పుడు మంగళ వాద్యధ్వను లే. నిత్య కల్యాణము పచ్చతోరణము. అది భద్రాద్రికాదు, వైకుంఠము. ఆరామునికి సేవలుసేయించుచు నొద్దనున్నవారు నరసింహ వరదరామదాసుగారలు నారదతుంబురులు.

ద్విపద : రామునకు దయాది ♦ రాజిలఁదగిన
శ్రీమద్విధులకొప్ప ♦ చెల్వంపు గృతులు
గద్య పద్యాదులు ♦ కడు హృద్యములుగ
విద్యారసపౌఢి ♦ వెలయఁగావించి
శ్రీరాము సత్పదాం ♦ చిత పూజలందు
గోరికలార నె ♦ క్కొనగ స్థాపించెఁ
గాడు చుండెల్ల ♦ ప్పటికిని నాకృతులు
వేడుక నారఘు ♦ వీరుసన్నిధిని ॥

(నరసింహదాసు చరిత్ర)

ఇట్లు రామకైంకర్యమునకు మాత్రిమే యచింతితోపగతాధిపత్యము, ననుపమానైశ్వర్యమునంది మహాభక్తుండగుట, దానబ్భోగంబులంజిక్కక నవనీతము తక్రమునందున్నట్లు, జనకుండు రాజ్యముపాలించినట్లు, కుచేలుండు వైభవముల నుపభోగించి నట్లు కనుగలిగి మెలంగుచుండెను.

అంత నాకాలమున భయంకరక్షామదేవత తాండవమాడె. ప్రసిద్ధముకదా నేటికిని నందనకఱవు. అప్పుడీదాసుగారొనర్చిన ప్రజాసేవ యపారము. గొప్పయన్నసత్రము నాయూర నెలకొల్పె. ఎన్నియో కుటుంబము లటకేతెంచె. వినుండు.

ద్విపద : ఎందఱువచ్చిన • నేమి పో యంచు
నందఱి కొనరించె • నన్నదానంబు
శిశువులకును బాలు • చేరియిప్పించెం
బశుసమితికి మేతం • బాటించి కూర్చె
వారమునకు నొక్క • పరిలగడుగు
లాంగ స్త్రీబాల • కాళి కమర్చె
మాల మాదిగలకే • మరక యన్నంబుం
జాలుం జాలనంగ లె • స్సగ సమకూర్చె
ముమ్మార్లు భోజనం • బులు చేయువారు
ముమ్మార్లు తినువిధం • బున నమరించె
బాత్రిలుచాలక • బహుగచ్చుకుండ్లు

చిత్రింబుగాఁగట్టి • చేర్చె బక్వములు
ఆనాడు కట్టించి • నట్టి కుఁడంబు
లీనాటికిని నిల్చి • యొసఁగు భద్రాద్రి
(నరసింహదాసు చరిత్ర)

ఇట్లున్నని తెలుంగుల విజయవత్సర శ్రావణమునఱకు జనులఁబోషించె. నవ్వాల వర్షముగురిసె. సుభిక్షముదరిసె. జనము మురిసె. పాఠకులారా! నరసింహదాసుగారికి శ్రీరాముఁ డుద్యోగమిప్పించిన దెందులకో తెలిసికొంటిరా? కఱవులో ననదలగు పేదల కన్నవస్త్రములిచ్చి రక్షించుటకుఁ జూడీ భగవల్లీలల నెవ్వఁడెఱుఁగఁగలఁడు!

ఎట్టివారికిం బూర్వకర్మానురూప ఫలం బవశ్యమను భావ్యమ నాగండ్ల వరదరామదాసుగారికి క్షయరోగము సంభవించె. నానాటికిం గృశించుచుండె. అప్పుడు నరసింహదాసతనికరముఁ గరమునఁ గీలించి, కాయంబు బుద్బుద ప్రాయంబనియు, నైశ్వర్యంబు నశ్వరంబనియు, జావు కాయమ్మునకు తావనియు, "నిన్ను జెన్నపురినుండి నే భద్ర గిరికి శ్రీరాము సేవలకై తెచ్చినట్లు వైకుంఠమునకు నొప్పఁగ నిన్నుఁగొంచు నరిగెద ననియు, నిది రామాజ్ఞ నెఱవకు" మనియు నూఱడించి తత్సన్నాహమున నుండ, వరదరామ దాసు భార్యయుఁ దల్లియు నేమును మీ వెంట నరుదెంతు మన వల్లెయనియె. తన యర్థాంగియగు లక్ష్మీబాయమ్మగారు నాకును వైకుంఠయాత్రికు సెలవిందు మిముఁ బాసి ధరనిల్వ

నేర నెట్టులన దాసు కొంతవట్టు విచారించి నీకు భగవదాజ్ఞ లేదు. భూమిఁ బండుండుమని చెప్పి మఱియుం గొందఱు భక్తులు మమ్ము మీతోఁ గొంపొండు. శ్రీరామునితో సాకేతపౌరులరుదెంచినట్లు మీతో నరుదెంతుమన నధోముఖుండై మీ మీ యిచ్చచొప్పునఁ జేయుడు. విధినిమాత్రముఁ దాట నేరి తరము? అనిపల్కె. ఆహా! మన భక్తాగ్రేసరుని యందెంత విశ్వాసమో యానాటిప్రజలకు మృత్యుదేవత తనకుఁ గైవసమయ్యెంగావలయు దాసు తనయింటఁగల స్వర్ణరజతమయాది సర్వవస్తువులకు జాబితాలు వ్రాయించి రామాలయముం జేర్చి వలసిన వస్తువుల వలసినవారికిచ్చె.

ద్వి ప ద : ఏమియు లేకుండ • నిల్చూఱవిడచి
ఆమీద రాజకీ • య ప్రసంగములు
దేశపాండ్యాలకుఁ • దెలియబోధించి
వాసిగా సచ్చిలా • ద్వయశాసనముల
పైని శ్రీరాము స • ర్వ స్వర్ణరత్న
మానితాభరణముల్ • మఱియెన్నఁదగిన
స్థిరచరాస్థులపేర్లు • చేర్చి చెక్కించి
సరిగఁ గోవెలయందు • స్థాపనచేసె ॥

(నరసింహదాసు చరిత్ర)

మఱియు వరదరామదాసుగారి యాఱునెలల పుత్రు దాసి చేతులందుంచి సాఁకుమనిచెప్పి తనయొద్దనున్న తమ్ముని

కొమరు రామాఖ్యుని దీవించి మహాప్రస్థాన మహోల్లాసంబున నుండు నెడ వరదరామదాసు రామభజనసేయుచు విగతాసుండయ్యె.

అంత జనులందఱు విస్మయస్వాంతులై చూచుచుండ వరదరామదాసు శవమును వెంటఁదీసికొని కాళ్ళగజ్జెలఁ గట్టుకొని బుజమునఁ దాంబూరఁబెట్టుకొని చేతులఁ బలకలుఁబట్టుకొని కంఠంబులెత్తి భక్తులతోఁ గలసి భజనసేయుచు,

కాంభోజిరాగము — కీర్తన.

పోయెదమయ్యా! వైకుంఠమునకుఁ బోవుచునున్నాము ।

శ్రియః పతిని దలంచి భక్తశ్రేణులకు దండములుపెట్టి ॥పోయె॥ మోదముతో గోదావరి।నాధారముచేసి కొని సాధుజనుల వెంబడి మేము।నరగున శ్రీరాముల జూడ ॥పోయె॥

కూరిమి రాముఁడిచ్చిన । భూరిసంపద్వ్రాతమెల్ల కోరికలూరఁ గ్రిమ్మఱి । శ్రీరాముని సన్నిధిఁజేర్చి ॥పో॥

కోరి యీ శరీరముల । శౌరికర్పణముసేయ । శ్రీరామభక్తులును నార । సింహ దాసుఁడనెడి నేనును ॥పో॥

అని భజనసేయుచు నృత్యములు సలుపుచు నమ్మూకతోఁగదలి యరుగుచుండ నంబరతలంబున నంబుజాక్షుఁడు కోదండంబుంబూని నయనంబులకుం గోచరింప.

కీర్తన — ఆదితాళము.

అడుగో కోదండపాణి అడుగో । భద్రాచలేశుం ॥అడుగో॥

అళిసముదయము । నదలించెడిబల్ । తళుకు ముంగు
గుల । బెలుకులుగలవా ॥డడుగో॥

చందురుగుచికడు।మందముచేసెడి।పొందుగలుగు మో ।
మందముగలవా ॥డడుగో॥

తీరుగ కస్తురి।తిలకము మెఱయఁగ।చారుభ్రూయుగపు।
సైగలుగలవా ॥డడుగో॥

వెన్నెలనీనెడు । సన్నపునగవులఁ । జెన్నలరెడు । నా
పన్నరక్షకుం ॥డడుగో॥

కంబుకంఠమున । ఘనరుచిగలర । త్నంబుమెరయు
శ్రీ । దశరథరాముం ॥డడుగో॥

వాసిగ భద్రగి । రీశుఁడగుచు భువి।గాసిలు నరసింహ ।
దాసునేలువా ॥డడుగో॥

(విస్తరభీతి సాంతమువ్రాయ విరమించితి)


ఇట్లు భక్తబృందముతోఁ గలసి నయనగోచరుండై
నవ్వుచున్న శ్రీరామమూర్తి నాపాదమస్తకము వర్ణించుచు
క్రీస్తుశకము 1833-34 విజయవత్సర భాద్రపద కృష్ణచతుర్థీ
సౌమ్యవాసరమున రవి పశ్చిమాద్రిఁ జేరుతఱి వీధులం బోవు
చుండఁ బువ్వులఁ జల్లువారును, నెదురువచ్చి దండాపతితులగు
వారును, మెండుగాఁ గొండాడువారును, వారువోసి నమస్క
రించువారును, దోడఁజనువారును, నబ్బురపడువారును, ఈ
మార్గ మవలంబించినవారు తొల్లి పాండవులని వింటిమి. నేఁడు

మిమ్ముఁ గంటిమని యుప్పొంగువారునై పౌరులెల్ల రనుగమింప మున్నీని మన్నేటిదేవేరి యగు గోదావరీ నదీతీరముం జేరి వెనుకకు మఱలి దేవాలయ శిఖరోపరిచక్రముం జూచి నమస్కరింప నది యంగీకారసూచకముగా గిరగిర తిరిగెనఁట. అంత నానైకుంఠయాత్రికులు నెన్నంటి బడవలపై నెక్కి దాసును బురస్కరించుకొని భజనలు సేయుచు, నితరజనులీ యద్భుతముంజూడ, మఱికొన్ని పడవలపై నెక్కి వచ్చుచుం బరిపరి విధములం దలంచుచుండఁ గొంత దవ్వరిగిరి అట్టియెడ నిది యత్యంత సాహసకార్యమని గాని, ఇది యాత్మహత్య కాదా యనికాని, అడ్డుపెట్టుట యుచితమనిగాని, తలంచువారు లేరైరన్నచో నాదాసుగారి యచంచల గాఢభక్తి వైరాగ్యములం దెంత విశ్వాసముండెడిదో వేఱ నుడువ ననవసరము. అట్లు వారు నడిపాయకరుగ గోదావరీ వారి సముత్సాహంబునం బొంగి తరంగహస్తంబులం బిల్చుచుండ "జయ రమారమణ గోవిందహరే" యను నారావంబు భూనభోంతరాళంబులు నిండుచుండ, వేలకొలది జనంబులు పరివేష్టించి ప్రతీక్షించుచుండ, ముందు వరదరామదాసు కళేబరఁబు దాసు గంగలోఁ గలిపె. అంతలో నానదియొక్క పెట్టున బొంగి రామరామ రామా యనుచున్న లక్ష్మీనృసింహదాసును దరంగహస్తంబులఁ గౌఁగిలించి యదృశ్యం బొనర్చె. తత్క్షణము మిగిలిన పదునేడుగురుభక్తులు లక్ష్మీబాయమ్మతో గుభేలున నాగోదావరిలో దుమికిరి. అప్పుడు,

ద్విపద: వింతగానొకదివ్య ♦ విమల తేజంబు
ఘనతరసూర్య ప్ర ♦ కాశంబుమించి
జనములుసూడంగఁ ♦ జనె వియద్గతిని॥"

(నరసింహదాసు చరిత్ర)

వారు వీరనక యెల్లర కాదివ్య తేజంబు గన్పింప నిది లక్ష్మీనృసింహదాసుగారి దివ్యతేజంబని తలంచి యపరిమితాద్భుతముల నందిరి.



త్యాగరాజస్వామి

మనస్సు కామసంకల్పములతో గూడినపు డశుద్ధము, కామరహిత మైనపుడు శుద్ధము. అశుద్ధమైనమనస్సు బంధమును శుద్ధమనస్సు మోక్షమును సమకూర్చును; అనగా విషయాసక్తమైనపుడు పునరావృత్తి విషయరహితమైనపుడు బంధవిముక్తిఅనుట, విషయముల మనస్సున కంటనీకుండుట, సాధకుల కర్తవ్యము. విషయములంటని మనస్సు స్వస్థానమున నిల్చి భగవద్రూపియగును.

మనిషియన మనోనిగ్రహము గలవాడే. మానవుడు సాధింపవలసిన ఇహపరములు రెండింటికిని మనోనిగ్రహమవసరము. మనోనిగ్రహము లేని వాని జీవితము దుఃఖమయము. భగవంతుడు సగుణ, నిర్గుణస్వరూపుడు. సగుణసిద్ధి గడించిననే నిర్గుణ సిద్ధిలభించుట. ముందు సగుణోపాసనము ద్వారా మనోచంచలంబూడ్చిన, గ్రమముగ నిర్గుణసిద్ధి యలవడి అసంప్రజ్ఞాతసమాధి యలవడు. శబ్దబ్రహ్మము నజపంకటించి సాధనసాగించిన, సులభముగ సగుణ నిర్గుణసిద్ధులలవడి సాధకుని కృతార్థుని గావించును. శబ్దబ్రహ్మపరబ్రహ్మల కభేదము, శబ్దబ్రహ్మోపాసనవలన నచిరకాలముననే, భ్రమరకీటన్యాయమున నుపాసకు డుపాస్యు డగుచున్నాడు.

ఒక్కడైన పరబ్రహ్మమే జలచంద్రన్యాయమున ప్రపంచమునం దంతట నిండియుండుట దెలిసి నానాత్వమం



త్యాగరాజస్వామి

దేకత్వమును లక్షించుచు శబ్దబ్రహ్మము నుపాసింపవలయు నను రహస్య మెఱింగి తరించిన పుణ్యమూర్తి మన త్యాగ రాజమూర్తి.

తండ్రి రామబ్రహ్మము, తల్లి శాంతమ్మ. ఇంటిపేరు కాకరవారు. సోదరులు. 1. పంచాపకేశుడు, 2. రామనాథుడు. జనన స్థలము చోళమండలమునందలి తిరువారూరు (పుణ్య క్షేత్రం) పెరిగినది కుంభకోణసమీపమునగల పంచనదము. త్రిలింగబ్రాహ్మణుడు, కాలము క్రీ.18వ శతాబ్ది. అన్నలకుమించిన మేధాసంపద గలవాడగుట తండ్రికృపకు పాత్రుడైనాడు. పంచవర్షప్రాయమం దక్షరాభ్యాసమైనది. సంవత్సరములోపలనే బడిచదువు పూర్తియైనది. పిదప దండ్రివద్ద సంస్కృతము జదివి. పండితుడైనాడు. 8వ యేట నుపనయనము, శొంఠి వెంకటరమణయ్యగారికడ సంగీత మభ్యసించి రాగాలాపము జేయుట, పల్లవిబాడుట, నూతనకల్పనలు జేయుట, లక్ష్య లక్షణముల సమకూర్చుట, సమగ్రముగ సాధించి పేరువడసినాడు. పదునాల్గవయేట దండ్రియు, బదినైదవయేట దల్లియు బరమపదించినారు. పదియారవయేట, కాంచీపురవాసియగు భాగవతాగ్రణివలన రామతారకమును గ్రహించి, దేశికాచార్యానుమతి రోజునకు 125 వేల ప్రకారము 38 యేండ్లకు సరిగా 96 కోట్ల జపముగావించి శ్రీరామసాక్షాత్కారభాగ్యము గ్రహింపగలిగినాడు. అనుకూలవతియు సుశీలయునైన కమలాంబ యను భార్యతో నిర్బాధకరముగ జీవయాత్ర గడపుచుండె.

ఒకప్పుడు త్యాగయ్య తన్మయుడై శ్రీరాముని "ఏల నీదయరాదూ" అను కీర్తన అఠాణారాగములో బాడుచుండు తరి, నెందుండియో ఒక యోగివచ్చి భక్త్యావేశముతో గాన మొనర్చు త్యాగయ్యనుజూచి మైమరచి నిలువబడిపోయినాడు. త్యాగయ్యగారు కొంతవడికి గన్నులు దెరచి యోగిపుంగవుని గాంచి నమస్కరించి యపరాధమును క్షమింపుమని వేడుకొని యుచితరీతి సత్కరించినాడు.

అంత నాయోగివరుండు నేను కావేరీస్నానమాచరించి వచ్చెద; నంతవఱకు నీయొద్ద నుంచుమని చెప్పుచు నొకతాటి యాకుల గ్రంధము త్యాగయ్యగారి కొసంగి జననినాడు. భోజనకాలమునకు రాలేదు. రెండురోజులు జరిగినది. అతిధి జాడయేలేదు. భార్యాభర్తలు నిద్రాహారములమరచి దుఃఖించు చున్నారు. మూడవరేయి జరుగుచున్నది. త్యాగయ్యగారికెట్లో నిదురబట్టినది శ్రీరామమూర్తి స్వప్నమున గోచరించి "నీకు గ్రంధమిచ్చిపోయిన యోగి నారదుడు. అత డొసంగినగ్రంధము స్వరార్ణవము" అనిచెప్పి యంతర్ధానమైనారు పెన్నిధిగన్న పేద చందమున నాతడు బ్రహ్మానందమంది భార్యతో నాదివ్య స్వప్నవృత్తాంతముజెప్ప దంపతులిద్దరు దమ యదృష్టముగొని యాడుకొనుచు నిత్యకృత్యముల బ్రవర్తింప గడంగిరి.

ఏకాదశి యుపవాసము. ద్వాదశిపారణ. తులశిపూజ వీరికి విడిపోని వ్రతములు. జ్ఞానభక్తివైరాగ్య పూర్ణుడును సంగీతవిద్యా పారంగతుడు నగు వట్టాల గోవిందదాసుగారి

కొకరేయి స్వప్నమున శ్రీరామచంద్రుడు దర్శనమిచ్చి "నీవు రేపే బయలుదేరి త్యాగరాజస్వామిని దర్శించి వారిగాన, మాధురి నాఘ్రాణించి రమ్మని యాజ్ఞాపించు కారణముగ నాతడు శ్రీస్వామివారిని దర్శించి, గానసుధారసమాని సెలవుగొని పాండురంగదర్శనార్థియై పండరిపురమున కేగినాడు.

మఱియొకప్పుడు గంగాతీరవాసియగు రామదాసను భక్తశిఖామణి తనకు స్వప్నమున లభించిన రామాజ్ఞనను సరించి తిరువారూరున కరిగి, స్వామివారికి తనగానమును విని పించి, స్వామివారిగానమును విని సంతసించి, గానకళ నుద్ధరింప వచ్చిన యపరనారదావతారునిగా బ్రశంసించి వెళ్ళినాడు.

తంజావూరు, మైసూరు, మహారాజు లొకరొకరుగా జనుదెంచి తమతమ యాస్థాన విద్వాంసులుగానుండ ప్రార్థించిన "మా రామచంద్రుడు బీదవాడైనప్పుడు మిమ్మాశ్రయింపగల"ననిసమాధానమిడిన కారణముగా, నిజసోదరులు కుట్రజేసి శ్రీవారి పట్టాభిషేకపంచకమును కావేరిలో బారవేయ నిద్రాహారములు మరచి దుఃఖించుచు, తనకు స్వప్నమున సాక్షాత్కరించి కావేరినదిలో పట్టాభిషేకపంచకమున్న స్థలము నెఱిగించిన శ్రీరామవాక్యానుసరణి వర్తించి, తనయర్చామూర్తుల పరిగ్రహించిన భక్తాగ్రిణి త్యాగరాణ్మణి.

ఎడతెరిపిలేని భక్తితో గానలోలుని గీర్తించుచు బయలుదేరి రంగనాథునిదర్శించి కీర్తించి, వరదరాజస్వామిని సేవించి దివ్యగానామృతమున నభిషేకించి వెంకటరమణు దర్శింప దిరుమలకేగె. అప్పుడు స్వామి తెఱచాటైయున్నాడు "తెఱ

దీయఁగరాదా, తిరుపతి వెంకటరమణ'' అని తన దివ్యగాన ముతో జాలిగొనవేడినాడు. వెంటనే ఆ తెర తెగిపడినది, స్వామిదర్శనమైనది. దీన త్యాగరాజుని మహిమలోకమున వెల్లడి యైనది. బాల్యసఖుఁడగు సుందరేశ్వరుని కోర్కెపై నాతని యింట గొన్ని దినములుండి సెలవుగొని సుందరేశ్వరు డొసం గిన బల్యంకిక నెక్కి బయనించుచుండ, మార్గమధ్యమున గల యడవిలో దొంగలు రాలురువ్వ మొదలుపెట్టిరి గాని వారు రువ్విన రాళ్లు తిరిగి వచ్చి వారినే బాధింపసాగినవి. ఇద్దరు వీరులు త్యాగరాజును రక్షించుచున్నటులవారికి బొడగట్టెను. దొంగలు మహాత్ముడని గ్రహించి శరణుజొచ్చిరి.

శ్రీవారి మహాత్మ్యములు పెక్కులుగలవు, పలువురు చరిత్రకారులు గ్రంథస్థములు గావించియున్నారు. చర్విత చర్వణభీతి నిందు జేర్పమానితిని, పాఠకులు క్షమింతురుగాక.

ఈ మహాత్ము డిరువదినాలుగు వేలకృతులు ఆస్తిక నైతిక సాంఘికములుగా రచించుటయేకాక, నౌకాచరిత్ర ప్రహ్లాద భక్తవిజయము మొదలగు భక్తిరస ప్రధానములగు నాటకములనుగూడ రచించి భాషాసేవ గావించినాడు.

శ్రీరామునివలన తనప్రాణప్రయాణ సమయమెఱిగి తనసమాధి కావేరీతీరమున నెలకొల్పుడని శిష్యులకు జెప్పి, క్రీ. 1847 సం॥ పరాభవ పుష్యబహుళపంచమి పుణ్యదినమున మన త్యాగరాజస్వామి శ్రీరామునియం దైక్యమైనాడు.

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి

సాంఖ్యతారకామనస్కములని యోగములు మూడు విధములు. ఈ మూడు యోగములును ప్రత్యక్ష పరంపరా సాధనములుగూడ నగుచున్నవి. యోగత్రయసిద్ధివలన, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాంతరింద్రియ ప్రాణపంచకమాత్రా పంచక స్థూలసూక్ష్మకారణశరీర కామక్రోధాది దుర్గుణ విజయ మలవడి బ్రహ్మైక్యస్థితి లభించును.

ఇందు తారకయోగము జీవస్వరూపమును, సాంఖ్య యోగ మాత్మస్వరూపమును, అమనస్కయోగము బ్రహ్మైక్యస్థితిని గలిగించి సాధకుని ధన్యునిగా చేయును.

పూర్వభవమునందు సాధకునకు యోగభ్రష్టత గలిగిన గొరవడిన యోగమును పూర్తిగావించుకొని ఉత్తరజన్మలో గమ్యము నందగలుగుచున్నాడు. ఇతడు జన్మతోనే జ్ఞాన పూర్ణుడు, సర్వజ్ఞుడు, సర్వశక్తిసంపన్నుడు. వీనికి సర్వవిద్యలు తమంత దామై వరించును. అవతారపురుషుడన నిట్టివాడే. ఇట్టి పుణ్యులలో బోతులూరి వీరబ్రహ్మేంద్రస్వాములవా రొకరు.

తండ్రి నందికొండపాపఘ్ని మఠాధ్యక్షుడైన వీరభోజ యాచార్యులు. తల్లి వీరపాపమాంబ. జననము 17వ శతాబ్దము. తల్లి దండ్రులు భారతదేశమునంగల తీర్థయాత్రల జేయుచు, మహాత్ముడగు అత్రిమహాముని యాశ్రమమున కేగి, ఆతని సన్మానమంది విశ్రమించి యున్నతరి, మునివరుడొక

బాలుని గొనివచ్చి వీరభోజునకిడి వీని యౌరసునిగా గ్రహించి పోషింపుమని సెలవొసంగిన. వల్లెయని పుత్రుని స్వీకరించి నందికొండకేగి అతిగారాబమున ప్రేమించి పోషించుచుండిరి పిదప పరిపూర్ణాచార్య ప్రకృతాంబ లీపిల్లవాని తలిదండ్రులనియు, వారు పరమపదించిరనియు గర్ణాకర్ణి వినినవారగుట, రెట్టించిన ప్రేమతో బెంచుచుండ. బుత్రుని పదియవవర్ష ప్రాయమున పెంపుడు తండ్రి గతించినాడు.

ఇప్పటికి బ్రహ్మంగారికి విద్యలుపూర్తియైనవి. తల్లి యనుజ్ఞవడసి తీర్థయాత్రలకు బయలుదేరి దివ్యక్షేత్రముల దిలకించుచు, గ్రమముగ జనగాంపల్లెఁజేరి గరిమరెడ్డి అచ్చమ్మ గారియింట గోపాలకుడైయుండి కాలజ్ఞానము వ్రాయమొదలిడెను. పశువుల గాయుకాలమున జరిగిన శ్రీవారి నిత్యకృత్యము ఉదయమున లేచి గోశాల శుభ్రముగావించి, రాగి సంకటిముద్ద మూటగట్టుకొని గోవుల వెంట బీటికి జని, అందొక గిరిగీసి ఆ గిరిలో నావుల దోలి, తానొక పొదరింట జేరి కాలజ్ఞానము వ్రాయుచు. బొద్దుగ్రుంకినతోడనే తాను వ్రాసిన తాటియాకులను అచ్చమ్మగారి యింటి ప్రక్కగల పాడుపాతరలో వైచి మూయుచుండువాడు.

ఇతనిపాలనలో నున్నగోవులు క్షీరసమృద్ధి పశుసమృద్ధి గలవైనవి. ఒకనాడు కొందరు పథికులు దారినబోవుచు గాళ్లు కదలనీక నెమరులు వేయుచుండ జూచి, ఆశ్చర్యపడి వాటి నదలించిరిగాని కదలలేవు, మెదలలేవు. పాలకుడు లేమి విచారించి, ఆ ఆవుల బీటిమేతకు ద్రిప్పజూచిరి కాని ప్రయో

జనము లేకపోయినది కాగా, వారికి నేత్రావరోధముగూడ సంభవించిన భయపడి, తమతమప్రయత్నమును మాని, వచ్చినదోవబట్టిరి. వెంటనే నేత్రావరోధము దొలంగినది. వారువచ్చి అచ్చమ్మగారి కీవృత్తాంత మెఱింగించిన నామె గారరుదెంచి గోవుల నదలించిచూచి నిజమెఱింగి పాదలో గూరుచుండి యేమేమో వ్రాసికొనుచుండు బ్రహ్మంగారిని బహువిధముల బ్రస్తుతించి ప్రసన్నుని గావించుకొనినది.

బనగాంపల్లె నబాబు బ్రహ్మంగారి మహిమల గనుంగొనుటకై విందునకు బిలిచి మాంసాదుల వడ్డింపించిన నవి స్పర్శమాత్రమున ఫలపుష్పములైనవి. వానికి నబా బబ్బురపడి శ్రీవారి ననేకవిధముల స్తుతించి ప్రసన్నునిగావించుకొని ధన్యుడైనాడు. తదుపరి అచ్చమ్మగారికి జ్ఞానోపదేశము గావించి, సబహుమానముగా బయలుదేరి కందిమల్లాయపల్లె జేరి అక్కడి జనులకు దనమహిమలజూపి, గోవిందమ్మను వివాహమై నిజ భార్యతో మహాక్షేత్రముల దర్శించుచు, నక్కడక్కడ దత్త్వోపదేశములచే జనుల దృప్తిపరచుచు, గొంతకాలమున కింటికిజేరి పుత్రపుత్రికాసంతానమంది సుఖంబుండ, మునుమూరి పీరుసాహెబు కుమారుడగు సిద్దయ్య వచ్చి నమ్రుడై ప్రార్థించి శిష్యపద మర్థించి కృతకృత్యుడైనాడు.

శ్రీస్వాములవారు సిద్దయ్యగారికి బహ్మోపదేశము జేసి యాదరించుటయే కాక సాంఖ్యతారకామనస్కములను దృగాత్మ నిర్ణయమును హంసస్వరూప నిర్ణయమును, స్వర

శాస్త్రమును ఛాయాపురుషలక్షణమును బోధించి కృతార్థుని గావించినాడు.

తదుపరి దక్షిణదేశ సంచారమున నొకచో కుష్ఠువ్యాధిగ్రస్తుడైన భర్త తొడపై నిడుకొని దుఃఖించుచుండు బ్రాహ్మణస్త్రీనిజూచి దుఃఖకారణమడిగి తెలిసికొని తీర్థప్రసాదములతో నారోగ్యవంతుని గావించినాడు.

ఒకప్పుడు సిద్దయ్యగారికి షట్చక్రాధిపతులైన దేవతల స్థానముల నిరూపించి చెప్పుచుండ, చాటుననుండి విన్న కక్కయ్య అను మాలవాడు ప్రత్యక్షముగ జూడగోరి, భార్య నిదురించుసమయమున నామె దేహము జీల్చె. స్వామివారు చెప్పిన స్థలములందు దదధిదేవతలు లేమి చింతించి, శ్రీవారి కడకరిగి తనఘోరకార్య మెఱింగించి దుఃఖించిన, కరుణామయుడైన బ్రహ్మంగారు వెంటనే ఆతని వెన్నంటి వచ్చి, శవముపై నిజకమండలోదకము ప్రోక్షించియు, హస్తస్పర్శ గావించియు నామెను నిదురనుండి లేపినట్లు బ్రతికింపజాలినాడు. ఆమెయు స్వామివారికి వందనశతము లర్పించి ధన్యయైనది.

పిదప నంద్యాల బ్రవేశించి దాహమిండనిన నాయూరి విశ్వబ్రాహ్మణులు శ్రీవారి ప్రభావ మెఱుంగగోరి, కరగిన సీసరసముతో నిండిన మూసను పటుకారుతో బట్టి తెచ్చి చేతి కిచ్చిరి. వెంటనే తప్తలోహమును ద్రావి దాహము తీరినదని చెప్పుచు, చిరునవ్వొలయించి తనయాత్మశక్తి రూపొందించిరి. మఱియొకప్పుడు పదమూడుబస్తాలబియ్యము వండించి ఆరగింపు

డన, మందహాసముజేయుచు ఈ స్వల్పకార్యమునకు నేనేల, మాసిద్ధ డాచరించి మీకు దృష్టిగల్గించునని జెప్పుచు సౌజ్ఞ జేసిన, గురుమూర్తియాజ్ఞ దలధరించి యొక్కమెతుకేనియు మిగులనీక నారగించి తేపిన సర్వశక్తిపూరితుడు సిద్ధయ్య.

మఱియొకప్పు డహోబిలమున కేగు మార్గమధ్యమున గల వటవృక్షవాసియగు బ్రహ్మరాక్షసిని నిర్జించి యాత్రికులకు మార్గావరోధమును దొలగించినాడు. బ్రహ్మంగారు మన కడప నబాబువండి వడ్డించిన మాంసాహారము నదృశ్యమగునట్లు సంకల్పించి కృతార్థుడైనాడు. కడపనుండి అల్లాపల్లె వీరభద్రుని సేవింపనేగుతరి యెదుర్కొనిన దొమ్మండుగురు దొంగల దేహాంగబంధ మేర్పడునట్లు శాపమొసంగి వారికి గర్వభంగము జేసినాడు.

శ్రీవారు కలియుగాది 4692 సంవత్సరమున సజీవ సమాధి నలంకరించిరి. వీరి మహోపదేశములు బ్రతిసాధుని నోట వినెడివారమే యగుట విస్తరింప బనిలేదని తలంచెద. వీరు వెల్లడించిన మహోపదేశములతో నిండిన తాళపత్రములను దాచియుంచిన ప్రదేశమున గలచింతచెట్టిప్పటికిన్ని కనిపించుచున్నది. దేశవిప్లవసూచకముగా అందు బూసిన పూతయంతయు నొకేరోజు రాలిపోవునట.

దూదేకుల సిద్ధయ్య

భగవంతుడుసర్వమయుడు, సర్వశక్తిపూర్ణుడు అగ్నిని. వేడి, వెలుతురు లెట్లు వీడిపోవో అట్లే భగవంతుని యాత్మశక్తియు భగవంతునిదయయు వీడిపోవు. ఆభగవచ్ఛక్తి యొకప్పుడు బయటికి దోచుటయు, మఱియొకప్పుడు లోపకుండుటయు గూడ గలదు. ఈశక్తి భగవంతునిలో గుంభించినప్పుడతడు నిర్గుణుడు, బయటికి దోచునప్పుడు సగుణుడు. ఈశక్తియే భూతచలనమునకు గారణము. ఇది తేజోమయమైనది. ఇందుండి లేచినట్టియు, ప్రతిప్రాణిహృదయగతమైనట్టియు అణుస్వరూపమాత్రి తేజోబిందువే ఈశ్వరుడు

కనుపాపలమధ్య నివాసియైనట్టియు, పరమాణుస్వరూపమైనట్టియు తేజోబిందువు జీవుడు. జీవస్వరూపమైనదృక్కును, దృశ్యమగు ప్రపంచమును సాధకుడగు ద్రష్టయు నీమూటిని త్రిపుటి యనబడును. ఈ త్రిపుటిరహితమే ముక్తి. విడివడినపుడు సంసృతి. భౌతిక శరీరమందంతట వ్యాపించియున్న వ్యానవాయువునకు ద్విగుణము లావరించి భగవచ్ఛక్తిని మఱుగుపరచుటచే నేర్పడిన వికారమే, నేననుస్ఫృహకు గారణము. ఇది నిజముగాదు. భౌతిక దేహమునగల పరిచ్ఛిన్న వ్యాన వాయుగతమైన శుద్ధచైతన్యశక్తియే నేననుస్ఫృహకు గారణము.

ఈ గుట్టెఱింగినవాడే జ్ఞాని, ఇది తెలియనివా డజ్ఞాని. అజ్ఞాని శరీరమనస్సుల నేకముజేసి, నేను అనుచున్నాడు. జ్ఞానియో, మనోదేహములకు విలక్షణమై, ముఖ్యప్రాణవాయువున కంటి

యున్న శుద్ధచైతన్యశక్తిని పురస్కరించుకొని "నేను" అను చున్నాడు. జీవశక్తి ఉన్నతములైన పర్వతాదులను, సూర్య చంద్రాదులను సైతము, లోబరచుకొనుచున్నది. ఈశ్వరశక్తి సృష్టిస్థితిసంహారముల కాకరము. మఱియు నవసరానుసరణి జాగ్రత్స్వప్నసుషుప్తులయందు క్రమముగ నేత్రకంఠ హృదయములం దప్పుడప్పుడు దిగుచుండు స్వభావముగలది. జీవశక్తి, హృదయమందు స్థిరనివాసమేర్పరచుకొనినదియు ముఖ్యప్రాణాశ్రితమైనదియునైన తేజోబిందువే ఈశ్వర శక్తి. ఈరహస్య మనుభవపూర్వకముగా గుర్తించిన వాడే సర్వజ్ఞమూర్తి. సర్వశక్తిపూర్ణుడు. త్రికాలవేది. ఇట్టివాడే మన సిద్ధయ్య.

ఈతని నివాసము కడపజిల్లా ముడుమాల. తల్లి ఆదంబి, తండ్రి పీరుసాహేబు. సప్తమవర్షప్రాయమున బడిలో బ్రవేశించి పదునాల్గవ వత్సరప్రాయమునకు చదువు పూర్తి చేసి, శమదమాదిగుణములతో భక్తిప్రపత్తులుగల్గి విరాజిల్లుచు, బ్రహ్మవిద్యాసంపన్నుడగు దేశికాచార్య సేవాభాగ్యమలవరచుకొన వేచియుండుతరి, కర్ణాకర్ణిగా వినినవాడగుట, బితురుల కెఱింగింపకయే బయలుదేరి, కందిమల్లాయపల్లె వేంచేసియున్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామివారి కడకరిగి, సాష్టాంగవందనం బాచరించి, "సద్గురూ! సకలభువనాధారా! సచ్చిదానందస్వరూపా! వీడిని శిష్యునిగా గైకొను"డని ప్రార్థించి, నమ్రుడై నిలచిన, స్వామివా రాతని దీవించి, అంతేవాసిగా నంగీకరించె.

అంత బీరుసాహెబు పరబ్రహ్మేంద్రస్వామివారియొద్ద కందిమల్లాయపల్లెలో తన కుమారు డున్నాడని తెలిసి, జను దెంచి సిద్దయ్యనుగాంచి, "బిడ్డా! ఇంటికి రమ్ము పోదము, అన్నాడు." నేనురాను. ఇక్కడుండి ఏమిచేయుదువు? స్వామి వారి యొద్ద బ్రహ్మవిద్య నేర్చుకొనియెద ! చదువంతయు వచ్చినదిగదా, ఇకబ్రహ్మవిద్య యనునెట్టిది? అది వేదాతీత మైనది, త్రిమూర్తుల కందనిది. దివ్యజ్ఞానులసొమ్ము, అన్నాడు సిద్దయ్య. నీవు మహ్మదీయుడవుగదా! ఐననేమి? హిందూమతావ లంబననేల కావలయు? మనవారు నిన్ను వెలివేయరా? వృద్ధు లగు తల్లిదండ్రుల సేవకంటె బ్రహ్మవిద్య గొప్పదియా? తల్లి దండ్రుల కష్టపెట్టువారికి ముక్తి యెక్కడిది? అను తండ్రిని దిల కించి ముందు బ్రహ్మవిద్య నార్జించి పిదప మిమ్ము సేవించి ధన్యుడ నయ్యెద. నా మనం బీపరబ్రహ్మేంద్రున కర్పించితి. దిరుగనేరను. తల్లి, దండ్రి, గురువు దైవము, కులము, స్థలము వేయేల ! సర్వము నాకు గురుమూర్తియే, అని ఖండితముగ జెప్పి విరమించె.

పుత్రుని గాఢవిశ్వాసమున కుబ్బుచు, బీరుసాహెబు తిరిగి యింటి కేగి నిర్విచారుడై యుండె. ఇట్లు గురుసేవమరిగి తిరుగుచు గ్రమముగ సాంఖ్యతారకామనస్కములను లక్ష్య త్రయమును, దృగాత్మ నిర్ణయమును, హంస సంచారక్రమ మును ఎఱింగి ఆత్మశక్తి పూరితుండై అజ్ఞులకు దేరిచూడ రాకుండె.

తండ్రి పీరుసాహెబు మతాభిమానులు దుర్బోధకు లొంగి వీరబ్రహ్మేంద్రస్వామినుండి తన కుమారు నిప్పింప వలసినదిగా కడప నబాబు యొద్ద పిర్యాదుజేయ నాతండు తన ముందు హాజరుగావలసినదిగా బ్రహ్మంగారికి తాకీదు పంపినాడు. దాని నెఱింగి సిద్ధయ్య తండ్రియవ్యక్తమునకు కటకటపడి దేశికాచార్యానుమతి రాజసేవకుని వెన్నంటి బయనముసాగించి నబాబుముందు హాజరైనాడు. నీ పేరేమి? సిద్ధడు కులమేది? దూదేకులము; మతభ్రష్టుడవైతివా? లేదు, హిందూ మత మవలంబించినావటగా, లోకమున మతము లనేకములు గాని దేవు డొక్కడేగాదా, ఏమార్గమున నడచినను గమ్యము దొరకును. తగిన గురుని దొరకమి వీరబ్రహ్మముగారి నాశ్రయించినాడ; నిదితప్పగునా? నీకు జేతులుఅయినా గలవా? ఉన్నవి. ఉండిన నాకు సలాముజేయ వేల? నా సలాము నా గురుతప్ప మఱియొకడు భరింపలేడు. గాన జేయలేదు, నీ గురువంత గొప్పవాడా! అవును నేజేయెత్తిన నీకు బ్రమాదమువచ్చునేమో, అనుభయము నన్ను బాధించినది. బరీక్షింప నెంచిన నల్లరాతిగుండు దెప్పింపుము. అది యేమగునో చూడగలవు. అను సిద్ధయ్యమాటవిని నబా బురియాడు చిత్తముతో రుబ్బుడు పొత్రమును తెప్పించి ముందుంచిన, సిద్ధప్ప, గురుప్రభువును దలంచుచు జేతొట్టి ఆ నల్లరాతికి సలాము గావించిన నది పెటపెట ధ్వనులతో ముక్కలక్రింద తయారయినది. నవాబు చూచినాడు, వడకిపోయినాడు. లేచి సిద్ధయ్యకు వేలకొలంది

వందనములు గావించి భక్తిప్రపత్తు లుల్లసిల్ల బూజించి సబహు మానముగా వీడ్కొల్పినాడు.

గురుమూర్తిని దర్శించి సర్వ మెఱింగించి కృతార్థుడైనాడు సిద్ధయ్య. ఒకప్పుడు పంచానన తెగకు జెందిన వారు కొందఱు నంద్యాలనుండి బయలుదేరి వచ్చి బ్రహ్మము గారిని దర్శించి, భిక్షకాహ్వానించిన వల్లెయని శ్రీవారు సిద్ధయ్యతో బయనించి నంద్యాల జేరినారు. వంటలు సిద్ధమైనవి. యజమానిని బిలిచి, "మారువడ్డించుకొనని" నియమముగలదు. దానిని మీరు పాటింపనిచో బ్రమాద పడియెదరు. గాన జాగ్రత గొనుడని ఖండితముగ జెప్పి, భోజనమునకు గురుశిష్యు లిరువురు గూరుచున్నారు. మారువడ్డించిన నేమగునో నారాచెదనని యెంచి, యజమాని వంటవారికి బోధింప వారును విస్తరులయందు భోజనపదార్థముల ముందు కొద్దికొద్దిగా వడ్డించిరి గురుశిష్యు లిరువురది భుజించి లేవనుద్యుక్తులగుడు వంటవాడు శ్రీ వారి కెఱింగింపక నే పదార్థముల మారు వడ్డించిరి. అది చూచి గురుశిష్యు లిరువురు శంభునామస్మరణజేయుచు మారుపల్కక భుజించుచుండిరి. నాడు జరుగనున్న భూరి సమారాధనమునకు తయారు చేయబడిన పదార్థమంతయు, వీరిద్దరికే చాలలేదు. యజమాని భయవినయములు ముప్పిరిగొన నేతెంచి శ్రీ స్వామివారిని ప్రార్థించి ప్రసన్నుని గావించుకొనినాడు.

ఆత్మబలము గలవారి కసాధ్య మెందును లేదు గదా !
1725 సం॥ నం దొకనాడు పూల నెపంబిడి సిద్ధయ్య నావల

కంపి, (శ్రీ) బ్రహ్మాంగారు జీవసమాధిని ప్రవేశించినాడు. పూర్వు లకై వెళ్ళిన సిద్దయ్య బనగానపల్లె పూలతోటలో నుండుతరి, నొక వృద్ధబ్రాహ్మణు డేతెంచి "మీ గురువుగారు సమాధిని ప్రవేశింపనున్నారు. ఆలశించిన దర్శింపలేవు, వెంటనే బయలు దేరు"మని తొందరపెట్టిన మాఱుమాటాడక కందిమల్లాయపల్లె జేరి స్వామివారు సమాధినలంకరించినారని విని, దుఃఖాతి రేకంబున దేహస్మృతిలేక పడియున్న శిష్యునకు నిజదర్శ నం బిచ్చుటయే కాక, విశ్వరూపసందర్శనముగూడ జేయు కుటుంబివి గమ్మని యాశీర్వదించి యంతర్ధానమయినాడు గురువుగారు. అంత సిద్దయ్య గురుమూర్తి యాజ్ఞానుసారము వివాహమై పలువురుశిష్యుల సేకరించి, సద్గురునామస్మరణ ముతో జీవితశేషమును ముగించి 1736 సంవత్సరమున శాశ్వతబ్రహ్మపదవి నలంకరించినారు.

వెంకట్రమణ బ్రహ్మచారి

"అనన్యాశ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహామ్యహం ॥

భగవానుడు పరమదయాకరమూర్తి. ఆర్తరక్షణ వ్యాపార పారీణుడు. ఏదీనులు రక్షణగోరి యనన్యచింతా విముఖులై తన్ను జీరెదరో, కష్టమనియెంచక యెంత దూరమైనను స్వయముగ జని మనోరథముల దీర్చుచు వారి జీవితమంతయు దన తలపై ధరించి నిత్యానందమున దేల్చుచుండువాడు. ప్రహ్లాదాది భక్తులందఱీకోటిలో జేరినవారే. అందునుంచియే అన్నిచింతలుమాని యెవరు నన్నుపాసించుచున్నారో వారి యోగక్షేమమును సర్వమును నేను వహించుచున్నానని శ్రీకృష్ణభగవానులు జెప్పుచున్నారు. పినతల్లి వాగిషుక్షత మానసుండై స్థానాభిలాషియై తపమాచరించిన ధృవమహర్షికి యచిరకాలమున భగవానుడు దర్శనమిచ్చి కోరిన యిహకోరికయు గోరని పరకోరికయుగూడ నిచ్చియున్నాడు. అనగ భగవానుడు కల్పవృక్షము వంటివాడనుట. కల్పవృక్షము క్రిందకూర్చుని మానవుడు సమస్తకోరికలను పొందుచున్నాడు గదా ! అట్లే భగవంతుడను కల్పవృక్షము క్రింద నేనున్నానని నమ్మి యేయేకోరికలు కోరుచున్నారో ఆయాకోరికలు సమకూడును. భగవంతుడు భావప్రియుడు. యేరూపమున దలచువారికి నారూపమున దర్శనమిచ్చును. గనుకనే పరిపూర్ణ ప్రేమయు భక్తిరసపూరితమగు హృదయ

మును గలిగి భగవానుని నే భావమున నెట్లు ప్రార్థించినను అజ్ఞానాంధగారము నశించును. జ్ఞానజ్యోతి పొడకట్టును. ఆయన సాన్నిధ్యము దొఱుకును. కావున నజ్ఞానాంధకారమును నశింప జేసికొని జ్ఞానప్రకాశమును బొందుటకు బ్రయత్నించుట మన కర్తవ్యము అని తొకబంగాళీ భక్తుడు పాడియున్నాడు. భగవంతుడని లోకలిని నమ్మి భవనదిని దాటవచ్చును. ఇట్టి మహాపురుషులలో మన వెంకటరమణ దాసుగా రొకరై యున్నారు. వీరి నివాసస్థలము గుంటూరు మండలమునం దలరాదు అలవలపాడు, ఆఱువేల నియోగి; తండ్రి సుబ్బరామయ్య. పొట్టిగను సన్నగనుయుండి దినమంతయు ధావళి గోచితోనే తిరుగుచుండువాడు. నేను చూచునప్పటికి నడుమువంగిపోయి యున్నది. అల్లే గోదావరినుండి మోసికొనివచ్చి తనసత్రమునకు నీరు సప్లై చేయుచుండువాడు. ఆరంభమునుండి కొంతకాలమువఱ కా సత్రమునకు యజమానియు, వంటవాడును, నీళ్ళవాడును, పూజారియు, సేవకుడునుగూడ తానేయై యుండువాడు. ఈతనికి పదియైదవ వత్సరప్రాయమున తండ్రి సుబ్బరామయ్య మాతృహీనుడైన పుత్రుని దోకొని, సీతాకళ్యాణ మహోత్సవ దిదృక్షాపేక్ష పురికొల్ప భద్రాద్రికేగి, సీతారాముల దర్శించి కళ్యాణ మహోత్సవం బారసి, భగవానుని నిత్యసేవా మహాభాగ్యము గడింపగాబోలు నేత్క్షేత్రంబుననే జీవితశేషము ముగింప దలంపు గలవాడై, పుత్రునితో నంద నివసించి భిక్షాపాత్ర నాశ్రయించి, అభ్యాగతాతిథి పూజా సంపదోద్రిక్తుండై జీవితము సాగింపుచుండి

యచిరకాలముననే దేహము చాలించె. పితృ మరణానంతరము సన్నపూర్ణోపాసకులగు బ్రహ్మచారిగారు, పిత్రాచారమును వీడక భిక్షనెక్కుడుగ సంపాదించి యాత్రికుల నెల్లర నాహ్వానించి యన్నాదికముల సత్కరించుచు, శునక శూకరాది భూతలోకమునుగూడ తృప్తి నందించుచుండువాడు. తన యిరువదియవ వత్సరప్రాయమునం దన్నపూర్ణా సత్రమను పేరుతో నొక చిన్నకుటీరమును, యాత్రికులు నివసించుటకొక పూరిపాకాయును, దేవమందిరమునకొక గుడిసెయు గల్పించి పనిసాగించుచుండిన, భగవదనుగ్రహము పేర్మి యీ కుటీరములే పెద్దసత్రముగ మారినవి. వంటపాత్రలు విస్తారముగ సమకూర్పబడినవి. నిత్యాన్నదాన మవారిగా జరుగుచున్నది. బ్రహ్మచారిగారా నిర్ధనులు. క్షేత్రమునువీడి గూవలకు పోవువారుగారు. తత్క్షేత్రమా మహదారణ్య ప్రాన్తమై యున్నయది. గ్రామమునందు వసియించు గృహస్థులా శ్రీమంతులుగారు. ఇట్టి స్థితిలో సత్రమెట్లు సాగుచున్నదియో, దివ్యమందిరములు మంటపములు ప్రహారిలు ఎట్లు తయారయినవియో తెలిసికొన నేరికిని తరముగాకున్నయది. నిరతాన్న దాన తత్పరుండగు శ్రీమాన్ తూము లక్ష్మీనరసింహదాసుగారి వందనార్చనాది సత్కారములంది సంతసించునట్టి యర్చామూర్తులిప్పుడు బ్రహ్మచారిగారి పూజాది సత్కారములంది సంతసించుచున్నారు గాన నీమూర్తుల కరుణారసదృష్టి ప్రసారమాసత్రముపై సోకి యిట్టి మహోన్నస్థితికి దెచ్చినదనుటలో సందియములేదు.

చూడు డొకప్పుడు సీతాకళ్యాణ మహోత్సవము దిల కించుటకు వేలకొలది యాత్రికు లరుదెంచి భోజనమునకై అన్నపూర్ణాసత్రమునకు స్నానముజేసి వచ్చియుండిరి ఆనాడు సత్రములో భోజనపదార్థములు స్వల్పముగ నుండుటచే యుండినంతవఱకు బచనముజేసి యుంచబడియె. తయారయిన పదార్థములు వచ్చిన యాత్రికులకు జాలవని భయముజెంది వంటలవారు భగవదారాధనము జేయుచున్న బ్రహ్మాచారి గారికి విన్నవించిరి బ్రహ్మాచారిగారు నవ్వుచు పాకశాల కేతెంచి, శ్రీరామానుగ్రహ ముండిన మనకు తరుగు లేదు, వడ్డనపని సాగింపుడని హెచ్చరించుచు, నా పదార్థములపై నొకవస్త్రముగప్పి చేతులు జోడించి. మనము నందీశ్వర సాన్ని ధ్యము గలుగఁజేసికొని యిట్లని వినుతించె.

"ఎవ డీవిశ్వమునకు గారణత్రయ రూపుడై సంకల్ప మాత్రముచే సృష్టి స్థితి సంహారములు జేయుచు జన్మరహి తుడై యుండియు భక్తులకొఱకు నామరూపములు ధరించి యున్నాడో, ఎవనిస్వరూపమును దేవాదులు దర్శింపనేరక నర్చారూపోపాసనము జేయుచున్నారో, ఎవడు ప్రపంచమునకు జనకుడై, పాలకుడై, శేషియై, నాథుడై, జ్ఞేయుడై, స్వామియై, ఆధారుడై, యంతర్యామియై, భోక్తయై, కారణ కార్యరూపియై, విశ్వవిలక్షణుడై, బంధుడై, ఆశ్రితరక్షణైక దీక్షాధురంధరుడై భక్తవత్సలుండై భక్తాభీష్ట ఫలప్రదాతయై యున్నాడో, ఏని యధిష్టానము లేనిచో జేతనము లచేతనములై యుండునో, శ్రీ తూము లక్ష్మీనరసింహదా సార్చన వందనాదు లెవడు

గ్రహించి సంతసించుచు, పూర్వసుకృతము పేర్మి యిప్పుడు మత్పూజలనందుచు నాకాత్మస్వరూపుడై యున్నాడో, అట్టి శ్రీరామమూర్తి యీయన్నాదికములచే భూతతృప్తి గావించునటు లనుగ్రహించుగాక!" యని భగవన్నుతి గావించి యాత్రికుల నుపలక్షించి,

ఉ॥ తక్కువ లేదు నాకు నిరతంబు సుదర్శన చక్రధారియై
ప్రక్కలనిల్చి లోపముల బారగద్రోలుచు సౌఖ్యసంతతుల్
మిక్కిలికూర్చి మించుదయ మేలులొనర్చెడి రాముడుండ
నా కెక్కడిలేము లెక్కడివి యిష్టఫలవ్యతిరేకసంగతుల్ ॥

అని చెప్పుచు దిరిగి వడ్డనకాజ్ఞయిడి భగవదర్చనము పూర్తిజేసి మంత్రపుష్పమిచ్చుటకు దేవమందిరమున కరిగె. ఈమహనీయుని పూజకు కాలనియమము లేదు పుష్పములవసరములేదు. ఫలాదికముల ప్రసక్తి ప్రయోజనకారి గాదు. నోట సహస్రనామము లుచ్చరించుచు నామమున కొక నమస్కారము భగవానున కర్పించుచుండుటయే ఈపూజ కంతము లేదు. రోజునకిరువది సహస్రములు జరుగుననుట యతిశయోక్తి కాజాలదు. ఇది యింతటనిలిపి ప్రస్తుత మనుసరించెద.

అంత యాత్రికులు సూపకారులిడిన నన్నాదికముల బరితృప్తినంది బ్రహ్మచారి ప్రధానమున కభినందించుచు మహోత్సవ దిదృక్షాపేక్ష ముందునకుద్రోయ శ్రీరామాలయమున కేగి, పదంపడి తదుత్సవపరిసమాప్తివఱకు యాత్రికులు బ్రహ్మచారిగారి సత్కారముల బరితృప్తిగాంచి స్వగ్రామముల కేగిరి.

మఱియొకప్పు డనగ నుత్సవదివసములలో నొకనాడు పగలు రెండుజాములవఱకు భోజనపదార్థములంట లేకుండుటయు, గష్టమునకు సహింపలేక వంటవారలు బారిపోవుటయు, యాత్రికులు విస్తారముగ వచ్చియుండుటయు విచారించుచు, శ్రీరామ పాదాబ్జములపై బడి దీనాననుడై బ్రహ్మచారి "దుఃఖింపుచు, రామా! మేఘశ్యామా! త్రిలోకాభిరామా! ఈ తెప్పరంబెట్లు దీర్చెదవో భారమునీయదియ. నీదివ్య గుణకీర్తనముగావించు భారముమాత్రము నాయదియ. నే నసమర్థుడననుట దెలిసియు నుపేక్షవహించిన నీయపకీర్తి ఎవరిదనుకొంటివి? కానిమ్ము, నాపని నేనుజేసెద. తర్వాత నీయిష్టము. ''ఆపదా మపహర్తారం దాతారం సర్వసంపదాం లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహం'' ''రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే। రఘునాథాయ నాథాయ సీతాయాః పతయేనమః,'' ''నమః కోదండహస్తాయ సంధీకృత శరాయచ।దండితాఖిల దైత్యాయ రామాయాపన్నివారణే,'' ''ఆర్తానా మార్తిహంతారం భీతానాం భయనాశనం ద్విషతాం కాలదండం శ్రీరామచంద్రం నమామ్యహం,''అని కన్నులుమూసి వినుతించుచున్నంత.

సీ॥ తిరుశేఖ లేర్పడ తిరునామములు బెట్టి
ధౌతవస్త్రంబులు దనరగట్టి
తులసిపేరులుమెడ దులకరింపగ దాల్చి
నెమ్మేనగంధంబు నెఱిదగిల్చి

వెడ నుత్తరీయముల్ నడుములకు జుట్టి
పుండ్రదండలు శిఖ వ్రేలగట్టి
కుడిచేత జపమాల కొమరొప్ప గాఁ బూని
యెడమచే బల్లెము లెనగనంది

గీ॥ కక్షభాగంబులం బుస్తకముల బూని
నలుపు నెఱుపును గలమేను లలరుచుండ
బొడుగుగల వైశ్యులిరువురు వడిగవడిగ
వచ్చి రాభూసురోత్తమ వసతికడకు ॥

(భద్రాద్రి రామచరిత్ర)

ఇట్లువచ్చి బ్రహ్మచారిం గాంచి నమస్కరించి అయ్యా! మున్నొకపరి విపత్సమయమున మేము మ్రొక్కుకొనిన మ్రొక్కుబడి చెల్లించుటకుగాను శ్రీసీతారామునకు రూప్య శతద్వయంబు బట్టుకొని వచ్చితిమి. గైకొని శ్రీస్వామి వారి కర్పింపుడని చెప్పుచు, రూప్యములచే నింపబడిన పళ్లెర మొకదానిని ముందుబెట్టి రెండునారి కేళములను కర్పూరమును తాంబూలముతో సమర్పించిన, బ్రహ్మచారి సంతసించి శ్రీస్వామి వారికి కర్పూర హారతియిడి నారికేళముల నైవేద్యమిడి కట్నము చదివించి ప్రసాద మాభక్తులకిచ్చి, ''అయ్యలారా! నేడు భగవత్ప్రసాదము గైకొనుట కిటకు భోజనమునకు రండు. మఱియు మీ దేయూరు?ఏకులమువారు?వివరింపుడనిన నందు పెద్దవాడిట్లనియె. "మేము పాలుద్దేశ వైశ్యులము. సీతాకళ్యాణ మహోత్సవము దిలకించుటకును, మ్రొక్కుబడి చెల్లించుకొనుటకును, కుటుంబయుక్తముగవచ్చి గౌతమితటం

బునం దమర్చబడిన కుటీరములలో నొంట నివసించియున్నా రము. మాకొంఱకు కుటుంబములు వేచియుండును. సెలవొసంగిన వెళ్లివచ్చెదము. (శ్రీ)వారి యాజ్ఞానుసార మనువర్తించెదము" అని చెప్పి సెలవంది యెందేనియుం జనిరి. అనంతర మా ధన మును వెచ్చించి భోజనపదార్థములను దెప్పించి వంటవాండు లేమి తానే యాపనిని చేయ నిశ్చయించి కృతప్రయత్నుండై యుండ,

సీ॥ గౌతమీస్నానంబు గావించుటం దడి
సిన పిల్లజుట్లను జివురగట్టి
మూండు రేఖలు దేర మొగమున గళమున
బాహూదరాదుల భస్మమలది
నీర్కావిరంగున నెఱిలేని తడిపొడి
యంగవస్త్రమ్ముల నదిమికట్టి
చివరలారిన చిన్ని చేలముల్ పైగప్పి
పిడుపలు భుజములం దడరబూని

గీ॥ హస్తమున నుదపాత్రము లతిశయింప
యాజుషోమపనిమత్తుల నధికభక్తి
చదువుకొనుచును భోజన సత్రమెందు
గలదనుచు వచ్చి రిర్వురా ఘనునికడకు ॥
(భద్రాద్రి రామచరిత్ర)

ఇట్లు వచ్చి బ్రహ్మచారిం గాంచి నమస్కరించి, "బీద బాపలము. జీవనోపాధి కనువుగానమిం నెందేనియు, న్వంట జేసియైనను కుటుంబపోషణము జేసికొనదలంపుగలవారమై

బయలుదేరి పలుతావుల దిరిగితిరిగి,విసివి యిట కరుదెంచితిమి. మీసత్రంబున సూపకారత్వంబునకు మమ్ము నియమింపుడు. నేడు మాపనితనమునుజూచి సంతసించిన చిత్తానుసారము వర్తింపగలము. మఱచితిమి. మాకెరోజిష్టము లేనియెడల నాజ్ఞనెళ్ళెదము.'' అని చెప్పుచు, దాసుగారి చేతనున్న జల పాత్రము నొకడును, మఱియొకపాత్రమింకొకడును గైకొని గౌతమి కేగిరి. బ్రహ్మచారిగారు నాడు తనకు లభించిన పదార్థము లకును మనుష్యసహాయమునకును ఉబ్బుచు, నిదియంతయు భగవదనుగ్రహమనితలంచి, దేవమందిరమున కేగి "రంగా! నీచిత్ర చరిత్రల నెవరు గనిపెట్టగలరు ఆర్తత్రాణ పారీణుడవనుట కీదివసమున జూపిన యద్భుతచరిత్రము చాలదా! తండ్రీ" యని వినుతించుచు, శ్రీస్వామివారిని షోడశోపచార విధుల నర్చించి, పదంపడి సహస్రనామార్చనము గావించి మహానివేదనమున కెదురుచూచుచుండె.నింతలో గోదావరినుండి నీరువచ్చుటయు, సహస్రాధిక బ్రాహ్మణ బృందమునకు సరి పడు భోజనపదార్థములు సిద్ధపడుటయు వడ్డనలు పూర్తియగు టయుగూడ జరిగినది స్వామివారియెదుట నైవేద్యముంచిరి బ్రహ్మచారిగారు "రంగా! నైవేద్యమారగింపరా తండ్రీ!''యని కేకవేసినంత, మామూలు ప్రకార మెక్కడనుండియో సర్ప రాజంబేతెంచి నైవేద్య మాఘ్రాణించె. నంతబోక బ్రహ్మ చారిగారి తొడపైజేరి యాడుచు తన సంతోషమును వెలి బుచ్చుచుండె. నిట్లుండ బ్రాహ్మణభోజనములు పూర్తియైనవి. వంటబ్రాహ్మణు లిరువురును వచ్చి గౌతమికి వెళ్లివచ్చెదమని

చెప్పి వెళ్లిరి. సర్వ మంతర్ధానమయ్యె. నప్పుడు బ్రహ్మచారి బ్రహ్మానంద పారావారమున దేలియాడుచు లేచి, గౌతమి కేగిన విప్రులురామి విచారించి. వారికొఱకు సమస్త ప్రదేశ శములను వెదకించి ప్రయోజనముగానక ఇది భగవల్లీలయని నిశ్చయించుకొని "దేవాదిదేవా మహానుభావా, "హరిర్హరతి పాపానిదుష్టచిత్తైరపి స్మృతః। అనిశ్చయాపిసంస్పృష్టో దహ్యతేవ హీ పావకః" తెలిసికొనక నిప్పుదాకిన కాలురీతి, ఎవరి దలంచిన మాత్ర పాపములు దహింపబడుచున్నవో, అట్టి నీకు నమస్కరించుచున్నాడ. మానవు డెవనియందు మనసునిల్పిన మాత్ర నరక మనుభవింపడో, ఎవని నామకీర్తనమున స్వర్గము విఘ్నకారి యైనదో, ఎవనియం దుంచబడిన మనస్సుగలవానికి బ్రహ్మలోక మల్ప మైనదియో, ఎవనిస్మరించుట బ్రహ్మ హత్యాది సమస్తపాపములు నాశనమగునో, ఎవనినామ సంకీర్తనము సంసృతిబంధమును సడలింపగలదియో, సంసార సర్ప దష్టున కెవనినామం బౌషధప్రాయంబో, ఎవడు సకల శుభ నాసమగువాడో, నరక దుఃఖము గలుగజేయునట్టిదియు, మిగుల భయంకరమగునదియు నగు కలికల్మష మెవనినామస్మరణ వలన నిర్మూలింప బడుచున్నదియో, ఎవనినామ మొక్క క్షణకాలము జరుగనియెడల సద్భక్తుడు తనధనమును దొంగల పహరించినట్లు చింతించుచున్నాడో అట్టి నీపాదముల కభివాద నములు. రామా! మేఘశ్యామ భక్తమనోభిరామా

ఉ॥ అన్యమెఱుంగ కెల్లప్పుడు
నాత్మ భజించుచునున్న నన్ను సా

మాన్యు ననుగ్రహించి యిటు
మానవ రూపముతోడవచ్చి సౌ
జన్యముజూపి పోయితివి
సారసలోచన నేను ధన్యుడన్
ధన్యము నాకులంబు జన
నంబును సార్థకమయ్యె నేటికిన్ ॥

చ॥ ఎఱుగుదు సర్పరూపమున
నెప్పుడు దర్శనమిచ్చుచుంట నే
నెఱుగుదు వైశ్యరూపమున
నింతకుమున్ ధనమిచ్చిపోక లో
నెఱుగుదు బ్రహ్మరూపమున
నిప్పుడు పాచకుడైనజాడ యి
క్కెఱిగి యెఱుంగనట్టిడగు
నీజడు బోవగ రమ్మ రాఘవా ॥

ఉ॥ చిన్నటినాటనుండి నిను
జిత్తమున న్భజియించువాడ నే
నెన్నడు వన్నెలాడి మొగ
మెత్తి కనుంగొనకున్నవాడనే
నన్నది కాదటంచనని
యట్టిడనేని దృఢవ్రతంబునం
దున్న జనుండనేని నను
నుత్తమ లోకము బొందజేయవే ॥

(భద్రాద్రి రామచరిత్ర)

అని ప్రార్థించి, నాడు భుజింపక రామ మంత్రంబు జపించుచు జాగరణంబు జేసె. మరునా డుదయంబున బురజను లెల్ల రీవార్త విని సంతసించుచు జనుదెంచి, బ్రహ్మచారింగాంచి నమస్కరించి, "దేవా! నిర్జరాదుల కేని దర్శనం బొసంగని శ్రీరామచంద్రుడు నిన్న నీకనురక్తుడై దర్శనం బొసంగుటయె గాక దాస్యంబునుగూడ జేసిపోయెనని వింటిమి. నీభాగ్యమే భాగ్యము. అని పెక్కువిధముల వినుతించిరి.

మఱియొకనాటి బ్రాహ్మణ సమారాధనంబునం దాజ్యము లేకుండుటయు, నభ్యాగవతులు భోజనమునకు గూరుచుండుటయు,దల్లోపనివారణంబు గావించువారు లేమియు జింతించి పాచకుల నిద్దరజీరి, "నాయనలారా, మనయింటగల రిక్తయాజ్యపాత్రముల గొనిపోయి శ్రీరంగనియాజ్ఞయయి నది గాన, నీరెండు పాత్రముల యాజ్య మప్పుగా గొనిపోయెద మని చెప్పుచు గోదావరినీటిచే బాత్రల నింపుకొని రం"డని బని చిన వారలట్లు గావించి, పూర్ణపాత్ర లింటికి జేర్చి చూచుసరికి జలమంతయు నెయ్యిగా మారినది.అభ్యాగతాతిథివర్గమంతయు బ్రహ్మనంద సాగరమున నోలలాడుచున్నది. నాటిసమారాధన మెట్టిలోపంబును లేకయ నెరవేరినది. మరునాడు భక్తు లర్పించిన ద్రవ్యంబుచే నాజ్యంబార్జించి గౌతమీదేవి ఋణము దీర్చి కృతార్థుడై చెలంగినాడు.

ఈ సత్రమందును తదితర స్థలములయందును ఒక పిచ్చివాడు తిరుగుచుండువాడు. అతని పేరుగాని యూరు గాని యెవరికిని తెలియుటలేదు సన్నగను పొడవుగను చామన

చాయఁగనుండి యొక చింపిరిగుడ్డలమూటయు, చిల్లపెంకుల హారములును ధరించియుండువాడు. బ్రహ్మచారిమాత్ర మా పిచ్చివానిని మిగుల బ్రేమించును. ఈత డెవడని బ్రశ్నించిన నాగునువని చెప్పుచుండువాడు. ఆ పిచ్చివానిని నీ వెవరవని యడిగిన బ్రహ్మచారిగారి శిష్యుఁడనని జెప్పెడివాఁడు. యిందు నిజమెంతయో మనకు దెలియదుగాని బ్రహ్మచారిగా రావ్యక్తికి భోజనమిడిగాని తాను భుజింపరు. అతఁడు భుజించు నప్పుడు రెండుకుక్కలు తోడభుజించుచుండునవి. ఇట్లు బ్రహ్మచారిగా రమానుషక్రియల గావించి సలుబది వత్సరము లన్నదానము సాగించి, తనభారమంతయు తుంగదుర్తి నరసింహారావు (వకీలు) గారిపైనుంచి క్రీ॥ శ॥ 1919 వత్సరమున నిత్యవిభూతినందిరి.



రంగారాయుడు

క్రీ॥ శ॥ 18 శతాబ్దమున నెల్లూరు మండలమునంగల కొలుదుంట్ల గ్రామంబున బ్రాహ్మణ వంశమందు రంగారాయుడను దివ్యపురుషుం డుద్భవించి క్రమముగ బాల్య కౌమారంబు గడచి సర్వవిద్యా సంపన్నుండై, భద్రాచలము తాలూకా తహశీలుదారుగా ప్రభుత్వమువారిచే నియమింపబడి, శ్రీరామ సేవా మహాభాగ్యం బయాచితముగ నలవడినందులకు మిగుల సంతసించుచు జనుదెంచి, గౌతమి నుత్తరించి, స్నానసంధ్యానుష్ఠానముల బవిత్రుండై శ్రీరామసన్నిధిం బ్రవేశించి, యావన్మ్య సుందరమూర్తి యగు ర్యాచరూపమును దిలకించి,

సీ॥ శ్రీవిదేహాత్మజ చెంగట నివసించి
తప్పక సేవల దన్పుచుండ
సౌమిత్రి భయభక్తి సంపదోద్రిక్తుఁడై
తెలయుచు భవదాజ్ఞ వేచియుండ
భరతశత్రుఘ్నులు పార్శ్వంబుల న్నిల్చి
వింజామరల బూని విసరుచుండ
అంజనీసుతుఁడు పాదాబ్జంబు లొత్తుచు
స్థిరభక్తి పేర్మి మైమరచియుండ
గీ॥ నిండు పేరోలగమ్మున గూర్చుండి తౌర
వరద! భద్రాద్రిపురవాస! వసుమతీసు
తామనోహర! బ్రహ్మవిద్యానిరూప!
రామ! పావననుతనామ! రమ్యధామ!

దేవా! "ధ్యాయన్కృతే యజన్యజ్ఞై స్త్రేతాయాం ద్వాపరేర్చయన్। యదాప్నోతి తదాప్నోతి కలౌ సంకీర్త్య కేశవమ్" అనునట్లు కృతయుగమునందు నీధ్యానమువలనను, త్రేతాయుగమునందు యజ్ఞముల వలనను. ద్వాపరయుగమునందు పూజించుటవలనను ఎట్టిఫలముగలుగునో, అట్టిఫలము కలియుగమునందునీనామస్తోత్రముచేయుటవలనగలుగుచున్నయది. పరాత్పరా! ఏ తేజస్సుచేత సూర్యుడు వెలుంగుచున్నాడో, ఏ తేజస్సు సకల తేజస్సులకు ప్రకాశము గలుగజేయుచున్నదో, ఏ తేజస్సు చైతన్య లక్షణమైనదో, ఏ తేజస్సు విస్తారమైనదై సర్వోత్తమమైనదో, అట్టి తేజస్స్వరూపుడవగు నీకు నమస్కరించుచున్నాడ. ఏపరమాత్మ ఈలోకమును పరలోకమును సకలభూతములను అంతర్యామియై నియమించుచున్నాడో,ఏపరమాత్మ భయమువలన వాయువు విసరుచున్నదో,సూర్యుడుదయించుచున్నాడో ఇంద్రాది దిక్పాలకులు తమ తమ కార్యములయందప్రమత్తులై మెలంగుచున్నారో, మృత్యుదేవత భయపడుచున్నదో, అట్టి పరమాత్మవగు నీకు వందనము జేయుచున్నాడ. మఱియును రామా! ఏ దేవుడు పరమతేజస్సో ఏ దేవుడు పరమతపస్సో ఏ దేవుడు పరబ్రహ్మమో ఏ దేవుడు సర్వోత్తమ ప్రాప్యస్థానమో అట్టి దేవుడవగు నీకు గేల్మోగుడ్చుచున్నాడ. పరమపురుషా! పావన తీర్థములకు పవిత్రమును గల్పించువాడవును, ధ్యానార్హుడవును,జూడదగినవాడవును, కీర్తింపదగినవాడవును, స్తోత్రముచేయదగిన వాడవును, పూజింపదగినవాడవును, స్మరింపదగినవాడవును, నమస్కరింప దగినవాడవును, అయి

యున్నావు, సంసారబంధమునకు కారణమును, పుణ్యాపుణ్యాత్మకమును అయిన సకల కర్మములకును గారణమగు నజ్ఞానమును సర్వమును ఆత్మా నాత్మ జ్ఞానమునుగలిగించి వడంపజేయు పుణ్యుండవీవు. నిన్ను ధ్యానించువారికి రూపము ఆరోగ్యము, సర్వార్థములును, ఆనుషంగికములైన భోగములను నిచ్చువాడవు నీవ. పరమాత్మా! సకల పాపములకు ప్రాయశ్చిత్తము నీనామ స్మరణమే యగుచున్నది బ్రహ్మహత్యాది మహాపాపములు చేసినవాడైనను నీధ్యానము జేసినయెడల వాడు తపోవంతుడును పఙ్క్తిపావనులను పవిత్రులనుగా జేయువాడును భక్తాగ్రేణియు నగుచున్నాడు. నీవు జూచినంత హృదయగ్రంధి ఛేదింపబడును. సకల కర్మములు నశింపబడును. నీనామస్మరణ మొక్కమారు భక్తిమై చేసినంత మాత్రమున ధాతుసంతతిని వహ్ని గరగించునటుల సకల పాపములను గరగించుచున్నది. మానవుడవశుడై నిన్ను స్మరించినమాత్రమున సకలపాపములనుండి విముక్తుడగుచున్నాడు. సీతాపతే! పరాత్పరా, దీనదయాపరమూర్తే, కారుణ్యజలధే, దాశరథే అని పెక్కుభంగుల వినుతించి, తానువచ్చిన కార్యమును విన్నవించి భక్తుండొక్కడిట పనిగొనుచున్నాడను జ్ఞాపకముమాత్ర ముంచుకొండని'' ప్రార్థించి, తనవిడిదలకరిగి నిజకార్యానుసరణి బ్రవర్తించుచు, "పుంఖానుపుంఖ విషయా నుపసేవ్యమానో, ధీరో నముంచతి ముకుంద పదారవిందా" అనురీతి భగవత్పాదారవిందముల హృదయపీఠి బ్రతిష్ఠించి పూజించుచు, జీవితము సార్థకపరచుకొనుచుండె. ఇట్లుండి యొకనాడు భగవదా

రాధన గావించి నిశ్చలచిత్తుడై ధ్యానమగ్నుడై యున్నతరి శ్రీరామునకు రత్నకిరీట మొకదాని జేయించి యర్పించుటచే తమను దలంపాయన కుదయించినది. తానా శ్రీమంతుడు గాడు. అన్యుల యాచించుటకు తనయుద్యోగ ధర్మం బొప్ప కొనదు. అయాచితముగా ద్రవ్య మొసంగు వారు లేరు. ఇంకెట్లు తనసంకల్పము కార్యరూపముగ మారగలదు. ఇది ద్రవ్య సాధ్యమగు పనిగాని తేర కగునదిగాదు ఇవి యన్నియు చింతించి రంగరాయుడు వగలంబొగలుచు తన మనోరథం బీడేర్చుటకు శ్రీరాముడే సమర్థుడగుగాని యన్యులుకా జాల రని నమ్మినవాడై .నిజాభీష్ట సిద్ధికై శ్రీరాముని వేడుకొనుచుండె.

ఇట్లుండ నొకనాటిరాత్రి స్వప్నంబున

సీ॥ నీలజీమూత సన్నిభ శరీరమువాని
కాంచనాంబరము చే గ్రాలువాని
తతశంఖ చక్ర గదా పద్మహస్తుని
రత్నకిరీట శిరంబువాని
అనుజత్రయంబు త న్ననుసరించినవాని
మునిలోక నుతులకు మురియువాని
చిరునవ్వు మోమున చెన్నుగుల్కెడివాని
అభయహస్తంబుల నలరువాని

గీ॥ క్ష్మాతనూభవ వామభాగమున నెల్లు
వాని శ్వేతాతపత్రంబు వన్నెలీను
వాని పద్మాక్షు పద్మాప్తుపద్మగర్భ
భవ్య పదపద్ము శ్రీరామభద్రు గాంచె.

ఇట్లు గాంచి భయభక్తి వినయంబులు ముప్పిరిగొన నమస్కరించి నిలచిన రంగరాయుం గాంచి రామభద్రుండు, "పుత్రా! నీవు దలపెట్టిన కార్యంబు ద్రవ్యాతి సాధ్యంబు. అయ్యది లభింపక నీవు పరితపించుచేనెఱుంగుదు. నీపితామహుం డనర్ఘరత్నంబు లారింటి నీజనకస్థలంబునం దొకచో భూస్థాపితంబు చేసి మీతండ్రికేనియు జెప్పక మృతినొందియుండె. నయ్యది మత్కిరీట కార్యమున వినియోగింప దగినవియై యున్నయవి. గాన నీవేగి యారత్నంబులంగొని పనిసాగింపు"మని సెలవిచ్చె, సంపూర్ణముగా విషయము నెఱిగించి యదృశ్యుండైన, రంగారాయుడు మేల్కాంచి స్వప్నవృత్తాంతము స్వీయజనుల కెఱింగించి నాడే ప్రభుత్వమువారిచే సెలవంది స్వగ్రామమును జేరి, భగవన్నిర్దేశ్య ప్రదేశంబున ద్రవ్వించి యొకపేటికయందు భద్రపరచి యున్న రత్నషట్కంబును గ్రహించి, పరమానంద కందళిత స్వాతుండై యచిరకాలంబున భద్రాద్రి కేగి, పనివారల బిలిపించి కిరీటనిర్మాణకార్యమును పూర్తిచేయించి, ఆ కిరీటమునకు ముందుభాగమునం దుండునటుల నొక కమలమును చెక్కించి దాని మధ్యభాగమున నొక మరకతమును వేయించుటుచితమని దలంచి, ఏతన్మణి నార్జించుట దుర్లభమగుటచే కాలాంతరేణ సంపాదించి యలంకరింపదగునని యెంచి, ముందు మరకత మమర్పదలచిన స్థలముమాత్రము నిలువయుంచి, మిగత భాగమంతయు పూర్తిజేయించి, మరకత సంగ్రహాపేక్ష దినదినాభివృద్ధియగుచుండ దత్ప్రయత్న మాచరింపుచుండె.

ఎంతప్రయత్న మాచరించినను మరకతముమాత్రము లభింపలేదు. సీతాకాళ్యాణ మహోత్సవ సమయం బతిసమీప కాలమునం దున్నయది. తదుత్సవమునకు కిరీటము తయారు చేయించి రామమస్తకమునం దలంకరించి కృతార్థుడనగు దునం చెంచిన వాడగుటచే, రంగారాయున కత్యంతవిషాద మంకురించి యుత్సవము సమీపించినకొలది యభివృద్ధిగా జొచ్చినది. ఎంతధనము వెచ్చించినను మణి లభించునటుల గనుపింపలేదు. ఏమిచేయుటకును దోపక రంగారాయుడు నిరంతరము చింతాసముద్రమున విరామము లేక నీదులాడుచుండెను. శ్రీసీతాకళ్యాణమహోత్సవదిదృక్షాపేక్ష నతిశయింప భక్తులనేక మందివచ్చి గోదావరి పూర్వతటంబునం దమర్పబడిన కుటీరములయందు గ్రమక్రమంబున జేరుచుండిరి నవాహ్నికదీక్షతో యుత్సవము ప్రారంభింపబడినది. కళ్యాణ సమయమునకు కిరీటము తయారుగాదను వంత నంతకంతకు మితిమీర, రంగారాయుడు నిద్రాహారముల గొనక, రామానుగ్రహ సంగ్రహణాభిలాషం గైకొన తదర్చనా నిమగ్నుడై యుత్సవమున బాల్గొనక స్వగృహమునంద నివసించుచుండె.

చైత్ర శుద్ధ సప్తమి రాత్రి రంగారాయుడు ధ్యాన నిమగ్నుడైయున్నయెడ, "భయపడకుము. రేపు మధ్యాహ్నమునకు కిరీటము తయారుకాగల" దను వాక్యము వినువీధినుండి చెవిని బడెను. గాని అది దాసుగారు నమ్మలేదు. తెల్లవారినది. కాలోచితకృత్యముల దీర్చుకొని దుఃఖతరంగము లొకటి వెంట నొకటి వెన్నంటుచుంట, వేడుకదగ్గి భాష్పపూరిత నేత్రుండై

ఇష్టార్థిభక్తియందు లగ్నమయిన మనఃపద్మముగలవాఁడై గూరుచున్నతరి, యొకవేశ్యాతిలక మరుదెంచి నమస్కరించి యెటులో సుముఖుం గావించుకొని యిట్లనియె.

"అయ్యా, నేను ప్రాగ్దేశవాసినిని. వేశ్యాంగనను. సుగుణమణియను పేర బరగుదాన. శ్రీరామమూర్తి నాకు స్వప్నమున దర్శనం బొసంగి, "కాంతా, నీకు హైకోర్టు జడ్జి బహూకరించిన యంగుళీయకమునం దలరారు రత్నమును భద్రాద్రి తాలూకా తహశీలుదారున కిమ్ము. ఆతండు యమూల్య రత్నకిరీటంబొండు నిర్మించి నాకు సమర్పింప నెంచి నైజంబగు ధనంబును వెచ్చించి, కిరీటమును తయారుచేయించి తన్మకుటమున శోభనుగూర్చజాలు జీవమణి లభింపమి విచారింపుచున్నాడు. గాన నారత్న బొసంగి జన్మ సార్థకము గావించుకొమ్మ"ని పలికి సన్నుతులనంది యదృశ్యుండయ్యె. గాన దయయుంచి ఈ రత్నమును గ్రహింపుడని విన్నవింపుచు తనయొద్దనున్న జీవమణి నొసంగి కృతార్థయయ్యె.

అంత రంగారాయుడు సంతోష పారావారమున దేలియాడుచు, శ్రీరామానుగ్రహ మింతయొప్పునే యని తలయూచుచు, కిరీటమును దెప్పించి పనివారలచే దత్కిరీట మధ్యప్రదేశంబున మరకతమును స్థాపించుటకై నిర్దేశించియున్నస్థలంబున దాని నంటింప, నారత్న మాఁగూటిలో హెచ్చుతగ్గులు లేక యిమిడి కిరీటమున కలంకారమొసంగె.

ఇదియంతయు జరుగుసరికి శ్రీరామనవమి నాటి యపరాహ్ణము సమీపించినది. వెంటనే తయారయిన కిరీటమును

దలధరించి హరిభజనముతో నానందనృత్యము గావించుచు రంగరాయుడు వివాహమంటపమును సమీపించెను శ్రీసీతారామ యర్చామూర్తుల నన్యోన్యాభిముఖముగా రత్నసింహాసనములపై గూర్చుండజేసి యర్చకాళి వివాహమంత్ర పఠనము గావించుచుండెను. మంటపముచుట్టు ముట్టి ప్రేక్షకులు క్రిక్కిరిసి యుండిరి. అట్టియెడ రంగారాయుడుగారు కిరీటమును భగవానుని కర్పించి, కరంబుల ముకుళించి సమీలిత నేత్రపద్ముండై యిట్లని వినుతించె. "రామా! పరమపావననామా! పాపవిరామా! భద్రాద్రిధామా! పాహిమాం పాహిమాం పాహిమాం దేవా! తపఃకర్మాత్మకములగు సకల ప్రాయశ్చిత్తములలోపల నీనామస్మరణ ముత్తమమైనది. భయంకర నరకదుఃఖాత్మకమగు కలికల్మషము వెడలించు నదియు నీనామమే. తండ్రీ! నీ యవ్యాజప్రేమ యిట్టిదని వర్ణింప నాబోటికి వశమగునే. అగ్రజుచే ననేక యిడుమలం గుడుచుచు నడవులసంచరించుచుండు సుగ్రీవుని రక్షించినావు. ఎంగిలిపండ్లు భక్షించి శబరిని కాపాడినావు, చపలమర్కటుని సేవల గ్రహించినావు, క్రూరుడగు కాకాసురు ననుగ్రహించినావు, జటాయువునకు పునరావృత్తి రహిత శాశ్వత బ్రహ్మపదం బొసంగినావు, రాక్షస నాశంబొనర్చి వసుంధర కష్టము లీడేర్చినావు సూనిలోకము నతికృపాదృష్టి వీక్షించినావు. వెయ్యేల, యభిలషిత పదార్థంబొసంగి నన్ను కృతార్థుం గావించినావు. జగద్బంధూ! కరుణాసింధూ! నీవు సర్వాంతర్యామివై, అగ్ని నాయా దార్వాదులయందు బ్రవేశించి దార్వాది రూపములు కలవాడై యనుపదువిధములన,

నీవు భూతలముయొక్క యాకారములలో నానారూపములు కలవానివలె గనుపడుచున్నావు. సర్వలోకములకును నేత్ర రూపుడగు సూర్యుడు లోకనేత్రములయందలి దోషములచే దూషితుడుగాని విధమున, సర్వభూతాంతరాత్ముడవగు నీవు లోకసంబంధములగు దుఃఖములు కలవాడవు కావు. జ్ఞానరూపా సర్వగతుడును, స్వతంత్రుడును, ఒక్కడును, సకలలోకములను లోబరచుకొన్న వాడును నీవ." అని వినుతించి కరంబుల దట్టుచు,

ధన్యాసిరాగము—చాపుతాళము.

శ్రీరాములనమ్మి సేవించువారికి చింతలు పనియేటికే ముమ్మాటికి ॥ శ్రీ ॥

తారకనామ కీర్తనచేయువారికి వేఱుమంత్రము లేటికే ఓమనసా॥ (శ్రీ)॥

మత్తవృత్తి నిరసించినవారికి మఱునిబాధ లేటికే॥

తత్త్వస్వరూపము దెలిసినవారికి తాపత్రయము లేటికే ఓ మనసా ॥ (శ్రీ) ॥

పన్నగశయనుని కృపగల్గువారికి బాపసంఘము లేటికే॥

మన్నించు భద్రాద్రి రామదాసుడనైతి,మర్మమెఱుగ లేవటే ॥ ఓమనసా ॥ శ్రీ ॥

అనిపాడుచు భజనానందమున దేలియాడుచుండెను. క్రమముగా సీతాకళ్యాణ మహోత్సవము ముగిసినది. రంగారాయు డింటికి జని మరకతమొసంగిన గణికాతిలకమును జీరి యామణి వెల గైకొమ్మని నిర్బధించెను; గాని ఆయమ యంగీకరిం

పక, దేవా! రామాజ్ఞయగుటచే మణినర్పించితినిగాన ప్రతిఫలాపేక్ష నాకులేదు. మీయాజ్ఞ ప్రతిఘటించినందునకు క్షమింపుడని ప్రార్థించెను.

వ్రయప్రయాసల కోర్చి ముగించిన భగవత్కార్యమం దీమె భాగహారిణి యగుచున్నదే యని రంగారావు చింతించు చుండెను.

కిరీటమునకైన వ్యయమంతయు భరించి తత్ఫలమును గైకొననెంచి ఆవేశ్యయు దగుప్రయత్నము గావించుచుండె. కామ్యాభిలాష యిరువురకు దినాదినాభి వృద్ధినందుచుండె ననుటలో సందియముమలేదు. ఉభయులను సమాధాన పరుప నెంచి పలువురు భక్తులు పలువిధముల ప్రయత్నించిచూచిరి గాని ప్రయోజనము లేకపోయినది.

ఇట్లుండ నొకనాటిరేయి స్వప్నమునందు బ్రాహ్మణ బాలకులవలె రామలక్ష్మణు లిరువురకు ప్రత్యక్షమై, "భగవన్మస్తకాలంకారమగు కిరీట విషయమున మీకు సంబంధము లేదు. ఈకార్యమున మున్ను తానెవ్వరికడ నేవస్తువుల దాచి యుంచెనో నాయా వస్తువుల శ్రీరామమూర్తియే తెప్పించుకొని తనకార్యమును పూర్తిజేసికొని యున్నాడు. గాన మీ కామ్యాసక్తి విడి తృప్తులుగం"డని సెలవిచ్చి యంతర్థానులైరి.

ఇట్లు భగవదాజ్ఞ వినినంతనే యిరువురకు తమ తమ యవివేకములు విడిపోయెను. అంత భద్రాద్రిరాముని కాసత్కార్య ఫల మర్పణగావించి భక్తాగ్రణు లిరువురు పరితృప్తినందిరి. ఈకిరీటము శ్రీ వైకుంఠైకాదశియందును, శ్రీరామనవమి దివసంబునను శ్రీరాముల కిప్పటికిని యలంకరింపుచుండెదరు.

గోవిందస్వామి

"నాహం దేవో న మర్త్యోవా న తిర్యక్ స్థావరోపివా
జ్ఞానానందమయ స్స్వాత్మా శేషో హి పరమాత్మనః"

మోక్షసౌధము నధిరోహించుట కేర్పడిన సోపాన త్రయము నొక్క జన్మముననే క్రమముగ నుత్తరింప వలయు నను నిర్భంధములేదు గతజన్మమునందొక మెట్టునెక్కిన వాడు మరుజన్మమున మొదటిమెట్టు నెక్క ప్రసక్తిలేకనే రెండవమెట్టు నెక్కుటకు ప్రయత్నము జేయును. ఆజన్మమునందా మెట్టెక్కినవాడు మూడవజన్మమున మూడవమెట్టెక్కి గమ్యస్థానము జేరగలడు. అనగ గతజన్మమునందు సత్కర్మము సంపూర్ణముగ నాచరించి మనోపరిశుద్ధతను గడించినవాడు, మరుజన్మమున భక్తిగైకొని మూడవజన్మమున జ్ఞానమునుబొంది కృతార్థుడౌననుట. "పార్థనైవేహనా ముత్ర వినాశస్తస్య విద్యతే కళ్యాణకృత్ కశ్చి దస్తి దుర్గతిం తాత గచ్ఛతి।ప్రాప్యపుణ్యకృతాన్‌లోకా నుషిత్వా శాశ్వతీ స్సమాః" "శుచీనాం శ్రీమతాం గేహే యోగభ్రష్టోభి జాయతే।అథవా యోగినా మేవ కులే భవతి ధీమతాం। ఏతద్ధి దుర్లభతరం లోకే జన్మయదీ దృశం। తత్రతం బుద్ధిసంయోగం లభతే పౌర్వదైహికం। యతతేచ తతోభూయ స్సంసిద్ధి కురునందన." "పరమాత్మాను సంధానమునకు యత్నించి సామర్థ్యములేక భ్రష్టుడైన వానికి నిహపర లోకములందు నాశనములేదు. మంచి చేసిన వాడొకప్పుడును దుర్గతిని జెందడు. వాడు పుణ్యాము

జేసినవారి లోకములను జెంది అచ్చట బహుకాలము వసించి పిదప సదాచారవంతుల యిండ్లనైనను, శ్రీమంతుల గృహములనైనను బుట్టుచున్నాడు. అట్లుగాకపోయిన యోగులకుల మందు బుట్టుచున్నాడు." అని శ్రీకృష్ణభగవానులు చెప్పుటచే మానవు డేజన్మమున నెంతి సత్కార్మ దుష్కార్మము లాచరించిన నవి మరుజన్మమునం దనుభవమునకు వచ్చుచుండుననుట, లోకములో జన్మమునో దుర్మార్గము లాచరించు వారుగను సత్కార్మిష్ఠులుగను భక్తిప్రపత్తులు గలిగినవారుగను జ్ఞానపూర్ణులుగను బుట్టుచుందురు. ఇందు మొదటి తెగవారి దూషణములకు శేషించిన మూడు తెగలవారును పాత్రులగుచున్నారు. అందు నాల్గవ (జ్ఞానులు) తెగవారు సుతరాం నింద్యులుగ జూడబడుచున్నారు హిరణ్యకశ్యపుడు ప్రహ్లాదుని విపరీతవర్తనల కతికుద్ధుండై యాతని వశపరుచుకొనుటకు సామదానభేద దండోపాయముల సాగించియు బ్రయోజనముగానక, "ఓరీ దుర్మార్గా ! పండువంటి వంశము పాడుసేయ బుట్టితివి గదరా, నీ వెవరవో యోచించుకొనిన నీమూర్ఖ్యము విడిపోగల"దని మందలించిన, తండ్రీ! వినుము. నేను దేవుడనుగాని, మానవునుగాని, పశువునుగాని, పాషాణాదులనుగాని గాను. జ్ఞానానంద స్వరూపుడగు పరమాత్మనై యున్నాను. మఱియు "నాహం విప్రో న చ నరపతి ర్నాపి వైశ్యో న శూద్రో నోవావర్ణీ న చ గృహపతి ర్నోవనస్థో ఞ భిక్షుర్వా కింతు శ్రీమ ద్భువన భవన స్థిత్యపాయైక హేతో లక్ష్మీభర్తుర్నరహరి తమో దాస ద సస్య దాసః" నేను

బ్రాహ్మణుడ గాను, క్షత్రియుడ గాను, వైశ్యుడ గాను, శూద్రుడగాను, బ్రహ్మచారినిగాను, గృహస్థుడగాను, వానప్రస్థుడగాను, యతినిగాను, విశ్వనియంతయగు బరమేశ్వరుని యొక్క దాసుని పాదసేవకుడను.'' చూడుడు. సంపూర్ణముగ బ్రపంచస్థితిని వదలికొనినవాని స్థితి ''హరి మయము విశ్వమంతయు హరి విశ్వమయుండు సంశయము బనిలే దాహరి మయముగాని వస్తువు బరమాణువులేదు వంశపావని వింటే'' విశ్వమంతయు బరమాత్మ స్వరూపమై యున్నపుడు ''ఆధ్యాత్మ జ్ఞాన నిత్యత్వం తత్వజ్ఞానార్థ దర్శనం ఏతద్ జ్ఞాన మితిప్రోక్తం'' జ్ఞానియగు వాడాత్మజ్ఞానముతో గూడి తత్వజ్ఞానార్థము దెలిసికొని యుండవలయునని శ్రీకృష్ణభగవానులు శాసించినపుడును జ్ఞాని యింకెట్లుండగలడు? విమానముమీద నంతరిక్షమున బోవువానికి భూమియందుగల గృహములు, మేడలు, చెట్లు, కొండలు సమానముగ గనపడునట్లు, బ్రహ్మజ్ఞానికి విశ్వమంతయు బరబ్రహ్మ స్వరూపముగనే గనుపడుచుండును. కారణమగు పరబ్రహ్మమునకును కార్యమగు విశ్వమునకును భేద మేమాత్రము లేదని తెలిసికొనినవారే జ్ఞానులు. యిట్టివారలలో మనస్వామివారొక్కరై యున్నారు. వీరి జననస్థలము మలబారు మండలాంతర్గతమగు ఆలపాడ. కులము బ్రాహ్మణ. తల్లి దండ్రులపేర్లు తెలియవు. వీరికి తల్లిదండ్రులుంచిన పేరునందు విరాజిల్లు నక్షరపఙ్క్తి వీక్షింపగల మహాభాగ్యము గలుగలేదుగాని యనేకమంది యనేక విధములుగా పేర్కొనుచుండు నామము లన్నియు సార్థకములై

యున్నవి. అందు నాకు దెలిసినవిమాత్రి ముదహరించు చున్నాడ. 1. గోవిందస్వామి, 2. గోళ్ళస్వామి, 3. బాల బ్రహ్మచారి, 4 మళయాళస్వామి. వీరు మళయాళములో దన బాల్యము గడపి, యుపనయనమైనదాది దేశసంచారము జేయుచు, దనజీవితములో సగమాంధ్ర దేశమున వెళ్ళించి, అందక్షయ సంవత్సర మార్గశీర్షము మొదలు శ్రీ భద్రాచలరాము నాశ్రయించియుండి, ప్రభవ సంవత్సర వైశాఖ శుద్ధ చవితీ దివసంబున దేహము జాలించినారు.

ఈ ఘనుండు పరమహంసాశ్రమమునం దుండుటచే కాబోలు, నన్నివర్ణముల వారివలన భిక్షగైకొనుచు, "గోవింద రాం రాం, గోపాల హరి హరి'' యను దివ్యనామమును త్రికరణము లైక్యపరచి, సర్వదా ఆబాలగోపాలమునకు గర్ణపేయముగ నుచ్చైస్స్వరంబున స్మరించుచు, దనకు గనుపించువారి నెల్లర తనలో జేర్చుకొని భజనజేయుచుండువాడు. నెయ్యేల, నా మహామహుని దర్శించిన మాత్రమున నెట్టి నాస్తికునకైన నాస్తికత్వ బుద్ధివోడము ననుటకు సందియము లేదు.

ఒకప్పు డీభక్తాగ్రిణి నెల్లూరు పురవీధుల శిష్యబృంద పరివేష్టితుండై రామభజనసేయుచు, మార్గావరోధము గావించిన దన్మండలాధికారియగు పాశ్చాత్య ప్రముఖుండొయ్యన జనుదెంచి, యదలింపుచు స్వామివారిని డాసి, భీకరాకారుండై యెదుటనిలచి, ఏమేమో కఠినవాక్యములాడ నుద్యుక్తుండై, శ్రీరామ భజనానందమున ముస్నలువేయుచుండు హరిదాసుగారిచే నాకర్షింపబడిన చిత్తముగలవాడై, యప్రయత్నముగ

"గోవింద రాం రాం, గోపాల హరి హరి" అని బిగ్గరగ బాడుచు, స్వామివారి ననుసరించి భజనసేయ బ్రారంభించి యానంద నృత్యము గావించుచుండె. నీ చిత్రమును గావించి ప్రేక్షకులు పరమానందభరితులై, స్వామివారి ప్రభావమును వేనోళ్ళ గొనియాడుచు,

సీ॥ బ్రహ్మహత్యానేక పాపాటవుల కగ్ని
కీలలు హరినామ కీర్తనములు
గురుతల్ప కల్మష క్రూర సర్పములకు
గేకులు హరినామ కీర్తనములు
తపనీయ చౌర్య సంతమసంబునకు సూర్య
కిరణముల్ హరినామ కీర్తనములు
మధుపాన కిల్బిష మదనాగ సమితికి
గేసరుల్ హరినామ కీర్తనములు
గీ॥ మహిత యోగోగ్ర నిత్యసమాధి విధుల
నలరు బ్రహ్మాదిసురలకు నందరాని
భూరి నిర్వాణ సామ్రాజ్య భోగభాగ్య
ఖేలనంబులు హరినామ కీర్తనములు ॥

"గనుక నే హిందూమతద్వేషి నోటినుండి రామమంత్రము వెలువడినది. మున్ను సప్తమహర్షుల వాగమృత ధారలఁగ్రోలి, బోయ వాల్మీకి మహర్షియై చెలగినట్లు, బలువురు మూఢాగ్రేసర చక్రవర్తులు మనస్వామివారిని తిలకించినంత శ్రీరామభక్తి సంపూర్ణులై తేజరిల్లిరనుటకు సందియము లేదు." అని చెప్పుకొనుచు దమ తమ సంతోషముల వెల్లడించిరి.

స్వామివారికి గోపము సున్న, డాంబికము హుళక్కి, దేహ పోషణ వ్యాపారము శూన్యము, శుష్కవాదములు శశ విషాణములు ఎప్పుడు చూచినను రామభజన సేయుటయే. ఏమాట మాట్లాడినను భగవన్మహిమాభివర్ణనమే. ఏపని జూచినను శ్రీరామ కైంకర్య విశేషపూరితంబె. ఏస్థలమున సంచరించినను, శ్రీరామ భజనానంద సంజనిత భాష్పబిందు సముత్కీర్ణ సుందరవదనారవింద సముల్లసిత శిష్యబృంద సమాక్రాంత విస్తారంబె. ఆహా ! ఈ సాధుపుంగవుని సేవించువారిదియ జన్మము. నిత్యతృప్తి ఈ సుగుణఘునికి బ్రధానగుణము. ఈ పరమపావనమూర్తి దేశికానుగ్రహ పాత్రుడైనప్పటినుండి బ్రహ్మచర్యవ్రత దీక్షాపరుండై భారత దేశమునంగల తీర్థయాత్రల సేవించి, యోగసిద్ధియు మంత్ర సిద్ధియు గడించి, ప్రథమమునం దాంధ్రదేశమునం దలరారు ముఖ్యపట్టణములలో నొక్కటియగు నెల్లూరున కనతి దూర మునంగల వావిళ్ళ కేగిరి. అందీ పవిత్రాత్ముని యమానుష చర్యలు కొన్ని వెల్లడియైనవి. తద్గ్రామంబునం దనేకరోజుల నుండి కలరాదేవత ప్రవేశించి పశువులను, మనుజులను తన నోటవేసికొనుచుండె. గ్రామవాస్తవ్యులు శ్రీమంతులగుట, నెంత ద్రవ్యమునైన వెచ్చించి యీ యుపద్రవమును బాపు కొనదలంచి తగిన మంత్రవాది నారయుచుండిరి.

ఇంతలో నెక్కడనుండియో కాషాయాంబరధారి యొకండు నారాయణ స్మరణజేయుచు, బురవీధుల "కాషాయ దండ మాత్రేణ, యతిస్సర్వత్ర పూజయేత్" అను న్యాయము

ననుసరించి యూరివాసులచే వందనములందుచు విప్రగృహము లకు మందమంద గమనంబున బోవుచుండె. విపత్సముద్రము నందు మున్కలు వేయుచుండు వారలపుట, నా యూరిజనము లాసాధుగాంచి తమ నుద్ధరింప దలంచివచ్చిన భగవదపరావ తారమని యెంచి, పరుగు పరుగున బోయి, పుర ప్రముఖుల కాపుణ్యపురుషుని రాక నెరింగింప, వారలకు దెంచి వందనముల గావించి తగిన విడిదిలయందు బ్రవేశపెట్టి; మజ్జనభోజనాది కార్యముల గొఱంత లేకుండునటు లేర్పాటుల గావించి, తమ కష్టపరంపర లెఱింగించుటకు సమయాన్వేషణము జేయు చుండిరి. అంత స్వామివారు భోజనము జేసి నారాయణ స్మర ణముతో వచ్చి తనకొఱకై యమర్చియుంచిన యాసనముపై గూర్చుచుండి వేదాంతోపన్యాసముల గావింపజొచ్చె, కొందఱు కపటులకు తమ కపటముల గప్పిపుచ్చుటకు వేదాంతోప న్యాసములు మిక్కిలి సహాయకారులుగా నున్నయవి. అప్ప రమ పవిత్రోపన్యాసముల వినుటకు రమారమి యప్పూరి వాస్తవ్యులందఱు వచ్చి స్వామివారి వాక్యానుసరణి యుచిత స్థలములం దాసీనులై వినుచుండిరి. అయ్యుపన్యాసధోరణి కాలమును గప్పిపుచ్చినది. ఎట్టకేల కుపన్యాసకుడును శ్రోత లును తమ తమ పనుల జాలించి స్వామివారు కాలోచిత కృత్యముల దీర్చికొనుటకును, సభికులు కుటుంబకార్యముల సవరించుకొనుటకును సభను ముగించి వారి వారి స్థలము లకు జనిరి.

అంత స్వాములవారు కాలోచితకృత్యముల దీర్చికొన నేగుతరి సమయమారసి, పురప్రముఖులలో నొకరిద్దఱాయన వెంటనేగి గ్రామమునకు సంభవించిన విపద్దశనంతయు విశద పరచి ఈ ముప్పునుండి తప్పించిరక్షింపవలయునని ప్రార్థించిరి. స్వామివారి కామాటలు కర్ణపేయములుగ నున్నవి, ద్రవ్యసంగ్రహణార్థమే తెంచినవాఁడు కాన లోలోన సంతసించుచు వారింగాంచి, మీగ్రామమునకు సంభవించిన విపత్తు నడంచుట దుర్ఘటము. నలువది దినములు సీతలాయంత్ర పునశ్చరణము జేసి యయ్యది రచ్చబండక్రింద బ్రతిష్ఠించిన మీకు శుభము లలవడును. దీనికి రమారమి పదివేలరూప్యములు వెచ్చింపవలయు నియ్యది ద్రవ్యసాధ్యమైన పనిగాన నడుమ నెట్టిలోపమును బొడసూపకుండ సాగించుట దుస్తరము మీరు పూచీపడెదరేని యెట్టులో ఈ మహోపకారము జేయఁగలము. ఇది మా యాశయమని చెప్పిన మర్మరణముల కడలుచున్నవారు కాన సమ్మతించిరి.

ఈసమయమున బుష్కలముగ ద్రవ్య మార్జింప వచ్చునను పేరాసబైకొని దన యసమర్థతను గుర్తింపకయే అయ్యగా రాపని కొప్పుకొనిరి. ఈవార్త గ్రామమంతటను వ్యాపించి పురజనుల సంతోషవార్ధి నోలలాడించినది. నాఁడే నగర మధ్య ప్రదేశమున బందిరిలు వేయఁబడినవి. తగిన సంభారములన్నియు సేకరింపబడినవి. మరురోజు తెల్లవారి యేడుగంటల ప్రొద్దెక్కినది. మంగళ వాద్యములతో మన సన్యాసిగా రాపందిలియందు బ్రవేశించి, తనకుద్దియగు బాపనయ్యల గొందఱ సమకూర్చ

కొని. వారి సాయంబున సీతలాయంత్రిం బొండెట్లోనిర్మించి పునశ్చరణము సాగించె. బందిలియందు బ్రతిరోజు బ్రాహ్మణ భోజనము లవారిగ సాగుచున్నవి. ఊరిలోనివా రాబాల గోపాల మాపందిలియందే కాపురము జేయుచుండిరి. రోజునకు సహస్రాధిక రూప్యములు వ్యయమగుచున్న వన నతిశయోక్తి కాదు. ఇరువది దివసములు కడచినవి. వింశత్సహస్ర రూప్యములు వ్యయమయినవి కాని గొట్టాలమ్మ పురిలోని మనుజులను వ్యయపరచుటమాత్రము మాన లేదు. "ఏమండి! అయ్యగారూ! యిరువది రోజులయినను కలరా తగ్గలేదేమండి?" అని ఎవరయిన బ్రశ్న వేసిన సక్రమముగ నలువది దివసములు పూర్తియయినగాని తగ్గదని సమాధానముజెప్పుచుండువాడు. అమాయికులగు పురజను లామాటలనమ్మి అయ్యగారు చెప్పినట్లెల్ల ద్రవ్యము వెచ్చించుచుండిరి.

ఇట్లుండ నొకనాడు గోచిపాతరాయం డొక్కండా గ్రామమున జరుగు మహోవిభవమును జూచుటకును బురజనుల నుద్ధరించుటకును పిలువని పేరంటముగవచ్చి యజ్ఞవాటికను జేరి యంత్రమును బరీక్షించుచుండె. నదిచూచి మన అయ్యగారు కోపముతో 'నావలకుబోయి కూరుచుండుము. ఏమట్లు చూచెదవు నీకు బిచ్చిపట్టినదియా' అని యదలించుచు జారచురంజూచెను. ఈమహోమహుడే మన కథానాయకుడు. ద్రవ్య సంపాదననాసక్తి బ్రేరేపశక్తికిమించిన కార్యము దలపైబెట్టుకొని తనగుట్టుబయలుపడునేమో యనుభయమెంతయో పురి కొల్ప, నోరికొలంది వ్రేలుచుండు నా కపటసన్యాసిని కాంచి

మన కథానాయకుడు వినయ వినమితవదనుండై, "అయ్యా! నా దొక చిన్న మనవి. మీరు కావించు కార్యము ప్రశస్తవంతము సీతాలాయంత్రప్రతిష్ఠవలన గ్రామమున కెంతయేనియు శుభము గలుగ గలదు. కాని యిప్పటి మీ ప్రయత్న మట్లుగాక వ్యతిరేకమగునని తెలియుటచే సంశయాస్పదచిత్తుడనై తదీయ శుభవార్త మీకెఱింగింపజాలక యూరక నిట్టూర్చుచున్నాడ. కోపపడకుండెదరేని వెల్లడించెద"ననెను. ఆమాటలవినిన గపటసన్యాసికి మితిమీరిన కోపము వచ్చినది. పండ్లు బటబటగొఱుకుచు గన్నెఱ్ఱజేసి "ఏమీ వ్యతిరేకమా! నీకేమి తెలుసునని మాట్లాడితివి? ఇట్టియమంగళము లిక ప్రేలకు. ప్రేలితివేని తగిన శాస్తి కాగలదు. పొమ్ము"అని స్వామివారిని దూరనాడిన "అయ్యా! కోపపడకుడు. పొరపాటెంతవారికేనియు రాగలదు. శాంతముతో వినుడిప్పుడు మీరు ప్రతిష్ఠింపనున్న యంత్రమందు బీజములు తమ తమ స్థానములయందు నిలువమి యిట్లు పలుకవలసి వచ్చినది. యెందుల కీగొందర శాస్త్రపరిశోధనము గావించి నామాట సత్యములైన శిక్షింపవచ్చు"నని స్వామివారనిరి. తాను పట్టిన పట్టె నెగ్గవలయునను పిచ్చియూహగల మన సన్యాసికి నిష్కపటియగు స్వామివారి వాక్యములు మఱింత కోపకారణములై మితిమీర జేయుటచే "ఏమీ" బీజములు స్వస్థానములందు నిలువలేదుగా! పెద్దశాస్త్రవేత్తవలె మాట్లాడుచున్నాడవే! యుక్తాయుక్త వివేకములేని శిష్యుని స్వీకరించిన గురువు ననవలెను. నిన్ను నిక ప్రయోజనము లేదు. యింకనైన నోరు మెదల్పక దిన్నగ గూరుచుండుము. లేనిచో తగిన ప్రాయశ్చి

త్తము గాగలను.'' అనిపలుకుచు, నయ్యగారు తన కపటము బయటబడకుండుటకో లేక తెలియకనో సభికులతో మాట్లాడుచు నటునిటు దిరుగుచుండె. నంత సభలోని పెద్దలలో నొకరు లేచి, ''అయ్యా సన్యాసిగారు ఈస్వామివారు శాస్త్రప్రమాణము జూపెదనని పలుకుచుండ తొందరెందులకు? తగిన సమాధానము జెప్పినగదా వారి మాటలకు విలువవచ్చునది. శాస్త్రము జూపుమనుడు'' అనిపలికి కూరుచుండెను.

నన్ను దప్పుపట్టుటకు బ్రహ్మ దిగిరావలె. వీడన నెంత? ఎటువంటి శాస్త్రజ్ఞులైనను నాకడియెందాసులే నాశక్తి తెలియక మీరిట్లుల మాట్లాడెదరు? నాయంతవాడీ బీదసన్యాసితో శాస్త్రచర్చకు గడంగి మర్యాద బోగొట్టుకొనునా? వీనికి గురువు పరదూషణాదికములు మాత్ర ముప దేశించినట్లున్నాడు. మీకు నాయందు నమ్మకము లేనియెడల వీనిచేత నీకార్యము బూర్తి చేయించు కొనుడు. నేమానుకొనెద''నని సన్యాసిగారు ధిక్కరించి పలికిరి.

అది విని గోవిందస్వామి చిరునవ్వుతో ''మన ముభయులము మాట్లాడుచున్నపుడు నిష్కారణముగా నాదేశికాచార్యుని నిందింప నేల? లోప మేదయినను న్న నన్ను శిక్షింపుడు. మీకు మీ దేశికాచార్యు డెట్టి గౌరవపాత్రుడో నాకు నాదేశికాచార్యు డట్లె గౌరవపాత్రుడగునని యేలదలంపరు? గాన వృథాగా మద్గురునిందగావింపకుడు'' అనిస్వామివారనిరి అదివిని ధిక్కరించుచు, ''స్వభూషణాదికముల గావించుకొనునట్లు శిష్యుని తయారుచేసిన గురువును నిందించినను బాపములేదు. నీవు

నాతో మాట్లాడ నర్హుడవు కావు. ఆయధికారము నీగురువున కుండిన దీసికొనిరమ్ము. పొమ్ము. అవసరమున్న, వానితో మాట్లాడెద''నని సన్యాసిగారనిరి.

స్వామివారుగురుదూషణమునకోడుచుశ్రవణపుటంబులంబ్రవే ళులుంచి ''వినయముతో నయ్యా! నాగురువర్యునికింగల యధికా రానధికారముల నెన్న బోకుడు ఆమహానుభావుని ప్రభావమిట్టిదని వర్ణింప నాతరముగాదు. నాగురువర్యుని దిలకింప మీకాకిష్టమేని సర్వవ్యాపియగు నాతండిప్పుడేయిక్కడనే దర్శనమియ్యగలండు. మద్దేశికుని ప్రభావము గొంత మీకు జూపినగాని నామాట యందు నమ్మకము గలుగదు. ఇదిగో చూడుడని చెప్పుచు చిన్న కాకితపుముక్కల రెండింటి దెప్పించి యందొక దానిపై నిజగురుదత్త మహామంత్రమును ("గోవింద రాం రాం గోపాల హరిహరి") వ్రాసి త్రాసునొండు దెప్పించి దానియం దొకవైపున నుంచి, "అయ్యా! సన్యాసిగారూ! శ్రీవారి గురు వర్యుండొసంగిన మంత్రరాజమును లిఖించి త్రాసు రెండవ వైపునందుంచుడు. దాన మీసంశయము నివర్తిగాగల''దని చెప్పుచు రెండవకాకితపుముక్క నాతని చేతికిచ్చె.

స్వామివారినుండి కాకితము బుచ్చుకొని సన్యాసిట్లు దలంచె, "ఇతడు పిచ్చివాడు. కాదేని యొకేబరువుగల కాకిత ములపై మంత్రములు లిఖించినంతమాత్రమున బరువునుండి భేదపడునని దలంచువా డుండురా! పొరపాటు. తప్పక రెం డును సమానభారము గలవియయ్యే యుండును. దీన నన్నీ తడు వంచింపజాలడు. మంచిది, మంచిది. దీననే వీని మదము

డంగగలదు. అట్లే గావించెదగాక!" నని మనస్సమాధానము గావించుకొని, ఆచిన్న కాకితముపై తన గురువర్యుడిచ్చిన మంత్రము లిఖించి త్రాసుయొక్క రెండవవైపున నుంచె.

వెంటనే స్వామివారిచీటి తూకమునమించి చూపరుల కద్భుతము గలిగించె. నప్పుడాస్వామి సభికులంగాంచి, "అయ్యలారా! నాగురువర్యుని ప్రభావము దిలకించుడు. సన్యాసిగారు మంత్రము లిఖించిన కాకితము తేలికయైనది. సన్యాసిగారికి సహాయముజేయ నెంచితిరేని తూకమునకుమించు మరే వస్తువైనను తెచ్చి త్రాసునందుంచి కృతార్థులుగండు. త్వరపడు"డని చిరునవ్వుతో బలికెను.

ఆమాటలువిని కొందఱు సభికులులేచి వారివారి దగ్గరనుండు కాకితముల గొన్నిటిదీసి సన్యాసి త్రాసువైపునం దుంచిరి. కాని ప్రయోజనము లేకపోయినది. మద్గురుప్రభావమునుగనుగొంటిరా! యని స్వామివారనుచుండ సభలో స్వామివారికి "జై" అను కేకలు మిన్ను ముట్టినవి. దానితో సన్యాసికి పరాభవము సంభవించుటచే నాటిరాత్రిపలాయనము జిత్తగించిరనియు, వానిపేరు తనకు దెలియదనియు మహారాజశ్రీ గద్వాల లక్ష్మారెడ్డి గారు చెప్పుచున్నారు. ఇట్లు గోవిందస్వామివారు సన్యాసి కాపట్యమడంచి గ్రామము నలయించు కలరా వ్యాధి మాటమాత్ర రూపుమాపి, సీతలాయంత్రి ప్రతిష్ఠాకార్యము సక్రమముగా బూర్తిచేయించి సర్వజనాదరణపాత్రుండై కొంతకాలమటనుండ, దలవనితలంపుగ స్వామివారికి సప్తాహముజేయ సంకల్పము వొడమ వెంటనే ముహూ

ర్తము నిశ్చయముగాబడినది. ఈవార్త యచిరకాలమున నెల్లూరుమండలమునం దంతట వ్యాపించినది యథోచితముగ సర్వసంభారముల సమకూర్చబడినవి. స్వామివారు నివసించుట కాపురివాస్తవ్యులచే నిర్మించబడిన మఠముచుట్టు గొప్ప పందిరులుగూడ తయారయినవి. మహాత్ములు సిద్ధసంకల్పులుగదా! ముహూర్త కాలమునకు సరిగా హరిభజనాపూర్వకముగ సప్తాహము ప్రారంభింపబడి సంపూర్ణాన్నదానముతో క్రతువు సాగుచున్నది. లక్షలకొలంది ప్రేక్షకులు స్వామివారితో గలసి భజనానందమున దేలియాడుచుండిరి. పూర్ణాహుతినాటికి దాదాపారులక్షల ప్రేక్షకులతో గ్రామమంతయునిండిపోయినది. నాల్గైదుపుట్ల బియ్యము వండి యన్నము రాసి పోయబడి యుండె. నందుకుదగిన శాకాదికములు సిద్ధపరుపబడినవి. పూర్ణాహుత్యనంతరము స్వామివారువచ్చిన జనమును, సిద్ధపరుపబడిన పదార్థములను దిలకించి, వినియోగాసాధ్యమైయుండుటచే గాబోలు, మఠనిర్మాణకాలమున గట్టింపబడిన యాంజనేయ దేవాలయ శిఖరముపైనెక్కి ప్రేక్షకుల నుద్దేశించి కరమునెత్తి, "ఆత్మీయులారా! భోజన పదార్థములన్నియు సిద్ధమయినవి. తత్పదార్థ వినియోగమునకు బలువురు యువకుల సాయమవసరమైయున్నది. ఇప్పటికి భోజనకాల మతిక్రమించినను సాయపడువారు చాలినంతమంది సమకూడియుండలేదు. కాన నిష్టమున్న వర్ణవ్యవస్థల జూడక నెవరికివారు భగవత్ప్రసాదమును స్వీకరింపుడు" అని బిగ్గరగా కేకలువేసెను. స్వామివారి పలుకు లాలించి భగవత్ప్రసాదమును ప్రేక్షకులు స్వయ

ముఁగ స్వీకరించి యాదివ్యస్థలమును జగన్నాథమును గావించిరి. అవభృథాంతముతో క్రతువు పూర్తియయినది. స్వామివారు సప్తాహానంతర మాయూరియందు కొన్నిదినములుండి బయలుదేరి చనిగండ్ల, శ్రీనివాసపల్లెలమీఁదుగ కర్నూలున కేగి, యటనుండి పత్తికొండ కేగు రస్తాన ప్రయాణము జేయుచుండిరి. వెనుకనుండి మోటారు రయిదెంచుచుండెను. డ్రయివరు శ్రీ వారిని ప్రక్కకు దొలకించుటకు విశేషప్రయత్నము జేసి యంతర్ముఖులైయున్న స్వామివారిని తొలగింపజాలక విఫలమనోరథుడై, యజ్ఞానావృతుండగుట కోపావేశమెంతయో ప్రేరేప నిష్కారణముగ కఠినతవహించి, దురభిమానముతో కారును ప్రక్కకుదొలగించుకొని పోవుటమాని, స్వామివారిని వెంబడింపజేసి గంటకు ముప్పదిమైళ్ళు వెళ్లగల వేగమా కారునకు గలిగించి రెండుమైళ్లవరకు నడపంగలిగినాడు. గాని శ్రీవారిని ప్రక్కకు దొలగింపజేయుటకుగాని, తుదకు సమీపింపజేయ గలుగుటకుగాని సమర్థుడు గాకపోయినాడు. ఆత్మశక్తిపూరితు నడ్డగింప నేరితరము! అంత నాసారథి తనగర్వము విడనాడి కారుదిగిపాదచారియై వెంబడించి, యచిరకాలమున స్వామివారి పాదముల బడగలిగినాడు. చూచితిరా! మనసారథి గర్వపూరితుడై యుండినప్పటి స్థితియు, గర్వరహితుడై యుండినప్పటి స్థితియు. గాన "గర్వమేరికిని కార్యకారికాదు". ఆహా! ఆత్మశక్తియన నిట్లుండవలదా! అట్లు సారథి స్వామివారి పాదములబడి యపరాధమును క్షమింపగోరుచు ప్రార్థించి తెచ్చి కారున గూరుచుండజేసి కృతార్థుడైనాడు. ఈవార్త కర్నూలు

మండలమునం దంతటను వ్యాపించి స్వామివా రెందుండినను జనులు గుంపులుగవచ్చి వందనార్చనాదుల గావించి పోవు నటులజేసినది. పాఠకులారా! ఈపుణ్యపురుషుని జీవితము వ్రాయుభాగ్యము నాకు గలుగజేయుటకు భగవానుని ప్రార్థించుచున్నాడ. వినుడిప్పుడు బొబ్బరలంక నుండి రాజోలు కుబోవు కాల్వకట్టపైన నొక సాధుమూర్తి తిరుగుచుండెను. వీరికోపమునకుగురియై యొకకారు మూడురోజులు నడువలేక నిల్చిపోయినది. ఈమహామహునిగాంచి యచేతనములగుకాళ్లు, బండ్లు, స్త్రీమర్లు భయపడుచున్నయవి. ఇష్టమున్నవారువీక్షింప నగు. వీరిపేరు చెప్పువారులేరుగాని, మూర్తినిమాత్రము జూప గలరు.

కొయ్యలగుంట వాస్తవ్యులు కొందఱు స్వామివారిని మహానందికిం గొంపోయి యందొకమఠమును నిర్మించి స్వామి వారి నందుండ బ్రార్థించిరి. భగవన్మహిమను లోకమునకంత కును వెల్లడిపరచుటయే పరమధర్మమని నమ్మిన మహానుభావు లొక్కచో నిలచియుండగలరా! ఇట్లయినను వారి యిష్టాను సారము కొంతకాలమందుండి యటనుండి గద్వాలచేరి యందు రామనామామాత్మ్యమును బోధించి భక్తి బీజమును మొలకెత్తించినారు.

నైజాము రాష్ట్రమున నివసించు హిందువులు ప్రాయశః గాఢభక్తిపరిపూర్ణులగుట సర్వజనవిదితము. రావిశేషమ్మక ముగూడా అందువలన నారాష్ట్రము నందలి వ్యాధిగ్రస్తులు స్వామివారు రామభజన జేయు స్థలమునకేతెంచి రామ నామామృతమును గ్రోలి యారోగ్యవంతు లగుచుండిరి. నాట

నుండి మనకథానాయకుడు భవరోగ వైద్యుడగుటయేగాక ప్రాకృత వైద్యుడుగూడ నైనాడు. ఇది యంతయు నారసి యచ్చటిభక్తులు స్వామివారియం దతిశయించిన భక్తిప్రపత్తులు గలవారై యుండుట స్వామివారియాజ్ఞ నొందు కూపమును ద్రవ్వించిరి. ఆనూతిలోని జలమున శ్రీ స్వామివారు రామ నామామృతమును గలిపిరట. ఆ నీరిప్పుడమృతమువోలె వ్యాధులకు పనిజేయుచున్నవట. అటనుండి బయలుదేరి యం దందు సంచరించుచు బెజవాడకేతెంచి కృష్ణానదిం గ్రుంకి, కనక దుర్గను సేవించి భద్రాద్రికేగు తలంపున బయనము సాగించి, మార్గమధ్యమునం దలరారు నందిగామ తాలూకా కమ్మవారి పాలెమునకు సమీపమునంగల కాప రామయ్యగారి భావి వద్దకువచ్చిరి. యాకూపమునంగల జలము స్నానపానయోగ్యం బుగాక కీటకములచే నిండియుండి ప్రేక్షకుల కసహ్యము గొలుపుచుండె. ఈ బావిచుట్టును రామయ్యగారికి గొంత భూమి కలదు గాని అది బదరికాశ్రేణి సదృశంబగుటచే వ్యవ సాయ యోగ్యంబగునది కాకయుండె. అట్లు స్వామివారటకు జేరి ప్రాతస్స్నాన సమయంబగుట ననుమానింపక, నానూతి యందుస్నానముజేసి సమీపవర్తులగుగోపాలకులజీరి, నేటినుండి యీభావినీరు స్నానపాన యోగ్యంబగుగాక! రేగుపొదలచే నిండియుండు నీపరిసరక్షేత్రం బచిరకాలమున ఫలవృక్ష సమావృతంబై యొసంగుగాక! యని జెప్పియెం దేనియుం”జనియె.

మరునాడుదయంబున గోపాలకులవలన నావార్త రామయ్యవిని సంతోష సంశయంబులు ముప్పిరిగొన, నూతికడ కేతెంచి యమృతోపమానములై యున్న జలంబులగాంచి పరమానందభరితుడై, “ఏమహామహుని కరుణాతిరేకంబున

బ్రహ్మానందమును మరపించునట్టి యానందమును బొందగలిగితినో అట్టి మహనీయుని దర్శించినగాని నాజన్మము కృతార్థత నందజాల"దని దలంచి, నాడే పయనమై పెక్కుస్థలముల వెదకి వెదకి యెట్టకేలకు భద్రాచలంబున శ్రీరామసేవా పరాయణుండై యుండుస్వామివారినిగాంచి, వందనముగావించి తనసంతసమును వెల్లడించి కృతార్థుండయ్యె ఇప్పుడు రామయ్యగారి భావినీ రమ్మృతమునుమించి పరిసరక్షేత్రమునగల కదళీవనమే వారి నుజ్జీవింప జేయుచున్నవట

నాడు మొదలు రామయ్యస్వామివారినిసేవించి తత్వజ్ఞాన సంపన్నుండై యుండెనని చెప్పుదురు. ఇట్లుండ గొందఱుభక్తులు స్వామివారునివసించుటకు భద్రాచలక్షేత్రమున మఠమొండు నిర్మింపనెంచి, శ్రీవారి కిష్టము లేదని తెలిసియు బని ప్రారంభించిరి. రెండుగజములయెత్తు గోడలు లేచినవి ఇంతలో ప్రభవ సంవత్సర వైశాఖమాస మేతెంచినది'' రామయ్య కార్యాంత రాసక్తుడై యెందేనియుం జనియె. సీతాకళ్యాణ మహోత్సవము ముగిసి నెలయయినది. శ్రీరామునకు వైశాఖపూజలు జరుగు చున్నవి. పున్నమివచ్చి శ్రీవారికి రక్తభేదులు కలిగించినది. ఔషధసేవలేదు. రామభజన మానలేదు. వైశాఖ శుద్ధ చవితి నాడుదయమున శిష్యు వీరాచారిని పిలిచి, ''మాపని దీరినది, పోవుచున్నాము. నీవు విచారింపక శాశ్వతసుఖ మనుభవింప బ్రయత్నింపుము. కృతకృత్యుడ వయ్యెద"వని సెలవిచ్చుచుండు సమయమున బ్రహ్మరంధ్రమును భేదించుకొని శ్రీవారిజీవాత్మ పరమాత్మయం దైక్యమయి శిష్యకోటికిని చూపరులకు నెంతయో యమ్మృత విషాదములు గలిగించినది.

సయ్యద్ అహ్మదలీషా ఖాదర్ వలీ

కొ త్త లం క యో గి

కం. బాలునిగతి నున్మత్తుని
    పోలిక జడమతివిధాన భూతోన్మాదో
    ద్వేలుని వడువున సుజ్ఞా
    నాలంబుండలరుఁ బుడమి నకుటిలమతియై॥

సమస్త చేతనాచేతనాత్మకమైన ప్రపంచంబంతటను బరమాత్మని దిలకింపుచు, సర్వసమదృష్టి యలవరుచుకొని నిష్కంటకముగ నిజదేహయాత్ర కొనసాగించుకొనుచు, పామరులవలన నేలాటి యాటంకములు గలుగకుండుటకు బాలోన్మత్త పిశాచావిష్టులవలె గనుపించుచు, నటకునివలె సమయానుగుణముగ క్రోధముఖరగుణముల నెలువరచు చున్నను, దక్రోధము క్రియారూపమును దాల్పనీకఁ బరోక్షముగ నాశ్రితుల మనోభీష్టముల దీర్చుచు, మృత్యుదేవతకు స్వాగతమిచ్చు మహాత్ములీయాంధ్రరాష్ట్రమునం దన్నిజాతులలోను స్వల్పముగ గనుపించుచున్నారు. గాని సామాన్యమానవు లెల్లరు భేదవృత్తి సహితులగుటయు, దురభిమానపూరితులగుటయు, వర్ణబద్ధులగుటయు సుజ్ఞానపూరితుల గనుగొనజాలక పోవుటయేగాక, వారి నాక్షేపించుచు, తమ తమ జీవితముల గలుషవంతములఁ జేసికొనుచున్నారు. వర్ణపిశాచమెట్టి యకార్యమున కొడిగట్టదు! యెట్టివర్ణమునకు జెందినవారైనను పవిత్రులనియే దలంచుచు, స్వభాషణ పరదూష

గాదు లంటనీక సమస్త ప్రపంచ మీశ్వరాంశా పూరితమని యెఱింగిన పుణ్యపురుషున కొక్కనికిమాత్ర మాయాత్మ నిష్ఠులు గోచరింపబడుచుందురు. అట్టి మహాపురుషులకెల్ల కన్నాక్కై యసమానమప్రతిభా ప్రభావములు గలిగి నవీన నాగరికతా మహాత్మ్యము పేర్మి శాస్త్రమర్యాద లతిక్రమించి వర్తించుచు, సంశయోద్భూత చేతస్కులై మెలంగు యాధునికుల విపరీతభావము లంతరింపఁ జేయఁజాలు నడవడిచే విరాజిల్లు మహాత్ముండు మన సయ్యద్ అహమ్మదలీషా ఖాదర్ వలీ. వీరి నివాస స్థల నామధేయ జననీజనక జనన కాల వివరములు సంపూర్ణములుగ దెలియుటలేదు. గాని క్రీ. శ. 1921 వత్సరమున జరిగిన జనాభా సందర్భములో కొత్తలంక నివాసియగు కొండపల్లి యజ్ఞన్నగారప్పుడు తన బ్లాకులో నివసించియున్న వలీగారిని ప్రశ్నించి యతికష్టము మీద పేరును, నివాసమును, వయస్సును కనుగొనజాలితినని చెప్పుచున్నారు. ప్రస్తుత మాయా విషయముల కనుగొనుటకింతకంటె తగిన సాధనలు లేకపోవుటచే నవియ నిందు బొందుపరచెద. నివాసస్థలము నైజామురాష్ట్రములోని నల్లగొండ మండలాంతర్గతమగు గొల్లపల్లి. ఈ గొల్లపల్లి యస్టేటునకు జెందిన జమీందా రీకుటుంబమున జననము. తల్లిదండ్రులు పేర్లు తెలియవు. వయస్సు 125 సంవత్సరములు. రైల్వేస్టేషన్ భువనగిరి. ఈ విషయములన్నియు క్రీ. శ. 1921 సం॥ తెలియవచ్చినవియగుట నిప్పటి కీవలీగారి వయస్సు 135 సంవత్సరములయియున్న విఅని చెప్పెదను. కారణము తెలియదుగానియిప్పటికి

రమారమి యేబది సంవత్సరముల క్రితము శ్రీ కుండలేశ్వర
మునకేగి అందు గౌతమీతటమునంగల మిఠాయిషాకావద్ద
చిన్న కౌపీనధారియై కూరుచుండువాడట. దగ్గిర నొక
మృణ్మయపానపాత్ర ముండెననికూడ తెలియుచున్నది. గ్రామ
మునం దప్పుడప్పు డన్న మర్థించి మెసవుచుండిరి. శీతాతపముల
లెక్కసేయక మెలంగెడివాడు. ఒకటి రెండు పర్యాయములు
గౌతమి నవలీల నుత్తరింపగలిగిరని యొకరిద్దరు చెప్పుచున్నారు.
ఈ కుండలేశ్వరమున నున్న రోజులలో నిప్పుడు రాజమహేంద్ర
వరమునంగల కోటిలింగాలయం దలరారు మఠమున వసించు
చుండిన కృష్ణావధూతగారు, వలీగారి యనుగ్రహమర్థించి
కొన్ని రోజులు శ్రీవారి వెన్నంటి తిరుగుచుండ, యొకప్పుడు
పురవీధుల జనుచు, కారణము లేకయే యవధూతగారు బలముగు
ప్రహారణములచే నలయించుట గాంచి, చూపరులు కటకటంబడి
యవధూతను పరిహసింపుచు, నీతురక నాశ్రయించి నందు
లకు బ్రతిఫల మనుభవించితివిగదా. చాలు, నిక నాపిచ్చివాని
వీడి సుఖంబుండుమని పెక్కువిధముల బోధింప, నాతండు
నవ్వుచు శ్రీవారు నన్ను బరీక్షింప నిట్లు కొట్టిరిగాని, నాయందు
కోపముచే కొట్టినవారు కారని జవాబుచెప్పి తనపట్టు సాగించి
కృతార్థుడైనాడట.

కేశనకుఱ్ఱు వాస్తవ్యుడు మాధవరపు కొండయ్య
తనభార్యకు సంభవించిన కుసుమవ్యాధి కనేక చికిత్సలు
చేయించి ప్రయోజనము గానక విసివి, వలీగారినిదర్శించి
యారోగ్య మర్థింప, గరుణించి ప్రసన్నవదనుండై మనోరథ

సిద్ధియగుగాకయని'యాశీర్వదించి పంపిన.నాటగోలెవ్యాధిసన్న గిలి యచిరకాలమున నామె సంపూర్ణారోగ్యము గడించి పుత్ర వతియై విరాజిల్లినది. ఆయమ తనపుత్రుని జంకనిడికొని సభర్తృ కయై సిద్ధపరచిన పాయసము గైకొని, సభక్తిపూర్వకముగ వలీ గారిని దర్శించి వందనశతము లర్పించి పాయసంబర్పింప, నాతండు సంతసంబు వెలిబుచ్చుచు, పాయసంబున గొంతభా గము మెసవి యూరకున్న. శేషించిన భాగమును ప్రసాదముగ నాయమ సభర్తృ పుత్రికయై భుజించి, శ్రీవారివలన నాశీర్వాద ములంది సుఖముగ నిల్లుజేరి కృతకృత్యయయ్యె. ఈదంపతు లిరువురు పుత్రపుత్రికా సౌభాగ్యసంపదోద్రిక్తులై యారోగ్య పూరితులై విరాజిల్లుచుండిరి. మఱియొకప్పు డొక మార్వాడీ బ్రాహ్మణు డొక్కండరుదెంచి యోగిగారిని దర్శించి నమస్క రించి, పంచదారలాడువుల నుపహారంబుగ నొసంగిన శ్రీవారా లాడువులలో గొంతభాగము గొఱికికొని తిని, మిగిలిన భుక్తశేష మాబ్రాహ్మణున కొసంగినారట. అతం డాప్రసాద మును చేనంది భుజింప మనంబొప్పక, స్వాశ్రమమునకేగి యొకగూట నాప్రసాదమిడి మిన్నకుండెనట.నాడు రేయిస్వప్న మున యోగిగారు బొడసూపి,"నీవసూయాగ్రస్తుండవై నే నిడు ప్రసాదము భక్షింపక నుపేక్షించియుంటివి. ఇదికారణంబుగ నీకాపదలు సంభవింప నున్న"వని నమ్ముమని యంతర్ధానులైరట. అంత నాతండు మేల్కని భయవిస్మయంబులు ముప్పిరిగొన మిగిలిన రేయి యెట్లో వెళ్లించి, మరునాడుదయమున నూతనో పహారముం గైకొని యోగిగారి దర్శనమునకేగ శ్రీవా రాతని

దరిజేరనీక దరిమివేసెనట. ఆవల నావిప్రుండు గృహంబునకేగి గూటనిడిన ప్రసాదమును గ్రహించి, పదంపడి, యోగిగారిని దర్శించి ప్రసన్నవదనుని గావించుకొని, యావిపత్సముద్ర పతనమును దప్పించుకొని కృతకృతుండయ్యెనని బ్రహ్మశ్రీ ఆకుండి సుబ్రహ్మణ్య శాస్త్రిగారు చెప్పుచున్నారు.

శ్రీవారు ద్వంద్వసహిష్ణులై భయవిరహితులై క్షుత్తృష్ణల గణనసేయక, విజనస్థల విహారాసక్తచిత్తులై కౌపీనమునుగూడ ద్యజించి దిగంబరులై, శయనాసనాది విధానములందు స్థలనిర్ణయము లేక వర్తించుచు, భక్తిప్రపత్తులు గలిగి దరిజేరిన స్వాశ్రితుల సన్మానించి వారిడు స్వల్పోపహారముల బరమప్రీతి గైకొని కృతకృత్యుల గావింపుచు, నిహపరము లర్థించివచ్చిన శిష్యలోకమును కఠినపరీక్షలచే నలయించి యుత్తీర్ణులైనవారి గడతేర్చుచు, చూపరుల కీతండు పిచ్చివాడని దోప మార్గమునం బోవునెడ చెట్టుచెట్టు పుట్టజుట్టిచుట్టి గనుపించెడి పత్రములెల్ల నాఘ్రాణించుచు, సమీపించినవారి నదలించి యావలికంపుచు, మార్గమధ్యంబునంగల పశుమలంబులపై కొంతసేపు విశ్రమింపుచు, మఱియు నేమేమో వికటక్రియల గావించుచు, హేయాహేయ ద్వంద్వ విరహితులై దురితమతుల ప్రహరణాదుల సత్కరించుచు, జలమలవిసర్జనాత్పరమున మర్మస్థాన ప్రక్షాలనములగూడ నుజ్జగించి చూపరుల కసహ్యముగొల్పుచు పరమపవిత్రులయ్యు నపవిత్రులవలె దోచుచు, నమానుషక్రియా కలాప విలాసులై కుండలేశ్వరమున కఖండశోభ గలిగింపుచుండిరి.

ఒకప్పు డన్నంపల్లి బ్రాహ్మణు డొక్కఁడు పయనిం
చుచు మార్గమధ్యంబునంగల కాల్వకట్టపై దిగంబరిగా పరుండి
యుండిన యోగిగారిని గాంచి, నమస్కరించి శ్రీవారి కర్పించు
టకు దనయొద్ద నెట్టిపదార్థమును లేమి విచారించుచు, ముందు
నకు గొంతనడక సాగించిన సమీపమునగల క్షేత్రమున
విరాజిల్లి కాయలచే నలరారు మామిడివృక్షములను వాటిని
పరిపాలించు యజమానినిగాంచి సమీపించి తన యభిమత
మెఱింగించిన నాతం డమందానందమున చూతసాలారోహ
ణంబు గావించి, పక్వఫలములఁ గానక విచారించి వృక్షమునం
దలరారు కాయలయం దుత్తమము లేరి ముదురుకాయల
రెంటి కోసియిచ్చిన, నావిప్రుండు సంతోషాయత్తచిత్తుండై
యా మామిడికాయల గైకొని యోగిగారు పరుండియుండిన
స్థలమునకు దిరిగివచ్చి, యాతని నచటగానక సమీపము
నంగల పంచముల గృహముల దిలకించి, అందొక గేహంబున
గూర్చుండియుండిన యోగిగారినిగాంచి భక్తిపెంపున నస్పృ
శ్యతకు జంకక మాలగూడెములోనికిం జని శ్రీవారికి తాను
తెచ్చిన మామిడికాయలనిచ్చి చేతులుజోడించి నిలచిన,
నతని దృఢభక్తి కలరుచు నా పులుపుమామిడికాయ లమృ
తములట్లు భక్షించి విప్రుని సన్మానించి పంపిరి. ఇట్లు శ్రీవారు
కుండలేశ్వరమున నుండుకాలమున సమీపగ్రామమగు కొత్త
లంక నివాసియగు గేదెల స్వామి, తన రెండవపుత్రుండగు
గోవిందరాజులు సంతానవంతుడుగామి విచారించుచు బుత్రుని
జీరి, "నీవు సంతానార్థివై కుండలేశ్వరమున వేంచేసియున్న

దిగంబరయోగిగారి నాశ్రయింపుము పొమ్ము" అనిన నాతండు వల్లెయని నాడేబయలు దేరి కుండలేశ్వరమున కేగి యోగిగారిని దర్శించి కొబ్బరిబొండములు రెండర్పింపబోయిన నాతండు కోపించి యావలకుఁ దరిమివేసెనట. అంత గోవిందరాజు భయాక్రాంత చిత్తుండై నాటికిల్లుజేరి మరునాడు తిరిగి కొబ్బరి బొండముల గైకొనిపోయి యోగిగారినిదర్శించి బొండములర్పిం చిననాతండు దయాళుండై యాకాయల భుజించెనట. ఇట్లే ప్రతి రోజు గోవిందరాజు తనకు లభించిన ఫలాదికముల యోగిగారి కర్పించుచు, నాతని యనుగ్రహమును బొంది రాత్రిం బవలు భజనసేయుచు యోగిగారి వెంటనంటి సంచరించుచు, దేహాభి మానమును విడచి దేశికాచార్య సేవామహాభాగ్యము గడించుచు, నిద్రాహారములమాని వర్తించుచు, దేశికా చార్యానుమతి యప్పుడప్పుడు గృహంబున కేగి గృహకృత్య ముల నెరవేర్చుకొని తిరిగి యోగిగారిని సమీపించి సేవసేయు చుండువాడు. గాని యస్థిరసంతాన సంపద నెప్పుడుగాని గోరక నిర్లిప్తుండై మెలంగుచుండె. ఇట్లుండ గొంతకాలమునకు యోగి గారి యనుగ్రహమువలననో, పూర్వకృత సుకృతము పేర్మినో మఱి యేకారణముచేతనో గోవిందరాజుగారికి పుత్రికాచతుష్ట యంబును, నేకపుత్ర భాగ్యమునుగూడ గలిగి జనకుండగు గేదెల స్వామికి సంతసము గలిగించినది.

ఇట్లుండ గోవిందరాజు భక్తిశ్రద్ధలు నానాట యభివృద్ధి యగుచు గురుసేవా మహాభాగ్య తత్పరుండై గృహమున కేగుటగూడ మరచి, తన్మయానందమున నోలలాడుచు యోగి

గారికి ఛాయవలె దిరుగుచుండుట జనకుండగు స్వామియు, నగ్రజుండగు వెంకటరత్నమును గోవిందరాజు మనసు ప్రపంచ విముఖత వహించి పరమార్థావలోకనము జేయుచుండుట విచారించి, నాతని వేరువిథముగ సంటజేర్చుట కనువుగానక నెట్లో నాతని బోధించి యోగిగారిని కొత్తలంకకు జేర్చి సేవించు నట్లాడంబరచి, కార్యసాధనకు దగుప్రయత్నములు జేయు చుండ భగవదనుగ్రహము పేర్మి, శ్రీవారందునకు సమ్మతించి శిష్యునితో కొత్తలంక జేరి గోవిందుని గృహ మలంకరించె

ఇట్లు శిష్యవాత్సల్యమెంతియో విస్తరింప యోగి కొత్తలంకయందును తత్పరిసర నారికేళ వనములందును తది తర స్థలములందును సంచరించుచు, కుండలేశ్వరమునందు వలెనే కాలముద్రోయుచుండుటయు, యోగి ననుసరించి గోవిం దుడు గృహకృత్యముల నంతయు విడనాడి నిర్లిప్తుడై సంచ రించుటయు జననీ జనకులును, భార్యాబిడ్డలును సోదరులును కటకటంబడి నాతని మరలింప ననువుగానక గోవిందుని మంద లించియు గోపించియు, బోధించియు సామదానభేదముల సాగించిచూచి ప్రయోజనము లేమి, యోగిగారియందు నీకింత యనురాగ ముద్భవిల్లుట కేప్రభావము లాతనియందు గనుపెట్టజాలితివో అయ్యవి మాకును జూపించిన నీప్రయత్న మునకు మేమడ్డుపెట్ట మనియు, లేనిచో ననేకాంతరాయముల గలిగించెదమనియు బెదరించి తమపట్టును కొనసాగింపదలంచిరి.

అందుకు గోవిందు తగిన సమాధానముచెప్పకనే తన నిర్లిప్తత్వమును కొనసాగింపుచుండె. కృతార్థత నొందదలంచిన

శిష్యు లిట్లేగడ వర్తించుట! ఇదియంతయు యోగిగారంతర్దృష్ట్యా నెఱింగిన వారగుట శిష్యునకుగల సంకటముదొలగింప సమయ మారయుచుండె. నిట్లుండ కొంతకాలమున కొకనాడు యోగి విజనస్థలమునందు నివసింపుచున్నతరి యకస్మాత్తుగ విపరీత మగు గాలివాన ప్రారంభించి యచిరకాలమున భూమినంతయు జలమయము గావించినది. గోవిం దీయుత్పాతమును దిలకించి దేశికాచార్యుడు విజనస్థలమునం దెట్టి యాపద నొందు చున్నాడో యనియు, నాయన నారసి గృహమునకు జేర్చి కృతకృత్యుడ నయ్యెదననియు దలంచి, యాగాలివానలో బయలుదేరి నారికేళవనములను తదితరములైన యునికిపట్లను రోసి, యోగినెందును గానక పరితాపాన్వితస్వాంతుడై విసుకు గొనక జలపూరితములైన మిట్టపల్లముల లెక్కసేయక వెదకి వెదకి, తుదకు పెద్దకాల్వకట్టుకు దవ్వులనుండు మాగాణిగట్టున నొక తాటియాకులమట్ట మోమున కడ్డమిడుకొని కూరుచుండి యుండిన యోగిగారిని దర్శించి, సమీపించి నమస్కరించి తన యభిమతం బెఱింగించి దేశికునాన నాతని తనభుజమున నెక్కించు కొని సునాయాసముగ నిల్లుజేర్చి, బలిష్ఠమగు ప్రిహరిమధ్య, విరాజిల్లు నిజగృహమునంగల యొకగదియందు బ్రవేశపెట్టి, శీతబాధా నివారణార్థము చలిమంట వేసి సేదదేర్చి పాదము లొత్తుచు గొంతసేపు కూర్చుండి, యోగిగారు నిద్రించి నట్లె ఱింగి నిద్రాభంగమగునని శంకించుచు, నింటగలవారి నెల్ల నెదుట నున్న తన రెండవగృహంబునకంపి వాకిళులుమూసి, దర్వాజా వెలుపల గోవిందుడు తన యన్నయగు వెంకటరత్నముతో

గూర్చుండి యుండెను ఇట్లు దాదాపు నాలుగుగంటల కాలము గడచిన గోవిందుడు యోగిగారు నిద్రనుండి లేచి రేమోయని దలంచి తెలుపుదెరచి గృహమంతయు బరికించినను యోగిగారెం దునను గనుపింప లేదు. ప్రమాదమువలన నెట్టి విపత్తైనను సంభవించి యుండిన దేమోయని శంకించుచు, తదావరణమునం గల గూపముల సహితము వెదకి ప్రయోజనము గానక బరిత పించుచుండ, నీదుర్వార్తగ్రామమునంతటను వ్యాపించి పురజనుల కలవరపెట్టినది. పలుదిక్కులకు బలువురు యోగిగారరయుటకు వెంటవెంటనే చనిరి. ఇట్లుండ గొంతసేపటికి యోగిగారుత్తర బజారున దిరుగుచున్నారను వాక్యము వెలియవచ్చి వెంటనే పురవాసుల నాశ్చర్యాబ్ధి ముంచివేసినది. నష్టద్రవ్యరాసి చేకూరినట్లు సంతసించుచు గోవిందుడు పరుపరుగునం బోయి శ్రీవారిని దర్శించి తిరిగి గృహమునకు దోడ్తెచ్చి కృతార్థుం డయ్యె. ఈయద్భుతమునుగాంచి గేదెల స్వామి పుత్ర మిత్ర సహితముగా శ్రీయోగిగారికి శిష్యుడై నిరంతరపరిచర్యామహా భాగ్యమున పాలుబంచుకొని కృతకృత్యుండయ్యె. నాడు మొదలు వెంకటరత్నము గోవిందు ననువర్తించుచుండె.

అప్పటినుండి గోవిందు డెట్టియంతరాయము లేక దేశికా చార్య సేవాపరతంత్రుడై నేటివఱకు విరాజిల్లుచున్నవాడు. ఈకలికాలమునం దిట్టి యద్భుతప్రభావ సమేతుడగు గురు వర్యుండు లభించుటయు, అతికష్టములకోర్చి కఠినపరీక్షల నారి తేరి శుశ్రూషా మహాభాగ్యము గడించు శిష్యుండుండుటయు నబ్బురమేయగు గదా!. చూడుడు. ఒక్కనా డశుద్ధవిలిప్తమైన

శరీరముతోనున్న విజనస్థల వాసియగు యోగిగారిని దర్శించి గోవిందుడు సమీపించి, "బాబూ! మీ దేహమం తెంతయు నమేధ్య మలముకొనబడియున్నది. యాజ్ఞయియిన నీటగడి గెదనని ప్రార్థించిన, నాతండు సమ్మతింపక నన్నీగూపమున నీభుజమున వహించి మోసికొనిపోయి పురవీధిని తీసికొనిపోయి యిల్లుజేర్చుము. పెద్దవాడనగుటచే నడువజాలక నిన్ని కష్టము నకు బాల్పడజేయుచున్నాడ. శీతబాధ భరింపజాలమి నీట గడగు వ్యాపారమునకు సమ్మతింపనైతి. గృహమున కేగిన తదుపరి నీయిష్టమువచ్చి నటుల జేయవచ్చునని యాజ్ఞపించు టయు, నెట్టియసహ్యములు దలపగూపనీక నక్లైగావించి కూ్రర పరీక్షలో గడ తేరినాడు. తదాది నిట్టిపరీక్ష లే చేయు చుండెనట.

నేను యోగిగారిని దర్శించుతరి గోవిందుడు గావించిన భజనవలనను అప్పుడు జరిగిన యితరకార్యములవలనను గోవిం దుని పరాకాష్టయు యోగిగారియందున్న భక్త్యాధికమును వెల్లడియైనది.

శ్రీవారిని దర్శించుటకయి నాకంటె నొకరోజుముందు రామచంద్రపుర నివాసులగు కొందఱు మహమ్మదీయులును, రాజోలు తాలూకా నివాసులగు బ్రాహ్మణ క్షత్రియ లిద్ద రును వచ్చి కొత్తలంకయందు విడిసియున్నారు. యోగిగా రూరలేక నెక్కడనో నారికేళవనములందు గుప్తరుచున్నారు. ఈనారికేళవనములు క్రొత్తవారికి దుష్ప్రవేశములగుటచే గోవిందుని సహాయమున కార్యసాధన చేసికొననెంచి వారు

యాతని నాశ్రయించిరి. వారికోరిక కొనసాగించుటకుగాను గోవిందుడు ప్రజోత్పత్తి వత్సర మార్గశీర్ష బహుళ షష్ఠియుదయము యోగి నారయుటకేగి నాడొంటిగంటకు (అనగ) నేనూర ప్రవేశించిన కొంతవడికి యోగిగారిని కొత్తలంక బ్రవేశపెట్టినాడు. ఆతని యనుగ్రహము పేర్మి నాకశ్రమమున యోగిదర్శనము లభించినది. కృతార్థుడనైనాడ. ఇట్లుండ సాయంత్రము మూడుగంటలైనది. గోవిందుని యింటిముందు గల వేదికపై పరచియున్న కంబళముపై సన్నని గుడ్డ ముసుగిడికొని పరుండిన యోగి పాదములొత్తుచుండిన గోవిందునితో గొంతసేపు భజనానందమున నన్ను దేల్చుము, త్వరపడుమని యాజ్ఞాపించె. వెంటనే గోవిందుడు చితారును చిటికెలను మ్రోగించుచు యోగిగారి శిరోభాగమునకంటి కూరుచుండి భక్తిప్రవత్తులుల్లసిల్ల గ్రమముగ రామదాసుచరిత్రయందు గల కీర్తనలెల్ల సాయంత్రి మేడుగంటలవఱకు పాడి కృతార్థుడయ్యె.

ఈ కీర్తన జరుగుచుండు కాలమున గోవిందుని తమ్ముడు గౌరయ్య నమ్రతమై యోగిగారిని జేరి కీర్తన యాపమనెదరా యని ప్రశ్నించినప్పుడు, యోగిగారు భక్తిరసము కడుపునిండ నటుల పాడనిమ్మని వెలువరచిన వాక్యమును బట్టియు, నా కీర్తనలలో "కావు కావు మటంచు గాకాసురుడురాగ గాచిరక్షించినా వయ్య రామప్రభో ॥ పాహి ॥" అను పదమును గోవిందునిచే తిరిగి తిరిగి పాడించుకొని యానందించు విషయమునుబట్టియు, యోగిగారు కబీర్ దాసునకువలె రామ

భక్తిపూరితులనియు కీర్తన ప్రారంభించినది మొదలు కొర
వడని భక్తితో రమారమి నాలుగుగంటల కాలము విసుకు
విరామము లేక గురువర్యుని మనోభావానుసరణి భజనగావించి
నాటిరేయి యంతయు దేశికాచార్య సేవానిమగ్నుడై యుం
డుటచే గోవిందుని శుశ్రూషాపరాకాష్ఠయు విస్పష్టమైనది.
నాడు రేయి నాలుగుగంటలకు యోగిగారు నే పరుండియుండిన
వేదిక సమీపమునకు వచ్చుచున్నారని తెలిసికొనినవాడ
నగుటచే నా ప్రదేశమును ఖాళీచేసి ప్రక్కనుండు వేదికపై
కేగితిని. అంత యోగి నా యభిప్రాయమున కనుగుణముగ
నా వేదికపై బరచియున్న తాటియాకుల చాపపై ముసుకు
పెట్టుకొని పరుండిరి అప్పుడు నేనిట్లు దలంచితి. ఇప్పుడు శ్రీవారి
కెఱుకబరపక పాదములొత్తు కార్యమున బ్రవేశించిన గ్రొత్త
వాడనగుట నాయనకోపమునకు గురికావలసివచ్చునేమో
ముందు నన్నెఱింగించుకొని తత్కార్యమున కున్ముఖుడనగుట
సమంజసముగా నుండునని యోచించి భయకంపములు మన
మున దొలుకాడ వినయవాక్యముల 'బాబూ! తమకు చలి
బాధ నడంగుట కీదుప్పటి కప్పమనెదరా'యని యొకటి రెండు
పర్యాయములు విశదపరచిన శిరంబెత్తిచూచి 'దుప్పటి నే
కప్పుకునియున్నాడ; నిదిచాలు'నని జబాబు చెప్పిరి. అంతట
నే నూరకొనక, 'మీరు కప్పుకొనినది దుప్పటికాదు. సన్నటి
గుడ్డ; అది చలి నాపలేదు. ఈ దుప్పటి మొద్దుగానుండుట జలి
నాపగల'దని చెప్పుచుండు నంత, కోపమున నరుగు దిగి

పొమ్మని మందలించిరి. అంత నే భయాక్రాంతుడనై సమీప మునున్న మఱియొక యరుగుపై కూరుచుండి శేషించిన రాత్రి వెళ్ళించితిని. కోపముచేతనైనను శ్రీవారిని నాతో మాట్లాడించిన భగవానుని వేనోళ్ల వినుతించుచున్నాడ నాడు శ్రీవారు గావించిన యమానుషచిత్రము నొకటి వినగలిగితిని. ప్రొద్దున లేచి భక్తావతంసుడును, సుగుణగణాలంకారుడును, భూసురవరుడునగు ఆకుండి సుబ్రహ్మణ్య శాస్త్రిగారిని దర్శించుటకు నేను కేశనకుఱ్ఱు (కాశీనకురు) కేగితిని. గతరాత్రి శ్రీవారి దర్శనార్థమే తెంచిన, భక్తులు కాక నాటి యుదయమున కాకినాడ నర్సాపురములనుండి సంపన్న గృహస్థు లేతెంచి యోగిగారిని సమీపించి, యతని యనుమతి లేకయ భక్తిపెంపున పాదములనంటి నమస్కరించుటచే జనసమ్మర్దమున కిష్టపడని వాడై, విజనస్థలవాస సంపద బురికొల్ప నెవరికోడను జెప్ప యేక నారికేళవనముల వైపునకు బరుగెత్తికొని పోయిరట. చూపరులెల్లరు శ్రీవారిని వెంటనంటి కొంతదూరమేగి వారిని కలసికొనజాలక తిరిగి గ్రామమున కేతెంచిరి. వారిలో ముళ్ళపూడి పాణియ్యావధూతస్వామి [గోళ్ళబుచ్చిరాజావధూతగారి శిష్యకోటికి జేరినవారు] మాత్రము శ్రీవారిని వెంటనంటి పోవుచుండెనట. యిట్లు కొంతదూరమేగిన శ్రీవారు పిచ్చి పిచ్చి నడకలతో బోవుచు నొకదడి చాటున కేగిరట. వెంటనే యవధూతగారు నాదడి దరిసి చూచునప్పటి కచ్చట యోగిగారు ఈ చిత్రమున కబ్బురపడుచు, అందందు వెదకి యెందున గానక, మార్గమునం దగుపడిన వారినందరిని యోగిగారి పోబ

డిని గుఱించి ప్రశ్నించియు, వారివలన తగు సమాధానము బడయజాలక భగ్నప్రయత్నుడై యింటికివచ్చి తన ప్రయాస మంతయు విఫలమైనదని నాతో జెప్పి విచారపడినారు.

నాటి సాయంత్రము మేమిద్దరము గోవిందుని పురస్కరించుకొని, నారికేళ వనములన్నిటిని తిరిగి తిరిగి యెందునను శ్రీవారిని గనుగొనజాలక, సన్న్యులవలన శ్రీవారి నివాసప్రదేశ మెఱుంగదలంచి మార్గస్థుల నలుగురైదుగురిని ప్రశ్నించిన 'కూతపమువ్రన శ్రీవారుగలరు, త్వరగబోయిన సందర్శింపగల'రని చెప్పిరిగాని. మేమెంత వడి వడిగ నడచినను శ్రీవారిదర్శనము లభింపక విఫలమనోరథులమైతిమి.

యోగిగారి కన్నభాషలయందును ప్రవేశముగలదు. అందులో నురుదు తెలుగు ప్రధానభాషలుగా నున్నవి. ప్రాపంచికు లడుగుశుభాశుభ ప్రశ్నలకు సమయానుగుణముగ జబాబు లిడుచు లోకాపకారము గావించుచున్నారు. ఒకప్పుడు గేదెల వెంకటరత్నముగారు చనువుమై 'మీరు నల్లకొండ సీమనుండి రాగతమేమి?' యని యడిగినప్పుడు, ప్రారబ్ధము గొట్టుకవచ్చినది యని జబాబు చెప్పిరట. వీరు నాగపూరులో దేహముచాలించిన బాబా తాజుద్దీనునకు మిత్రులనియు, నక్కడ కొంతకాలము వసించియుండిరనియు తెలియుచున్నది.

'కొద్దిరోజుల క్రిందట పచ్చమట్ల రామకృష్ణం రాజుగారి కొబ్బరితోటలో, బుట్టయొద్ద యోగిగారు పరుండియుండ సర్పమొకటి శిరమువద్దజేరి తన శరీరము చుట్టచుట్టుకొని పడగచే శ్రీవారి మోమున కెండతగులనీక నడ్డము పట్టియుండుట

మేము చూచితి'మని బసవ నారాయణస్వామి. పొత్తూరి వెంకట సోమరాజు మఱికొంద ఱీడిగెలు చెప్పిరని కొండపల్లి యజ్ఞన్న గారు చెప్పుచున్నారు. యోగి నప్పుడప్పు డూరిలోనికి దీసికొని వచ్చిన మారుమాటాడక వచ్చును గాని అట్లుజరుగని యెడల నాహారమేమియు గొనకనే నిజనస్థలమున సర్వకాలము నివ సింపగలడు

తాను పరమార్థావలోకనము చేయుకాలమున నెవరే యూరికిదీసికొని పోయినను మారుమాటాడక పోవుచుండు వారట. ఒకప్పు డమలాపుర వాస్తవ్యులు కొంద ఱఱుదెంచి శ్రీవారిని చేయిబట్టుకొని తీసికొని వెళ్ళి, బండిమీద గూరుచుండ బెట్టి, తమ గ్రామమునకు దీసికొనిపోయి ఒకయింట విడియించి యుత్సవప్రయత్నము జేయుచుండిరట. ఇంతలో శ్రీవారు బహిర్ముఖులై వారినందఱ వంచించి యెందేనియు జనిరి. ఇది యెఱింగి ఆయూరివారు శ్రీవారి నెందునను గానక, తమ ప్రయ త్నము వ్యర్థమగుటకు పరితాపపూరితులై వెంటనే కొత్తలంకకు వచ్చి విచారించి, శ్రీవారిని దర్శించి భయాశ్చర్యముల నొందినారట.

ప్రియశిష్యుడగు గోవిందు డొకప్పుడు యోగిగారి నను మతివడసి తిరుపతి మొదలగు పుణ్యస్థలముల సేవించి వార ణాసి కేగ దలంపుగలవాడై, దీర్ఘప్రయాణమున విశాఖపట్ట ణము జేరియుండునంత, నింటికిబోవలయు నను యభిలాష వొడమి ధూమశకటారోహణముజేసి నాటిరాత్రి పండ్రెండు గంటలకు ద్వారపూడి దిగి మరునాడుదయము 10 గంటలకు

సమారమి ఇరువది క్రోశముల కెక్కువదూరముననున్న స్వగ్రామమునకు జేరి, యింత యచిరకాలమున దీర్ఘప్రయాణము చేయుట కబ్బురపడుచునుండి, తనభార్యాబిడ్డలు క్రింద 3 రోజుదయమున శ్రీవారిని దర్శించి, తమ ప్రియశిష్యుడేగి చాలాకాలమయినది, 'వారి వియోగము మాకు భరింపరాకయుండుటచే నలమట నొందుచున్నారమని. యచిరకాలమున రప్పించి మమ్ము ధన్యులగావింపుమని, ప్రార్థించిన, రేపు 10 గంటలకు రాగలడనిచెప్పి వారిసమాధాన పరచినారని యతనికి తెలియవచ్చుటచే, విశాఖపట్టణములోనున్న తాను వెంటనే యోగిచే, యాకర్షింపబడి, సకాలమున కింటికి రాగలిగితినని దలంచి శ్రీవారి ప్రభావమును నిరంతరము స్మరించుచు వారి పాదసేవ చేయుచున్నానని గోవిందరాజు చెప్పుచున్నాడు.

మఱియు శ్రీవారికి భక్తిచే చేయబడిన భజన పరమాహ్లాదజనకమగుటచే నెంతటి విద్వాంసులేతెంచి సంగీతము పాడుట కనుజ్ఞయిమ్మని ప్రార్థించినను ఆప్రార్థన లంగీకరించువారుగారట. గాని శిష్యుడు గోవిందుని యొక్కయు సుంకరి రామదాసుగారి యొక్కయు భజన స్వామివారి నెంతయు మోదాంబుధి దేల్చివేయునని తెలియుచున్నవి. వీరు సంగీత విద్వాంసులు గాకపోయినను గాత్రమాధుర్యము, లేనివారైనను వారిని ప్రేమించినట్లు భజనలో మఱియొకరిని ప్రేమించుట లేదని గూడ తెలియుచున్నది.

అనేకమంది స్త్రీలు పుత్రభిక్ష మర్థించి మనోరథసిద్ధులు గడించి పిల్లవాండ్ర కెట్టిపేరులు పెట్టవలయునో

తెలుసుకొనుటకు శ్రీవారిని కోరిన, రాముని పేర్లు బెట్టునట్లా జ్ఞాపించువారట దీనివలన రామభక్తి వీరి హృదయమున నెట్లు నాటుకొనిపోయినదియో విశదమగుచున్నది. వీరిని ప్రేమించు వారు బ్రాహ్మణులు తప్ప, శేషించిన యన్నివర్ణములవారును గలరనియు, బ్రాహ్మణులలో గొద్దిమందిమాత్రమే గలగనియు ఆకుండి సుబ్రహ్మణ్యశాస్త్రిగారు చెప్పుచున్నారు. ఈ కొత్త లంక యమలాపురము తాలూకాకు చెందియున్నది. యిందు గల పెద్ద కాల్వకట్టన శ్రీవారు వచ్చుచుండగ, నాతని వెదకుచు పోయిన శిష్యుడు గోవిందుడు కట్టనెక్కి చూచి, తనకు రెండు ఫర్లాంగుల మేరలో యోగిగారు వచ్చుచున్నారని తెలిసి, యక్కడనే నిలచి చూచుచుండ, నకస్మాత్తుగా కాలువ గిన్నలి యొడ్డునుండి యావలికి జేరి శరీరము తడియకనే యావలికట్ట మీద చూడగలిగితినని యు, నిరువది గజముల వెడల్పున బారు చున్న కాలువ నతిప్రయాసమీద నీది, నేనావలిగట్టునకు జేరి యోగిగారికి నమస్కరించి శరీరము తడియకనే ఈవలిగట్టున కెట్లు రాగలిగితిరని ప్రశ్నించిన, బల్లకట్టుమీద దాటితినని జెప్పి రనియు విచారించిన అక్కడెచ్చటను బల్లకట్టుగాని సంగడి గాని లేదని తెలియవచ్చినదనియు గోవిందరాజు చెప్పు చున్నాడు. ఈ గ్రామమందుగల బ్రాహ్మణ బ్రాహ్మణే తరులందఱు శ్రీవారి భక్తులైయున్నారు. చాలా దూరదేశము నందుండు భక్తులుగూడ నప్పుడప్పుడు యోగిగారికి ఫలహార ముల బంపుచుందురు గాని, ఇష్టమైనయెడల నా పదార్థముల గొద్దిగ స్వీకరించుటయు స్వీకరింపకపోవుటయు గలదు. నే నీ

గ్రామమునందున్న సమయమున దాదాపు పదునైదు క్రోశముల దూరమునందున్న కపిలేశ్వర పుర వాసియగు శ్రీమతి వెంకటనరసమ్మగారు మనిషిచే జున్ను పంపిరి. దానిని శ్రీవారు గ్రహింపగలిగిరి. వీరి మహాప్రభావములును చర్యలును లెక్కింప నాకోటి వశములు గావు గాని నిక యొకటి రెండు విషయములజెప్పి ముగించెద. నొకప్పుడు యోగిగారి కాలిమడమకు మడిమె మండెయను రణము లేచి చీము నెత్తురలతో నావరించి యున్నను, మామూలు ప్రకారము నారి కేళారణ్యములయందు సంచారము జేయుచు, రణమును దడపుచుండిసను యెట్టిమందును వేయకుండగనే యచిరకాలమున మానిపోయినదట. ఇప్పటికి రెండుసంవత్సరముల క్రిందట నొకనాడు యోగిగారిని కొందఱు గ్రామస్థులు వెంటబెట్టుకొని వచ్చుచుండగ మార్గమధ్యమున పామొండు కాలునచుట్టుకొని బలముగ కరచిన, యోగిగారాపామును బలవంతముగ లాగిపార వేసిరట అంతట నదిపోక తిరుగ పరుగెత్తుకొనివచ్చి యోగిగారిని కరచినదట. అది చూచి సమీపవర్తులు దాని చంపనుంకించిన, మానిపించి గ్రామమున కేతెంచి యెట్టి బాధయు లేకనే నాటిరాత్రి శ్రీవారు వెళ్ళించిరి. ఆపాము మరునాటికి నిష్కారణముగ చచ్చియుండుటను చూచి పురజనులు యోగిగారి ప్రభావమున కబ్బురపడిరట. అహింసావ్రతదీక్షాపరుని గాంచినంత సహజ వైరస్వభావములు గల జంతువులు మిత్రత్వము నెరపునని పెద్దలు చెప్పుచుండ, యోగిగారిని సర్పమెట్లు కరవగలిగినది? లేదు, లేదు. అది పాముగాదు. భగవానుడు సర్పరూప

మునుదాల్చి యోగి యహింసావ్రతమును బరీక్షించి, తత్పరీక్షలో నుత్తీర్ణులయిన యోగిగారి ప్రభావము లోకమున కెఱింగింప, సర్పశరీర మంద విడచి స్వస్థలమున కేగియుండునోపునని దలంచెద. ఇదియే నిజము.

యోగిగారి వయోనిర్ణయమును గుఱించి విచారింప ఆకుండి సుబ్రహ్మణ్య శాస్త్రిగారిట్లు చెప్పుచున్నారు. తన చిన్నతనమున కుందలేశ్వరములో యోగిగారి ప్రథమదర్శన సమయమున ఈయనగారికి దాదాపు ముప్పది సంవత్సరముల వయస్సుండుననియు, ముప్పది సంవత్సరములు కుందలేశ్వరమునను పదునారు సంవత్సరములు కొత్తలంకయందును వసింప గలిగిరనియును. ఈ లెక్కనుబట్టి చూచిన యోగిగారి వయస్సు రమారమి డెబ్బదియారు లేక యెనుబది సంవత్సరములయినట్లు తెలియుచున్నది. యోగిగారిని చూచినవారి కిదియే నిజమగునని తోచగలదు. ఇదియింకను విచారణీయాంశము.



ప్రతాప కోటయ్య శాస్త్రి

రచయిత :- చంద్రమౌళి చిదంబరరావుగారు

స్రక్చందనాది భోగంబుల నాసింపక బ్రహ్మానంద మనుభవించువా డాత్మారాముడు. ఈత డనుభవించు సుఖము బయటి నుండి వచ్చినదిగాదు; బయటిసుఖ మస్థిరమైనది. విషయము లస్థిరములగుట, వీటివలన వచ్చు సుఖమునకు స్థిరత్వ మెట్లు లభించును ?

పరబ్రహ్మ సత్యవస్తువు మార్పు లేనిది, నశింపనిది, వికారములు లేనిది. పరసుఖ మనుభవించి యానందించువాడు, బాహ్యమును తేరిపార నైనను జూడడు సాధకుడు తన ఇంద్రియములకు విషయములతో పొత్తు తప్పించి పరమాత్మప్రాప్తి హత్తించినచో పై ఇంద్రియములకు దివ్యత్వ మలవడి స్వస్వరూపానుభూతి సంపాదించినవా డగుచున్నాడు. ఇప్పు డితడు జీవుడుగాదు, ప్రత్యక్ష పరబ్రహ్మము. బురదలోని కుమ్మరిపుర్వువలె సంసారమున వర్తించుచున్నను, ద్వంద్వరహితుడై, విషయానందములకు సాక్షిమాత్రు డగుచున్నాడు. వీనికి అనర్థరూపమైన ద్వైతమునశించినది అద్వైతానందభాగహారి ఇట్టివారు మనకోటయ్యశాస్త్రిగారు. తండ్రి జోగయ్యశాస్త్రిగారు. నివాసము బాపట్ల తాలూకా, నాగండ్ల. చిన్నతనమునుండియు విరాగియు నిరపేక్షియునై జీవయాత్ర సాగించుచుండువారు. బాల్యమున తెలుగుబడిలో నించుక విద్యా

భ్యాసము చేసెను గాని అందు విశేష వైశద్యము గాంచియుండ లేదు. ఉపనయనమైనపిమ్మట వేదాధ్యయనము సలిపెనో లేదో స్పష్టముగా, తెలియదుగాని వీరి జీవితమందు ప్రధానముగా గమనింపదగిన యంశములు నిరపేక్షత్వము, వినయ వివేకాది సద్గుణసంపత్తి, అతిశాంతము, నిరంతరానందానుభవము, సమత్వము. జననీ జనకులు ధనవంతులుగాక సామాన్య స్థితిగతులలోనుండి భూమిసాగుచేసికొని జీవించుచు వచ్చిరి. కోటయ్యగారికి మాత్రము వ్యవసాయమందు శ్రద్ధ లేక తలిదండ్రుల వత్తిడిచేత పొలమునకు వెళ్ళుచువచ్చుచు నుండిరి. గాని తక్కిన కృషీవలులవలె పంట పండింపవలెనను నాసక్తిగాని, యుత్సాహముగాని, పండినవేళల సంతోషము గాని, యెండినవేళల విచారముగాని లేక, నిస్పృహులై కాలక్షేపము జేయుచువచ్చిరి. జొన్న, మొక్కజొన్న మొదలగు సస్యములు పండినసమయములలో దారిఁ బోవువారిని పిలిచి జొన్నకంకులును, నూచబియ్యమును యిచ్చుచు సంతసింపుచుండిరి. పొలముకావలికై తానున్న సమయమున పొలములో పశువులుపడి మేసినను, ఆకాశమున సంచరించు పిట్టలెన్నివచ్చి కంకులను తినుచున్నను వానిని చూచుచుండియు వారింపక, అన్నిజీవరాసులు తనచేలో పంటతిని సంతుష్టిగాంచుచున్నవి గదా యని యపరిమితానంద ప్రవాహమున నోలలాడుచుందురు. వీరిచర్య తలిదండ్రులు గమనించి యప్పుడప్పుడు కోపించుచు వచ్చినను స్వభావసిద్ధమగు నతని యుదాసీనవృత్తి మారలేదు. పొలముపనికి పనికిరాడనియెంచి యింటిపనుల

యందుఁ బ్రవేశపెట్టిన నిరుగుపొరుగువా రేవస్తువు కావలెనని కోరిన నయ్యది నిరభ్యంతరముగా నిచ్చుచువచ్చెను. తలిదం డ్రులు మందలింపఁగా వినయముతో సమస్త జీవరాసుల నిరం రము పోషించు భగవంతుఁడు మనలమాత్రము పోషింపఁడా యని సమాధానముఁ జెప్పుచుండును. అట్లు కొన్ని సంవత్సర ములు గడచి యిరువదియేండ్ల ప్రాయమురాగా గొల్లపూడి కాపురస్థుఁడు కూరపాటి వెంకటాద్రియుఁడు తనకుమార్తె మహా లక్ష్మమ్మను కోటయ్య శాస్త్రిగారికిచ్చి వివాహముచేసెను. పిమ్మట కొన్నాళ్ళకు తండ్రి కుమారుని పిలిచి, మనకు ఋణ బాధ యధికమైనది. భూములు దక్కునట్లులేవు. నీభార్య కాపురమునకు రానున్నది నీవు సోమరిపోతువై యింట ను డరాదు. యెచ్చటికేనిపోయి ద్రవ్యము సంపాదింపవలసిన దని తీవ్రముగాను, ఖండితముగాను పలుకగా, కోటయ్యశాస్త్రి మారుమాటాడక మరునాడే ద్రవ్యార్జనాకార్యభారవాహియై, ఆకాలమందు బీదబ్రాహ్మణులు తరుచుగా ధనార్జనకై పోవు చుండు నైజాము రాష్ట్రమున కేగి, సికిందరాబాదులో నొక సత్రము పంచలోజేరి యారాత్రిగడపి, మరునాడొక వీధిని పోవుచుండగా గుబ్బము నారాయణయను నొక ధనవంతుడగు వర్తకుడు జబ్బుపడి యనేకమంది వైద్యులు మందిచ్చినను, రోగము నెమ్మదింపక వ్యాధిబలమై జీవితాశవదలిన పరిస్థితు లలో, పలువురు బంధుమిత్రులు చూచుటకు వచ్చుచు పోవుచు సందడిగానుండుటచే, కోటయ్యశాస్త్రిగా

రాజనసంకులము చూచుట తటస్థించినది. అది యేమో యని దలంచి తానును లోనికి వెళ్ళి చూచెను. శాస్త్రిగారి జీవచరిత్రయందొక గొప్ప పరివర్తన కానున్న యోగముండుటచే కాబోలు వ్యాధిగ్రస్థుని సమీపబంధు వీకోటయ్య శాస్త్రిగారి నొకగొప్ప వైద్యునిగా దలంచి రోగినిచూచి యౌషధ మీయ వేడిరి. శాస్త్రిగారు తనకు వైద్యమందు నైపుణ్యము లేదని చెప్పినను వారదినమ్మక బలవంతపెట్ట సాగిరి. అంతట శాస్త్రిగారీశ్వరునిపై భారము వేసి తనయొద్ద నున్న యక్షతలకుప్పెను నీటిలో నరగదీసి ఈతీర్థమే రోగికి సంజీవి యగుగాక యని సంకల్పించి యిచ్చెను. అట్లు రెండు మూడు దినము లాతీర్థమివ్వగా రోగికి రోగము తగ్గినందున రోగికిని యాతని బంధువులకును శాస్త్రిగారియం దత్యంత భక్తిశ్రద్ధలు గలిగెను. అట్లు కొలది రోజులకు వ్యాధి పూర్తిగా నెమ్మదింప నారాయణ సంతసించి, శాస్త్రిగారిని సత్కరింప నెంచి కావలయునదెల్ల నిత్తు, గోరుమని చెల్పగా నిరపేక్షాధనుండగు నప్పరమనాథుశిఖామణి తాను కాశీచేరుటకగు వ్యయమిమ్మని యడిగెను. నారాయణ, కోటయ్యశాస్త్రిగారి యల్పసంతోషమున కబ్బురపడి అట్లే చేయింతునని చెల్పి శాస్త్రిగారిని కాశీకంపి కొంతధనము శాస్త్రిగారి తలిదండ్రులకు గూడ పంపెను.

ఇట్లు మనకోటయ్యశాస్త్రిగారు కొలది రోజులలోనే కాశీపట్టణముచేరి. ఉత్తుంగ తరంగయగు గంగాతరంగిణిం

గాంచి మనం బుప్పొంగ, నుత్తరవాహినియై ప్రవహించు నాత రంగిణీ భంగములుగల మణికర్ణికలో మునింగి, యభంగ భక్తి పారవశ్యముచే నోలలాడి విశ్వనాథుని దర్శించి యన్నపూర్ణా దేవింగాంచి ప్రణమిల్లి, మైమరచి యానందరస కల్లోలినీ భంగ ములలో నీదులాడుచు, చాలసేపచ్చట సంపూర్ణ ధ్యాన నిమగ్నుఁడై విశ్వనాథుని తన మనోవీథిఁ గదునిల్పి పూజిం పుచు సంతసింపుచు, అనిర్వచనీయానుభవావేశ పరవశుఁడై పడియుండి, తుదకు గ్రమ్మఱ ప్రపంచజ్ఞాన స్ఫురణచే నొడలు తెలిసి పలుమారు తనయదృష్టమును బొగడుకొనుచు, తనను ప్రయాణమునకు పురికొల్పిన తండ్రిని, ధనమిచ్చిన వర్తకుని కృతజ్ఞతతో నభినుతించుచు నన్నపూర్ణ సత్రమున కేగెను. ఇట్లు నిత్యము ప్రాతఃకాలమున లేచుచు గంగాస్నాన మొనర్చుచు విశ్వేశ్వరు దర్శించుచు గంగాజలంబుల నభిషేకముఁ జేయుచు, నన్నపూర్ణా విశా లాక్షింగాంచి యాజగజ్జననీ పాదపద్మములకు భక్తిపరవశుఁడై వందనముచేయుచు, ధ్యానముచేయుచు కతిపయమాసంబు లచ్చట గడపుచుండెను. అట్లుండ నాతని సుకృతపరిపాకవశం బున శ్రీ బాలసరస్వతీస్వామి కోటయ్యగారి యోగ్యత తిల కించి, విరాగిత్వ ముపలక్షించి శమాదిసంపద కలరి భక్తికి మెచ్చి తనయనుగ్రహమునకు పాత్రుఁడనియెంచి యొక నాఁడు కోటయ్యగారిం గాంచి, 'నాయనా! నీవు దేవి యను గ్రహమునకు పాత్రుఁడవైతివి రమ్మని' చెప్పి యాతని తనయాశ్రమమునకుఁ దోడ్కొనిపోయి త్రిపురసుందరీ మహా

మంత్రముపదేశించి, దానికవసరమగు నంగన్యాస కరన్యాస పూర్వకవిధానము నభ్యాసము చేయించెను. సద్గురు కటాక్ష మహిమచే కోటయ్యగారు మంత్రసిద్ధియు, యోగసిద్ధియుగడించి పూర్వమునకంటె నధికవిరాగియై, భక్తియుక్తుఁడై యుండి కతి పయవత్సరంబులకు స్వదేశమునకు రా పయనమయ్యెను. ఈ లోగా తమ తనయుని వృత్తాంత మెఱుంగక తలిదండ్రులును, అల్లు డేమయ్యెనో తెలియక అత్తమామలును, భర్త యెచ్చట నున్నాఁడో వినరాక భార్యయును పరితపించుచు, దైవమును నిందించుచుండిరి. ఇట్లుండ కొన్నాళ్ళకు కోటయ్యగారు తండ్రి కోరిపంపినట్లు ధనముతోఁగాక సంపూర్ణ భక్తిజ్ఞానధనములతో వచ్చిన, మృతుఁడైనవాఁడు పునరాగతుఁడైన యట్లెంచి జననీ జనకులు నత్తమామలు భార్యయును సంతసింపుచుండిరి. బంధుజనములును సంతుష్టచిత్తులైరి మిత్రులానందమందిరి. అంతె మామగారు కోటయ్యగారిని తనయింటికి దీసికొనిపోయి యతని వినయ సౌశీల్యాది గుణములకు సంతసించినను ప్రపంచ మునకు మాత్రము పనికివచ్చువాఁడుకాఁడని యెంచి యసం తుష్టుండయ్యెను. భార్య కాపురమునకు వచ్చినను కోటయ్య గారు తామరపాకుమీఁది నీటివలె ప్రకృతి నంటియుండక సంచ రించుచు ఆత్మనిష్ఠా నిమగ్నమానసుండై యుండెనుగాని, తక్కినవారివలె ప్రపంచ సౌఖ్యలోలుఁడు గాకుండెను ధన సంపాదనాశక్తిగాని, సంసారభార సంచలనముగాని పొందక వైరాగ్యముతో సంచరించుచు వచ్చెను. అట్లుండ నతనికి ప్రథమపుత్రోదయముఁ గలిగెను. జన్మనక్షత్రము మంచిది

కానందున గ్రహశాంతిఁ జేయ వలసివచ్చినది. ఈసందర్భమున కోటయ్యగారి యమానుషశక్తి కొంత ప్రకటితమయ్యెను. శాంతిచేయుటకు వలయుధనము లేదని కోటయ్యమామగారు స్పష్టముగాఁ జెప్పిరి. కోటయ్యగారికి సంపాదన లేదయ్యె. ఇఁక ద్రవ్యము సమకూర్చు టెట్లు? కోటయ్యగారుమాత్ర మధైర్యముఁ జెంద లేదు. తనయందు విశ్వాసముగల కాకుమాను వాస్తవ్యుఁడు మాజేటి శేషయ్యయను వర్తకుని కడ కేగి, తన పుత్రుని జన్మనక్షత్ర శాంతికై నలువదిరూప్యము లప్పయిమ్మని కోరెను. గాని శేషయ్య అప్పిచ్చుట కిచ్చగింపడయ్యె. అప్పిచ్చినచో తిరిగి కోటయ్య అప్పుతీర్ప జాలఁడను సందేహముచే నతఁడు ఋణమీయఁదలంపలేదు. కోటయ్యగారు శేషయ్యచే తిరస్కృతుఁడయ్యును సంతోషముతో గొల్లపూడి కేగెను. పిమ్మట శేషయ్య తన మామూలు ప్రకారము సాయంకాలము శివాలయమున కేగి స్వామినిదర్శించి గుడిముందించుక సేపు కూర్చునియుండ, ననన్యసామాన్య సౌందర్యాతిశయములచే నలరారు నొకజవ్వని మవ్వంపు కాంతులతో తనకు ప్రత్యక్షమై, "నాభక్తునకు నలువదిరూప్యము లప్పియక నిరాకరించితివా ?" యని యడిగి యదృశ్యయయ్యెను. అతం డచ్చెరువంది మేను వడవడ వడంక, 'కోటయ్యగారి యుపాస్య దేవతయగు త్రిపురసుందరీదేవి కాబోలు, ననితలంచి మరునాడు కోటయ్యగారున్న చోటికేగి 'అయ్యా ! మీకు శాంతికి కావలసిన దెంత?' యని యడిగెను. కోటయ్యగారు కావలసిన సామగ్రి యెంతయో ? యెఱుంగని వాడగు

టంజేసి స్వల్పముగా, నేబదిమందికి మాత్రము జాలునామగ్రి చెప్పెను. శేషయ్య తానా వస్తుసంభారమును శాంతినాటికి గొల్లపూడికి చేర్చెదనని చెప్పెను. అంతట కోటయ్యగారు తనదారి నేగెను కోటయ్యగారు శేషయ్య వస్తుసామగ్రిఁ దెచ్చునను ధైర్యముతోఁడనో లేక సహజమగు నుదాసీన భావముతోఁడనో శాంతికగు ప్రయత్నముచేయకయే యిన్న కుండెను. శేషయ్య తన వాగ్దానముసంగతి మఱచి తన స్వంతపనులమీద బాపట్లకేగెను. శాంతి సమీపించెను. బాప ట్లలో నతఁడు కోర్టువ్యవహారముమీద నిలువవలసి వచ్చెను. శాంతిమాట మఱచిపోయినందున వస్తుసామగ్రి గొల్లపూడి చేర్చ ప్రయత్నముచేయుట సంభవింపలేదు. శేషయ్య శాంతి మాట మఱచినను, కోటయ్యగారికి కార్యభారమందు శ్రద్ధ లేకున్నను, భక్తపరతంత్ర యగు త్రిపురసుందరీదేవి తనవిధా యక కృత్యమును మాత్రము మఱువలేదు శేషయ్యకు తిరిగి తన దివ్యసుందర శరీరమును చూపెను. 'తత్క్షణమేగి తనభక్తు నకు చేసిన వాగ్దానము తీర్చు' మని యాజ్ఞచేసెను. శేషయ్య భయకంపితగాత్రుఁడై యదరిపడి తనదావా వాయిదా కోరు మని ప్లీడరుగారికిచెప్పి త్వరిత ప్రయాణముతోఁ నింటికేగి యారాత్రివేళనే ధాన్యము దంపించి కావలసిన తక్కిన సామ గ్రితో తాను బండిమీద తెల్లవారువేళకు గొల్లపూడిచేరెను. ఆపూట శాంతికి వస్తుసామగ్రిలేదు, కోటయ్యగారికి ద్రవ్య సంపాద నాశక్తి సున్న. ఇట్లుండియు కోటయ్యగా రంతకు మున్నే లేచి బ్రాహ్మణుల పిలిచివచ్చుటకు చుట్టుపట్ల గ్రామ

ములకేగెను. ఈపరిస్థితులలో భార్యయును బంధువులును తహ
తహలాడుచుండిరి. అంతలో శేషయ్య వస్తుసామగ్రితోం
జేరగానే బంధువులకు ప్రాణములు లేచివచ్చెను. శాంతి
ప్రయత్నములు చేసిరి. కోటయ్యగా రింటికి జాము ప్రొద్దెక్కి
వచ్చిరి. శాంతి జరిగెను. బ్రాహ్మణభోజనములు మాత్రము
కా లేదు. ఇన్నూరుమంది బ్రాహ్మణులు కూడిరి. ఏబదిమందికి
మాత్రము వంటచేయబడెను శేషయ్య నిప్పచ్చరముగ నిల్లు
చూచి, ప్రయత్నము చూచి, వస్తుసామగ్రిచాలమి చూచి, ప్రయ
త్నము చాలదని శంకించి భయపడి కోటయ్యగారినిపిలిచి,
''స్వామీ! వంటకములు చాలనట్లున్నవి యెక్కడికైనా
వెళ్ళి బియ్య మప్పుఅయినా తెమ్మన్నారా?'' అని యడిగెను.
కోటయ్యగారు నవ్వి, భయము లేదు అందఱికిసరిపోవును.
అనిచెప్పి లోనికి వెళ్ళెను. బ్రాహ్మణులు బారులుతీర్చి కూర్చుం
డిరి. ఇంట్లోవారు పదార్థము చాలదని విస్తళ్లువేయుటకు జంకు
చుండిరి. కోటయ్యగారు అన్నపురాసిని చూచి తలయూచిరి.
తనకు అత్తవారు శాంతిపీటలమీద పెట్టిన క్రొత్తవస్త్రములను
గిన్నెలోనున్న నేతిని జేర్చి అగ్నిహోత్రములో వేసిరి.
హవ్యవాహనుడు సంతుష్టుడయ్యెనని కోటయ్యగారు సంత
సించిరి. తక్కినవారతని వెఱ్ఱితనమునకు వగచి పలువురు బలు
మాటలాడిరిగాని కోటయ్యగా రామాటల గమనించిలేదు.
దేవికి అన్నపురాసి నైవేద్యముపెట్టి మంత్రపుష్పమిడిరి. ధైర్య
ముతో కోటయ్యగారు వడ్డనచేయుడని హెచ్చరించి అన్నపు

రాసివద్ద తానునిలవబడి పళ్లెరము లందిచ్చుచుండెను. వడ్డన పూర్తియయ్యెను. యేబదిమందికి మాత్రము చేసిన పదార్థ మిన్నూరుమందికి వినియోగింపగా నింకను మిగిలెను అప్పుడు బంధువులకును నింటిలోనివారికిని కోటయ్యగారిశక్తి తెలియ వచ్చెను ఆనందపరవశులైరి శాంతి నిర్విఘ్నముగా నెరవేరెను. శేషయ్యా సంతసించి తనయూరు చేరెను.

కోట్యయగారిట్లు నిర్లిప్తవృత్తితో సంచరించుచు ద్వాదశీవ్రతమనుష్ఠించువాఁడై ప్రతిద్వాదశినాఁడును బ్రాహ్మణ సమారాధన చేయుచూవచ్చెను. ఆరోజున తనకునచ్చిన గృహస్థుకడకేగి ద్వాదశికి కావలసిన పదార్థములు సమకూ ర్చుచు వచ్చెను వీరిముఖారవింద దర్శనము చేలోభికూడ త్యాగియై కోరినపదార్థముల నొసంగుచుండెడివాడు. అడిగిన వారిచ్చినను యీకున్నను రాగద్వేషములు లేక జయాపజయ ములయందు సమత్వముగల్గి యానందము చెందుచు తనసౌమ్య స్వభావముచే సమస్తజనుల చిత్తాకర్షణముచేయ గలిగినమహా నీయుఁడను ప్రసిద్ధిగాంచెను.

శాస్త్రిగారికి విద్యాపాటవముగాని, సంస్కృతభాషాజ్ఞా నముగాని, శాస్త్రపరిచయముగాని, తాదనాపటిమగాని, వాగ్జా లముగాని, ఆత్మశక్తిచూపు ప్రయత్నముగాని, వేషభాషలుగాని లేకున్ననుజనులుమాత్రమాతనిమహానుభావుఁడనియెంచుచుం డిరి. ఎచ్చటికేగినను తానువచ్చినసంగతియేయెఱుంగనిరీతివర్తిం చుచు వచ్చెను. ఇట్లుండ కొన్నాళ్లకాయన మన్నవగ్రామము

నకు వచ్చెను. మన్నవ పలువురు బ్రాహ్మణ గృహస్థులున్న నొకచిన్నగ్రామము. ఆగ్రామ వాస్తవ్యులు వేదాధ్యయన మందాసక్తులై కర్మిష్ఠులై యతిథిపూజలందాసక్తులై యుండు వారు. అభ్యాగతులెందరువచ్చినను నిరభ్యంతరముగా భోజన సత్కారము చేయుచుందురు. అట్టి మన్నవగ్రామమునకు కోటయ్యశాస్త్రిగారు రాగా! తమ సహజసత్కారకార్యస్వభా వము ననుసరించి, మన్నవవాస్తవ్యులాతని గౌరవించి యాద రించిరి. తక్కినయూళ్లలో నొకదినమునకంటె నిలువని మన శాస్త్రిగారాయూరుచూచి యచ్చటిబ్రాహ్మణుల ధర్మాసక్తి గాంచి, వేదాధ్యయనపాఠకులగు బాలుర తిలకించి, తన యందు వారికిగల యాదరము పలక్షించి స్నాన పాన యోగ్యమగు నీటివసతిఁ బరికించి వరిధాన్యముపండు ఫల వంతములగు కేదారములంగని యానందించి తనకు నిలువనీడ యగు స్థలముగావిశ్వసించియచ్చటనిలువనిచ్చగించియుండెను భోజనవేళ కే గృహస్థుడాతనిఁగాంచుట తటస్థపడిన నతఁడా యోగిగారిని పిలిచి భోజనమిడుచు వచ్చెను. ఇట్లు కొన్నిదిన ములు, మాసములు గడచెను. అచ్చట సప్తాహ మొనర్చు సంకల్పమాతని కంకురించెను. ఆయూరువారామాటవిని సంతో సించిరి. ధాన్యరూపమగు చందా వేసిరి కొంతధాన్యము పోగు చేసిరి. కాని ధాన్యమంతయు సమకూడి ధనముచేరి సప్తాహ ప్రయత్నము నిర్విఘ్నముగా జరిగి దైవపూజాదులు పూర్తి యగువఱకు శాస్త్రిగారు వేచియుండగలరా! అతనికి దైవపూజ కంటె భూతతృప్తిచేయుటయే ముఖ్యము. సప్తాహ సంకల్పము

మొదలుకొనియే యన్నప్రదానముచేయ నారంభించెను. ఏ దినముచేరిన ధాన్యమాదినముననే బ్రాహ్మణసమారాధనకు వ్యయమగుచువచ్చెను. అందువలన సప్తాహనామక యజ్ఞము జరుగ కాతని సమారాధనము దీర్ఘసత్రముగాపరిణమించెను. అట్లుండ శాస్త్రిగారి నాయూరస్థిరముగా నిలుపుసంకల్పము మన్నవగ్రామవాసులకుగలిగి శాస్త్రిగారిభార్యబిడ్డలనుగూడ నచటికిరప్పించి యొకయిల్లుగూపి వారికికావలసిన జీవనముగూడ కల్పించిరి. భార్యాపుత్రు లింటయున్నను శాస్త్రిగారొకచోట నిలుచువారుకారు వారూరూరు తిరుగుచు ద్వాదశీవ్రత మనుష్ఠించుచు వచ్చిరి. శాస్త్రిగారు నల్లగాను, యెత్తుగాను, స్థూలముగనుండి యత్యంత మందగమనముగలవారై యుండిరి. వీరు దయాత్పూర్వమే తటాకమున స్నానముచేసియొడ్డునగూర్చుండి నిమీలితనేత్రులై జపమొనర్చుచుండువారు శాస్త్రిగారు వేసంగివేళల నెండవేడిమికిగాని, గ్రీష్మవాయువునకుగాని, వర్షాకాలమున జోరునకురియు వర్షధారకుగాని లెక్కసేయక తనశరీరము మరచి ధ్యానసమాధి నిష్ఠలో నిమగ్నుడై సమస్త ప్రపంచమును ప్రపంచవాసనలనువిడచి యుండువాడు. లేకున్న శీతాతపవర్ష బాధలాతనికి లేకుండుటెట్లు? ఒక్కొక్కవేళ దిగంబరుడై యుండువాడు. వస్త్రధారియైయుండు వేళలగూడ మూరెడు వెడల్పుగల యొకచుట్టుతిరగని చిన్న యంగవస్త్రము మాత్రమే మొలధరించి మఱియొక కొల్లాయిగుడ్డ భుజముపై వేసికొనుచుండువాడు. బీదవారెవ్వరైన కనుపడి వేడినచో తనకొల్లాయిలనుగూడా వారికిచ్చి తానుదిగంబరియై యింటికి

నచ్చుచుండును. శాస్త్రిగారు యోగ్యుఁడని యెంచిమంచివస్త్ర ములను యితర గృహస్థులిచ్చిన నవిగూడ బీదసాదల కిచ్చివే యుచు తనకొల్లాయిలో తాను సంచరించుచుండును. ఈమహా నీయుఁను దూషణ భూషణ తిరస్కార గౌరవములు సమాన ములుగా దలంచుచు సంతతానంద పరవశుఁడై యచ్ఛైరవృగల్పిం చుచుండును సమస్తభూతప్రియుండై నిరంతర మన్నదానము జేయుచు మానవులయందేగాక శ్వానమార్జాలాది సకలజంతు జాలములయందత్యంత ప్రేమజూపుచు నూకలను బియ్యమును చీమల పుట్టలయొద్ద చల్లుచుండును కోపమనునది శాస్త్రిగారి కడ నెన్నడును జూచియుండ లేదు. పరదూషణమెన్నడును లేదు బిగ్గరగా మాట్లాడుటయన నతండెఱుంగడు. ఇతరులు బొగడి నచో తన యల్పజ్ఞతనుగూర్చి ముచ్చటించునుగాని స్తోత్రప్రి యత్వ మేకోశమునను లేదు. శాస్త్రిగారి స్వభావమును దెల్పు నొకటి రెండంశముల నుదహరించవలసియున్నది. చిన్నతనమున పదునారువత్సరముల యీడుగలిగినప్పుడొక గృహస్థు తనబం ధువు యింటికొక యరిసెలకావడియును రవికెలను చీరెలనిచ్చి తమపురోహితుని కుమారుఁడగు మనశాస్త్రిగారిని బంపగా దీసికొని వెళ్లుచు మార్గమధ్యమమున నొకచెట్టునీడ నించుక విశ్రమించెను. అచటికి సమీపమున చేలలోనున్న పలువురు బాలురచ్చటికి వచ్చిరి. గర్భవతియగు నొక యానాదిస్త్రీ చిని గిన గుడ్డలతో నచటపడియుండెను వారినిచూచికొన్న రవికెలను చీరెయు నాయానాది వనితకిచ్చెను. చేలలోని పిల్లవాండ్రకు అరిసెలు చాలభాగము పంచిపెట్టెను. మిగిలియున్నకొలదియరి

సెలను, రవికెలను మాత్రము తీసికొని గమ్యస్థానము చేరెను. అచ్చటివా "రిదియేమయ్యా" ఇంతహైన్యముగా పంపినారని యడిగిరి. అంతశాస్త్రిగారు యజమానుల లోపము లేదని యును తానుమార్గమధ్యమున నవి, దీనదశలోనున్న వారికిచ్చి తిననియును చెప్పిరి వారు చేయునది లేక యూరకుండిరి. పూవు పుట్టగనే పరిమళించు నన్నట్లు చిన్నతనమునుండియు మానవుని స్వభావము వెల్లడియగుచుండును. మన్నవగ్రామములో నతఁ డున్న దినములలో తరుచుగా! నభ్యాగతులను తనయింటికి భోజనమున కాహ్వానము చేయుట చూచితిమి. ఒకనాడు ఇంట తండులములు లేవు, వ్యంజనములు లేవు, ఆపూట యెట్లు గడచునాయను తహతహతో భార్యయుండెను. అట్టిస్థితిలో వీధిని నలుగురు బ్రాహ్మణులు పోవుచుండగా శాస్త్రిగారు చూచి వారిని భోజనమునకు తనయింటికిఁతీసికొనివచ్చి భార్యను వంటయైనదా! యని ప్రశ్నించెను. ఆమె భర్తను ఆయన వెంట నున్న బ్రాహ్మణులను చూచి తన భర్త వారిని భోజనమునకే గొనివచ్చెనని తలంచి యింట నేమియు లేకుండుటచే భయపడి, వంటయగుట కింటనేమున్నదని బదులు చెప్పెను. అంతట శాస్త్రిగారా వచ్చినబ్రాహ్మణులను చెరువున కేగిస్నానములు చేసెరమ్మని చెప్పి తాను తనకు పరిచయముఁగల మన్నవ బాప య్యగారి యింటికేగెను అప్పటికి రెండుజాముల ప్రొద్దెక్కెను. శాస్త్రిగారు భోజనముచేసినట్లు లేదు. ఆసమయమున శాస్త్రి గారువచ్చుట కర్థమున్నదని గ్రహించి ఏమయ్యా! అన్నము తినకుండా వచ్చినావని యడిగెను. నలుగురు బ్రాహ్మణులు

వచ్చినారు వారన్నముతిన లేదు. నాయింట యేమియు లే ఉ అందుచేత వచ్చినానని శాస్త్రిగారు చెప్పిరి. శాస్త్రిగారిస్వభావమెఱింగినవాఁడగుటచే బాపయ్యగారు మూఁడుతవ్వల బియ్యమిచ్చి పంపిరి. శాస్త్రిగారా తండులములు దెచ్చి భార్యకిచ్చెను, ఆమె స్నానముచేసి యన్నము వండెనుగాని వ్యంజనములు లేని యన్నమామె పెట్టుటెట్లు? అంతట శాస్త్రిగారు చుట్టుపట్లనున్న గృహస్థులయిద్దకేగ నచ్చటివారు కావలసిన పచ్చళ్లనిచ్చిరి. అవి తెచ్చి బ్రాహ్మణులకన్నమిడి పంపెను. ఇది శాస్త్రిగారి జీవితములోని యొకనాటియుందతము. ఇట్లే తఱుచుగ శాస్త్రిగారు తనయింటవంటకు పదార్థములేమియు లేకున్నను దారినబోవువారిని భోజనమునకు పిలుచుచుండువారు. ఎట్లో దైవకటాక్షముచే నాహారపదార్థములు సమకూరుచు వచ్చెను

ఈ మహామహుని జీవితకాలమునందొకప్పుడు భార్య సమేతుఁడై భద్రాచలయాత్రకేగి శ్రీరామమూర్తిని సేవించి బ్రహ్మనందవార్ధి నోలలాడుచు శ్రీరామసేవా తత్పరుఁడై యుండి యొక్కనాడు గౌతమిస్నానమునకేగిన సింకిదాబాద్ నగరవాస్తవ్యుఁడగు వర్తకుడొక్కఁడుసువర్ణసురభిని సవత్సకముగా గౌతమీతీరమున బ్రాహ్మణునకు దానమీదలంచివచ్చి సత్పాత్రనన్వేషింపుచు పూర్వార్జిత పుణ్యావిశేషముపేర్మితనకు పూర్వపరిచితడగు మనశాస్త్రిగారింగాంచి సంతోషాతిశయం బతిశయింప సమీపించి నిజాభిప్రాయం బెఱింగించి గోదానము స్వీకరింపఁబార్థించిన శాస్త్రిగారు చిరునగవుతో సమ్మతించె.

అంత నావర్తకుడు తనకు సత్పాత్రి లభించినందున కానందించుచు యథావిధిగా శాస్త్రిగారి కుచితదక్షిణలతోఁ స్వర్ణగోదానము గావించి కృతార్థుడయ్యె.

ఇటుల గోదానమునంది కోటయ్యగారు తనసమీపము నందు. కూర్చుని జపముఁజేసికొనుచుండు బీదబాపనొకనిసమీపించి వినయాతిశయఁబుట్టిపడ సేతులుజోడించి తనయొద్దనున్న సువర్ణసురభినిజూపి, అయ్యా! నేనెప్పుడేనియు నింటనుండక నేం దేనియుం దిరుగుచుండువాఁడనగుటచే నీసురభినిపూరిసీరము లిడి పోషించుజాల నందుకు సమర్థుడగువాడుగాని గోదానము నందరాదని పెద్దలనెదరుగాన దయయుంచి దీని తాముభరింప వలయునని ప్రార్థించుచు వర్తకునివలన తానుపొందిన దక్షిణలతోఁ నాస్వర్ణసురభిని యాబ్రాహ్మణున కర్పించిన, భార్య మహాలక్ష్మమ్మగారు చేతులుజోడించి దేవా! మనముకుటుం బీకులము బీదవారము. ఇట్టి స్థితిలో నయాచితముగా లభించిన సువర్ణసురభిని యన్యులకర్పింప మీకు మనం బెట్లొప్పినది మీనిర్లిప్తత్వము మనకుటుంబమున కంతకును ముప్పుఁదెచ్చుచున్నది. గాన నేటినుండియైనను ద్రవ్యార్జనాపరులై మెలంగకుంటిరేని మవ పసిపాపల పోషించుట దుస్తరంబగునని మనవి జేయుచున్నదానననిన, శాస్త్రిగారు చిరునవ్వు మోమున తాండవమాడ ఇంతీ!

కం. హరియందు జగములుండును
హరిరూపము సాధుగాత్రమందుండు శివం

కరమగుపాత్రము గలిగిన
నరయఁగ నదిపుణ్యదేశ మనఘచరిత్రా ॥

(భాగవతము)

అనునట్లు సత్పాత్రిలభించిన ద్రోసిపుచ్చు టెట్లు? ఇంకొకసమయమున చాలినంత ధనములభింపవచ్చునుగాని ఇట్టి సత్పాత్రము మనజీవితకాలమునందు లభింపఁగలదా? పసిపాపల పోషించుటకు నీవుగాని, నేనుగాని కర్తలమగుదుమా?

కం. రక్షకులులేనివారల
రక్షించెదననుచుఁ జక్రి రాజై యుండన్
రక్షింపమనుచు నొకనరు
వక్షముఁ బ్రార్థింపనేల యాత్మజ్ఞులకున్ ॥

(భాగవతము)

అనుటచే ప్రాణుల జీవితభారమంతయు భగవానుఁడే భరింపగలఁడనుట. ఇదియుగాక,

మ॥ జనకుం డెవ్వఁడు జాతుఁ డెవ్వఁడు జని ♦ స్థానంబు లెచ్చోట సం
జననం బెయ్యది మేనులే కాలది సం ♦ సారంబు లే రూపముల్
వినుమా, యింతయు విష్ణుమాయ దలఁపన్ ♦ వేఱేమియు లేదు మో
హనిబంధంబు నిదానమింతటికి జా ♦ యా విన్నబో నేటికిన్ ॥

మ॥ చెలియే మృత్యువు చుట్టమే యముఁడు సం ♦ సేవార్థులే కింకరుల్
శిలలం జేసెనె బ్రహ్మదన్ను దృఢమే ♦ జీవంబు నో చెల్లరే
చలితంబౌట యెఱుంగకీ కపట సం ♦ సారంబు నిక్కంబుగా
దలచున్ మూఢుఁడు సత్యదాన కరుణా ♦ ధర్మాది నిర్ముక్తుఁడై ॥

(భాగవతము)

అనునట్లు కపటసంసారంబును నమ్మి సత్యదాన కరుణా ధర్మాదుల వీడనాడుట శ్రేయోదాయకముఁ గానేరదని సమాధానముఁజెప్పి యొప్పించి తన నిర్లిప్తత్వమునకు వన్నె పెట్టినారు. పునరావృత్తిరహిత శాశ్వతబ్రహ్మలోకము గడింపఁ దలంచిన వారలకిదియే మార్గము గనుకనే,

సీ॥ ఎవ్వనిగరుణింప ♦ నిచ్చగించితివాని-యఖిలవిత్తంబు నే ♦ నపహరింతు
సంసారగురుమదః ♦ స్తబ్ధుఁడై యెవ్వఁడు-దెగడి లోకము ♦ నన్ను ధిక్కరించు
నతఁడెల్లకాలంబు ♦ నఖిలయోనులఁ బొందుచుఁ-బుట్టును దుర్గతిఁ ♦ బొందుచుఁ బేద
విత్తవయోరూప ♦ విద్యాబలైశ్వర్య-కర్మజన్మంబుల ♦ గర్వముడిగి॥

తే॥ ఏకవిధమున విగతుఁడై ♦ యెవ్వఁడుండు
వాఁడు నాకూర్చి రక్షింప ♦ నలయువాఁడు
స్తంభలోభాభిమాన సం ♦ సార విభవ
మత్తుఁడై చెడనొల్లఁడు ♦ మత్పరుండు॥

అని భగవానుఁడు వచించియున్నాఁడు, గాన సందేహముడుగుమని భార్యకుఁ జెప్పెనట.

ఇట్టి మహాపురుషులు లోకము నుద్ధరించుట కప్పుడప్పుడవతరించు చుందురను యార్యోక్తి యథార్థమయ్యెగదా.

ఇట్లు శాస్త్రిగారు కొన్నిరోజులు భద్రాద్రియందు నివసించి భగవదాజ్ఞఁ గైకొని మన్నవగ్రామమునకు విచ్చేసిరి.

శాస్త్రిగారు మహిమగలవానివలె గనుపడువారు కారు. కాని యొకటి రెండు పర్యాయములు సిద్ధులాయన కప్పటి శక్తిఁ గలిగినట్లు తెలిసికొనిరి. వల్లూరు జగన్నాథరావుగారింట

నవరాత్రములలో కలశముపెట్టి పూజసలుపుచుండిరి. ఆరోజులలో శాస్త్రిగా రాయూరునకరుగుట సంభవించినది. శాస్త్రిగారు జగన్నాథరావు గారింటికేగగనే భోజనమునకాహ్వానము చేసిరి వచ్చెదనని చెప్పి వెళ్ళిరి. గాని యేవేళకును రాకైరి అందఱును వేచియుండిరి. వేచివేచి విసిగి చెఱువునకు స్నానమునకు వెళ్ళియుండవచ్చునని తలంచి అచ్చట నేమైన యపాయముఁ గలిగినదేమో? యని శంకించి శాస్త్రిగారిని వెదకుటకై నాగేశ్వరరావుగారిని పంపగా నాచెఱువు మరగొమ్మ సమీపమున విజనమైన ప్రత్యేకముపోయి చూచినగాని కనుపడని యొక మఱుగుప్రదేశమున శాస్త్రిగారిని చూచిరి. శాస్త్రిగారు పలుకునట్లులేదు. అచ్చట నిమీలితనేత్రుఁడై ధ్యాన నిమగ్నుఁడై యుండెను. శరీరమందంతయును గండు చీమలు ప్రాకుచుండెను. బెల్లపుగడ్డపై మూగినట్లు చీమలాతని యాపాదమస్తకము నావరించియుండెను. చూడవచ్చిన నాగేశ్వరరావుగారు నివ్వెరపోయిరి. భయపడిరి. తహతహ చెందిరి. శరీరమున కంపము జనించె. అట్టిస్థితిలో శాస్త్రిగారిని పిలుచుటకు సాహసింపలేకపోయెను. ఇంటికేగి యీసమాచారముఁ దెలుప పలువురచ్చటికేగి చూచిరి. కొంతసేపటికి బహిర్ముఖుఁడై శాస్త్రిగారు కనులువిచ్చి తన తనువుపై నావరించియున్న చీమల దులుపుకొని గ్రామము చేరిరి. శాస్త్రిగారు తఱచుగా తనువుమఱచి యంతర్ముఖులై యుండువారు.

(ఈ నాగేశ్వరరావుగారు పాండ్రిపాటి గ్రామాధికారియని పాఠకులెఱింగెదరు గాత.)

పైన దెల్పినట్లు శాస్త్రిగారికిగల సుగుణములలో నిరపేక్ష సమత్వము, అన్నదానము, ధ్యానము ప్రధానములై యున్నయవి. సకల ప్రాణులకు నన్నదానము చేయుచుండుటచే శాస్త్రిగా రెచ్చటికేగినను నచ్చటికి కుక్కలు వెంటఁబడుచూ వచ్చెను. తనకు లేకున్నను వస్త్రవిహీనులకు తాను కట్టిన పుట్టములనెల్ల నిచ్చుచు కొన్నివేళల దిగంబరులై యింటికి వచ్చుచుండువారు. డంబముగాని, యహంభావముగాని, లేక సాధుజీవనుఁడై యుండెను. నిత్యసంతుష్టి నిత్యసంతోషము శాస్త్రిగారి స్వభావమున ప్రధానాంగము. ఇట్లు శరీరయాత్రగడపి శరీరము చాలించు సమయమాసన్నమైన తఱి నెఱింగి "కాశ్యాంతు మరణాన్ముక్తిః" యను విశ్వాసమున కాశీయాత్రకేగ నిశ్చయించెను. తాను గర్భవతియగు భార్యతో గూడ వారణాసికి పయనమై వెళ్ళెను. అచ్చట సకుటుంబముగా విశ్వేశ్వరు దర్శించి, గంగానదీ స్నానమాచరించి ప్రయాగకేగి యచట కొన్నిదినములుండి త్రివేణీ సంగమమందు ప్రతిదినము స్నానమాచరించుచుండిరి. ఈ త్రివేణీ సంగమ స్నానసమయమున శాస్త్రిగారి యద్భుతశక్తి గానుపించెనని వెంట నేగిన పాండ్రపాటి నాగేశ్వరరావుగారు చెప్పుచు వచ్చిరి. వెంటనున్న వారిని విడిచి తానొంటిగా త్రివేణిసంగమ

ప్రదేశమున అతి గంభీరమగుచోటికేగి యచ్చట స్నానము చేసి మనుష్యులకందని నీటిపై తేలి ధ్యాననిమగ్నుఁడై యుండె ననియు, శాస్త్రిగారే వేళకును రాకుండుటచే తాను త్రివేణీ తీరమునకేగి చూడ నట్టేట జపముసేయుచు నతడుండెననియును పిమ్మట కొంతసేపటికి బహిర్ముఖుఁడై తీరమునకు రాగా నట్టేటి లోని కేటికేగితిరని ప్రశ్నింపగా అచ్చట లోతులేదని శాస్త్రి ప్రత్యుత్తరము చెప్పెననియును. ఆ వి ష య ము నమ్మక విచారించిన మీదట త్రివేణీసంగమ మచ్చట అగాధ జల పూర్ణమని నిశ్చయముగా తెలిసెననియును మున్నగు సంగతులు నాగేశ్వరరావుగారు చెప్పుచున్నారు. అటనుండి గయా క్షేత్రమునకేగి యాత్ర సేవించుచుండ జ్వరమువచ్చెను. 4వ దినము భార్యతో నేనిక నీశరీరము చాలించెదను నాకై నీవు విచారింపకుము. "జాతస్య మరణమ్ ధృవం" అను వాక్యము సత్యముగదా నాపని దీరినది గర్భవతివగు నీకు పుత్రికగలుగు నని చెప్పుచుండ బ్రహ్మరంధ్రము భేదించుకొని ఆ యన 1896 గంగాపుష్కరిణీకాలమున తన నలుబది రెండవయేట పరంధామము జేరిరి. అంతట భార్యాపుత్రులు మన్నవగ్రామమునకు వచ్చి యచ్చట నివసింపుచూ వచ్చిరి. ఇట్టి పరమ యోగి నిటీవల గనివినియెఱుంగము శాస్త్రిగారి కిరువురు పుత్రులు నొకపుత్రికయును గలదు. వారు సుఖముగానున్నారు.

తూమాటి రామభొట్లు

అజ్ఞాన పిశాచి అనుచరులలో కీర్తికాంక్ష యొకటి. ఇదియు కామాది రాక్షసులవలె సాధకుని పతనానికి కారణ మగుచున్నది. దారి దప్పించి ఆదర్శనమునకు దూరము చేయును. భక్తుని మోసపరుచుటలో నతిసమర్థతగలది దీనికిలోబడినవారు చాలాతక్కువ. విషవృక్షమునకువలె చేదుకాయలనే కురియు చుండును. ఈవృక్షమునకు స్వార్థముబీజము పైకిమంచిదేగాని విచారించిన బరమాపకారి. ఇదిచేయించుపనులలో కొన్ని మంచివే గాని లోలోన జెడ్డభావించుచునేయుండును. ఇంతియే కాదు! ఈర్ష్యాసూయాదుల వృద్ధిజేసి భగవంతునినుండి వేరు చేయుటలో దీనికి సాటి మఱియొకటి లేదు.

స్వాహంకార ప్రతిష్ఠాపనయే "దీనిలక్ష్యం" సత్క్రియలసాధనములుగాగొని తనపని నెరవేర్చుకొనును ఇదిపరాభిప్రాయదాసి. అదేగాని ఆదర్శంగూడ ధర్మాధర్మము లందు బాటులో నున్నదానినే గ్రహించును. ఏదియైనను సరియే! కీర్తిగలిగినజాలు పలుకుబడిలో నేదియుండిన నదియే దీని లక్ష్యము దినికిసత్యావివేచన లేదు, సాధకుని నపకీర్తిపాలుజేయుటలో సందెవేసినచెయ్యి దీనిసహచరి "కపటము" పేరుప్రతిష్టల నెంట బరువులెత్తు స్వభావము గలది అయినను సత్క్రియాపరాయణుండగు రామభొట్లుగారికి కీర్తికాంక్ష బానిస.

తండ్రి నరసింహచౌదరి తల్లి చిలకమాంబ. 19వశతాబ్ది మందు పుటుక. వీరి జననగ్రామము మద్దిరాలపాడు. ఒంగవోలు

తాలూకా. భార్య పేరమాంబ గురువు అద్దంకి తాతా
చార్యులుగారు ఒకప్పుడు గురువునకు సాష్టాంగపడి దేవా!
మానసలక్ష్యమగు జపముచే, నేమహోమహాని ధ్యానింపక
నవిద్యోద్భూతములగు జన్మాదులనందునట్టి మానవులు
బంధవిముక్తులై స్వర్గాపవర్గాది నానాఫలములను బొంద
గలరో యాజపవిధుల విశేషాంశములు వివరింప వేడు
చున్నాఁడ -నన నాచార్యుఁడిట్లానందమునందుచు పుత్రా!
స్థావరజంగమాత్మకమగు సర్వప్రపంచమునకుఁ బ్రభుండును
దేవాది దేవుండును త్రివిధపరిచ్ఛేదరహితుండును క్షరాక్షర
విలక్షణుండును, పూర్ణుండును సర్వాంతర్యామియును
షడ్భావవికారశూన్యుండును సర్వజ్ఞత్వ సర్వశక్తిత్వ సర్వ
వ్యాపకత్వాది గుణపూర్ణుండును అగు పరబ్రహ్మమును
గుణకీర్తనముల నెడు స్తోత్రములచేత సర్వకాలములయందును
సత్కారపూర్వకమగు పూజను మానవుఁడు సేయుటయే సకల
వేదములలక్ష్యమగు ధర్మములలో నుత్తమము. అట్టి సద్బ్రహ్మ
మును మతసాంకేతికముల ననుసరించి, విష్ణువనియును, శంకరు
డనియునుఁ జెప్పనొప్పు మానవులు కొంత తద్రహస్యము
నెఱుంగక మతవైషమ్యములకు బద్ధులై యన్యోన్యదూషణ
తిరస్కారాదులఁ గావించుకొనుచుందురు. ఇట్లుండుటచే నర
కానుభవంబు తప్పజాలదు. సర్వభూతాంతరస్థితుండగు పర
మాత్మను సర్వసమత్వావేశపరుండై భజించినగాని మాన
వుడు కృతార్థుఁడు గాఁజాలఁడని పెద్దలు వచింతురు.
ఇదియునుంగాక —

శ్లో॥ మద్భక్తా శంకరద్వేషీ ।
మద్వేషీ శంకరప్రియః ।
తావుభౌ నరకం యాంతి ।
యావచ్చంద్ర దివాకరమ్ ॥

నాకు భక్తుఁడుగానుండి శంకరుని ద్వేషించినవాఁడును శంకర భక్తుఁడుగానుండి నన్ను ద్వేషించినవాఁడును వీరలిద్దరు సూర్యచంద్రులున్నంతకాలము రౌరవాది మహానరకయాతనల నొందగలరని పురాణముఖతా శ్రీకృష్ణభగవానులు వచియించి యున్నారు. గాన నీవు శివకేశవభేదమును విడనాడి చరించునది యనివక్కాణించి చౌదరిగారికి తారకమంత్రము నుపదేశించిన నాతండెంతయు సంతోషపారావారంబునఁ దేలియాడుచు గురువర్యునకు పునః పునః ప్రణామంబులాచరించి వినయ వినమితవదనుండై నిలచిన, తాతాచార్యులు మందహాసపూరిత వదనారవిందులై శిష్యునిఁదిలకించి పుత్రా! నేను మీావంశపరంపరా గురుపీఠాధికారినై యుండుటయఁగాక నీకిపుడు కారణగురువునుగూఁడ నైతిగదా! నాకు గురుదక్షిణ నేమీాయజాలెదోయనిన చౌదరి దేవా! నాసర్వస్వము మీాయది యు భవదుచ్ఛిష్టము మాత్రము నేనును నాపరివారంబును భుజించి జీవితముల సార్థకపరచుకొనెదమనిబలికి నిలచిన, వాని యౌదార్యమున కాశ్చర్యాయత్తచిత్తులై యాచార్యులు పుత్రా! నాకీ బాహ్యసంపలతోఁ బనిలేదు నేను కోరునది నీవీగలిగినచో వెల్లడించెద ననవుడు వల్లెయన నీవు నిరంతర భూతసేవా తత్పరతమై మెలంగుటయ నాకు గురుదక్షిణయగు

ననుడు చౌదరిగారందునకుఁ దన యామోదమును దెల్పి బ్రిమాణం బాచరించె. ఇట్లు కొన్ని దినంబులు తాతాచార్యులుగారాయూరనివసించి సచ్ఛిష్యలాభమును గడించి నిజపురవరంబగు తక్కెళ్ళపాడున కేగె.

అంత మరునాఁడరుణోదయంబున నరసింహచౌదరి తన యగ్రతనయుండగు రామభొట్లుగారింజీరి తండ్రీ! నేను వృద్ధుడ నగుటచే కుటుంబపోషణ వ్యాపారంబును చదలవాడ గ్రామాధికారత్వ పదవియు భరింప నసమర్థుండనగుట నీవెఱింగిన విషయంబేగదా నాపూర్వపుణ్య విశేషంబుచే సుగుణాఖనివగు నిన్ను జ్యేష్ఠపుత్రునిగాఁ బడయగలిగితి, గాన తదీయభారవాహివై నాకు విరామంబిడిన (కలౌస్మరణాన్ముక్తిః,) అను న్యాయము ననువర్తించి భగవద్దయా పాత్రుండనయ్యెదనని జెప్పి యొప్పించి తనయందుగల యధికారద్వయంబును బుత్రున కొప్పగించె.

ఇట్లు తండ్రిచే ననుజ్ఞవడసి శుచియై పూజాద్రవ్యంబులం గైకొని యుచితపరివారంబు వెంటనంటిరా భక్తిప్రపత్తులుల్లసిల్ల చదలవాడయందు వేంచేసియున్న శ్రీసీతారాము సన్నిధికేగి యర్చకులచే షోడశోపచారవిధులం బూజలు గావింపించి మంత్రపుష్పంబిడి తదీయమూర్తిని హృత్కర్ణికామధ్యంబున నిల్పి నిమీలిత నేత్రుండై,

కం. నీపాద కమలసేవయు
నీపాదార్చకులతోడి • నెయ్యము నితాం

తాపార భూతదయయును
తాపసమందార నాకు ♦ దయ సేయఁగదే ॥
(భాగవతము)

అని వరంబర్థించి శ్రీపాదతీర్థ ప్రసాదంబుల గ్రహించి యందుండి తన్నగరంబునంగల శివాలయంబున కేగి పార్వతీ సహితుండగు శంకరు నారాధించి, తీర్థప్రసాదముల గ్రహించి నిజనగరంబున కేగి విజనస్థలంబున పటంబొండుఁ బరపించి యందు నానావిధ శకుంతంబులు మెసవుట కనుకూలంబగు వరిగెబియ్య మొకకుంచెడు పోయించి తత్పటంబునకు నలుప్రక్కల నుచితపాత్రంబులతో నీరంబులిడిఁ దానికి దూరంబుగా నొకసేవకుని కాపుంచి వానికి నిరంతర మటుల గావించుచుండునటుల కట్టడిగావించి నిజగృహ ప్రవేశంబయి భోజనంబు లభింపక యూరియందెందేని తిరుగులాడు బీదజనం బులఁ బిల్వఁబంచి వారి కుచితరీతుల నన్న సత్కారంబులఁగా వింపించి తదుపరి తానునుభుజించి సుఖోపవిష్టుండై భగవత్కథా కాలక్షేపంబులఁ బ్రొద్దుఁలుబుచ్చుచుండె. నాఁడు మొదలిటులఁ బ్రతి దివసంబు నేతత్కృత్యంబులఁజరుపుచు జగద్విఖ్యాతకీర్తినార్జించి కృషిక్రియాసముపార్జిత విత్తంబుల వెచ్చఁబెట్టి చదలవాడ యందు వేంచేసియున్న శ్రీశితికంఠునకు ధ్వజ ప్రహరీ ప్రతిష్ట లును చదలవాడనుండి పోతవరమునకుఁబోవు మార్గమధ్య మునను, మద్దిరాలపాటియందును తటాకద్వయ నిర్మాణమును "స్వదత్తాదధికం పుణ్యాం పరదత్తానుపాలన" మను సూరి జన వాక్యమందు విశ్వాసపూరితుండై పానకాలచెర్వు, చంద్రాయ

చెర్వు, రావలగుంట, చిత్రిచిత్రగుంట, రామనచెర్వు, లింగాయచెర్వు, అర్వగుంట లను బాగుచేయించి మార్గాయాస సమన్వితులగు శకటారోహకులకు భోజన సత్కారంబును తద్వాహనంబులకు పూరినీరంబులిడుటయు మతవర్ణ విచక్షణ సేయక భోజనమజ్జనాది సత్కారంబుల గావించి భూతలోకమును బరితృప్తింబరచుటయు నిత్య కృత్యంబులుగా జరుపుచు సర్వ జనాహ్లాదకరముగా నిచాకారంబును నిర్వహించుకొనుచు నిహపరములయందు సమభావముంచి తనజీవితమును సార్థక పరచుకొనుచుండె.

ఇట్లుండ కొంతకాలంబునకు చీర్వానుప్పలపాటి నివాసియగు కుమ్మర వెంకటాద్రియు, మద్దిరాలపాటి గ్రామ నివాసియగు గుడ్డివీరడును చౌదరిగారి గృహంబునంగల ద్రవ్యమును తస్కరకృత్యంబుచే నపహరింపదలచి బంధుమిత్రి పుత్రిపౌత్ర సమన్వితమై శతాధికమగు నాలమందలచే పరివేష్టితమై యొప్పారు నేతద్గృహప్రవేశము గావింపవలనుపడక సమయాన్వేషణము గావింపుచుండ నొకనాడు చౌదరిగారి భృత్యుండొకండు గ్రామంబునంగల కూలిపనులు చేయువారల కొందఱినిజీరి చౌదరిగారి గృహంబుపైన పెంకు గప్పించుచుండ నాకూలివారలలో వెంకటాద్రియు వీరడునుజేరిరి. పగలంతయుం పెంకునందించుచుం బనిముగించి సాయంతనమున కందఱికూలీలతో తమతమగృహంబులకేగక యింటి మండువాయందు దాగియుండి రాత్రి యామద్వయం బతిక్రిమింప

గృహంబునం దందఱు నిద్రాపరవశులగుట నెఱింగి యెటులో నింటఁ బ్రవేశించి, ధనాగారంబునంగల యమూల్యాభరణంబులఁ దస్కరించుకొని తిరిగి మందువాకులంఘించి మనోరథసిద్ధియగుటకు సంతసింపుచు తమతస్కరక్రియాకౌశల్యమున కుబ్బుచు బారిపోనెంచి మార్గాన్వేషణము గావింప గృహోపరినుండు వెన్నుగాడిపై,

సీ॥ గజసింహగమనుల ♦ ఖడ్గతూణీధను ర్ధరుల శార్దూలవి ♦ క్రములరాజ
సింహులగుణరూప ♦ చేష్టితంబులఁ బరస్పరసమానులఁ జారు♦చంద్రముఖుల
రమణీయమూర్తుల ♦ కమలపత్రవిశాల నయనులసురభవ ♦ నంబువిడచి
ధరణికిచ్చిన ♦ సురలక్కైవడిఁ గ్రాలు వారివీరులభంగి ♦ వరలువారి

గీ॥ రాజభానులక్రియదివ్య ♦ తేజమునహ
రిన్నికాయము వెలిగించు ♦ చున్నవారి
గరిమతర కాకపక్షముల్ ♦ గలుగువారి
మహితకీర్తుల రామల ♦ క్ష్మణులఁ జూచి ॥

తమచైదము లెఱింగి పట్టిబంధింప నేతెంచిన చౌదరిగారి సేవకులుగా దలంచి నలుదిక్కులందును నీదివ్యరూపులే ప్రకాశింపుచుండుట చేయునది లేక మూలలయందుగల జలదారులలో తమమేనులు జొప్పించి పదేపదే తలలెత్తి నలుదిక్కులం బరికింపుచు నిష్పురుషపుంగవు లప్రమత్తులై యుండి రిక నెట్లో దేహంబులు బ్రతికి బయటఁబడగలవని పరితపించుచు మనవంశబులం దెవ్వరుచేయని నీ చౌర్యవృత్తి నవలంభించుటచేఁ దగిన ప్రాయశ్చిత్తమైనది. ఇకముందిట్టి కార్యములయందుఁ బ్రవేశింప రాదని మనంబులకు బుద్ధిఁజెప్పుకొనుచు దురాశయెట్టి

ముప్పును సమకూర్చినది. దీనిని దప్పించువారెవ్వరేనియు లేరు గదా!యని లోలోనవిలపించుచు కదలిన చప్పుడగు దాన దూర మునున్న కష్టం బిప్పుడే రాఁగలదని దలంచి మేనుల గుదించు కొనుచు నిట్టి స్ఫురదూ ర్పుల, నీగృహముసందెన్నడును జూచి యెఱుంగనే, నేడెందుండివచ్చిరని, యచ్చెరపడుచు, వారిరూ పము లెంతేఁజూచినను మనమునకు తనివిదీరమి కన్నులు మూతలిడక నాదివ్యాకారంబుల గనుచు సంతోషదుఃఖ భయంబులు ముప్పిరిఁగొన నాటి రేయి వెళ్లించిరి. తెల్లవారినది రేయి తాము చూచిన కావలివారలు కనుపింపలేదు గాని యింటివారు నిదుర లేచుటయు భృత్యులు వారివారి పనులవెంట గృహముచుట్టుముట్టి సంచరించుచుంటయు, తమపనిసాగమి రేయి వోలె జలదారుల వీడజాలకుండిరి. పగలంతయు నన్నము లేదు. పొద్దుగుంకినది. గతరాత్రి తమకు గనుపించిన పురుషపుంగవులిరువురు నెన్నుగాడిపై పచారుచేయుచుండిరి. ఇక నేమిదారి, తిరిగి రెండవ రేయి రెండుజాములకు మించినది. ఊరం తయు మాటుమణిగినది. ఇప్పుడు గృహములోనికిదిగి తప్పించుక పోదమనితలంచి ప్రయత్నంచిరిగాని గృహమునందుగూడ నిద్దరు పురుషులు శరశరాసనములతో పచారుచేయుచుండు నటుల గనుపించి వారి నోతయువారించినది. ఇంటిపైనను యింటిలోనను మనుజులు సంచరింపని సమయమే వారికి గనుపిం పదాయె. ఏమిగతి, మతే? యింకెక్కడి జీవితాశ, యిక్కడ మన్నుగావలసినదే? యెటుబోవుటకు వీలు లేదు. పరాత్పరా! దీనదయాపరా! యాపద్బాంధవా! మేముచేయరానిపని చేసినం

దుకు తగిన శాస్తిగావించితిరి. మాజన్మావధిలో నిట్టికార్యము లెప్పుడును మేముచేయఁబోము ఈ విపదబ్ధి నుండి యావలకుఁ దాటింపుమని భగవానుని ప్రార్థించుచు రెండవరేయి కడపిరి. తెల్లవారినది. కమలబాంధవుడు తూర్పునఁబొడసూపె, తస్కరు లాకలిదప్పుల కడలుచు మృత్యువు తమకు దప్పదని దలంచి నిశ్చితంబూని గృహంబునుండి దిగనెంచి వెన్నుగాడిపైకివచ్చిన భృత్యులుగాంచి దొంగలు దొంగలని కేకలిడిన చౌదరిగారి కుమారుడు శేషయ్యగారరుదెంచి, వారల నందునుండి దింపించి ప్రహారణమ్ముల సమ్మానింపదలచిన, చౌదరిగారు వారించి వారలచే గత దివసద్వయంబునను జరిగిన యావద్వృత్తాంతమునువిని వారుసత్కరించిన యమూల్యాభరంబులనుగాంచివిస్మయాకులచిత్తుండై వారలకు గనుపడిన పుణ్యపురుషులు రామలక్ష్మణులని గ్రహించి తస్కరకృత్యంబు లొనరింప నేతెంచిన వారికి భగవస్సాక్షాత్కారము లభించుటకు పూర్వపుణ్యవిశేషంబుండితీరవలయునని దలంచి—రామమూర్తినుద్దేశించి,

చ॥ ఇలఁగల నింద్రజాలికుల • నెందఱినో కనుఁగొంటి గాని ని
స్తులగతి నిన్నుఁబోలుచుర • తోరపుజాలకళా విశేషతన్
నిలయముఁగన్నమాయఁగను • విప్పగ సృష్టియులేక సత్యమున్
గలిగి యసత్యమున్గొలుపు • గారడిపెద్దవునీవు రాఘవా ॥

ఓ దయామయా! ఈ యల్పుని యస్థిరసంపదనురక్షింప దూతకృత్యము చేయుటకుగూడ సిద్ధపడి నీ యవ్యాజకరుణ నాపైఁజూపితివా? జగత్కర్తవగు నీవలన పనులఁ గొన

నెంచిన నా జన్మమేటికి కాల్పనా? పరమపావనా! భవదీయః దివ్యదర్శనా సౌభాగ్య మర్థించితిగాని యెన్న డేనియు మద్రిమ్య సంరక్షణాభారము నీపైనుంచితినా? అన్న మభ్యర్థించు క్షుధాతురుని వస్త్రదానముచేఁ బరితృప్తిపరుప నెంచినట్లు, తావకీయః దివ్యమంగళ స్వరూప దర్శనాభిలాషినగు నన్ను సంపదభీక్షణా వ్యాపారోపకృతిం గావించి సంతృప్తిపరుప నెంచితివిగా? ఇది యేమి? ధనమువలన ధర్మము దానివలన నైహికాముష్మిక సుఖంబు లభించునదైయుండ నరునకు ద్రవ్య విముఖత్వము కార్యకారిగాదని సూచింపనెంచి యీ పనిగావించితి రేమో? అట్లయిన జన్మపరంపర సమకూర్పఁజాలు నీ యిహాసంపదలతో నాకవసరము లేదు. పునరావృత్తిరహిత శాశ్వత బ్రహ్మలోక పదవిసంఘటింపఁజేయు సుజ్ఞానధనం బభివృద్ధిపరచి తస్కరపాళులు తద్ధనాపహరణము గావింపకుం డునటుల గాపాడి నన్నుద్ధరించుము. విద్యావిహీనులైన నాబోటుల కీహాసంపదల నర్థదాయకములగుట నన్ను తల్లోలుని గావింపక. త్రిమూర్త్యాత్మకమై త్రిజగదానంద సంపూరిత నీల నీరదాకారంబై సుందరమందహాస సందీప్యమాన ప్రసన్న వదనారవింద విరాజితంబై సర్వశుభలక్షణ సమన్వితంబై కపట మానుషాకారంబై యోగిజన భాగధేయంబై దివిజ యక్ష కిన్నర కింపురుషాది సిద్ధజన సేవితంబై తనరారు భవదీయ దివ్య మంగళస్వరూప సందర్శనభాగ్యంబు లభింపజేయక ఇతర హోమపకృతు లెన్నో నసరించినను నా మనశ్శాంతిఁ గాజా

లదుగాన, నోయాపద్బాంధవా ! దీనదయా పరమమూర్తీ ! మన్మనోరథసిద్ధియగునటు లాశీర్వదించి సంసృతి సంజనిత కల్మషాతిరేకములు నన్నంటకుండునటు లనుగ్రహింపుము. అని యనేక రీతుల వినుతింపుచు తస్కరులజూచి,

ఓ తస్కరులారా! మీరలతిపుణ్యాత్ములరు, పావనమూర్తులరు, ఏ పరమపురుషుడు యీలోకమునను పరలోకమునను సకలభూతములకును అంతర్యామియై నియమించుచున్నాడో ఎవని భయమువలన వాయువు విసరుచున్నదో, సూర్యుడుదయించుచున్నాడో ఇంద్రాగ్ని వరుణాదులు తమతమ కార్యములను జేయుచున్నారో, అట్టి మహామహుని మోక్షదాయకుని దివ్యమంగళ స్వరూపుని, అవాఙ్మానసగోచరుని ఆర్తత్రాణ పరాయణుని దివ్యస్వరూపము జూడజాలితిరి. ఇట్టి మిమ్ము స్తుతింప నాతరమగునా? మీపవిత్రస్వరూపములఁ జూచుటచేత నా జన్మము కృతార్థత వహించినది. మీపాదస్పర్శచే నాగృహము పావనమైనది.గాన భేదవృత్తింగైకొనక మద్గృహంబునంగల వస్తుసముదాయంబున మీకుకావలసినవి గైకొండని నుడివిన, వారలు గతరాత్రులయందుఁదమకు కనుపించినవారలు శ్రీరామ లక్ష్మణులనియు భగవానుడు చౌదరిగారియందును వారి వస్తురక్షణయందును గడు శ్రద్ధవహించియుండునటుల నెఱింగి.చౌదరిగారి భక్తికబ్బురపడుచు నిట్లనిరి.

దేవా! మీద్రవ్యము శ్రీరామ సంరక్షితంబై సద్వినియోగ యోగ్యంబై యుండుటచే మాబోటి దుర్మార్గులంటదగి

నవి గాదుగాన నీవస్తురాజములతో మాకు పని లేదు. నేమింత
టినుండి స్వార్జిత విత్తంబుల జీవయాత్ర సాగించువారమని
జెప్పుచు నందుండి వెడలిపోజూచిన రామభొట్లుగారు వారించి
నాడు వారలకభ్యంజనములు గావించి రుచిరాన్నాదుల
బరితృప్తిపరచి యమూల్యవస్త్రములొసంగి నూతనబంధువుల
సాగనంపిన వడువున బంపఁదస్కరులు తమతమ గృహంబుల
కేగిరి. (1. ఇందుఁజెప్పబడిన వీరడు మాలవాడు. ఇప్పుడు వీని
కుమార్తె మద్దిరాలపాటియందు గలదు. 2. కుమ్మరి వెంక
టాద్రి రామభొట్లుగారు పరమపదించిన తదుపరి నాయూరు
విడచి కుటుంబమును వెంటకొని యెటకో వెళ్ళినాడని చెప్పె
దరు.) ఇట్లు చౌదరిగారు తనజీవితమును సార్థకపరచుకొని తన
డెబ్బదియవయేట శాశ్వత బ్రహ్మలోక సౌఖ్యమనుభవింపనేగిరి.



గుంటూరు నల్లమస్తాన్ సాహెబు

గీ॥ బాలుని విధంబునను ♦ పిచ్చి వానిభంగి
అందమేది పిశాచంబు ♦ చందమునను
అనుభవజ్ఞాన యోగి యీ ♦ యవని యందు
సంచరించుచునుండు ని ♦ శ్చంచలగతి ॥

పరమాత్మ శాంతిస్వరూపి జీవులహృదయములు ఈ శాంతి స్వరూపుని గ్రహింపజాలవు. మానవుని మనస్సు పరమాత్మయందు లీనమైనపుడు తచ్ఛాంతి బయలు పడును. ఈశాంతి (అనగా) ఆత్మశక్తి హృదయాకాశమును చిత్రాతిచిత్రముగా బ్రవేశించి క్రమముగా ఆహృదయమంతటను వ్యాపించి యాక్రమించుకొనును. ఇదియే మహాయోగరహస్యము. ఋషులయందు నిబిడీకృతమైన శక్తి రహస్యముగూడ నిదియే!

శాంతి ప్రవేశించినవెంటనే సర్వోపద్రవములనుండి సాధకుని భగవచ్ఛక్తి రక్షించుచుండును. ఆత్మశాంతియే ఆత్మశక్తి. ఈశక్తిపూరితుని దాకినవెంటనే శరీరమానసిక రుగ్మతలు పటాపంచలగును ఇట్టిశక్తిని జీవులుస్వయముగా సృష్టించుకొని పరమశాంతిని బొందజాలరు. ఈశక్తిప్రతిజీవుని హృదయమందును గలదు. భగవదనుగ్రహము సంపాదించి స్వస్వరూపావలోకనము జేయుచు సుఖదుఃఖాది ద్వంద్వములదాటి లోనికేగిన బరమశాంతి, నిత్యతృప్తి, విశ్వప్రేమ, అద్వితీయధైర్యము, నిర్విచారము, అద్వయానందము జీవుడుగ్రహింపగలడు. గంగ భూమిలోబ్రవహింపు చున్నట్టు ప్రతిహృదయమందును ఆత్మ

శక్తి ప్రవహింపుచున్నదని తెలిసినవారు గుంటూరు నల్ల మస్తానుగారు.

గుంటూరు మండలమున "మస్తాన్" గారి పేరువినని వారరుదుగానుండును. మస్తాన్‌గారి "ఉరుసు" అను పేరుతో నామహాత్ముడు సిద్ధిపొందిన దినమున గుంటూరు పట్టణమున అతని దరగాయొద్ద పెద్ద యుత్సవము చేయుదురు. ఈయుత్సవమునకు మహమ్మదీయులను హిందువులలో నెల్లవర్ణముల వారును స్త్రీలును, పురుషులును, బాలురును అత్యంత శ్రద్ధాభక్తులతో నేగి యుత్సవమునుదర్శించి వచ్చుచుందురు. హిందూ మహమ్మదీయ వివక్షత లేక సమస్తజనులును మస్తానుగారి యురుసునకు భక్తితో జనుటకు కారణమేమని పాఠకులు ప్రశ్నింపవచ్చును. అందునకు కారణము లేకపోలేదు. మస్తాన్‌గారిని స్వయముగా కన్నులజూచి ముచ్చటించి యీమహామహుని మహాత్మునిగా తెలిసికొన్నవారు గుంటూరులోను, దానికి చుట్టుపట్టు గ్రామములయందు ననేకులు నేటికిని జీవించి యున్నారు. ఈమస్తాన్‌గారు మహమ్మదీయ కులమునజన్మించినారు. సయ్యదు వంశస్థులు వీరుదక్షణదేశములోనున్న తిరుచినాపల్లిలో జన్మించి బాల్యమున నచ్చటనే పెరిగినట్లు వారి శిష్యుడొకరు చెప్పుచుండువాడు. వారు బుట్టిపెరిగినది యెక్కడైనను సుమారు 100సంవత్సరములు గుంటూరులోను తత్పరిసర గ్రామములందును వారుండిరి. శ్రీవారు ఇప్పటికి 33సం॥రములకిందట సిద్ధినొందిరి. అప్పటికి గుంటూరులో కడువృద్ధులగువా రనేకులు తమచిన్నతనములోనే మస్తాన్‌గారతి వృద్ధు

లుగా నుండిరనియును. గత 80 సంవత్సరములనుండి యష్టే మార్పు లేక నున్నారనియును చెప్పుచువచ్చిరి వారి యద్భుత శక్తిమాత్రము నెవ్వరు సంశయింప లేరు. వీరికి కీర్తి యెట్లు వచ్చెనో తెలుపుటకతని యద్భుతమగు చర్యలుగాక వేరుకారణములు కానరావు. ఆయనసామాన్యముగా నెవరితోడను మాటలాడువాడుకాడు. మౌనముద్ర బూనియున్నట్లు చూపరులకు తోంచుచుండును. మాడలాడినప్పుడు సైతము క్లుప్తముగా నొకటి రెండు మాటలుతప్ప యెప్పుడును మిక్కిలి మాటలాడి యెఱుగడు. రోగపీడితులుగాని, తమగ్రహచార విషమై తెలిసికొనగోరువారుగాని శ్రీవారియొద్దకేగి పడియుండగా, పడియుండగా, రెండు మూడు దినములకొకమాట చెప్పించుచుండును. ఆమాటయదార్థమై భావి శుభాశుభ సూచకమై యుంటూవచ్చెను. ఆయనకు శాస్త్రపాండిత్యముగాని, వాచాప్రౌఢిమగాని,యుక్తులుగాని, డాంబికముగాని యెన్నడూ లేదు. సిద్ధిపొందునాటి కామహనీయునకు రెండువందల యేబదియేండ్లు వఃస్సుండునని యూహించుచూ వచ్చిరి. అధమము రెండువందల యేండ్లకు తక్కువయుండదని ఘంటాపథముగా శతవృద్ధులు చెప్పుచుండిరి.

వీరికి నెల్లూరు జిల్లాలోని పామూరు కాపురస్థుడు షేకు మదార్ సాహెబ్ 1880 సం॥ మొదలు శిష్యుడైయుండి శ్రీవారు సిద్ధిపొందిన పిమ్మటగూడ చాలకాలమతని దరగాయొద్ద అర్చన చేయుచు 1920 సంవత్సర ప్రాంతమున దేహయాత్ర చాలించెను. ఈ శిష్యునివలన మస్తాన్‌గారొనర్చిన మహత్తర కార్య

ములును, వారిజీవిత రహస్యములను కొన్ని తెలియవచ్చినవి. గుంటూరువాస్తవ్యులలో కొందరు శతవృద్ధులు మస్తాన్‌గారి యద్భుతచారిత్రమును గురించి చెప్పుచూ వచ్చిరి. మస్తాన్ గారు సామాన్యముగా పిచ్చివానివలె నుండువారు, వీరు ప్రథమములో నొకకావడి మోయుచు తిరుగుచుండిరి. ఆ కావడిలో నొకప్రక్క చిలపరాళ్ల గంపయును, రెండవప్రక్కన చింపిగుడ్డల గంపయును మాత్రముంటూ వచ్చెను. ఆయనకు తన వెంటనున్న రెండు కుక్కపిట్టములును, నొకమేకయును సదాయీ మహాత్మునకు సహచరులైయుండెను. చిలపరాళ్లు చింపిరిగుడ్డలు గల కావడిని మోయుటలో నొకపరమార్థమున్నట్లు తోచుచున్నది. జనుల పాపములనెల్ల తాననుభవించి జనుల పాపపరిహారమునకై యేసుక్రీస్తు తాను చిలువపై మరణించెనని క్రైస్తవ మతస్థులు చెప్పుచుందురు. అట్లే మస్తాన్‌గారును పాపుల పాపభారము తానువహించి వారినుద్ధరింప దలంచి సంచరించుచున్నట్లు లోతుగావిచారించి చూచువారికి తోచుచుండెను. కొన్నాళ్ళకాకావడి తీసివైచి యొక చిన్నబండిపై గూర్చుని శిష్యులీడ్చుచుండ కొన్నాళ్లు చరించువారు వీరి చారిత్రమునందు మిక్కిలి యద్భుతములైన దుర్ఘట కార్యములను కొన్ని యుదహరించెద :— ఒకనాడు భవానియను పేరుగల యొకరసపుత్రస్త్రీ శ్రీవారికోడిని దొంగలించి దానిని చంపిదాని మాంసమును వండి తినవలయునని యెంచి మాంసము ముద్ద జేసి వంటకై యచ్చటపెట్టెను. మస్తాన్‌గారు వచ్చి కోడిలేకుండుటజూచి దివ్యదృష్టిచే ఆమెచేసిన దుండగమును సహింప

జాలక ఆమెనుద్ధరించుతలంపుతోనో యున్నట్లు మస్తాన్‌గారా కోడిమాంసపు ముద్దవంక చేజాచి "భో భో" యనిపలికి పిలిచెను. వెంటనే యాకోడి పూర్వాకృతితో జీవించిన కోడియై గంతులు వేయుచు మస్తాన్ కడకు వచ్చెను. భవాని ఈ సంగతి కన్నారగాంచి యబ్బురపాటుజెంది మస్తాన్‌గారి పాదపద్మములకు ప్రణమిల్లి తనపాపము బాపుమని ప్రార్థించెను అది మొదలు భవాని అహింసావ్రతముబూని శ్రీవారికి శిష్యురాలై చెప్పదగిన భక్తురాలయ్యెను ఈయద్భుతచర్య వీరు సిద్ధిపొందక ముందు సుమారేడెనిమిది సంవత్సరములక్రిందట జరిగెనని తెలియుచున్నది. దీనివలన మస్తాన్‌గారియమానుషశక్తి లోకమునకు వెల్లడికాకమానదు.

వీరు మహానుభావులని తెలిసికొన్న యొక మహమ్మదీయ వర్తకుడు కడప గ్రామనివాసి శ్రీవారియందు భక్తితాత్పర్యముగలవాడై వారచ్చటచ్చట పడియుండుటజూచినివాసయోగ్యమగు నొకగృహము సమర్పింపదలచి గుంటూరుసంగడిగుంటలోనిల్లుకొని శ్రీవారికి సమర్పించిరి. ఆయింటిలో మస్తాన్‌గారును వారి శిష్యుడును నివాసము చేయుచు కొన్నాళ్లు కాలక్షేపము జేయుచు వచ్చిరట. శ్రీవారి దరగాయొద్దకు అర్చనాదికమునకు వలయుపూజాద్రవ్యములను నేటికిని ఆయింటియొద్ద నుండియే తీసుకొని వెళ్లుచుందురు. మస్తాన్‌గారు నూతనముగా గుంటూరువచ్చిన దినములలో వైద్యశాలకు సమీపమున నొకచోట నివసించుచూ, వచ్చిరి. అచ్చట నొక ములగచెట్టుక్రింద వారుకూర్చునియుండగా కారుమబ్బులుపట్టి, యురుములు

మొయిపులు సాగి వర్షము ప్రారంభమయ్యెనుగాని శ్రీవారెచ్చ
టికిని కదలక ఏకాసనముతో నచ్చటనే నిలిచిపోయెను. వర్ష
మధికమయ్యెను. ఆవర్షబాధకు వారియొద్దనున్న మేక నిలవలేక
యరచుచుండెను ఇంతలో నురుములధికమై పెళపెళధ్వనితో
నొకపిడుగు సమీపములో పడెను ఆపిడుగుపాటునకా మేక చని
పోయెను. అచటికి దూరముననున్న మఱియొకమనుష్యుడుగూడ
చనిపోయెనట. ఇందు విపరీతము లేదుగాని శ్రీవారుకూర్చున్న
స్థలముమీద మాత్రము వర్షముకురియమి వారికేవిధమైన
బాధగలుగలేదు. ఆమహాత్ముడా వర్షసమయమున యోగనిద్ర
లో నున్నట్లు చూచినవారికి దోచెను. కొంతసేపటికి వానతగ్గి
పోయెను. చుట్టుపక్కలనున్న జనులు గుంపులుగూడి శ్రీవారు
న్న చోటికి వచ్చి చూడగా మస్తాన్‌గారున్న ప్రదేశము తడువ
కుండుటజూచి యచ్చెరువందసాగిరి. కొంతసేపటికి శ్రీవారు
లేచి చూచునంతలో తన మేక చచ్చిపడియుండుట కాన్పించెను.
ఆ మేకను నచ్చోటనుండి లాగిపారవేయుట కచ్చటికి
వచ్చినవారు ప్రయత్నపడగా శ్రీవారు వారిని వారించి
తానా మేకను సమీపించి దానిప్రక్కగూర్చునికన్నులుమూసు
కుని భగవధ్యాన మొనర్చి లేచి మేకచుట్టును ముమ్మారుతిరిగి
యామేకను స్పృశించి దాని మేనెల్ల నిమిరి "ఉఠో" యని
లేవదీసెను. అంత నామేక నిద్రించిలేచినట్లు లేచి తనపై బడిన
వర్షపునీరు విదలించుకొనుచు తనచుట్టు మూగిన జనమునుజూచి
భయపడి శ్రీవారి గాళ్లసందునదూరెను. అంత నచ్చటిజనులెల్ల
రత్యంతాశ్చర్య నిమగ్నులై శ్రీవారిని పొగడుచు ఆయనపాద

ములకు ప్రణమిల్లుచు చాలసేపాయనను వదలకుండిరి. ఈ యద్భుతచర్య పట్టణమునందెల్లవారు చెప్పుకొనసాగిరి. ఆవల రెండుగంటలైన పిమ్మట శ్రీవారియొద్దకు పిడుగుపడి చనిపోయినవాని తల్లివచ్చి పాదములమీదపడి తనకుమారుని బ్రతికింపుమని వేడుకొనగా శ్రీవారచ్చటికేగి దైవధ్యానముచేసి చనిపోయిన వానిని తన దివ్యహస్తములతో తాకి యాలింగనముజేసి లేవనెత్తెను. చచ్చినవాడు జీవించెను. అంతట శ్రీవారి కీర్తి దిగంతములు వ్యాపింపగా వాడవాడలనుండి జనులు వేనవేలు రాసాగిరి కాని శ్రీవారు వారితో మాటలాడ నిచ్ఛగింపక మౌనసముద్రబూనియుండెను, యోగాభ్యాసమునందు నిరుపమానమగు అనుభవముగల్గిన మన మస్తాన్‌గారు తమ యోగమహిమ ననేక నద్భుతకార్యములు చేయుచుండువారు. ఒకనాడు నల్లపాడు గ్రామసమీపములో నొక వైశ్యునిపొలము దరిని శ్రీవారు పడియుండెనట. మొండె మొకచోటను కాళ్లు మఱియొకచోటను, శిర మొకచోటను భిన్నమై పడియుండెనట. ఆవైశ్యుడు తనపొలము చూడవచ్చి యాశవఖండములను చూచి భయపడి యింటికి పరువెత్తి తానుచూచిన విషయము గ్రామస్థులకు తెలుపగా వారా వైశ్యునితో గలసి యాపొలము సమీపమునకు వచ్చుచుండిరి. ఆసమయమున శవఖండములు లేకనే యొల్లింటియాకారముదాల్చి మస్తాన్‌గారు నిలిచినజూచి యిదియేమని గ్రామస్థులు వైశ్యుని ప్రశ్నింప జొచ్చిరి. అంతలో శ్రీవారు వైశ్యునివంకజూచి భయపడితివా యని యడిగి చిఱునవ్వు నవ్వెనట ఈ యద్భుత కృత్యమునకు పర

మాశ్చర్యపడి వారాతనిపాదముల పైబడి తమయూరిలోనికి రమ్మని ప్రార్థించిరి. గాని శ్రీవారుమాత్రము తాను వెళ్ళక గుంటూరు వచ్చెనట. యోగవిద్యలో ఖండయోగమున నిట్టి యమానుషచర్యలు జరుపుచుండుదురు. ఈచర్యలచే స్వాతిశయ మును పెంపొందించుకొనుటగాని, ధనసంపాదన జేయుట గాని కోరనివారయ్యును యోగులాయభ్యాస పాటవమునకు కాబోలు తామూకార్యముల జేయుచుందురు. అట్టి కార్యము లొకప్పుడు జనుల కంటపడుచుండును. దానిచే మహత్తర యోగవిద్యాశక్తిగలవా రున్నారనియును అట్టిశక్తి సాధింప వచ్చుననియును జనులు తెలిసికొనుట కవకాశముగలుగు చున్నది.

గుంటూరు మండలమునుండి యొకయాత్రికుడు కాశీ యాత్ర జేసికొనుటకేగి కాశీలో గంగాస్నానముజేసి విశ్వ నాథునిదర్శించి కొన్నాళ్ళచ్చట నివసించి కాశీపట్టణమంతయు చూచి యానందించుచు నొకచోట నొకవృద్ధుని జూచెను. ఆతడొక మశీదుముందున్న ఖాళీస్థలమునందు గూర్చునియుం డెను. ఆమశీదొక దివ్యభవనముగా కనుపెట్టెను. అదిచూచు కుతూహలముతో మనయాత్రికుడు ఆవరణములోనికి వెళ్ళి చూడగా నచ్చట ముసలివాడీయాత్రికునివంక తేరిపారజూచి చేసన్నతో రమ్మనిపిలిచెను; ఆయాత్రికుడు ముసలివాని యొద్దకువెళ్ళి యేమికావలెనని అడుగగా నీది గుంటూరు కదా ! యని యడిగెనట అతడెవరో తననెఱిగినవాడనియును

గుర్తించి పిలిచినాడనియును దలంచి ఆవును మాది గుంటూరు దగ్గిరయూరే అనిచెప్పెను. అంతట నావృద్ధయోగి సంతసించి నాయనా! గుంటూరులో నాస్నేహితుడు డొకడున్నాడు బాగు న్నాడా? యనెను. ఎవరాస్నేహితుడని యడుగగా నేనాతని రెండువందలసంవత్సరముల క్రిందటచూచితిని వాడు నాబాల్య మిత్రుడు మస్తాను అనుపేరుగలవాడు అని చెప్పెను. మన యాత్రికుడును మస్తానుగారి నెఱింగినవాడగుటచే వెంటనే తెలిసికొని మస్తానుగారిని నే నెఱుంగుదును బాగానేయున్నాడని చెప్పి యాశ్చర్యపడెనట.

ఈ వృద్ధుని సంభాషణముచేత మస్తానుగారు దీర్ఘాయుష్మంతుడును, మహాత్ముడునగుటయేగాక తానును రెండువందల సంవత్సరములకు మించిన వయస్సుగలవాడై నట్లు తేలుచున్నది అందువలన మనయాత్రికుడు భయభ్రాంతుడై యా వృద్ధుని ముందుగూర్చుని యాతని పొగడ నారంభించెను. హిందూదేశ మున సామాన్యజనులలో నెవ్వరును నూరుసంవత్సరములు మించి జీవించువారుండరు. అట్టి విషయములో రెండువందల సంవత్సరములు మించిన వయస్సుగలవారుండుట దుర్లభము. ఎక్కడైనను అట్టివయస్సు గలవారున్నను యీవృద్ధుడును మస్తానుగారును వారిలోవారైనను యొకవింతగాదు గాని యెన్నడునుచూడని మనయాత్రికుని చూచి యావృద్ధుడు నీది గుంటూరుకాదా? యని ప్రశ్నించుటవలన నావృద్ధుడు మహాత్ముడని స్పష్టముగాక తప్పదు. అనంతరము మనయాత్రికు డావృద్ధ యోగివద్ద సెలవుతీసికొని కొన్నాళ్లకు గుంటూరుచేరెను. గుంటూరులో మస్తానుగారున్న చోటికతడు ప్రయత్నపూర్వ

కముగా వచ్చెనుగాని మస్తానుగారు ధ్యానమగ్నులైయుండుట చేత పలుకరించుటకు వీలు లేక వేచియుండెను. ఇంతలో మస్తాను గారిని దర్శించుటకు పలువురుజనులు వచ్చికూర్చుండిరి ఆజనులలో మనయాత్రికుడుడొకడైయుండెను. అట్లొక గంటకాలము కనిపెట్టుకొనియుండగా మస్తానుగారు ధ్యానసమాధి చాలించి కనువిచ్చిచూచువరకచ్చటికి వచ్చినవారు తమతమ వ్యాధులను గూర్చియు గ్రహచార సంభవమైన విపత్తులనుగూర్చియును చెప్పుకొనసాగిరి. ఇట్లు వారి మొరలనువిని అవసరమైన సమాధానములనొసంగి పంపివేసెను. పిమ్మట మనయాత్రికుని గాంచి నా స్నేహితునిచూచి మాటాడివచ్చినావా? నాక్షేమ సమాచారమునుగూర్చి నిన్నడిగిన స్నేహితుడు బాగున్నాడా, అనెను. మనయాత్రికుడాశ్చర్యపడి వారిరువురిలో నొకనికంటె యొకరు మహానుభావులనిదలంచి, చిత్తము మీదర్శనముచేసి మీస్నేహితుడు మీక్షేమసమాచారమడిగెనని చెప్పుటకే నేనిచ్చటికి వచ్చినాను. మీరిద్దరు మహానుభావులు. మీావయస్సువారే నాకు సెలవిచ్చిరి. ఇట్టి మహానుభావులని తెలియక సామాన్యయోగులని మాత్రమే నేనుదలంచితిని. నన్నుచూడగనే నీదిగుంటూరు కాదాయని మీస్నేహితుడును ప్రశ్నించెను. ఆతనిశక్తి యెంతయని చెప్పగలను! ఈస్తోత్రము ప్రారంభింపగనే మస్తానుగారు విననొల్లక నిమీలితలోచనుడై ధ్యానముజేయదొడంగెను. కం॥ ''తనులోకము గొనియాడగ వినియుబ్బడుసజ్జనుండు''అను నార్యోక్తి యాతనియందు వ్యక్త

మయ్యెను. అంతనాయాత్రికుడు కొంచము సేపచ్చటనిలచి మస్తాన్‌గారు కన్నులు తెరువకుండుటచే తనయూరున కేగెను.

ఈ మహానుభావుడు పరుండుట యెన్నడు నెవ్వరుజూచి యుండలేదు. నిరంతరము కూర్చునియుండి మేలుకొనుటగాని ధ్యాననిమగ్నుడగుటగాని మాత్రమేగలదు. ధ్యానమనునది నిద్రయేయని మనమెంచినను పరుండుటమాత్రము లేదు. కూర్చుండియే నిద్రించుట మేల్కాంచుట మాత్రము గలదు.

ఈతనిగురించి చెప్పుకొను వింతచర్యలలో మఱియొక టికలదు. ఒక మహమ్మదీయ యువకుడొకనాడీ మహాత్ముని చూచి పిచ్చివాడని వాదించెను. తెలిసినపెద్దలు వద్దనివారించి నను వినక గట్టిగా పిచ్చివాడేయని మొటుగబల్కెను. పాప మీయువకు డదేపాటగా పిచ్చివాడు పిచ్చివాడు పిచ్చివాడని గుక్కతిప్పకుండా విరామములేకుండా నరచుచు తిరుగనారం భించెను. అందఱుచూచి వానికి పిచ్చిపట్టినదని యెంచి పట్టిబం ధించి యొక్క గదిలోనుంచి తలుపు మూసిరి. కాని పిచ్చితగ్గి నదికాదు. అట్లు రెండుమూడు దినములావిధముగా నుంచినను వాని పిచ్చిధోరణి తగ్గనందున తలిదండ్రులు కారణమరసి మస్తాన్‌గారి యొద్దకాపిల్లవానిని తీసికొనివెళ్ళి ఆయనపాదముల మీాద పడవైచి తామునుపడి అపరాధముక్షమింపుడని వేడ జొచ్చిరి. అంతటమస్తాన్‌గారు వారి మొరలు నాలించిపిల్లవాని ధోరణిచూచి దగ్గరకుపిలిచి నోటిమీాద తనహస్తమును పెట్టెను. వెంటనే పిచ్చిధోరణి యాగిపోయెను. చెడిన మనస్సు తిరిగి

బాగుపడెను. ఆయువకుడును భయభక్తులతో మస్తాన్‌గారికి వందనముచేసి యాతని యనుగ్రహపాత్రుడై యింటికేగెను.

మస్తాన్‌గారి యద్భుతశక్తి విషయమై మఱికొన్ని గాథలుకలవు. వీరొకదినముదయమున నొకవర్తకుని దుకాణము నొద్ద కౌపీనధారియై కూర్చొనియుండెనట. ఇతని వికారాకారమును వృద్ధత్వము నుపలక్షించి యసహ్యపడి లేచిపొమ్మని రెండుమూడుపర్యాయములు చెప్పినను అతడులేవక యట్లే కూర్చొని యుండినందున కోపముతో, నావర్తకుడొక కఱ్ఱతో నతని బలమైన దెబ్బకొట్టెనట. ఆదెబ్బకు మస్తాగారి దేహము తునకలై ఖండఖండములుగా శరీరము చెదరి వేరువేరుగా పడి పోయెనట. ఆసంగతి చుట్టుపట్ల జనులుచూచి గోలపెట్టగా పోలీసువారువచ్చి విచారించి యావర్తకుని పట్టిబంధించి చెరసాలకు తీసికొని వెళ్ళిరట. తునకలై పడియున్న యాతనిశరీరము చేర్చి విచారణచేసి ఖననము జేయ ప్రయత్నించగనే, ఆశరీర శకములన్నియుజేరి జీవవంతమగు దేహముగా మారినందున మస్తాన్‌గారెప్పటివలె తన పూర్వరూపముతో కూర్చునియుండెనట. అంతట నీవింతయంతయు చూచినవారచ్చెరువంది పోలీసుకచ్చేరికి వెళ్లి జరిగినయుదంతము సాంతముగా తెల్పగా నాహంతకుడు నిర్దోషియని విడిచిపుచ్చిరట. ఇట్టి యమానుషచర్యలవలన మస్తాన్‌గారి మహిమ మండలమెల్ల వ్యాపింప జొచ్చెను. ఇంతకంటె నెక్కువ వింతసంగతులు గాకున్నను అతనికిగల మఱికొన్ని ప్రజ్ఞలుగూడ చదువరులకు హృదయరంజకముగా నుండకపోవసయెంచి యుదహరించుచున్నాడను.

వినుకొండగ్రామకాపురస్థురాలగు నొకయువతిసంతానము లేక పలుపాట్లుపడి ప్రయోజనము లేక నిరాసనొంది తుదకొకనాడు గుంటూరుకురాగా, నచ్చటివారివలన మస్తాన్‌గారి మహిమవిని తనకాతని యనుగ్రహముచేత సంతానము లభింపవచ్చుననను పేరాశతో నాతనిసన్నిధి కేగి రెండుమూడుదినములు పడియుండ నొకనాడతని కనుగ్రహముగల్గి యొక మొగశిశువు గల్గునుపొమ్మని యనుగ్రహించెనట. అంత నాకాంతతనయింటి కేగెను. కొలది రోజులలోనే గర్భముధరించి పిమ్మట నొక మొగశిశువునుగాంచెనట. శిశువుగల్గిన కొన్ని మాసములకా శిశువును మస్తాన్‌గారికిచూపి తనకృతజ్ఞతా సూచకముగ వందనసమర్పించి యాతని యాశీర్వాదమందు కోరికతో గుంటూరు కేగుటకు పయనమై రైలుస్టేషనుకు వచ్చెనట. అచ్చట రైలుస్టేషను ప్లాటుఫారముమీద నొక మూల మస్తాన్‌గారు కూర్చునియుండిరట. అదిచూచి యావెలది పట్టరానిసంతోషముతో నతనిపాదములకు సాష్టాంగపడి పిల్లవానినికూడ పడవేసెనట. అంతట మస్తాన్‌గారామెతో నీవు గుంటూరు వెళ్లుము అచ్చట పెద్దయుత్సవము జరుగును. అదిచూచి యానందింపుమని చెప్పిరట. ఆమహాత్ముని యుత్తరువుచొప్పున నాకాంత గుంటూరు కేగి విచారింపగా మస్తాన్‌గారు చనిపోయిననారనియును అందుకై గుంటూరుపురవాసులెల్లరు పెద్దయుత్సవము జేయుచున్నారనియును తెలిసి యచ్చటి కేగి యుత్సవము దర్శించెనుగాని యామెకాతడు చనిపోయినట్లు విశ్వాసము గలుగలేదు. ఆరోజుననే తాను వినుకొండ స్టేషను యొద్దచూచి మాటలాడివచ్చిన మస్తాన్‌గారు మరణించినట్లు

ఆపూటనే వినుటచేత, నామెకు నమ్మకమెట్లుగల్గును ? ఆమె తానామహాత్ముని రెండుమూడు గంటలక్రిందట వినుకొండలో చూచివచ్చితినని యెవ్వరితోనో చెప్పెను. ఆమెమాటవినువారు లేరైరి. అంతట నాయింటి యుత్సవముచూచి మస్తానుగారి కళే బరముచూచి తానుచూచినమహాత్ముడు వేరొకపురుషుడేమో ! యని సందేహపడుచు స్వగ్రామము జేరి యచ్చటవిచారింపగా తాను స్టేషనులో చూచిన పురుషునిచూచినట్లు చెప్పువా రెవ రును లేరైరి. మస్తానుగారు మరణించిన పిమ్మట సహితము కొన్నిరోజులవఱకు కొందఱికి కొత డచ్చటచ్చట కనుపించుచు వచ్చెనను వదంతి వ్యాపించియుండెను.

మస్తానుగారొక దినమున బెజవాడలో కొందఱు పెద్ద మనుష్యులు కూర్చునియుండ, తానచ్చటికివచ్చి మాటలాడుచు తనచేతనున్న బుట్టనచ్చటపెట్టి మక్కాకు వెళ్ళి వెంటనేవచ్చెద ననియును అంతవఱకు బుట్టను చూచుచుండవలసినదనయును చెప్పి వెళ్లెను. అచ్చటివారతనిమాటలు తమకర్థముగాక మక్కా యెక్కడ బెజవాడయెక్కడ, అతడు వెళ్ళివచ్చుట యెక్కడ అని సందేహపడుచు తమపాగా మాట్లాడి యెచ్చటికో వెళ్ళి నాడని తలంచుచు తమమాటల ధోరణిలో తాము పొద్దు పుచ్చుచుండిరి. పిమ్మట రెండుగంటలకు మస్తాన్‌గారు తిరిగి వచ్చి తనబుట్టను తీసుకొనగా నచ్చట గూర్చుండియుండిన పెద్దమనుష్యులు పరిహాసముగా మక్కాకు వెళ్ళివచ్చినావా ? యని ప్రశ్నించిరట. మస్తాన్‌గారు ఆయిప్పుడే వెళ్ళివచ్చినాను అచ్చట పెద్దయుత్సవము జరుగుచున్నది అచ్చటికి మహాత్ములు

వచ్చినారు వారిని దర్శించి వచ్చినానని" ఉత్తరము చెప్పి రట. ఆపెద్దమనుష్యులంతట నాతనిమాట యదార్థమును పరీక్షింపనెంచి ఆ తేదీయును గంటయును వ్రాసిపెట్టుకొని మక్కాలో తామెఱింగినవారికి తంతీవార్తమూలముగా నా దినమున ఆసమయమున మక్కాలో నేమిజరిగినది తెలుప వేడగా వారచ్చట జరిగిన సమాచారమును మస్తాన్‌గారచ్చటికివచ్చిన విషయము తెలుపుచు జవాబుపంపిరి. ఆయద్భుత సమాచారమును విని భయభ్రాంత మనస్కులై వారందరు మస్తాన్‌గారి వెంటబడి ఆయననూరేగెంచి పవిత్రమహమ్మదు నపరావతారమని వేనోళ్ల స్తోత్రము జేయసాగిరి.

ఇంకొకపర్యాయము మస్తాన్‌గారు గుంటూరులోనున్న రోజులలో పోలూరు పాపరాజను నొక జ్ఞానయోగిగారి శిష్యుడు ఉన్నవ నందయ్యగారను నాయన తనగురువుగారి యనుజ్ఞచే మస్తాన్‌గారిని సందర్శింపనెంచి గుంటూరునకేగి మస్తాన్‌గారున్న చోటికేగెను. అచ్చట మస్తాన్‌గారొక మఱ్ఱిచెట్టుక్రింద కూర్చునినిమీలితలోచనులై యుండెను. అతనిసన్నిధానముననొక బీదవాడు రుగ్ణరాబాధితుడై యుండి మస్తాన్‌గారి యనుగ్రహమునకై వేచియుండెను. నందయ్యగారచ్చటికేగిన తొలుక యరగంటకు మస్తాన్‌గారు కన్నులుదెఱచి యచ్చటతనకై వేచియున్న బీదవాని ననుగ్రహించి పంపుచు నందయ్యగారివంక చూచి, నీయొద్దనున్న నాల్గణాడబ్బు లాబీదవానికిమ్మని సెలవొసంగెను. నందయ్యగారియొద్ద మస్తాన్ చెప్పినట్లు నాల్గణాలు మాత్రమే యుండెను. ఆపావలా నందయ్యగారు వెంటనే

యాబీదవృద్ధున కొసంగెను. అంతటమస్తాన్ మందస్మితముచేసి 'పాపరాజుగారు నిన్ను పంపినారా' అని యడిగెను. నందయ్య గారాశ్చర్యపడి ''చిత్రము'' అని బదులు చెప్పెను. అంతట మస్తాన్ 'పాపరాజుగారు చాలమంచివారు, హిందువుల యిండ్లలో పితృదినములలో నితరులకెవరికి బిచ్చమైనను పెట్టరు కాని పాపరాజుగారు తనతండ్రి యాబ్దికమురోజున ముందుగా నాకన్నముపెట్టెను. అనిచెప్పిరట. ఈమహాత్ముడు తానత్యంత నిరాడంబర జీవనుడై మానావమానములకు విముఖుడై నిరంతర ధ్యానరతుడై దేహయాత్ర నడపుచుండెను.

ఈ మహాత్ముని యపారమహిమదెలుపు మఱియొక యుదంతముగలదు. నిజాంరాష్ట్ర నివాసియగు నూరుల్ ముస్తాఫాఖాదర్ అనునొక మతగురువు దేశసంచారము జేయుచు శిష్యకోటిని సంపాదించుచు ధనసంపాదనము జేయుచుండిరి. ఆయన యొకదినమున మస్తాన్‌గారున్న గ్రామమునకువచ్చి యచ్చటి మహమ్మదీయులెల్ల మస్తాన్‌గారి మహిమనుగూర్చి స్తోత్రముసేయగా సహింపలేక నతని నిందించుచు నిరసించుచు ఆత్మభూషణము గావించుకొనసాగెను అంతట యుభయులకును సన్నిధి గలిగించు తలంపుతో నా పురవాసులు కొందఱు మస్తాన్‌గారున్నచోటికా మహమ్మదీయ గురువును తీసికొని వచ్చిరి. అమిత వాచాలుడగు నామతగురువు మస్తాన్‌గారి మౌన ముద్రను, నిమీలిత లోచనములను వికారస్వరూపమును వృద్ధాప్యదశను చూచి సులభముగా నతని తనమాటకారి

తనముచేత నోడింపవచ్చునను పేరాసతో విజృంభించి ఖురాన్‌నుండి తానువల్లించిన కొన్ని మంత్రముల చదివి వాని యర్థము చెప్పగలవాడని మస్తాన్‌గారిని ప్రశ్నించెను. అందుకు వానియర్థము తనకు తెలియదనియు, తెలియనక్కర లేదనియు నుత్తరముచెప్పగా మతావేశము తెప్పించుకొని అచ్చటనున్న మహమ్మదీయులకు నచ్చునట్లుగా గంభీరస్వరముతో కోపముతో "ఖురాన్ వ్యర్థమా" నీవు మహమ్మదీయుడవుకావా? కాఫర్ వా? అనిగద్దించెను. దానికి మస్తాన్‌గా రుత్తరముచెప్పక కనులుమూసుకొనెను. అచ్చటనున్న వారిలో మస్తాన్‌గారి మహిమనెఱింగిన వారు కొందఱు "అయ్యా! మస్తాన్ పండితుడు కాకపోవచ్చునుగాని అతడు మహాయోగి మహిమగలవాడు" అనిచెప్పిరి అంతట నామత గురువు కోపోద్దీపితుడై, "ఈమహిమలు యీయోగము వట్టి టక్కరితనముగాని నిజముకాదు నిజమైన దైవభక్తిగలవాడు ఖురాన్ వల్లించి అందుల ధర్మముల పెద్దలవలన తెలిసికొని ఆధర్మముల నాచరణలోపెట్టి దేశసంచారముజేసి మతవ్యాప్తి గావించవలెను. అదియే ప్రవక్తగారి సందేశము" అనెను. ప్రవక్తగారి సందేశ మెట్టులుండినను ప్రత్యక్షముగా గానుపించుచుండు మహిమల విచారింపవలదా? ఆమహిమ లట్టుంచుడు. భక్తియన భగవానునియందు విడివడని యనురాగము. భగవానుడు విశ్వస్వరూపుడు అట్లగుటచేతనే యొకభక్తు డిట్లు భగవానుని వర్ణించినాడు.

క॥ విశ్వము నీలోనుండును
విశ్వములోనుందువీవు వేరుపడక నా
విశ్వమునీవే నివే
విశ్వము భేదంబులేదు వీసంబైనన్ ॥

ఇదికాక శ్రీవిష్ణు సహస్రనామ భాష్యమున విశ్వ నామమున కిట్లుత్ప త్తిదెల్పినారు—

సీ॥ బ్రహ్మకారణము ప్రపంచానికా కార
ణము కార్యమును యభిన్నంబయగుట
సగుణ నిర్గుణ శూన్యసంగతి విశ్వంబు
విస్తరిల్లుట సర్వ విశ్వశబ్ద
ములు సమనార్థకం ♦ బులఁబ్రవర్తిల్లుట
బ్రళయంబునను భూత ♦ పఙ్క్తి బ్రహ్మ
మందుఁ బ్రవేశింప ♦ నలకారణ ప్రభూ
తంజగు బగము స ♦ ర్వంబునందు

గీ॥ జీవరూపంబునను బ్రహ్మ ♦ చేరియుంట
బ్రహ్మశబ్దంబు నీయందు ♦ వర్తిలుటను
విశ్వనామంబు నీకగు ♦ వేదవేద్య
రమ్యగుణసాంద్ర శ్రీరఘు ♦ రామచంద్ర ॥

కనుక భగవంతుడు విశ్వస్వరూపుడనుట నిర్వివాదాంశము. భక్తుడు భగవానునియం దనురాగము గలవాడనిన విశ్వమునందనురాగము గలవాడనుట. విశ్వమునంతయు నారాధించు భక్తుడొక మతబద్ధుడగునా? మతబద్ధుడేయైన చో నిష్కామియై మెలంగుటకు వీలులేదు. ఎందుకన మతవ్యాప్తి

చేయుటగూడ నొకకోరికయై యుండును. గనుక అందునుంచి భక్తు డన్ని మతములందును సమానభావముంచి స్వపర భేదములెన్నక, స్వాభిమానరహితుండై విదేహుని యట్ల మెలంగుచు, తనకు ఫలాభిరతి లేకుండినను లోకోద్ధరణమునకై కర్మము లాచరించుచుండును. కోపమును వీడినవారికి మాత్రి మీమహాత్ముని సాధుత్వ మెఱుంగబడునని యచ్చటనుండు ప్రవక్తలలో నొకరనిరి. దానికి మఱింత కోపించి కాఫరుల శాస్త్రములతో మాకు పని లేదు. ఏమహమ్మదీయుడు హిందూమతానుసారము వర్తించి స్వమతమున కపకీర్తి గలిగించును. మీతో మేము వాదులాడుటకు రాలేము నిజముగా మీ మస్తాన్ మహిమగలవాడే యయినచో, విదేహుడే యయినచో దృష్టాంతము చూపగలడా? వట్టిమాట లేనా? అట్లు చూపునెడల మేమును మీమస్తాన్‌కు శిష్యులమయ్యెదము. లేదేని మీరు మామతమును స్వీకరింపగలరా? యను ఖాదర్ గారి వాక్యములకు భయపడి, చాలామంది నిరుత్తరులై యుండిరి. గాని అందులో మస్తాన్‌గారి ప్రభావము సంపూర్ణముగా నెఱింగిన నొక హిందూవృద్ధుడు, 'అయ్యా ఆచారములు భేదముగానుండిన యుండవచ్చునుగాని యన్ని మతములవారికిని ధర్మశాస్త్ర మొకేరీతి నుండును. అనగా మా వేదమునకును మీఖురాన్‌కును భేదముండదు. జ్ఞానులన్ని మతములయందును గలరు. వారలందఱొకేధర్మము నాశ్రయించినవారై యుందురు. కీర్త్యపకీర్తుల లెక్కింపక యదార్థ మెఱింగి వర్తింతురు. మీకెట్లు వాదములో పనిలేదో అట్లే మాకును పని లేదు. నిజ

ముగా మస్తాన్ మహిమగలవాడే "విదేహుడే" దృష్టాంతము
చూడనెంచిన చూపగలడు. వట్టిమాటలుగావు. నిజముగా
వారిమహిమలు చూచినచో మీరు శిష్యులగుటకు వెనుదీయ
రని ఖండితముగా చెప్పగలను. మస్తాన్‌గారియందు మహత్త్వ
లేదని మీరు ఋజువుపఱచు నెడల నేను మీ మతమును స్వీక
రించుటకు సిద్ధముగా నున్నా, నని చెప్పి నిలచిన, ఖాదర్ గారు
చిరునవ్వు నవ్వుచు, దృష్టాంతము చూడ మనియెదవా? మస్తాన్
గారిని పరీక్షించుపట్ల ప్రమాదము సంభవించిన నేను జబాబు
దారుడనుగానని చెప్పుచు, నొక్క పెద్దపాత్రను తెప్పించి
దానిని తైలముచే నింపి పొయియందుంచి సలసలకాచి, ముం
దా కాగుచున్న తైలము కొంత తెప్పించి సమాధిమగ్నులై
యున్న మస్తాన్‌గారి దేహముపైన పోయించెనుగాని, దాని
కా పురుషోత్తముడు చలింపలేదు. సమాధి నిష్టాగరిష్ఠులకు
దేహభ్రాంతి నశించుటచే నాసమయమం దెట్టికష్టములపాల్గా
వింప నెంచిన నవియన్నియు నిరర్థకములై పోవును. కనుక నే?
మున్నొకపరి శ్రీరామకృష్ణ పరమహంసగారు నిర్వికల్పసమాధి
యందు నిలచియుండ మూఢాగ్రేసర చక్రవర్తి యొక్కం
డెరుదెంచి, పరమహంసగారి స్థితి కపటంబని తలంచి, నిజమెఱుంగ
నొక యినుపకమ్మి నెఱ్ఱగ కాల్చి తెచ్చి పరమహంసగారి తొడ
యందుంచెనట. ఆకమ్మి నావరించియున్న హవ్యవాహనుడు
శ్రీవారితొడ నంగుళములోతువఱకు కాల్చినాడట అట్లు తన
తొడ కాలిపోవుచున్నది పరమహంసగా రెఱుంగరు. ఆక్రూర
కార్యము గావించిన మహానుభావు డాచిత్రమునుగాంచి

యపడి, పరమహంసగారు సమాధినుండి లేచువఱకందు గారుచుండియుండి వారు బహిర్ముఖులగుడు తనతప్పు నెఱిం ంచి క్షమాపణము గోరిరట. అంతవఱ కెందుకు? బ్రహ్మశ్రీ పతాప కోటయ్యశాస్త్రిగారు సమాధియందున్నపుడు చీమలు దేహమంతటను వ్యాపించి సంచరించుటగాక నప్పుడప్పుడు సర్పములుగూడ వారి దేహమందు చుట్టుకొనియుండునని చిన్నవ నంచయ్యగారు చెప్పుచుండువారు. అట్లే మస్తాన్‌గారి యందు హావ్యవాహానుడేమియు తన నైజకృత్యమును జూపి యుండ లే... అట్లు మస్తాన్‌గారు చలింపకుండుట ఖాదర్‌గారు గాంచి, నూనె బాగా కాగలేదని దలంచి, నిరుత్సాహముఁ గొనక తిరిగి నూనె మిక్కుటముగా కాయించి, తప్తతైల మును తెప్పించి యాపాదమస్తకము మునుంగునటుల పోయిం చెను. అప్పుడుగూడ మస్తాన్‌గారు చలింపలేదు. చలింపక పోవుటగాక, దేహమున బొబ్బలెక్కుటగాని కందుటగాని చివ ఱకు నైజకాంతినుండి విడివడుటగాని జరుగలేదు. ఏమి చిత్రము! మున్ను హిరణ్యకశ్యపుడు తప్తతైలమున ముం చిన, నిర్బాధకుడై చెలంగిన ప్రహ్లాదునికైవడి మనమస్తాన్ గారు ప్రకాశించిరి. దానితో ఖాదర్‌గారికి భయాశ్చర్య విషాదములు ముప్పిరిగొనినవి. మస్తాన్‌గారికి కోపమువచ్చి తనను శపింపఁగలడని శంకించుచు, వారు సమాధినుండి లేచు వఱకు వేచియుండి సమయమరసి తనతప్పును వెల్లడించి క్షమాపణగోరుచు, శిష్యునిగా స్వీకరింపఁ బ్రార్థించెను. ప్రత్యక్ష శిష్యబృందమును సేకరించి తద్వారా నిజకీర్తి చంద్రి

కల లోకమంతయు వ్యాపింపజేయవలయునను కోరిక లేనివా డగుటచే, సమాధానము చెప్పక ప్రసన్నదృష్టితో వానిని దిలకించెను.

మస్తాన్ గారెందఱికో గురువుగానుండెనుగాని వారికి మాత్రి మొక్కడేని శిష్యుడు లేడు. తన నడవడి ననుస రించి మానవులు కృతార్థులగును గాకయని సమ్మోవాడగుటచే ప్రత్యక్షశిష్యులను చేర్చ లేదు. మదార్ పిన్నటనుండియు, తన ననుసరించి కష్టములకోర్చి నిరంతరము సేవజేయుచు దిరుగు చుండినను పరతత్వ మిట్టిదనిగాని, నీవిటుల చరింపవలయునని గాని వాగ్రూపముగా నెప్పుడును చెప్పియుండలేదు.

ఖాదర్ గారిట్లు మస్తాన్ గారిచే ననుగ్రహింపబడి శ్రీవారి యాజ్ఞానుసరణి స్వదేశమునకేగి తానుచూచిన యద్భుతవిష యము లాదేశమంతటను వెల్లడిజేసిరి.

ఈఘనుడెవరేపని జేయుచుండినను తానును వారితో గలసి నాయాపనులు జేయుచుండువాడు. వీరికి పీపాలుకొలది సారాయిత్రాగు నాచారముగలదను కింవదంతి కలదుగాని, విచారించిన నీనింద విరోధులుకొందఱు గలిగించియుండినట్లు తెలియవచ్చినది గాన నిజముగాదు. అష్టసిద్ధుల గడించిన వారిలో ప్రథములు. వీరు గుంటూరులో సిద్ధిబొందిన దివస ముననే సామాన్యముగు మానవాకారముని చుట్టుపట్టులనుండు గ్రామములలో బొడసూపి, 'నేడు గుంటూరు నల్లమస్తాన్ సిద్ధి బొందినాడు. అందుచే నక్కడ గొప్పయుత్సవము జరుగ నున్నది. ఆయుత్సవమును దిలకించుటకు నేనుబోవుచున్నాను.

అని అన్ని గ్రామములలో నొకేపర్యాయము జెప్పినట్లాయుత్స
వముఁజూడ నేతెంచినవారు వెల్లడించినారని ఆయూరిలోని
పెద్దలు చెప్పుచున్నారు.

వీరు సిద్ధిబొందుటకు ముందైదురోజులుగా మే నెల యిర్వదిమూడవతేది పగలు పదిగంటలకు నేనీదేహము చాలించెదనని ప్రకటించుటచే నాదివసమునకు తదుత్సవదిదృక్షాపేక్ష త్వరపెట్ట పలువురు ప్రేక్షకులరుదెంచి మస్తాన్‌గారిని దర్శించి శ్రీవారు సుఖముగానున్నటుల నెఱింగి నిర్ణిష్టకాలమున కెదురు చూచుచుండిరి పదిగంటలయినది. తనపాదసేవజేయుచు గూరుచునియున్న మదారుగారికి తనపొకడ చేసన్నతో నెఱిగించుచు పరమపద మలంకరించిరట. ఆచిత్రము కనులారాఁజూచి ప్రేక్షకులాశ్చర్య విషాదములకు లోనైరనుటలో వింతలేదుగదా!

ఈవార్త యచిరకాలముననే వ్యాపించిపురమునంతయు విషాదమున ముంచివేసినది. మస్తాన్‌గారు జ్ఞానులైనను జాతిన మహమ్మదీయులగుటచే మహమ్మదీయ మతానుసారముగ సమాధిజేయుట మంచిదనియెంచి, శ్రీవారిసమాధికి నగరం పిచ్చయ్యగారు సమర్పించిన స్థలమున సమాధిపనులు సాగింప నెంచిన యారోగ్యశాఖాధికారరుదెంచి పురసామీప్యమున శవశరీమును పూడ్చివేసిన పురవాసుల కనారోగ్యము కలుగును గాన వీలులేదనియు నిర్ణిష్టస్థానమున ఖననము గావింపవలయు ననియు చెప్పుచు నిరోధించిరి. ప్రభావసంపన్నుడగు మస్తాన్ గారి శవము సామాన్యమానవ శవమట్లు స్మశానమున బూడ్చుట కిష్టము లేక పురిలోని హిందూ మహమ్మదీయులందరు

తహతహ జెందుచుండిరి. పగలు నాలుగుగంటలయినది పొద్దు లేదు. సమాధివద్ద జరుగవలసిన క్రియలనేకములుండుటయే గాక రాత్రియైన నన్యగ్రామములనుండి రాబడినప్రేక్షకులకు తగినయేర్పాట్లు చేయకుండుటచే వారు భోజనాదులకిబ్బంది పడవలసివచ్చునని గూడ నాయకులు పశ్చాత్తాపపడుచుండిరి. ఈలోపల కారణములేక నాఆరోగ్యశాఖాధికారికి కుక్షిశూల సంభవించి బాధపెట్టుచు గిల్‌దారగారివలన ప్రబోధింపబడి తనవ్యతిరేకాభిప్రాయమును సవరించుకొని యారోగ్యపూరి తుడాయెను. వెంటనే సమాధికార్యములు ప్రారంభించి యచిర కాలముననే పూర్తిగావించిరి. తోడనే సుగంధద్రవ్యములతో నాగర్తము సగమువఱకు నింపబడెను. ఆగర్తమున మస్తాన్‌గారి కళేబరమునుగూరుచుండబెట్టి మహమ్మదీయ శాస్త్రానుసరణి క్రియలగావించి యావఱకాకళేబరమునకు గప్పియుంచిన వస్త్రముదొలగించి చూచిన యాకళేబరమున ప్రేతకళలే బ్రహ్మతేజము విజృంభించి చిరుచెమటల నొప్పియుండుట ప్రేక్షకులెల్లరు గాంచి యానందనృత్యము గావించిరి. 23-5-1895 తేదీన నాగర్తముపైనొకపరుపుబండను పఱచిదాని పైచిత్రవిచిత్ర కట్టడములకట్టించి పూర్తిగావించి గుంటూరు పురవాస్తవ్యులు కృతార్థులైరి. ఇది భక్తిలతా గ్రంథమాల నుండి సంగ్రహింపబడినది.

అమరవాది

శ్రీ కాకళ్ళ రామానుజాచార్యులుగారు

గీ॥ అవని రామోత్సవ ప్రక్రియావిధాన
మాగమోక్తానుసారంబు గాగ్రహించి
రామచంద్రున కర్పించి గోముగనిన
అనఘు వెంకటరామాను జార్యుగొలిచి
రామచంద్రుని గాంతుదు ర్భవమడంతు ॥

భగవానుఁ డెట్లువాఙ్మనస గోచరుఁడో భగవన్నామ మట్లే అవాఙ్మానస గోచరము తెలిసినదైనను తెలియకయైనను భగవన్నామసంకీర్తన గావించిన వారిపాపములు జలమునందుంచిన లవణమువలె హరించిపోవును. భగవన్నామమునందు బుద్ధి నుంచువాఁడు నరక మనుభవింపఁడు నామకీర్తనాపరునకు స్వర్గ సుఖముఁగూడ స్వల్పాతిస్వల్పమే. ఘోరకిరాతులైనను భగవత్స్మరణమువలన ముక్తినందెదరన బుణ్యాత్ములమాట జెప్ప నేల? అగ్ని నార్పుటకు నీరును చీకటిని బోగొట్టుటకు సూర్యుఁడును చాలియున్నట్లు, పాపముల నశింపజేయుటకు భగవన్నామము చాలియున్నది. రోజున కొక క్షణకాలమైనను, నిశ్చలచిత్తముతో భగవన్నామము జపించినవారికి శాశ్వత సుఖము లభించునని స్వానుభూతిపరు లనుచున్నారు. ఇక

సర్వకాల సర్వావస్థలయందును, విడువక జపించు వారి కెట్టి యుత్తమస్థితిలభింపగలదో ఎఱింగింప నేరితరము.

భగవంతుని పాదముల కొక నమస్కారము జేసిన పది యశ్వమేధముల యవబృంధములతో సమానమైనదట గాని యజ్ఞముల ఫల ముత్తమజన్మలకు గారణ మగును. గాని జన్మరహితస్థితి గూర్పలేదని తెలిసినవారగుట నాచార్యులవారు రాకపోకల నరికట్టి జాలిన శ్రీరామనామము నాశ్రయించి తరించినారు.

గోలకొండ రాష్ట్రము ఔరంగజేబుచే భంగపడిన యనంతరము పదియు నేడవ శతాబ్దియందు భద్రాచల మొక జమీందారుచే పాలింపబడుచు, శ్రీరామ కైంకర్యములు కొడవడక జరుగుచువచ్చినవి. ఈ జమీందారు పేరుగాని, వంశముగాని తెలియబడదు. ముందు దెలిసికొనదగిన యాధారములుగూడ నెక్కడను ఎట్టివియు గనుపించుట లేదు. ఈ క్షేత్రమున అమరవాది కామళ్ళ వెంకటరామానుజాచార్యుల వారను దివ్యపురుషులు జన్మించిరి. తల్లి దండ్రుల పేర్లు తెలియవు విచారించిన నీ వంశమువా రిప్పటివఱకును భద్రాచలముననున్నట్టి వినికిడి ప్రయత్నించి ముందు బాఠక లోకమున కెఱింగించుభాగ్యము లభించుగాక ద్వితీయ, తృతీయ సంతానములు నష్టపడుటచే దల్లిదండ్రు లీ పిల్లవాడు జన్మించిన వెంటనే ! శ్రీరామున కర్పించిన నాతండు శ్రీరామానుగ్రహమువలన రామాభిషేకమునకు రాబడు గోక్షీరముల వలనను కొంతకాలము రామాలయమున బ్రతిదివసము విధిగా

వేయుచుండు వాయసబలి మెతుకుల వలనను క్షున్నివారణ జేసికొనుచు రామపాదతీర్థముచే దాహశాంతి గావించుకొనుచు దినదినాభివృద్ధి నందుచుండె.

ఈ మహాత్ముడు సహజ పాండిత్యపటిమ గలిగి సర్వకళా కోవిదుడైనాడు. గర్భాష్టమందుపనయన మైనది వయోవృద్ధి యైనకొలదియు రామభక్తి విస్తరించినది. సర్వకాల సర్వావస్థలయందు గూడ రామనామము మరచువాడుగాడు. అభినవ ప్రహ్లాదుడైనాడు నిద్రనుండి లేచిన వెంటనే కాల్యకృత్యములు తీర్చి షోడశోపచార విధుల రాము నర్చించి ప్రసాదము స్వీకరించి విజనస్థలము నాశ్రయించి భగవద్విచారము జేయుచు దాను తరించి యాశ్రితుల దరింపజేయుచుండువాడు.

ఒకప్పుడు సంప్రజ్ఞాత సమాధియందుండు తరి శ్రీరాములు సాక్షాత్కరించిన దర్శించి ఆనంద బాష్పధారావిలసిత కపోలతలుండును గద్గదస్వర పూరిత గ్రీవాలంకృతుండును పులకీకృత సర్వాంగుండు నగుచు మైమరచి వినుతు లొనరించి నమ్రుడైన నిజభక్తునిగాంచి ప్రభువు వత్సా! మదుత్సవ ప్రక్రియ నంతయు నాగమశాస్త్రోక్తవిధి బొందుపరచి మూల గ్రంథమునకు ఖండవరసలిఖించి మదీయాభిలాష నెరవేర్చుమని విన్నవించి యంతర్హితుండైన బండితవర్యుల కలవిగాని యేతత్కార్యము బూర్తిగావించి తన సహజపాండిత్య ప్రకర్షను వెలయించినాడు. మన ఆచార్యులు యీ యుత్సవ ప్రక్రియ ననుసరించియే? నేటికిని భద్రగిరియందు శ్రీరామోత్సవములు జరుగుచున్నయవి.

ఒకప్పుడు ధర్మకర్త స్వామిదర్శనమునకు వచ్చినపుడు తన కాచార్యులు తగు మర్యాద జేయ లేదని కినిసి తన పాలన క్రిందనుండు గ్రామములయం దెక్కడను నిలువరాదను క్రూర శిక్ష విధించిన జేయున దిలేక రామాజ్ఞనంది భగవద్విశ్లేషమున కోరుచు పాలవంచ జేరి మృత్తికతో సీతారామమూర్తుల నిర్మించి ప్రాణప్రతిష్ఠకళావాహనాదులు గావించి పెక్కు రీతుల నుతించి స్తుతించి సుముఖుని గావించుకొనిన రామ మూర్తి సాక్షాత్కరించి పుత్రా, మద్వియోగమువలన నీ వెట్టి వెతగుడుచుచుంటివో ? నీ విశ్లేషమువలన నేనును తీరని పరితాప మొందుచుంటి నీవు లేని యీశూన్యగ్రామము నం దడుగిడక నిందయుండెద నని సెలవొసంగిన నాచార్యులు పరితృప్తులై భగవత్సేవా పరాయణులై యుండిరి.

మరుదిన ముదయమునకు భద్రిగిరి రామాలయమునం దర్చామూర్తులు లేమి తెలిసి తన యవ్యక్తమునకు పరితప్తుడై జమీందారు స్వయముగా పాలవంచకు బాదచారియై జని యాచార్యులవారి ప్రార్థించి క్షమింపుడని విన్నవించి సమ్మతి పరచి తెచ్చి భద్రగిరి జేర్చి ధన్యుడై నాడు.

ఒకప్పుడు యవనభటులు పలువురు భద్రిగిరి ముట్టడించి యాలయము ప్రవేశింప జూచుచుండిరని వినిన వాడగుట జమీందా రాచార్యుల సమీపించి రానున్న విపత్తు నెఱింగించిన తురుష్కులవలన నెట్టి యాపదయు రాదు వారు క్రూరకర్ములగుట బ్రజల హింసింపగలరేమో ? యని సంశయించుచుంటిని వారట్లు గావించిన గర్మశరీరము లను బంది

నాలనుండి విడివడిన వారమగుదుము అంతటి పుణ్యము నకు లభించునా? నిజముగ లభింపదు, ఎన్నాళ్ళు బ్రతికి ను మరణము తప్పదుగదా? భయమెందులకు కాదగిన ర్యము భగవానుడే!" తీర్పగలడు నిశ్చలులై యుండుడని ర్యముజెప్పి జమీందారుని బంపివేసి దానొంటరిగా కోనెల ప్రవేశించి భజన గావించుచుండె.

అంత యవనభటులు కోనెల యొద్దకి కలకలము లేవి వారించి యొకరిద్దరుమాత్రము దేవాలయములో బ్రవేశించి గాచిరిగాని అందువారికి విగ్రహము లగుపడలేదు. నిరీశ్వరా యమని తలంచి తిరిగివెళ్ళినారు. యవనబాధ యంతరించి ని. గోదావరీపరిసరసీమ ననుసరించి వెళ్లినారు. యవను దలు నాటనుండి నిర్బాధకముగా భగవదారాధన జరుగు న్నది.

పై విపత్సమయము ననుసరించి భయాతిరేకమున చార్యుల వారి కెఱుకబరపకయే అర్చకబృంద ముత్సవ యమును గౌతమీ నదియందొకచో, దాచి యవనుల బారి ండి తప్పించిరి. గ్రామము నిష్కంటక మైనవెంటనే తమీ ప్రవాహ మతిశయించుట నుత్సవమూర్తుల వెలికి యుటకు వీలుచిక్కినది కాదు. కొంతకాలము జరిగినది. ల్లువ తగ్గినది గాని దాచినచోట నామూర్తులు కనుపింప దు. నిష్కారణముగ నుత్సవబేరమును గోల్పడుట కడలుచుండ 'కనాడు కొందఱు రైతులు జమీందారునికడకేగి ప్రతిదివస ర్ధరాత్రియందు గోదావరి నీటినుండి యెవ్వరో! తన తమ్ముని

బిలచినట్లు శబ్దము వినవచ్చు చున్నది. యెంత బ్రయత్నించి నను వా రెవ్వరయినది తెలియవచ్చుట లేదు. అని చెప్పి వెళ్ళినారు. కారణమరయు తలంపున విచారించి ఆలయము నం దుత్సవభేరము లేదని తెలిసి అర్చకుల యవివేకమునకు జించించి గోదావరినుండి పిలుచువాడు రామమూర్తియని నిశ్చయించి మన యాచార్యుల కెఱింగింప నాతం డిట్లనియె. రాజా ! రేపు మధ్యాహ్నమున కుత్సవబేరము గోదావరి నీటిపై కేలియాడుచుండును కైకొనిరండన వారట్లుగావించి కృతకృత్యులైరి. కాని బేరమున సీతావిగ్రహమగుపింపలేదు. కారణ మెఱింగింపవేడిన రామచంద్రుడు, సీతను గౌతమి కొసంగినాడు. కాన నైజామురాష్ట్రమునగల ఫణిగిరి ఆల యమునుండి జానకీవిగ్రహమును గొనితెండని యానతిచ్చిన వారట్లే "కావించిరి. ఇది తెలిసి ఫణిగిరి ధర్మకర్తలు బలవంతు లగు జమీాందారులగుట నెత్తివచ్చి భద్రగిరి ముట్టడించిరి. నాటిరాత్రి ఫణిగిరి జమీాందారునకు స్వప్నమున శ్రీరాముడు సాక్షాత్కరించి నాయాజ్ఞమీాద జరిగిన సంఘటనమునకు నీవడ్డు గల్గింపలేవు, విరమించుకొమ్మని సెలవొసంగిన వాడట్లు గావించె, ఇప్పటి సీతావిగ్రహము ఫణిగిరినుండి తెచ్చి ప్రతి ష్ఠించినదియే" యని పాఠకుల కెఱింగించి సెలవర్థించెద. ఇట్లా చార్యులవా రమానుషప్రభావములజూపి తనడెబ్బదియవయేట బరమపద మలంకరించినారు.

అల్లూరి వెంకటాద్రిస్వామి

భగవంతుడు కరుణామయుడు, శాశ్వతసుఖమును గలిగించుటకై యధికారియగు జీవుని వెంటనంటి సమయమరసి జ్ఞానోదయభాగ్య మొదవించును. ఇచ్ఛామాత్రముచేతనే "తా నన్నిజీవుల నుద్ధరింప జాలినవాడే" గాని, తన యచింత్యలీలలచే మానవుని భక్తిమార్గమునందు బ్రవర్తింపజేసి యందాతడు కావించు స్వప్రయత్నములయందు దానంతరంగోపదేశకర్తయై భక్తునుజ్జీవింపజేయును.

ఈ రహస్య మెఱింగియే, "రామదాసాదిభక్తులు తీవ్రతమమైన భగవద్భజనలో బాల్గొని సులభముగ భగవదనుగ్రహము గడించినారు. భగవద్భజనలో బాల్గొనిన భక్తులకు గొంతవడికి సప్రయత్నముగా దద్భజన నిలచిపోయి కనిపించని యెఱుంగని దుఃఖమునమునిగి మఱికొంతవడికి దశదిక్కులు భగవన్మయములగుటచే దుఃఖమునవ్వగా" మారి యా వెనుక నాత్మజ్యోతి పొడగట్టుటచే సంతోషాతిశయమున, గంతులువేయుచు నావల భగవద్భావావేశాధీనుడై తద్గుణకీర్తనమున బ్రారంభించి సాగించి అదియు నప్రయత్నముగ విరమించి భగవద్గుణగణోపాపన్యాసమున మైమరచి సంప్రజ్ఞాతసమాధిలో నిష్టమూర్తి దర్శనములభింప భక్తుడు కృతకృత్యుడగుచున్నాడు.

ఇట్టి భజనానందమున స్వానుభవపూర్ణుడు శ్రీ అల్లూరి వెంకటాద్రిస్వామి ఆరువేల నియోగి బ్రాహ్మణుడు జననము క్రీ. 1862 సంవత్సరములు. జననస్థలము కృష్ణామండలములోని

వరిటాలజెంతగల అల్లూరగ్రహారము. శ్రీవత్ససగోత్రము. తండ్రి వెంకయార్యుడు. తల్లి వెంకమాంబ. ఈతడు పంచవర్ష ప్రాయమునుండి ఆగ్రామమున వేంచేసియుండు నృసింహ స్వామివారికి భక్తిప్రపత్తు లుల్లసిల్ల బుష్పమాలా కైంకర్యము జేసి పూజించి భజనగావించి యానందించుచుండువాడు.

ఈ కాలమున జరిగిన విచిత్రభగవల్లీల వినిపించి ముందున కేగెద. స్వామివారు గోపాలురతోఁగలిసి తన పెంపు డావును మేపికొనివచ్చెదనని దలంచి తలిదండ్రులతో జెప్పకయే బీటికి జని పసిపిల్లవాడగుట నావును బీటవిడచి యొక పొదరింట బండుకొని నిద్రించెను. ఆసమయమున సూర్యుడు తీవ్రరూపము వహించి ప్రకాశించుట నెండవేడిమి మనస్వామి వారి మొగమునకు దాకినది కందిపోయినది ఆ వేడిమి నడ్డగించుటకుగాబోలు నల్లతాచుపా మొకటి జని, తన పడగచే స్వామి వారి మొగమునకు నీడను గల్పించినది. తోడి బాలకు లది చూచి భయపడి పరుగెత్తివచ్చి తలిదండ్రుల కెఱింగించిరి. వారును రోదనములతో గుండెలు బాదుకొనుచువచ్చి నిద్రించు పుత్రుని జూచిరిగాని సర్పములేదు, విచారింపగా బామిప్పుడే యీ మార్గమున బోయినదని గుర్తులు జూపిరి తోడిబాలురు. ఈ గోలతో స్వామివారు నిద్దురనుండి లేచి నారు ఆతని వెంటగొని గృహమునకేగుచు బ్రశ్నింప నిట్లనె నిదురలో నాకు కల వచ్చినది ఇద్దరు పురుషు లొకమంచి అమ్మాయిని వెంటగొని కోతితో వచ్చిరి. అందు బెద్దవా

డేమేమో! చెప్పగా! రెండవవాడు నా నాలుకమీద నేమే
మో! వ్రాసినాడు మెలకువ వచ్చినది. ఇంతకెక్కుడు నాకు
దెలియదని చెప్పినాడు తల్లి దండ్రుల యాశ్చర్యములతో
స్వప్నకథ ముగిసినది. దీనిఫలముగ సహజపాండిత్యమబ్బుట
బ్రత్యక్ష నిదర్శనము

గర్భాష్టమం బుపనయనమైనది. భక్తి విస్తరించినది
భజనలు మితిమీరినవి నమ్రభావమతిశయించినది సత్యదీక్ష
పెరిగినది. కామమంతరించి ప్రేమ విస్తరించినది వేయేల
మనస్వామి అపరప్రహ్లాదుడైనాడు శ్రీమాన్ తూము నర
సింహదాసుగారు భద్రగిరికేగుచు మార్గమధ్యమందు గల
ఆయూర నొకటి రెండు రోజులుండుట తటస్థించినది స్వామి
వారికి మహాపురుష సమాశ్రయ భాగ్యమబ్బినది. రామతారక
మంత్రోపదేశమిచ్చి తంబుర తాళము లొసంగి భక్తివిధాన
మును బోధించి దీవించి దాసుగారు భద్రగిరికేగినాడు.

చిత్తమా ? నీవు ధన్యతజెందనున్న
నియతిమై ప్రత్యహంబును నిదుర లేచి
మొదట రామజపంబూని పిదప రామ
నామసంకీర్తనము జేయ క్షేమమొదవు ॥

అనునట్లు వేకువ నిదురనుండి లేచి పడకయందు గూరు
చుండి మానసికముగ రామజపముతో మైమరచి సూర్యో
దయమునుండి కాల్యకృత్యముల నిర్వర్తించుకొని భోజన
భాజనముల మరచి రోజంతయు భజనానందమున దేలియాడు
చుండువాడు.

ఒకప్పుడు సీతాకళ్యాణమహోత్సవ దిదృక్షాపేక్ష బైకొన జననీ జనకులతో జెప్పకయే బయనించి భద్రిగిరిజేరి కళ్యాణరాముని సేవించి భజనానందపాథోధిమునిగి అందలి భక్తులసహాయముతో సంతర్పణముగించి రామకోటివ్రాసి పదిసంవత్సరములందుండి రామాజ్ఞగొని యెడనెడబయనంబుల నల్లూరు జేరి తల్లిదండ్రుల కాహ్లాదమొసంగినాడు.

స్వామివారి భజనకు రోజున కిరువదినాలుగు గంటలు చాలుటలేదు భాగవతసేవ మిన్నుముట్టినది. యావనసాంకురించినది తన వివాహప్రయత్నములో దలిదండ్రులున్నట్టు కనిపెట్టి నిష్కామియగుట దప్పకొననెంచి గరుడోత్సవవ్యాజమున దలిదండ్రుల సమ్మతిపై బయనము సాగించి తిరుమల వెంకటేశ్వరు దర్శించి యానందించి కంచిజేరి పెరుందేవీ సహిత వరదరాజస్వామిని సేవించి సంతసించి అందే నివసించుచు మధుకరవృత్తితో జీవయాత్ర సాగింపుచుండె.

కర్ణాకర్ణి తలిదండ్రులు పరమపదించినారని యెఱింగి బంధవిముక్తి కానందించుచు దేహపటుత్వమున్నంత కాలము భగవత్కైంకర్యముచే గాలము బుచ్చనెంచి దివసమున కథమపక్షము పదిరూపాయీలు జేరక భుజింపనని పట్టుబట్టి అనుయాయులు వెన్నంటనగరసంకీర్తనముతో గ్రామస్థులమేలుకొల్పుచు వచ్చిన ద్రవ్యముచే, గంచివరదుని కైంకర్యమున ముంచెత్తిన భక్తాగ్రిణి మనస్వామివారు.

మఱియు దన కఠినతర నియమమువలన జనించిన బహువిధ కష్టములకు లోనై అప్పుడప్పుడు భజనానందసం

జనిత సంప్రజ్ఞాతసమాధి ద్వారా లభించిన భగవదాజ్ఞాను సారము ద్రవ్యమార్జించి కంచివరదరాజస్వామికిని పెరుందేవి గారికిని బ్రత్యేకప్రత్యేకముగ రెండు పుష్పవనములును స్వామి వారిశయ్యాగృహమునందుంపదగిన పాలు, జున్ను పరిమళవిడి యము మొదలుగాగల శాశ్వతకైంకర్యములనే కాక గోపుర మండపప్రాకారాదుల జీర్ణోద్ధారణగావించి సన్నిధియారాధ నాదికార్యములకు మామండూరునం దైదువేలరూపాయిల విలువగల భూమిని స్వామివారి కర్పించి దివ్యరత్నమయంబైన వైరముడియు నుభయదేవేరులకు రత్నకిరీటములును, సమ ర్పించుటయేకాక గంచియందలి దివ్యస్థలముల జీర్ణోద్ధారణ గావించి భగవదాజ్ఞననుసరించి జక్రాంకితమహాభాగ్యమును గడించి అందుగల వైష్ణవలోకగురువైనాడు శ్రీస్వామివారు.

మఱియు నొకప్పుడు శ్రీరంగేశుడు సాక్షాత్కరించి బంగాళాదేశవాసియగు మాధవదాసుకడ నున్న మరకతమణి దెప్పించి మిగిలిన రత్నసంచయమును సేకరించి ప్రయత్నపూ ర్వకముగా "చాండియన్కొండె అను దివ్యకిరీటము దయారు చేయించి తనకర్పింపవలశినదిగా" నాజ్ఞాపించుకారణముగ బహు ప్రయాసకులోనై రత్నములును ద్రవ్యమును సమకూర్చి రంగ ని దివ్యకిరీటధారినిగా జేసెన ప్రత్యక్షరంగనాయకస్వామి వెంకటాద్రిస్వామి

తదుపరి ఆయాచితముగ శ్రీభూమతల్లుల గిరీటధార ణునుగా జేయుటయే కాక మకరకంఠిని సమర్పించి శ్రీరంగ నాథుని యభిలాషదీర్చినాడు. శ్రీస్వామివారి యారగింపునకై

అతిరసాదిపదార్థా సేకరణమునకు తిరుప్పళాతుడై అనుగ్రామము
తీసి శ్రీరంగేశుని కర్పించిన యౌదార్యశిఖామణి మనస్వామి
1 నెల్లూరి రంగనాయకాలయజీర్ణోద్ధరణము మహాబలిపురదివ్య
స్థలఖిలంబును జక్క జేసిన సజ్జనానందగామి మనస్వామి పిస్టోలు
పేలుటచే శ్రీవారి శిష్యుడగు వెంకటస్వామి నాయుడుగారి
కుమారునికి సంభవించిన నేత్రావరోధమును తొలగించిన
స్వామివారి పాదతీర్థప్రభావమేమని వర్ణింపనగు.

మఱియు ఒంగోలు తాలూకా నూనెవారిపాలెమునందు
వేంచేసియున్న స్వామివారి రథ నిర్మాణమునకొఱకు గొనబడిన
యినుపయిరుసులు సెంట్రల్ స్టేషనుకు జేర్చబడినవి లగేజీ
కార్యక్రమమందాలస్యమగుట రైలుసాగినది. అది చూచి మన
వెంకటాద్రి తలపంకించినాడు ఇతరకారణమేమియు లేకనే
ధూమశకటమాగినది. అంత నాయిరుసు లెక్కింపబడినవి.
హేతురహితముగ బండిసాగి గమ్యముజేరి చూపరుల కాహ్లా
దము గల్గించినది.

విల్లిపుత్తూరున వేంచేసియున్న ఆండాళమ్మ దేవికి
"రాజముడి కుంభప్రసాదముల సమకూర్చి సుందరరాజస్వామికి
దివ్యవిమానమర్పించి శ్రీరంగము జేరి ప్రియశిష్యులకు దంబుర
తాళములొసంగి రంగనారాయణజియ్యంగారిసన్నిధి సన్యసించి
"తిరువెంగడరామానుజజియ్యం" గారను ఆశ్రమనామధా
రియై చరమదశగ్రహించి అన్నలూరినారాయణదాసుగారిసమ
క్షమున 1877సం॥ ధాతవత్సర మాఘబహుళ సప్తమి అనూ
రాధనక్షత్రయుక్తసోమవారమర్ధరాత్రి విష్ణుసాయుజ్యమందిరి.

భక్తులెల్లను సన్నిధి మర్యాదలతో నూరేగింపుగావించి కొళ్లిడముతీరమున, "శ్రీ ఆళవందారుపడుత్తురై" సన్నిధి స్థలమున సమాధిగావించి యానందించిరి.

సీ॥ విఖ్యాతేధాతువర్షే దివసపరివృఢే
కుంభగేకృష్ణపక్షే
తిథ్యాంసప్తమ్యభిఖ్యాయుజశశిదివసే
మైత్రితారాసమేతే
శ్రీరంగే శాంఘ్రిపద్మేసతతవిరచితా
శేషకైంకర్యలక్ష్మ్యై
శ్రీమాన్ రామానుజాచార్యః పరమపదమగాత్
వెంకటాద్రీర్యతీంద్రః ॥



శ్రీ తుంగదుర్తి బుచ్చయ్యగారు

వెనుకటి జన్మమున బ్రహ్మవిద్య సాధింప యత్నించి గమ్యంబు జేరక దేహమువిడచిన వాడు మరుజన్మమున విధిగా దేశికాగ్రణి కృపకు బాత్రుడై యోగసిద్ధి గడించు చున్నాడు వీడు దేవతల కసాధ్యమయిన శాశ్వతసుఖసంపా దనా పరులలో మొదటివా డగుచున్నాడు సత్యసంధుడు ప్రతివిషయమును శాస్త్రదృష్ట్యావిచారించువాడు వేదవిహితా చారసంపన్నుడు స్వధర్మాచరణదక్షుడు ఈశ్వరచింత దప్పని వాడు ఆత్మశక్తిపూరితుడు నగుగృహస్థునకు పుత్రుడుగా పుట్టును ఈతనికి జన్మతోపాటు జ్ఞానోదయమగుచున్నది. బాల్యావస్థయందే యితనియందు సర్వజ్ఞత్వాదులు దోచు చుండును. వీనికి సమస్తవిద్యలు లభించును. శాస్త్రపరిచయ మధికమగును. వేయేల నిర్జరదుర్లభమగు మానవజన్మ వీనిదే యన సాహసముగాదు. అంజనధారి ధనరాసులు గనిపెట్టి నట్లు శాస్త్రరహస్యములన్నియు వీనికి హృద్గతములై కాను పించును కేవల గురూపదేశమాత్రమున సర్వసమర్థు డగు చున్నాడు.

శమదమములు వీని స్వాధీనములు మనస్సు వాయు వృత్తో నేకీభవించి చిదాకాశమునగలిసి సమరసపూరితమగును. అందువలన నీజన్మమునందు జేయు అభ్యాసము తోడ్పడి యీతని నీస్థితికి దీసికొనివచ్చును. ఇప్పుడితడు వేదవేత్త పూర్ణవైరాగ్యమూర్తి సుగంధచందనరూపి అష్టసిద్ధులీతని వరించినవి ఇట్టి వారలలో మన బుచ్చయ్యగా రొకరు.

వీరిజననము క్రీ 18వ శతాబ్దము జనస్థలము కురుచేడు వినుకొండతాలూకా. తలిదండ్రుల పేర్లు వివరముగ తెలియ వనియు ఏడవయేడు వచ్చులోపలనే మాతాపితృవియోగ మైనట్టు వింటామనియు నా గ్రామవాసులు చెప్పిరి. ఆగ్రామ మున సన్నిహితబంధువు లెవరును లేని కారణముచేతనో? మఱి యేహేతువు ననుసరించియో పిల్లవాడు డెపిసిబడి యొం టరిగా నెట్లో? చేజర్ల కబోదీశ్వరాలయప్రాంగణమున జేరియుం డుట పురివాసులాదరించి పోషింపుచువచ్చిరి. పగలంతయు బురిబాలకులతో నాడుకొనుచు నెందెందో? గుడుచుచు రాత్రికి కోనెలముఖమంటపమున బరుండుచుండువాడు గాని, బలవంతపరచినను గృహస్థులయిండ్లకేగువాడుగాడట ఎనిమి దవ సంవత్సరము వయస్సు దాటనున్నది.

కుంకలగుంట బసవయ్యగారు రఘుచెంచి బ్రహ్మతేజో పూరితుడై చేజర్లవీథులలో దిరుగు పిల్లవానిని జూచి చేరజీరి నీ వెవరిపిల్లవాడ వని యడిగిన గబోదీశ్వరుని కొడుకునని చెప్పి నాడు ఆమాటకు సంతోషించి యెత్తిముద్దిడుకొని మా యిం టికివచ్చెదవా? అని అడుగ దలయూచినాడు కొడుకులు లేనివాడగుట "బ్రాహ్మణబాలుడని తెలిసికొని దత్తపుత్రు నిగా మనస్సున సంకల్పించి చంకదింపకశ్లే తనయింటికి గొని పోయి కబోదీశ్వరప్రసాదమని చెప్పుచు భార్యకప్పగించినాడు ఆమెయు నౌరసునికివలె పోషించినది. ఉపనయనముగావించి చదువులబడికి పంపిరి సంవత్సరము దిరుగక పూర్వమే సమస్త విద్యాపారంగతుడైనాడు గాని, తలిదండ్రులుగాని యుపా

ధ్యాయులుగాని, తెలిసికొన జాలరైరి. బడికి సరిగా పోకపోవు టయేగాక నింట నల్లరిపనులు జాస్తిగా జేయుచుండువాడగుట దెలియరైరి గాబోలు ! భగవదనుగ్రహము గలిగి జన్మముతో నెన్నంటి వచ్చిన విద్యాబుద్ధులుగలవారికి జదువులబళ్ళేమిటికి? గురుబోధ లెందులకు? ఇవి యన్నియు నిరుపయోగము లే గదా? చదువు లేకపోయినను బ్రహ్మ తేజోసంపన్నుడగుట దనయింట నున్న జాలునని అన్నింటికి నోర్చి పిల్లని గంటికి రెప్పవలె గాపాడుచు బసవయ్యగారు పరితృప్తులగుచున్నారు.

ఇట్లుండ నొక రేయి నున్నట్టులుండి పిల్లవాడదృశ్యుడై నాడు. బసవయ్యగా రూరంతయు గలయ వెదకినాడు. బావులు, సమీపారణ్యములు రోసి ? రోసి ? ప్రయోజనము లేదని తలచి, పుత్రవియోగదుఃఖము బట్టజాలక మంచముబట్టి నాడు తండ్రి. వీరిస్థితి నెఱింగి గాబోలు, తలవనితలంపుగా, నొక రేయివచ్చి తండ్రి మంచముపై గూరుచుండి నిదురించు జనకుని లేపి "నాన్నా ? నీకేమి పిచ్చియా ? కబోదీశ్వరునాన మెలంగునాకై యడలవలదు. ఇంతటినుండి పంద్రెండువత్సరములు జరిగిన వెనుక నీ చేజెర్లనివాసినై జీవితాంతమువఱకు నిన్ను గనిపెట్టియుండెద. అడుగో! కబోదీశ్వరుడు. నిన్నారడింప వచ్చినాడు కనులు దెఱచిచూడుము, లెమ్ము. స్వామివారికి నమస్కరింపు" మని త్వరపెట్టిన, లేచి బసవయ్యగారు బిడ్డని కౌగలించుకొని కనులు తెఱచి కొడుకు జెంతనిలచియున్న తేజోమూర్తి కబోదీశ్వరుని తిలకించి మంచమునుండి లేచి

నమ్రుడై నమస్కరించి, స్వామివారి పాదములబడి "నాకీ పుత్రి వియోగదుఃఖము గట్టిపెట్టదలచితివా ? నీ సంకల్పమెట్లో అట్లే జరుగుగాక ! అద్భుతపురుష నే నెంతవాడ ! అజ్ఞాని నగు నాకు మీదర్శనభాగ్యమబ్బినది. చాలు. ధన్యుడ. కోరి నప్పుడు వీడు నాకంటబడునటుల మాత్రము వరమిమ్ము. చాలు. దాన దృప్తుడ నయ్యెద" నన, "అట్లే యగుగాక!" అని చెప్పుచు నీశ్వరుడు పిల్లవానితో నదృశ్యుడై నాడు.

ఇంత మనబుచ్చయార్యులు శ్రీగిరికేగి కాయల గడ్డలమెసవుచు నారువత్సరంబులు తపంబుండి, యేడవవర్షమున జనన స్థలమగు కుసుచేడు జేరి యొక దేవాలయమున నివాసము జేసినాడు. ఆ గ్రామ వాసియగు అయ్యవారప్ప శాస్త్రిగారు దర్శించి బుచ్చయ్యనుగాంచి నమస్కరించి "గత రాత్రికలలో నొకదివ్యపురుషు డగుపడి తపస్సంపన్నుడగు తుంగదుర్తి బుచ్చయ్య, దేవాలయ ప్రాంగణమందున్నాడు. పూర్వమతడు మీగ్రామవాసియే ? మీదగ్గిరబంధువుగూడ ! సబహుమానముగ నాతని దోడ్తెచ్చి, యతిథిసత్కారము గావించు" మని చెప్పి యంతర్హితుడై నాడు గాన, దయయుంచి నా గృహము పావనముజేయుమని వేడుకొని సమ్మతింపరచి తన యిల్లుజేర్చి యతిథి సత్కారమున దృప్తుని గావించె.

ఈ అయ్యవారప్పశాస్త్రి ప్రాణాయామ సిద్ధిగడించిన పుణ్యమూర్తి. మహాతపస్వి. వీరికి ముగ్గురు కొడుకులు గలరు. వారిసంతతి యిప్పటికిని కురుచేడునందు గలదు. మన బుచ్చ

యార్యులు శాస్త్రిగారింట గొన్ని దివసము లుండి బయలుదేరి చేజెర్ల బోనున్న తరి శాస్త్రి అడ్డగించి నాకెనుబది యేండ్ల వయస్సు కొద్దిరోజులలో శరీరముజాలింప దలంపు గలదు. (శరీరము జూపి) "దీని కావలకంపి పయనింపుడన నిప్పు డది జరుగదు. తిరిగి నచ్చెద. అప్పుడు నాసమక్షముననే జరుగును" తప్పదని చెప్పి, పయనించి చేజెర్లకబోదీశ్వరుని దర్శించి, పాలకతండ్రికడ కొన్ని దినములుండి సెలవుగొని శ్రీశైలమున కేగి తపంబుండె.

ఇట్లుండి యొకనాడు భ్రమరాంబా దర్శనమున కేగిన తరి అంబసాక్షాత్కరించి బింబము కదలినది. తిరిగి ప్రతిష్ఠించు మని యాజ్ఞాపించిన వల్లెయని ఆత్మకూరునుండి విప్రుల రావించి బింబమును సమంత్రకముగ స్థానమునుండి తొలగించి సక్రమముగ బునశ్చరణ జరిపించిన తమపరి యెక్కువగా ద్రవ్య మిచ్చిననే సహాయమిచ్చెదమని విముఖులైన బ్రాహ్మణుల కోడుగొనకనే తన తపఃప్రభావ సహాయమున బింబమును నిల్పి ప్రతిష్ఠా కార్యము బూర్తిచేసినాడు. ఇప్పుడర్చించు భ్రమ రాంబాబింబము బుచ్చయార్యులచే బ్రతిష్ఠింపబడినదే యని చెప్పుచున్నారు.

ఒకతరి భ్రమరాంబ సాక్షాత్కరించి కబోదీశ్వరాలయ మున దేవీప్రతిష్ఠ గావించి ధన్యుడవగు మని యాజ్ఞాపించిన నాడే పయనముసాగించి చేజెర్లజేరి ఈశ్వరునకు భ్రమరాంబా యానతి నెఱింగించి తదీయాలయమున పార్వతీప్రతిష్ఠ జరిపించి త్రికాలవేదియగుట తద్వారా లోకసేవజేయుచు జీవయాత్ర సాగించినారు మనబుచ్చయ్యగారు.

ఇతని కాకాశగమనాది సిద్ధు లుగ్గుబాలతో నలవడిన నగుట నే పుణ్యక్షేత్రములందుండినను శివరాత్రి లింగోద్భవ కాలమునకు గభోదీశ్వరాలయమున తప్పక ప్రత్యక్షమగుచుండు వాడు. ఇట్లే కాశీ, దక్షిణకాశీ, రామేశ్వరము శ్రీశైలము, మొదలగు దివ్యక్షేత్రములయందు శివరాత్రి లింగోద్భవము నకు సరిగా బ్రత్యక్షమగుచుండు రనిగూడా పలువురు చెప్పు చున్నారు. ఇట్లే ముక్కోటిపుణ్యదినమున భారతదేశమునంగల విష్ణుక్షేత్రములయంతటను బ్రత్యక్షమగుచుండిరట వీరిజపస్థల ములు 1. కభోదీశ్వరాలయము 2 గుత్తికొండబిలము 3. శ్రీశై లము. పూర్వమిడిన వాగ్దత్తానుసార మెక్కడనుండినను, నెల కొకసారి యైనను వచ్చి తండ్రిని దర్శించి పోవుచుండువాడు. సహజపాండితీ గరిమ విరాజిల్లువాడగుట నాధ్యాత్మికభావ పూరితములగు గేయములను శ్లోకములనుబాడి శిష్యలోకము నానందింపజేయు ప్రత్యక్షసచ్చిదానంద పరబ్రహ్మమని పేర్వ డసిన పుణ్యమూర్తి. అయ్యవారప్పశాస్త్రి గారి కిడిన వాగ్దత్తా నుసారము తన దివ్యసమక్షమున దేహయాత్రముగింపించి క్రీ॥శ॥ 18-19 శతాబ్దములసంధి కాలమున దేహము జాలించినాడు. శ్రీవారిసమాధియొద్ద ప్రతియేటను వార్షికోత్సవ మతివైభవ ముగ జరుగుచున్నది.



కృష్ణానందావధూత

లక్కవరము శివారు, నాగభొట్లపాలెము, నెల్లూరుజిల్లా.

భగవంతునికి రూపములు మూడు 1. అరూపము, 2. విశ్వగర్భస్వరూపము, 3. విశ్వరూపము. విశ్వరూపము అగు నదు ప్రపంచము మనమందఱ మీవిశ్వరూపములోని వారమే! మనము, నిరంతర మాచరించు కార్యకలాపము లన్నియు విశ్వమునకు సంబంధియున్నవియే. ఇట్లగుట విశ్వరూపోపాసన మత్యంతసులభము సుకరమునుగూడా విశ్వగర్భోపాసనకు ముందుగా నహంకార, మమకారముల వదలి ప్రయత్నింప వలయు. భగవద్దర్శనమున కేగెడి బ్రతికోనెలముందును బలిపీఠ మును దర్శించి, అందు మనయందుండు అహమ్మల నాపీఠమునకు బలియొసంగి కోనెలలోని కేగి స్వామిని దర్శింపవలె. లేకున్న దర్శనభాగ్యమువలన లభించుఫలము శూన్యంబగునని దాని భావము. దీనిరహస్యమేమి? ముందహంకార మమకారముల వదలి విశ్వగర్భోపాసన జేయవలయును ఇది అసాధ్యమైన పని గదా? విశ్వమునందు భగవద్దృష్టి నలవరచుకొనుచు నుపాసన ప్రారంభించిన గ్రమముగ నహంకార మమకార లడంగి నిర్వికారానుభూతి లభించి సాధకుడు కృతార్థుడగును. ఇట్టి సాధన యలవరచుకొని స్వప్రయత్న మేమియు లేకయే.

క. లోకంబులు లోకేశులు

లోకస్థులు తెగినతుది నలోకంబగు పెం

జీకటి కవ్వల నెవ్వం
డేకాకృతి వెల్గు నతని, నే సేవింతున్ ॥

అనునట్లు, ఇంద్రియములు ఇంద్రియాధిదేవతలు ఇంద్రి వృత్తులుగూడ నశించి నిర్వికల్పసుఖమును గడించిన పావన మూర్తి మన అవధూతస్వామి.

ఈతడు క్రియాద్వైతియగుట విధినిషేధదూరుడు. అష్ట సిద్ధు లీతని వెన్నంటియుండు. సర్వప్రాకృతికవిద్యలు పీఁ గరస్థములు.

సీ॥ ఒకవేళ దనయందు సకలప్రపంచంబు
గల్పితంబని యెంచి కాంచినవ్వు౯
ఒకవేళ సర్వభూతోపాధితతి యందు
దనుజూచిమిగులసం తసము జెందు
ఒకవేళ దేహాదు లొప్పుగావి హరింప
సర్వసాక్షినటంచు సంభ్రమించు
ఒకవేళ నన్యమిం చుకలేదొకండనే,
న, ని నిర్వికల్పస మాధినందు ॥

గీ॥ లిప్తమాత్రింబ విద్యానిర్లిప్తమాత్రు
డయిన ఘను నెన్న లేరు బ్రహ్మాదులనగ
క్షణము సర్వజగద్వ్యాల క్షణతనందు
వాసినుతియింప దరమె యె వ్వానికైన ॥

వీరు 18వ శతాబ్దమున నెల్లూరుమండలమునందలి లక్కవరము శివారు నాగభోట్లపాలెము జేరినారు, వీరి తలిదండ్రులెవరో, ఎక్కడుండినారో ! తెలియదుగాని, బ్రాహ్మణుడనియు, వేదవిదుడనియు మాత్రము దెలియుచున్నది.

భోజనభాజనములలో వర్ణభేదమును గణించువారుకారు. దేహాపేక్షను వర్ణనాతీతము దెబ్బదవపడికిమించినవాడయినను దినమునకు మూడామడ నడచు సామర్థ్యముగలవాడు లక్కవరప్రమల్లపరాజుగారు శివరాత్రిమహోత్స దిదృక్షాపేక్షబైకొన శ్రీశైలయాత్రకు బోనెంచి ఆశీర్వాదముగైకొన నవధూతను సమీపించి నమస్కరించి నిలచిన జూచి "ఏమీ ! నీవు శ్రీశైలమునకేగ సంకల్పించివచ్చితివా ? మంచిది. పోయిరమ్ము. మల్లికార్జునస్వామివారికి నానమస్కారముచెప్పు" మనిన అవధూతగారి వాక్యముల కబ్బురపడి "దేవా! సన్నిధికేగి నకారణమునేజెప్పకయే తెలిసికొని యాశీర్వదించితిరి. మీ ప్రభావమబ్బురము. సాక్షాన్మల్లికార్జునులైన మీకు దెలియరాని దేమియుండును!'' అని అవధూతగారిని బొగడి యనుజ్ఞవడసి, కొందఱి మిత్రులతో నెడనెడ ప్రయాణంబుల నైదవదివసమునకు శ్రీగిరిజేరి, ధూళిదర్శనము కొఱకాలయాధిపతుల నాజ్ఞవడసి గుడిలో బ్రవేశించిరి. అవధూతగారును దేవునిదర్శించి మల్లపరాజున కెదురేగిరి.

అవధూత చిఱునగవుతో "ఎంతసేపైనది ? ఎవరెవరు వచ్చినారు? అని అడిగినాడు, మల్లపరాజుగారికి కల గనినట్లై

నది. నిశ్చేష్టితుడైనాడు. ఎగాదిగాచూచుచు నిలువబడిపోయి నాడు. "ఏమట్లు మాచెదవు? తెలియదా ? నేను కృష్ణావధూత నని. మీ వెనుకనే బయలుదేరి వచ్చుచుంటి. శిఖరేశ్వరము రొద్ద మిమ్ములజూచితిని. గాని నడువలేనేమో ? అనుభయ ముతో నే నక్కడగూర్చుండ లేదు." అని మల్లపరాజును వీపుదట్టుచు నవ్వినా డవధూత. తిక్కదెలిసినది. చేతులు ముకు ళించి, మీరు సర్వజ్ఞులు. సత్యసంకల్పులు. సర్వశక్తిపూర్ణులు. సర్వాంతర్యామియగు సచ్చిదానందమూర్తి కసాధ్యమెందైన నను గలదా ? అని సవినయముగ బలికి శ్రీవారి యాజ్ఞ వడసి ధూళిదర్శనము గావించి శివరాత్రిమహోత్సవములో బాల్గొని యాత్రముగించి అవధూతతో నిల్లుజేరి యాత్రావిశేషముల స్త్రీలకెఱింగించి తన జీవితమును సార్థక మొనర్చుకొనినాడు మల్లపరాజు.

యాత్రావిశేషముల వినినవారెల్లరు అవధూతవారు మాతో అయ్యపరాజుగారి శివాలయములోజరిగిన అభిషేక మున నాడు పాల్గొని నారని వచించి శ్రీవారి ప్రభావమున కుబ్బుచు వేనోళ్ల గొనియాడినారు.

అవధూతగారికి ప్రతిరోజురాత్రి నిసీధమున బయలు దేరి ఋషుల నివాసమని చెప్పు సీమకుర్తికొండకేగి మగునా దుదయమునకు నాగభొట్లపాలెము జేరు నలవాటుకలదు. ఇదికని పెట్టి అన్నంభొట్లశాస్త్రి అవధూతగారి వెన్నంటజూచెనుగాని యెన్నడును సందర్భపడలేదు. ఒకనాడు తనప్రయత్న సిద్ధినాశించి


అవధూతగారు పరున్న గృహముననే శాస్త్రియు బరున్నాడు. అవధూతమాత్రము మామూలు ప్రకారము లేచి బయటికి వెళ్లుచు తలుపు దగ్గరకు నెట్టిపోయినాడు శాస్త్రిచూచి శ్రీవారి వెన్నంటజూచెను. గాని ఎంత ప్రయత్నించినను తలుపు రాలేదు. సమీపముననున్న యింటివారిని కేకలతో లేపిన వారునువచ్చి తలుపు నెట్టిరిగాని అది సందివ్వలేదు. ఊతకనెత్తి ప్రయత్నించి విఫలులైరి. పిట్టలుపీచుపీచను నప్పుడు తలుపు దానంతట అదియే తెరువబడినది శాస్త్రిబయటికివచ్చి దిక్కుల పరికించుచు స్వగృహప్రవేశ మొనరించినాడు. మామూలు వేళ కవధూత గారేతెంచిరి.

శాస్త్రిమరురోజు రేయి గూడ యెందో దాగియుండి మామూలు వేళ కవధూతగారి వెన్నంటి పోసాగినాడు. కాని అవధూతగారి పోబడియే లేదు. పరికించి చూచుచుండ నొక పెనుభూత మాతని కంటబడినది భయముచే శాస్త్రి భూమి కొరిగినాడు. తెల్లవారినది నిద్రనుండి లేచినవానివలె లేచినాడు అవధూత దర్శనమైనది వారిపాదాలబడి జరిగిన యుదంత మంతయు జెప్పి క్షమింపవేడినాడు ప్రసన్నుడైనా డవధూత. ఇకమీద నిట్టిప్రయత్నము జేయకు ప్రమాదమగునని మందలించినాడు. నాటినుండి బుద్ధి మార్చుకొని అవధూతగారి యనుగ్రహమునకు పాత్రుడైనాడు శాస్త్రి. మహాత్ములచర్య లతిచిత్రములు గదా!

శీతజ్వరములో బాధపడునట్టి యవధూతగారి జూచుటకు లక్కవరపుర వాస్తవ్యులు కొందఱేతెంచిన వారల గూర్చుండ నియమించి యొక కఱ్ఱ తెప్పించి తాస్యాయముగా వారలముం దడ్డముగా బడవేసిన గొంతెనడికది గడగడ వడక ప్రారంభించినది. ఈచిత్రమేమని ప్రశ్నించిన బ్రారబ్ధవశమున (తనను జూపుచు) వీనినాశ్రయించిన వ్యాధిని ఈ కఱ్ఱయందు బ్రవేశపెట్టుట వడుకుచున్నయది. ఇప్పు డీశరీరము వ్యాధిలేనిదగుట నారోగ్యముగనున్నది. నాబాధయంతయు నీకఱ్ఱ అనుభవించుచున్నది నన్నువ్యాధిగ్రస్తుని చూచుటకు వచ్చియుంటిరి పాపము! వీనికివచ్చినవ్యాధి స్వాధీనమైనదని మీకు జూపుటకే యీ పని జేసినాను పరితాపపడకుడు మాయస్వాధీనమైన వారికి వ్యాధులుగూడస్వాధీనములగు మాయయొక్క యదార్థ స్వరూప మెఱింగినవానికి దానిబాధ లేనిదగును మాయ లేనిదై ఉన్నటు లగుపడు స్వభావము గలదగుట లేనిదానిని లేనటుల జూచినవారే మాయను జయించినవారు. మనకు సంభవించు సుఖదుఃఖములు మాయావినోదములు, ఈ రహస్యమెఱింగిన సాధకులు మాయావికారములకు లోనుగాడు గాన, కష్టసహనశక్తి యలవరచుకొని ధన్యులు గండని బోధించి పంపివేసినా డవధూత.

ఒకప్పుడు శిష్యులకు దేహయాత్ర జాలింప నున్నానని తెలిపి ఈ శరీరమును లక్కవరమున సమాధి గావింపు డని సెలవొసంగుచు వెంటనే కపాలభిన్నములో బరమపదమలంక

రించినారు. స్వామివారి భౌతిక దేహమును శ్రీవారు సెలవొసంగి నట్లు గావించినారు శిష్యులు. సమాధికి జరుగు నిత్యనైవేద్య దీపారాధనాది కార్యములకు గ్రామస్థులు పదునెనిమిది యకరముల భూమినిగూడ సమర్పించినారు. ప్రతిసంవత్సరము పుష్యమాసములో శ్రీవారికి వార్షికోత్సవము జరుపబడుచున్నది. వీరిశిష్యులలో ముఖ్యులు లక్కవరపు అయ్యపరాజదంపతులు వీరు పాతకమూరు నివాసులయ్యును కొన్నికారణములచే నూతనముగా 'లక్కవరము' అనుపేరుతో ఊరుకట్టించి అందు శివప్రతిష్ఠగావించి అత్యంత భక్తితో లింగమూర్తినుపాసించి శంకరసాక్షాత్కారభాగ్యముగడించిన పుణ్యమూర్తులు. ఈ దంపతులిరువురు రొకే ముహూర్తమున నిరాయాసముగ లింగైక్యమయిన భక్తాగ్రిణులు. వీరి వంశమునందలి యెనిమిద తరము వారీయూర నిప్పుడు వశించుచున్నారు.



తరికుండ వెంకమాంబ

"మంత్రము" సంసార సాగరమునుండి తరింపజేయు నది. సప్తకోటి మహామంత్రములలో "ప్రణవ" రామ తారకము, లుత్తమములు ప్రణవమెటు లేకాక్షరమంత్రమో? తారకముగూడ నట్లే ఈ రెండిటికి భేదమింతయు లేదు. ఏకాక్షరమంత్రములు ధ్యానధారణములకు సులభసాధ్యము లైనవి మంత్రాక్షరముల మనస్సున కంటించి భావమును జేర్చి ధ్యానములో నిలుపుటకే యుపాసన యనిపేరు, సహజస్థితిని బొందినపుడు సాధకుని ప్రయత్నము లేకయే; అవస్థాత్రయ మందును ధ్యానము సాగుచుండును ఈస్థితి మాయాసమూల ముగ నాశనమైనప్పుడే లభించునది యగుట శతవిధముల ప్రకృతిని జయించియే ధ్యానసాధనమునకు బూనవలయు. మాయను జయించుట కీశ్వరానుగ్రహ మవశ్య కర్తవ్యము. గాన? మంత్రజపము కోట్లకొలదిగా నుండునట్లు ప్రయ త్నింపవలయు. మాయను జయించిన వాడే ఈశ్వరుడని పెద్దలనెదరు. "నావిష్ణుః విష్ణుమర్చయేత్" అనుట సర్వులకు దెలిసినవిషయమే,, ఉపాసకు డుపాస్యుడగు సూత్రమిదియే. దైవకృప లేమియే పతనమునకు గారణము. మంత్ర, మం త్రార్థ, మంత్రభావముల నిరంతరమను సంధించుటచే భవ సాగరముదరించి సాధకుడు ముక్తుడగుచున్నాడు ఇట్టి ముక్త సంఘులైనవారలతో దరికుండ వెంకమాంబగారొకరు.

ఈమె నివాసము తరికుండ. (పెనుగుకడవ), రాయ దుర్గవాసులు క్షామబాధ భరింపజాలక నిండ్లనువదలి యీబాల

గోపాలముగా, జలధాన్యసమృద్ధిగల ప్రదేశమున నిలుచుతలం పున బంధసంచుచు మార్గమధ్యమందొక్కెడ నడకబడలిక తీర్చుకొననిలచియుండిరి. అది గ్రహించిమిష్ట అందుండుతరి ఒక బ్రాహ్మణముత్తైదువ పెరుగు విఱుచుచుండ నా పెరుగుకుండలో నొకరాయి పలుమారు కవ్వమునకు దగులుచుండె ఇదియేమి? అని కుండయందు దన చేయివిడిచి చూచిన నదేమియు గనుపింపలేదు? తిరిగి పెరుగు దఱువ మునుకొనిన గవ్వమునకు రాయి అడ్డుపడజొచ్చినది కారణమరయక భయవిహ్వలయై భర్తకెఱిగింప నాతడేతెంచి గాంచిన నృసింహవిగ్రహము కనుపడినది. ఈ విచిత్రసంఘటనమును కుబ్బుచు దోడివారల కెఱిం గించి సంతసించుతరి "భక్తులారా! మీ మీ కష్టములబాపి ఇష్టఫలసిద్ధి గూర్చుటకే నేనీ తఱికుండయం దుద్భవించితి మీరందఱును ఏకించి శక్తిగొలంది ఆలయమును నిర్మించి నామూర్తినందు బ్రతిష్ఠించి యారాధింపుడు తఱికుండ నృసింహనామమున బిలువంబడెద ననుమాట లాకసమునుండి వినవచ్చినవి అట్లే కావించి గ్రామీణులు దుర్భిక్షబాధ నుండి తప్పించుకొనినారు. నాటనుండి యాగ్రామమునకు "దఱి కుండ" అనిపేరు వచ్చినది.

మన వెంకమాంబతండ్రి కృష్ణయామాత్యులు. తల్లి పేరు తెలియదు. కాలము క్రీ॥ 18వ శతాబ్దము. ఈమె కష్ట వర్షప్రాయమున దఱికుండ నృసింహమూర్తి స్వప్నమున సాక్షాత్కరించి ప్రణవ ముపదేశించి రోజునకు బదివేలకు దక్కువ పడకుండునట్లు ౨కోట్లబదిలక్షల జపము గావింపుమని

యాజ్ఞ నొసంగి యంతర్హితుఁడైనాఁడు. మరునాఁడుదయమే జపదీక్ష వహించినది. గాని కృష్ణయామాత్యుఁ డావర్షముననే బిడ్డకు వివాహముజేసి కన్యాదానఫలము దక్కించుకొన నెంచినాఁడు.

ఇది తెలిసి వెంకమాంబ తండ్రినిజేరి స్వప్నవృత్తాంత మెఱింగించి మీరు సల్పు ప్రయత్నము తన మంత్రజపసిద్ధి కంతరాయమని నొక్కిచెప్పినది. గాని లెక్కసేయ లేదు. వరాన్వేషణము గావించి శుభముహూర్తమున బిడ్డ కిష్టము లేని పెండ్లి చేయించినాఁడు. ఐదువత్సరములు గతించినవి. అమ్మ పుష్పవతి యైనది. నిషేక ముహూర్తము నిశ్చయింపబడినది. లగ్నకాలమునకు బంధుపుత్రులతో వరుడరుదెంచినాఁడు. అమ్మ సభక్తిగా విభుని సమీపించి నమస్కరించి స్వీయాభిలాష నెఱింగించి సన్నుతి పరచి వరునివచ్చినదారిని పంపివేసినది. తపోభంగ మొనరించు పాపమున కొడిగట్టుకొనలేక బంధువుల దూషణవాక్యములతో దిరిగిపోయి యిల్లుజేరి మరునాఁడే అమ్మగారిభర్త శరీరయాత్ర జాలించినాఁడు దైవనిధి నెవరుతప్పింపగలరు! భర్తకుత్తరక్రియలు ముగిసిన మరునాఁడునే మదనపల్లివాసియగు "రూపావతారము సుబ్రహ్మణ్యశాస్త్రి నాశ్రయించి జపవిధానం బెఱుంగుటయే" కాక దత్తమునుగూడ గ్రహించి యిల్లుజేరి నృసింహాలయ ప్రాంగణమందుగల ఆంజనేయ స్వామివారికి వెనుకనలరు రహస్యస్థలమున గూర్చుండి జపదీక్ష సాగింపు చున్నారమ్మగారు.

అర్చకుడు చూచినాడు మాయమాటలతో భర్త నావలకంపుటయేకాక చంపివేసిన భర్తృహంతవు నీమొగము జూడరాదు. లెమ్ము? స్వేచ్ఛావిహారిణివై తిరుగుచున్నావా? ఊరునాడు రోసినపాపివి కపటవేషముతో స్వామివారి వస్త్రాది కముల దొంగిలింప వచ్చినదానికివలె నున్నావు లెమ్ము? ఆవలకు బొమ్ము? అని అరచుచు నమ్మను కొట్టి నెట్టినాడు

చేయునది లేక దన జపదీక్షవిరమించి తండ్రిని జేరి యర్చకునివలన దనకుగలిగిన పరాభవ మెఱింగించిన నాతండును లోకుల మాటలు నమ్మినవాడగుట నిజపుత్రి ప్రవర్తనను శంకించి రక్కసీ? నీ కారణముగా మగడు దిగులుపడి చనిపోయినాడు లోకదూషణముల విని సహింపజాలకుంటి గాన! శిరోజముల బరిత్యజించి వికారివగు మటుమైన సమ్మతించెద లేనిచో నాయింట నడుగుబెట్టరాదు. పొమ్మని నెట్టి వేసినాడు.

తండ్రీ! నావలన దప్పులుండిన క్షమించుము నేను నృసింహమూర్తిని వరునిగా వరించితి. ఈపని మానసికముగా జరిగినది. నీయల్లుని మరణమునకు దైవవిధియే కారణము. గాని, వేరుగాదు సర్వజ్ఞులగు మీరునన్ను బాధించుట ధర్మము గాదు నాభర్త చచ్చువాడుగాడు శాశ్వతసుఖస్వరూపి చచ్చి నది నీయల్లుడుగాని? నాభర్తకాదు? నీయిష్టమెట్లో? అట్లే గావించెద ననిచెప్పుచు శేషాచలాధిరోహణము గావించి అం దలి తుంబురుకోనలో నిరాహారదీక్షతో జపయజ్ఞమును పూర్తిగావించి అవభృధస్నానానంతరంబు స్వామిపుష్కరిణి

కుత్తరమునగల మండపమున గూర్చుండి 1. రాజయోగ సారము, 2. వేంకటాచలమాహాత్మ్యము, 3. ముక్తికాంతా విలాసము, 4 భాగవతద్విపద అను కావ్యచతుష్టయము లిఖించి ధన్యతగాంచి నారమ్మ గారు.

అంత దండి కృష్ణయామాత్యుడు పుత్రీయుదంత మెఱింగి శేషాచలమున నివసించు తనూజాతను సమీపించి యజ్ఞానబలమున దాగావించిన పరాభవమునకు క్షమింపుమని ప్రార్థించిసమ్మతిపరచి స్వగృహమునకు గొనివచ్చి సబహు మానముగ బోషించుచుండె

వెంకమాంబ తండ్రియిలుజేరినదని తెలిసి పూర్వా చారపరాయణులు జనుదెంచి కృష్ణయామాత్యునితో నీ పుత్రి యెంతటిజ్ఞానియైనను వంశాచారమునను సరించి ముండనకర్మ గావించుకొనవలసినదియే ? తప్పదు ! అట్లుగావింపనిచో మీకుటుంబమును బహిష్కరించెదమని చెప్పుటయే కాక బుష్పగిరిపీఠాధిపతులరుదెంచిన వారికెఱింగించిన శంకరాచార్య స్వామి అమ్మనుపిలిపించి వ్యాస్యకారణమెఱింగించి జవాబు జెప్పుమని నిర్బంధించినారు.

అమ్మస్వామివారికి నమస్కరించి మీ యభిమతాను సరణి ననువర్తించెద నని చెప్పుటయు అంబష్ఠుని బిలిపించి పనిగొన నాజ్ఞాపింప నాతం డమ్మగారియొద్దగూర్చుండి భయ ముతో వెంటనే లేచి, కేకలుబెట్టుచు భూతము, అదిగో భూతము, చచ్చితి జచ్చితి నని అరచుచు బయిపెత్తెనాడు.

శంకరాచార్యు లీ విపరీతస్థితి జూచి వెంకమాంబగారి దిలకించిన కనులుమూతపడి గడగడవడకుచు నృసింహమూర్తి యన యేసందియము లేదు నిజముగానృసింహమూర్తియే! యని అకున మొదలిడినాడు. చూపరులు నిశ్చేష్టితులైనారు అరగంట కాల మా ప్రదేశమంతయు నిశ్శబ్దమైనది కొంతవడికి బరిసర మంతటికిని బాహ్యదృష్టి యలవడినది చూపరులంద అమ్మగారి ప్రభావమున కబ్బురపడుచు బొంగిపోయిరి. అమ్మగారు దిక్కులు ప్రతిధ్వనించునట్లు భగవన్నామకీర్తనము గావించుచు దుర్గమారణ్యమార్గము బట్టి పయనెత్తి తుంబురు కోన జేరినది.

అప్పటినుండి కొన్ని వేళలమునియై, కొన్ని వేళలభజన సేయుచు, కొన్ని వేళల భగవంతునితో మాటలాడుచు, బ్రహ్మానందమునమునిగి తేలుచున్నా రమ్మగారు. అడవిమృగములునూ ప్రేమించుచున్నవి. ఆమృగముల నీమెయు ప్రేమించుటయు జరుగుచున్నది. ఈకాలముననే "తరికుండయందు గొలనునిర్మింపబడినది ఈకొలనులో నీరెండుటయనునదే" లేదు ద్వాదశవర్షక్షామమైన నూరివారికి నీటిభయము లేదు.

ఈకొలను దరి నమ్మగారి సమాధిగలదు దీని కీవలదరి మఱియొకకొలనున్నది. ఆజలము సమస్తరోగహారి ఈతరికుండ తిరుపతికుత్తరమున వాయల్పాడనకు దొమ్మిదిమైళ్లలో నున్నది. అనేకమంది యాత్రికులచే సేవింపబడుచున్నది. సమాధి వెంకమాంబగారిపేరుతో వెంకటేశ్వరస్వామివారికి ప్రాతఃకాలహారతి యిప్పటికిని సమర్పింపబడుచునే యున్నది.

[40]

లక్కవరపు అయ్యపరాజు

అత్యంతశ్రద్ధతో జెదరనిచిత్తముగలిగి భగవదోపాసను జేసి జీవితముల సార్థకముల జేసికొనినవా రుత్తమోత్తములు. ఇట్టి యుత్తమస్థితి నార్జించుటకు సాధకుడు ప్రతిదినము దాను గావించు లౌకిక కాలౌకిక గర్మఫలముల నన్నింటిని భగవానున కర్పింపుచు రానురా నవియే నిష్కామ్యములుగామారుట ప్రబేమో ద్భన్నై గాలక్రమముగ నాప్రేమయే "జ్ఞానరూపము ధరించి గమ్యమున జేర్చును, పిందె కర్మ భక్తి కాయ జ్ఞానము పండు పిందెలో గాయపండును కాయలో; బిందెపండు, పండులో? బిందెకాయయు నెటులుండునో కర్మలో భక్తి, జ్ఞాన ములును భక్తిలో గర్మజ్ఞానములును జ్ఞానములో గర్మ భక్తులును గర్భితములై యుండుననుట ఇట్లు గర్మ, భక్తి, జ్ఞానములు మూడును విశ్వాకారునిజెంది గ్రమముగ విశ్వ గర్భితమైన యవ్యక్తసిద్ధి లభించుచున్నది. అనగా విశ్వరూప మును ప్రేమించుచు రాగా? సమస్తభూతములు విశ్వరూప మునకు జెందినవగుట సమబుద్ధిగలవాడై సాధకుడు భూతము లన్నింటియందును భగవద్భావము జేయుచు బాహ్యమునదోచు నానాత్వమం దేకత్వమును ఏకత్వమందు నానాత్వమును గని కృతార్థుడగుచున్నాడు, ఇదియే సగుణాద్వైతము.

వీడు సంసారియే గాని, నిజమైనసన్యాసి, దేహాముం డియు లేనివాడు. వస్తుదృష్టిలేనివాడు. రైతులలో రయితు,

సంసారులలో సంసారి, భక్తులలో భక్తుడు, జ్ఞానులలో జ్ఞాని, యోగులలో యోగి, కనికనని వాడు విని విననివాడు, చేసి చేయని వాడు చచ్చి చావనివాడు వేయేల త్రిగుణాతీతుడన వీనికే జెల్లు వేదముల కందనివాడు.

ఇట్టివాడే అయ్యపరాజుగారు ఇప్పుడు చెప్పబోవు మాట రెండువందలపది వత్సరములనాటిది ఒకశరదృతువులో నెల్లూరుమండలమునందలి పోతకమూరు గ్రామమునకు బశ్చిమ మందుండు భావిచెంత మఱ్ఱిచెట్టునీడ నొక యవధూతగారు సుఖాసీనుడై కూరుచున్నాడు దారినబోవువారందఱు జను దెంచి నమస్కరించి యాశీర్వాదములంది వెళ్ళుచున్నారు.

ఈ సమయమునం దయ్యపరాజుగా రరుదెంచి బ్రహ్మ తేజోపూరితుడైన అవధూతనుగాంచి మహాపురుషుడని తలంచి సమీపించి ప్రదక్షిణ నమస్కారముల గావించి నమ్రుడై నిలచి నాడు తనకనుసన్న కూరుచుండిన అయ్యపరాజును దిలకించి అవధూత, నీపేరేమి? అయ్యపరాజు, అవ॥ అయ్యరాజు మీదీయూరేనా? నీకిద్దరుతమ్ములున్నారుగదూ? నీకుతల్లి లేదుగా? సంపన్నగృహస్థుడనుకుంటాను వినుము ప్రారబ్ధ మనుభవింపక తప్పనిదగుట నీవు పూర్వభవమున శ్వానహింసా రూప పాపముజేసియున్నావు తత్ఫలముగా, సంతాననష్టము గలుగుచున్నది. శివప్రతిష్టగావింపుము దోషముహరించియిహా పరసుఖము లనుభవింప గలవు అని వచించిన అవధూతగారి బోధవిని అయ్యపరాజుగా రబ్బురపడి తాజెప్పకయే" సర్వ

మెలింగించుట దిరికాలవేది అని శ్రీవారికి తిరిగినమస్కరించి పాదములబడి తనయానందవారిచే శ్రీవారి పాదప్రక్షాళనము జేయుచుండ నవధూత నవ్వుచు లేవదీసి ఆలయనిర్మాణమున కనువగు స్థలమునిర్దేశించి ముహూర్తనిశ్చయము గావించి నేనటయుండియే ఆలయనిర్మాణకార్యక్రమము సాగింపజేసెద ననియు నీయందు భగవదనుగ్రహము మెండుగ గలదనియు వచించిన అయ్యా? తమ పూర్వాశ్రమనామధేయ మెయ్యది నివాసమెక్కడ నని అడిగిన నీవాప్రశ్నలవేయరాదు నేను జెప్పనురాదు. అదియట్లుంచుమని చెప్పుచు రేపటియుదయము నీతో వచ్చి కార్యక్రమములో బ్రివేశింప జేసెద ననివిరమించి నాడు.

మరునాడుదయమున నయ్యారాజు నెంటనంటి పురిలోని కేగి అం దాలయనిర్మాణమున కనువగు స్థలమెందును లేమి గ్రామమునకు నాలుగుమైళ్ళలో నున్నట్టియు అయ్యపరాజు నకు జెందినట్టియు బదివందల యెకరముల కంద్రికలో నను కూలస్థలమం దొకచో నాలయనిర్మాణమునకును నివాసగృహ మునకును శంఖువుల నాటించి యచిరకాలమున గట్టడముల రెండింటిని నిర్మింపజేసి శివప్రతిష్ట గృహప్రవేశోత్సవమును గావింపించి రాజదంపతు లిరువురకును క్రమముగ, పంచా క్షరీ, గౌరీపంచాక్షరీ, మంత్రోపదేశములిచ్చి ధన్యుల గావిం చినా డవధూతగారు.

గ్రామముగ నాలయపరిసరములందు బీదరయితుల నూతనగృహములునిర్మించుకొని నివశించుట నిర్మానుష్యము

స్థల మూయగా మారినది ఇదియే లక్కవరము. ఇట్లు మహా
త్కార్యనిర్మాణ కర్తయై అయ్యపరాజు నిజకుటుంబకార్యముల
సోదరులకప్పగించి నిర్లిప్తుడై తాను శివాలయమందును,
భార్య నిజగృహమునన్ఁగల దేవగృహమందును గూర్చుండి
యుపాసనలనాగించి దేశికాచార్యజ్ఞ ననుసరించి సిద్ధియు
సంతానవృద్ధియు గలిగి విరాజిల్లుచుండిరి. నానాటికి లక్కవర
పురి పెరిగి భక్తి ప్రపత్తుల కునికిపట్టైనది దంపతులకు గౌరీశం
కరులు సాక్షాత్కరించుటయే కాక బిలిచిన పలుకుచుండిరి. ఇట్లుం
డియు జపములు మానలేదు అతిథ్యభ్యాగత సేవలు విస్తరించి
నవి రాజుగారు కట్టించిన మంగళసూత్రములు వంపలకొలది
అవారిగా షోడశ మహాదానములు గావించినా డయ్యపరాజు
పేరుప్రతిష్టలతో దిక్కులు మారు మోగినవి.

ఒకప్పుడు గరతలభిక్షుడును తపుతలవాసియు నైన
కృష్ణానందావధూత యాన నీపుణ్యదంపతులు నాగభొట్ల
వారి యెముకకేగి నమస్కరించి నిలిచిన అయ్యపరాజా ? రేపటి
యుదయమున నే మీభౌతిక దేహమును విసర్జించి పరమపద
మలంకరింపగలము, నీయనుయాయుల నందఱ బిలుపబంచి
భజనలతో నన్ను సాగనంపుము. ఈ భౌతిక దేహమును లక్క
వరమున సమాధిగావించి నిత్యనైవేద్యదీపారాధనములకను
వేర్పరచునది. అని సెలవొసంగి నియమితకాలమునకు విదేహ
నైవల్యమంది నా డవధూతగారు.

అంత గొంతకాలమున కొకనా డయ్యపరాజు కాల్య
కృత్యముల నిర్వర్తించుకొని శివాలయమున కేగినాడు భార్య

దేవగృహమున జపించుచున్నది. నాటియుదయము ప్రథమ యామము దాటినది.

పిల్లవాడొకండు బరుగెత్తివచ్చి పెద్దతాతయ్య చనిపోయినాడని ఆతురతమై వచించినమాట విన్నది భార్య కనకమ్మ కూయుచున్నది. కూరుచుండినట్లే శివైక్యమొందినది దంపతులిరువుర నొకేచితియందుంచి కుమారుడు నరసయ్య దహనసంస్కారకర్మల సక్రమముగ జరిగించి ధన్యుడైనాడు. ఈ వంశపుకోభివృద్ధి నాశించి భగవంతుని గీర్తించుచు సెలవు గొనెద లక్కవరపువంశీయులే యిప్పటికిని లక్కవరపు కరణములు.



కైవారము బాలాంబ

భూతములన్నముపలన బుట్టుచున్నవి. అన్నమువలననే పెరుగుచున్నవి. ఈ కారణమును పురస్కరించుకొనియే సత్రకతువులన్నియు నన్నదానపూర్వకములై ప్రవర్తించుచున్నయవి. గనుకనే దానములలో నన్నదానమునకు బ్రధానస్థాన మీయబడినది అన్నము ప్రత్యక్షభగవత్స్వరూపము అన్నసారము ప్రాణాధారమును, ఆత్మబలసమగ్రమునై యున్నది. అన్నము లేనిచో బ్రాణము శుష్కించి తద్వారా దేహమున కపాయము సిద్ధించును దేహబలమనోబల సంపాదనమున కన్నపానములత్యంత సహాయకారులు, మనోదేహములు వేరువేరు పదార్థములు, కాపు దేహముయొక్క సూక్ష్మరూపము మనస్సు మనస్సుయొక్క స్థూలరూపము దేహము దేహమారోగ్యవంతమైననే మనశ్శుద్ధి లభింపగలదు. మనశ్శుద్ధిలేనివారికి నాత్మశక్తికలలోనివార్త ఆత్మశక్తి మనశ్శుద్ధివలన నేర్పడును. మనశ్శుద్ధి దేహారోగ్యమువలన లభించును. దేహారోగ్యమన్నమువలన లభ్య పడుచున్నది. గనుకనే "అన్నం బ్రహ్మ" అని వేదమాత చెప్పుచున్నది సత్రకతువులన్నియు నన్నిదానపూర్వకములుగ జరుపుటకు కారణమన్నమాత్మశక్తిగర్భితమై యుండుటయేయగు దామానుకొనియైనను, అతిథినిగుడువబెట్టిన యజమానిపుణ్యము వర్ణింపతరముగానిది జాతిమతవిచక్షణసేయక గావింపబడు అన్నదానము విశేషతమము.

మఱియు నన్నము దినుట వలన ధాతువృద్ధిసమకూడును. ధాతువృద్ధి శరీరారోగ్యసంపాద శరీరాభివృద్ధికిని ఆత్మాభివృద్ధికిని గూడ అన్నమవసర మగుననురహస్య మెఱింగిన మహాతల్లి కనుక నేనిరతాన్నదాన వ్రతపారీణయై జీవయాత్రసాగించి ధ్యాంధ్రావనిపేరు గాంచిన సద్గుణ కదంబ మన బాలాంబ.

ఈమె మనశ్శుద్ధికిని, సత్యసంకల్పములకును కాణాచి కార్యదీక్షా సౌశీల్యములకునికిపట్టు పరార్థైకప్రవృత్తికి నిలయము దూరశ్రుతమైన క్షుధాకులిత దీనాలాపశ్రవణమాత్రదన్నివారణోపాయమును క్రియారూపము ధరింపజేయు నారీమతల్లి మన బాలాంబ ప్రతిదివసమును తన మంచము క్రింద సిద్ధపరచి యుంచిన భోజనపదార్థములతో నన్నాతురుల రేయియంతయు సంతృప్తిపరచు సద్గుణగణ శారదాంబ బాలాంబ.

ఈ మహాతల్లిభర్త కైవారము సుబ్బావధాని సత్యదీక్షాదురంధరుడు మృదుమధురహృదయుడు విబుధజనాహ్లాదకరుడు సాధుజనప్రియుడు మితభాషి కలిగినకలిమి కులుకక తృప్తినందుచు నిర్వికారత్వముగాను సమానచరిత్రుడు ఎట్టివిషమస్థితి దాపురించినను చేజాచి యెఱుంగని నిర్లిప్తుడు ఇట్టి మహామహితుడగు భర్తతో బదునెనిమిది వర్షములు జేసిన కాపురమున సంతానభాగ్యము బడయజాలమి భావగారి కుమారుడగు, నారాయణను, అల్లారుముద్దుగ లాలింపుచు బాలింపుచుండె.

ఈతడు బాల్యమునం దాడుకొనుచు కాలుజారి నూతగూలినాడు. ఈ ఘోరవార్త విని బెగడొందక నృసింహానామ



కైవారము బాలాంబ

స్మరణతో రూపమును సమీపించి నారాయణా! ఎందు న్నావురా! నాయనా! అని పిలచినవెంటనే, అమ్మా! భయపడకుము "ఎవరో, దివ్యపురుషు డొక డరుదెంచి నీటమునుగనున్న నన్నెత్తి మెట్టున కూరుచుండబెట్టి యంతర్హితుండైనాడు". అనుమాటలు భావినుండి వినవచ్చినవి. అమ్మ భగవదనుగ్రహమున కుబ్బుచు నా కుఱ్ఱవాని వెలికిదీయించి సంతోషపారావారమున దేలియాడినది.

ఎంతటి వారికైనను, ప్రారబ్ధ మనివార్యముగదా! తన నలుబదవయేట అనగా, క్రీ. 1888 వత్సరమున భర్తసుబ్బావధానపరలోక గతుడగుట జింతాసాగరమున మునింగి ఎట్టకేలకు శాంతివహించి భర్తకపరక్రియలు ముగింపించి దినమునకు రెండుపూటలు నృసింహస్వామివారి దర్శనము జేయుచు నొకశుభదివసమున బులిహాళ్ళనరసింహాచార్యులగారి వలన దిరుమంత్రోపదేశము గ్రహించి మంత్రసిద్ధియు భగవత్సాక్షాత్కారభాగ్యమును గడించిన జగదంబ బాలాంబ.

ఇట్లు దినములు గడపుచుండ నన్యమతావలంబుని వలన మంత్రోపదేశ మందిన కారణము నూతగాగొని పురిబ్రాహ్మణబృందము గనలి పీఠాధిపతికెఱింగించిన స్వామివా రమ్మగారిని స్వయమున బరీక్షించి నిష్కల్మషయని నిశ్చయించి బ్రాహ్మణబృందమును మందలించి తరిమివేసినారు.

అంత బాలాంబ పానకాల నృసింహగిరిపై నిత్యనివాసమేర్పరుచుకొని తపస్సు జేయుచుండిరి. ఈ స్థితియం దుండ తరి

నొకనాడు కుంభవర్షము గురువ మొదలిడినది. తలదాచుకొన నెంచి అమ్మ బయలు వెట్టుచు నొకగుహాచెంతకేగి లోన బ్రవేశింపనున్నతరి, గుహాద్వారమునుండి బురదనీటి వెల్లువ యెదుర్కొని అమ్మను నెట్టివేసినది. ఆ స్రోతపుతోఁ ? స్మృతిదప్పి అందొక గుంటగూలి చేతనరహితయై మైమరచినది. వర్షమాగిన వెంటనే బురదచే గప్పబడుట శరీరమునకు గనుపింపరాని స్థితి యేర్పడినది.

ప్రతిదివస మమ్మగారి క్షేమమారయ వచ్చిపోవుచుండు హనుమంతయ్యగా రరుదెంచి పోబడి తెలియక నందంతా వెదకి బురదలో గూరుకొనిపోయిన శ్రీవారి దేహమును విశ్వప్రయత్నముపై బయటికి దీయించి సమయానుకూలోపచారముల స్మృతి గలిగించి ధన్యుడైనాడు.

మఱియొకతరి పురిప్రత్యర్థు లరుదెంచి అమ్మ నడవడి శంకించి కారులాడుటవిని సహింపజాలక ప్రాణత్యాగము జేసికొన నుంకించి అగాధమగు నూతబడినది. వెంటనే నృసింహమూర్తి సాక్షాత్కరించి తదీయాపదనుండి తప్పించి అంతర్హితుడైనాడు.

నృసింహానుగ్రహమద్దుపడ లెక్కకెక్కుడగు ప్రయాసల నవలీలదాటి తపస్సిద్ధి గడించి బ్రహ్మతేజో విరాజమానమూర్తియై విరాజిల్లుతరి నృసింహమూర్తి పంచాబ్దముల బాలుడై వచ్చి అమ్మా! నాకన్నముబెట్టవా! ఆకలి బాధించుచున్నది. మాట్లాడవేమి తల్లీ! అనుడు అమ్మ గ్రహించి చేతులు జోడించి నమ్రవదనయై నృసింహదేవా! ఈ యబ

లను పరిహసింపదలంచి బాలుడవై వచ్చితివా! ''నాయనా! ఇదేమి వేళాకోళమా! తండ్రీ! విశ్వగర్భుడవైన నీకన్నము బెట్ట నే నెంతదాన జనకా! అని దీనాలాపముల పాదములబడి మైమరచిన బాలాంబకు స్మృతిబ్రసాదించి లేవనెత్తి నిజరూపుజూపి వినుతులంది అవ్వా! నేటినుండి నీవలన నిర్విఘ్నముగ నన్నదానయజ్ఞమవారిగా సాగున ట్లనుగ్రహించితి. ఆర్తదోషదూషితవు గాకుండువుగాత. నీ దీక్ష కంతరాయము గలుగకుండుగాక! అని వచించి యంతర్హితుడైనాడు నృసింహుడు.

అన్నదానమహాయజ్ఞము సాగుచున్నది. యాచింపకయే భోజనపదార్థములు కుప్పలు తెప్పలుగా వచ్చిపడుచున్నవి. ఈ స్థితినిజూచి సహింపలేని ప్రత్యర్థులు, శిరోజముల నదలించుకొనుము లేకున్న వెలిబెట్టెదమని బెదరించిన నల్లెయని క్షౌరకునిముందు కూర్చున్నది గాని, అంబష్ఠునికి జేయ్యివడక మొదలిడుటయే కాక లక్ష్యము చెడినది కారణ మరయ దనముం దమ్మలేదు. అబ్బో! సింగము, సింగము చచ్చితి, చచ్చితి నని పెనుబొబ్బలిడుచు బరువెత్తిపోయినాడు.

వీడొకతరి మహాలయపక్షపు దినములలో నొక సాయంత్రి మైదుగంటల కమ్మగారి దర్శింపగలిగినాడు. రాకకు గారణమెఱింగించి (శ్రీ) మల్లాది సుబ్బదాసుగారి జీవిత గాథ నర్థించి దెలిసికొని తృప్తి నందిన వీనినిగాంచి అమ్మగారిట్లనిరి.

మహాలయపక్షము పితృప్రీతికర మగుట చేయి భోజనమా, ఫలాహారమా, ఫలాహారమే'' అన్నాడు పిండిచేయింప

మనెదవా, ఔనన్నాడు, రాత్రి యేడుగంటలకు మడిగట్టి శ్రీవారి యాజ్ఞ ప్రకారము భోజనశాలజేరి సుఖాసీనుడైనాడు మఱియొక అతిథి వీడిప్రక్కన గూర్చుండె నిరవుర కమ్మగారు విస్తరులవేసి, దోసెడు దోసెడు నెడల్పుగల అరిసెలు వడ్డించిరి ఆరెండరిసెలంతోడనే తృప్తివారణాయెనది. కాని నంటనే రెండు పెరుగు, గారెలు ప్రత్యక్షమైనవి. తదుపరి రెండు లడ్లు వీటితో గడుపునిండి వ్రేలుపెట్టిన అందునట్లైనది. ఉత్తరాపోసనమునకు సిద్ధపడునంతలో నేపుడుపిండికొనివచ్చి, నాయనా, పిండిచేయమంటివే, అనిచెప్పుచు విస్తరిలో గుమ్మరించి చిక్కని మజ్జిగబోయ నుంకించుట గోపమువచ్చి వీడిట్లనియే అమ్మా! నిన్నేమియు ననజాలగాని అన్నదానవ్యాజమున నతిథుల ప్రాణాపహర్తవైనావు. ఇదియేమి విపరీతము కొంచెమైనను సందు లేని యీ పొట్టలో మజ్జిగజేరిన పిండి పట్టుటెట్లు? అని విసుకుగొనుచుండ నవ్వి నాయనా! నరసింహనామస్మరణజేయుము. కడుపు సలితిజూపునని చెప్పి యొప్పించి వీడిచే మూడుపర్యాయములు నృసింహనామ మంత్రోచ్చారణము జేయించినారమ్మగారు. వెంటనే పొట్ట వెలితిజూపి భుక్తాయాసమంతరింప అమ్మగారియాజ్ఞ ననువర్తించి కృతార్థుడైనాడు. ఇది అమ్మగారి ప్రభావమా? నరసింహనామమంత్రప్రభావమా? అను సందియం బిప్పటికిని వీనిని వదలినది గాదు గాని శ్రీవారి చిత్తము భగవన్నామాయత్తమగుట, నామినామముల కభేదము కనుక నాచిత్తము భగదాకృతి ధరించుకారణముగ నెలువడిన యాత్మశక్తియని నిరూపించుకొనినాడు.

మఱియొకతరి సంక్రాంతిదివసమున సత్రావరణమందు బ్రాహ్మణులు భోజనములు చేయుచున్నారు. అమ్మగారు పర్యవేక్షణ కాముకులై పంక్తులవెంట దిరుగుచున్నారు. ఈసమయమున నొకవంటవాడేతెంచి అమ్మా దొడ్డి గుమ్మమునుండి పంచముడొక్కఁడు దెసదెంచి క్షుధార్తుడై కేకలు వేయుచున్నాడు. బ్రాహ్మణభోజనములు పూర్తియగువఱకు కాగునటుల లేదు. అని చెప్పిన విని వెంటనే పరుగునవచ్చి క్షుధాతురు నాదరించి దొడ్డియందొకచో గూర్చుండ నియమించి వానికి భోజనపదార్థము లిడినారు. వాడును తృప్తిగా భుజించి అన్నదాతా సుఖీభవయని దీవించి అమ్మ చూచుచుండగనే అంతర్హితుడైనాడు. పానకాల నృసింహమూర్తియే అంత్యజుడై తనకు సేవనొసంగినందుల కుబ్బుచు మైమఱచి ఆనందతాండవము గావించినారు.

ఒకప్పుడు మంగళగిరి తిరుణాలకు వేలకొలది యాత్రికులేతెంచి కళ్యాణమహోత్సవము సేవించి నాటిరేయి బాలాంబగారి సత్రములో విందు లారగించినారు. అమ్మగారు యాత్రిక బాలబాలికల బాలభోగమునకై పదునైదు మానికెల బియ్యముతో వండింపబడిన గుండిగ నిలువయుంచిరి. నాడు తెల్లవారి నది బాలభోగమునకు దాదాపు పదారువందలమంది బాలులు వచ్చి పంక్తులుదీర్చి కూరుచున్నారు. ఉన్నది పదునైదు మానికెలబియ్యపుటన్నము వచ్చిన అతిథులారువందలమంది సరిపోవదని వంటవాడు తహతహపడుచున్నాడు. వార్ధక్యదశలో నున్న అమ్మగారేతెంగి బిరబిరవచ్చి అన్నము రాసిపోయించి కస్తూరిపసగలిడి తానై పళ్లెరములతో నన్నమెత్తిపంపు

చున్నారు. ఆరువందలమంది యాత్రికులు భుజించి తృప్తులై అమ్మగారిని వేనోళ్ల పొగడినారు. ఇది యంతయు నృసింహ మూర్తి ప్రభావమని చెప్పుచు దన నిష్కామసేవ వెల్లడించినారు.

ఒకప్పుడు బ్రాహ్మణసమారాధనమున నెయ్యిపాత్రాభికరణమునకుగూడ లేదు వంటలైనవి వేలకొలంది యతిథులు బారులుదీరి భోజనమునకు గూరుచున్నారు. వడ్డనలైనవి అన్నాభికరణమునకుగూడా నేయి లేమి వడ్డనవారు గుసగుస లాడ మొదలిపెట్టిరి. అమ్మగారు చూచిరి. కర్పూరము వెలిగింపబడిన పళ్లెరముతో వాకిటిముందుండు కోనేటిరేవునకు జేరి పానకాలరాయుని మంగళహారతితో దృష్టిపరచినారు. వెంటనే నేతిడబ్బాలబండి ప్రత్యక్షమైనది. రైల్వేస్టేషను పోర్టరొకడు కర్నూలునుండి సెల్పార్టరుతో రాబడిన ప్యాసుతో వచ్చి అమ్మగారికి సమస్కరించి డబ్బాలు వప్పగించి రశీదు దీసికొని వెళ్ళినాడు సంతర్పణ పూర్తయైనది. యాత్రికులు అమ్మగారి ప్రభావమును వేనోళ్ల గొనియాడి తృప్తులై వారి వారి స్వగ్రామములకు పోయినారు.

ఇట్టి మహిమ లింకెన్నియో గలవని చెప్పిరిగాని, వీనికి లభించినవఱ కెతించించినందులకు జనులు క్షమింతురుగాక!

నాటనుండి అమ్మగారి జీవితాంతమువఱకు నృసింహ మూర్తి వెన్నంటి దిరుగుచు సేవకుడై అన్నదానమహాయజ్ఞమును కొనసాగించి డెబ్బదితొమ్మిదవయేట దనలో జేర్చి కొనినాడు.

మహర్షి పీరోజీ

సర్వవ్యాపకుడగు పరమేశ్వరుండు సకలమానవ హృదయాకాశాంతర్గత దివ్యమండపమున ప్రేమానందామృతఘనస్వరూపుండై సర్వదాచిచ్ఛక్తితో రమించుచుండుట బాహ్యాడంబరముల యాచారములతో గాని, అస్థిరరూపములతో గాని, సత్కారమాన పూజాప్రదములగు విద్యలచేగాని అవసరములేక సకలభూతములయం దేకైకభావము, గలిగి ప్రేమపూరితహృదయుడై, దృశ్యమంతయు దానుస్మరించు నామాధిష్ఠాన దైవముయొక్క దివ్యమంగళవిగ్రహముయొక్క రూపమే'' యనెడు అరూఢభావముచే నస్థిరభోగాశ త్యజించి వైరాగ్యభూషణుండై మూర్తీభవించిన భక్తిస్వరూపుండై సంతతానందరసపానముచే సంతృప్తుండై సంసారియైనను అసంసారివలె నిజజీవితముగడపి యంత్యమున శ్రీరామనామజప ఫలసిద్ధిగాంచిన దివ్యపురుషుడే'' మనపీరోజిమహర్షి.

తండ్రి సర్ఫోజీ. తల్లి నర్సాబాయి. తమ్ములు 1. వెంకోజీ, 2. గోపాలరావు. జననము క్రీ॥ 1829 సం॥ విరోధి సంవత్సరామాఘశుద్ధైకాదశి వీరికి బాల్యమునుండి పరమాత్మ నెఱుంగ నభిలాషమెండు భగవత్పాదసేవ భాగవతారాధనము సర్వభూతదయ వీరి సహజగుణములు. వీరికి దశవర్షప్రాయమునకే, సంస్కృతాంధ్రపాండిత్య మలవడినది. ద్వాదశవయః ప్రభృతివీరిని కవితాకన్య వరించి కాపురముచేయుచున్నది. సహజపాండిత్య ప్రకర్షగలవాడు.

ఒకనా డనాహూతుడై చిదానందయోగి యేతెంచి పీరోజీమహాశయుని యఖిలమిత్ర మెఱింగి తారకమంత్రము నుపదేశించి దీవించి జనియె. అత్యంతభక్తియుక్తి దన్మంత్రపురశ్చరణ యందు సిద్ధిగడించి ఆచార్యశతకము రచించి గురువున కర్పించినాడు.

పదునైదవయేట వీరాబాయిని భార్యగా వరించిరి. ఈమె పతిసేవాపరాయణ, సుగుణఖని సుశీల సాధ్వీశిరోమణి ఈ అనుకూలదంపతులు చంద్ర చంద్రికలవలె వెలుగుచు భగవత్కార్య కలాపములందు ప్రొద్దులుపుచ్చుచు నిజజీవితముల బవిత్రవంతములు కావించుకొనుచుండిరి.

రాను రాను సద్గ్రంథరచనాభిలాషయు దత్త్వగేయ నిర్మాణశక్తియు, శతకగద్యపద్యాదిరచనా కౌశల్యములుగలిగి, భద్రాచలయాత్ర గావించి యిష్టమూర్తి నర్చించి పరమానంద సుధాలహరి దేలియాడుచు, స్వీయకృతుల శ్రీరామున కర్పించి కృతార్థతగడించిన పుణ్యమూర్తి పీరోజీచక్రవర్తి, స్వానుభవసిద్ధములగు పరమార్థ రహస్యముల శిష్యుల కెఱింగించి కృతార్థులగావించెడి ధీమణి వీరి శిష్యులలో సిద్ధులు పంచములుగూడ గలరు. నానాటశిష్యబృంధమెక్కువైనది. శిష్యబృంధముతోపాటు మహిమలు పెరిగినవి తన్మహిమలద్వారా, సత్తెనపల్లి జమీందారుగారి సత్కార మతిశయించినది హుమ్నాబాదు నివాసియగు మాణిక్యప్రభువు వీరి శిష్యకోటికి జెందినవారు.



మహార్షి క్షీకోటి

వీరు 1889 జులై తొమ్మిదవ తేది అనగా విరోధివత్సరా షాఢశుద్ధైకాదశిరాత్రి లింగోద్భవకాలమందు రామనామ స్మరణతో బరమపదమలంకరించిరి. వార్షికోత్సవములు జరుప బడుచున్నవి వీరికృతులు, 1. నవకుసుమమాల, 2. పన్న గాచలనాయకశతకము, 3. గజేంద్రమోక్షము, 4. పరమా నందసుధాలహరి, 5 దశావతారదండకము, 6. శేషగురుశత కము, 7. నమశ్శివాయగేయము, 8. శ్రీరామశతకము, 9. నాత్రిజితీయము, 10. పంచీకరణము, 11. స్వప్రకాశము, 12 ఆచార్యశతకము 13. తత్వసంగ్రహము, 14. ప్రహ్లాద చరిత్ర.

శ్రీవారి మహిమలు

భవిరిశెట్టి ఓబయ్య యను వైశ్యుడొకడు తన పంట పొలమును మేసిననను నెపముతో నాలగాపరిని దిట్టుచు, నాలగొట్టుచు గొన్ని పశువుల బందెకుదోలుకొనిపోవుచుండుట జూచి కటకటబడుచు పాపమీతడీనాడు రానున్న యాపద నెఱుంగడు పామునోట జిక్కిన కప్పవలె దనగతిగానక మోస పోవుచున్నాడు అనుచు శ్రీవారు తలపంకించినారు నాటి రేయి ఓబయ్య కలహించి భార్యనింట నుండనీక బజారునకు నెట్టి తలుపులు బిగించుకొని యురిబెట్టుకజచ్చినాడు. దీనివలన మనఋషి త్రికాలవేది యనక తప్పదు.

ఒకప్పుడు కార్యాంతర మనుసరించి వేశ్యావీథి నడుగు చుంటజూచి కామవికారమునకు లోనైన "శ్రీహరి" అను వేశ్య, మహోదరముట్టిపడ శ్రీవారిజీరి దనయింట గూరు చుండబెట్టి పరిచర్యలదన్నుచు దన తుచ్ఛాభిమతంబెఱింగింప జలింపక జితునగవుతో సోదరీభావముట్టిపడ జ్ఞానబోధగావించి ప్రేమదృష్టి బ్రసాధించినాడు. నాటగోలె గామదృష్టివర్జించి ఆ వేశ్యయోగినియై తరించినది. దీనివలన వీరు జితేంద్రియు అనుట సాహసము కాదు.

మఱియొకతరి అడవినిమేయు జమీందారుగారి ఆవుల మంద గల పశువునొకదాని పులిబట్టు ఎఱింగి పురివీధి భక్త గోష్ఠిలోనున్న శ్రీవారు చేతికఱ్ఱ ఝుళిపించుచు, ఛస్, ఛస్, అనుశబ్దముతో నదలించుటగాంచి ప్రశ్నించి కారణమెఱింగి విచారించి నిజమునుగుర్తించి సంతసించినారు. చూపరులు, దీనివలన ఋషిగారు సర్వజ్ఞులని తెలియగలరు.

నా యొద్దనిలువయున్న నీలిమం దిప్పుడు విక్రయించిన లాభమా! నష్టమా! అని ప్రశ్నించిన కోట అప్పయ్యగారిని తొందరపెట్టుచు లాభమో! నష్టమో! వెనుక విచారితము గాని వెంటనే నీ నీలిమందుకొట్టు ఖాళీజేయుము. లేనిచో బ్రమాదపరిస్థితి నెదుర్కొనగలరని నొక్కిచెప్పుచు నట్లే గావింపించినాడు మునునాడుదయమున కది పరశురామప్రీతికి గురియైనది దాన యజమాని సంతోషవార్ధినోలలాడినాడు.

దేవునిజూచుమార్గ మెఱింగింపుమని పరిహాసవాక్యము లాడిన వంధ్యా కోటప్పను పిచ్చివాడా! పో! పొమ్మని యద

లించిన కారణముగా నాతండు పిచ్చివాడై గంతులుబెట్టసాగి నాడు. ఆతనిబంధుగులు ప్రార్థింప వానిపిచ్చిని భక్తిగామార్చి శిష్యకోటిత జేర్చి యాదరించిన సిమ్హశంకమూర్తి పీరోజి చక్రవర్తి.

భార్యా సర్యూబాయిగారు కలరావ్యాధికిగురియైనారని వచ్చిన యుత్తరము ననుసరించి యమవసనిశి చిలుకలూరు పేటనుండి సత్తెనపల్లి కేగుచుండ మార్గమధ్యమున నలుగురు దొంగలడ్డగించిరి. భయపడక నాచోరుల ప్రత్యక్షరామలక్ష్మణ భరతశత్రుఘ్నులనుగా భావించి "ఎంతో బ్రహ్మానంద మాయెనే! మన చింతాలన్నియు దీరిపోయెనే" అని పాడుచు నృత్యము జేయుచుండుటగాంచి దొంగలు తమతమ క్రూర బుద్ధుల మార్చుకొని భక్తిభావము లుట్టిపడ తమతమ తప్పుల మన్నింపప్రార్థించి ప్రసన్నుని గావించుకొని పయనమున శ్రీవారికి దోడ్పడి సత్తెనపల్లె జేర్చుటయే, గాక వారు శిష్యు లయినారుగూడ

పైవిధముగ సత్తెనపల్లి జేరి మరణశయ్యనున్న భార్యను స్తన్యములు లేక గృశించు పుత్రుని కలరాభయమున కడలు పురివాసులను గాంచి వెంటనే తటాకమున గ్రుంకులిడి వార్చి మహాలక్ష్మి వృక్షచ్ఛాయగూర్చుచుండి తపంబుండె నాటి సాయంత్రికి సత్తెనపల్లి నెల్లెడ శాంతిలత నల్లిబిల్లిగా నల్లుకొని యుల్లసిల్లినది. స్వీయపరకీయులెల్ల రారోగ్యపూరితులై కలరా భయదూరులై మహానందభరితులైనారు.

భద్రాచల యాత్రసందర్భమున శ్రీవారు భక్తబృందముతో రాత్రి ప్రథమ యామమున తొంకలపల్లిమకామున జేరి వంటప్రయత్నము సాగింపనెంచిన బండిలో బియ్యపు మూట కనుపడలేదు. అది మార్గమధ్యమున నెందెక్కడనో, పడిపోయినదని దలంచి తన ప్రయత్నమాపినాడు వంటవాడు. ఇంతలో నొకనూతనవ్యక్తి బియ్యపుమూటతో బరుసెత్తివచ్చి దారిలో దనకు దొరకినదని చెప్పుచు దానిని శ్రీవారిముందుంచి యంతర్హితుడైనాడు. శ్రీరామానుగ్రహమున కుబ్బుచు పాచకున కెఱింగించిన వాడు వంటసాగింపించి యథాకాలమున భుజించిరి. భక్తబృందమానందించినది. ఈ సంఘటన శ్రీవారి యేబది నాల్గవయేట జరిగినది.

ఎంతనిర్దయమానసుడవు నే నెంత వేడిన గనువడవు అని పాడుచు భద్రగిరి జేరి రాము సేవించి కృతార్థుడైనాడు సీర్ఫోజీ మహారాజు.

భక్తమణి పాటిబండ్ల వీరయార్య

కర్మయోగాచరణమున నే గమ్యము లభించునో, జ్ఞాన శ్రేయోగజ్ఞానములను వివేకనౌక నాశ్రయించి దాటరాని సంసారసముద్రము నవలీలగా తరింపజేసి మానవునికి స్వస్థితి గల్పించునో, మహావాక్యశ్రవణము జ్ఞానులకే శాశ్వతపదవి గల్పించి తరింపజేయునో! ఏది భక్తులకు, భక్తివిషయమో! యాజకులకు యజ్ఞాధిష్ఠాన దేవతయో, ఏది సర్వులకు సర్వ కాలములందును బూజనీయమో, అట్టి శాశ్వతస్థానమును జేరి సుఖయించిన పుణ్యమూర్తులలో మన పాటిబండ్ల వీరయార్యు లొకరు.

ఈతండు భక్తి, భజనల నొకే పరబ్రహ్మస్వరూపముగా సేవించి యారాధించిన సిద్ధమూర్తి చకోరములకు చంద్రుని వలె దోడిభక్తుల కానందమిచ్చి తరింపజేసిన ముక్తజీవి.

వీరి నివాసము గుంటూరుమండలమునగల సత్తెనపల్లి యుపమండలాంతర్గత దీపాలదిన్నె పాలెము. కమ్మవంశాలంకారుడు తండ్రి బాపయ్య. తల్లి బాపమ్మ. భార్య వెంకట నరసమ్మ. జననము క్రీ. 1867 సంవత్సరము వీరు చిన్నటనుండియు రామభజనములో బాల్గొనుచుండువారు.

అష్టవర్షప్రాయమున బులహారి వీరోజిబాబు. దీపాలదిన్నెపాలెమువచ్చి శిష్యులకోరికపై వరుసగా నాధ్యాత్మికోప.

న్యాసములు వారముర్రోజులు. ప్రతినిత్యము గావించుచుండుట విని, తానును భక్తినార్జించి ధన్యుడనయ్యెదననితలంచి గాబోలు, బిలువకుండగనే, ఆరుదెంచి గురుసేవ జేయ మొదలిడినాడు.

పిదప గురుమూర్తి యరుదెంచి నప్పుడే తిరుమో! భక్తి ప్రపత్తులుట్టిపడ నమ్రభావముతో శ్రీవారి వెంటనంటి సేవల గావించుచు, దేశికాచార్యానుగ్రహము గడించినాడు

పండ్రెండవయేట, దేవాభక్తుని అచ్చమాంబగారి నాశ్రయించి గురువుగారిచే నుపదేశమిప్పింపుమని యర్థింప నామె కరుణించి దేశికాచార్యున కెఱింగింప నాతండు వీరయ్యగారినిజేరి త్వరపడకు తత్ఛుభసమయమునకై వేచియుండుమని చెప్పిన గురువరు నానతిశిరమునధరించి తదీయ శుభముహూర్తమున కెదురుచూచుచుండె.

పదునైదవయేడు వచ్చినది కబురంపి శిష్యుని బిలిపించి కారణమొసంగినారు గురువుగారు నాడుమొదలు పగలంతయు గృహకృత్యములయం దప్రమత్తుడైయుండి తలిదండ్రుల కుల్లాసము గలిగించుచు ప్రతిదివసము రేయి ప్రథమయామమున భోజనానంతరము స్వపురివదలి సత్తెనపల్లి జేరి గురువును సమీపించి వినయవిధేయతలతో తదీయసేవాభాగ్యము నార్జించి దేశికాచార్యునాన సూర్యోదయమునకు సరిగా. స్వపురిజేరి కుటుంబకార్యకలాపముల మెలగుచు నిట బితరులను అట గురువుగారినిగూడ సంతసపరచుచు, నిహపరముల రెండింటి

నేకదీక్షతో సాధించిన పుణ్యమూర్తి మన వీరయార్య చక్రవర్తి.

ఇట్లు మూడు వత్సరములు నడచినవి. ఈ మధ్యకాలమునం దొకనాటి గురుసేవలో నిద్రాదేవత నెత్తికెక్కి మైమరపించినది. కొంతవడికి మెలకువగొని పరితాపముతో, ఆహా! నేడట్టిప్రమాదముసంభవించినది. అపరాధి నపరాధిని "అపరాధినిమాత్రమే" గాదు. నీచుడ దుర్మార్గుడనుగూడ లేదేని గురుమూర్తియందు సామాన్య మానవబుద్ధి సేయగలుగుదునా? ఈ తుచ్ఛవృత్తి నాయందె దో. దాగియుండి ప్రమాదపరిస్థితి గలిగించినది. అర్చామూర్తియందు విగ్రహభావమును మంత్రమునం దక్షరభావమును గురువునందు మనుష్యభావమును గలిగిన శిష్యుడెప్పుడును బాగుపడజాలడు అని తనలో దాను పరితపించుచు గురువర్యునిపాదాలబడి విలపించు శిష్యుని బ్రశ్నించి కారణమరసి చిరునగవు మోమున దాండవింప బుత్రా! లెమ్ము భయపడకు ఎంతటివానికైనను పొరపాటు రాక తప్పదు. ఇట్టి ప్రమాదముముందెప్పుడును గలుగకుండునట్లు వరంబొసంగితి శాంతించుమని బుజ్జగించి శిష్యుని తృప్తిపరచిన సుస్థిరానందసుఖభోజి మన వీరోజి.

వీరయార్యు లుపదేశమంది రెండేండ్లుగడచి మూడవయేడు వచ్చినది ఒక్కెడ దేశికార్యు సేవలదన్నుచు అయ్యా! మీ పేరు శాశ్వతముగానుండునట్లు దేని మాహాత్మ్యమును చూపి దానికి స్థిరత్వముగలిగింపుడు అనిన, శిష్యా మానవనిర్మిత కార్యము లెట్లు శాశ్వతములుగాగలుగును సృష్టియు నశాశ్వత

మైనదియే గదా ? ప్రభావమున వేఱులేదు ఏకత్వమందు నానాత్వమును గుర్తించుటయే యగునని వచింపుచు హస్త మస్తకసంయోగము గావించి పిచ్చయ్యగారి ననుగ్రహించినాడు. నాటనుండి మనదాసుగారి కేకత్వమందు నానాత్వములక్షించు భాగ్యమలవడుటయేగాక యోగసిద్ధిగూడ లభించినది.

నాటనుండి ఆత్మశక్తి నిజదేహమందు సంచారము జేయుచుండు కారణముగ సాత్వికలక్షణములు పొడసూపుటయేగాక నప్పుడప్పుడు మైమరచుటగూడ సంభవించినది. ఈ స్థితియందుగూడ వ్యవసాయకార్యముల నేమరువాడు కాడు. ఒకనాటి యుదయమున బాలభోగ మారగించి దుక్కి దున్నుట కరక కోడెలతో పొలమునకు బోయినాడు కాని గతరాత్రి కొద్దివర్షము పడుట దున్నుటకు వీలుగామి బీటిమేతకు వృషభములవిడచి యొకతుమ్మచెట్టునీడ నధివసించి శ్వాసలమందగింపజేసి ఖేచరీముద్ర నాశ్రయించి నిశ్చంచలతవహించి సమాధినధిగమించిరి. ఎద్దులు బీటిమేతగాని తృప్తిపడి యందుండి బయలువెడలి యిల్లుజేరినవి. తండ్రి బాపయ్యగారరుదెంచి వృషభముల వంట కుమారుడు రామి విచారించి యెద్దులగట్టివేసి పుత్రనిరాకకై యెదురువాచి చూచి ప్రయోజనముగుపడమి బయలుదేరి జిరాయితీప్రదేశమున కరిగి అందు నిశ్చలులై సమాధిసుఖ మనుభవించుచున్న కుమారునిజూచినాడు. తుమ్మమొద్దుపై విచ్చలవిడిగా దిరుగు లాగున వాని శరీరముపై గండుచీమలు వేలకొలంది విహరించుటగూడ గాంచినాడు. దిగ్భ్రమునుబొంది పుత్రుని జేరి

తన పైవస్త్రముతో జీమల దులుప మొదలిడినాడు. ఈ సంఘటనతో వీరయ్యగారు బహిర్ముఖులై చిరునగవుతో గతరాత్రి నిదురలేని కారణమున నిద్రవచ్చినది అని లేచి బీటికై జనుచుండ జూచి బీట నెద్దులు లేవు ఇంటికివచ్చినవి రమ్ము పోదమని చెప్పుచు బుత్రునితో నిల్లుజేరినారు బాపయ్యగారు.

పుత్రు డనుభవించినది నిద్రసుఖముగాక సమాధిసుఖమని గ్రహించినవాడగుట నాటనుండి వ్యవసాయమును మాన్పించి అందు మఱియొకని నియమించి పుత్రుని ఆధ్యాత్మికసాధనమునకు సంపూర్ణదోహద మొసంగినారు. బాపయ్యగారు నాడుమొదలు వీరయార్యులు సత్తెనపల్లిజేరి గురుసేవ జేయుచు నాధ్యాత్మికరహస్యము లెఱుంగుచు సంతృప్తులగుచుండిరి.

ఇట్లుండ బీరోజీగారికి సంజావ్యాధి యంకురించి యంతకంత కతిశయించుచుండె మందులు పనిజేయుట లేదు. కంటికి రెప్పవలె గురువుగారిని కనిపెట్టియున్నాడు వీరయ్య 8-7-1886 సంవత్సర ఉదయం 8 గంటలకు తండ్రివద్దనుండి యుత్తరము వచ్చినది చూచినాడు తండ్రి బాపయ్యగారు తీవ్రవ్యాధిగ్రస్తులైనారని తెలిసి దేశికాచార్యానుమతి దీపాలదిన్నెపాలెమునకేగి జనకుని కారోగ్యము సంపాదింప బలుపాట్లుబడుచు, గురువును సమీపింపలేకపోయినాడు 19-17-86 సంవత్సరము నాడుదయం మెనిమిదిగంటలకు బీరోజీ పరమపదమలంకరించినారు.

నాటిబగలంతయు వీరయ్యగారు పితృసేవలో నిమగ్నులై యుండుట వలసి రాత్రి పదిగంటలకు పరుండి కనుమూసిరి. వెంటనే గురువుగా రగుపడినారు నేను హరిసన్నిధిసేవలో మునిగి మైమరచితి నని చెప్పి యంతర్హితుడైనాడు వెంటనే మెలకువగొని స్వప్నవృత్తాంతము దండ్రి కెఱింగించి సెలవు గొని యప్పుడ బయలుదేరి సత్తెనపల్లి జేరి గురువియోగమున కడలుచు గొంతవడి నిశ్చేతనుడై యుండి యెట్లో మనస్సమాధానమంది అనుయాయులతో గలసి నాడు జరుగ వలసిన సమాధికార్యకలాపముల బూర్తిగావించుకొని భర్తృ వియోగదుఃఖమున మునింగిన వీరాబాయిగారిని గురుపుత్రులను, ఓదార్చి, విజనస్థలి జేరి గురువియోగమునకు బరితపించుచు దుఃఖాశ్రువులు వెల్లిగొన మైమరచినతరి గురుమూర్తి సాక్షాత్కరించి పుత్రా! మదీయవియోగబాధ కడలుచుంటివి ఊరడిలుము, నేను నిన్నువిడచి యెక్కడికిని పోలేదు. పోవువాడనుగూడా? కాను, మధ్యవచ్చిన శరీరము మధ్యనే పోయినది. దీనికై విలపింపదగదు. నేను శాశ్వతుడ, నీవుగూడ నట్లే శాశ్వతుడవు నీవు జీవన్ముక్తుడవు, నేవిదేహముక్తుడ గాన నూరడిల్లుము మనమిరువురకు గమ్యమొక్కటియే? అని పలుకుచు నంతర్హితుండైనాడు.

అంత వీరయార్యులు మెలకువనంది స్వప్నవృత్తాంతమంతయు స్వీయులకెఱింగించి సంతోషాయత్తచిత్తుండై గురుపల్లి సెలవంది యిల్లుజేరి జననీజనకులసేవయందు జాగ్రత

గలిగి మెలంగుచు సత్తెనపల్లియందలి గురుకుటుంబమునుగూడ నొకకంట గనిపెట్టియుండెను.

పరమార్థాభిలాషియగుట బ్రహ్మచర్యవ్రతమున కడ్డగు నని యెంచి పితరులయాజ్ఞ నిరాకరించి వీరయార్యులు వివాహము మానుకొనినాడని యెఱింగి గురుపత్ని మీరాబాయిగారే తెంచి గురువర్యులు సాగించిన సాంసారికయాత్ర శాస్త్ర దూష్యము గాదని తెలిపి సమ్మతిపరచి "వెంకటనరసమ్మ" అను అనుకూలకన్య నొకరితెనుగూర్చి వీరయ్యగారికి వివాహము గావింపించినారు. అనుకూలవతియగు భార్యతో గలసి మెలసియుండి ఒకేపుత్రికాజననముతో నాత్మసన్యాసదీక్ష గైకొని జీవితాంతమువఱకు బ్రహ్మచర్యవ్రత మనుష్ఠించిన ధీశాలి మన వీరయార్యులు.

నాటనుండి వీరిదృష్టి నిజపాదాంగుష్ఠమున లగ్నమై చెదరక నిలచినది. మితభాషి, నిరాడంబరి బ్రహ్మావలోకనాదక్షుడు గురువుగారి సమాధి కధ్యక్షతవహించిన లక్ష్మమ్మజీగారికి నంజువ్యాధి యంకురించినది పెదగోవిందరావుగారితో గలిసి గురుపుత్రుని పిఠాపురమునకు దీసికొనివెళ్ళి మందిప్పించినారుగాని రోగశాంతి లేదు. లక్ష్మమ్మజీగారి యభిమత మెఱింగి వీరయ్యగారు తత్ప్రధానాధిపత్యము వహించిరి. లక్ష్మమ్మజీయనంతరము గురుపత్నియగు మీరాబాయిగారి సహాయముతో నాశ్రమకార్యముల దిద్దుచు నభివృద్ధికి దెచ్చి స్వీయకృషితో గీర్వాణాంధ్రభాషలభ్యసించి ఆశుధారాకవిత్వమలవడ గురుపరముగ గేయపద్యములు విరచించి పవిత్రజీవితము సాగించి పిదప

దేశికాచార్యులమనుమడు పీరోజీబాబుగారికి మఠాధిపత్య మొసంగి దుందుభిసంవత్సర కార్తీక శుద్ధ పంచమి (9-11-22)హరినామస్మరణతో బరమపదమలంకరించినాడు వీరయార్యులు.

నిర్యాణాత్పూర్వమే తనకు జరుగవలసిన యుపక్రియల నిరూపించి చెప్పుచు గురుప్రదత్త యచలాద్వైతగ్రంథమునొద్ద యుంచుకొని మననముచేయుచు సంపూర్ణ వివేకముతో దేహమువదలినారు భార్యా వెంకటనరసమ్మగారు నాకేమి సెలవిచ్చినారన ఐహికమే లేదు. సర్వవ్యాపకమైన సచ్చిదానంద పరబ్రహ్మముమాత్రమున్నది దాని ననుభవింపుచు జీవితము సార్థకపరచుకొమ్మని సెలవిడినారు. పునర్దర్శనభాగ్యము లేదుగదా? అని ప్రశ్నించిన పత్నికి నేశాశ్వతుండ గురుసేవా పరాయణుడనై అదృశ్యాకృతితో, గురుసమక్షమందుండెద నప్పుడప్పుడు నీకుమాత్రము నాదర్శనములభించుగాక.

వీరయార్యుల భౌతికశరీరము బాబుగారి సమాధియెదుట పీరోజీమఠమునందే సమాధిగావింపబడినది. విధినిషేధదూరుడైన యినగంటి పున్నయార్యులు వీరి శిష్యకోటిలో నొకను.

ఒకప్పుడు గురువుగారింట బెఱుగుచుండు శునకంబొండు తలవని తలంపుగా వచ్చిన దానిని తనయిష్టదైవమునకువలె భావించి పాదప్రక్షాళనాది సత్కారములగావించి రెండు దినసముల కావల దానిని వెంటబెట్టుకొనివచ్చి గురువుగారి కప్పగించిన ధన్యజీవి. ఈ సంఘటనమువలస శ్రీవారి గురుభక్తి యెంతటిదియో? తెల్లమగుచున్నది.

చిరుమామిళ్ల సుబ్రహ్మణ్యముగారు

గతజన్మమున యోగసిద్ధిగడింప యత్నించి పూర్తి గామి మరుజన్మమున తత్సిద్ధికొఱకు పుణ్యాత్ముల గృహమం దుద్భవించి పనిగొని మానవుడు ధన్యుడగుచున్నాడు.

వీడు ప్రతిబంధముల నన్నింటిని క్రమముగ దాటుచు కోట్లకొలది జన్మములసాగించి చివఱకు యోగభ్రష్టుడై పుణ్యుల గృహమునం దవతరించును. ముక్తికి సాయపడు సమస్తసాధనములు దమంతదామె వీని నెన్నంటును యతిరాజని పిలువదగిన వాడితడే, వీడే; పరబ్రహ్మముతో గలిసి యేకరూపమును పొందిన పరమధీరుడు వీడే; చిత్తమునకుగల యవిద్యావరణము తొలగినవాడు వీనియందు చిదాకాశ మస్తమించినది వీనికి శబ్దాతీతమగు సుఖములభించినది, వీనిని వర్ణించుటకు భాషచాలదు ఈతడే, వర్తమానశరీరధారియైన సచ్చిదానంద పరబ్రహ్మము.

ఇట్టివాడే" మన చిరుమామిళ్ల సుబ్రహ్మణ్యముగారు. తల్లి అంబమాంబ తండ్రి నరసయ్య గురువు అద్దంకి తాతాచార్యులుగారు. జననము క్రీ॥ శ॥ 19 వ శతాబ్దము. వీరిప్రధాన రచన వేదాంతసారసంగ్రహబోధిని. నివాసము దుర్గిధర్మవరము.

ఈమహాత్ముని తల్లి తండ్రులు చదువుకొఱకు బడికి బంపినారు సంవత్సరము వెళ్ళులోపలనే చదువుపూర్తిఅయినది పూర్వజన్మాభ్యాసపటిమ తోడ్పడిన మహాత్ముల చరిత్రలు చిత్రములగునుగదా ? పంతులుగారి వలన జెప్పబడిన పాఠ

ములు వినుటయే గాని తిరిగి దానిని వల్లనవేయుటగాని మనసిం చుటగాని యెఱుంగనే" యెఱుగడు బడిలోనున్న కాలమం తయు మౌనవ్రతధారియై యుండునుగాని లోడిపిల్లలతో మాటలాడుటగాని ఆటలాడుటగాని దెబ్బలాడుటగాని నెయ్యాల "నోరువిప్పుటయే." యెఱుంగడు ఈకారణమున నందఱి చేతను "మొద్దబ్బాయి"అని పిలువబడుచుండువాడు. పంతులు గారు కోపికాడు కాని లేకున్న, దినమునకెన్నితిట్లు ఎన్ని దెబ్బలుపడుచుండువాడో ? దేవునకెఱుక.

ఒకనాడు పంతులుగారు నరసయ్యగారిని కలిసి అయ్యా మీ అబ్బాయి నేనిడిన పాఠమెట్లో? పెదవులబెట్టుకొని యొప్ప గించునేగాని పాతపాఠములు వల్లింపడు నెత్తిన నోరుబెట్టుకొని కేకలువేసినను నోరెత్తడు పాఠములు చదువకుండిన బోనిమ్ము తోటిపిల్లలతో నైనను మాటలాడడు పాఠములు జదువు మన్న న్వాడు పుస్తకము వైపునకు దన జూపుద్రిప్పి మొద్దువలె గూరుచుండును. ఈస్థితిలో జదువెట్లురాగలదు నీని నేదండింప జాల మీారలైనను శిక్షించి దారికితెండు అదిమీావలన గాని యెడల బాలముపనిలో బ్రివేశపెట్టుడను యీామందమతి పోవు నేమో ! చూతము అని నొక్కి చెప్పెడి పంతులు మాటవిని నరసయ్య చిరునగవుతో మా అబ్బాయి విషయమైవిన్నాను మేమందఱము నిదురించిన పిదప దీపముయొద్ద గూరుచుండి తెల్లవారువఱకేదో, చదువుచునో, వ్రాయుచునో, పుస్తకము ముందుబెట్టుకొని కూరుచుండునుగాని ఊరకొనుటలేదే. చదు వకపోయిన బాఠము లెట్లొప్పగింత పెట్టగలడు మీా మాటలు

వింతగానున్నయవి. ఐననుమిమ్ములగాదనక ప్రయత్నించి చూచెదగాని నేజదువు లేనివాడనగుట మీరలే యొకపరిదయచేసి, పరీక్షింపుడు అనిన వల్లెయని పంతులుగారు నాటిరేయి పండ్రెండు గంటలకు నరసయ్యగారి యింటికే తెంచి యితరులకు గనుపడకుండునట్లు దాగియుండి పిల్లవాడేదో! వ్రాయుచున్నట్టు గురుతించి తృప్తిపడి వెళ్ళినారు.

పైగనుపరచిన స్థితిని గమనించిన సుబ్రహ్మణ్యముగారెనిమిదవ వత్సరప్రాయమునుండి ప్రతిదినము రేయి, దీపము కడ గూరుచుండి భక్తిజ్ఞానయోగపూరితములయిన పద్యములనో, కీర్తనములనో, వ్రాయుటగాని, నిశ్చంచలుండై ధ్యానసమాధిసుఖ మనుభవించుటగాని జరుగుచుండినదని తెలియబడుచున్నది.

పదియవ యేటియందొకనాడు సుబ్రహ్మణ్యంగారు తన నియమనానుసారము దీపమునకెదుటగూరుచుండి ధ్యానానందమగ్నుడైనాడు తెల్లవారినది. తల్లిచూచి పలుకరించినది. కాని జబాబులేదు. భయపడి పర్వెత్తివెళ్ళి భర్తకుచెప్పినది. అతడు వైద్యునిబిలిచి తెచ్చినాడు. అబ్బాయిచేయిచూచినాడు. నాడిచిక్క లేదు. వదనమునందు బ్రహ్మతేజము విస్తరించుటధ్యానమగ్నుడై యున్నాడని గ్రహించినాడు వైద్యుడు, భయపడకుడని తలిదండ్రులకు జెప్పుచు బిడ్డస్థితిని వెల్లడించి ధైర్యమువారికి గలిగించినాడు. కొంతసేపటికి శైత్యోపచారముతో సుబ్రహ్మణ్యం బహిర్ముఖుడైనాడు. స్త్రీయులుపురుషులును సంతోషించినారు. తదుపరి తండ్రి పుత్రుని గౌగలించుకొని నాయనా! నిదుర

వచ్చినదియా: నిద్రవచ్చిన, మంచముపై బరుండగూడదా! అన్నాడు. జబాబు లేదుగాని నవ్వు మొగముతో దలయూచి నాడు సుబ్రహ్మణ్యము లోకులీతడు యోగభ్రష్టుడగుట వదిబూర్తి జేసికొనుట కవతరించిన జ్ఞానమూర్తియని జెప్పికొన సాగినారు తెలియనివారు కొందఱీతనికి రోగమని పరితాప పడుచుండిరి. ఈస్థితి రెండు, మూడు రోజులకొకమారు వచ్చుటయు వచ్చినప్పుడు రెండుగంటలుండుటయు సంభవించుచున్నది. ప్రాకృతవిద్య సన్నగిలినది. పరవిద్య బలపడినది. అబ్బాయిగారికి పండ్రెండుసంవత్సరములు నిండినవి. బడికి పోవుచునే యున్నాడు నవరాత్రములు వచ్చినవి పిల్లలతో గలిసి గడలుపట్టుకొని గోపాలస్వామ్యాలయమునకు బోయినాడు.

పిల్లవాండ్రెల్లరు శ్రీ స్వామివారిపై దసరాపద్యాలు చెప్పుచున్నారు. గాని అందు సుబ్రహ్మణ్యము పాల్గొనలేదు గ్రామపెద్దలామహోత్సవము జూడవచ్చిరి. పఠానధారిస్తున్న సుబ్రహ్మణ్యమునుజూచి యెగతాళి చేయుచు, నీవు జదువవేమి మూగ మొద్దుగా నిలువబడినావా? చదువు. చదువు, మని గద్దించినారు. గానిమాట్లాడ లేదు. అప్పుడు పంతులుగారువచ్చి చేతులు బట్టి నా మర్యాద దక్కించుమని నొక్కిచెప్పినాడు. సమ్మతి జూపుచు బిల్లలనాపి నూటయెనిమిది ప్రార్థనారూపకందపద్యము లాశువుగా "కేశవ" మకుటముతో జెప్పి గోపాలుని నర్చించినాడు. ఈచిత్రము జూచి చూపరు లాశ్చర్యపడినారు తెలిసి తల్లి దండ్రులును సంతోషించినారు.

తన యాధ్యాత్మికసాధన యిష్టదేవతాలయమున సాగింపదలచి తల్లిదండ్రుల మెప్పించి అపరరాత్రి బయలుదేరి గోపాలస్వామివారి యాలయమునకేగి ముఖద్వారముకడ నిలచి భక్తిపెంపున స్వామిని ప్రార్థించినవెంటనే తదాలయపు తలుపులు బిగింపబడినవైనను గోపాలుని దయవలన తాళము లూడిపడెడివి. సుబ్రహ్మణ్యములోన ప్రవేశించి స్వామిని దండకరూపమున ప్రార్థించి ప్రసన్నుని గావించుకొని ప్రభునాన స్వామివారికెదుట గూరుచుండి నియమితకాలమువఱకు సాధన సాగించి తృప్తుడై నిజగృహమునకేగువాడు. ఇట్లు కొన్నిరోజు లేగిన దాను స్వయముగ బిగించిన తాళములూడి తలుపులు తెరువబడియుండుట శంకించి దొంగనుబట్టు తలంపున మామూలుప్రకారము దలుపులుబిగించి ఆ యాలయావరణము నందొకమూల దాగియున్నా డర్చకుడు నియమితకాలమునకు సుబ్రహ్మణ్యముగారు వచ్చిరి. స్వామిని ప్రార్థించిరి. తాళాలు తెగిపడినవి. ఆలయములో ప్రవేశించి జపముముగించుకొని యింటికేగినాడు దాసుగారు.

ఇదియంతయు స్వయముగాగాంచిన యర్చకుడు మరునాటిరేయి ధర్మకర్తను వెంటగొని మఱి ముగ్గురు స్నేహితులతో దేవాలయావరణమునగల రహస్యస్థలమున దాగినాడు. నియమితకాలమునకు సుబ్రహ్మణ్యముగా రేగిరి. ప్రయత్నమేమియు లేకయే తాళములూడిపడి తలుపులు తెరువబడినవి. లోనికేగినాడు స్వరచితగీతములతో స్వామిని ప్రార్థించినాడు.

గాని ప్రసన్నుడుగా లేదు తన గుట్టెఱుంగుట కితరు లేవ్వ రాల యావరణమందు దాగియుండినట్లు లంతర్వాణి ప్రబోధమున నెఱింగినాడు. ఆలయప్రదేశమంతటను నదకి యొకచో వారిని జూచినాడు చూచి "మీకేమిపిచ్చియా, పొండు పొండు" అని వారిని మందలించి తిరిగి కోనెలలో జేరి స్వామిని బ్రస న్నునిజేసికొని తత్ప్రసాదమున నియమితకాలమువఱకు సాధన సాగించి కృతార్థుడై పరిభువాష్ట స్వగృహాపరివేశియైనాడు.

అంతకు ముందు తనకొఱకై గాచియున్న పురవాసి యొకడేతెంచి మీ యాధ్యాత్మిక సాధనమున కంతరాయము గలిగింప యత్నించిన మూర్ఖులు నల్వుర కున్మాదవ్యాధి సోకినది తన్నివారణ మర్థించుచున్నారు దయచేయుడని ప్రార్థిం చుట, కనుమతి బ్రకటించి భగవానుని చిత్రచద్ధుమునకల రుచు వానినెంటజని భగవత్ప్రసాదతీర్థముల నున్మాదగ్రస్తుల కిడి నంత వ్యాధివిముక్తులై క్రమముగ సంపూర్ణారోగ్యమతు లైనారు. నాటనుండి జీవితాంతమువఱకు దీర్ఘపరిసాదములతో నివారింపజేసిన శారీరికమానసికవ్యాధులు వేలకు మించి యున్నవన నతిశయోక్తిగాదు ఇప్పటికిని శ్రీవారి సమాధికి గావించెడి ప్రదక్షిణ పారిణాచారములతో నెమ్మతించెడి వ్యాధులు లెక్కకు మిక్కుటముగనున్నయవి.

క్రమక్రమముగ దాసుగారి కిరువదవయేడువచ్చినది. బ్రహ్మచర్యవ్రతముచే జీవితముగడుప వలయునను సంక ల్పము గలిగినది. గాని గురువు తాతయాచార్యులవా రరు

దెంచి నైష్ఠికబ్రహ్మచర్యవ్రత మత్యంతకఠినమగుట భక్త లోకము గార్హస్థ్యబ్రహ్మచర్యమునే యవలంబించి తరించినదని జెప్పియొప్పించి సుబ్రహ్మణ్యమును గృహస్థునిగావించిరి. వీరి మునిమనుమడగు సుబ్బయ్యగా రన్నివిషయములయందును తాతగారితో దీటయినవారు. ఈ సుబ్బయ్యగారిభార్య సజీవి.

మన సుబ్రహ్మణ్యముగారు వ్యవసాయవృత్తితో జీవ యాత్రసాగించుచు పునరావృత్తి రహితశాశ్వత బ్రహ్మపద మలంకరించిరి వీరి వలన జేయబడు వ్యవసాయకాలములో నొక విచిత్రసంఘటన జరిగినది పండిన వరిగచేను కోయుటకు త్రిపురాంతకమునుండి కూలీలు వచ్చినారు. తానొద్దనుండి కోత మొదలుపెట్టించి భోజనమున కింటికివచ్చినారు. సుబ్రహ్మణ్యం గారు కూలీలలో నాయకుడు పురుషోత్తమదాసను పంచముడు గలడు. ఇతడంతరంగభక్తుడు. మనస్సు భగవంతునకర్పించి శరీరము వరిగెకోతకు నియమించినాడు. తోటికూలీలందఱు నాయన ననువర్తించిరి.కోతజరుగుచున్నది.భగవన్నామముతో దిక్కులు మారుమ్రోగుచున్నవి. గట్టుగనుమ లేవియు వారికి దెలియుటలేదు. వంచిన నడుములెత్తకుండ పనిసాగించు చున్నారు. భూస్వామిగట్టుదాటి కాడిగట్టునగల యితరరయితు భూమి చివరకుపోయినది. మునుము, సుబ్రహ్మణ్యముగారు వచ్చి కోతనాపి మందలించిన పురుషోత్తమదాసు నమ్రుడై తన మనస్సు భగవంతునివైపునకు ద్రిప్పుకారణముగా హద్దు మీరితిననియు దనననుసరించి అనుయాయులు పనిగొనుట

ప్రమాదముజరిగినదనియు జెప్పుచు క్షమాపణముగోరిన సుబ్రహ్మణ్యముగారు పురుషోత్తమునకు నమస్కరించి నీవునాకొక దేశికాచార్యుడవైతివి యిప్పటి నీమనోవృత్తి ననుసరించి ధ్యాననిష్ఠసాగించి ధన్యుడనగుదునని వచించి ధ్యానసమాధి నార్జించినాడని చెప్పెదరు.

ఈ పురుషోత్తమదాసు పుట్టుపూర్వోత్తరము లేమియు దెలియవచ్చుటలేదు. లభించిన రెండవసంపుటమున జేర్చి ధన్యుడనగుదునని మనవి.

సుబ్రహ్మణ్యముగారిచే రచింపబడిన గ్రంథములు

1. కేశవశతకము (ఆశుధార)
2. సగుణనిర్గుణతత్త్వకందార్థములు
3. గోపాలశతకము
4. గోపాలశతకము (నిందాస్తుతి)
5. త్రిలోకవందితశతకము
6. చిత్రశతకము
7. భక్తివశవర్తిశతకము
8. విజ్ఞానదండకము
9. నీతిబోధ (పూమాలలు)
10. వేదాంతకీర్తనలు

శ్రీవారు తనయెనుబదవయేట పరమపద మలంకరించిరి.

ఉన్నవ ఆనందరామదాసుగారు

నిత్యనైమిత్తికాది కర్మలు నియమముగ నెరవేర్చుచు నాధ్యాత్మికదృష్టిగలిగి "నే నెవడను, ఎందులకు వచ్చితి, ఏమి చేయుచున్నాడ, ఎవనియాజ్ఞ మెలగుచున్నాడను, ముందెక్కడికి బోవలె" మొదలగు విషయముల దర్కించి, తర్కించి తెలియని రహస్యముల బెద్దలవలన నెఱింగి తెలిసిన విషయముల మరువక గ్రమముగ స్వానుభవమునకు దెచ్చుకొనుచు, యమనియమాదుల బరిశుద్ధమానసుడై సత్యశౌచాదిసద్గుణగణముల నార్జించి స్వార్థబుద్ధి నడంచి పాపభీతిగలిగి, అవ్యయానందమును, సర్వసమ్మతభావమును, నిర్భయత్వమును, నిశ్చంచలచిత్తమును, నిరుపమానగాంభీర్యమును, వాసనాత్రయవినాశమును, సాధించి తాను అనునది, వినునది, పల్కునది, తలచునది, నేను, నాది అనునది వేయేల సర్వము పరబ్రహ్మమొక్కటియే అని తెలిసికొనిన జీవుడే, దేవుడగుచున్నాడు.

ఇట్లే, తనయందు విశ్వమును, విశ్వమునందు దనను, జూచుమహాత్ముడు మన ఆనందరామదాసు. వీరినివాసము బాపట్లతాలూకా చినలింగాయపాలెము. తల్లి వెంకమాంబ. తండ్రి పానకాలుశర్మ. కుమారులు సీతారామాంజనేయులు, ప్రసాదరావు, వెంకటకృష్ణయ్యలు. జననము క్రీ॥ శ॥ 1856 సంవత్సరము, గురువు పోలూరి పాపరాజుగారు.

ఈతడు బాల్యమున భగవల్లీలాదికములగు నాటల, పాటలచే గడపి బడియందుండు కాలమునందు గాని, ఇతర సమయములందుగాని చెడ్డపిల్లవాడనిపించుకొనుటయే కాక వేళకింటికి భోజనమునకు రాక గ్రామబహిః ప్రదేశమందుగల సావడులలోను, ఇతర రహస్య స్థలములను గూర్చుండి గోపాలనామస్మరణజేయుచు దన్మయానంద మనుభవించు చుండువాడు. తలిదండ్రులు ప్రయాసపడి, వెదకి తెచ్చినగాని యింటికివచ్చువాడు గాడు

ఎట్లో బడిచదువు పూర్తియైనది. పానకాలుశర్మగారు కుమారున కుపనయనము గావించినాడు. పౌరోహితుడువచ్చి వడుగును గూర్చుండబెట్టి ఆపవిత్రపవిత్రోవా అను శ్లోక మును పూర్తిగాజెప్పి చదివించినాడు. దాసుగారు భక్తిశ్రద్ధలతో జదివి, దీనికి దాత్పర్యమెఱింగింపు డని విసయముతో మనవి జేసినాడు. గాని ఆపురోహితు డర్థముదనకు దెలియదని చెప్పుట, దలయూచి నిరుత్సాహపడక నచిరకాలమున సంధ్యావంద నము కంఠస్థముజేసి, అర్థములేని చదువు వ్యర్థమను ఆర్యోక్తి యెంతయో, కలువరపరుప దృప్తిగొనక, దాత్పర్యమెఱుంగు తలంపుమిన్నుముట్ట సమయమున కెదురుజూచుచుండె. దాసు గారికి బదునైదవయేడు వచ్చినది ఏండ్లుపైబడుకొలది విజ్ఞాన భాగ్యము రేకెత్తుచున్నది. జ్ఞానాజ్ఞానములకు జనుపుతో నిమి త్తము లేదనుట సర్వులెఱింగినవిషయమే గదా. నేనెవడను, తల్లిగర్భమున బ్రవేశించుటకు ముందు నాకీదేహముగలదా,

లేదుగదా, అట్టులైన నీ దేహమెట్లువచ్చినది. ఎందులకు వచ్చినది దీనిపెంచుచుండువాడెవడు ముందొకప్పు డీదేహము లేని స్థితి నాకేర్పడవచ్చునుగదా! దుఃఖముల కాకరమగు యీ దేహము రాకుండగ జేసికొనుట కేదేని యుపాయము గలదా మొదలుగాగల ప్రశ్నల దనలో దా నూహింపుచు సమాధానముల జెప్పుకొని సంతసపడుటయో, సరియగు సమాధానముల రామి పరితాపపడుటయో, జరుపుచు ఎట్లో కాలము నెట్టివేయుచుండె, ఇట్లుండ వివాహమైనది. భార్య బాపమాంబ కాపురమునకు వచ్చినది.

ఇరువదేండ్లవాడైనాడు, దైవాద్యావిజ్ఞానశిరోమణి యగు పోలూరి పాపరాజుగా రరుదెంచి దాసుగారి జిజ్ఞాస నెఱింగి ఆతడడుగు ప్రశ్నములకన్నింటికిని దగు సమాధానము లిడి సందేహములదీర్చి సంధ్యావందనమునకు దాత్పర్యము విశదముగావించి నాయనా! నిత్యకర్మల గొరవడనీక ముగించు కొనుచు నైమిత్తికములయం దశ్రద్ధవహింపక సక్రమముగ సాగించుచుండిన జిత్తశుద్ధిగలుగు దద్వారా గాయత్రీమహా మంత్రోపాసన సిద్ధించు, గాయత్రీమంత్రసిద్ధి లభించిన వెంటనే నీప్రయత్నమేమియు లేకయే సప్తకోటి మహామంత్రసిద్ధి కర తలామలకమగు దాన యవ్యక్తోపాసనమలవడి పునరావృత్తి రహితశాశ్వతబ్రహ్మలోకప్రాప్తి లభించి ప్రత్యక్ష సచ్చిదా నందస్వరూపివై యలరారగలవు. ఇదియే స్థితప్రజ్ఞస్థితి. అని సాదరముగా విశదపరచిన గురువుగారితో "అయ్యా మఱి

యొకమనవి. పిన్నటనుండి వీడికి శ్రీరామకృష్ణనామమున్పై నభిమానముమెండు భవదీయాజ్ఞ ననుసరించి గాయత్రీజపము సాగించిన నిష్టమూర్తిని నిరాకరించినట్లగు నేమో! అని శంకించెద ననుటయు, జిరునగవుతో! బిడ్డా! గోపాలమంత్రోప దేశము గావించెద గోపాలగాయత్రీమంత్రములలో నీ కభిమానముగల మంత్రమును ప్రధానముగా జేసికొని మిగిలిన మంత్రమను సంధింపుము అనుసంధానమంత్రమువలన బ్రధానమంత్రమునకు బలమేర్పడి త్వరలో సిద్ధిలభించు దాన గృతార్థడవయ్యెదవని తెలిపిన సంతసించి పనిగొని దక్షిణలచే దేశికాచార్యుల సత్కరించి సబహుమానముగ నంపి గ్రమముగ మంత్రద్వయసిద్ధి గడించినారు దాసుగారు.

దాసుగారి గృహములోని వాతావరణ మనుకూలముగా నుండకపోవుట గారణముగ సాంసారికచిక్కులలో దగుల్కొననివాడై యెక్కువకాలము మౌనదీక్ష వహించుచును కొంతవఱకు బ్రియశిష్యులచే క్లేశకారణముల విదల్చుకొనుచు తనబ్రహ్మనిష్ఠను నిర్బాధకముగ సాగించిన పుణ్యమూర్తి అపకారుల కుపకారములు జేయుస్వభావముగలవాడగుట దన కెవనివలన నెట్టియాపదవచ్చినను సహించి మహోపకారములనే కావించుచు,

పరులునిందించుపట్ల గోపంబుగొనక
శాంతమునుభూని వినయపు ష్కతలనూని
ఖిహితసంభాషణంబుల వెలువరించి
స్వాంతమా? వారిసంతస పఱపుసతము.

అనుసమస్థుని వాక్యానుసరణి బనిగొని తృప్తిపడుచు
నహంకృతి నడంచుకొనిన సత్యమూర్తి. దాసుగారు ప్రాణా
యామసిద్ధివలన జిత్తైకాగ్రత సంపాదించి తద్వారా బ్రహ్మైవ
లోకనమహాభాగ్య మలవడ సర్వశక్తిసంపన్నుండును నిరా
డంబరజీవియునగుట దత్తన్మహాశక్తుల శిష్యకోటి కందించుచు
సాధుజనవంద్యుడై విరాజిల్లిన యశోవిశాలుం డానందరామ
దాసు వీరి శిష్యకోటి శతాధికము అందు ముఖ్యులు ప్రతాప
రామావధాని, కృష్ణమూర్తి, బాణాల భద్రయ్య, మాదిరెడ్డి
వీరభద్రరావు, భాగవతుల కృష్ణదాసు, కుసుచేటి వరదమ్మ
గార్లు ముఖ్యులు.

దాసుగారు తన డెబ్బదియవయేట నొకనాడు వివిధ
గ్రామములనుండి శిష్యులరావించి గోష్టి సాగించి నేడీభౌతిక
దేహము విడచి స్వధామమగు పరమపదమున కేగ
నున్నాడ గాన వినుండు పరమపద మభిలషించువారెల్ల రే
జీవికిగాని కష్టదాయకులు కారాదు. సత్యదీక్ష వహించి ధన
మార్జించి ధర్మకార్యములకై వెచ్చింపుచు గామక్రోధములకు
లోనుగాక భూతమైత్రి సంపాదించి నిష్కాపట్యధారులై
నిర్భయస్వరూపులై అసూయారహితులై వర్తించుటముఖ్యము.

ఈ గుణము లలవడనిచో ఆత్మానాత్మవస్తువివేకము
ఇహాముత్రార్థఫలభోగవిరాగము శమాదిషట్కసంపత్తి
ముముక్షుత్వములను సాధనచతుష్టయసంపత్తి లభ్యపడదు.

ఇవిలభింపనిచో ముక్తి దుర్లభము, కేవలభగవన్నామసం
కీర్తనమునఁ ముక్తినార్జింప దలంచినవారుగూడ యమ నియ
మాదులు గష్టించి సాధించిననే యిష్టార్థసిద్ధి లభించుట,
లేనిచో గగనపుష్పమేయగు మీలో నేను, నాలో మీరనుస్వాను
భవమున దోచుటయే? అద్వైతసిద్ధి ఈసిద్ధిని బాహ్యమునకు
జూపుటయే, సన్యాసము మరణకాలమందు గ్రహించునట్టి
ఆశ్రమస్వీకారమున కాతురసన్యాసమనిపేరు ఇప్పుడు నేను
మానసికముగ సన్యసించితి గాన మీరంద ఱైక్యకంఠముగా
భగవన్నామసంకీర్తనము గావింపుడు, అనిబోధించి శిష్య
బృంద మనువర్తింప భజనచేయుచు క్రీ॥ శ॥ 1935 సంవత్సర
మందు వచ్చిన భాద్రపద శుద్ధ తదియరోజు జీవబ్రహ్మైక్య
మును పొందినారు వీరి కుమాళ్ళయం దిరువురు సత్సంతాన
సంపదలతో దులదూగుచున్నారు.

మాల ఓబులు.

మానవుడు తనకులభించిన ధర్మక్షేత్రమైన మానవ దేహమును బూదియందు బ్రేల్చబడిన నేతికివలె వ్యర్థ పరచుకొనుచున్నాడు. ఇందునకు గారణము స్వీయధర్మమును విడి పరధర్మమనుష్ఠించుటయేయగు జీవితగమ్యము గ్రహింపగలిగినచో, హృదయమం దానందమును గృహమునందు దృప్తి దేశములోవృద్ధి లోకములో శాంతి లభించితీరును. ఈ శాంతియే మోక్షము మానవగమ్యము బ్రహ్మసాక్షాత్కారము?

అపరోక్షానుభవమునో, మోక్షమును చవిజూచుటయే, అన జన్మరాహిత్యము జేసుకొని స్వస్వరూపానంద మనభవించుటయే, పునరావృత్తిరహితశాశ్వతబ్రహ్మపదము కాని సామాన్యమానవుడు ఆత్మవిచారణాశూన్యుడై దుర్లభమైన మానవజన్మ తనకెందుల కెవనివలన నీయబడినదో, తెలిసికొన జాలకున్నాడు, నిత్యసత్యమైన దైవమునుమరచి అనిత్యములైన విషయాలవెంటనంటి సంసారసాగరమునమునిగి పోవుచున్నాడు. అస్థిరమైన దేహమే తాననుకొనువాని కేగతిగాక శాశ్వతసుఖమెట్లు గలుగును? నిజముగ నాత్మవిచారణసేయువాడు కోటికొక్క డేనియు దొరకడు వీడు స్వాత్మపరీక్షగావించుకొనుచు దానుగమ్యము వైపునకు బయనముసేయుచున్నదియు లేక నధోగతిమార్గముబట్టినదియు దెలిసికొనగలడు. తన ప్రస్తుతస్థితి గ్రహించినప్పుడే, భావిస్థితి వృద్ధిజేసుకొని తరింప వచ్చు కాలమమూల్యము చిందిపోయిన పాలకై చింతింపక

తమమానవధర్మము నిలబెట్టుకొన బ్రయత్నించి కృతార్థులైనవా రన్నిజాతులయందును కలరు. వీరలలో మన మాల ఓబు లొకడై యున్నాడని నుడువుభాగ్య మబ్బినందల కెంతయు గర్వించుచున్నాడ.

ఈతని నివాసము కడపమండలమునందలి ఒంటిమెట్ట. తల్లి పేరు ందేవి. తండ్రి మునిస్వామి క్రీ. 19వ శతాబ్దము ఈ దంపతుల కినుప తునక చెకుముకిరాయికి నగ్ని పుట్టినట్లుల మన ఓబులు పుట్టినాడు ఈతడు దినదినాభివృద్ధినందుచుండి పరిపూర్ణయౌవనవంతుడైనాడు తరుచుబురాణములు జరుగు స్థలములకు హరికథలుజరుగు ప్రదేశములకు భజనలు జేయుచుండుపట్టులకుబోయి తత్కాలక్షేపముల రేలంతయు గడపుచు బగలు వ్యవసాయదారుల పనిపాటలకు గూలికేగి ద్రవ్య మార్జించుచు ఇటులిహమును అటు పరమునుగూడ సంపాదించుకొనుచున్నాడు. సత్కాలక్షేపములలో బాల్గొనుటచే నోబనికి భక్తిజ్ఞానము లలవడినవి.

నేను ఎవడను, ఎందుకుబుట్టితి, పుట్టినవారంద ఱేమగుచున్నారు. నేను, పరమాణువునని, జ్ఞానానందస్వరూపుడనని, పాపరహితుడనని, శాశ్వతుడనని, ముసలితనమును చావును లేనివాడనని, నిత్యుడనని, శోకరహితుడనని, ఆకలిదప్పులు లేనివాడనని, సత్యకాముడనని, సత్యసంకల్పుడనని, శాస్త్రములు చెప్పుచున్నయవి నా కింద్రియములే లేవట లేని వెట్లు వచ్చినవి. ఆకలిదప్పులేల నన్ను బీడించుచున్నవి. పరమాణువుగానుండు నా కింతటిదేహ మెట్లువచ్చినది. ఎందులకువచ్చి

నది ఈ లక్షణములు నావిగావు. దేహలక్షణములు నేను; దేహినిగాని, దేహమునుకాను. ఇంటిగోడకు సున్నముగొట్టిన యింటనున్నవానికి సున్నముగొట్టినట్లగునా! ఇంటిగోడను త్రివ్విన నింటనున్నవాని దవ్విన ట్లెట్లగును ఇల్లు పడిపోయిన నింటివాడు పడిపోయినట్లెట్లగును. ఇల్లుకాలిన నింటగలవాడు కాలినట్లెట్లగు ఆ తెలిసినది. ఈ యిల్లు నాదనుకొనుటచే నింటికి దగిలినవన్నియు నాకు దగినట్లే! అభిమానముచే ననుకొనుచున్నాను దీనికి గారణము లహంకారమమకారములే! దేహము, నేను కాదు. శాశ్వతుడ ఈ దేహమో! అశాశ్వతము, నాకింతకుముందటి దేహములు, రాయిగానో, చెట్టుగానో, పశువుగానో ఉండెనట. పుణ్యాత్ములు నాపై బగుండుటచేతను దేవునకు టెంకాయ గొట్టుటలోనగు పుణ్యకార్యముల నన్నుపయోగించుటచేతను రాతిజన్మముబోయి వృక్షజన్మలభించెను. వృక్షముగా నుండునపుడు పుణ్యాత్ములు నా నీడను నిల్చి గాలిపీల్చుటచేతను నా ఆకులు, పూవులు, కాయలు, పండ్లు నుపయోగించుటచేతను దిక్కులేని పక్షులకాశ్రయమునై యుండుటచేతను నతికినను పరులకపకారము గావింపకుండుటచేతను వృక్షజన్మమువిడచి పక్షిజన్మవచ్చినది. పపుణ్యోదయముచేతనో, రామ, రామ, అనుటచేతనో, పక్షిజన్మముపోయి పశుజన్మవచ్చినది. అందు లభించిన గడ్డిగాదముల దిని పాలచేతను, పేడచేతను లోకులకు సాయపడు భాగ్యములభించి ఈ మనుష్యజన్మవచ్చినది. తెలిసిచేసినను తెలియకజేసినను పుణ్యపాపము లూరకబోవు మనుష్య

డగుటచే నితరజన్మములయందు లేని జ్ఞాన మెక్కుడి యెక్కువ యైనది. మనుష్యజన్మ దుర్లభమనుట కిదియే కారణము. ఇట్టి జన్మము వృథా జేసికొని అధోగతిపాలగుట సరిగాదు. మానవు నకు దుర్గతులుమూడు. హింస కామ్యకర్మ పరదూషణ ఈ మూడింటిని వదలి భగవంతునాశ్రయించెద. దన నెవ్వఁడుమనువ కుందురో, తాను వారిమాగునబోవట ఇది సమస్థనివాక్యము దీనినసుసరించి ధన్యతగాంచెదగాక. తల్లిదండ్రులసేవ మరువ కుండెదగాక. అని నిశ్చయపరుచుకొని భగవన్నామమును జిహ్వాగ్రమునుండి విడిపోనీక గడుజాగరూకుడై మెలంగుచుండె.

ఇట్లుండ గొన్నిదివసములకు చైత్రశుక్లాష్టమి నారం భించి శ్రీసీతారామబ్రహ్మోత్సవము జరుగుచుండ మనటీబులు సంజీవరాయుని కోవెలముందు శ్రీరాముని కభిముఖముగ నిలచి తంబురచిటికలంతో శ్రుతిలయ లేకము జేసి.

ముఖారి — ఆది

ఎపుడు దర్శనమిచ్చెదో కృపతోడ రఘురామ
అపరాధినని నీవు నెపములెంచకు దేవ ॥ ఎపుడు ॥
జడుడను, బాలుడ, జాల్మడమత్తుడ
గడుబాపచిత్తుడ, గరుణింపవే, రామ ॥ ఎపుడు ॥
అంజలిముందునే, నంజనాసుతవరద
రంజిలజేసిన, రాదుగానీపుట్టు ॥ ఎపుడు ॥

అని పాడుచు, నార్తుడై భజనసేయుచుండ, ఆతాబాకా చవాశ్మీల్దారు, నిజసతీసుతులతో, మడుగులుగట్టుకొని, దేవా లయమునకు బోవుచు, భజనసేయుచుండు టీబులునుగాంచి,

ఉత్సవకాలమున స్వామిదర్శనార్థమై వచ్చినవారికి స్పర్శదోష మంటదని, తెలియని వాడగుటయు, జలపాత్రిజేనున్నచో, జండాలాదిస్పర్శన సల్లాపదోషములు లేవని, తెలియని వాడగుటయు, అధికారదోషము నెత్తికెక్కినైలబడితినని, తలంచి, కోపించి భృత్యులచే నోబనిగెంటించె.

అంత, ఓబడు, దనపరాభవమునకు జింతింపక భగవత్సాన్నిధ్యము బాసిపోవుచు,

ఆనందభైరవి — ఆది

ఇకనాకెవడుదిక్కు, ఇందిరారమణి
ఇకనాకుదిక్కెవ్వరు, రామా, రామా ॥ ఇక ॥
ఇకనాకుదిక్కెవ్వ । రిందఱుజూడగ
ప్రకటితముగనీవే, పదపదయన్నితోయ ॥ ఇక ॥
నీవేనాదిక్కని, నెరనమ్మినందుకు
ఈవిధిమర్యాద, లెసగించితే, రామ ॥ ఇక ॥

రామా ! ఇదియంతయు నీలీల, అని చిరునగవుతో నొలగిపోయి, ఆలయపశ్చిమభాగంబునన్నల తటాకములో నిలుచుండి.

ఆనందభైరవి – అట

చేరికొలుతు వీరరాఘవా ! కూరిమిబ్రోవు ॥చేరి॥
ఎంతోబాళివెతలజాలి వంతదూలివిలపించిన
స్వాంతమునను జింతమాని ఇంతగనికరింపవేల ॥చేరి॥

ఇట్లు లోబడా ర్తిమైభజనసేయుచుండె బ్రొద్దుగ్రుంకినది పవళింపుసేవ ముగిసినది. అర్చకులు స్వామివారికి హారతులిడి

సెలవుగొని, బోదలంచిరి. కాని స్వామిప్రసన్నుడుకా లేదు. అర్చకులెట్లో? మనంబుల సమాధానపరచుకొని కోవెలతలుపులు తాళములబిగించి నిజగృహములకేగిరి. ఓబులీశ్వర సాన్నిధ్యము గల్పించుకొని తీవ్రముగ భజనసాగించుచుండె, మాలబాలకులుభజనతో బాహ్యాని దేహముల మరచుచుండిరి. రాత్రి మూఁడవజా మతిక్రమింపకుండ నర్చకులు లేచి కాల్యకృత్యముల దీర్చుకొని మడుగులుగట్టి స్వామివారి ప్రభాతసేవ సాగించుటకువచ్చి కోవెలతలుపులు దీసి లోనికేగి స్వామివారి సమీపించి నిర్మాల్యవిసర్జనకార్యమున బ్రవేశింపదలచి పనిగొన నుంకింప స్వామి వారు పశ్చిమాభిముఖులై యున్నారు. ఈవార్త గ్రామస్థులెఱింగివచ్చి చూచి కారణమర్థయఁజాలక డిల్లపడిపోయిరి. ఈ చిత్రమరయుదలంపున బరిసర గ్రామవాస్తవ్యులు వందలకొలంది పర్వెత్తివచ్చిరి. ఎందఱు వచ్చి ప్రార్థించినను స్వామిపూర్వాభిముఖుడు కా లేదు. పై పెచ్చు నొకయర్చకున కావేశముఖుడై నాసన్నిధినుండి మదీయభక్తుని పెడదోవబట్టించినారు. నేనాతని వెన్నంటి యుండువాడనగుట మీరలెఱుంగరు. ముందు నాభక్తుని ప్రసన్నతమీకలవడిన నేనును బ్రసన్నుడనయ్యెద నని ఖండితముగ జెప్పుటయు, చూపరులాబాలగోపాలముగా భజనలతో దటాకమున దేహముమరచి భజనచేయుచుండు ఓబులును సమీపించి ప్రార్థించి సుముఖునిగావించుకొని సబహుమానముగ తోడ్తెచ్చి సన్నిధినిలిపిన శ్రీరామమూర్తియు పూర్వాభిముఖుండై ప్రసన్నుడైనాడు.

నాటనుండి ఓబులు భజనానందమున దేలియాడుచు భగవత్సాయుజ్యమహాభాగ్యము జూరగొనినాడు ఆతని వంశమువారు నేటికిని బ్రహ్మోత్సవకాలమునందు స్వామి ముందు భజనలు జేయుచుందురు.

మ॥ అమలజ్ఞాన సుదానధర్మరతి సత్యక్షాంతి నిర్మత్సర
త్వముల న్వ్యక్షతపోనసూయలగడున్దర్పించు ధాత్రీసురో
త్తముకంటెన్ శ్వపచుండుముఖ్యుడు మనోర్థప్రాణ
వాక్కర్మముల్
సమత న్నిన్నునయించెనేని నిజవంశ శ్రీకరుండయ్యెడిన్.

మనఓబు లారాధించిన రామమూర్తి ప్రభావము లొకటి రెండు జెప్పి కథముగించెద. కడపనబాబగు హీమాన్ బేగు ప్రతిహిందూదేవాలయము దూరి ఆదేవుని పేరుబెట్టి పిలుచువాడట. దేవుడు మాటపలుకకున్న అందలి విగ్రహముల బీకిపారవేయించువాడట. ఆయాచారము ననుసరించి యొకనా డొంటిమిట్టకేగి కోవెలతలుపులు దీయించి లోదూరి శ్రీరామా! ఓశ్రీరామా! అని పిలచినాడు వెంటనే లోనుండి "ఆ" అనుశబ్దము వచ్చినది విన్నాడు. శ్రీరామమూర్తి పలికినట్లు నమ్మినాడు. వాడును శ్రీరామభక్తుడై తనపేరుతో దేవాలయసమీపమునం దొకభావి త్రవ్వించి జలదానముజేయుటయేకాక ప్రాకారమునకు బురుజులు దిమ్మలు కట్టించి ప్రతిదినము దనపేర దీపము వెలిగించున ట్లేర్పాటు గావించినాడు. ఇప్పటికిని అది హీమాన్ చేగుబావి

అని పిలువబడుచున్నది. వంకలో మఱియొక భావి యేర్పడు వఱకు నీభావినీ రే శ్రీస్వామివారి తిరుమంజనమున కుపయోగ పడుచున్నది.

శ్రీరామాభ్యుదయము రచించిన అయ్యలరాజు రామ భద్రుడు, శిశువుగానున్నప్పుడు తల్లిదండ్రులు లీతసిగొని శ్రీరామ కోవెలకేగి పిల్లవాని నందొకచో బరుండబెట్టి ఎవరినో డనో చూచుచుండు డని చెప్పి, కోవెలలో బ్రవేశించి భక్తిమై స్వామికి నమస్కరించి కానుకలర్పించి తిరిగి ముందువచ్చి తల్లి చూచిన పిల్లవాడ గుపడలేదు తండ్రి చంకబెట్టుకొని వెళ్ళినా డని తలంచి స్వగృహము జేరినది. తదుపరి తండ్రివచ్చిచూచి శిశువును తల్లితీసుకొని వెళ్ళినదని తలంచి యిల్లుజేరినాడు. భార్యా భర్తలుకలిసి పిల్లవానికై గ్రామమంతయు వెదకి, వెదకి వేసారి భరింపరాని దుఃఖముతో గ్రుంగిపోయినారు. తాము కోవెలలో బ్రవేశించుటకు ముం దెవరితో పిల్లవాని కనిపెట్టియుండు డనిచెప్పిరో వారిని మరచినారు. ఇక జేయున దేమి, దుఃఖము మితిమీరినది. ఇంతలో దెల్లవారినది. అర్చకులు మడుగులై కోవెలలో బ్రవేశించి నిర్మాల్యవిసర్జనకు యత్నింప సీతాదేవియొడిలోనుండి స్తన్యము లారగించు బిల్ల వానిజూచినారు. పరుగెత్తిపోయి పుత్రదుఃఖమున గ్రుసింపు చున్న తల్లిదండ్రులకీవార్తతెలింగింప వారరుదెంచి పిల్లవాని గ్రహించి భగవదనుగ్రహమున కలుగుచు రామభక్తులై వారు గడకు సాయుజ్యముక్తులైనారుగూడా!

అద్దంకి వెంకట్రాయుడుగారు

దుస్సంగతి పతనకారణము. ఇది కర్మత్రయమున కంటెను బలవత్తరమైనది. దాని దరిజేరనీక దృఢసంకల్పముతో భక్తుడు భజనలసేయును భజనలసేయువాని తాపత్రయములంటవు. భజనప్రారంభించుటకుముందు సత్సంగతి, సచ్ఛాస్త్ర పఠనములావశ్యకములు. నమ్మకముగలిగి పట్టుదలతో ననన్య భక్తియుతముగ జేయబడుభజన భక్తునికి దోడునీడగా సాయబడును. సాధనాకాలములో రోజునకొక భక్తుని జీవితగాథనైనను శ్రవణించుచుండు నియమమేర్పరచుకొనవలయును, భగవచ్చరిత్రలవలన గలుగజాలని మేలు భాగవతచరిత్ర శ్రవణమువలన గలుగుననుట నిస్సంశయము భగవంతుని బ్రకటింపజేయజాలినవాడగుట భగవంతునికంటెను భక్తుడధికుడు భాగవతులయందు బ్రీతిగలవానికే భగవత్సాక్షాత్కారము. భజనవలనభగవంతుడు భాగవతునకు దర్శనమిచ్చుటయే కాక జూపరులెల్లరకును దర్శనమీయగలడు. భాగవతుని ప్రార్థననుసరించి యీపని జరుగును. భగవంతుడు నిజభక్తులకొఱ కవసరమైన స్వీయప్రాణములనుగూడ సమర్పింపగలడు. ఆతడు ప్రేమకు వశ్యుడగుట నారాయణతీర్థులతో గలిసి నృత్యము జేసినాడు. భక్తులయిష్టానుసారము మెలంగుట కాతడు సిద్ధపడియున్నాడు. భక్తసమ్మేళనములందు భగవంతుడు ప్రత్యక్షపరోక్షములతో హాజరగుచున్నాడు. ఇట్టిసమయములం దందఱకుగూడ భగవత్సాక్షాత్కారము

సంభవము, పరిపక్వచిత్తులైన భాగవతులు పలువురొకచో జేరి భజనలునాగించినపుడే యీపని జరుగును.

ఇట్లు జేరినభాగవతులందఱకు నీశ్వరప్రేమ శాస్త్రోక్తాచారము గలిగియుండవలయు. వీరందఱకును వైరాగ్య మవసరముగూడ నిర్మలవైరాగ్యము భగవద్భజనవలననే కలుగును పట్టుదలతో జేయంబడుభజన వలన భగవదాసక్తి గలుగు దీనినే వైరాగ్యమనెదరు. భజనసేయకనే వైరాగ్యము గోరువాఁ డతి మూర్ఖుడని చెప్పినతప్పుగాదు

ఇనుముచే నినుమును గోయునట్లు భగవదాసక్తిచే విషయాసక్తి దూరమగును. కాన మన యాసక్తివిషయములనుండి తొలగించి భగవంతునిపై నిలుపవలయు. విషయవిముఖత యేర్పడిన వెంటనే విరామములేని భజనసాగును. భజనవలననే భజనయం దభిరుచికూడ గలుగును. ఇట్టి భజనవలన భగవంతుఁడు పట్టుపడును, ఇప్పు డుపాసకు డొకనూతనదృష్టి సృష్టించుకొనినవాడగుచున్నాడు ఈ దృష్టివలన నష్టసిద్ధులు లభించుటయే కాక నిర్వికల్పమునుగూడ సాధించినవాడగుచున్నాడు.

పరిపక్వస్థితిలేనివాడు భక్తుడుగాగాని, జ్ఞానిగాగాని కాజాలడు. భజనవలన లభ్యపడని పదార్థమే లేదనుట అతిశయోక్తిగాదు. ఇట్టి మహాత్మునకే దివ్యబృందావనదర్శనము తత్పవిత్రప్రదేశమున నిరంతరాయముగ జరుగుచుండు దివ్యరాసక్రీడాదర్శనము లభించును. దివ్యదృష్టిగలవారికే యిది సాధ్యము ఈ మహాభాగ్యము గడించినవారిలో నద్దంకి వంకటాద్రియుడుగా రొకరు.

తండ్రి త్యాగరాజుగారు. తల్లి కోటమాంబ. జననము క్రీ॥శ॥ 1900 హేవళంబి ఆశ్వేలసియోగి ప్రిధవిభార్యమహాలక్ష్మమ్మ. రెండవభార్య పేరు తెలియదు. ఈ భక్త్యాగ్రణిదర్శన భాగ్యము వీడి జీవితములో మూడుమార్లు లభ్యమైనవి: అయ్యవి ఎనిమిదవవర్షప్రాయమున పంగులూరులో జరిగిన రాసక్రీడలోను, రెండవమారు పదునైదవయేట గుండ్లాపల్లి లోను మూడవమారు బాపట్లభావనారాయణ స్వామివారి కోవెలలో జరిగిన రాసక్రీడలోను. వీరు ప్రతి దివసమును మూడు పూటలు భజనానందములో మునుంగు చుండువారు. (1) నిష్కామదీక్ష (2) వినయవినమితసంపత్తి (3) నిరుపమానశాంతి (4) ఆధ్యాత్మికకానుభూతి (5) అహింస (6) సాత్త్వికభక్తి (7) సమత్వము (8) బ్రహ్మవలోకనస్థితి మొదలగునుగుణములు. వీరి యమాల్యాభరణములు ప్రభాతపవళింపుసేవలు. ద్వాదశీపునర్వసు దీక్షలు శ్రీరామకృష్ణోత్సవములు వీరి నిత్యవ్రతములు. అభ్యాగతాతిథిసేవలు సదానుష్ఠేయములు.

తండ్రియనంతరము కుటుంబభారవాహియై కలవెగూరులో పల్లెకూటాధిపతియైన నీలంరాజుజానకీరామ భాగవతారు గారివలన భాగవతశ్రవణమును, గుళ్లాపల్లి వీధిబడిలో నున్నపుడు మల్లవరపు వెంకటేశ్వరస్వామివారి సమక్షమున గాయిత్రీమంత్రోపాసనాసిద్ధియు, పమిడిపాటి వీధిబడిలో నుండుతరి ఓనమామల జియ్యంగారి వలని నష్టాక్షరీమంత్రోపదేశమును, నందిపాటి పాఠశాలకాలమున దక్షిణయాత్రల

గావించు సందర్భమున లభించిన యవకాశమును ననుసరించి కంచిలో నాలూరి వెంకటాద్రిస్వామివారి వలన శ్రీరామ తారకోపదేశమును, శ్రీరంగపురి శ్రీరంగనాథసన్నిధియందు దక్షారిష్టరీ మహామంత్రోపాసనాసిద్ధియు దద్వారా రంగనాథ సాక్షాత్కారమును అంత శ్రీరంగాజ్ఞననుసరించి దిరుగుపయనమున గంచిగల శ్రీ వెంకటాద్రిస్వామివారి సెలవంది పునః నందిపాడుగ్రామప్రవేశమును జరిగినవి. ఈయాత్రలో శ్రీలక్ష్మీనారాయణ షట్చక్ర సీతారామ గోపాల సాలగ్రాముల శ్రీవారి కనుగ్రహించిన వెంకటాద్రిస్వామివారు శిష్యవాత్సల్యమూర్తులు. తన ముప్పదవయేట భద్రగిరీశుడగు సీతారామసన్నిధి రామతారకసిద్ధిగడించి భగవత్సాక్షాత్కార మహాభాగ్యమార్జించిన పుణ్యజీవి. వీరికి ధనధాన్యలక్ష్మి దాసియైనదని చెప్పుటకు వెనుకాడవలసిన యవసరముండదు. అనన్యాశ్చింతయంతో మామ్ యేజనాః పర్యుపాసతే, తేషాం నిత్యాభియుక్తనామ్ యోగక్షేమం వహామ్యహామ్" అను భగవద్వాక్యము కార్యరూపముదాల్చినది. రాచక్రీడ వీరిజన్మహక్కు. జీవితములో దాదాపేబది రాసక్రీడల గరుపసాక్షాత్కారముతో బూర్తిజేసిన భక్తాగ్రణి. వీరి రాసక్రీడా మహోత్సవముల దిలకించినవారికి శ్రీవారి గోపికాభక్తి వెల్లడి కాక మానదు. ఈ భక్తి బాపట్లలో జరిగిన క్రీడామహోత్సవములో గుర్తింపగలముగూడ.

బృందావనమున నిరంతరము జరుగుచుండు దివ్యరాస క్రీడయే, దాసుగారి దాసక్రీడ. శ్రీవారు పుత్రుల విద్యకొఱకు బాపట్లనుండుట సంభవించినప్పుడు సర్వధారివత్సర కార్తీకమం

దోకపుణ్యాదివసమున దన్మహోత్సవము జరుగబడినది. ఇప్పటి దాసుగారివయస్సు డెబ్బదిమూడవయేడు సంజువ్యాధిచే శరీరమంతయు బరువెక్కినది. బలమావంతయు లేదు మంచముపై నుండి లేచి గూరుచుండుశక్తిగూడ సున్నయైనది. భోజనమ్ము నాదులకై లేచుటకు మఱియొకరి నాయమవసరమైయున్నది. ఈ సమయములో నద్దంకినుండి దాసుగారిని జూచుట కనుయాయుడగు తాటిగడప శేషయ్యవచ్చి రెండు దినములుండుట దటస్థించినది. రెండవరోజు సంభాషణలో దాసుగారాత్రితో మిత్రమా! మీసహాయముతో నిప్పటికి షుమారు నలుబదేబది రాసక్రీడలు జరిగినవి. ఇప్పుడు జీవితము ముగిసినది. తుదిరాసక్రీడజరిపి ధన్యుడనగుభాగ్యము గలిగించి నాముచ్చటదీర్పుము లేవలేనిస్థితిలోనున్నానని శంకింపవలదు. నీసహాయముండిన దప్పక భగవదనుగ్రహము రాగలదు. ఇంతవఱకు నీరాకకై ప్రాణములు చిక్కబట్టుకొనియున్నాడ నీవు స్నేహితుడవు భక్తుడవుగూడ పట్టుబట్టుము తప్పక జరిగి తీరును "యద్భావంతద్భవతి" యను ఆర్యోక్తిరిత్తవోవునా! అట్లెప్పటికిని జరుగదు. రాగల శుద్ధదశమికి చదలవాడ కేశవులను పిలిపింపుము చిమటరంగయ్యగారియూరనే యున్నారు. రెండు మృదంగములతో ప్రారంభింతమని పలుకుచు జివాలునలేచి కూరుచున్నాడు దాసుగారు. లేవలేనిస్థితి యెటుపోయినదో! తెలియదు. కార్డు తెప్పించి శేషయ్యగారిచే కేశవులునకుత్తరము వ్రాయించి చేవ్రాలుజేసినాడు. మూడవనాటికాతడు వచ్చినాడు కార్తికశుద్ధదశమి రాత్రి తొమ్మిది గంటలైనది. క్రీడారంగమున కుత్సాహముతో జేరిరి. రాస

క్రీడ ప్రారంభమైనది. వినాయకప్రార్థన జరిగినది. క్రమముగ గోపికలొకరినొకరు పిలుచుకొని బృందావనము జేరి దేవగాంధర్వ మభినయించుచు శ్రీకృష్ణుని దర్శించి భక్తిప్రపత్తులతో బూజించినారు. పిదప గోపికల మందలించి మీమీయిండ్లకు బొండని ఖండితముగ శాసించినాడు. శ్రీకృష్ణభగవానులు కృష్ణవియోగమునకు సహింపక గోపికలు వివశులైనారు. ఇప్పటికి కథ రక్తికట్టలేదు. సభికులొకరొకరు బయలుదేరి నిజగృహామార్గములు పట్టినారు. తూర్పారలో దాలెగిరిపోయి నది మెరికెలు నిలచినవి. దాదాపు నూరుమందికి దక్కువ గాని సభికులుమాత్రముండిరి ఇంతవఱకు శేషయ్యగారిచే కథ నడుపబడినది. రంగస్థలమం దస్వస్థులై కూరుచుండి యుండిన సంకటాద్రియుడుగారి యందొక నూతనశక్తి తేజో రూపమున ప్రవేశించినది. ఈ చిత్రము సభికులు కనులారా జూచి యానంవంచినారు.

వెంటనే దాసుగా రితరులసహాయము లేకుండగనే! లేచి నిలువబడి, ''దాశరథే'' అని పెద్దకేకబెట్టినారు. ఆధ్వని దిక్కులప్రతిధ్వనింపజేసినది. దీనితో సభికుల మానసక్షేత్రములందుగల భక్తిబీజములు మొలకలెత్తి నిముసములమీద వృక్షములై వృద్ధినంది పూత పిందెకాయలతో విస్తరించినవి. శేషయ్యగారు దాసుగారిపదములకు గజ్జకట్టి చిరుతలు చేతికిడినాడు. ఇరువురు మనుష్యులు మంచమునుండి లేవదీసి నెమ్మదిగ పట్టుకొనివచ్చి రంగస్థలమున గూరుచుండబెట్టిన దాసగా రితరుల సహాయములేకుండగనే లేచి ''దాశరథే'' అని కేకబెట్టుటయేకాక రాసలో బాల్గొనినాడు, కమ్మనిపాట

ముద్దులొలుకుట ఆటకనుగుణాభినయనము చూచిన దీరవల యునేగాని, చెప్పిన దీరదు. ఇప్పుడు దాసుగారియందు నవ యౌవన ముట్టిపడుచున్నది ఆత్మశక్తి ప్రభావపూరితులకు వార్ధక్యము, యౌవనమగుననుట కిదియే తార్కాణము. అర్చా మూర్తిచే నానులక్షలవరహాలను కక్కించిన శక్తివార్ధక్య మును యౌవనముగా మార్చజాలినదనిన చిత్రమేమి

కథ సాగుచున్నయది. గోపికలందఱియందు నన్నిరూపము లతో దాండవించిన కృష్ణభగవానునకువలె భక్తబృందములో దాసుగారు తాండవించుచున్నారు. రంగస్థలము దివ్యబృందా వనమైనది. సభికులలో నూతనచైతన్య మావిర్భవించినది. ఆనందభాష్పములతో నృత్యములు జేయువారు కొందరు, ఒకరి నొకరు కౌగలించుకొని కృష్ణస్మరణతో నేడ్చువారు కొందరు, విపరీతమైన నవ్వులతో మైమరచువారు కొందరు కృష్ణలీల లనభినయించువారు కొందరు కృష్ణా! కృష్ణా! కృష్ణా! అనుచు నెలుంగులెత్తి దిక్కులు ప్రతిధ్వనింప గేకలువేయువారు కొం దరు, నృత్యముల మైమరచి భూమిబడి దొర్లువారుకొందరు, జంటలుగా నిలచి చేతులుగలిపి గంతులుబెట్టువారు కొందరు, వేయేల! మార్దంగికులు, మృదంగముల నడుముల బిగించి గంతులిడుచు లయ నతిక్రమించినారు. వంతపాటకులమనం బులు భగవన్ముఖములగుట బిచ్చికేకలతో దప్పతాళము లతో గుప్పిగంతులిడుచున్నారు. రాగతాళయాముల లెక్క సేయక జంత్రవాయిద్యపరులు తమ తమ పనిముట్లనెట్లో వినియోగించుచు దలయూపుచు దేహస్మృతులు దప్పి

యున్నారు. దాసుగారు సింగపుపిల్ల వలె రంగస్థలి నటించుచు కృష్ణనామస్మరణములో మునిగి తేలుచున్నాడు. కృష్ణాంతర్హిత గాథ వచ్చినది. విపరీతదుఃఖము దాసుగారు వెల్లడించినారు. సభికులున్నవా రున్నట్లు గోలబెట్టి యేడ్చుచు రంగస్థలి నాటిన చెట్లలో వెదకువారు కొందరు ఆలయ స్తంభముల బరికించుచు గండ్లనీళ్ళు కండ్లగుత్తుక్కొనువారు కొందరు ఆలయావరణమంతటను తిరిగి తిరిగి కలయ వెదకువారు కొందరు కనివినియెరుంగని చింతామగ్నులైనారు. పిదప "శ్రీకృష్ణ పాదారవిందచిహ్నములివిగోనే" అనిపాడుచు దాసుగారు భూమిబడి పొర్లుటజూచి సభికులెల్ల రున్నవారున్నట్టు లానంద పరవశులై పరుగునవచ్చి శ్రీకృష్ణపాదచిహ్నములపైబడి వందన శతములతో మేనులుమరచిరి. సభకొంతవడి నిశ్శబ్దమైనది. అంతదాసుగారు బహిర్ముఖులైరి. వెంటనే సభికులందఱకు స్మృతులుగలిగి ఖిన్నవదనములతో నుండిరి.

అంత దాసుగా రనుయాయులతో గలసి విజనస్థలి జేరి గోపికాగీతల ప్రారంభించి సూర్యోదయమునకు ముగించిరి. గరుడ సాక్షాత్కారమైనది. రాసముగిసినది. దాసుగారి జీవితములో నాఖరురాసయిది. మంగళహారతితో భక్తులందరు స్వగృహములచేరినారు. తదుపరి యచిరకాలమునకు గలవకూరు జేరి తన డెబ్బదినాల్గవయేట క్రీ. శ. 20 విరోధికృతు వత్సరాశ్వయుజ శుద్ధైకాదశి బుధవారము సాయంత్రమైయిదు గంటలకు మంచిస్పృహతో శ్రీవారు పరమపదించిరి.

మాల పిచ్చమ్మ

అకార ఉకార మకారముల కలయికచే యేర్పడిన ప్రణవము హృదయాంతరాళమందున్న యనాహతచక్రము నందు సదా ఘంటానాదమువలె ధ్వనించుచుండును. ఈప్రణవమే సకలజగత్కారణమైన పరబ్రహ్మము.

షణ్ముఖీముద్రలో గనులుమూసి ఆలింప నభ్యాసకునకు సక్రమాభ్యాసమువలన ఆప్రణవమే "చిణి" శబ్దముతో వినుపించును ఇట్లే, ఘంటానాదము పిదపశంఖనాదము వినబడును. పై నాదత్రయమువలన నరిషడ్వర్గమడగి శమదమాదులలవడును. తదుపరి సహస్రారమందు వీణానాదము తర్వాత దాళనాదము, ఆవల వేణునాదము శ్రవణింపనగు ఇవి యపరోక్ష సాక్షాత్కారజ్ఞానమలవడ సుషుమ్న నాడినుండి బయల్వెడలుచున్నవి

వేణునాదానంతరము భేరీనాదము వినిపించును దీనితో గామబీజనాశనమగును. తర్వాత మృదంగనాదము దీనివలన బ్రికృతిజయము అటుపిమ్మట మేఘగంభీరమైన నాదము ఇప్పటికి సాధకుడు చతుర్దశేంద్రియములు విషయవిముఖములై చిత్కళాదర్శనభాగ్యములభింప ఆధ్యాత్మికాది తాపత్రయములడంగి సుస్థిరానందమూర్తియై విరాజిల్లగలడు.

పైగనుపరచిన ప్రణవము నాదు, బిందు, కళ, అని మూడువిధములుగా విభజింపబడినది. నాదమకారము బిందుకారము కళ మకారము నాదానుసంధానమైనపిదప గనులు

మూసి భ్రూమధ్యమునగల ద్విదళకమలమున దృష్టినిలిపి యుంచిన హృదయమున (1) గుణరహితాకాశము (2) పరాకాశము (3) మహాకాశము (4) తత్వాకాశము (5) సూర్యాకాశము లనుక్రమముగజూడనగు. ఇందు మొదటిది శబ్దరూపములు లేనిదై యుండు రెండవ పరాకాశము దట్టమైభయంకరమై, అంధకారబంధురమై ఉండు. మహాకాశము ప్రళయకాలమందు ప్రజ్వలించు కారుచిచ్చువలె భీతిదాయకమై యుండు తత్వాకాశము నానావిధ చిత్రవిచిత్రకాంతులచే బూర్ణమైయుండు సూర్యాకాశము సహస్రకోటి భానుదీప్తి గలదై యుండు

పై యాకాశముల నడుమనడుమ మల్లెపూవులవలె దీగ మెఱుపులవలె జిత్కళలు బయల్వెడలుచుండును. ఈపరి క్రమముగ నాకాశపంచకమునందఖండజ్ఞానజ్యోతి విరాజిల్లు తజ్జ్యోతిని దర్శించిన పిదప సహస్రారమున హంససంచార మేర్పడును. ఇప్పుడుద్వంద్వరహితమైన శాశ్వతసుఖానందమును సాధకు డనుభవింపగలడు. ఇతడే జీవన్ముక్తుడు. ఇట్టి వారిలో మన మాలపిచ్చమాంబగారొకరు.

ఈమెగారు పూర్వజన్మసాధనాబలము వెన్నంటిరా సహస్రారమున వీణానాదముతో జన్మించినారు. షణ్ముఖీముద్రాభ్యాసకాలములో వినుపించు దశవిధనాదములలో నైదవదగు వీణానాదశ్రవణకాలములో నెనుకటి జన్మచాలించుటచే దన్నాదశ్రవణము తోడనే, యోగపూర్తికొఱకు నుత్తరజన్మ ధరించిరని తెలియవచ్చుచున్నది. ఏడాది వెళ్లులోపలనే మాటలాడు శక్తిగలుగుటయే, కాక నాదానుభూతి బైటబడినది.

తండ్రి పరే ముత్తయ్య. తల్లిపీరమ్మ.గారిమెను కృష్ణా జిల్లాలోని బందరు హైదరాబాద్ రోడ్డుప్రక్కన గలిగినట్టి కురుమద్దాలి. జననము క్రీ॥ శ॥ 19 వ శతాబ్దాంతము ఈమె గారికి ముగ్గురు సోదరులు నొకతోబుట్టువును గలరు. వయస్సు ముదిరినకొలది నాదానుభూతివిస్తరించుట నాతలలో నొదలు పులకరింపజేయు మోతవినబడుచున్నదని చెప్పుచు మానము వహించి కూరుచుండువారు. ముఖలక్షణమును బరిశీలించి నానందచిహ్నము లగుపించుచుండెడివి. ఈమెగారి తలనుండి వెలువడుమోత యొకప్పుడెక్కువగను మఱొక్కడ దక్కువగను ఇంకొకతరి కనుపింపకుండగనుకూడ నుండెడిది. అమ్మ గారు ప్రశాంతముగ నున్నతరి ప్రశ్నించిన మోతప్రారం భింపగనే పరులమాట వినంబడదు ప్రపంచమేకనంబడదని జవాబుజెప్పును.

తలిదండ్రులిది బిడ్డకు రోగమనుకొని వారు మందు లిప్పించినారుగాని ప్రయోజనముగనుపింపలేదు. విసుకెత్తి మాని నారు కొన్ని యేండ్లుగడచినవి బాలికకు దనుకాంతిగాని స్ఫుటత్వముగాని సుంతయు దగ్గలేదు. ఈమెస్సురదూపి ఆజానుబాహుయుగళా, శుక్లపక్షపాకరునివలె దినదినాభివృద్ధి నందుచున్నయది పిలచినగాని పలుకద్దుకోరినగాని యాహారము గొనదు బాలకులమాటల బాల్గొనదు. నానాదానుభవము జేయుచు నింగిజూచుచు దిక్కులబరికించుచు మఱియొకసారి పాలుద్రావి పరువులిడు గోవత్సముల సొంపుల కచ్చెరునం దుచు, నమందానందకందళితహృదయయై యున్నమన పిచ్చ

మాంబను లోకులు "పిచ్చిపిచ్చామ" అని పిలువజొచ్చిరి పదియైదయేడు వచ్చినది ఈపిచ్చామకు పిచ్చిబలమైనది.

ఇంతెటి స్ఫురదూపి పెద్దకులములలో నెందును గనుపడదని జెప్పుట నతిశయోక్తికాదు. పిచ్చిప్రబలముగాక పూర్వమే వివాహముగావింప దలంచి తలి దండ్రులు తత్ప్రయత్నములు సాగించుచున్నారు. వరాన్వేషణకై తిరిగి తిరిగి తుమ్మలపల్లి నివాసియగు శోభనాద్రినిదెచ్చి పెండ్లిజేసినారు. ఈ పెండ్లితోపాటు సమాధిసౌభాగ్యముగూడ లభ్యపడినది. కాపురమునకు బోయినది. దినమున కిరువది నాలుగుగంటలు గొడ్లసావడిలో నివాసము భోజనముచేయునదే తడవు మిగిలిన యిరువదినాలుగుగంటలు గోసేవయే గృహకృత్యములన్నియు దోడికోడలు నిర్వహించుచున్నయది. గోవులమేపుకొనపచ్చిక బయిళ్ళకరిగి పశువుల బీటవిడచి యున్నతస్థలి గూరుచుండి బ్రహ్మావలోకనము జేయుచు దద్భావమం దారూఢతగడించి సమాధి నలంకరించుచుండువారు. గోవులు మేతలు మేసి తనివిగొని ప్రొద్దుగ్రుంకువేళకు గోష్టమునకు జేరుటయే గాని యొకరోజైనను గోవులవెంట నమ్మగారరుగుట గలలో వార్తైనది. యొంటరిగా రాత్రి యేవేళకో యిల్లుజేరుటయు భర్త బందుగులకోపములకు గురియగుటయుగూడ జరుగుచున్నది.

ఇట్లుండ గొంతకాలమున కమ్మగారు గర్భముధరించినారు. నాల్గవమాసము వెళ్ళి వెళ్ళకపూర్వమే శోభనాద్రి పరమపద మలంకరించినాడు. తదుపరి క్రమముగా పదినెలలు

నిండి కుమార్తెనుగన్నది. ఆమెకు భాగ్యమ్మ పేరుపెట్టినది. పుత్రికి నెలవెళ్లులోపలనే బయలదేరి పుట్టిల్లుజేరి నది భర్త యాస్తియందున్యాయముగా దనకురావలసిన స్థిరచరరూపమైన దాయభాగమునందలి సర్వహక్కులను మరందికే యొప్పగించి శుష్కహస్తములతో దల్లికడకేగినది. ఆతల్లియు మరుమాటాడక బుత్రినాదరించి నిజగృహమున దావిచ్చినది. యిప్పటికి దండ్రి గతించినాడు. సోదరు వేఱుబడినారు. తల్లి యొక్కరితయే నంటిని బ్రిడింట గాపురము ఆగుడిసెయందు దలదాచుకొనుచున్న దమ్మగారు. ఇప్పుడు కూలిచేసి పొట్టబోసుకొనుచు నాదసుధారసపానమత్తయగుట కష్టాలనే సుఖాలుగా ననుభవించుచు సంతోషపారావారమున దేలియాడుచు ప్రసన్నవదనయై కాలముగడపుచు హరిమయము విశ్వమంతయు హరివిశ్వమయుండు సంశయము బనిలేదా హరిమయముగాని ద్రవ్యము పరమాణువులే దను భాగవత ధర్మదీక్షాపరతంత్రయై బ్రహ్మానంద మనుభవించు సుగుణాకరంబ మన పిచ్చమాంబ.

కూలిపనులలో రయితులమెప్పుగడించి తానార్జించిన స్వల్పద్రవ్యముతో గుటుంబము జరుపుకొనుచు నతిథ్యభ్యాగతసేవలగావించి పేరువడయుట గ్రామీణు లాశ్చర్యపడుచున్నారు.

పాచిధనమింటనుండ జీమలు బాకినట్లు దేహమందు బాధగల్గునట ఆకారణముగా జేసినకూలి ధాన్యరూపముగా గ్రహించుటయేగాని ద్రవ్యముగాగొనుట మానినారు. ఇట్లు

నొఋగుతిరుగులు లేక జీవయాత్ర సాగుచున్నది. అనారోగ్య కరములగు పదార్థములగాని వస్త్రములగాని గృహమునం దుండరాదు రారాజులయందు లేని తృప్తి కోటీశ్వరునియందు లేని సంతుష్టి మూర్తీభవించినది.

పుత్రి భాగ్యమ్మ యుక్తవయస్కురాలైనది. వట్టి కోటయ్య అల్లుడైనాడు గాని యాతడచిరకాలముననే చని పోయినాడు. బంధువులకోరికపై బిడ్డకు పునర్వివాహము జరిగి నది గాని అదికలహకారణమైనందున కూతురు, అల్లుడు ఎడమొగముపెడముఖులైనారు ఒకప్పుడు భర్త చే దెబ్బలు తిని భాగ్యమ్మ తల్లికడకేగి పరిస్థితు లుగ్గడించిన భర్తనుపీడి యుంట స్త్రీధర్మమునకు విరుద్ధమని నొక్కివక్కాణించి పుత్రిని బంపివేసినది. ఆమెతిరిగి భర్తకడకేగుచు మార్గమధ్యమునగల భావిబడి మృతినందినది. పోలీసులమ్మగారిని బిలిపించి నీపుత్రి యాత్మహత్యకు గారణమేమనిన ప్రారబ్ధమని జవాబుజెప్పి తన నిర్లిప్తస్థితికి వన్నె బెట్టినది.

దీనితో బాహ్యాబాధములన్నియు వీడిపోయినవి పూర్వ జన్మమున కొఱవడిన యోగమును గుర్వపేక్ష లేకయే సాధన సాగించి యోగసిద్ధిగడించి బ్రహ్మానందమందుచు దనకుగల యాస్తినంతయు దానధర్మములరూపముగా వెచ్చబెట్టి మొలకు చుట్టిన గోనెపట్టతో నిల్లువిడచి రుద్రభూమిని నివాసస్థలముగా జేసికొని సంకల్పరహితస్థితి నార్జించి,

గీ॥ అరసి నిర్గుణబ్రహ్మంబు నాశ్రయించి
విధినిషేధనివృత్తస ద్విమలమతులు

జేయుచుందురు హరిగుణ చింతనంబు
మానసంబులనే పొద్దు ॥

అను భాగవతధర్మానుసరణి ననుసరించి రామభక్తా గ్రణి హనుమన్నామస్మరణజేయుచు యోగినియై నిరాహార దీక్షవహించి ఒక రుద్రభూమియేగాక బుల్లేటిగట్టునందును లక్కావఝ్ఝులవారి తోటయందును గుమ్మరుచు, శీతోష్ణసమ స్థితి నార్జించి ఆకలిదప్పులమరచి రోహిణీకార్తెయెండలకు వర్షర్తువునగల వానలకు హేమంతమునగల చలికి మాకు మసలుచు క్రూరజంతువులకడలక నరణ్యముల దరిగి తిరిగి చిత్తము పరాయత్తముగానీక నభిమానరహితయై శ్రీరామావ ధూతనామమున బిలువబడుచు నెట్లో కొంతకాలమునకు గుడుమద్దాలిప్రాంతముజేరి మసలుచు బరిసరగ్రామములగల భక్తులుపాడుచుండు త్యాగరాజకృతుల వేమనపద్యముల మొవ్వగోపాలపదముల బ్రహ్మంగారి తత్త్వముల సిద్ధప్పగారి కీర్తనముల వినుచు గోనెపట్టచుట్టుకొని సంచరించుట గొం దరు భక్తులామెగారిదరిజేరి వేదాంతవిచారము సాగింప జూచిరి. గాని వారిని దరిజేరనిచ్చెడివారుగారు.

ఇట్లుండ గొంతకాలమునకు శ్రీవారి శక్తిని గుర్తించి తదీయగ్రామవాసులొక తాటియాకులపాకను నిర్మించి యెట్లో అమ్మగారిని ప్రసన్నురాలిని గావించుకొని కొనివచ్చి ఆశ్రమ మున బ్రవేశపెట్టిరి. నాడు మొదలు తన వచ్చిరానిభాషతో, వేదాంతోపన్యాసవెల్లువలో నాప్రదేశమంతయు ముంచివేసెరి.

అమ్మగారి దర్శనార్థమై యేతెంచు భక్తులసంఖ్య మితిమించినది. తత్త్వవిచారము మతిశయించినది తలవని తలంపుగా నొకనాడు మౌనమువహించి యొకటి రెండేండ్లవలీలగా వెళ్ళించి, అది ముగిసిననెంటనే ప్రతిరెండుదినముల కొకరోజును క్రమముగ మూడురోజుల కొకరోజును మౌనముద్రవహించుటయేకాక పూర్ణసమాధియందుండుట కలవాటుపడిరి. ఈ నియమము జీవితాంతమువఱకు జరిగినది. సమాధినుండి లేచినదివసమున పలువురు భక్తులేగి వేదాంతరహస్యము లెఱింగి పోవుచుండువారు.

వీడొకప్పుడు బందరునుండి బయలుదేరి అమ్మగారి ఆశ్రమముముందు బస్సుదిగి సాయంత్రమైదుగంటలకాశ్రమము లోనికేగినాడు అది అమ్మగారు సమాధినుండి లేచినదినము పరునెత్తివచ్చి యానందభాష్పములతో గౌగలించి లోన ప్రవేశపెట్టి కూర్చుండబెట్టి నీకాకలియగుచున్నదా, పొద్దున నెప్పుడో బువ్వతిన్నావుగదా! ఆకలి లేకుండునా? అంటూ, గదిలోనికేగి యొకలడ్డుపట్టుకవచ్చి నాచేతబెట్ట బ్రియత్నించినది అప్పుడు నేనిట్లంటి నీవు మాలదానవు వీడు స్వచ్ఛమైన బ్రాహ్మణుడు, నీవిచ్చెడి యీ లడ్డెట్టుదినవలె, వీడికి కులము పోదా! అరే బత్తికికులముగలదంటావ్రి? తిను, తిను, అంటూ వీడి నోటగుక్కినది. సంతోషముతో దిన్నాడు. ఆమె ప్రేమతో నొసంగిన మంచినీటి ద్రాగినాడు పవిత్రుడనైనాడు. అమ్మగారి మాతృప్రేమను గుర్తింపగలిగినాడు వీడినేగాడు

వచ్చెడిభక్తులనందఱిని యాదరించి పంపుస్వభావ ముగ్గు
చాలతో నీమెయందున్నదని విని యానందింపగలిగినాడు.

ఇట్లు కురుమద్దాలియాశ్రమమందు ముప్పదివత్సరములు గడిపి అనేకమంది భక్తులపై నిజవాగమృతమును ప్రోక్షించి ధన్యులగావించి, ప్రాణ పయాణమాసన్నమగు టెఱింగి ఆశ్రితులకు రహస్యములెఱింగించుచు సంపూర్ణవ్యక్తితో క్రీ॥శ॥ 20వ శతాబ్దము వికృతివత్సర పుష్యబహుళ తదియ రాత్రి యొంటి గంటకు గనులవెంట దివ్యజ్యోతి వెలువడి సర్వవ్యాపియైన పరంజ్యోతితో నేకమైరి. శ్రీ కొమ్మరాజు లక్ష్మీకాంత యోగివర్యుల యాధిపత్యమున సమాధికార్యము పూర్తి గావింపబడినది అమ్మగారి శిలావిగ్రహ ప్రతిష్ఠతో తత్కార్య కలాపములు ముగింపబడినవి.

వి శే ష ము లు

1 రుద్ర భూమిసంచరించుకాలములో నొకనాడు కపిలేశ్వరపుర హరిజనవాడలోని శ్రీరామాలయములో నమ్మగారున్నారు. పిన్నమనేని వెంకటనరసమ్మగా రరుదెంచి ప్రార్థింప నామెభక్తి ప్రపత్తులకు వశవర్తినియై వెంటవచ్చి శ్రీనరసమ్మగారిచే పాదపూజలంది సంతసించిరి. శ్రీ వెంకటనరసమ్మగారే కురుమద్దాలియాశ్రమ నిర్మాతలు, 1925 సంవత్సరమున తదాశ్రమప్రవేశ మమ్మగారు గావించిరి.

2. అమ్మగారి ప్రథమశిష్యులు బుచ్చమ్మగారు. (ఇంటిపేరు తెలియదు) రుద్రభూమి సంచరించు పిచ్చమ్మగారిని వెన్నంటి సేవించి తరించిన పుణ్యమూర్తి.

3. అర్థింపకనే దనమిల్లునకు వైనన్ను నిప్పించుకారణముగ పూర్వాపరమునుమరచి మూడవశిష్యుడైన ధన్యమూర్తి పెన్నమనేని పేరయ్యగారు.

4. సంతానమునకెదురుచూచుచుండు దిట్టకవి రామకృష్ణయ్యగారమ్మగారి యాజ్ఞననుసరించి భార్యవలన సూర్యనమస్కారములు పూర్తిగావించి సత్సంతానవంతుడై యిష్టార్థసిద్ధి గడించిన పవిత్రచరిత్రుడు నాల్గవశిష్యుడు.

5. కురుమద్దాలి యాశ్రమవాసకాలములో నొకశునక మేగుదెంచి కర్ణపుచ్ఛములాడించుచు నిల్చుటచూచి చిరునవ్వులో "ఎవతెవేనీవు" యీడికేం యేమని, ఎందుకొచ్చావు చెప్పు, యీడిదగ్గిరుంటావా? అన్నారమ్మగారు. కుక్కవిన్నది తలయూచినది ఆనాటినుండి అది ఆశ్రమవాసియై తల్లియాదరణకు పాత్రురాలైనది. పదేండ్లు జరిగినది. ఒకనాడమ్మగారు కుక్కనుజూచి. మానవలోకం యిడచిపోతావంటే పో, ముందుమనిషివైతావులే, పో, నాటిరాత్రియే ఆకుక్కశరీరము విడచినది. దానిచర్మమాశ్రమములో నుంచబడినది. కుళ్లు లేదు, దుర్వాసన లేదు అమ్మ నిర్యాణమువఱకు కన్పట్టియున్నది.

6. ఈడదూడలుంటాయి. మేలుకోండి, అని అమ్మగారు చూపరులకెఱింగించుచుండువారు, పామొకటి యాశ్రమమునుండి బయటికివచ్చినది. కొత్తగా వచ్చినవారిలో నొకడు దానిని కఱ్ఱతో గొట్టినాడు. అమ్మచూచి పరుగెత్తి వచ్చి దానితలనుపట్టి లేవదీసి చావబోవుచున్నదని గుర్తించి, ముందు నీవు మానిసివైతావులే; అన్నారు. వెంటనే అది

ప్రాణమువదలినది. ఆసర్పశరీరచర్మ మమ్మగారినిర్యాణకాలము వఱ కాశ్రమమున నుంచబడినది.

7. వర్షములో దిరుగుచున్నను, శరీరమునకుచుట్టుకున్న బట్టతడిసియుండలేదు. ఈమెగారు నడచుస్థలములలోగాని కూరుచున్నప్రదేశమందుగాని చినుకులుపడవు. ఎంతటివర్షమైనను అమ్మగారిని తడుపలేదు.

8. ఆనందాశ్రమవాసులగు కొమ్మరాజు లక్ష్మీకాంత యోగిగారు యాశ్రమమున కప్పుడప్పుడు వచ్చిపోవుచుండిరి అమ్మగారిచే ప్రేమింపబడుచుండువారు. అమ్మగారును ఆనందాశ్రమమున కేగుచుండువారు ఒకప్పుడమ్మగారానందాశ్రమమునగల శివలింగదర్శనమున కాలయమున కేగి సర్పరాజముచే చుట్టుకొనబడిన లింగమునుదర్శించి నమస్కరించి పామునుద్దేశించి, ఒసే తాసుపామూ, అయ్యభుజమీద తీసిపో లేదంటే నీకు, అని పలుకుచు జరునగవులో స్వస్థలము జేరియాసీనయైనది.

9. ఒకప్పుడు తిరుమలకేగి కొండనెక్కి అర్చకుల యంగీకారము లేకనే గుడిలో ప్రవేసించి వెంకటేశ్వరస్వామి భుజముతట్టి "ఏమిరా వెంకన్నా" ఇక్కడున్నావురా, అంటూ, పిల్లవానితో మాట్లాడినట్లు మాట్లాడి తిరిగివచ్చినది చూపరులెల్లరు తెల్లబోయినారు అడ్డుపరచినవారు లేరు.

10. భారతమునగల విజ్ఞానమూర్తుల నెందఱినో సేవించి నారు సంభాషించినారు. ఒకప్పుడు మళయాళస్వామివారితో గలిసి యేర్పేడు జేరి కొన్నిరోజులందుండి బయలుదేరి తిరుమల

జేరినారు, తిరువణ్ణామలకేగి రమణమహర్షి నిదర్శించి, పుదుచ్చేరిలో నరవిందుని వీక్షించి 1924సంవత్సరము వచ్చినప్పుడు మహాత్మాగాంధినిలక్షించి తృప్తిపడినారు.

11. తనను జెప్పుకొనవలసివచ్చినప్పుడు, నీవు అనుచుందునేగాని "నేను" అను టెన్నడెఱుంగము.

12. అహంకారమమకారము లడంగునటు కారణశరీరముదాటి మహాకారణమునగలిసి పునరావృత్తి రహితస్థితి నార్జించిన ప్రత్యక్షసచ్చిదానందమూర్తి మన యువఘూత చక్రవర్తి.



శ్రీ మదాంధ్రవాల్మీకి వాసుదాసస్వామి

మూనప్పుడు. తనసర్వస్వము భగవానున కర్పించుట ఆత్మార్పణమనెదరు అనగా దేహము, మనస్సు. అహంకార మమకారాదులనన్నిటి యందను దనకుండెడి సర్వాధికార ములు భగవదర్పణము చేయుటయే ఆత్మార్పణము లేకశరణా గతి ఇట్టి స్థితిలో త్రికరణశుద్ధిగా తనచే జేయబడు కర్మలన్నియు, భగవంతుడే జరుపుచున్నట్లు భక్తుడు తలంచి నిర్విచారియై యుండును దీనిలో సాధకుని యహంకారయుక్తమైన జ్ఞానము, విశ్వమంతయు భగవల్లీలయను పరిశుద్ధజ్ఞానములో గలసి యంతరించుచున్నది. ఇట్టివానిమనోబుద్ధులు స్వతంత్రించి యేపనియు జేయజాలవు. భగవంతునియిష్టమే? తనయిష్టము భగవంతుని యాలోచనయే, తనప్రవర్తన భగవంతుని సంక ల్పమే తన సంకల్పము భగవంతుని వికల్పమే తనవికల్పము.

మనోబుద్ధుల కాధారమైన యంతఃకరణ భగవదా ధీనమైనది. కనుక దానిపై దనకధికారములేదు. సుఖమే రానీ, కష్టమే రానీ అంతయు భగవల్లీలయే ఎట్టి వికార ములు లేకుండ ననుభవించుటయే శరణాగతునిపని సర్వ భారము భగవంతునిదే సాధకుని యిప్పటిపని యెల్లప్పుడును భగవన్నామము జేయుటయే కార్యాకార్యములన్నియు భగ వదాధీనములని వానివిశ్వాసము తాను నిమిత్తమాత్రము భగవానుని చేతికీలుబొమ్మ భగవదాదేశము ననుసరించి ప్రపంచమునే కాదు దేహమునైనను తృణప్రాయముగ

వదలుమన్నను వీనికి భగవత్సాక్షాత్కారము సులభము ఎవనికి భగవత్సాక్షాత్కారమగునో, వాని యాత్మశక్తి తాండవించుచుండును వాడెంతటికఠినకార్యమైనను జేయగలడు. ఇంతియ కాదు సర్వశాస్త్రములు కరతలామలకములు సర్వవిద్యలు సర్వకళలు సర్వశక్తులు వీని వెన్నంటియుండును. ఇట్టివాడొక్కడుమాత్రమే భగవద్విశ్వరూపోపాసనకర్హుడు. వీనికి స్వర్గాదిభోగములు తృణప్రాయములు తుదకు మోక్షము గూడా లెక్కచేయడు ఇట్టివాడుగనకనే మనవాసుదాసు సర్వకళాకోవిదుడును క్రూరవ్యాధి విముక్తుడునునై శ్రీమద్రామాయణకావ్యము బంగ్లకెక్కించి ఆంధ్రవాల్మీకియైనాడు ఆత్మశక్తిపూరితున కసాధ్యము లేదను ననుభవోక్తి వీరియందు సార్థకమైనది.

తండ్రి వావిలికొలను రామచంద్రరావుగారు, తల్లి కనకమాంబ. అగ్రసోదరుడు శేషగిరిరావు. తమ్ముడు రంగారావు. తల్లిదండ్రులిడినపేరు సుబ్బారాయుడు జననము 23-1-1863 సరియగు దుందుభివత్సర మాఘశుద్ధచతుర్థి. జనన స్థలము కడపమండలమున జమ్ములమడుగు, శ్రీవారి పూర్వులు నైజాములోని వావిలుకొలమాన్యులు పండ్రెండవయేట పితృవియోగము తటస్థించుట బినతండ్రి లక్ష్మాజీరావుగారి వలన బోషింపబడి విద్యాబుద్ధు లార్జించిరి. వీరికి శ్రీరామభక్తియు వాక్చతురతయు విద్యాశక్తియు సహజములై యున్నయవి. పదమూడవయేట భయంకర క్షయవ్యాధి పొడసూపి బాధింప మొదలిడినది. ఇట్లు నన్ను ఆంధ్రాంగ్లసంస్కృత



శ్రీమదాంధ్ర వాల్మీకి వాసుదాసస్వామి

భాషలయం దసమాన పాండిత్యమార్జించిరి. ఇంమ మాత్ర దేవభాషలు రెంకును స్వీయకృషి సమార్జితములు పోతన మహాశయునకువలె సహజపాండిత్యబిరుద మందిన ధీశాలి.

హూణభాషలో ప్రవేశపరీక్షయం దుత్తీర్ణులై యం.ఏ. చదువుచుండ క్షయవ్యాధి మర్భరమగుట బడివదలి యింట నుండియే గీర్వాణాంగ్లభాషలకు వన్నెలుదీర్చి యుభయభాషా కవిత్వ మలవరుచుకొసిరి

బీదకుటుంబమగుట నుదరపోషణార్థము పొద్దుటూరు తాలూకాకచ్చేరిలో నేడురూప్యముల జీతముగల దస్తరబందు పనిలో క్రి. శ. 1883 సంవత్సరాగష్టునదియవ తేదీన ప్రవే శించి పనిచేయుచు శ్రీ గంచనపల్లి వెంకటసుబ్బారావుగారి కుమార్తె రంగనాయకమ్మను పెండ్లాడి పరపీడార్థహితులై యుద్యోగము నిర్వహించుచు క్రమముగ రైవిన్యాసపరీక్ష కులుగా జేరి యదృచ్ఛాలాభసంతుష్టిగలిగి కొంతకాలమునకు సేవావృత్తిగర్హ్యమగుట, దెలిసియు నప్పటికుటుంబస్థితికను కూలముగ మెలంగుచు, ఆక్టింగుతహశ్శీల్దారు పనివఱకు బోయిరి. కాని క్షయవ్యాధి ముదురుట దప్పనిసరిగ నుద్యో గముమాని యిర్వదియైదవయేట కుమారాభ్యుదయమను ప్రౌఢప్రబంధమును రచించుటయే కాక, నెల్లూరినగర పండిత పత్రికాంతుల కోరికపై గందపద్యములతో వివిధవిచిత్రకల్పనల జోడించి యొకే పూటలో దప్పగిరిరంగనాయక శతకము విరచించి మెప్పువడయుటయేకాక గజమాలికాబహూకృతు

లంది పిదప కౌసల్యాపరిణయాది గ్రంథనిర్మాతలై భాషాసేవ గావించినారు.

కడపవాస్తవ్యుడును భక్తుడును అగు నన్నేమియా సాహెబుగారి చికిత్సవలన వ్యాధినన్నగిలి యారోగ్యవంతులై చెన్నపురియందున్నతపాఠశాలాంధ్రోపాధ్యాయులుగా 1901 సంవత్సరమందు జేరి పనిగొనుచు 1904 రాజధానీకళాశాలయందు బ్రధానాంధ్రాధ్యాపకులై పదియారువత్సరములు పనిజేసి క్రీ॥ శ॥ 1920 సం॥ ఉపవేతనము గ్రహించి జీవితమంతయు భగవత్కైంకర్యమున గడుపనెంచిరి,గాని మూడువందల జీతముతో నాంధ్రభాషాంతరకర్తగా నయాచితస్వార్జిత ప్రభుత్వముచే నియమింపబడితీరని భాషాసేవ గావించిరి.

తన యిర్వదిరెండవయేట బినతండ్రిలక్ష్మాజీరావుగారి వలన శ్రీమద్రామాయణోపదేశమంది నూటయెనిమిదిమార్లు పారాయణముజేసి దత్ఫలితముగ నాంధ్రవాల్మీకి రామాయణమును దాని నివిశేషార్థములతో సుందరరూపమున విపులమైన వ్యాఖ్యానమునుజేర్చి యాంధ్రలోకమునకు బ్రసాదించి కృతార్థులైరి. చెట్లూరి నరసింహాచార్యులుగా రొసంగిన శ్రీరామతారకోపదేశబీజమే మందరనామక మహావృక్షమై సంసార పరితప్తులకు విశ్రాంతిస్థానమైనది. రామతారక జపము రామనామధ్యానము రామకోటిలేఖనము రామాయణము పారాయణము ఆంధ్ర వాల్మీకిరామాయణనిర్మాణము శ్రీవారి నిత్యకృత్యములు.

ధర్మమత, నీతిబోధకములగు కృతుల నిర్మించుటయే కాక శ్రీరామకృష్ణలీలామృతము ద్విపదభగవద్గీత ఆర్యకథా సిధులు, ఆర్య చరిత్రారత్నావళులు, హితచర్యామాలికలు భక్తిప్రసూనమాలికలు సులభవ్యాకరణము మున్నగు లోకోపకారకృతులరచించి తన యాంధ్రవాల్మీకిరామాయణకృతిని 1920 సంవత్సరమునం దనేక భక్తకవి పండితసమక్షమున నొంటిమెట్ట కోదండరామమూర్తి కర్పించి విశ్వజనుపువలన నాంధ్రవాల్మీకి బిరుదమందిరి.

క్రీ॥ శ॥ 1910 సంవత్సరమున సంభవించిన భార్యావియోగముతో బంధవిముక్తుడై సంతసించి ఉపవేతనమంది యోగాభ్యాసమునకు ఘటికాచలముజేరి సాధన సాగించి యోగసిద్ధిపడసినారు. ఈరోజులలో స్వాప్నికముగ దాను ముండ్లగండ్లలో దిరుగాడుచుండ బయసించు సాధువులందిద్దరరుదెంచి రాజమార్గమున జేర్చినట్లు బొడసూపుకారణముగ ఆశ్రమముస్వీకరించి కౌపీనధారియై ఫలాహారసేవియై యుండె. మఱియొకతరి యిట్లే స్వాప్నికమున నొంటిమిట్ట శ్రీ కోదండరామ కైంకర్యమునకు బ్రోత్సహించిన శ్రీరామాజ్ఞనొని తనకుగల సర్వస్వము దత్కైంకర్యముల కర్పించి ద్రవ్యాభావముబైకొన టెంకాయచిప్పను చేనంది రామభిక్షుకై రామభజనతో బట్టణపల్లెలదిరిగి ధనమార్జించి స్వార్థపరుడు కాక కోదండరామాలయ జీర్ణోద్ధరణము, రథవాహనాదినిర్మాణము, రామసేవాకుటీరస్థాపనము గావించి సాధ్వీ సాధులకు

సకలమభక్తినిబోధించి ధన్యులగావించి శ్రీ కోదండరాములకు నిత్యోత్సవ పక్షోత్సవ మాసోత్సవాదుల గల్పించి యొంటిమిట్టను కలియుగవైకుంఠముగా మార్పగలిగిరి. భక్తు లనుభవించుకలలు భావిశుభసూచకంబులైయుంట జాగ్రత్స్వప్న సమాధులని పాఠకులు తలంతురుగాక.

ఒంటిమిట్టయందు నిర్మించిన శ్రీరామసేవాకుటీరమే కాక శృంగశైలముపై నాశ్రమం బొండుకల్పించి నిరతాన్న దానమహాయజ్ఞము సాగించుచు 1926 సం॥ కోదండరామ సేవక సమాజమును దాని కనుబంధముగ వైద్యశాలయు నేర్పరచి యాశ్రితులకు దేహమనోవ్యాధుల దీర్చిరి.

1929 సంవత్సరమున గట్టా సిద్ధయ్యగారి ధనసహాయముతో భక్తసంజీవని పత్రిక ప్రారంభించి జీవితాంతమువఱకు నడిపిరి. యామర్తి సుబ్బదాసుగారి సంపాదకత్వమున నిప్పుడది నడచుచున్నది. సద్భక్తులసంకల్పము లమోఘములు గదా! ఆంధ్రదేశపర్యటనకాలమున రచించిన టెంకాయ చిప్ప శతకమున శ్రీవారి యాధ్యాత్మికానుభవములెన్నియో గలవు గ్రంథవిస్తరభీతి నిందు జేర్చకుంటి నావంటి యల్పజ్ఞుడు శ్రీవారి శక్తిసామర్థ్యముల వర్ణింప నెంచుట దీపముచే సూర్యుని జూపబ్రయత్నించినట్లు పరిహాసపాత్రుడనయ్యెదనేమో అను భయము వెంటాడు కారణముగ దదీయజీవితగాథ ముగింపనుంటినని మనవి.

శ్రీమద్వాల్మీకి రామాయణము నూటయెనిమిదిమార్లు పారాయణము జేయుటయే కాక నూటయెనిమిది సీతాకల్యాణ

ములు, అన్ని సట్టాభిషేకములుగావించి ఆసేతుసీతాచలమున గల ఐదువందల పుణ్యనదులయు చతుస్సముద్రములయు దీర్ఘ రాజములతో శ్రీరామచంద్రసామ్రాజ్యపట్టాభిషేక మహోత్సవమును గన్నులపండువుగ జరిపి భక్తకల్పద్రుమ అను మకుటముగల నూటయెనిమిది పద్యసుమములతో కోదండరాము నర్చించి యిహపరము లార్జించిరి. తదుపరి ఒంటిమిట్ట కోదండరామసన్నిధి రామాయణబాలకాండమును, మేల్పట్టునందుండి అయోధ్యాకాండమును, నడిగడ్డపాలెమునందుండె అరణ్యకాండమును, లక్ష్మీనరసాపురమునందుండి కిష్కింద సుందర యుద్ధ ఉత్తరకాండములును, మందరరూపమున వ్యాఖ్యానము వ్రాసి ముగించి భద్రాచలరామునకు కౌసల్యాకళ్యాణ నర్పించి తనజీవితమంతయు దేశదైవభాషాసేవల కర్పించి చెన్ననగరమున 1-8-36 ధాత సం॥ మాఘ శుద్ధ చతుర్థి శరీరము చాలించినారు.

భక్తశిఖామణి సింగరిదాసుగారు

భావమహాభావములని సమాధులు రెండువిధములు సగుణసిద్ధి కాలవాలమైనది. భావసమాధి దీనినే తన్మయమనిగూడ ననెదరు. తన యుపాసనామూర్తిని యెల్లచోటుల యందు దిలకించుచు నానందడోలిక నూగులాడుట మహాభావసమాధి దీనిని సంప్రజ్ఞాతసమాధి అని చెప్పవచ్చు క్రమముగ నీసమాధుల రెండింటి ననుభవించినప్పుడే సాధ్యము సిద్ధించినదని చెప్పనొప్పు భక్తులంద ఱీభావము నాహరించినే ప్రపంచాతీతులైరి సిద్ధమూర్తులన వీరే లక్ష్యస్థానమైన భగవద్దర్శనప్రాప్తినే సిద్ధియనెదరు. దీనినే సవికల్పమని మఱికొందఱ అసంప్రజ్ఞాతయనియు జెప్పెదరు. ఇంకొకవిధముగగూడ జెప్పకొననగు నాత్మను దర్శించునప్పుడు భావసమాధియని, అఖండాత్మను దర్శించునపుడు మహాభావసమాధియని, ఇప్పుడు, అష్టసిద్ధులు వాటియంతటవి లభించును. ప్రయత్నపూర్వకముగ బ్రికటింప దలంచిన బతనమునకు హేతువులగు ఇష్టదేవతాసందర్శనప్రాప్తి లభించినవారినే మహాభక్తులని చెప్పనొప్పు, దీనినే ఈశ్వరసాయుజ్యమనెదరు. భావమహాభావముల ననుభవపూర్వకముగ నెఱింగిన సిద్ధపురుషుడు మన సింగరిదాసుగారు.

తండ్రి పెన్షన్ తాహశీల్దారును, అనేకతటాకకూపనిర్మాతయునైన కామరాజు కృష్ణయ్యగారు. తల్లి సంతతాన్నదాన సంపన్నయు సాధ్వీశిరోమణియునైన రామలక్ష్మమ్మ.

ఒంగోలు మండలమునందలి వెంకటాపురమున క్రీ॥ 1840 సం॥ శార్వరి జ్యేష్ఠశుద్ధైకాదశి జననము. కౌమారకాలమునుండియు జంతుప్రీతిగల్గియుండువాఁడు. తల్లి యన్నమునకు బిలచిన వెంటనే పరిగెత్తిపోయి తన యాటవస్తువులయిన కుక్కపిల్లల గొనివచ్చి వాటితోఁగలసి భుజించుచుండువాఁడు ఒకనాఁడు పిల్లవానిచర్యకుగోపించి యాకుక్కపిల్లలఁగొట్టి యావలి నెట్టిన నవికుయ్యో! మొఱ్ఱో! అని దుఃఖింప మొదలిడ వాటితోఁగూడ తానేడ్చుచు, వాటినిబట్టికొనివచ్చి వానినోటి కన్నపుగవళమందించి బుజ్జగించువాఁడుగూడ. ఈచర్యకై అసహ్యించుకొన దన ముందుగల భోజనపాత్రి వాటిముందఱకు నెట్టి మఱియొక కంచమున దనకన్నము బెట్టువఱకు మారాముజేసి పట్టుబట్టి తన పంతము చెల్లించుకొనువాఁడు. దీనినిబట్టి కౌమారదశనాఁటి భూతదయ వయస్సుతోపాటెంతవఱకుబోయి యుండునో, యూహింపుఁడు. ఐదవయేట నక్షరాభ్యాసమైనది. లక్కవరపు వెంకటనరసింహముగారివలన బడిచదువుపూర్తిచేసి క్రమముగ బురాణగ్రంథముల శ్రావ్యముగ జదువుట, అందలిగూఢార్థముల గ్రహించుట, మఱియొకరికి వినిపింపగల్గు నేర్పుగలవాడగుట తల్లిదండ్రులకానందము గల్గించుచున్నాఁడు.

తండ్రి కృష్ణయ్య ప్రతిదినము కుమారునిచే రామాయణముజదివించి వినుచుండువాఁడు. దీనిచేభక్తిభావమతిశయించి యప్పుడపుడు మైమరచుచుండువాఁడుగూడ ప్రతిరాత్రి ప్రథమయామమున గొంతసేపు రామమందిరమున భజనచేసి గాని నిద్రించువాఁడుగాఁడు.

భక్తశిఖామణి సింగరిదాసుగారు

భావమహాభావములని సమాధులు రెండువిధములు సగుణసిద్ధి కాలవాలమైనది. భావసమాధి దీనినే తన్మయమనిగూడ ననెదరు. తన యుపాసనామూర్తిని యెల్లచోటుల యందు దిలకించుచు నానందడోలిక నూగులాడుట మహాభావ సమాధి దీనిని సంప్రజ్ఞాతసమాధి అని చెప్పవచ్చు క్రమముగ నీసమాధుల రెండింటి ననుభవించినప్పుడే సాధ్యము సిద్ధించినదని చెప్పనొప్పు భక్తులంద ఱీభావము నాహరించిరేని ప్రపంచాతీతులైరి సిద్ధమూర్తులన వీరే లక్ష్యస్థానమైన భగవద్దర్శనప్రాప్తినే సిద్ధియనెదరు. దీనినే సవికల్పమని మఱికొంద ఱసంప్రజ్ఞాతయనియు జెప్పెదరు. ఇంకొకవిధముగగూడ జెప్పుకొననగు నాత్మను దర్శించునపుడు భావసమాధియని, అఖండాత్మను దర్శించునపుడు మహాభావసమాధియని, ఇప్పుడు, అష్టసిద్ధులు వాటియంతటవి లభించును. ప్రయత్నపూర్వకముగ ప్రకటింప దలంచిన బతెనమునకు హేతువులగు ఇష్టదేవతాసందర్శనప్రాప్తి లభించినవారినే మహాభక్తులని చెప్పనొప్పు, దీనినే ఈశ్వరసాయుజ్యమనెదరు. భావమహాభావముల ననుభవపూర్వకముగ నెఱింగిన సిద్ధపురుషుడు మన సింగరిదాసుగారు.

తండ్రి పెన్షన్ తాహశీల్‌దారును, అనేకతటాకకూప నిర్మాతయునైన కామరాజు కృష్ణయ్యగారు. తల్లి సంతతాన్నదాన సంపన్నయు సాధ్వీశిరోమణియునైన రామలక్ష్మమ్మ.

ఒంగోలు మండలమునందలి వెంకటాపురమున క్రీ॥ 1840 సం॥ శార్వరి జ్యేష్ఠశుద్ధైకాదశి జననము. కౌమారకాలమునుండియు జంతుప్రీతిగల్గియుండువాడు. తల్లి యన్నమునకు బిలచిన వెంటనే పరిగెత్తిపోయి తన యాటవస్తువులయిన కుక్కపిల్లల గొనివచ్చి వాటితోఁగలసి భుజించుచుండువాడు ఒకనాడు పిల్లవానిచర్యకుఁగోపించి యాకుక్కపిల్లలఁగొట్టి యావలి నెట్టిన నవికుయ్యో! మొఱ్ఱో! అని దుఃఖింప మొదలిడ వాటితోఁగూడ తానేడ్చుచు, వాటినిబట్టికొనివచ్చి వానినోటి కన్నపుగవళమందించి బుజ్జగించువాడుగూడ. ఈచర్యకై అసహ్యించుకొన దన ముందుగల భోజనపాత్రి వాటిముందఱకు నెట్టె మఱియొక కంచమున దనకన్నముబెట్టువఱకు మారాముజేసి పట్టుబట్టి తన పంతము చెల్లించుకొనువాడు. దీనినిబట్టి కౌమారదశనాటి భూతదయ వయస్సుతోపాటెంతవఱకుబోయి యుండునో, యూహింపుడు. ఐదవయేటనక్షరాభ్యాసమైనది లక్కవరపు వెంకటనరసింహాముగారివలన బడిచదువుపూర్తిచేసి క్రిమముగ బురాణగ్రంథముల శ్రావ్యముగ జదువుట, అందలిగూఢార్థముల గ్రహించుట, మఱియొకరికి వినిపింపగల్గు నేర్పుగలవాడగుట తల్లిదండ్రులకానందము గల్గించుచున్నాడు.

తండ్రి కృష్ణయ్య ప్రతిదినము కుమారునిచే రామాయణముజదివించి వినుచుండువాడు. దీనిచేభక్తిభావమతిశయించి యప్పుడపుడు మైమరచుచుండువాడుగూడ ప్రతిరాత్రి ప్రథమయామమున గొంతసేపు రామమందిరమున భజనచేసి గాని నిద్రించువాడుగాడు.

అప్పుడప్పుడువిజనస్థలిజేరి భగవంతుడెట్టివాడు, నాకును భగవంతునకునుగల సంబధమెట్టిది. నేనెవడ నని తర్కించు కొనుచు దీర్ఘాలోచనానిమగ్నుడై యందే నిమురించిన దలి తండ్రులు వెదకి తెచ్చి బుజ్జగించుచుండువారు.

పండ్రెడవయేటియం దుపనయనసంస్కారము జరిగి నాటినుండి సమీపమునగల సింగరిగిరి నరసింహునిదర్శించి వచ్చుటయాచారముగలవాడైనాడు. ఒకనాడు ప్రొద్దుగ్రుంకు సరికి నరసింహునిజేరి భజనముచేతను ప్రార్థనలచేతను భగవంతుని దృప్తిపరచి అమవసనిశిబయలుదేరి ద్వితీయయామ ప్రథమమున నింటికి నొంటరిగా వచ్చుచున్నాడు దారితప్పి పెడ దారిబడిపోవుచుండ ముందుజూపు మేరలో మినుకుమినుకుమను దీపముగ నగుపించిగ, అది క్రమక్రమముగ పెట్రోలుబాక్సు ప్రకాశమైయుండుటదోచి భయాశ్చర్యముల గలిగించినది. వెంటనే భావతరంగములదృశ్యములై మనోశాంతి లభింప నానందముద్భవించినది. శరీరస్పృహదప్పి నేలకొరిగినాడు. ఎంత కాలము పడియుండెనో, దేవుడెఱుగు స్పృహవచ్చి కనువిచ్చి నాడు జ్యోతి లేదు. ధూళి ధూసరితదేహుడై తిరిగి పయనముసాగించి తనను వెదకుచు నెదురేగిన యిద్దరుమనుష్యులతో నింటికివచ్చి చేరినాడు.

మఱియొకతరి సాయంత్రమైదుగంటలకు బయలుదేరి భగవత్సాక్షాత్కారమర్థించి సింగరిగిరి కేగి ఆలయప్రాంగణ మంతయు నిర్మానుష్యమైయుండ సంతసించి కోవెల బ్రవేశించి అర్చామూర్తిపాదములబడి ప్రత్యక్షదర్శన మర్థించుచు



భక్తశిఖామణి సింగరిదాసుగారు

దుఃఖించి దుఃఖించి సాక్షాత్ భగవత్సాక్షాత్కారముగాక నిరాశాభరితుండై కన్నుల వేడినీరుగార గొంతపడి విలపించి కనులువిచ్చిన మున్నుదాగనిన దివ్యజ్యోతి గాన్పించె వెను వెంటనే దుఃఖమంతరించి యానందవారి వోలలాడి సంప్రజ్ఞాతలో మునింగిన నృసింహుడు సాక్షాత్కరించినాడు.

అంత దాసుగా రానందనృత్యము గావించుచు సమాధి నుండి వెలువడి చూచిన దజ్జ్యోతిగాని నృసింహమూర్తిగాని కనుపింపలేదు. భగద్విశ్లేషమునకు జొక్కి మైమరచి కొంత వడికి దెప్పరిలి, యెట్లో ఆలయమునుండి బయటబడినాడు. వెంటనే ఒకయోగిని గంటబడినది నాయనా! నీకొఱకై సింపు వేచియున్నాను. అని బిగ్గగాగలించి సింగన్నా ! దుఃఖింపకు తారకముపదేశించెద. దాననీ కభీష్టసిద్ధిలభించునని చెప్పుచు శ్రీవారిని యాలయములోనికి గొనిపోయి సర్వవేదాంత రహస్యముల దెలిపి సందియముల దీర్చి తారకముపదేశించి యథేచ్ఛజనియె.

ఈమె సీతాంబయను శూద్రయోగిని బ్రహ్మచారిణి యింతకన్న నీమె పుట్టుపూర్వోత్తరాలేమియు దెలియరావు. అంత సింగరిదాసు తన్మంత్రసిద్ధి నార్జింప శ్రీరామసాక్షాత్కార భాగ్యమలవడినది. నేడు మొదలు దాసుగారి కంతా రామమయమైనది.

తదుపరి తండ్రి గతించుట గుటుంబభారముపై బడినది. కుటుంబాస్తియంతయు నప్పులపాలైనది. ఊర తన కప్పిచ్చు

వారు లేరు. ఉద్యోగము జేయుటకు మనస్సొప్పదు. కుటుంబము పోషించుటెట్లు మేనమామ వెంకటనరసింహముగారి బలవంతమున నుద్యోగముకొఱకు బెట్టబడిన యర్జీ మంజూరైనవ్పు డోపల యాత్రానెపమున నొకయర్ధరాత్రి బయలుదేరి పదునైదవరోజునకు నెల్లూరు జేరినారు దాసుగారు.

ఈ పయనమున నొకచిత్రముజరిగినది. దాసుగారు చీకటిబడువేళకు బెన్నయొడ్డు జేరి యుత్తరించుటకు నదిలోదిగి భజనతో పయనించుచున్నారు. ప్రవాహమంతకంతకు బెరిగి దాసుగారిచేతగల తంబురచిరతలేకాక బైగుడ్డతో సహా గంగాదేవి గ్రహించినదిగాని! దాసుగారి భజన జరుగుచునే యున్నది. నదినడుమ కేగుసరికి స్తంభించి నిలచిపోయినారు ఈవలావలి యొడ్డుల తన్నిపారుచున్నది నదీమతల్లి, కటికిచీకటిలో నదిలో నుండి వినంబడు రామనామము జెవిబడుట దయాపరులై పల్లెకారులు దివిటీలతో పడవనడపుకొనిపోయి దాసును సమీపించి తామెన్నడు కనీ వినీ యెఱుంగని యిసుకదిబ్బపై మొలబంటినీటిలో దేహముమరచి యున్న మూర్తినిగాంచి యబ్బురపడుచు, నెట్లో స్మృతిగలిగించి పడవనెక్కించుకొని ప్రయాసపై యొడ్డుజేర్చి ధన్యులైనారు. నమ్మిన భక్తుల యోగక్షేమముల భగవంతుడే వహించునను గీతోక్తి సార్థకతవహించినదనుటలో సందియ మేమాత్రమును లేదని మనవిజేయుచున్నాడ.

అంత శ్రీవారు రంగనిదర్శించి నాటిరాత్రి కోనెల యందు వసించి భగవంతుని గీర్తించుచు దెల్లవార్చినారు. ఉద్యోగమునకై యితరుల బలవంతముమీద పెట్టబడిన దర

ఖాస్తు శాంక్షనయి వచ్చినదిగాని దరఖాస్తు దారెక్కడ నున్న దియు తెలియనందున రద్దయినది యిది తెలిసి దాసుగారు చాలా సంతోషించినారు. శ్రీరామసేవకు మరిగినవాడు సామాన్యమానవసేవల సమ్మతింపగలడా?

సింగన్న ఉద్యోగము రద్దయినది తెలిసి తిరిగి వెంకట నరసింహముగారు ప్రయత్నించి శాంక్షను చేయించినారు దాసుగారు దక్షిణదేశయాత్రలు ముగించుకొని యింటికివచ్చిన రోజునకు సరిగా శాక్షను ఆర్డరు ప్రత్యక్షమైనది చూచినారు. రామకూరు ఫిర్కారివిన్యూఇన్స్పెక్టరుద్యోగము తన కిష్టము లేకపోయినను దైవయోగమునకు బద్ధుడై పనిలో బ్రవేశించి నారు. గాని జపతపముల గొడవలో నిమగ్నుడైయుండుట వేళ కాఫీసునకుబోవుట సంభవింపమి పైయుద్యోగి దాసు గారిని మందలించి బెదరించి భయపెట్టెను. గాని ప్రయోజ నములేకపోవుట నుద్యోగమునుండి తొలగించినాడు బంధము తొలగినందుకు సంతసించి తల్లి భార్యలతో నిల్లుజేరి శ్రీరామ సేవాపరాయణులై కాలముగడుపుచున్నారు. దాసుగారు కుటుంబజీవనమున కష్టపడినందున సహింపలేక దల్లి కట కటంబడి అన్న వెంకటనరసింహముగారితో జెప్పి దుఃఖించి నది. చెల్లెలిదుఃఖముచూచి భరింపలేక మేనల్లుని విరాగమును రూపుమాపెదనని పట్టుపట్టి యిష్టములేకపోయినను, ఇన మన మెళ్ళూరు తాలూకాకచేరిలో గుమస్తాపనిలో బలవం తముమీద ప్రవేశపెట్టినాడు. గాని అదికూడ మూన్నాళ్ళ ముచ్చటైనది.

భార్య గర్భవతియైనది. ప్రసవించుటకు పుట్టింటి కంపి నాడు. నిత్యోపవాసములు జేయలేక దల్లి తనచిన్నబిడ్డలతో పుట్టింటికి బోయినది విరామము లభించినందులకు సంతసించుచు రామసేవలో బాల్గొని తృప్తిపడుచు తిరుపతియాత్రకై బయలుజేరిన మార్గములో బావమరది ధేనువకొండ రామకృష్ణయ్యగారు కలిసి యాత్ర పూర్తిఅయిన యనంతరము దనయింటికి వచ్చిపోవునట్లు ప్రార్థించిన సమ్మతించి తిరుపతికేగి యాత్ర ముగించుకొని అనినమాటప్రకారము బావమరది గారియింటికిజేరినాడు. ఆయన దాసుగారి నెట్లో యొప్పించి చిత్తూరుమండలమందలి పూతలపట్టులో బడి పెట్టించినాడు.

ఇప్పుడు దాసుగా రాయూరంగల ఆబాలవృద్ధమునకు గురువై పాఠములచేతను పురాణకాలక్షేపములచేతను పురివాసుల నానందవార్ధిముంచెత్తుచున్నారు. భార్య రుక్మిణమ్మ పసిపిల్లతో వచ్చిపతిసేవజేయుచుండ నొకవత్సరము జరిగినది.

దాసుగారికి రక్తనిరేచనములు పొడసూపి వ్యాధి విస్తరించుట పాఠశాలను కట్టిపెట్టి క్రీ॥ శ॥ 1864 వెంకటాపురము జేరినవెంటనే వ్యాధినుండి విముక్తుడైనాడు. తదుపరి భార్యాబిడ్డల నత్తవారింటికంపి శేషాచలమును జేరి గోగర్భప్రాంతమునంగల గుహాయందు తపోవృత్తి గైకొనినాడు ఆరవ మాసమున కౌపీనధారియగు మునియొక్క డరుదెంచి నీతపము ఫలించినది. ఇంతటినుండి గోరినప్పుడెల్లను శ్రీరామ సాక్షాత్కారము కాగలదు. తపమునుచాలించి వెంకటాపురముజేరి ఆదర్శగృహస్థుడై యుండుమని యాజ్ఞాపించిన దనప్రయత్నము

విరమించి వెంకటాపురముజేరి నిష్కామకర్మాచరణదక్షుడై శ్రీభద్రాద్రిరామదాసుచరిత్రము రచించి శ్రీరామున కర్పించినాడు. ఇప్పుడు జనులలోనున్న రామదాసుచరిత్రి యిదియే. నిర్లిప్తస్థితిని గుఱితించి మామ అప్పయ్య క్రీ॥ శ॥ 1869 సంవత్సరములో సల్లుని దనయింటికి జేర్చినాడు. ఒకవత్సరము మామిళ్ళపల్లెయందుండి రేపల్లెజేరి తమ్మునినుండి వేరుపడి పితరుల యాస్తినుండి రాబడిన ద్రవ్యముతో నాలుగుయకరముల మాగాణికొని ఇల్లుకట్టుకొని కాపురముజేయుచు జిత్తము న్యాయత్తముగానీక విషయవిముఖుడై కుమ్మరిపురుగువలె సంసారమున మెలంగుచు భగవన్నామామృతపానతృప్తుడై యాశ్రితుల నాదరించుచుండె. చెల్లెండ్రుపు రోకరోజుననే మృత్యువువాతబడినను వెంటనే, యైదారుసంఖ్యల పుత్రికలు దివంగతులైనను తన నిర్లిప్తత గోల్పడలేదు.

ఇప్పటికి రేపల్లెపాఠశాల సాగుచునే యున్నది. నిద్దుర లేచినదిమొదలు పొద్దుగ్రుంకువఱకు దాసుగారికి తీరుకలేదు. కొంతకాలము పిల్లలపాఠములు,కొంతకాలము భాగవతపురాణకాలక్షేపము, రామభజనలు, జపతపానుష్ఠానములు ఇంకెక్కడలీరుక. ఈమధ్యకాలమున భార్య రుక్మిణమ్మయునంతరించినది. భార్యావియోగముతో రేపల్లెవదలి పెద్దకుమారుని యుద్యోగస్థలమగు నూజవీడుచేరి తత్కార్యపధానువర్తియై పిదప బొమ్మనసన దొకవత్సరముండి బ్రహ్మవిద్యాభిమానియగు చానలి పున్నయ్యగారిని శిష్యునిగా గ్రహించి పాతూరి కోటయ్యశాస్త్రిగారిస్నేహాము సంపా

డించి తదుపరి శిష్యులతో రామేశ్వరము జేరి స్వామిసేవతో నుండుతరి నొకనాడు భజనానందమున దేలియాడుచు ధ్వజము కడ భావసమాధి నైమరచిన నక్కడివారు హారతులతో నాదరించినారు. అటనుండి జంబుకేశ్వరుదర్శించి శ్రీరంగేశ దర్శించి, ఇట్లే దక్షిణయాత్రలనన్నిటిని ముగించుకొని స్వపురి జేరి అందు కొంతకాలముండి ద్వితీయపుత్రుడు చెన్నకేశవు లుండు బాపట్లజేరి గంగరాజు పట్టాభిరామదాసు, అద్దంకి వెంక టాద్రియుడుగార్ల స్నేహముగడించి మూడవసుతుని యాహ్వా నముపై నర్సాపురముజేరి యందు భక్తిబీజములునాటి పోషిం పుచు దనడెబ్బదినాల్గవయేట నాతురసన్యాసమును స్వీకరించి నలవత్సర జ్యేష్టశుద్ధపంచమి మహాసమాధి బ్రవేశించినారు.



బోధానందమహర్షి

యే యథామాం ప్రపద్యంతే।
తాం స్తథైవ భజామ్యహమ్ ॥

అనుభగవద్వ్యాఖ్యానుసరణి నొకటియైన పరమాత్మ స్మార్తులకు శబళబ్రహ్మముగను, శైవులకు, శివుడుగను, వైష్ణవులకు విష్ణువుగను, శాక్తేయులకు శక్తిగను, సౌరులకు సూర్యుడుగను, గాణాపత్యులకు గణపతిగను, సాక్షాత్కరించు చున్నాడు. షణ్మతములయందలి సాధకులు తత్తన్మతాను సరణి భగవంతు నుపాసించి సగుణసిద్ధిగడించి తద్వారా మనోనాశనరూపమైన యద్వైతానందము నార్జించు చున్నా రనుట లోకవిదితము.

ఇందు శైవులు శివలాంఛనానాదారులై శివారాధనము జేయుచు తదీయభక్తుల బ్రత్యక్షశివస్వరూపులనుగా భావించి సేవించుచు పరదారాధనవర్జితులై పరమేశ్వరాయత్తచిత్తుల గుచు శివార్పితప్రసాదదీక్షతో జీవభ్రాంతినిద్రోసి వేసి శివోహ మను మహామంత్రజపదీక్షాదురంధరులై పురుషప్రకృతుల యందు శంకరభావము జేయుచు శివాద్వైతమహాభాగ్యము నార్జించి ధన్యులగుచున్నారు.

ఇట్టి మహానుభావులలో శ్రీబోధానందమహర్షిగా రొకరు. వీరి పూర్వాశ్రమమందలినామధేయము "సుబ్బన్న" ఇంటిపేరు ఇలపర్తివారు. తండ్రిసూర్యనారాయణ. తల్లి మహా

లక్ష్మమ్మ. జననము క్రీ॥ 19వ శతాబ్దమందలి వృషవత్సర కార్తీకశుద్ధతదియ.

ఈపుణ్యమూర్తి శైశవానంతరస్థక్రమమున శుక్లపక్ష పాకసునివలె సుగుణగణభూషితుండై శివాంశసంభవుడగుట దివ్యతేజమున బంధుమిత్ర జనసందోహ నయనానందకరుండై శుభలక్షణలక్షితుండై, సుజనవంద్యుండై, విరాజిల్లుచుండె.

సప్తవర్షప్రాయంబునం దుపనయనస్తైనది. నాటగోలే ప్రాకృతవిద్యాభ్యాసమారంభించి పదియవయేడు వచ్చియు, రాకపూర్వమే బడినుండి స్వగ్రామమైన గోదావరిమండలాంతర్గత కాలీరున బంచకావ్యపఠనముగావించి కోనసీమలోని కౌశికా తీరమువగల బోడకుఱ్ఱున శ్రీకంఠం కేదారలింగేశ్వరునికడ వేదాధ్యయనముగావించి పంచాక్షరీవిద్యనభ్యసించి, శంభ, సాళువ, బాలా మంత్రత్రయపాదుకాంతదీక్షసంగ్రహించి కాంచిపురిజేరి పునశ్చరణావిశేషముచే స్వానుభవము గడించి, పదునైదవయేట మహాలక్ష్మమ్మనువివాహమై అతిథ్యభ్యాగతసేవతో సక్రమముగా గార్హస్థ్యముగడుపుచు విద్యార్థుల బలువుర సేకరించి విద్యాన్నదానముల దృప్తులగావించి గురుప్రసాదలబ్ధిచే సత్కీర్తినార్జించి వేదపాఠశాలనిర్మించి తద్వారా! అనేకమందివిద్యార్థుల గృతకృత్యులంగావించి త్రిలింగక్షేత్రమందంటను బహుశివప్రతిష్టల జరిపించి స్త్రీవిద్యా ప్రభావముచే నాత్మశక్తివృద్ధిపరచి తన్మూలమున భూతచికిత్సాబలముగ బలువుర నారోగ్యవంతులగావించి రుద్రాక్ష



బోధానందమహర్షి

ధారణచే బ్రత్యక్షశంకరమూర్తియై గోష్పాదప్రమాణశిఖయు గర్ణముల నాగకుండలములును కలిగి దర్శనీయుండై యుండె.

ప్రారబ్ధమెంతవాని కైనను శ్రమలుపెట్టక మానదు గదా! అంత భార్యమహాలక్ష్మమ్మ మృత్యువున కాహుతి యగుటయు, సత్యవతినివివాహమాడుటయు సంభవించి క్రమముగ శుభదినము లెదురేగ బ్రథమభార్యకుమార్తె రామమ్మ గారికిని ద్వితీయభార్యకుమారునకును వివాహములుగావించి పరమార్థదృష్టివిస్తరింప విషయలాలసుడుగాక దామరాకుపై జలబిందువువలె సంసృతికంటక మెలంగుచు శివానందస్వామికడ నాశ్రమముస్వీకరించి బోధానందబిరుదమంది సన్న్యాసాశ్రమ ధర్మములగౌరవడనీక నేరవేర్చుచు గ్రముకభక్షణ పర్ణభక్షణ ఖట్వాధిశయన కామినీసంభాషణాది గుణగణముల విసర్జించి దండకమండలధారియై కాశీసేతుమధ్యగల పుణ్యతీర్థముల గ్రుంకులిడి పవిత్రుండై కృష్ణానదీతీరస్థ జిలుమూరు జేరి పలువురు శిష్యులు వెంటనంట తెనాలి శైవసంఘము వారివలన జరుపబడిన నగరోత్సవమాదరంబున గ్రహించి, గొల్లలమామిడాడ జేరి విస్సన్నగారి సన్మానముతో గొన్నిరోజులందుండి, దుర్గాంబా కళత్రుడగు మామిళ్లపల్లి సాంబయ్యగారికోరికపై భక్తలక్షణము లిట్లుబోధించె.

1. పూర్వజన్మమునం దొనర్చిన యొకానొక పాప విశేషముచే నితరులవలన నపకారము జరుగవచ్చు దాని నెన్నండును మనస్సున కంటనీయరాదు.

2. భగవదాశ్రయమునం దన్యాయ మెప్పుడును జరుగదు భక్తున కేవిధమైన బాధకలిగినను పూర్వసన్మార్జితమైన పాపవిశేషమైయుండు. తత్పాపవిముక్తికై, భగవత్ప్రార్థనము జేసిన యాతడు ముక్తుడగుచున్నాడు.

3. భక్తున కపకారముజేయువ్యక్తి యంత్రపాత్రియుడు మాత్రము, పై పెచ్చుబాధగలిగించుటద్వారా వాడు అజ్ఞానావృతుడగుచున్నాడు తనపై దానే కష్టాల బిలిచి తెచ్చుకొనుచున్నాడు ఖండితము.

4. ఇతరు లెంత బాధగలిగించినను భక్త డాగ్రహపడడు. ప్రత్యపకారబుద్ధిలేనివాడే నిజమైనభక్తుడు. మహోపకారిని మహోపకారినిగా దలంచి ప్రేమించును. అప్పు డా యపకారి మనస్సు పరితాపాగ్నిచే దహించి అశాంతినొందును. ఇప్పు డపకారిని భక్తు డత్యంతదయతో వీక్షించును. వీక్షించుటే కాదు, అపకారిని సమీపించి 'సోదరా! నీవింతగా విచారించుచున్నా వేల దీనికి నీవేమాత్రము గారకుడవుకావు, నాకర్మయే నాకపకారము గావించినది. భగవంతుడు నీద్వారా నాకు మహోపకారము గావించినాడు. కాన నీచిత్తమం గేవిధమైన యశాంతిని జెందకుము. యదార్థహృదయముతో జెప్పుచున్నాను. నామాటనమ్ముము' అని చెప్పు నాతడే నిజమైన భక్తుడు ఇప్పు డాతనిమనస్సు సంపూర్ణమైన శాంతినిబొందినదగుచున్నది. ఇట్లు జరుగనిచో, ద్వేషాగ్ని వారిరువురనుగూడ గాల్చివేయును. ఈరహస్య మెఱింగియే భక్తుడు పరాపకార స్పృహా మనస్సున కంటనీయడు.

5. పరులవలన దనకు స్వల్పాతి స్వల్పమైన యుపకారము
లభించినను భక్తుడు మరచిపోడు. అది తనప్రారబ్ధమువలన
గలిగిన దనిగాని, లేక దనప్రయత్నఫలముగా లభించినదనిగాని
కలలోనైనను దలంపడు. భగవంతు డీమిత్రుని రూపమున దన
కుపకరించినాడని తలంచి వానియందెప్పుడును భగవద్భావము
గలిగియే యుండును. పరిస్థితులుమారినను పరోపకార
స్పృహానుమాత్రము మారనీయడు. వీలులభించినపు డాతని
సేవజేయుటకు, సిద్ధముగానుండును. ఆతని యుపకారమును
వేనోళ్ల గొనియాడుచుండువాడే నిజమైనభక్తుడు. ఉపకార
స్పృహగలవాడే విశ్వరూపోపాసనమున కర్హుడు పై విషయ
ముల జ్ఞప్తియందుంచుకొని, శివనామస్మరణముతో నీ జీవి
తము సార్థకమొనర్చుకొనుము.

6 యుక్తాయుక్తముల విచారింపక స్వార్థరహితుడవై
విశ్వరూపుని బ్రేమించుము. హేతురహితముగా నవమానము
జరిగిన అది భగవల్లీలయని సంతసింపుము. ధర్మమైనను పలు
వుర కిష్టముగాని మాటనుగాని, చేతనుగాని వెల్లడింపక మౌన
ముద్రవహించుము. దాన నీకు గష్టముగలిగినను సహించుము.
ప్రాణాపదసంభవించినను పరహింసకుద్యమింపకుము. దేహాత్మ
బుద్ధియే మహాపాపమనుట మరువకుము. మాటలలోగాని, చేత
లలోగాని శంకరు విస్మరింపకు. మృత్యుదేవతకు స్వాగతమిమ్ము.
చూపునగల కామవృత్తి దూరముజేసి ప్రేమవృత్తి నలవరచు
కొమ్ము. శంకరుడు సత్యస్వరూపియగుట సత్యదీక్షబూని
కృతార్థుడవగుమని మహోపదేశము గావించినాడు. మఱియు,

గీ॥ విషయవిముఖతగల్గిన విబుధకోటి
తోడ భాషింపునియమంబు దొలగబోకు
దుర్జనులపొత్తుచేకూర్చు దోడ్డముప్పు
విజితదుస్సంగవృత్తి లభించుముక్తి.

అని నిర్మొగమాటముగా శాసించి ధన్యునిగావించు టయేగాక దనజీవితమంతయు మహోపదేశములతో వెలింగించి వేలకొలంది శిష్యుల సంగ్రహించి విజయవాడయందు గల స్వీయాశ్రమమున క్రీ॥ 20వ శతాబ్దమందలి విజయసంవత్సర వైశాఖ బహుళామావాస్య గురువారమున శివనామ స్మరణతో బ్రహ్మనిర్వాణ భావమందినారు

వీరి భౌతిక దేహమును కృష్ణయొడ్డున సమాధిగావింపబడి యపరోత్సవము జరుపబడినది.

శా॥ సన్యాసాశ్రమమందితుట్టతుదకున్
సాయుజ్యసంసిద్ధిచే
నన్యోపాధులులేకశాశ్వతశివ
ధ్యానార్చనాసక్తుడై
అన్యోన్యైక్యసమాధిలోమునిగి బ్ర
హ్మంచత్పరంజ్యోతియై
ధన్యత్వంబునుబొందె ముక్తుడితడా
ధ్యాత్మస్వరూపంబునన్.

(బోధానందవిజయము.)

పాటిబండ్ల వెంకటప్పార్యులు

గీ॥ తివిరిచద చిద్విలాసమహా దేహమంద
చిత్తు స్వేదాంబుధారలై క్షితినిదొరగ
గేవలానందమూర్తియై కీర్తిగాన్న
పాటిబండ్లకులాంబోధి బార్వణశశి
వెంకటప్పార్యుసద్భక్తి వినుతిజేసి
రామచంద్రునిగాంతు దుర్భవమడంతు.

మానవునియం దెన్ని శక్తిసామర్థ్యములు, ఎంతటిప్రభావము. ఎన్ని మహిమలు, ఇమిడియున్నవియో మనకుదెలియునవికావు. మానవునియందుగల మహాత్మ్యమంతయు నెఱింగిన పుణ్యు డింతవరకును బుట్టలేదనుట అతిశయోక్తికాదు.

ఈమానవు డీవర్తమానసృష్టిలో నవతరించి దాదాపు రెండువందలకోట్ల వత్సరములు కడచినను వానిశక్తులలో సహస్రాంశము లైనను వెలువడలేదు. ఈ రహస్యమెఱుంగక దాను దుర్బలుడ ననియు, అల్పుడనియు, దలంచుచున్నాడు. విచారించిన నీత డల్పుడుకాడు, దుర్బలుడును కాడు, పైకి గాన్పించెడి దుర్బలము వెనుక నెన్ని సదవకాశములున్నవియో సాధింపదగిన వెన్నెన్ని శక్తులున్నవియో పాపమీతనికి దెలియదు.

జితేంద్రియులను పరమహంసలను, యతులను, అష్టసిద్ధులను సంపాదించినవారలను, వేయేల ఆత్మశక్తిపూరితులను, మన మెందఱెందఱిని చూచుటలేదు. మానవత్వ

మును గూర్చి మనకు దెలిసినది యత్యల్పము. అనంతశక్తి సాగరము మానవుని కాధారమై ప్రకాశించు చున్నది.

ఆధ్యాత్మికమును శ్రవణించి శ్రవణించి తానాత్మ స్వరూపుడనను విషయమును మననించి మననించి ఆ మనన శక్తి తనలో బ్రతిరక్తనాళములలో జొచ్చి ప్రతిరక్తబిందువు నందును, స్పందించువఱకు దనసప్తధాతువులలో దనపంచకోశ ములలో బ్రవేశించువఱకును రేయింబవళ్లు మననము జేయు చుండిన దన శక్తిసామర్థ్యములు, తన ప్రభావములు, మహిమలు, బయటబడును.

మానవుని తనువనిత్యము బ్రహ్మానందమయము. సర్వజ్ఞము. సర్వశక్తిమంతము. స్వయంప్రకాశమాన మగు ఆత్మను "నేను" అనుభావముననిండి నిబిడీకృతముగావలయు, అహోరాత్రములు దీనినే మననము జేయుచుండవలయు.

మానవ జీవితమునకు నీతత్త్వమవినాభావసంబంధము నొందువఱకు ఐక్యమగువఱకు మననము జేయవలయు అప్పుడు కాని క్రియాశక్తి వెలువడను. నిండు హృదయమునుండియే క్రియలు వెలువడును. మానవు డాదర్శప్రాయుడైనప్పుడే క్రియాశక్తి వెలువడుట సంభవించును. నరుడు నిత్యము ప్రఫుల్లహృదయముతో నుండునపుడే భావబలమున గ్రియలు ద్విగుణీకృతశక్తివంతములగును. అవి దివ్యములై శోభించును. ఈభావము దన జీవితమున నిరంతరము వర్తింప జేసికొనిన "వాడే జ్ఞాని, వాడే భక్తుడు, వాడే యోగి" ఇట్టివ్యక్తులలో నాత్మ

శక్తుల గొన్నింటి నార్జించిన పుణ్యమూర్తి మన పాటిబండ్ల వెంకటప్పార్యు లొకరు.

తండ్రి దేవగురుబ్రాహ్మణ భక్తిపూరితుడగు నాగయ్య గారు. సాధ్వీమతల్లియగు తల్లి రాజమ్మ. వీరి పురుషసంతానములో బెద్దవాడు మన వెంకటప్పార్యులు. జననస్థలము గుంటూరుమండలమునగల చేబ్రోలు కమ్మవా . జననము క్రీ॥శ॥1866 జులై 29 తేది. తన అరువదిరెండవ వత్సరవయస్సున అనగా విభవవత్సరాషాఢశుద్ధత్రయోదశీ శనివారము తెల్ల వారుజాము 4 గంటలకు నిర్యాణసౌధ మధిరోహించినారు. వీరికి గోటయ్య. కృష్ణయ్య లనుసోదరులును, నరసమ్మగారను తోబుట్టువును గలరు. శ్రీవారు జననీగర్భ ద్వాదశమాసజీవి.

బాల్యమంతయు నాటపాటలతో బూర్తియైనది. గాని విద్యాభ్యాసప్రయత్నము సున్నపడినది. గాన నిశానీదారని చెప్పకతప్పినదిగాదు. అయినను వసుచరిత్ర మనుచరిత్ర, మొదలగుగ్రంథములనుగూడ నవలీలగా నర్థము చేసికొను శక్తిసామర్థ్యములుగల మహానీయుడు. స్ఫుటకాయుడు. సుందరవిగ్రహముగూడ. ధైర్యస్థైర్యములలో మొదటివాడు.

ఒకప్పుడు దొంగలు పదుగురువచ్చి చేబ్రోలులోని సంపన్నగృహస్థుని యింటబడి దోచుకొని తమకు లభించిన ద్రవ్యము నూరి వెలుపల బంచుకొనుచుండ నెఱింగి యొంటి మైజని యాతస్కరులనోడించి జయముగాంచి, వారియొద్ద నుండిన ధనకనకాదివస్తువుల, గొనివచ్చి తద్గృహస్థునకిడి తన

బాహుబలమును పరీక్షించిన ధైర్యశాలి మన వెంక టప్పార్యమూర్తి.

పై గనుపరచిన చోరులలోని పైలుమాన్ ఒకడు శ్రీవారి నంతమొందింప నెంచి వచ్చి శిష్యత్వమర్థించిన సమ్మతించిన అతడు గురుసేవ జేయుచు, కపటముతో గాలముగడపుచుండి యొకనాటి రేయి, తనయత్నమును సఫలీకృతము గావించుకొన నెంచి వినయమున గురువు సమీపించి పాదసేవా నెపమును పురస్కరించుకొని పనిగొన మొదలిడినాడు. ఇనుపతునకలపై జేయి వేసినట్లైనది. శరీరము స్పృశించిచూచినాడు, ఉక్కు-దుంగనంటినట్లైనది భయపడి మరుదిన ముదయముననే పలా యనము జిత్తగించినాడు.

ఎంతటిశక్తి, ఎంతటిప్రభావము ఇట్టివాడుకనుకనే ముప్పదివత్సరములనాడు సమాధిని జేర్చిన శ్రీవారి దివ్య దేహము చెడిపడకుండ గలిగినది. సామాన్యులకు విపరీతముగ దోపవచ్చు, బరీక్షించిన నిజమెఱుంగనగు.

వీ రేకోనవింశతి వర్షప్రాయమున జలువూరి భిక్షావతీం ద్రులవారివలన బంచాక్షరీమంత్రోపదేశమునంది, దాదాపు పదికోట్లు జపించి దీక్షముగించినారు. నాడుమొదలు సంస్కృ తాంధ్రగ్రంథముల యందుగల యాధ్యాత్మికములగు విషయ ముల శ్రవణమాత్రముచే గ్రహింపగలశక్తి యలవడినది. శ్రీవారి కనుభూతికి రాని యాధ్యాత్మికరహస్యములుగాని, ఆధ్యా త్మిక వాఙ్మయమునం దర్థములుగానిగ్రంథములుగాని లేవని చెప్పవచ్చును. వీరిప్రథమభార్యా దుర్గమ్మగారు. పదియేండ్ల

కాపురముజేసిన యనంతరము దేహముజాలింపగా, తన నలు బదియైదవయేట రెండవ వివాహమైనది. గాని ఆమెయు నెల దిరుగకముందే గతించినది ఈమెపేరు లక్ష్మమ్మ తదుపరి వత్సరము ముగియులోపలనే వెంకటసుబ్బమ్మను పరిణయమై పంచాక్షరీమంత్రి ముపదేశించినారు. ఈమెగారు పంచాక్షరి నుపాసించి మంత్రిసిద్ధినందుటయే గాక దనదివ్యస్వప్నమున శంకరసాక్షాత్కారమంది పిదప కుంకుమప్రదానానంతరము శరీరము జాలించినారు ఈమెగారి సంతానమే హైమవతమ్మ, నాగేశ్వరరావుగార్లు. నాలుగవభార్య బాపమ్మ సజీవి. వీరు భర్తవలన బంచాక్షరీమంత్ర ముపదేశమందియుంట నాడు మొదలు నేటివఱకు నియమబద్ధయై జపతపానుష్ఠాన శ్రవణ మననములయం దాశక్తచిత్తలై పరమేశ్వరుని సేవించు చున్నారు.

శ్రీవారు సత్యదీక్షాధురంధరులగుట వాసిరెడ్డి వీరయ్య గారు. తేబడిన శివిల్ వ్యాజ్యములో దనదీక్షకు భంగము వాటిల్లనీక న్యాయవాది సలహానుగూడ నిరాకరించి జరిగినది జరిగినట్లుజెప్పుట నిజమెఱింగి కోర్టువారు వాదికి వ్యతిరేకముగా దీర్పువ్రాసి ప్లైంటును ద్రోసివేసి శ్రీవారి కనుకూలముజేసి లాభస్తేషామ్। జయస్తేషామ్ । కుతస్తేషామ్ । పరాభవః॥ అను నార్యోక్తిని సార్థకపరచినారు. ఆత్మశక్తిగలవాని కపజయము కలలోని వార్తగదా మరీ!

ఒకప్పుడు శిష్యులకోరికపై సేకూరుజేరి అందు ః
దశి ప్రవచనము జేయుతరి దలవనితలంపుగ కోటిసూర్యప్రకా
శమైన యాత్మజ్యోతిని దర్శించి తన్మయులై మూడవనాటికి
ప్రపంచోన్ముఖులైనారు. అప్పటినుండియు జీవితాంతమువఱకు
ప్రతిదివస మెప్పుడో ఒకప్పు డాత్మజ్యోతిని దర్శించుచు గొన్ని
గంటలు సమాధి సుఖమనుభవించు యోగిపుంగవులు మన
వెంకటప్పయ్యలు. వీరి కిప్పటినుండి భూతభవిష్యత్తులు కర
తలామలకము లైనవి.

స్వీయవృత్తియగు వ్యవసాయమును కాలాతిక్రమణ
గానీకసాగింపుచు అందలి ఫలసహాయమువలన నతిథ్యభ్యాగత
సేవతో నిజకుటుంబపోషణ జేసికొనుచు శిష్యవిత్తాపహారిగాక
నాలుగువర్ణములనుండి శిష్యసంగ్రహముగావించి కృతార్థుల
జేయుచు నితరకాలములందు బశువైద్యము పశుపరీక్ష మొద
లగు లోకహితకార్యముల జేయుచు జీవితమును సార్థకపరుచు
కొనుచుండువారు.

సాధుసేవయందు ప్రాణముల గూడ నర్పించు
త్యాగమూర్తి ఒకప్పుడు శృంగేరినుండి. రాబడిన సాధుమూ
ర్తితో గలిసి ఆత్మవిచారమగ్నులై యన్నపానములమరచి
బ్రహ్మానందపారావారమున మునకలువేయుచు దేహముమరచి
యుండుతరి యతివర్యు లంతర్హితులైనారు. నాల్గవదివసమునకు
శ్రీవారు బహిర్ముఖులై ఋషిపుంగవుడు లేమి విచారించి పరితపించి
కొంతవడికి శాంతివహించి సాక్షాచ్ఛంకరులే సాధురూపమున

దర్శనమిచ్చినారని ముదంబురాసి మునకలు వేయుచు దనముం దయాచితమున గనంబడిన యజ్ఞవరాహగీతాగ్రంధమును గాంచి నిజశిష్యుడగు దేశిరాజు రాఘవయ్యగారి చేజదివించి ప్రవచనరూపమున శిష్యకోటికిబోధించి కృతార్థుడగుటయే కాక దానిని బారాయణగ్రంధముగాస్వీకరించి ధూపదీప నైవేద్యాదిపూజలతో దృప్తిగొనుచుండువాడు.

తనయిరువది రెండవసంవత్సరప్రాయమునందొకనాడిష్టాగోష్టి నుండి మాటలసందడిలోశిష్యుడగు రావూరి సుబ్బయ్యగారితో గొలదిరోజులలో నిర్యాణకాలమురానున్నదని చెప్పిన కారణ ముగా విభవవత్సరాషాఢశుక్లత్రయోదశిరాత్రి యొంటిగంటకు అతిసారరూపమైన విరోచనమైనది. దానితో దేహము స్వస్థత దప్పి దుర్బలుడైనాడు. ఇది తెలిసి గ్రామమునంగలశిష్యులు గురువర్యుని సమీపించి సేవలన్దన్నుచు గురువున కెఱింగింపకయే పరాశరం వెకంట రామానుజాచార్యులవారిని పిలిపించినారు.

ఆచార్యులవారు నాడిబరీక్షించి శుష్కించియుండుట గాంచి ప్రశ్నించిన నాకుజబ్బేమియులేదు. విరోచనమగుట దుర్బలముగమాత్రమున్నయది. అనిజబాబిచ్చిరి. ఇది ప్రాణప్ర యాణసమయమని యెఱింగినవాడగుట నాచార్యులవా రౌష ధముదెచ్చెదనని చెప్పుచు దప్పుకొనినారు. కుమార్తెహైమవ తమ్మతండ్రిపాదములొత్తుచు వైద్యునిరాకకు నిరీక్షించు చున్నారు. కానివైద్యుడురాలేదు. వేకువనాలుగుగంటలైనది. బిగ్గరగా బంచాక్షరీ మంత్రముచ్చరించుచు శ్రీవారు శివైక్య మును బొందినారు.

తెల్లవారినది శిష్యకోటి గురువియోగమునకడలుచు నెట్లో శాంతివహించి శ్రీవారిభౌతిక దేహమునకు స్నానాదిక ములనిర్వర్తింపజేసి యూర్ధ్వపుండ్రధారణగావించి విమానము నందుంచి మంగళవాద్యములతో నగరోత్సవము ముగించి సాయంకాలమునకు సమాధిస్థలమునకుజేర్చిరి. గురువుగారి భౌతిక దేహమును విమానమునందుంచినది మొదలు సమాధి స్థలమునకు జేర్చువఱ కెంతచెమటనీరు శ్రీవారి శరీరము నుండి యూరినదియో? ఎన్నిమారు లూర్ధ్వపుండ్రములదిద్ది నారో లెక్కింపదరముగాదు. గాని సమాధిసమీపమునదింపు టతో చెమటలాగిపోయినవి. జయజయధ్వనులతో సమాధి యందా భౌతిక దేహమును ప్రవేశపెట్ట నొకబండతో ద్వార ముమూసి భజనలనోలలాడుచు దదుత్సవమున పాల్గొనిన వారెల్లరు దమతమ గృహములజేరినారు అపరక్రియలుపెద్దల సహాయముతో కుమారుడు నాగేశ్వరరావుజరిపినారు. ఆరు మాసములేగినవి. శిష్యులగు అరవ వెంకటాద్రి, దేశిరాజు రాఘ వయ్య, చీదెళ్ల గోవర్ధనము, పాటిబండ్ల అచ్చయ్యగార్లొక నాడు సమాధిపై మండపముగట్టించుటకు బనివారి వెంటగొని సమాధిసమీపించి నిర్యాణకాలమున గురువను సమీపమున లేనివాడగుట నాకొదువ దీర్చుకొన దలంచిన అరవ వెంకటాద్రి కోర్కెమేరకు సమాధి పైబరుపబడిన బండను తొలగించి చూచిరి. ఆరుమాసములనాడు సమాధిలో గూర్చుండబెట్టిన శ్రీవారిభౌతిక దేహ మప్పుడుకు ర్చుండబెట్టినట్లున్నది.

పడిపోవుటగాని, మురుగెత్తుటగాని లేదు పైగా జిరునవ్వు మొగముతో విరాజిల్లుచున్నయది. చూపరబ్బురపడినారు. శ్రీవారిమహిమ వేనోళ్లగొనియాడినారు. అంత నివాళులిడి ద్వారము తిరిగి బండతో మూసి సున్నపు పనితో సమాధి నలంకరింపించి క్రమముగా మండపము పనిపూర్తిగావించినారు. నాటినుండి నేటివఱకు కుమారుడు నాగేశ్వరరావుగారు వార్షికోత్సవములు జరుపుచున్నారు.

బాపమ్మగారును పతిభక్తిగలవారై జపతపానుష్ఠానములుగావించుచు నాధ్యాత్మికవిచారణతో జీవితము బవిత్రవంతము గావించుకొనుచున్నారు. (శ్రీ)వారిశిష్యులలో బ్రిధముడగు కీర్తిశేషులైన చీదెళ్ల గోవర్ధనముగారికోరికపై నీ దివ్యచారిత్రిము బూర్తిగావించి (శ్రీ)మదాంధ్ర మహాభక్త విజయమునందు జేర్పబడినదని మనవి.

గీ॥ విభవసంవత్సరాషాఢ విహితశుక్ల
పక్షమందు త్రియోదశి రాత్రివేళ
తనువుజాలించి సంసిద్ధి తగనుబొందె
వసుధ(శ్రీ)పాటిబండ్లన ద్వంశవిదుడు॥.

సందడి రామదాసు

ఏకోరికలు లేనివాడుజ్ఞాని. వీని కాజ్ఞానప్రకాశమువల్ల ద్వైతమునశించినది. దాన నంతయు దానేయైనాడు. "అద్వైత బ్రహ్మమనిన నితడే స్ఫటికమునీటిలోనుండి అది యాన్నిటకంటె వేరైయున్నను దానినెట్లుగుర్తింపలేమో? అట్లే జ్ఞానినిగూడ గుర్తింపలేము. వాయువాకశమున గలసి పోయినప్పుడు ఆకాశమునకు భిన్నముగా వాయువుండదుగదా? అట్లే జ్ఞానియగువాడు బ్రహ్మలోగలిసి, బ్రహ్మమేయగుచున్నాడు.

జ్ఞానస్వరూప పరబ్రహ్మమే కాని; జ్ఞానిమాత్రము గాడు. ఆకాశమునుండివాయువు బయటపడినప్పుడు ఆకాశమునందు ఆవాయువున్నదని యెట్లుదెలిసికొనుచున్నామో? అట్లే శరీరముద్వారా కర్మాచరణమొనర్చునపుడు, లోకులకు జ్ఞాని, భక్తునివలె గనుపించును. గాని, విమర్శించిన నాత్మానుభవమువలన భగవంతుడే యగుచున్నాడు. ఇతనికిప్పుడాత్మానుభవము సహజమైనది. సహజముగబ్రహ్మమే తానునుట.

ఇతడుభిన్న దేహధారియైనను పరమాత్మాభిన్నుడు, అనగా మాధవుడైన మానవుడు జ్ఞానోదయంబైన వెంటనే తననుదామరచినాడు. ఆత్మానుభూతియను గంగాప్రవాహము బ్రహ్మానందసాగరమున గలిసిపోయినది.

ఇదిమహారహస్యము. ఇతడు వాసుదేవస్సర్వమితి, అనుభగవద్వాక్యమునకుగురియైనాడు. వీడే శ్రేష్టభక్తుడు ఆర్త అర్థార్థిజిజ్ఞాసభక్తులకంటె నుత్తముడు ఇతనియనుభూతిలో

స్థావరజంగమములన్నియు మునిగిపోయినవి. ఎందుచూచినను దానర్థై మిన్నుముట్టిన పుణ్యపూర్తి ఇతనికి పశువునుగూడ మాటలాడింప సమర్థతగలిగియున్నది. ఇట్టివారలలో మన సందడి నాగదాసుగారొకరు.

తండ్రి రామయ్య. తల్లి పార్వతమ్మ. అన్న కోటయ్య. తమ్ముడప్పయ్య. కులము కురప. జననము క్రీ॥ 19 శతాబ్దము. కుమారుడు శ్రీరాములు సజీవి గ్రామము దబ్బాకుపల్లెనంది గాం తాలూకా. ఈయన శైశవమున నుయ్యలనున్నప్పుడీగలు, దోమలు, నల్లులు, పైనబ్రాకిన నుపేక్షించి పరధ్యానములో నుండునుగాని యేడ్చియెఱుంగడు తల్లిగాని, యితరులుగాని, వచ్చి ముద్దునకు నవ్వించిన విపరీతముగా నవ్వువాడట. దోగాడునప్పుడుగాని నిద్రించునప్పుడుగాని, మఱియేఇతరా వస్థలయందుగాని చిరునవ్వుతో గూడినముఖముగలవాడై యుండును ఆకలెఱింగిపాలిచ్చిన దాగ్రవునేకాని పోరుబెట్టి యెఱుంగడు, ఐదేండ్లునిండినవి,

సీ॥ ఆకలియనితల్లి నడుగబోడన్నంబు
యెఱిగిపెట్టినచోభు జించుచుండు
ఈడుబాలురగూడి ఆడబోడెన్నండు
వొంటిమైచరియించి యొప్పుజూపు
వస్త్రభూషణములు వాంఛింపడెన్నండు
రామభజనలుసేయ గోముగాంచు
గృహకృత్యములజోలి కేపోవడేవేళ
హరిచరిత్రలవిన నరుగుచుండు.

గీ॥ గ్రూర జంతువులనుగను గొన్న వేళ
వైరమూనకనిజపాణి వలెనెయెంచి
పరమకృపజూపుదనదగు బాల్యమందె
నాగదాసుసామాన్యమా నపుడెతలప॥

ఇట్లుపరప్రీతిమున్న యుండు నెడ దలిదండ్రులుగాంచి యొకనాడు పుత్రునిబుజ్జగించుచు నాయనా! తోడిపిల్ల లెట్లుండిరో? చూడుము నీవును వారికివలె బుట్టలేదా? ఏమిచెప్పినను తలనూచెదవేకాని, ఔ, నవు. కా, దనవు, తుదకన్నమైన నడుగవు, పిల్లలాటలకుబిలిచిన సమ్మతింప వెందులకూ, నేటినుండి పశువుల మేపికొని వచ్చుచుండుము, లేకుండిన ఘంటమతి యేర్పడును, పెండ్లికావలె, భార్యాకాపురమునకు రావలె. సంసారము చేయవలె, ఇట్లుండిన నెట్లుజీవితము సుఖవంతము జేసికొనగలవు.

నిన్నుజూచిన మామనములు తల్లడిల్లుచున్నయవి, నీయన్నను జూడుమెట్లున్నాడో? వానితో బడికిపోయి చదువుకొనుము, భగవద్భజనలు సేయుటకును, భగవచ్చరితల వినుటకును కాలమిదికాదు. అదిముందు రాగలదు అనిచెప్పి బడికంపిన నాతడట్లు కావించి యచిరకాలమున వేదశాస్త్రపారగుడై బడివిడచి ముత్తినరపు వెంకటాద్రివలన, యోగమభ్యసించి తానెఱింగిన సత్యమును పలువురకెఱింగించి కృతార్థుడయ్యె ఇట్లుండి తల్లియాన దలధరించి అచ్చమాంబను వివాహమాడి యిహపరముల సమముగ నడుప జూచెను గాని సంపూర్ణముగ వ్యతిరేకియైన భార్యతో సంసారమును

వేగించుచు వివేకముగోల్పోక భగవత్కథాకాలక్షేపముల, బొద్దులు పుచ్చుచుండె.

ఇప్పటి దాసుగారిసంసారశకటము కడగండ్లతో సాగి పోవుచున్నది. అత్యంతమెలకువతో సంసారనౌకను జీవితప్రవాహమున నడపుగొని పోవుచున్నాడు గురువారాధనా మహోత్సవ మేతెంచినది. వందలకొలదిగా శిష్యులేతెంచినారు. మొదటిరోజుగురుపూజజరిగినది. రెండవనాటిరేయి భజనలతో బొద్దుపుచ్చి రెండవయామమున శిష్యులకు వేదాంతబోధ జేయుచు, దేహముమరచి పోయినారుదాసుగారు. శిష్యలోకము గురువుననుసరించినది, జాముపొద్దెక్కినది. దాసుగారికిగాని చుట్టునుగూర్చునియున్న శిష్యులకుగాని బాహ్యస్పృహ తలజూపవేదు. రాతిబొమ్మలైనారు. కేకలతోనచ్చమాంబ వచ్చి జాముప్రొద్దెక్కినది. పాచియిల్లు బాగుచేసుకొనవలదా? ఏమీ! మాట్లాడరు, మూగమొద్దులవలె బలుకరేమి లెండి లెండి, చాలు, చాలు, మీవేదాంతబోధలు పలుకరేమి? అనుచు నోటబట్టరానిమాటలతో అదలించినది. కాని పలికిన వారులేరు. విసికినది. త్వరత్వరగాలోనికేగి గృహశుద్ధికొఱకు పేడగలిపిననీటితోనిండిన కుండనొకదానిని బట్టుకొనివచ్చి పట పటబండ్లుగొరకుచు శిష్యులమధ్యగూరుచుండిన దాసుగారిని స్నానమున ముంచెత్తినది. కాని శ్రీవారికి దేహస్మృతి రాలేదు. నిర్వీరపోయినది అచ్చమాంబ. శిష్యులుకొందఱు బహిర్ముఖులై గురుపత్నిచేతకు దలలూచుచు మిన్నకుండిరి.

తాను కోపముతో జేయబడిన విపరీతప్రకార్యమునకు బశ్చా త్తాపపడుచు బెనగొనుదుఃఖమున భర్తపాదములంబడి తప్పు క్షమింపుమని విలపింపదొడంగినది. ఆయేడ్పువిని చుట్టుపట్టులం గల స్త్రీపురుషులెల్లరు వచ్చిమూగిరి. గాని అచ్చమాంబ దుఃఖమాగలేదు. శిష్యలోకముతో దాసుగారు బహిర్ముఖు లగుటకు బగలు రెండుజాములయినది. తనపాదములబడి దుఃఖముతో మైమరచిన యచ్చమాంబనూరడించి జరిగిన దానికై వగచిన ప్రయోజనమావంతయు లేదు. గాన నూరడిలి యిటు వినుము.

సీ॥ సకలదృశ్యంబెన్న టికినైననశియించు
నని మదినూహించు కొనగవలయు
బుట్టిచచ్చెడివస్తు వులకెద్ది హేతువో
దానినేమాయగా దలపవలయు
అఖిలమైయద్దాని కంటకనిర్మలం
బగునదియేస్థిరం బనగవలయు
కడకదే మూడవస్తులకు సాక్షి యసుమ్మ
టంచు నీలోపల నెంచవలయు.
గీ॥ అట్టియాత్మనె యీశ్వరుం డనుచునమ్మి
నిండుభక్తిని భజియించు చుండవలయు
కడుభయంబున గాలంబు గడపితుదకు
భవముదరియించి మోక్షంబు బడయుమబల.

(నాగదాసుహరికథ)

అని తత్వబోధగావించి జ్ఞానపథగామినినిగా జేసి ధన్యను గావించినాడు.

నాడు మొద లచ్చమాంబ సుజ్ఞానఘనియై పరిపూర్ణ సమాధిసుఖమనుభవించుచు భర్తకు జేదోడు వాదోడుగా మెలగి లోకవంద్యయైన దాసద్గుణకదంబ, అచ్చమాంబ.

అప్రియత్నముగ వికారి వత్సర చైత్రశుద్ధతదియ సప్తాహముప్రారంభించినారు. చేత చిల్లిగవ్వయేనియు లేదు దాసుగారు ధనవంతుడా, కాదు. గృహములోనున్న నువ్వుల నూనె వినియోగించి సమంత్రకముగ నఖండారాధనగావించి శిష్యులతోడను గ్రామమందునంగల విప్రులతోడను గలసి భజనసేయుచు గూరుచున్నారు దాసుగారు.

బియ్యపుబస్తాలు, నేతిడబ్బాలు, కూరగాయలు బండ్లతో వచ్చినవి. కారణమడుగ గమ్మమెట్లుసాహుకారియాజ్ఞ గొని వచ్చితిమనియు నాతనిపేరు తమకు దెలియబడదనియు బండ్లవారు చెప్పి తెచ్చినసంభారములన్నియు దింపి దాసు గారివలన బాడుగమాత్రము గ్రహించి వెళ్లినారు. విచారింప గ్రామవాసు లాపదార్థములంపించిన వర్తకుడెవ్వండో తెలి యమి భగవద్విలాసమని సంతసించినారు ఏమని ప్రశ్నిం చిన తెలియనివానివలె, దాసుగారు, చిరునగవుద్వారా సమాధానమిడినాడు. ఆత్మశక్తి యెంతకుజాలదు క్రతువు యేడురోజులు భూరిఅన్నదానముతోడ నుపన్యాస భజన హరికథాది కాలక్షేపములుతోడను అవభృథాంతతో క్రతువు పూర్తియైనది. మఱియొక విశేషము! భోజనపదార్థముల

కొట్టుముం దొక నూతనవ్యక్తి రేయుంబవలు నిద్దురమరచి కావలియున్నాడు. ఈతడి దేయూరో? ఎక్కడినుండివచ్చి నాడో, పేరేదియో, ఎవరికిని తెలియదు గాని, ఆయేడు రోజు లీతనికి గుడువబెట్టి గాని, దాసుగారు భోజనముజేయు వాడుగాదు ఆతడాజానుబాహు, స్ఫురద్రూపి, ప్రేక్షకులెల్ల రతనిజూచి ముగ్ధులగువారేగాని, నీ వెవడవు ఎందుండివచ్చి తివి, పేరేమి అనిప్రశ్నించిన వారే లేరు. సప్తాహాంతమందం తర్హితుడైనాడు. ఎక్కడకుబోయినాడో? ఎప్పుడుపోయినాడో ఎవరకిని తెలియదు. భగవల్లీల లతివిచిత్రములుగదా? సప్తాహాంతమందొక సత్రమును నిర్మించుటయేగాక శ్రీలక్ష్మీ నారాయణస్వామివారి ప్రతిష్టనుగూడ జరపించినారు. సంకల్ప సిద్ధుల కెదురుదిరుగు కార్యకలాపము లెందును గనుపింపవు. ధ్వజప్రతిష్టకాలమున జరిగినసంఘటనవలస దాసుగారి మహాత్వము వెల్లడియైనది. ధ్వజప్రతిష్టామహోత్సవమును దిలకించుటకు వేలకొలది చూపరు లేతెంచిరి. వచ్చినవారందఱును ధ్వజమునుగర్తముననిల్పుటకు బ్రయత్నించినవారే, గాని అది లేవలేదు; పలువిధప్రయత్నముల సల్పివిఫలులైనారు. దాసుగారాలోచించి పూజామందిరమున కేగి భగవానుని ప్రార్థించి ప్రార్థించి దేహముమరచినారు. ఇట్లుండ మేదరమెట్ట వెంకయ్యగా రెందుండియో? పరుగునవచ్చి, చూపరుల సహాయముతో సులభముగ ధ్వజమును లేపి గర్తమునందుంచి బిగింపించినాడు. ఇంతలో దాసుగారు బహిర్ముఖులై ధ్వజము కడ

కరిగి విషయమెఱింగి పిలిపించి ప్రశ్నింప, వెంకయ్యగా రాశ్చ ర్యముతో నిట్లనిరి.

అయ్యా! గతరాత్రి యందంతయు పనివారి వెంటనుండి ధ్వజముపని పూర్తిచేయించు కార్యమున వర్తించుట నిద్దుర లేని పాడనగుట బడలికచే నింటికేగి నిదురించుచు దాము గబురం పిన వచ్చినాడ. ఈధ్వజము లేచినసంగతియే నే నెఱుంగను అని చెప్పినాడు. అదివిని ఇదియంతయు భగవల్లీలయని తలంచి, యాత్రికులతో దాసుగారు సంతసించినాడు.

ఒకప్పుడు స్వామివారికి తెప్పతిరుణాళ్ళ జరుగుచున్నది. తెప్పపైనగూరుచుండి భజనయందు బాల్గొనువారిలో నిద్దరు వ్యక్తులు నీటబడి మునకలు వేయుచుండిరి సమీపమున నీతగాడు లేమి వారి నెవ్వరును బయటికిదీయ సాహసించిన వారు లేకపోవుకారణముగా మునిగిపోయినారు తేలలేదు. చచ్చినారనితలంచి యాత్రికులెల్ల హాహాకారములు గావించిరి. ఇంతలో నీతగాండ్లే తెంచి నీటదూకి శవముల వెదుక ప్రారంభించిరి ఉత్సవమాగినది దాసుగారు దెప్పనుండియే భగవత్ప్రార్థనలో మునిగినారు. కొంతవడికి దాసుగారిముందు నీటబడినమృత దేహములు తెప్పపై గనుపడినవి అవి సజీవము లని యాత్రికులు సంతోషపారావారమున దేలియాడిరి. మాపకుల సంతోషపెట్టుటకో? యనునట్లు ఆ దేహములను దాసుగారు చేతితో స్పృశించిరి నిదురబోయి లేచినవారివలె లేచికూరుచుండిరి. ప్రశ్నించిన నీటమునింగి తల్లటపడు మమ్మె

వరో తెచ్చి తెప్పజేర్చినారు. వారిట్టి వారని చెప్పలేము. తెప్పజేర్చిన వెంటనే మైమరచితిమి. అని ఈశుభవార్త దెలిసి నీట నుండిన యాత్రికులు తాము వెదకు ప్రయత్నములుమాని తెప్పజేరి అద్భుతదృశ్యమున కానందించినారు దీక్షితో నాత్మ శక్తిపూర్ణులని దాసుగారు పొగడొందినారు.

వీరుపలుకు మాటలన్నియు బద్యములుగనో, గేయములుగనో, శ్లోకములుగనో, వెలువడుచుండెడివి దాసుగారు నిరంతర ధ్యానానందపారావారనిమగ్నులై యుండుటయేగాక సుజనసందేహనివృత్తికరంబులును దుర్జన దురుక్తిభంజనములును అగుగ్రంథముల బెక్కుకిటిరచించిరి. అందు గొన్నింటి మాత్రి మిందు బొందుపరచెద.

1. భగవద్గుణకీర్తనలు
2. లక్ష్మీనారాయణశతకము
3. శ్రీపతిశతకము
4. భజగోవిందకందార్థములు
5. భగవద్గీతాకందార్థములు
6. సకలతత్వార్థదర్పణము
7. జీవన్ముక్తివిచారము
8. అచలబోధసీసార్థము
9. సర్వమతసమత్వసిద్ధాంతము
10. రామనామప్రభావము
11. పంచాక్షరీమహాత్మ్యము
12. బ్రహ్మవిద్యైక్యసారము
13. మోక్షమార్గదర్శనము
14. దుర్మతఖండనము
15. వర్ణాశ్రమతత్వబోధని
16. మతవివాదపరిష్కారము
17. తారకనామకీర్తనలు
18. పూర్ణబోధగీతార్థము
19. పుత్రీమణత్యాగోపాఖ్యానము
20. భక్తదూషణనిరసనము
21. అచలాంతార్థప్రకాశము
22. స్వరోదయము
23. నామదేవుచరిత్ర
24. సత్యనారాయణవ్రతమహాత్మ్యం
25. నిఖిలరోగనివారణోపాయము
26. పారిరబ్దదీపిక
27. రోహిదాసు,కబీరుదాసుసంవాదం
28. నారాయణనామప్రభావము

29. భద్రాచలమహాత్మ్యము
30. ద్రౌపదీవస్త్రాపహారణము
31. రంతీదేవుచరిత్రా
32. భక్తిసారసంగ్రహము(కీర్తనలు)
33. లక్ష్మీనారాయణకీర్తనలు
34. విశ్వజననిశతకము
35. విగ్రహార్చనసిద్ధాంతము
36. కర్మస్వరూపసిద్ధాంతము

మొదలగునవి.

వీరు ప్రత్యక్షసచ్చిదానందమూర్తులు, దేహధారులయినను పరమాత్మాభిన్నులు వీరికి ప్రారబ్ధజన్యమయిన శరీరాభిమానము పూర్ణముగా నశించినను తత్ప్రారబ్ధము, లోకహితమున కుపయోగించుచుండిరి ఇప్పు డీతని చర్యము లన్నియు భగవల్లీలలు రోగనివారణోపాయమును గ్రంథరూపముగ దెల్పిన శ్రీవారికి కాసరోగము జనించినది. వ్యాధి ప్రబలినకారణముగ బాధ నభినయించినారు.

ఈస్థితిలో ధనుర్మాసోత్సవములు ప్రారంభింపబడినవి నాడు మొద లారుమాసములు వ్యాధితలజూపలేదు. మఱి యొకతరి దోటకూర బాపయ్య, ముకుందరామదాసుగార్లతో రాజమండ్రినుండుతరి నొకరోజు బగలంతయు వ్యాధిబాధితులై లేవలేనిస్థితిలో నుండుట, శిష్యు లుపచారములు, సేయుచుండిరి పొద్దుగ్రుంకినది క్రమముగ నిశీధిసమయమున కుపచారకులు కనుగూర్కినారు కొంతవడికి దడిగుడ్డలతో నొకబ్రాహ్మణుని వెంటబెట్టుకొనివచ్చి ముకుందదాసును లేపి వీరు గోదావరీస్నానమునకు సంకల్పము జెప్పిన విప్రులు పుణ్యా

మూర్తులు వీరికొకరూప్యము దక్షిణగా నిమ్మని చెప్పియిప్పించి పంపినారు రోగిష్టులైయుండి నడిరేయి గోదావరీస్నానమేమిటి ఈ తడిబట్ట లేమిటి యని ప్రశ్నించిన దేహము చికాకుగా నుండిన స్నానము జేయుట తప్పగునా? నోరు మూయుమని యదలించి పంపినారు.

ఇట్లెన్నియో లీలల ప్రకటించి క్రీ॥ 20వ శతాబ్దము నందలి పరాభవసంవత్సర ఆషాఢబహుళామావాస్యనాడుదయ మందు బద్మాసనాశీనుడై శరీరము జాలించినాడు.

వీరు 1921 దబ్బాకుపల్లె వెళ్ళినప్పుడు [illegible]దాసుగారు ప్రతిష్ఠించిన లక్ష్మీనారాయణమూర్తిని మఠమున వ్రేలబడిన దాసుగారి చిత్రప్రతిమను చూచి ధన్యుడైనాడు.

గీ॥ నీవు నాలోన జేరుట నిఖిలదృశ్య
మంతయు న్నేనయన్యమావంత లేదు
లేదు ముమ్మాటి కన్యంబులేదు దబ్బ
పత్రపురివాస నవ్యశోభన విలాస ॥

రా మ యో గి

స్వపరిపాలనా సంపదపైనను భౌతిక విధానము పైనను, భారత దేశవైభవ మాధారపడక తపోధనులగు మహర్షి పుంగవుల జ్ఞానవిజ్ఞాన రూపములైన ఆధ్యాత్మిక ప్రతిభ వలన సర్వాంగ సుందరమైయున్నయది.

యువకుల ప్రవర్తనలు పాశ్చాత్యనాగరికత కలవాటు పడి యార్యవిజ్ఞానభాస్కరుని మలినమొనర్ప నెంచినను ప్రభాకరుని తేజమునకు కళంక మాపాదించునా? కాలగర్భమున దాగిన మహాశక్తియొక్క నవ్యకాంతులు రోజులు మంచివయినప్పుడు ప్రభావంతములు కాకపోవు. హిందూ మహాసముద్రమునుండి వెలువడిన జ్ఞానరత్నములు జీవన్ముక్త కాంతులు వెల్లివిరిసి సుజ్ఞానోద్ధరణ కారణములగుచున్నవి. అట్టి మహామణులలో రామయోగి మణియొకరు.

తండ్రి చేవూరి పిచ్చిరెడ్డి. తల్లి రామమ్మ. జననస్థలము నెల్లూరునకు బదిమైళ్లలోనున్న నరసింహులుగిరి దాపునగల మోపూరు. జననకాలము (1895) మన్మథవత్సర శ్రావణ శుద్ధాష్టమీ యిందువారము. పంట రెడ్డివంశము. శ్రీవారి పుటుకకు బూర్వపురోజు వీరినాయనమ్మగారి కలలో నొక దివ్యపురుషుడు ప్రత్యక్షమై, "రేపటియుదయము మీావంశాలంకారుడగు దివ్యపురుషు డుద్భవించి లోకమాన్యుడగు" నని తెలిపి యంతర్హితుడైనాడు. ఆయన సెలవిచ్చిన కాలముననే మన యోగిగారి పుటుకజరిగినది. పిల్లవానికి రెండవనెల వచ్చియు రాకపూర్వమే తండ్రియు, నాయనమ్మయు బరప

దించినారు. భోగభాగ్యముల కాలవాలమైన కుటుంబమైనను తగుసమర్థతతో నడుపజాలమి భూములన్నింటిని మక్తాలకిడి పిల్లవాని జేతగాని రామమ్మ అన్నగారిల్లు జేరినవి. ఆకారణముగ మన యోగిగారన్నారెడ్డిపాలెంలో సతిగారాబముతో బెఱుగు చున్నాడు. బ్రహ్మానందస్వామి నెల్లూరునం దాధ్యాత్మిక ప్రచారము జేయుచుండిరి. యోగిగారిని చదువులబడికంపి నారు. గాని ప్రాకృతవిద్య పట్టుబడలేదు. అందు వ్రాయుట చదువుట మాత్రము నేర్వగలిగినాడు మైనను వెళ్లినది. అంత దార్ఢ్యము, ధర్మవిచక్షణ, సత్యదృష్టి, యుక్తాయుక్తవిచారణ క్రమముగా బెరుగ జొచ్చినవి. వివాహము నిరాకరించుట జననీపుత్రులకు సమస్య నేర్పడినది.

ఒకనాడీ వివాహవిషయమై చర్చించుకొను సందర్భము ననుసరించి వెలువడిన వాక్యామసరణి దనకు గల పిత్రార్జిత మంతయు తల్లిపేర దఖలు వ్రాసి నెల్లూరుజిల్లా రిజస్ట్రారువారి ఆఫీసులో రిజష్టరుచేయించి సదరుపత్రమును పోస్టుద్వారా జనని కంపి యంతర్హితుడైనాడు. తనకు జేరిన దఖలు పత్రి మును చూచి దుస్సాధ్యములైన కాంతాకనకముల దృణప్రా యముగ వదలిన పుత్రుని వైరాగ్యమునకు సంతసించి అత్త గారు చెప్పినట్లు మహాపురుషుడని నమ్మినది. గాని పుత్ర వియోగ బాధ మిక్కుటమై పలుచోట్ల వెదుకించినది గాని పుత్రుడు కనుపింప లేదు. మేము చూచితిమని చెప్పువారునుగూడ లేరు నిరాశవహించినది. కొడుకు దేనిలోనో పడిచచ్చి పోయి నాడని తలంచి దుఃఖించి దుఃఖించి సంపూర్ణవిరాగిణియై తనకు

లభించిన యాస్తినంతయు దానధర్మములక్రింద వినియోగించి యెట్లో జీవితము సాగించుచున్నది రామమ్మ.

ఐదేండ్లుదాటిన నొకనాడు కర్ణాకర్ణిగా నెల్లూరునందు గొత్తగారాబడిన బ్రహ్మానందస్వామివారి సేవలో కొడుకుండుట విని సంతసించి, ప్రయత్నపూర్వకముగా బయనించి నెల్లూరున కేగి వానిగాంచి పుత్రవాత్సల్యము బ్రకటింప సమీపించిన, "ఏమ నీవాడు కాదు. నీకొడుకు చచ్చినా"డని చెప్పుచు బయ వెత్తిపోయినాడు అందామె యెన్నిరోజులున్నను తిరిగి కనుపింపలేదు నిరాశజేసికొని శ్రీస్వామివారి నాశ్రయించి తారకమంత్రోపదేశమునంది యిల్లుజేరి మంత్రజపసిద్ధిగడించి ఇహదృక్కు విసర్జించి, పరదృక్కార్జించి ధన్యురాలైనది.

అట్లు బర్వెత్తిపోయిన రామయోగి నిజమైనయోగియై చీమకుర్తి పర్వతగుహ జేరి. యన్నపానముల మరచి తపోసిద్ధిగాంచి నిర్వికల్పమార్జించియుండ, గొన్ని సంవత్సరము లేగినపిదప వైవాద్వాబాహ్యస్మృతిగలిగి తలవనితలంపుగా తీర్థయాత్రల జేయవలయు ననుసంకల్పమంకురించినది. వెంటనే బయలు దేరి గురుమూర్తి యనుజ్ఞవడయుటకై నెల్లూరున కేగినాడు. గాని స్వామివారు బాపట్లయందుండినట్లెఱింగి పాదచారియై భావపురిజేరి గురుమూర్తినిదర్శించి తనయభిమత మెఱింగించిన జిరునగవుతో స్వామివా రిట్లనిరి.

పుత్రా ! నీసంకల్ప మతిపవిత్రమైనదియే, మేముకాదనము, గాని నీవుగాని పుణ్యక్షేత్రములు, నీవుగాని పుణ్యతీర్థములు, నీవుగాని పుణ్యనదీనదములు ప్రత్యేకించి యుండినగదా

దూబగుంట్ల శ్రీరాములు

నిజమైన మానవు డలవరచుకొనదగిన గుణములు మూడు. అవి 1. ప్రేమ, 2. కపటరాహిత్యము, 3. సహనము. ఇందు యదార్థజీవనము ప్రేమయే. ప్రేమమయమైన జీవితము రామతుల్యము. సత్కార్యాచరణయు, పరహితాదరణయు క్రమముగ నిహపరసాధకములు. ఇవి లేనివాడు బ్రతికియు జచ్చినవాడే. ప్రేమస్వరూపమహాభాగ్యము లేకపోవుటచే మానవులలో నూటికి తొంబదితొమ్మిదిమంది యును జీవచ్ఛవములని చెప్పక దప్పదు. వీరిని పిశాచములని గూడ చెప్పవచ్చు. పిశాచములని పిలచినను తప్పుగాదు. ఈరహస్యమెఱింగినధీరులే భక్తకోటికి జెందినవారు. నిజమైన భక్తుడు దీనులను, పేదలను, అజ్ఞానులను చూచి పరితపించుచుండును. ఇంతియగాదు. హృదయము స్తంభించిపోవువఱకు దల దిమ్ముపట్టునంతవఱకు సంతపించి, పరితపించి దేహము మరచును. మానవున కుండదగినది ప్రేమ యొక్కటియే. ధనకనకవస్తువాహనాసామగ్రి కాదు. పాండిత్యప్రకర్ష కాదు. దుర్భేద్యములగు కష్టముల విదళించి రాజమార్గమేర్పరచునది ప్రేమయొక్కటియే. అదియు సానుభూతితో మిళితమైయుండనగు. ఇట్టి ప్రేమకు సమస్తవిశ్వము స్వీయనిలయము. విజయసింహాసన మధిష్ఠించిన దిదియే. దైవమును నెక్కడనో వెదుక పనిలేదు. సోదరమానవులను, పేదలను, దుర్బలులను దైవస్వరూపులనుగా ప్రేమించిన భగవత్సాక్షాత్కారప్రాప్తి. ఇట్లు విశ్వమంతయు బరమేశ్వరునిగా ప్రేమించి తరించిన వారలలో మన దూబగుంట్ల శ్రీరాములుగా రొకరు. తండ్రి లక్ష్మయ్య. తల్లి

మహాలక్ష్మమ్మ. కుమారుడు లక్ష్మయ్య. కుమార్తెలు సుబ్బమ్మ, నాగమ్మ, లక్ష్మమ్మలు. వాసస్థలము సత్తెనపల్లి, గుంటూరుమండలము.

ఈతడు తన దశవర్షప్రాయమున బడికేగునెపమును పురస్కరించుకొని యిల్లువిడచి శ్రీరామాలయమునకు వెనుకవైపునగల రహస్యప్రదేశమునజేరి కూరుచుండి నిర్వేదాయత్త చిత్తుడై, ఈశరీరమున "నేను" అను పదార్థమెద్ది? దానినెట్లు జూడనగు? ఈ రహస్యము నెఱింగించు వారెవరు? వారెందుం డురు? అని విచారించుచు, పై ప్రశ్నములకు సమాధానము దొఱుకమి విచారసాగరమున మునింగి దుఃఖించి, దుఃఖించి మైమరచియున్నతరి శ్రీపీరోజిబా బొకజొన్నగింజతో జను దెంచి, పాదును సృష్టించి. అందా బీజమూడ్చి నీరిడిన వెంటనే అది చెట్టై యొకకంకిని విడచినది. అది కొంతవడికి పక్వస్థితికి వచ్చి బంగరువన్నెలుగల గింజల నెళ్ళగ్రిక్కినది. ఆగింజలు వందలకు మించినవి. ఆగింజల చూపుచు పిరోజీబాబు. శ్రీరామా! ఈ కనుపడుగింజలన్నియు మొదట నేగొనివచ్చిన గింజనుండి వెలువబడినవియే కదా! పాతిపెట్టబడినగింజేమయినది చెప్పు?

శ్రీరాములు:– నశించినది.

పీరోజిబాబు:–ఆగింజనశించిన నిన్నిగింజ లెచ్చటనుండి వచ్చినవి

శ్రీరాములు:– గింజనశించినది కాని అందలి జీవశక్తియే చెట్టై యీగింజల నీయగలిగినది యని తలంచెద.

పీరోజిబాబు:– ఇది జ్ఞాపకమున నుంచుకొనుము. కాని ఈ గింజ యందుగల బీజశక్తిని గురుతించుము, అనిచెప్పుచు నొక గింజ యాతని చేతబెట్టినాడు.

అంత శ్రీరాము లాగింజ నొకకత్తితో ముక్కలుచేసి చూచినాడు. కాని జీవశక్తి కనుపింపలేదు. నివ్వెరపడినాడు.

పీరోజిగారు:- జీవశక్తి కనుపింపలేదా! అది సూక్ష్మమయినదని తలంచెదవు, ఉండినగనుపింపదా?

శ్రీరాములు:- ఉన్నది. లేకపోయిన ఆ వృక్షమెట్లు రాగలదు! వాయువువలె గనుపడనిదై క్రియారూపమును ధరించినది.

పీరోజిగారు:- ఇటులనే, ఒక్కండైన పరమాత్మనుండి నానా రూపములతో జీవకోటి యుద్భవించుచున్నది. అగుపడు గింజయొక్క రూపనామములనే ప్రకృతి యని యందురు. ఈప్రకృతి యందుగల జీవశక్తి మార్పుజెంది బహునామరూపము లలో గలుపడినది. 'నేను' అనుపదార్థ మదియే! ఈపదార్థ మునకు రూపనామములు లేవు. ఇది అఖండశక్తిసంపన్న మైనది గూడ! అది నీశరీరమం దణుస్వరూపమున నున్నది. అగ్నియందుండి లేవబడిన రవ్వలెట్లు అగ్నికి వేరు కావో అట్లే అణుస్వరూపములగు జీవశక్తులును పరమాత్మాభిన్న ములు. రవ్వను పట్టుకొని నిప్పునట్లు తయారు చేయవచ్చునో అట్లే అణురూపియగు జీవుడు అఖండశక్తిమంతుడగు పర మాత్మగా తయారగుచున్నాడు. దీనికి సాధకుని సాధనా బలమే కారణము. "యద్భావం తద్భవతి" అను ఆర్యోక్తి జ్ఞప్తియం దుంచుకొనుము. దీనివలన నేకత్వమునుండి నానాత్వమేర్పడినదని తెలిసికొంటిమి. దీనికి "యో మాం పశ్యతి సర్వత్ర సర్వం చ మయి పశ్యతి॥ తస్యాహం న ప్రణ శ్యామి స చ మే న ప్రణశ్యతి యను భగవద్వాక్యము సాక్ష్య మిచ్చుచున్నది. ఎవడు నానాత్వముగ నున్న ప్రపంచమును

పరమాత్మగ ప్రేమింపగలడో వాడే పరమాత్మయగుచున్నాడు. అని చెప్పి పీరోజీబా నదృశ్యుడైనాడు. వెంటనే ఒకకుక్కతో నద్దాలమేడ ప్రత్యక్షమైనది. ఆ అద్దాలలో గొన్ని తెల్లనివియు, గొన్ని ఎఱ్ఱనివియు, మఱికొన్ని నల్లనివియు, నింకను కొన్ని పలువిధములైన రంగులుగలవియు, మేడలోనున్న కుక్క అద్దములలో బ్రత్యక్షమైన నానారకముల కుక్కల జూచినది. మోమెత్తి నోరుదెరచి అరువ మొదలుబెట్టినది. అద్దములలోని కుక్కలన్నియు నఱువసాగినవి. అసలుకుక్కకు గోప మతిశయించి తన్నుట గరచుట మూలముగా నద్దములు ముక్కచెక్కలైనవి. ప్రతిముక్కయందును ప్రతిచక్కయందును దనప్రతిబింబములే గనుపించుట గోపమతిశయింప దన్నుకొని చచ్చినది. అద్దాలమేడ యంతరించినది. శ్రీరాములు నిర్ఘాతపడి స్మృతిదప్పి కొంతవడికి దెప్పరిలి మేల్కొనినాడు. తా ననుభవించినది కలగా నెఱింగినాడు. ఈ స్వప్నమును గాంచినవాడెవడు అని విచారించినాడు. స్వప్నమునకు విలక్షణముగనుండి తానే చూచితిననియు, దాగన్నకల మనోలీలయనియు, మనస్సు నాదిగాని నేను గాదనియు నేను జిత్స్వరూపిననియు గ్రహించి, మనస్సునుండి వేఱుపడి శాంతమూర్తియైనాడు. శ్రీరామమూర్తి ఇట్లు తెలిసి, తెలిసిన తెలివిని మఱువక మననించి, మననించి యున్మన్యవస్థ నార్జించి యచలపరిపూర్ణానంద మనుభవించినాడు. పంచ విధములైనసిద్ధులలో నిది స్వప్నసిద్ధి అని పాఠకులెఱింగె దరుగాక.

(55)

నేటినుండి శ్రీరాములుగారు విశ్వమునందుండి యుండనివాడును, విని విననివాడును, కని కననివాడును, చూచి చూడనివాడును, అయియుండుట దల్లిదండ్రు లీతని కున్మాదవ్యాధి పొడసూపినదని వెఱగంది సర్వశక్తిసంపన్నుడైన వీరోజీ బాబున కెఱింగించిన, నాతం డరిగి పిల్లవాని వెంటగొని నిజనివాసమున కేగి పరీక్షించి నిజమెఱింగినవాడగుట, నతని సహజ సమాధియని గురితించి, తనశిష్యకోటియందు ప్రథమునిగా గ్రహించి, నిస్వార్థప్రేమ నుద్బోధించి, కృతార్థుని గావించినాడు.

నాటినుండి యుపరప్రస్థితుడై విశ్వమందు గన్న విన్న యర్థములందు వస్తుదృష్టి విసర్జించి, పరబ్రహ్మదృష్టి బాదుకొల్పి యానందించుచుండువాడై, చిత్తశాంతి గలిగి ఏ యొడుదుడుకులు లేనివాడై నిర్వ్యాపారికాంక్ష నిష్కామకర్మాచరణాదత్తుడై కామవృత్తి నడంచి ప్రేమవృత్తిని విస్తరింప జేసి, నిస్సంసారియై సంసారమున మెలంగుచుండె.

సంసారమున నెట్టి విషమస్థితి బొడసూపినను, సమచిత్తతనుగాని ధైర్యస్థైర్యములనుగాని కోల్పోవువాడు గాడు. జీవనము, ప్రపంచ మస్థిరము, వేయేల! సర్వము భగవంతుడే. తనయం దెన్నిశక్తిసామర్థ్యములు, ఎంతటిప్రభావము, ఎన్ని మహిమలు, అడగియున్నవియో తెలిసినవాడగుట మస్సలుడ ననిగాని, అల్పుడననిగాని కలలోనైనను దలంచువాడు కాడు.

“అహం బ్రహ్మాస్మి”అను మహావాక్యసారము శ్రీవారి శరీరమందలి ప్రతిరక్తబిందువందును స్పందించుచున్నది. సప్త

ధాతువుల లోపలను, వెలుపలను పంచకోశములందంతటను నిండి నిబిడీకృతమైనది. దీనివలన గ్రియాశక్తిపూర్ణుడై యుం డుట నంశయు దానై విరాజిల్లిన పుణ్యమూర్తి మన శ్రీరామ మూర్తి వీరికి లక్ష్మణార్యులను కుమారుడును, సుబ్బమ్మ, నాగమ్మ, లక్ష్మమ్మలను కుమార్తెలుగలరని చెప్పితిమి గదా! ఈ లక్ష్మణార్యులు పాటిబండ్ల వీరయ్యగారి శిష్యకోటికిజెందిన వారు. ఇతడు నిగూఢవర్తనుడు. నిరాడంబరజీవి. తన జ్ఞానసిద్ధిని జాగరూకతతో శ్రద్ధగలిగి దూరదృష్టిగలవాడై వివేకము వెన్నంట నిరాడంబరముగా రక్షించుకొనుచుండు పుణ్య మూర్తి యితడు. తనయాధ్యాత్మికానుభవములను మోక్ష సాధని మొదలగు పత్రికలయందప్పుడప్పుడు, ప్రకటించు చుండుట మాపాఠకుల కెల్లరెటింగిన విషయమే, విస్తరించి వ్రాయపనిలేదు. శ్రీరాములుగారు 19వ శతాబ్దమందలి నల సంవత్సర వైశాఖ బహుళపంచమి పుణ్యదినమున జీవయాత్ర ముగించి జీవబ్రహ్మైక్యమును పొందిరి.

గీ అపర శ్రీరామమూర్తి నా నలరు పితృ
దేవతా భక్తి యేకపత్నీవ్రతంబు
సూనృతాచారసంపత్తి శుద్ధ బుద్ధి
నలరు శ్రీ దూబగుంట్లవంశాబ్ధిసోము
ప్రేమభావాభిరాము శ్రీ రాము నెన్ని
రామచంద్రుసి గాంతు దుర్భవ మడంతు.

శ్రీగురుమహారాజు వేజండ్ల అప్పదాసు

శ్లో. శ్రవణం కీర్తనం ధ్యానమ్ శ్రీవిష్ణోః పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యమ్ సఖ్యమాత్మనివేదనమ్.

లీలామానుష విగ్రహుడైన భగవంతుని కథను వినుచు తదీయకీర్తనల రాగతాళమిళితముగను భావయుక్తముగను పాడుచు, భగవన్నామముల మంత్రమూలకములుగ జపించుచు, భగవత్పాదారవిందముల మానసికముగ సేవించుచు, తదీయార్చామూర్తుల పుష్పాదులబూజించుచు, సాష్టాంగము లర్పించుచు, వందనము సమర్పించిన నెను నెంట ప్రార్థనలుచస్పి సన్నిధి పీడలేనివాడై, యన్యచింత లేక నేకలక్ష్యముతో ధ్యానించుచు ప్రేమపూర్ణుడై సర్వస్వము భగవదర్పణగావించి నిస్సంకల్పుడై తన్మయసుఖ మనుభవించుచు, నెవడు నిత్యజీవితము గాగించునో వాడు నిజమైనభక్తుడు. వీడు సముద్రమునందలి తరంగములవలె నిష్టదైవమునందు బ్రపంచమును జూచును. వీనికి భగవంతు డాత్మస్వరూపి. భూతభవిష్యత్తు లుల్లంఘించినవాడగుట త్రికాలవేది. అధ్యాత్మవిద్యానముద్రుడు. అనన్యభక్తినిమగ్నుడు. భగవద్విస్మృతి లేనివాడుగూడా. ముక్తిభక్తికి దాసి అనునార్యోక్తి వీనియందు సార్థకత వహించినది. ఇట్టి మహాభక్తులలో వేజెండ్ల అప్పదాసుగా రొకరు.

తల్లి సెత్తెమాంబ. తండ్రి రామకృష్ణయ్య. సోదరుడు సూర్యనారాయణ. కుమారులు 1. సంజీవరావు, 2. రామకృష్ణశర్మలు. గోత్రము శ్రీవత్సస. రామతారకము తొంబది

యారుకోట్లుచేసిన జపనిష్ఠాగరిష్ఠులు. గురువు పొట్లపాటి రామ యోగి. జననము క్రీ 19వ శతాబ్దాంతము. గంగాదీక్షితులవారి యధ్వర్యమున తులసీకళ్యాణముతో ప్రారంభించి దుర్ముఖి మాఘమునను, వికారిజ్యేష్ఠమందును, శార్వరిజ్యేష్ఠమందును క్రమముగ మూడుసప్తాహములును. క్రోధి మాఘమం దేక వింశత్యాహ్నికదీక్షతో శ్రీరామయజ్ఞమును, శ్రీమదద్దంకి వెంకటార్యభాగవతారుగారివలన ప్రదర్శింపబడిన మహా రాసక్రీడయు, పరాభవమాఘమందు మండలదీక్షతో శ్రీరామ సామ్రాజ్యపట్టాభిషేకమహోత్సవమును, కీలకవత్సరమాఘ మునసంగమేశ్వరుసన్నిధి అష్టోత్తరశతసంఖ్యాదంపతీజనపూజతో సార్ధమాసద్వయదీర్ఘసత్రయాగమును భక్తియుక్తముగ జరిపి ముగించినారు. పై దెలుపబడిన మహాకైంకర్యములం దన్నదాన మవారిగా సాగబడినది. అతిథులకుటుంబాల కాల వాలములైనవి వంటపందిరులన్నియు. ఆకాలమున సప్తాహాది కైంకర్యములొనర్చిన వారిలో వీరే మొదటివారు. ప్రతికైం కర్యమందును దినమునకు నలుబది బస్తాలబియ్య ముడుకుచున్న నన నతిశయోక్తికాదు. ప్రేక్షకజనవసతు లత్యానుకూలములై యున్నవి. శ్రీవారు యాజ్ఞవల్క్యజయంత్యుత్సవ సమాజ మున కధ్యక్షులుగూడ. వీరి కుమారు లిప్పుడు తెనాలి నాజరు పేటయం దున్నారు. వీరెనుబదవయేట శరీరము జాలించిరి. వీరి జీవితమందొక విశేషముగలదు. యాదవకులోద్భూతుడై యోగసిద్ధిని గడించిన పుణ్యమూర్తి గురువగుటయే. ఈతని యుపాసనమూర్తి బాలాత్రిపురసుందరి.

వాసస్థలమెయ్యదియో తెలియబడదు. ఈతఁ డొకప్పుడు పోట్లపాడునకు సమీపమునగల నొకవృక్షచ్ఛాయ సమాధి నిష్ఠనున్నాఁడు. బాలక్రీడాభిలాషియై నాయూరిపిల్లవాఁడొక డా చెట్టునెక్కి ఆడుచు బాడుచు బ్రమాదవశమున మూత్ర విసర్జనము జేసినాఁడట. అవి సమాధినిష్ఠుఁడైన యోగిగారి శిరమున బడినవట; గాని యోగి బహిర్ముఖుఁడు కాలేదు. ఆపిల్ల వానికి వెంటనే కాళ్లుపట్టుకొని పోయినవి. వాఁడు నతిప్రయాసముతో జెట్టుదిగి బహిర్ముఖుఁ డగువఱకు యోగిని కాచియుండి తన తప్పు నెఱింగించి క్షమింపగోరిన యోగివరుఁడు "జరిగిన, దానికి వగవపని లేదు. నీ ప్రారబ్ధమిట్లున్నది. నే జేయదగిన దేమియును లేదు. జీవితాంతమువఱకు గాళ్లుండియు లేనివాఁడ వయ్యెదవు. నీశరీరముమాత్ర మత్యంతబలిష్ఠమై యారోగ్య పూరితమై యుండుగాక! బాలయోగివై యిహపరము లార్జింప గలవు"అని వరం బొసంగెనట. నాఁడు మొదలా బాలుఁడష్టసిద్ధులు గలవాఁడై జీవితాంతమువఱ కొకగూఁటెద్దుబండిమీఁద దిరుగుచు నాశ్రితుల కాధ్యాత్మికబోధలందించి కృతార్థుల గావించుచుండువాఁడు. ఈ రామయోగి నెఱసిన వెండ్రుకలతో నలంకరింపబడిన తలయు గడ్డమును కలవాఁడై భ్రూభాగమున గల కుంకుమబొట్టుతో దేహపుష్టితో దండధారియై చూపరుల కానందదాయకుఁడై యుండువాఁడు. ఈతఁ డెక్కువకాలము కొండ గుహలనుండువాఁడు గూడ. చూచువారలకు భోగిగా గనుపించును కాని సంపూర్ణవిరాగి. శరీరసౌష్ఠవమునకును గారణము యోగశక్తియే యని చెప్పకతప్పదు. యోగిగారిదర్శన

మబ్బుటయే కష్టము. అబ్బినవానికి పునరావృత్తిరహితస్థితికర తలామలకమే.

యోగిగారి ప్రభావములను విని మన అప్పదాసుగారు బహుప్రయాసలకోర్చి దీర్ఘప్రయత్నముతో దర్శనభాగ్యమంది జన్మబంధమడంగ నరంబర్థించిన నక్షేకానిమ్మని సమ్మతిజూపి యిట్లనియె. నేగొల్లడ. నీవు బ్రాహ్మణుడవు నాగురుత్వము నీకు దగనిది. విప్రునకు దప్ప యన్యజాతి కుపదేశార్హత లేద నుట నీవెఱుంగవే? జాతిధర్మము వీడరాదు గాన ఔమ్ము. బ్రాహ్మణగురువు నాశ్రయింపుము. అనుట దాసుగారు జిరు నగవుతో అయ్యా? నా కుపనయనమునాడు బ్రహ్మోపదే శము గావించిన మహాత్ముడు నా తండ్రి ప్రధానగురువు, ముముక్షున కుపగురువు లెందఱైన నుండవచ్చునని శాస్త్రము జెప్పుచున్నదగుట సంశయించుటకు దావులేదు. ఇట్లగుట నాకోరిక దీర్పక దప్పదు, అన్యజాతి వాని నుపగురువుగా గ్రహించిన జాతిధర్మము కొఱవడదు. అని సము[illegible]డై నిలచిన దిలకించి నాయనా! అప్పదాసా! ధర్మమన జాతివిహితకర్మల నాచరించుటయే; వర్ణాశ్రితధర్మము దక్కువగా నాచరించినను, అది సంపూర్ణశ్రేయోదాయక మగుచున్నది. ఇతరవర్గములవారికిని యితరాశ్రమములవారికిని విధింపబడిన కర్మములను తామెంత బాగుగానాచరించినను అవి యనర్థములనే సమకూర్చుచున్నవి. జన్మకు గర్మయే కారణమనుట వినియుందుము గదా! ఉత్తర దేహమునకు కారణమైన కర్మను ప్రారబ్ధమనియెదరు. దీనినే స్వభావమనిగూడ నందురు. ఇదియే జాతివర్ణములకు హేతువు

ప్రారబ్ధమున కనునగు ఆయాజాతియందే స్వర్గమందే ఆ యా జీవులు పుట్టగలరు కావున బ్రాహ్మణాదు తమ తమ జాతివర్ణముల కనురూపములగు కర్మల నాచరించుటచే క్రమముగా పాపము తగ్గి పుణ్యావృద్ధియగుచున్నది. ఇదియే శ్రేయఃప్రాప్తికిమూలము. స్వభావము ల్లంఘించిన నాపద తప్పదు. అందుచే క్రమముగ జీవు డధోలోకముల పాలగు చున్నాడు. గావున నెవరుగాని జాతిధర్మ ముల్లంఘింపరాదు. గాని, నీవు చెప్పినటు లుపగురు సంగ్రహవిషయములో ప్రమాదములేదు. అనిన దాసుగారిట్లు సెరి అయ్యా సామాన్యమానవులకు వర్ణాశ్రమభేదములు పాటింపనగును గాని, బ్రహ్మనిష్ఠులకు గాదు. సమాధికాలములో నన్యులు తనపై మూత్రవిసర్జన జేసినను, మఱి యేబాధల ముంచినను, బహిర్ముఖులు కానివారును తెలిసినపిదపనైన నహంకారమూనని వారును, బ్రహ్మనిష్ఠు లనబడుదురు. ఇట్టి బ్రహ్మవిదులలో దమరొకరు. దయయుంచి తారక ముపదేశింపుడని ప్రార్థించిన వల్లెయని దాసుగారికి వారి మూలముగా దాసకోపదేశమిడి ధన్యునిగావించినారు యోగిగారు. వీరిశిష్యకోటి కనిగిరితాలూకాలో మిక్కుటము. వీరిశిష్యకోటిలో జేరి నట్టియు, కనిగిరిహైస్కూలునందు ప్రధానోపాధ్యాయులైనట్టియు, సుబ్బరామయ్యగారు యోగిగారినిగూర్చి ప్రశ్నించిన వర్ణమునుపాటింపని బ్రాహ్మణుడని చెప్పిరి. నివాసముగాని జననాదికములు గాని తెలియబడవనిరి. శ్రీఅప్పదాసుగారు గాయత్రి తారకమంత్రముల క్రమముగా మూడుకోట్లయేబది లక్షలు తొంబదియారుకోట్లు జపించి మంత్రద్వయసిద్ధిని గడిం



వేపండ్ల అప్పదాసు

చిరి. తనగురువునుగురించి కొన్నికీర్తనలలో రామభద్రుడని, మఱికొన్నికీర్తనలలో రామార్యులని వెల్లడించిన కారణముగ పొట్లపాటిరామయోగియే శ్రీవారిగురువనకదప్పదు. వీరిజనన స్థలము వేజండ్లయేకాని తానాలితాలూకా సంగంజాగర్లమూడిలో బడిపంతులుగుటచాదాపు తనభగవత్కైంకర్యము లన్నియు సంగంజాగర్లమూడియందే జరిపినారు. జపదీక్షముగిం చిన వెంటనే తలవనితలంపుగ దేశికార్యు దర్శనమబ్బుటనా నందాశ్రుపులబాద ప్రక్షాళనముగావించి,

క మా చి – ఆ ది

శ్రీ గురువర చరణం సదా సేవకభవహరణం
శ్రీగురుతారక మంత్రనిధానం శ్రీమత్సాంఖ్యసుయోగసుగానం
శ్రీ అమనస్కసుధారసపానం శ్రీమద్బ్రహ్మానందనిదానం
శ్రీసద సద్రూపం సర్వాధారం శాంతమనంతమనామయరూపం
సకలాగమ సంతోషప్రబోధం।సమ్మునివేషసుఘోషవిభూషం॥
శ్రీ అనాది మధ్యాంతరమఖిలేశం।అనన్యభక్తోదయపరహంసం
అద్భుతభావం అపరిచ్ఛిన్నం । హంసాశ్రితసంచారవిచారం।
శ్రీనిరుపమానసౌందర్యంధైర్యం।నిద్రయోగచిన్ముద్రవినోదం
పరమపవిత్రం భరితసుమిత్రం। పాలితదైవం దేవాదిదేవం
శ్రీరామభద్రగురు రాజప్రసారం । రామనామపారాయణసారం
శ్రీమదప్పదాసాఖ్య వినోదం । శ్రీహరిహరిహరినామస్మరణం

అని బ్రహ్మానందమున తాండవముజేయుచు నెమ్మదిగి పాదములంబడి లేవకుండిన వాత్సల్యము నెరపుచు లేవనెత్తిశాం

తించుము. శాంతించుము. దుర్ముఖమాఘ వికారి జ్యేష్ట శార్వరి జ్యేష్టమాసములందు క్రమముగా మూడుసప్తాహములు జరుప సంకల్పించి పనిగొన దలంపు నే నదృశ్యముగనుండి కార్య భారమువహించి నిర్విఘ్నముగ జరిపించెద ఇతరకాలములందు సమయమరసి దర్శనమిచ్చుచుండెద ననియాజ్ఞాపించి యంత ర్హితులైనారు.

దేశికాచార్యానుమతి పై మూడుసప్తాహములు భూరి యన్నదానముతోడను మఱికొన్ని క్రతువు లాయావత్సరము లందును జరిగినవని వెనుకజెప్పబడిన దాసుగారిచే నిర్వహింప బడిన భగవత్కైంకర్యములందు క్రమముగ పాళీభజనలు, హరి కథలు, ఉపన్యాసములు, మంత్రపునశ్చరణములు, ఆధ్యాత్మిక గ్రంథపారాయణములు విరామము లేకుండ జరుపబడినవి. ఇంక తరంగాష్టపదీకాలక్షేపములు చెప్పనక్కరలేదు. తృతీయసప్తా హావబృథస్నానకాలమున ముగ్గురు కుఱ్ఱవాండ్లు సంగమేశ్వరా లయము ప్రక్కనయున్న పడలకాలువలో స్నానములుచేయుచు మునిగిపోయిరి. జాలరులువలలతో వెదుకనారంభించిరి. చిక్క లేదు, వారు నిరుత్సాహులై కాలువవడ్డున కేగి చూచిన నావలి యొడ్డున ఆబాలురు గనంబడిరి. తమపోకడనుగురించి ప్రశ్నిం చిన నెవరో నూతనపురుషులిరువురు జలమునుండి తెచ్చి బయట జేర్చిరనియు వారలిందెందునుకనుపడ రనియు, జెప్పి చూపరుల కాహ్లాదము గలిగించిరి. ఈవిచిత్రచర్యకు రామలక్ష్మణులే కారకులనియు, దీనికంతయు దాసుగారిరామభక్తియే మూల మనియు, మాహించి జనులు శ్రీవారి నెంతయో! గొనియాడిరి.

నిర్ధనుడగు తనచేత భగవత్కైంకర్యరూపమహాక్రతువుల జేయించిన గురుకరుణకుబ్బుచు ఇట్లు గురుస్మరణ గావించిరి.

ముఖారి – ఆట

యోగిరా! మహా! యోగిరా
శ్రీరామ యోగిరా! రాజయోగిరా!
యోగ్యమభ్యసించువారికి। భోగ్యమగుచున్నారురా! యో॥
సుంతరా? బల్ వింతరా?
ఒకగంతురా? వారితంతురా?
పంతముడిగినవారికెల్లను । భావమగుచున్నారురా? యో॥
చూడరా? వారి బాడరా? వేగగూడరా? జ్ఞానయోడరా?
తాలో నాడుపామును గనినవారికి ।
ఐక్యమగుచున్నారురా ?
తత్వసిద్ధిని జెందరా, వారి తత్వమెల్లనుపండెరా?
పర తత్వసిద్ధిని జెందువారికి।దత్వమసి; ఐయుండురా? యో॥
నిండుతా? మేల్, బండిరా? పీతజండాయొకడుండురా?
జండాజాడలుగన్నవారిక జాతమృతములు లేవురా?
గున్నరా? మా, అన్నరా? గుహుడన్న నిన్నటిమాటరా?
తనచిన్నపాదాచిహ్నాలిచ్చెను।చెన్నకృష్ణులు వీరెరా? యో
ఊరుపేరిల లేదురా? ఒకయూరిలోనిల్వాగురా?
ఊరుశూన్యంబైనవారికి ఉత్తమాటదిగాదురా? యో॥
గుప్పరా? పూల్ గప్పరా శ్రీఅప్పశిష్యుడుచెప్పెరా?
తప్పుదిద్దినరామగురువరు దర్శనంబిపుడాయెరా?

ఇట్లు రెండు మూడు కీర్తనలతో డనేకాక దండకోత్పల మాలాపద్యములద్వారా గురువర్యానభినుతించినాడు. వీరు పరతత్త్వార్థసారసంగ్రహమను అప్పదాసచరిత్ర గేయపద్య రూపముల రచించి అందు పాండిత్యసంస్కారభాగ్యమేమి యు లేదు. నిత్యానుసంధాన నియతి లేదు. గణయతిప్రాసల క్షణముజూడగలేదు. చదువ లేదయ్యనే శాస్త్రవితతి; నీకటా క్షముచేత నేరచించితిగాని నాదుప్రజ్ఞయుగాదు. నలిననాభ. అని తననిరహంకృతిని వెల్లడించినాడు.

దాసుగారిచే నిర్వహింపబడెడు ప్రతిక్రతువునకును తెనాలినుండి వచ్చెడి బియ్యపుబస్తాలబండ్లకుగాని, కూరగాయలబండ్లకుగాని. విధివిరామము లేదు. రెండెద్దులబండ్లమీద నుచ్చిష్టపాత్రల దోలుచుండినను తరుగుట లేదు.

ఈక్రతువులన్నింటికిని సంగంజాగర్లమూడి అంగలకుదురు కమ్మవారాబాలవృద్ధముగ నాయకపడి శాశ్వతకీర్తి నార్జించినారు. శ్రీరామపట్టాభిషేకమహాయజ్ఞము జరుగు రోజులలో నొకరోజు పందిరులంటుకొని పరశురామప్రీతియగుచుండుట గాంచి పైరెండుగ్రామములవారరు తెంచి మంటలనార్పి వెంటనే నూతనపరికరములతో బూర్వమునకంటె మించిన పందిలిని నిర్మించి క్రతువు నిర్విఘ్నముగ సాగునట్లు దోడ్పడి ప్రేక్షకుల కద్భుతము గలిగించినాడు.

చాగంటిపాటి సప్తాహములో వైశ్యస్త్రీలుకొందఱు, బంగారపునగలతోడవచ్చి పగలంతయు నుత్సవవేడుకజూచుచు గాలముగడిపి రాత్రికిభోజనములు జేసి సప్తాహసందిలియందు

బరుండుటకు శంకించి దాసుగారింజేరి చోరులు జీనరాని ప్రదేశము జూపుడని ప్రార్థించిన నప్పుడు మీారీసందిలియందే బలం దుడు. సంజీవరాయుడే కాపాడగలడని సమాధానపరచినారు దాసుగారు వారల్లేగావించి సుఖనిద్దురంగానిరి కొంతవడికి నిద్రించువారిలో నొకకాంతకు మెలకువగలిగి పరికించిన నొక భూతము పందుకొనిసవారి చుట్టును దిరుగుచున్నట్లు గుపడిన భయపడి కేకలిడినది. మిగిలినవారు లేచిచూచిరిగాని వారి కగుపడ లేదు. అంతదాసుగారరుడెంచి సంజీవరాయుని లీలయని చెప్పి భయముదీర్చినారు.

సప్తాహము మూడవరోజు సప్తాహసందిలికి నిప్పంటుకొని కాలుచున్నది. దాసుగారు శ్రీరామపూజాకైంకర్యమున నిమగ్నులై యున్నారు. హవ్యవాహనుడు భయపడినాడు. గాబోలు, దాసుగారిని సమీాపింపసాహసింప లేదు. పందిలి యంతయు దగులబడినదిగాని రామమందిరము మాత్రము మిగిలినది. శ్రీరామలీల లద్భుతములనుట కిదియొక తార్కాణము. పమిడిఘంటం వెంకటసుబ్బయ్యగారిని, ప్రయోగ బాధనుండి తప్పించుటయే కాక తత్ప్రయోగమును జేసిన వాడర్థించిన మందలించి యాదరించి బహుమతి యొసంగి పంపినారుగూడా?

శ్రీతారకబ్రహ్మ పంగల నారాయణప్ప

వేదము, సేవ. ప్రేమ, జ్ఞానములను మచ్చ్యభాగము లందించినది వానిననుభవించుచు రసానుభూతి జేసినవాడే నిజమైనమానవుడు వీనిమాటలన్నియు వేదవాక్యములు నడక వేదవిహితము ! వేయేల మూర్తీభవించిన వేదరూపి ఆనగనన్ని వేదములు భక్తుల హృదయములందు దాంపవించుచున్నవి యనుట ఎవనిమనస్సు పురుషోత్తమప్రాప్తి కంకితమైనదో? వానికొక్కనికి మాత్రమీ రహస్యము బోధపడును ప్రేమయొక్క బాహ్యరూపము సేవ, ప్రేమతోగూడిన సేవయున్నచోటనే జ్ఞానముండును విశ్వరూపునకే కాలమున కెట్టిసేవ యవసరమో ! దానిని గురుతింపజేయునది జ్ఞానము సేవ్యసేవక స్వరూపముల నెఱింగిచేసినసేవయే సంపూర్ణ ఫలకారి.

సహజముగ జేయంబడు సేవకంటెను ప్రేమతో జేయబడుసేవ, ప్రేమజ్ఞానములతో నోతప్రోతమగుట శ్రేష్టాతిశ్రేష్టము ఇటుల విశ్వరూపుసేవింప జాలినవారే. వేద వేత్తల వేదములన్నియు వీరిలో నేకీభవించినవి అది మొదట బీజమై, సేవారూపమున వృక్షమై భక్తిజ్ఞానములను కాయలుకాచి పక్వములై నాస్వాదనమున కుపయోగించును. ఈ రహస్యమెఱింగి వేదము భక్తులహృదయములందు దప్ప బయట లేదని తెలిసి శక్తివంచన లేని సేవాభాగ్యమార్జించి తరించిన వేదమూర్తి వంగల నారాయణమూర్తి.

వీరినివాసము నర్సారావుపేట తాలూకా జగ్గాపురము. జననము క్రీ. 19వ శతాబ్దాంతము. తల్లి కావేరమ్మ. తండ్రి

కొండంభొట్లు. సంపన్నగృహస్థు కుమారుడు కేశవభొట్లు. కుమార్తెలు సుబ్బమ్మ, నర్సమ్మ, సీతమ్మగార్లు రామవరు, వేలూరు ధర్మవరములం దీకుమార్తెల కుటుంబములు దిన దినాభివృద్ధినందుచున్నవి. వృత్తి వ్యవసాయము ఎట్టి విషమ స్థితియందైనను చేయిచాచియెఱుంగని పుణ్యమూర్తి.

ఒకప్పుడు కోనసీమనుండి వేదవేత్తలయిన ముగ్గురు విప్రోత్తములు బీదలగుట యాచనకొఱకందందు దిరుగుచు, మన నారాయణప్పగారింట బసచేసినారు. శ్రీవారు వారిని చుట్టపుచూపులతో నాదరించి భోజనమజ్జనాద సత్కారములు కావించుచుండిరి. ప్రక్కన యతిథులు లేక భోజనముచేసిన రోజు శ్రీవారి జీవితములో లేదని చెప్పిన యతిశయోక్తి కాజాలదు. నిత్యాన్నసత్రమును మరపించిన గృహముగల వాడు నారాయణమూర్తి వీరిని నారాయణప్పయనియు నారాయణమూర్తియనియు లోకులు పిలుచుచుండువారు. తన యందు నిఖిల భూతములందును నొకభంగి సమహితత్వంబును జరుపువాడు. అనుపోతన వాక్యమునకు గురియైన వాడు మననారాయణప్ప. గుంటూరు మండలమునందంతటను సంచారముజేయు యాచకులందఱెప్పుడో యొకప్పుడు నారాయణప్పగారి సత్కారమందినవారై యుందురు.

ఒకప్పుడు పై ముప్వురుబ్రాహ్మణులును మడుగులుగట్టి భోజనమున కేగి కూరుచుండిరి. నాడు వీరికిదోడు మఱి పది మంది యతిథులువచ్చిరి. అందఱు బారుతీరి కూరుచున్నారు. భోజనపాత్రలమర్చబడి నవరసాన్నములు వడ్డింపబడినవి.

అతిథులు పరిషేచనములగావించి భోజనములు సేయుచుండిరి. లకారాంతేన భోజనము న్యాయము ననుసరించి మరదలు "లక్ష్మీనరసమ్మగారు" పెరుగుపాత్రతో ప్రత్యక్షమై సమయ మరసి వడ్డించుచున్నది. బ్రాహ్మణులు దృప్తిగాభుజించిరి. కాని అందొక బ్రాహ్మణుడు కన్నీరు కార్చుచు ముందున్న భోజన పాత్రయందుగల పెరుగన్నములో జేయి పెట్టకొని నూరకు చున్నాడు. మహాత్మా! భోజనము సేయుట విచారముగ గూరుచున్నారేల పదార్థలోపమా? ఆదరణాలోపమా? అన్నాడు నారాయణప్ప.

లేదు లోపము లేదు. ఆదరణయందును లోపము లేదు. నాకు ముగ్గురు పుత్రులును, నలుగురు పుత్రికలునుగలరు. వారిం కిట్టి దధ్యోదన మెప్పుడును పెట్టినపాపాన బోయినవాడగాను, నిర్భాగ్యుడనగు నాయింట వారేల పుట్టిరా యని విచారించు చుంటి. అట్లుగాక మీబోటి సంపన్నగృహస్థులయింట బుట్టిన మృష్టాన్నముల దృప్తులగుదురు గదా! అని నొల్లుచున్నాడు. నారాయణప్పచూచి దుఃఖింపకు భగవానుడు నీకోర్కె దీర్ప గలడు. చింతమాని భుజింపుము అని ప్రేమపూర్వక వాక్యముల నాదరించిన బ్రాహ్మణుడు దుఃఖమాపుకొని భోజనము జేసినాడు.

భోజనానంతర మతిథులు సుఖాసీనులై తాంబూలములు వేయుచు నిష్టాగోష్ఠినున్నతరి నారాయణప్ప ప్రక్కకు మానేదు పాలిచ్చు బఱ్ఱెతో వచ్చి తనపాలేరును బిలిచి దారిబత్తెము నకై కొన్నిరూపాయీలనిడి విషయ మెఱింగించి ఈబఱ్ఱె నీబ్రా హ్మణుని వెంటదోలుకొనిపో సనుజ్ఞ యిడుటయే కాక దాని

పోషణమున కొకయెకరముభూమినిగూడ దానము జేసినాడు. శ్రీవారి దానములన్నియు గష్టార్జిత ద్రివ్యసంభవములే!

క. జ్ఞానము కేవలకృపన
జ్ఞానికి నుపదేశవిధి ప్రకాశముసేయం
గానది సకలధరిత్రీ
దానంబులకంటె నధిక తరఫలితమగుఁ.

అనుభారతధర్మము ననుసరించి వందలకొలంది శిష్యుల జేర్చిన నిష్కామసేవాధురంధరుడు శ్రీనారాయణప్ప ఆరాధనా నెపమున ప్రతివత్సర మొకపరి శిష్యబృందమును జేరి సోదరులవలె నాదరించి పాదపూజాదికముల గ్రిహింపకయే ఆధ్యాత్మికోపన్యాసములతో రుచిరాన్న సత్కారములతో సబహుమానముగా బంపుయాచారముగలవారు వీరి యుపన్యాసములు స్వానుభవపూరితములై మనో రంజకములై మృదుమధురవాక్య శోభితములై యలరారుచుండెడివి

అసూయాగ్రిస్తుల దుర్బోధల ననుసరించి తనను బరీక్షింప వచ్చిన కొనశీమపండితులను, బ్రిహ్మవిద్యలో స్వానుభవమునుజూపి నిరుత్తరులజేసి గౌరవ మార్జించిన పుణ్యమూర్తి నారాయణమూర్తి.

వరుసగ నిరువదివత్సరములు కాలినడకను భద్రాద్రి కళ్యాణరాముల దర్శించిన భక్తాగ్రణి నారాయణప్పధీమణి. ఈ సమయమును స్వపురినుండి బయలుదేరుటతో మొదలుపెట్టిన రామభజన రాములసేవించి పర్ణశాలాది పుణ్యస్థలముల

దర్శించి తిరిగి యింటికివచ్చి మహాసంతర్పణగావించి గ్రామము శ్రీరాముల కర్పించుటయేగాని మంగళము జెప్పుచున్నాను.

ఆ మాగులు కాశీయాత్ర రెండు పర్యాయములు రామేశ్వరయాత్రచేసి గంగచే జల్లి దగ్రహణాభిషేకించి త్రికాల వేదియగుట భావిసద్గించి పితరుల నొటగొని నానాసేవసెకేగి భౌతిక దేహము విశ్వేశ్వరున కర్పించి ఋణత్రయ విముక్తుడైనాడు.

పండ్రెండవయేటి వయస్సునుండి గురుప్రసాదము నిల్పుకుని వేదశాస్త్రము లభ్యసించి, తదీయ సగాస్త్ర సనుభూతి గ్రహించిన ధన్యజీవి వ్యవసాయకుటుంబమగుట శాలిక్షేత్రముల సేద్యము సాగించి ధాన్యసమృద్ధి గలిగి తద్ద్వారా దానధర్మము సాగించి నిరంతాన్న దాతయను కీర్తిగడించిన పుణ్యగణ్యు మన నారాయణభట్లు.

నిజపురి నానుకొనియుండిన నిజక్షేత్రమున సంతోషక పుష్పవనమును, దీనిలో నొకకుటీరమును, దానిసమీపమున జలసమృద్ధిగల కూపంబును నిర్మించి ప్రతిదివసము ముషః కాలమున నాకూపంబున గృతస్నానుండై కుటీరమున జపదీక్ష సాగించుచుండిన గాయత్రీదేవి సర్పాకృతిధరించి కుటీరప్రాంగణమున మసలుచు శ్రీవారు బహిర్ముఖులగుచు వెంటనే యంతర్హిత మగుచుండెనట. ఈ విషయము గర్ణాకర్ణి నాలకించినవారగుట భీతినొందియున్యులీతోటలో నడుగిడువారుగారట వారిని భగవదర్చనకువారిగా బుష్పరాజములు లభించుటయే

గాక శ్రీవారి జపదీక్ష కేవిధమైన యంతరాయము జరుగ కుండెనట.

ఒకప్పుడు వేదపాఠకులగు శిష్యులతో గుటేరమున బ్రవేశించి భుక్త్యాసంబడంచుకొన బరుండిరి. అందరు నైమరచి నిద్రించుచున్నారు. చడీ చప్పుడు లేకుండగ సర్ప రాజ మరుదెంచి శ్రీవారిప్రక్క బరుండి గురవుగారి జెవిపై తన పడగ నుంచినదట. నిట్లు లుండ శిష్యుడొక్కండు కొట్టి నట్లులేచి కూరుచుండి దేశికుని వైపునకు దృష్టిసారించి భయ పడి నోటమాటరాక బాధపడుచు సహాధ్యాయుల గొట్టి లేపినాడు. చేసన్న సర్పమును జూపినాడు. చూచి భయాకులిత చిత్తులై దిక్కుల బర్వెత్తి గ్రామీణుల కెటెంగించిన వారు జనుదెంచి చూచిరి. గాని సర్పమగుపడ లేదు. గోలచేయుచు వెదుక మొదలిడిరి. యీ స్థితిలో శ్రీవారు లేచి తెలియని వానివలె గాంణమడిగి తెలిసికొని మా రామప్ప యిప్పగిది దర్శన మొసంగినాడుగాబోలునని సమాధానమిడినాడు.

నాటనుండి భగవానుడు శ్రీవారి వెన్నంటి తిరుగు సూచనలు చూపరులకు గనుపించుచుండెడివట శ్రీవారి దర్శన స్పర్శనాది సత్కారముల గ్రహసంకటములు తొలగుటయు నాధ్యాత్మికాది వ్యాధిగ్రస్థు లారోగ్యవంతులగుటయుఁగూడ జరుగుచువచ్చినది. నిజమైన పౌరోహితుడుగాని నామధారి మాత్రముకాడు అశ్రితకల్పభూరుహామను పేరుగాంచిన పుణ్య శాలి నిరంతరాన్నదాన దీక్షాధురంధర చక్రివర్తి.

''కుమారస్వామి'' అను విప్రుడొకడు [illegible] యగుట వంతనందుచు పొలములో నాగలి దున్నుచుండు నారాయణప్పగారిని సమీపించి నమస్కరించి తన్నివారణ ప్రార్థింప దాపుననున్న పొదరింటగల యోషధిసంగ్రహించి సేవింపించినాడు. వెంటనే సుగుణము గనుపించి నెలనాళ్లలో నారోగ్యవంతుడై తనజీవితము శ్రీవారి సేవకర్పించి ధన్యుడాయెను.

వీనినివాసమేదియో? బంధువులెవరో? తెలియదు గాని మదీయవంశస్థుడగు కుమారస్వామి శ్రీవారి శిష్యుడని మాత్రము వింటిని. ఆ కుమారస్వామి ఈ కుమారస్వామియగు నేమో? అని సంశయించుచున్నాను శ్రీవారి సంతానాభివృద్ధి నాశించుచు గ్రంథము ముగించెద.

రామదాసు రాగం పిచ్చియార్యులు

శ్రీరామ నామసంకీర్తన, సద్యోఫలదాయి, విద్యాగంధ మెఱుంగని, సామాన్యమానవులకు గూడ. సుకరము, సులభము, సర్వుల కందుబాటులోనుండునది. యోగసాధనకు వలె, కష్టనష్టముల పాల్జేయునదికాక, సుసాధ్యమైనది. ఆనంద దాయకముగూడ! భగవానుని యనంతనామములలో. ప్రణవమునకగ్రస్థాన మీయబడినది. ఇది సకలవేదసారము, ప్రణవ ప్రతినిధి రామనామము ప్రణవమెట్లేకాక్షరీమంత్రమో! అట్లే! రామనామముగూడ! ప్రణవోపాసనవలననే ఫలముగలదో ? రామమంత్రోపాసనవలనను, ఆ ఫల మే కలుగును.

రామనామజపమువలన గిరాతు డాదికావ్యకర్తయైనాడు ! కాశియందు మరణించినవారికి, ముక్తినొసంగునది, రామనామమే ? రామనామమాధుర్యము విడలేక, రామునితోపాటు జలసమాధి నధిష్ఠింపక హనుమంతు డిప్పటికి నప్పుడప్పుడు భక్తులకు బొడకట్టుచున్నాడు. కాళిదాసు, రఘువంశమందును, భవభూతి, యుత్తరరామచరితయందును, మురారి అనర్ఘ రాఘవమునందును, జయదేవుడు ప్రసన్నరాఘవమునందును రామునిగూర్చియు, రామనామమునుగూర్చియు, వేనోళ్ళ బొగడియున్నాడు. అప్రయత్నముగా గావించు, సంకీర్తనమునకుగూడ, ముక్తిసిద్ధము, పరిహాసముగా. గాని నిందారూపమున గాని, అర్థరహితముగా గాని చేసిన నామసంకీర్త

నకు, మోక్షము కరతలామలకము, పెంపగు చింతకుంట రామ నామమునేర్పి గోపన్న రామదాసైనాడు. ధ్యానకీర్తనాంస్మరణాదులలో నామ లేఖనము కోటిగుణితము.

మనో వాక్కాయ శుద్ధినర్జించి, మూడునూరులు కోట నుచ్చరించి, పిదప మోక్షసిద్ధినాశించి, శ్రీరామ త్ర్యక్షరిని, లేఖనము గావించుచు, కోటినామముల లిఖించిన పుణ్య పురుషుడు రామసాయుజ్యసంపద నందకొనగలడు వేయేల? తానమునకువలె? స్థిరస్థాననివాసియగునని రామదాసు రాగం పిచ్చయార్యుల జీవితము సాక్ష్యమిచ్చుచున్నయది.

పూర్వవాసనాబలమున మంత్రోపదేశ ప్రక్రియయందు సగుణదృష్టియు, సగుణమున సాకారమైన, యనాదినిజమున గల శుద్ధచైతన్య మహాకాశమున నిర్గుణదృష్టియు, జీవితాంత లోసంగ వ్రాసి ముగించిన రామకోటితో పాటు సంపూర్ణ వ్యక్తిలో నిరామయానప్రభ లుట్టిపడ నానందవారి దేలి యాడుచు, దేహేంద్రియాదుల గోదావరీనదీసంత్యక్తకడి, జీవుని శ్రీరామచంద్రునిచేర్చి, శాశ్వతసుఖ మనుభవించిన, భక్తాగ్రేణి జీవితగాథ శ్రవణీయమై, ఆదర్శప్రాయమై మనసాధన భక్తికి తోడ్పడగల దనుటలో సంశయింప బనిలేదని ఖండితముగ జెప్ప సాహసించితిని.

పాఠకమహాశయులారా! వినుడు, సావధానులరై వినుడు,

క౦. ఎఱుక గలవారి చరితల
గఱచుచు సజ్జనులగోష్ఠి గదలక ధర్మం

తెలియుచు నెఱిఁగినదానిని
మఱియును కనుష్ఠించునదిస మంజసబుద్ధిన్.

(భాగవతము)

భక్తిశ్రద్ధలతో నేకాగ్రచిత్తులపై వినుండు. తండ్రి కోటయ్య. తల్లి కోటమ్మ. ఈ పవిత్రదంపతుల మూఁడవపుత్రుఁడు మన భక్తాగ్రణి దాసు రాగం పిచ్చయార్యులు వాసము గుంటూరు. వీరి కాంధ్రాంగ్లేయ విద్యలయందు ప్రవేశము గలదు. ఈ వంశక్షేత్రమున భక్తిబీజమునాటి మొలకెత్తించిన పుణ్యమూర్తి రాగం వీరయ్యగారు. దాసుగారి సోదరుఁడీతండు నొకప్పుడన్నతో, బంధువులతో భద్రాద్రి యాత్రకేగుటకారణముగ వంశక్షేత్రమునం దంకురించిన భక్తిమొలక దాసుగారిచే బోషింపబడి తదగ్రపుత్రుఁడు సమర్థ ఆంజనేయులుగారి దోహదమువలన వృక్షమై పండ్లతో, పూలతో, కాయలతో విరాజిల్లుచు వర్తమానమున నాంధ్రభక్తలోకమున కాశ్రయమైనది. ఈ యాత్రాకాలమున గలరావ్యాధిద్వారా బరీక్షించి భగవానుఁడు మన భక్తాగ్రణి కదృష్టజయపత్రిక మాలముగ దాసుగారి కష్టసహనశక్తి లోకమునకు వెల్లడించినాఁడు.

గుంటూరు మండల గహానశాఖలో నుద్యోగిగా నున్న తఱి తన యొగ్గురు బిడ్డలతో ప్రథమ భార్యా శరీర యాత్ర జాలించినను ఉద్యోగమూడినను జీవనాధారమంతరించినను విషయలంపటుల కెందును సుఖము లేదని తెలిసి పరిపూర్ణ

త్యాగియై తన నిర్లిప్తత్వము వెల్లడించినాడు. ఇంతలో విరాగిని పట్టుబట్టితిరిగి ప్రారబ్ధము పెండ్లికొడుకును జేసినది. వీరి రెండవ భార్య సుందరమ్మ. యెండలో తట్టయుండినట్లు సర్వవిధముల భర్త ననుసరించి భక్తి వృక్షమును బోషింపుచు ననుకూల దాంపత్య వైభవమున దోహదమిడ సద్వృక్షము కాపునకు వచ్చినది.

పెండ్లినాడు నల్లబోటికొండపై వేంచేసియున్న శ్రీ నృసింహస్వామివారి దంపతులకిచ్చిన యాశీర్వాద బలమునను, గుంటూరు నల్లమస్తానుగారి కృపాదృష్టిబలమునను గ్రమమున మంగళగిరి, వినుకొండ, శ్రీశైలము మొదలగు పుణ్యక్షేత్రముల నుద్యోగములభించుటయే కాక, సుగుణపు పుత్రులు నొకపుత్రికయు దాను పెంచిన భక్తిపుష్పఫలములా! యన్నట్లు లుద్భవించిరి.

ఎంతటివారి నైనను ప్రారబ్ధము కలతపఱుక పోదు చూడుడీ ? వాతావరణ మనుకూలింపమియో ? పూర్వకర్మ కృతం పాపం వ్యాధిరూపేణ బాధించు ననున్యాయము ననుసరించియో ? వ్యాధిబాధితులై తన యుద్యోగమునకు స్వస్తి జెప్పి గుంటూరుచేరి యత్యంతకష్టముతో గుటుంబ పోషణ జేసికొనుచు పెద్దకుమారునకు విద్య నేర్పించు కార్యమున దాసుగారికి లభించిన క్లేశములు వర్ణనాతీతములు పుత్రి వియోగముగూడ జరిగినది. ఇట్టి విషమపరిస్థితిలోగూడ శాంతిని కోల్పడలేదు.



రాగం పిచ్చియామాత్యులు

కోటి లేఖన కార్యక్రమమారంభించి పనిగొనుచు, దన ప్రియ త్నమున కంతిరాయమని కాబోలు కిల్లి కొట్టును కట్టి పెట్టి శ్రీ నృసింహాలయములో పెద్దపుత్రుచే బడిపెట్టించి, గుట్టుగా సంసారమును నెట్టుచు, క్రమముగ నగ్రతియుని నెత్తి నంటగట్టి గట్టిపట్టుదలతో దినము పండ్రెండుగంటలు కాలము రామ కోటి లేఖనమందును, మిగిలినకాలము, రామభజన పురాణ శ్రవణాదులయందును వినియోగించుచు దనజీవితమును సార్థక పరచుకొనుచున్నారు. డెబ్బదియేనవపడివచ్చియు రాకమునుపు మన పిచ్చయాచార్యులకు దాసబిరుదమంటుపడినది గదా !

నృసింహాలయములో నాగుచుండు పాఠశాల కను కూలముగ నిజకుటుంబ మగ్రహారమున కనితిష్ఠములో మార్చిరిగాని. రామవిశ్లేషమున గోరుచు తనయభీప్సితమున కన్యధాత్వము సిద్ధించుట విచారించునెడ, నొకనాటి స్వప్న మున సాక్షాత్కరించిన శ్రీరామచంద్రమూర్తి, నిజసోదరు నుద్బో ధించి. చెలో, భాయ్, చలో అని త్వరపెట్టు బయలుదేరిన దాసుగారి పాతయింటినుండి బయలుబడిన దృశ్యమును గాల కించి కుటుంబమునకు వసతిగృహ మవసరమనుట భగవదా దేశమని తెలిసి మరునాడుదయమున తన పాతయింటగల శ్రీరామపట్టాభిషేకచిత్రము భక్తులభజనలతో నగ్రహారము లోని నూతనగృహప్రవేశము గావించి గృహద్వయమునం దును, భజనలు గావించున ట్లేర్పాటుగావించి సమయాను గుణముగా, నందు దానును పాల్గొనుచుండెను

నూతనగృహము నృసింహాలయ సమీపమునందుం డుట హరికథా పురాణశ్రవణాదుల గాల్గొనుచు నానంద ముగా గాలము వెళ్ళింపుచున్నారు. దాసుగారు దినములు గడచినకొలది శ్రీ సీతారామ నామసంకీర్తనసంఘ మభివృద్ధి నంది భాగవతసేవలవారిగా సాగుచుండుటయే కాక గ్రామ మం దంతటను గృహసంకీర్తనములు, నగర సంకీర్తనములు, అన్నదానములు, హరికథలు, భాగవతసేవలు, విస్తరింపించుట నుపన్యాసపూరితములైన భగవన్నామప్రచారముతో శ్రీసీతా రామనామసంకీర్తనసంఘము గర్తపురి గగ్గోలు పెట్టుచున్నది. ఈ సత్క్రియా కలాపముల కన్నింటికిని దాసుగారి గృహమే కేంద్రస్థానము. దాసుగా రిప్పుడు యువకులతో గలిసి యువకు డైనాడు భగవత్సేనయందు.

దసరా రాబడితో గుంటి గుర్ధ్ధుల కన్నదానము జేయ గుమారుని బ్రోత్సహించి, కార్యము సాగించుచుండ గొన్ని యేడులకది శ్రీసీతారామనామసంకీర్తనసంఘముననొక శాఖగా రూపొందె. ఇప్పుడు సమర్థుని యాధిపత్యమున జరుగుచున్నది ప్రతిరామకోట్యుత్సవాంతమున జరుగుచుండు బీదనారాయ ణాన్నప్రదానమున కిది బీజమైనది. అంత గొంతకాలమునకు జ్వరపడి రామకోటి లేఖనమునం దశక్తులైనను శ్రీయుత అద్దే పల్లి రామకృష్ణయ్య శ్రేష్ఠిగా, రుచితముగ నొసంగు రామ కోటి లేఖన గ్రంథముల స్వయము భక్తులకిడి వ్రాయించుచు, అట్లన్యులును, తానును వ్రాసినట్టి రామకోటిగ్రంథముల

నన్నిటి నొకచో జేర్చి, సంవత్సరమున కొకసారి ఘ్రాణించు నట్లు కట్టడి కావించి పనిగొనుచుండ 2-9-1933 సంవత్సరము మొదలువారిగా జరుగు రామకోటి మహోత్సవములకు మూలకందమై విస్తరించినది.

తదీయోత్సవముల మొదట, 48 మందిరములలో జరిగిన పూజలిప్పుడు నందలక్షలాది మందిరములలో జరుగుచున్నవి. త్ర్యాహ్నిక పంచాహ్నికదీక్షగా పూజాదులగుటయే గాక, శ్రీ రామ సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాది సత్కౌతుకలాపములు కాక క్రమముగా నాసేతుహిమాచలము లలో సుందరమందిరములలో ననేక నామస్మరణములతో "శ్రీరామనామక్షేత్ర" మేర్పడి సత్రశాలలస్థాపనయు జరిగినవి. ముందుగూడ జరుగనున్నయవి సంకల్పసిద్ధిప్రదములు శ్రేయోత్తర వృద్ధిదములు.

భాగవతులు నిర్భయస్వరూపులు, హాలాహలముగానీ, కాలాగ్నిగానీ తుదకు మృత్యువుగూడ భక్తుని భయపెట్ట లేదు పెద్దపక్షి యొకప్పుడు తనగృహమున్న వాలిన తక్కువేమి మనకు రాముం డొక్కడుండవలెను, అనిపాడుచు, నింటిపై పాలుచల్లి తృప్తిగొనినారు. ప్రతిగ్రీష్మమునందును చలివేంద్రముల నిర్మించి స్వయముగ మార్గస్థుల దాహశాంతి గావించుచుండు మహోపకారి శ్రీరామనామక్షేత్రస్థ సాధన శాఖకండగా నిలిచి జపకుటీరములు నిర్మింపజేసి, వానియందు జపముల గావించు సాధకుల కండగా నిలిచి కృతకృత్యుల

గావించినారు. శ్రీవారినిత్యకృత్యములు రెండే రెండు. అందొకటి రామకోటి లేఖనము, రెండవది శ్రీ నృసింహాలయమందలి పురాణశ్రవణము. తన శ్రీరామకోటి లేఖనగ్రంథములను శ్రీభద్రాద్రిరామున కర్పింపవలయునను యపేక్ష యతిశయింప. క్రీ. శ. 1934 సంవత్సర చైత్ర శుద్ధమున జరుగు సీతా కళ్యాణమహోత్సవమున చిన్నకుమారుడు నంక శాస్త్రులను వెంటగొని బయలుదేరి చైత్ర శుద్ధ పంచమి పొద్దుపొడుపునఁ గౌతమి నుత్తరించి స్నానమాడి స్వరూపధారియై మడుగులతో బందగులగూడి భాగవతబృందము సన్నంటిరా రామ భజనలు చేయుచు, గనుకొలంకుల నానందవారి బిందు సందోహము. మిణుకూరం, పురవీథుల దాంటవించుచు గిరికి వలగొని భద్రనగ ముద్గమించి భూళిదర్శన వ్యాజమున సీతారాముల దర్శించి వందనము లర్పించి, నాయుష్యమర్థించి, యిష్టార్థసిద్ధి గడించి, సెలవుగొని బసజేరి భోజన భాజనముల గావించి సుషుప్తిసుఖ మనుభవించి యానందించిరి.

తెల్లవారినది గౌతమి గ్రుంకులిడివార్చి మడుగులదీర్చి సుఖాసన మలంకరించి స్వీయాజ్ఞానువర్తియగు పుత్రుజేరి కాలాతిక్రమణమున కనుమతింపజాల సప్తమిగడియలకై వేచి యుండనేల భగవత్కార్యకలాపముల కన్నియు శుభసమయములే తెమ్ము నేడే శ్రీరామకోటి శ్రీరామున కర్పింతము శుభస్య శీఘ్రమనినాడు. ఆలసింపరాదు. అని త్వరపడుచు లేచి రామకోటి లేఖనగ్రంథములకట్టి శిరమున ధరించి, భక్త

బాంధవకోటితో గిరిప్రదక్షణము గావించి, కోవెల ప్రవే
శించి, ప్రదక్షిణ నమస్కారములు స్వామికి సల్పించి స్వామికో
టర్పించి జన్మ సార్థకత వహించినదని సంతోసించుచు, భగవ
న్నామసంకీర్తనము విడిగిలకేగి, సమారాధనాది సత్క్రి-
యల భాంధవ భాగవతుమాన్యుల నర్చించి సంపూర్ణతృప్తి
నార్జించిరి దాసుగారు.

ప్రొద్దు గ్రుంకినది ప్రతుదినము ఉత్సవక్షణము మనది
గాదు. కోవెలకేగి రాముదర్శించి సేవగొనివచ్చి భక్తులు
గావించు సప్తాహములో బొల్గొందము నేనే రేయి యే పట్టబట్టి
భగవన్నామ ప్రవాహమునకలు బెట్టుచు ప్రసరించు తృప్తిని సహింపస్థితి
నార్జించి మానవ జన్మసార్థకము గావించుకొనెదము అమ్మా,
లెమ్మా అని త్వరపెట్టుచు భజనలు చేసి రాముని దర్శించి,
ధ్యాననిష్టనుండి కొంతవడికి బహిర్ముఖులై సెలవంది ధన చేరి
భుజించి పరుండిరి. తన ప్రక్కగదిలో సప్తాహము జరుగు
చున్నయది. కుమారునిచే సప్తాహము జరుగు గది ప్రక్కకు తన
పడకను త్రిప్పించి సంకీర్తన మాలకించుచుండిరి. రాత్రివంటి
గంటైనది పడకనుండి లేచి కూర్చుండిరి. శాపిరాడదు తల
దిరుగుచున్నది. కూర్చుండజాలననుచు భద్రగిర్యాఖ్య చేతులు
జోడించి "శ్రీరామ రామ" అనుచు ప్రపకపై కొనుగుట
గాంచి వెంకటేశ్వర్లు తనతొడపై తండ్రిని పరుండ జేసినాడు.
స్మృతితప్పుచున్నదని తెలిసి తండ్రి చెవిలో రామనామము
జెప్పుచు గూరుచున్నాడు. వెంకటేశ్వర్లు శ్రీరాముని నివ్య

సుందరమూర్తియై దర్శన మొసంగుట. భగవానుడు తన తండ్రి ననుగ్రహింపవచ్చి దర్శనమిచ్చినాడని దలంచి వందన శతములు మానసికముగ నర్పింప సంతర్పితుడైనాడు శ్రీరామమూర్తి.

రాత్రి నడిజామునకు మించినది 22-3-1934 దాసుగారి జీవాత్మ పరమాత్మలో కలిసినది. పెద్దకుమారుని రాకకై వేచి యుండి మరునాటి సాయంత్రికి భక్తులు భగవన్నామకీర్తనలతో శ్రీవారి భౌతికదేహమునకు దహనసంస్కారము గావింపబడినది. నాడు భజనలతో భద్రగిరి ప్రతిధ్వనించినది. సంనయన సంస్కారభాగ్యముమాత్రము సమర్థున కబ్బినది. అనాయాసమరణదాతయైన శ్రీరామకోటిని లిఖించి, రాము స్మరించి, తరించి మాపాతకులు కృతార్థులగుదురుగాక.



కూర్మదాసు

ఎవనికి దేహము దేవాలయమై ఆత్మ దేవుడాయెనో? వాడే నిజమైనభక్తుడు [illegible] కాట సట్టును కిరీటిచాలి నిలిచి మనసు [illegible] కునిక పట్టుసనగు నీతుచ్ఛదేహము దేవాలయ [illegible] ఆత్మ దేవుడగుట కెప్పటికి "యద్భావం తద్భవతి" అను న్యాయము ననుసరించి భావమాత్మ చే నటి [illegible] ముల [illegible] జేకూరగలదు.

"యో మాం పశ్యతి సర్వత్ర సర్వంచ మయి పశ్యతి
తస్యాహం న ప్రణశ్యామి స చ మే న ప్రణశ్యతి."

అను భగవద్గీత వాక్యమునకనుగుణముగ అట్టి దేహము దేవాలయముగను ఆత్మ దేవుడుగనుండును విశ్వమంతట భగవంతుడున్నాడు. భగవంతునియందు విశ్వమున్నది. అనగ విశ్వవిశ్వేశ్వరులకు భేదము లేనట్లు తెలియుచున్నదనుట విశ్వమంతటను భగవంతుని, భగవంతునియందు విశ్వమును చూడగలిగినవాని దేహము దేవాలయమై ఆత్మ దేవుడగును. ఈభాగ్యమార్జింపగలిగినవాడు, కులహీనుడైనను, విద్యాశూన్యుడైనను సహాయసంపత్తి లేనివాడైనను లోకవంద్యుడగుచున్నాడు. మూడులోకములు వీని కనుసన్న మెలంగగలదు. ఇట్టివారలలో కూర్మదాసుగారొకరు. వీరికి తలిదండ్రులిడిన పేరు యిలపావులూరి సంకటసుబ్బయ్య జన్మతో బంగుత్వస్థితి కలవాడుట కూర్మదాసని లోకులచే [illegible]బడు

చుండిరి. కడుబీద విద్యాశూన్యుడు సుందరదేహుడుకాడు. ఎట్టివాడైననేమి ధనవంతులెల్ల రీతనిదాసులు సుందరాంగులుకు శ్రీరామమూర్తి,విద్యావంతులుభృత్యులు. తండ్రిఇలపావులూరి శ్రీనివాసులు. తల్లి ఆదెమాంబ. సోదరులు వెంకటకృష్ణయ్య, సీతారామయ్యలు. జననము క్రీ. శ 19వ శతాబ్దము నేటి కనుపదినాలుగేండ్ల వయస్సు. నివాసము కందుకూరు తాలూకా, సింగమనేనిపల్లె. ఐదవయేట నక్షరాభ్యాస ముతో భక్తిబీజము మొలకెత్తినది అది వయసుతోపాటు పెరిగి వృక్షమై పూలు కాయలతో విరాజిల్లి కాపుదిగినది ఇప్పుడు నృక్షమునం దక్కడక్కడపడుకాయలుమాత్రమగుపడుచున్నవి. క్రమముగా బడిచదువు పూర్తిఅయినది ఉపనయనమహోత్స వము జరిగినది. స్వపురిభజనమండలి స్థాపించి, నిత్యభజనలు జరుపుచు, నాయాపర్వములందు రామ, కృష్ణ నృసింహాది జయంతుల జరుపుచు బరమానందమున నోలలాడుచు గ్రిమ ముగ దరంగ కాలక్షేపమున కలవడినాడు. ఆరోజులందు దరంగ కాలక్షేపమున బేరుగడించినవాడు. ఏలేశ్వరపు సీతా రామాంజనేయులుగా రొక్కరుమాత్రమే.

వారిని దర్శింపదలంపు గలదు. గాని అది నెరవేరు బొట్లు చేత డబ్బులేదు నడువ గాళ్ళులేవు. దైవముమీద భారము వేసి తాబేటికినలె జేయూతచక్రలతో నెడ నెడ మకాములు జేయుచు మున్ను పండరియాత్రకేగు కూర్మదాసునికివలె బంగ నోలుస్టేషను చేరి యొక యుదారమూర్తి ద్రవ్యసహాయముతో

తెనాలి కేగి యటనుండి పయనముసాగించి యెడ్ల పల్లి కూరును గాంచినాడు.

అందు బ్రహ్మశ్రీ మల్లాది సుబ్బదాసుగారు జరుపు సప్తాహములో కాలక్షేపము జరుగుటకుబోవు సీతారామాంజనేయులుగారి వెంట నల్లభాపురము జేరి సుబ్బదాసుగారిని దర్శించి తదీయ సత్కారమంద సముత్సుకైన మనకొంటెబాలుని గాంచి యూరడించి మార్గప్రయాసమంతయు విని కూర్మదాసను సార్థకనామ ప్రదానము జేసినారు. నాటనుండి వెంకట సుబ్బయ్య పేరునుమాని భక్తలోకమంతయు కూర్మదాసని పిలువజొచ్చినది.

నాయనా! కూర్మదాసగా? మీ యాపథపన్ ప్రేస్తై నను సాగించుచున్నావా? నీవును నామస్మరణములో మగ్నమను చుంటివా? లేనిచో? నేటినుండి భజనానందమున మునిగి తేలుము, నే నిడినపేరు సార్థకమగును అనుచు సాదరమున కూర్మదాసుగారిని ముందు గూర్చుండబెట్టుకొని హస్తమస్తక సంయోగమున నాదరించె. తదుపరి సీతారామాంజనేయ భాగవతారుగారివలన బాలగోపాలతరంగ కాలక్షేపము సాగినది. అందు భక్తులెల్లరు బాహ్యాని తన్మయసుఖ మనుభవించుచున్నారు. చూపరులెల్ల రానందవారి నోలలాడుచున్నారు. జోడు మృదంగనాదములు మిన్నుముట్టుచున్నయవి. సంకీర్తనాపరుల కంఠధ్వనులు దిక్కుల జెవుడు పరచుచున్నయవి. తాళముల మ్రోతలు భూనభోంతరాళము మారుమ్రోగుచున్నవి. భక్తుల నేత్రము లానందజలధులైనవి. సుబ్బదాసుగారు ప్రేమ

వచినాడు. కూర్మదాసు ప్రత్యక్ష కూర్మదాసయినాడు. గంట లతిక్రమించినవి. పగలెల్ల గతించినది. రాత్రిసమీపించినది బహిర్ముఖము లంతరించినవి. అంతర్ముఖము లుద్రేకించినవి ఇట్లు బ్రహ్మానందమున దేలియాడిన భక్తుల కెట్టి యతిథి సత్కారము లాచరించి ధన్యతగాంచవలయునో? యోచించి తగు ప్రయత్నములో నున్నారు కార్యకర్తలు. ప్రొద్దుగ్రుంకి జాముప్రొద్దుపోయినది. సంకీర్తన ముగిసినది. భక్తు లెల్లరు బాహ్యావృత్తు లార్జించిరి. సుబ్బదాసుగారు భక్తులెల్లర కభ్యంగనముల గావింపించి మడుగులిచ్చి రుచిరాన్నముల దృప్తులగావించి చందనతాంబూలములిడి సుఖాసీనులంజేసి భాగవతకథాశ్రవణమున సంతృప్తుల గావించుచు సుబ్బ దాసుగారు కూర్మదాసుతో నిట్లనిరి.

కూర్మదాసూ! ఈ భక్తసమాగమమువలన మనము ధన్యులమైనాము. ఇట్టి సద్భక్తసమ్మేళనముతో జరుగుసప్తాహ దీక్ష నాగించుట గుటుంబీకుల కసాధ్యమే గాని నీబోటి బ్రహ్మ చారులకు సులభసాధ్యము పంగుత్వస్థితి దలంచి భయపడకు ఇది దేహమునకే గాని మనస్సునకు లేదుగదా? స్థిరసంకల్ప పూర్ణుడవగుము దాన నీవు దరించుటయే కాక నాంధ్రావని నంతటిని దరింపజేయగలవు. అదుగో నిరతాన్నదానశిరో మణిగారగు వరంగలు వరమ్మగారు వారి యాశీర్వచనము బొందుము అని చెప్పుట సంతసముతో గూర్మదాసు వరమ్మ గారికి నమస్కరించి యాశీర్వాదమందినాడు. ఇట్లు సప్తా హము క్రమముగా నన్నదాన భజనానందములతో ముగిసి

నది. భక్తులమహాశీర్వాదములు ముందునకు దోహదపడ పాండు రంగ సప్తాహములుజరుప సంకల్పించినాడు పూర్ణదాసు.

తదుపరి వరదమ్మగారి యాజ్ఞను సంగ్రహించి పండరికేగి పాండురంగనిదర్శించి సప్తాహదీక్షలు నిర్విఘ్నములుగ జరుగు నట్లు వరమర్థించి రంగనిసేవలో గొన్నినాళ్ళు గడపి యుండి బయలు దేరి తెనాలిజేరి తురగా కృష్ణయ్యగారింట నుండగ భజనలో బాల్గొని అటనుండి ఈమని ప్రవేశించి నేలనూతల సుబ్బావ ధానులుగారింట బసజేసి యుపవాసదీక్ష సాగించుచు బ్రహ్మ సత్రము జరుపుటకు సిద్ధార్థినామసంవత్సరాషాఢ శుద్ధపంచమి ముహూ ర్తము నిశ్చయించి గ్రామవాసుల కెఱింగించిన నాయూరి నియోగి వైదికకక్షకు చెందినవాడగుట వైదికగృహమున బస జేసినాడని నియోగులును, దాసుగారు నియోగియగుటచే తమకు సంబంధము లేదని వైదికులును విముఖులగుట వలన దాసుగారి ప్రయత్న మేమియు సాగలేదు. ఇప్పటికి క్రతువు ప్రారంభమునకు ముహూర్తము మూడునాళ్ళు మాత్రమే.

గ్రామవాసులు విముఖులైనను వారిదైవమునను కూలమైనను,

తన సేవారతులు మఱువరో తానువారి
మఱువబో డెప్పటికిని రామప్రభుండు
భక్తజనకల్పధేనువై పరగినట్టి
శ్రీరఘూత్తముడెప్పు డుపేక్షింపబోడు.

అను సమర్థుని వాక్యానుసరణి నాటిరేయి స్వప్న మున శ్రీరామలక్ష్మణులు వైష్ణవవేషధారులై సాక్షాత్కరించి,

నిర్ణయించుకొనిన ముహూర్తమునకు బ్రహ్మోత్సవ మారంభింప బడెను. ననమికి మాస్పుకొనుము ఈలోపల పోగ్రాముసోటీ సులు సంచిపెట్టుము. తక్కినపనులు మేము చక్కబెట్టగలమని సెలవిడి యంతర్హితురాలైనారు.

భగవదాజ్ఞ ననుసరించి పోగ్రాము పత్రికల ముద్రింపించి పంపబడినవి. నేలనూతల సుబ్బావధానులుగారి ఖర్చుతో బందిరులు పూర్తిఅయినవి. గతరాత్రి స్వాప్నికముగ లభించిన భగవదాజ్ఞను పురస్కరించి పెద్దిరాజు మహాలక్ష్మమ్మగారిని జేరి ప్రథమరోజున సంభయ మొసంగుమన బదులుచెప్పక తల యూచి వెళ్ళిపోయినది. భగవదాజ్ఞకంతరాయము వాటిల్లదని తెలిసినవారగుట దాసుగారు నిర్విచారిత్యై, మంటపనిర్మాణము గావించి శృంగారించి యందర్చామూర్తుల బ్రవేశపెట్టినారు. నాటిరాత్రి యామద్వయ మతిక్రమించిన నైదువందల రూపాయీలుగల సంచీరముతో బ్రవేశించి దాసుగారికి సమర్పించి తనకు స్వప్నమున లభించిన శ్రీరామాజ్ఞ ననువర్తించితి ననియు మిగులు తగులులనేనే భరించెదననియు జెప్పుచూ, వెళ్ళిపోయినది మహాలక్ష్మమ్మ.

మరునా డుదయమునుండి బ్రహ్మోత్సవము ప్రారంభింపబడి, శేషించిన పదిరోజులకు బది యుభయములు సంపన్న గృహస్థులొసంగుట క్రతువు ముగిసినది. కొత్తపల్లి నిడమానూరు మైనంపాడు నగరములనుండి వచ్చిపాళీ భజనలలో బాల్గొనిన భక్తబృందమునకు గావించిన సత్కారములతో గ్రతువు జగజ్జేగీయమానమైముగిసినది.

శ్రీవాసుగావించు సప్తాహములన్నింటియందును జాతి మత విచక్షణలేని యన్నదానము గావింపబడుచుండెడిది. ప్రతి క్రతువునందును వైగనుసరించిన పాళీభక్తబృందమే పాల్గొను చుండెడిదట.

ఒంగోలు సప్తాహములో మూడవనాటి నృసింహారాధకులైన కైవారం బాలాంబగారిని శాంతింపజేయుటకు నూట యెనిమిది బిందెల పానకము బస్తా వడపప్పు నివేదించి వినియోగింపగా, యాత్రికుల కొకగిన్నెడు పానకమునకంటె నెక్కువరాలేదు. దీనినిబట్టి లక్షలకొలంది జనులు సమావేశమైనారని తెలియుచున్నది. ఆరోజులలో విస్తరిపాత్రలు తొలగించుటకు రెండెద్దులబండ్లు రెండు ప్రతిరోజును పనిగొను చున్నవని చెప్పుటతిశయోక్తికాదు.

రెండవరోజు జాదయము భక్తబృందము కీర్తనలతో కాలక్షేపము ప్రారంభించి దేహాముల మరచి నృత్యములు గావించుచున్నారు. బాపనులు బ్రహ్మానందమున మునిగిపోయిరి. చేతిపావుకోళ్ళ యాత్రతో దాసుగారు గీతించి యామహోత్సవములో బాల్గొనిన వెంటనే కోటిసూర్యప్రకాశమైన యాత్మజ్యోతి దాసుగారిని ముంచి ప్రేక్షకదృష్టికి గోచరించి అజ్ఞానాంధకారము పటాపంచలుగావించినది.

ఈయద్భుతసంఘటనలో యానందము ననుభవించిన నీలంరాజు బాలాంబగారు పరమయోగియు నిజభక్తురాలు నైన నీలంరాజు చలపతిరావుగారివలన శేషించిన నాలుగుభాగముల కారు వేలరూపాయలు దాసుగారికిప్పించి కృతకృత్య

త్రైనారు. వీరిప్పటికిని సజీవులు. ఈ సప్తాహములో రోజునకు రెండునీలిమందుకళాయిల నెయ్యి పూర్తిగా వినియోగింపబడుచు వచ్చినవనిన నతిథులసంఖ్యను ప్రత్యేకించి చెప్పబని లేదు దానుగారెండు సప్తాహముజరుప సంకల్పించినను అఖండారాధనమునకు నూనెమాత్రముసంపాదించి క్రతుపుప్రారంచువారు రెండవకంటికి కెలుకబడకయే అయాచితముగ లభించిన వేలకొలంది ధన ధాన్యములతో క్రతువు పూర్తియగుచుండునది.

ఈ ఒంగోలు సప్తాహము ప్రారంభించుటకు బూర్వము సంచిరులకు దాసరియాకు గొనివచ్చిరి అవి ప్రోగులమర్చబడినవి. ఆప్రోగులపై రేలంతయు రెండునల్లత్రాచులు కాపలాగాయుండు డస్కసలదినము చుండెడివట.

అరయ జాలదుగానిపా మరులురామ
చంద్రమహాత్మ్యమరరెప్ర శస్త్రతమము
భక్తకల్పద్రుమంబన బరగినట్టి
శ్రీరఘూత్తముడెపుడుపే క్షింపబోడు.

భక్తుడన ప్రత్యక్షభగవంతుడు, భగవల్లీలలెట్టివియో, భాగవతలీలలును అట్టివియే. ఒకప్పుడు గుంటూరునంగల న్యాయవాదులలో గొందరు నీలంరాజు చలపతిరావుగారిని జూచి "చలపతీ" ఎవరికిగాని, యేతరినిగాని, యొకపైసయు ధర్మము జేసియెఱుంగవే కూర్మదాసుగారి సప్తాహములో నారువేలరూపాయిలు వెచ్చించినావట చిత్రముగానున్నదే

అనిన, ఆరువేలేమిటి, నాలుగుకోట్ల జపమును "నేనే" భరించినాను నాకన్నులకప్పుడు దాసుగారు మానవునిగా గనుపడ లేదు అప్పుడుగా దిప్పుడింకెక్కడిది సప్తాహము చెప్పినను దాసుగారిని రెండవమానవుని పద్ధతి [illegible]! అనినారు చలపతిరావుగారు.

కామధేనువునిగ్గర కల్పతరువు
పరగ జింతామణియు రామభద్ర[illegible]
రావుముల్లోకములయందు రా[illegible]
దేవుడే లేడు వాని బ్రార్థించువాననా.

అడవిలోనికి వెళ్లినా శ్రీరామచంద్రుణ్ణి [illegible] అన్నవస్త్రాలకు లేమి ఉండదు. [illegible] శ్రీరాముడే అధిదైవమైతే ఆముష్మికము కరతలామలకము.

([illegible])

కడపసప్తాహ సంపర్కమున నొకనాఁడు, [illegible] చేయబడిన చలువ చప్పరము[illegible] స్వామివారి గానామృతము జరుగుచున్నది. గ్రామీణు లోసంగు హారతు [illegible] స్వామివారి కోసంగుతరి వహ్నికాగితముల కంటుకొనినది వెంటనే నూతన యౌవనపురుషు డొకడు [illegible]మునం దవతరించి మంటలార్పి యంతర్హితుఁ డాయెను. భగవదనుగ్రహ మెంతకు జాలదు.

వేమవర సప్తాహాంతమందు [illegible]. [illegible] కాలమున దాసుగారికి జోడుగానున్న తాడేపల్లి [illegible]

గారి మనుమడు తటాకమునబడి మృతినందనున్నతరి ఆజన్మ విరోధియగు వ్యక్తియొక్కండు పిల్లవాని ప్రాణాపదనుండి తప్పించి రక్తయ్యను సంతసపరచినాడు. ప్రశ్నించిన తాను నూతనపురుషుని ప్రోద్బలమున నీకార్యము జేయు జాలితినాని బుద్ధిపూర్వకముగా జేయలేదని ఆవ్యక్తి చెప్పినాడు. భక్తులకు భగవంతుడు ప్రత్యక్షపరోక్షముల సాయపడుచుండుననుట, ఇదియే తార్కాణము. శుభాంతముగా సప్తాహము పూర్తియైనది.

నియోగి వైదికికక్షకు మూలస్థానమైన నర్సారావుపేటలో ధనుర్మాస దీక్షతో గలిసిన సప్తాహ మేయొడుదుడుకులు లేకుండగ పూర్తియైనది. రెండు తెగల వారన్నదమ్ములవలె గలసి మెలసి కీర్తువు బూర్తిగావించినారు.

ఆర్తవాక్యాలనాలించి యుబ్జమిత్రి
డేకరణిజక్రవాకాల నేలెనట్లు
యార్తరక్షావనుండను కీర్తిగనిన
శ్రీరఘూత్తముడెపుడు పేక్షింపబోడు.

ఒకప్పుడు రామకోటి నర్పింప భక్తబృందముతో భద్రగిరియాత్రకు బయనముసాగించి పనిగొనుతరి చాపరాళ్లపల్లి, మొలకలవల్లి నడుమ భక్తులందఱు మేనులుమరచి భజనలు గావించుచున్నారు. మృదంగధ్వనులు మిన్నుముట్టుచున్నవి. కరతాళధ్వని దిశలావరించి మారుమ్రోగుచున్నవి. భక్తుల తూర్తధ్యానములు భగవాను నున్ముఖుగావించినవి. ఆత్మ

జ్యోతి దిక్కులావరింప నందుండి పట్టాభి రామమూర్తి దాసు గారికి సాక్షాత్కరించినారు. స్తుతిపాఠములతో భ్రాస్త్రగుంకి నది పయనమాగినది క్షుత్పిపాసలు మరచి పరమానంద ప్రవాహమున దేలియాడుచు తెల్లవార్చినాడు మరునాడుదయమునకు భక్తులెల్లరు బహిరంగోన్ముఖులై ఉత్సాహ భద్రిగిరిజేరి శ్రీరామమూర్తికి రామకోటినర్పించి కృతార్థులైనారు.

సికింద్రాబాద్ సమీపములో గుండా మహారాజు గారివలన పాండురంగ మహామంత్రోపదేశమంది తదీయ ప్రభావమున భద్రాచల మజిలీలలోని లింగగూడ గోసవీడు లందు సత్రములు సాగించి భూతసేవనార్జించినారు మన సనాతన బ్రహ్మచారిగారు.

గోసవీడు సత్రములో యాత్రికులు భోజనములు చేయుచున్నారు. దాసుగారి యాజ్ఞననుసరించి గరుకొక్క లడ్డుమాత్రమే భోజనపాత్రల బడుచున్నది మారడిగిన సమాధానమిడువారు లేరు. ఎందుండియో యొక తేజోమూర్తి యరుదెంచి బ్రహ్మచారిగారిజేరి లాడువలు చాలవని భయపడుచుంటివా? భగవదనుగ్రహముండిన దక్కువేమి మనకు చాలినన్ని వడ్డింపమనుము అనిచెప్పి అంతర్హితుడైనాడు. తన కుదోబ్భదించినమూర్తి శ్రీరామమూర్తియని నమ్మి భగవదాజ్ఞ ననువర్తించిన యాత్రికులు తృప్తిగాభుజించినారు గాని లాడువులరాసి తరుగలేదు మరునాడు సమీప గ్రామవాసుల నాహ్వానించి మిగిలిన లాడువులతో తృప్తిపరచినారు.

ప్రయాణసౌకర్యముచెడి వెనుకబడిన భర్తలకై విచారించి విచారించి క్షుత్పిపాసా వశులైన స్త్రీరత్నములు కొందఱు లింగగూడ సత్రమునజేరి దాసుగారియాసతి భోజనములు జేయుచున్నారు. వంటవారవారిగా భోజనపదార్థములు వడ్డింపుచున్నారు. నూతన స్థూలకాయుడొక డరుదెంచి ఆకలి, ఆకలి యని కేకలిడుచు బరుగిడివచ్చి భుజించువారి నడ్డగింప నా దుండగీని వారించి కఠినవాక్యముల మందలించుచు దాసుగారు వాని బ్రత్యేకముగ గూరుచుండబెట్టి భోజనమిడ వాడు భుజించుచు,

పరులునిందించుపట్లగో పంబుగొనక
శాంతమునుబూనివినయపు మంచితనూని
విహితసంభాషణంబుల వెలువరించి
స్వాంతమా ! వారిసంతస పరపుసతము.

అనుపద్యము బదే బదే బాడుచు గోవిందలతో భుజించి యంతర్హితుడై నాడు. ఇతడు సాక్షాద్భగవంతుడని విశ్వసించి దాసుగారు తన కోపమును రూపుమాపికొనినాడు ఇపుడెన్ని కోపకారణము లెదురేగినను చలింపని దీక్షతో జీవితము సాగించుచున్నారు.

ఇట్లు దాసుగారిరువది సప్తాహములు దీక్షతో సాగించుటయే కాక భద్రాచల యాత్రికుల సౌకర్యార్థము నాలుగు వర్షములు గొనవీడునందును, లింగగూడ నొకవత్సరమును, బూరగొమ్మలపాడున నొకవత్సరమును, కొత్తగూడ నాలు

గేంస్లును, పాండురంగ దిదృక్షాపేక్ష లనుజం చేసి యాత్రికుల నుద్దేశించి పండరియందు ధర్మశాలాస్నానములను, అన్నసత్త్రముల సాగించుటయే కాక నిత్యము చీరాల పాండురంగాపురములో పాండురంగ ప్రతిష్ఠగావించి దాని కనుబంధముగ నిర్మింపబడిన భవనమున నిరతాన్నదాన దీక్షాకంకణధారులై పనిసాగించుచున్నారు.

ఒకప్పుడు భక్తప్రచార ముద్దేశించి సనాతన భక్త సమాజమును వెంటగొని గుంటూరునుండి బయలుదేరి యెడనెడ భజనములతో షోలాపురి స్టేషనులో మకాము జేసినారు. రాత్రికాలము అమావాస్య చీకటి కన్నులు పొడుచుకొన్నట్లైనది. చోరులిరువురు అన్నంటియుండి సమాజమువారి రెండు మూటల జిక్కించుకొని దారిబట్టినారు. [illegible] ఆయుధములతో వారలకెదురేగి అదలించియు భయపెట్టియు వారి కడనున్న మూటల రెండింటిని గైకొని పోలీసు వేషధారులై మూటలతో జనుదెంచి సమాజ సభ్యుల లేపి చోరకృత్య మెఱింగించి మూటలిడి యంతర్హితులైరి. దాసుగారు భగవదనుగ్రహమున కుబ్బుచు భజనలతో బండరి జేరి రంగని దర్శించి యందు బదిరోజులుండి భక్తిప్రచారముగావించి గుంటూరు మండలము చేరినారు.

చీరాల పాండురంగాపురమున నిష్కామసౌభాగ్య ధురంధర సమయోద్దండ కోలాహలేత్యాది బిరుదాంకితులగు శ్రీమదద్దంకి తిరు వెంకటాచార్య దేశికేంద్రస్వామివారి యాధిపత్యమున బ్రతిష్ఠింపబడిన శ్రీపాండురంగస్వామివారికి నిత్య

నైవేద్యాదిసమారాధనాది కైంకర్యము లవారిగా సాగుచుండు టయే గాక ప్రతియేట బ్రహ్మోత్సవము మహావైభవముగా జరుగుచున్నది. శ్రీమాన్ రా॥బ॥ హరిప్రసాదరావు, అచ్యుతని వెంకటసుబ్బారావుగార్లు మఱికొందఱు భక్తులతో గలసి విరాళముల సమకూర్చి కైంకర్యములకు శాశ్వతస్థాయిని గల్పింప యత్నించుచున్నారు. అచిరకాలమున వీరికోరికకొన సాగించి పాండురంగమూర్తి వీరి నిహపరసౌఖ్యముల ముంచెత్తి రక్షించుగాకయని వరమర్థించి వందన శతములతో శ్రీపాండురంగని ప్రార్థించుచు నీకథముగించెద.



శ్రీ కూర్మదాసుగారిచే నిర్వహింపబడిన క్రతువుల పట్టిక

సంఖ్య	క్రతువు పేరు	క్రతువులుజరిగిన స్థలము	తేదీలు సంవత్సరం	సహాయములు	రిమార్కు
1	సప్తాహము	వేమవరము, రేపల్లెతాలూకా తెనాలి	సిద్ధార్థి	తాడేపల్లి రత్తయ్య	
1	,,	కన్యకాపరమేశ్వరీ, యావరణము	రౌద్రి	వర్తకబృందము	
1	బ్రహ్మసత్రము	[illegible]మని	దుర్మతి	గ్రామస్థులసహాయం	
1	,,	కడప	,,	వర్తకబృందము	
1	,,	ఒంగోలు, రంగారాయచెరువువద్ద	దుందుభి	వర్తకబృందము	
1	,,	నెల్లూరు, రామమందిరమువద్ద,	రుధిరోద్గారి		
		[illegible]పేట	,,	వర్తకబృందము	
1	,,	నర్స[illegible]పేట, [illegible]	రక్తాక్షి		
1	,,	కావలి, [illegible]	క్రోధన		
1	,,	[illegible]పల్లి, [illegible]	,,	గ్రామస్థులసహాయం	
1	సప్తాహము	[illegible]	అక్షయ	వర్తకబృందము	
1	,,	[illegible]	,,	[illegible] కృష్ణశాస్త్రిగారు	

శ్రీ ఆంజనేయ పరమహంస

పుణ్యభూమియగు భరతఖండము అనాది నుండియు అనేక మహనీయులను గన్నట్టిది. ఒకప్పుడు శ్రీమన్నారాయణుడు రాముడై కౌసల్యా దశరథుల గర్భవాసమున జనించి దుష్ట శిక్షణ శిష్టరక్షణ సల్పి మాయామానుష విగ్రహుండై ఉత్తరమున హిమవత్ప్రాంతమునుండి దక్షిణమున రామేశ్వరము వరకు పర్యటనగావించి ప్రతిచోట నాటికి నేటికి జనులున్నూ మన మెల్లరము స్మరించు రీతిని గుర్తులు చూపి మానవ ధర్మము దానాచరించి లోకమున కావగ్యమైన పాదపద్మములు సోకినంతనే పరమ పావనమైన పుణ్యక్షేత్రముగ విలసిల్లునట్లు చేసినదీ భారతావని యుందేగదా! ఇంతేగాక, శ్రీకృష్ణుడై దేవకీ వసుదేవుల గర్భవాసమున అర్ధరాత్రమున కారాగారమున దుష్టశిక్షణ శిష్టరక్షణక్కై అవతరించి లీలా మానుష విగ్రహుండై పరమాత్మ తత్త్వరహస్యమును అర్జునుని శిష్యునిగా గ్రహించి లోకమంతటికొరకు జగద్గురుడై గీతాశాస్త్రమును బోధించినది కూడా యీ భారతావని యుందేగదా! అట్టి యీ భారతదేశమున పరమ పూజ్యులైన మహాపురుషులెందరో పరమ పతివ్రతామతల్లులెందరో మహా సమాధి నిష్ఠా గరిష్ఠులై తపః సంపన్నులెందరో నిరంతరము ఏమూలనో ఒక్కొకచోట అవతరించి తమ పాదధూళిచే జీవకోటికి తరుణోపాయము చూపుచు నాటికి నేటికి అధర్మమును రూపుమాపి ధర్మసంస్థాపన చేయుచునేయున్నారు.

సనాతన ధర్మమునకు పుట్టినిల్లైన యీ భరతఖండమున ఆధ్యాత్మిక తత్వమార్గాసక్తి లేని జీవికి తావుగలదా? మత్స్యములు నీటనేగాని భూమిమీద నివసింపలేనట్లు బ్రహ్మవేత్తలు భారతావనియందే ఎక్కువగలరు గాని వేరొకచోటగాదు. అట్టి భరతఖండమున రామదాసు, త్యాగరాజు, నారాయణతీర్థులు మొదలైన ఆంధ్ర మహాభక్తాగ్రగణ్యులను గన్న ఆంధ్ర దేశమునందే శ్రీ ఆంజనేయ పరమహంస అవతరించినది.

స్వస్తిశ్రీ నందననామ సంవత్సర కార్తీక బహుళ దశమి ఆదివారమునకు సరియగు క్రీ. శ. 1892 వ సం॥ నవంబరు 13 వ తేదీన ఒక సాధారణార్థిక స్థితిగల బ్రాహ్మణ కుటుంబమున శ్రీ భైరవభొట్ల వంశమున జోగీశ్వర సీతమాంబల గర్భవాసమున కృష్ణాజిల్లా గుడివాడయందు యీ మహనీయుడు జన్మించెను. పుట్టిన శిశువునకు తలిదండ్రులు ఆంజనేయశర్మ అని నామకరణమిడిరి. హనుమదంశమే ఆశిశువునందు మూర్తీభవించెను ఉగ్గుబాలతోనే తల్లి వలన రామ నామ రసమును యీ శిశువు చవిజూచెను. ఉయ్యాలతొట్టిలో రామ నామము చెవి బడినంతనే ఎంతటి ఏడుపునైన మానును. శిశువు దిన దినాభివృద్ధిగా రామభక్తి యందోలలాడు చుండెను. తలిదండ్రులు యీ పిల్లవానికి అయిదవయేట అక్షరాభ్యాసమును, పదవయేట ఉపనయన సంస్కారమునుగావించిరి. తండ్రివలన నాతడు బ్రహ్మోపదేశమును పొంది ఆధ్యాత్మిక వికాసమునుపొందెను. యీ పిల్ల

వాడు పెరిగి పెద్దవాడగుచుండెను. ఈబాలకుడు శ్రీరామచంద్ర పాదరాజీవములను పూజించుటకే జనించెను, ఈబాలక రామనామ సంకీర్తనము గావించుటకే జనించెను, ఈబాలుడు శ్రీరామ తత్త్వధ్యానమును గావించుటకే జనించెను అని బాగుగ గ్రహించి అట్టి రామభక్తి తన్మయత్వమును పొందుట నిమిత్త మాత్రముగా ఈ శరీరయాత్ర గడుపుచుండెడివాడు. భద్రాచల రామదాసు కీర్తనలను, నారాయణతీర్థులవారి తరంగములను, త్యాగరాజు కృతులను భక్తితో గానము చేయు వాడు.

ఇట్లుండగా 'ఉత్తమా తత్త్వచింతా చ' అను నార్యోక్తి ననుసరించి అనేక శాస్త్రగ్రంథ సంపర్కమువలన ఈ మహానీయునికి పరమాత్మ తత్త్వవిచారమునందు ఆసక్తి జనించినంతనే, ఒకానొక ప్రత్యేకదినమున సీతారామాంజనేయ మను గ్రంథపరిచయమును అందరి శ్రీరామ తత్త్వోపదేశమును తన తండ్రిగారివలన గ్రహించి యీ చిన్నవాడు క్రమముగా మనస్సును అంతర్ముఖమొనర్చి ధ్యాననిష్ఠను కూడ చిన్నవయసులోనే సాధించుచుండెను. కొంతకాలమునకు యీ బాలుని 13 వ సంవత్సరము వయసున తండ్రి స్వర్గస్థులైరి. ఆధ్యాత్మికాసక్తి బాగుగ గల్గిన యీ బాలుడు సంసార భారము వహింపవలసివచ్చెను. కుటుంబము గడుపుటకై సాధారణార్థిక స్థితిగతులలో కష్టపడుచు గుమాస్తాగిరి చేయుచుండగా తన 16 వ సంవత్సరము వయస్సున లక్ష్మీకాంతమ్మ అను బాలికను

వివాహము జేసికొని గృహస్థాశ్రమ ధర్మముస్వీకరించి కృష్ణా జి॥ నూజవీడు గ్రామముజేరి కొద్దివేతనమున కొకచోట చిన్న యుద్యోగములో చేరెను ప్రతివాని జీవితము అనేకమార్పులు చెందుచుండును. ఆయాజీవుల పూర్వసంస్కారమును బట్టియే అవి జరుగుచుండునని పెద్దలవాక్యము. ఇది శాస్త్రసమ్మతము లోకములో ఒకని జీవితమునకు మరొకని జీవితమునకు పోలికయుండుట యరుద.

క్షేత్రము బాగుచేసి యుంచిన పిదప విత్తువాడువచ్చి విత్తులుచల్లుట ధర్మమేగదా ! ఇట్లు ఈ మహనీయుని జీవితము కొన్ని కాలము జరుగునప్పటికి బంగారమునకు మెరుగుపెట్టిన రీతిని ఒకానొక పుణ్యదినమున బ్రహ్మార్చస్సు ముఖమున దాండవింప, బంగారు ఛాయగలిగి ఆజానుబాహుండై యొక యోగిపుంగవుడు యీ మహనీయుని గృహమున కరుదెంచి. యోగరహస్యములనెల్ల వివరించి యుపదేశమొనర్ప యీ మహనీయుని జీవితమునకొక క్రొత్త వికాసముగల్గెను. అప్పటి నుంచి యీ మహనీయుని పూర్వజన్మ సంస్కారమున పం దొమ్మిదవ సంవత్సరము వయసునకే అనగా గురూపదేశము నందిన 1, 2 సంవత్సరములలోనే సద్గురు కృపవలన బ్రహ్మ విద్యా, రహస్యములనెల్ల గ్రహింపగల్గెను. ఈ మహనీయుని బ్రహ్మవిద్యా సంపత్తిచే ప్రకాశింపచేసినది అప్పటికి భద్రా చలమందు ఓంకారాశ్రమమండలికి చెందిన శ్రీశ్రీశ్రీ సచ్చి దానంద జోగీశ్వర అవధూతస్వామివారే.

సద్గురువు ఆశ్రీరామమునందును (శ్రీ) రంగనాయకుల యందు హంస క్షీరనీరములందు హంససంగ్రహము వ్యాపకముగ నాత్మ యోగాను సంధానమున సంచరించెను భార్యాపుత్రుల పోషణ నము, లోకవ్యవహారములు మొదలగు నిత్యకృత్య నిర్వహణాదిక వ్యక్తికి ఆటంకములగునా? కాదు. నిర్మలబుద్ధితో భగవ త్సన్నిధి నెక్కుడుగా గల్గిన మహాత్ములు సంసారులు భగవ ద్భక్తులుగనే సంచరించుచుండుగదా. ఈ విషయమున భాగవతోత్తమ ములో యీ మహనీయులు 'బాహ్యాన్యత్ర మహాసక్తి' అను అభ్యుక్తి ననుసరించి 'నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్' అని చెప్పబడిన గీతావాక్యము ప్రకారము నిర్వికారుడై జీవించ సాగెను. అందరికి తెలుపు రామనామ గానమును చేయుచుండె వాడు. ఎవరైనను కష్టములు కలిగి అర్థార్థులై పోయి వచ్చి గానక వారిని దర్శింపవచ్చిన వారినోదార్చి "నాయనలారా! అన్నింటికి రామనామమే శరణ్యముగదా! రామనామమునందు విశ్వాసముంచి మీరు స్మరించినచో నీ రామచంద్రప్రభువు కష్టములనుండి గట్టెక్కించడా! అట్టిని రామదాసు, కబీరు, త్యాగరాజు మొదలైన మహనీయులందరు రామనామ మహిమను లోకమునకు చాటలేదా? రామనామము నుచ్చరిం చుటకు దరిద్రము మన మేమియు చెల్లింపనక్కరలేదే! సల ఆరామనామము నుచ్చరించి మనము కష్టము తీర్చుకొనుడు" అని ధైర్యము చెప్పి భక్తులకు ప్రేమాస్పదులయి యుండెడివారు. అట్టి ఈమహనీయునియొక్క సాధారణ జీవితము సరిగా మాసోత్సవ

మును గ్రహించినవారు వారినిజేరి 'అయ్యా! తమ అను
గ్రహమున్న చాలు' నెడివారు అట్టియెడ వారిని చేయితో
పిస్పృతిట్టి నాయనా! రామనామ మెంతగొప్పనియో
చూడుము దానిని నీవు నిరంతరము అనుకో నన్ను మనువను
నేను సిన్ను మనువను. ఇదేగా చిన్నముక్క (అనగా మాట
అని వారిభావము' అన్నంతనే విశ్వసించినవారు ఆయన
నొక మహాపురుషుడని గ్రహించెడివారుగూడ.

అప్పుడప్పుడు యోగరహస్యములను పూర్ణముగ గ్రహిం
చితిమని విజ్ఞపిగుచుండిన మరికొందరు బాహ్యవిరాగులై,
కాషాయ వస్త్రధారులై యీమహనీయులతో తత్త్వవిచారణ
చేయ నుద్యుక్తులై వచ్చితిమని విన్నవించినంతనే వారితో
"నాయనా! యోగివేమన" 'చెప్పేవాడు చేయడుసుమ్మీ
చేసేవాడు చూడడుసుమ్మీ, చూచేవాడు చెప్పడు సుమ్మీ' అని
చెప్పిన భావమూహించితివా? వాచాబ్రహ్మజ్ఞానముకన్న
ఏకొద్దియైనను అనుభవము గొప్పది. వేదములన్నియు చదివి
ఉపనిషత్తులను మొదటినుండి చివరవరకు వల్లెవేసినప్పటికి
సర్వకాల సర్వావస్థలయందు ఆబ్రహ్మభావన లేనిదే యీ
జ్ఞానము వ్యర్థము 'దృశ్యగ్మంలీయతే యత్రమనస్తత్రైవ
లీయతి' యిది యోగసిద్ధాంతము ఈ విధముగ మనోలయ
మైనగాని మనజ్ఞానము పూర్ణత్వముగాదు. గాన ఇది మనము
సాధించుటకు ముందు ప్రయత్నము చేయవలెనని చెప్పుచునే
యోగనిష్టయందు నిల్చియున్న కొద్దిసేపటిలో శరీరమంతయు
కొంతవరకి యొకకట్టెవలె బిగిసి యీ భౌతికప్రపంచములోనికి

వచ్చి యొకపిల్లవానివలె ప్రక్కనున్నవారి నొకరినిచూచి 'నాకుతినుట కేమైన పెట్టుదువా? ఆకలియగుచున్నది' అనెడి వారు అప్పటికప్పుడే వారు భుజింప నీయ నిచ్చినయెడల ప్రక్కనున్నవారికి కొంచెము పెట్టి తాను భుజించెడివారు. ఈస్థితి చూచుచుండెడివారలు యీ మహాత్ముని గుప్త యోగాభ్యాసియ నెడివారు.

ప్రతి దినచర్యనుచూడగా, ఎప్పుడును నిర్జన అరణ్య ప్రాంతముననో, ఏకాంత వాసమున కౌపీన ధారిగనో, దిగం బరునివలెనో మౌనమువహించి బ్రహ్మనిష్ఠ యందుండెడువారు వారు యీ వ్యవహార ప్రపంచములో అందరివలెనే నవ్వుచు పాడుచు అందరివలెనే తినుచు, సంచరించుచు కాలముగడు పుట చూడగా గీతాశాస్త్రమునందలి బ్రహ్మవేత్త లక్షణ ములు కన్పట్టి వీరొక యంతర్ముఖులని స్పష్టమగుచున్నది.

ఈ మహాత్ములు 1928 వ సంవత్సరమునుంచి 1931 వ సంవత్సరములలో కృష్ణాజిల్లాలో బెజవాడ గుడివాడ గ్రామ ములలో తమ యుద్యోగధర్మము నిర్వర్తించుచు తమ తీరిక వేళల యందెల్ల తత్త్వరహస్యములను శిష్యగణమునకు ప్రబోధ చేసి వారి నుద్ధరించుచు భక్తులతో కూడి నామ భజనలు చేయుచు యిట్లు కాలముగడుపు చుండిరి. ఈవిధముగా గుం టూరుజిల్లా తెనాలి తాలూకా కొల్లూరు గ్రామములో కొంత కాలము గడిచెను.

అపుడు వీరొక భక్తునిగా నందరు పరిగణించుచుండిరి. ఆకాలమున వారి సేవాభాగ్యము లభించినవారిలో ప్రస్తు

తము శాస్త్రవ్యాస్తవ్యులైన శ్రీకంభంమెట్టు మధుసూధవరావు ఒకడు. వీరు ఆడిటరుగా పశ్చిమ గోదావరిజిల్లా ఏలూరులో తమ యుద్యోగధర్మము నెరవేర్చుకొనుచుండగా, బాపట్లకు పోయి స్థిరనివాసము ఏర్పరుచుకొనుమని సెలవిచ్చిన గురు వాక్యముతో 1934 సం॥ నుంచి వారు బాపట్ల నివాసముకు కారణము.

శ్రీ ఆంజనేయ పరమహంస తమ గురువాజ్ఞ ప్రకారము తమ 40 వ యేట. (1925 సం॥ లో) వాన ప్రస్థాశ్రమము స్వీకరించి, గుడివాడ తాలూకాలో పామర్రు సమీపమున కొండిపర్రులో నొక మామిడితోటయందు శ్రీ హనుమంతుని విగ్రహమును ప్రతిష్ఠించి అచట నివసించుచుండిరి. 1934 సం॥ లో తమ శిష్యులు మధుసూదనరావు బాపట్ల జేరినపిదప తరచు యీ మహనీయులును ఆగ్రామముకు దయచేయు చుండెడివారు.

ప్రతిదినము బ్రహ్మముహూర్తమందే లేచి కాల్యకృత్యములను తీర్చికొని తెల్లవారకముందే మేలుకొలుపులు పాడుచు పలువురు తమతో కలసి రామ నామసంకీర్తనచేయు భాగ్యమబ్బచేయుటకో యన్నట్లును తమ యనుగ్రహమునకు పాత్రులజేయుట కన్నట్లును తమసేవకులు మధుసూదనరావును చేత ఏకతారు, చిరుతలు ధరించి పాడుచుండగా బాపట్ల వీధులలో ఆప్రశాంతిసమయమున ఆర్తితో ఎలుగెత్తి సంకీర్తనచేయుచు ఒక్కొక్కరి ఇంటికిపోయి పిలచెడివారు తెల్ల

వారుజామున జేయు ఆ సంకీర్తనమంటపు సలుప్రుసు వాహ్యాను చుండెడివారు కీర్తనలు పాడుచునే భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రజలకు ప్రబోధముచేయు చుండెడివారు సర్వకాల సర్వావస్థలయందు రామనామమహామానందమునందే తన్మయత్వము చెందెడివారు వారు చెప్పిన ఉపదేశవాక్యముల సత్యము గుర్తెరిగి నమ్మినవారికి అద్భుతమహిమలు గోచరించెడివి. అందరకు రామనామమహిమయు, కలియుగమున శ్రీహనుమద్భక్తి పారిశస్త్యమును వెల్లడిచేసెడివారు వారందరకు సంచిత కర్మలనుండి విముక్తి ప్రబోధము చేయుచుండెడివారు "నాయనలారా! రామ అను రెండక్షరము లెంత మహిమగలవో మీకు తెలియునా? అవి స్మరించి, భావము గ్రహించి హనుమంతుడు వారధి కట్టగల్గెను. ఇంకేమి మీకు ఋజువుకావలెను?" అని తమతో కలిసియుండెడి సంకీర్తన పరులతో ననెడివారు.

వారి యనుగ్రహమున కష్టపరంపరలనుండి విముక్తులైన వారుకొందరు వారి మహిమనేమో గ్రహించిన మరికొందరును దరిచేరినపుడు "కేవలము సిద్ధులు మహిమలుచూచి మోసపోకండి రామనామ పరులెవ్వరో వారివెంట మహిమలుండునుగదా. దీనముచేత ధరించినవానియొద్ద నిలుచునందుటాశ్చర్యమా? మీరున్ను సద్గురుకృపచేత పాత్రులై రామనామపరులుగండి. రామనామ మెంతమహిమ గలదో మీకే తెలియగలదు" అనుచుండెడివారు.

ఈవిధముగా అప్పుడప్పుడు సాయంసమయములందు అనేకచోట్ల భక్తులగృహములందు సద్బోధచేయుచు కాలము గడపుచుండిరి. వారిబోధలయందలి కొన్ని సారాంశములను వారిమాటలలో యీ క్రింద వుదహరింపబడినవి

"భార్యా భర్తలు యిరువురును ఒకేమార్గములోనే యుండి తమధర్మము ననుష్ఠించుట వుత్తమము. పుణ్యస్త్రీలు తమ భర్తలచేత మంత్రోపదేశము పొందవలెగాని అన్యుల చేతగాదు.

"ప్రతిమనిషి అన్నిపనులుచేసి మసువవలెను. మగ వాడు పంక్తిలో విస్తళ్ళు ఎత్తుటకున్న ఆడది అంట్లుతోము టకుకూడ సంశయింప వలెనా? రానురాను యికముందు ఎవరి కెవరు నౌకరుగా పనిచేసెదరు? (చేయరని భావము.")

"నీ సంసారము తెలిసి నీవలెనే యితర సంసారము లున్నవని తెలిసికొనురీతిని నీఫొటోను, నీవు చూచుకుని విర ళించి తెలిసికొని నిన్ను నీవెఱిగి ప్రపంచమును తెలిసి కొనుము. అపుడు నీలోఉన్న బ్రహ్మమునీకు బయల్పడును."

"సమాధి అనగా ఏకాగ్రచిత్తత. అట్టి ఏకాగ్రచిత్తత ప్రపంచములో అన్నివస్తువులమీద నుండవచ్చును. అనేక ఆలోచనలనుండి ఏకాలోచనలో పడుటయే సమాధి. అట్టి సమాధియందు అట్టి ఆలోచింపబడుచున్న వస్తువుతప్ప యిత రము కనలేదు.

"ప్రపంచములో ప్రతి చిన్న వస్తువు దగ్గరనుంచి మనము నేర్చుకోవలసినది చాలయున్నది. మానవుడు తన ధర్మము

లను విడనాడి హీనస్థితి యంటున్నాడు" "అన్నింటికి సిద్ధ పడినపుడే మనము గమ్యస్థానము చేరగలము."

"ఏ ప్రకారము ఒక స్త్రీయే తనయిల్లు చక్కపెట్టుకొనుచు పిల్లకుపాలిచ్చి పెంచుకొనుచు భర్తకు సేవచేసి సంతోషము కలుగచేయుచు పని చేసికొనుచు అనేకవిధములుగా వర్తింపుచున్నదో అట్లే మనస్సే బుద్ధియై మనస్సే చిత్తమై మనస్సే అహంకారమై వర్తింపుచున్నది.

"అహంకారము అంతమే మహాష్టు. నీయింద్రియములను చెడుమార్గములోనికి దిగనీయక నీయహంకారము నశింపచేసి కొన్నపుడే దేశమునకు, భగవంతునికి, మానవులకు సేవ చేయుటకు అర్హుడగుదువు. గాని అంతవరకుగాదు. అప్పటికే అన్నివిధముల నీమనస్సు నిర్మలమై, ఊర్ధ్వముఖవ్యాప్తియై బ్రహ్మసాక్షాత్కారము నందును. ఆస్థితియే సమాధి అప్పుడు నీలో సర్వబ్రహ్మాండభాండమును జ్ఞాననేత్రముచే నిర్మింపగలవు. నీవు నిజమైన సుఖమనుభవింపగలవు. అదేపూర్ణ సమాధి. ఆనందకోశము తురీయాతీతము. అదిబయటకు చెప్పునదికాదు. ఎవరికి వారు, తమ అనుభవము వల్లనే గ్రహింపవలసినది. అట్టి అనుభవము ఊరక ప్రశ్నలవల్లవచ్చేదికాదు. గురుసేవచేసి గురుకటాక్షమువల్లనే లభ్యపడకలదు."

ఈ విధముగ సజ్జనసాంగత్యమును విస్తరింపజేయుచు బాపట్లగ్రామములో 1940 సంవత్సరములో శిష్యులు శ్రీమారుతి ప్రణవాశ్రమము నిర్మింపగ అందు భజన కాలక్షేపములతోడను, తత్త్వబోధలతోడను, తమదర్శనమునకై

విచ్చేయుభక్తుల ననుగ్రహించుచు, సంసారమున కష్ట పరంపరలలో నిస్పృహులై దరిగానక తమను వెదకికొనివచ్చిన వారికి తమమహిమానుగ్రహప్రసాదముచే రామభక్తి నుపదేశించి విముక్తులనుచేయుచు శిష్యగణములయెడ గురుకటాక్షవీక్షణముల ప్రసరింపచేయుచు తమ భౌతిక శరీరమునకు అంత్యకాలము సమీపించుట గుర్తెరింగి ఒకానొక దినమున తమశిష్యులగు మధుసూదనరావును ఒకకాగితమును తెమ్మని యందు "దీపముండగనే యిల్లుచక్కబెట్టుకొనుడని" లిఖించి అది దాచియుంచి చూచుకొనుమని సెలవిచ్చిరి.

అది మొదలు దేహము క్షీణింప నారంభించెను. తమ శిష్యుడగు మధుసూదనరావు నొక మంత్రదీక్షయందుంచిరి. తదుపరి క్రమముగా రాచకురుపు లేచి అది యొక కారణముగా కన్పట్టి 1941 వ సంవత్సరము అక్టోబరు 11 వ తేదీ రాత్రి 9 గంటలకు తమశిష్యుడగు మధుసూదనరావును తమచెవియందు నారాయణోపనిషత్తుల నేడుపర్యాయములు చదువగా శ్రవణముచేయుచు, శ్రీవారు సకుటుంబసపరివారమంతయు సన్నిధిలోనుండ భౌతికదేహమువీడి సోహాస్వరూపులైరి. ఈవిధముగ రాజయోగ సాధనముచే రామనామ ప్రాశస్త్యమును లోకమునకు వెల్లడిచేసిన మహానీయులలో శ్రీ ఆంజనేయ పరమహంస యొకరు. సద్గురు ప్రభువునకు జయమగుగాక.